Edit with WPS Office

RUSSIA IN THE SECOND WORLD WAR (RENDO PRAPANCHA YUDDHAM LO RUSSIA) A BOOK IN TELUGU. AUTHOR: TOLETY JAGANMOHANA RAO

SYNOPSIS

This books depicts the heroic struggle of the soviet people during the Great Patriatic War and also explains the reasons for the victory of the Soviet Union in the war.

Chapter 1. Germany's defeat in the First World War-Versailles Treaty - Rise of Hitler- His Philosophy (Mein Kemph) - German aggressions upto Munich -Conspiracies of West against Soviet Union - Munich Treaty - Non-aggression Pact between Germany and the Soviet Union - Russia-Finland border conflict - Hitler's attack on Poland and the beginning of the Second World War - Hitler's efforts to come to an agreement with Britain - Operation Barbarrossa - Revolt in Yugoslovia – Jun 22 1941 – beginning of Operation Barbarrossa.

Chapter 2. German Blitzkrieg – Early victories of Germany – Retreat of Soviet Forces – Reasons for Retreat – Resistance of the Red Army from day one - German Soldiers reaction to the fierce resistance and entry of new weapons like t-34 tanks – Molotov's speech - Stalin's Speech of July 3 - Smolensk battle – Evacuation of Industry to the east.

Chapter 3. Battle of Moscow – Situation on the eve of the battle - Developments in the Battle of Moscow - October 16 panic - November attack of German Army – Russian counter attack on 5th December and consequences.

Chapter 4. Battle of Leningrad - Blockade of Leningrad - Famine and Death – Ice Road - Heroic resistance of Leningraders - Kirov Works - Liberation of Leningrad in January 1944

Edit with WPS Office
.**Chapter 5.** Describes battles from the Spring of 1942 upto battle of Stalingrad – Blockade of Sevastapol – Heroic Resistance of Sevastapol - Russian defeat in Kharkov – Khruschev's allegation that Stalin was responsible for this defeat – Facts about this allegation.

Chapter 6. Battle of Stalingrad - Description of the different stages of the battle – Retreat to Stalingrad – Stalin's Order No. 227 in August - Preparations for Defence of Stalingrad – German Air Attack on August 23 – Devasttion - Resistance in Stalingrad – Street Fighting – Fighting in Factory Area - Russian Offensive on November 19 – Encirclement of German Army - Failure of German attempt to free the trapped 6th Army – Ultimate defeat and surrender of the 6th Army – Reaction of the people in other countries to the surrender of German Army at Stalingrad

Chapter 7. This Chapter describes about battles from Stalingrad to Kurks – Battle of Kurks - Russian preparation to meet the German tanks and army – Defence in Depth – German Attack – Failure – Russian counterattack.

Chapter 8. This chapter depicts life under German occupation – Hitler's New Order - Soviet citizens as slaves of Germany – Compelled to work in German factories - mass murder - shooting of people – Gas trucks and death factories - Cruel treatment of Soviet prisoners - Medical experiments on prisoners - Parisan War - German retaliation.

Chapter 9. This chapter tells about the new socialist consciousness among the people of the Soviet Union, which was at the root of victories of Soviet Union in the war - West propaganda about Stalin's crimes - Facts – Life of ordinary workers - improvement in the living conditions - change in the status of women in soviet union – Education and Culture - How Socialist Russia brought about a change in their living conditions of people - New Socialist consciousness

Chapter 10. Fall of Berlin - Series of victories in 1944 - German Retreat - Second Front in France when defeat of Germany in the hands of Soviet Union became a certainty - Soviet losses and allied forces losses – Comparison – battle of Berlin – Hitler's suicide – Germany's unconditional surrender.

There is an appendix on Stalin which tells briefly about Stalin's death and developments thereafter upto 20th Congress.

The allegations of Khruschev about Stalin's role in the Second World War 1) that Stalin did not prepare the country for the war 2) Stalin thought blitzkrieg was a

Edit with WPS Office
bourgeois theory and he did not expect that Germany could occupy large territories in Russia 3) Stalin did not heed the warnings about German attack. Nobody dared to tell him the truth because of the personality cult 4) Stalin did not listen to anyone. He never worked collectively but imposed his will on others. 4) Purge in the Red Army in 1937 weakened the Red Army 4) Stalin's hysteria, arrogance, cowardliness, poor knowledge of military affairs etc…. are also dealt with in this appendix. The facts about these allegations are given.

Edit with WPS Office

రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా

తోలేటి జగన్మోహనరావు

నవశకం ప్రచురణలు

గుంటూరు

Edit with WPS Office

రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా
తోలేటి జగన్మోహనరావు

నవశకం ప్రచురణలు
ఇంటి నెంబరు: 26 - 24 -38, 8వ లైను, 2వ అడ్డ రోడ్డు, ఎ. టి. అగ్రహారం, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్.
ప్రచురణ సంఖ్య: 1

ప్రధమ ముద్రణ: మే 2005
రెండవ ముద్రణ: మే 2014
మూడవ ముద్రణ: మార్చి, 2018
ప్రతులు: 1000

సర్వహక్కులు రచయితవి
వెల: రు.200/- ప్రి-పబ్లికేషన్ వెల: రు.100/-
ముఖచిత్ర రూపకల్పన: నర్సిం

ముద్రణ: చరిత ఇంప్రెషన్స్, ఆజామాబాద్, హైదరాబాదు – 500 020. ఫోన్: 040-27678411

Edit with WPS Office

(స్టాలిన్ ఫొటో)

Edit with WPS Office

విషయ సూచిక

పేజీ నం.

నవశకం ప్రచురణలు – మా మాట

ముందుమాట

తొలి పలుకు

అధ్యాయం ఒకటి

పూర్వ రంగం

అధ్యాయం రెండు

జర్మన్ మెరుపుదాడి – తొలి దినాలు

అధ్యాయం మూడు

మాస్కో యుద్ధం

అధ్యాయం నాలుగు

లెనిన్ గ్రాడ్ దిగ్బంధం

అధ్యాయం ఐదు

1942 వసంత కాలం నుండి స్టాలిన్ గ్రాడ్ వరకూ....

అధ్యాయం ఆరు

స్టాలిన్ గ్రాడ్ యుద్ధం

అధ్యాయం ఏడు

స్టాలిన్ గ్రాడ్ నుండి కుర్స్క్ వరకూ.....

అధ్యాయం ఎనిమిది

జర్మన్ ఆక్రమణలో సోవియట్ యూనియన్.....

అధ్యాయం తొమ్మిది

నూతన సామాజిక చైతన్యం

అధ్యాయం పది

బెర్లిన్ పతనం

అనుబంధం ఒకటి

Edit with WPS Office

స్టాలిన్

అనుబంధం రెండు

మేం వెడుతున్నాం

అనుబంధం మూడు

నేటి రష్యా

ముఖచిత్రం గురించి

BIBLIOGRAPHY

Edit with WPS Office

నవశకం ప్రచురణలు

(ఇంటి నెంబరు: 26 - 24 -38, 8వ లైను, 2వ అడ్డ రోడ్డు, ఎ. టి. అగ్రహారం, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్)

మా మాట

అభ్యుదయ సాహిత్యాన్ని, ముఖ్యంగా మార్క్సిస్టు సిద్ధాంత సాహిత్యాన్నీ సోషలిస్టు ఉద్యమ చరిత్రనూ, సామాన్య పాఠకులకు అర్థమయ్యేలా తేలిక భాషలో ప్రచురించి సాధ్యమైనంత తక్కువ వెలకు అందించాలనే లక్ష్యంతో 'నవశకం ప్రచురణలు' స్థాపించాం. మా ప్రథమ కానుకగా శ్రీ తోలేటి జగన్మోహనరావు గారి రచన 'రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా' పాఠకులకు అందజేస్తున్నాం.

మేము ప్రచురించే పుస్తకాలను లాభాపేక్ష లేకుండా ప్రత్యక్షంగా పాఠకులకు ముద్రణ ఖర్చుకు అందజేయ సంకల్పించాం. మా పుస్తకాలను మేము పంపిణీ సంస్థల ద్వారా పంపిణీ చేసినప్పుడు ధర రెట్టింపు అవుతుంది. ఎందుకంటే పంపిణీ సంస్థలకు కమిషను ఇవ్వాల్సి ఉంటుంది. మేము మా సంస్థలో కనీసం వందమంది సభ్యులను చేర్చుకుని, ఒక్కొక్కరి ద్వారా 10 కాపీలు ప్రి-పబ్లికేషన్ వెలకు అమ్మే ప్రయత్నం చేస్తున్నాం. సాంవత్సరిక సభ్యత్వ రుసుము రు.100/-, జీవితకాల సభ్యత్వ రుసుము రు.3000/-. ఈ ప్రయత్నంలో మాకు సహకరించదలచుకున్న పాఠకులు సభ్యులుగా చేరవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

ఈ సౌకర్యాన్ని పాఠకులు వినియోగించుకుని మా దగ్గర నుండి పుస్తకాలను ప్రి-పబ్లికేషన్ ధరకు తీసుకోవాలని కోరుతున్నాం. తాము కొనడమే కాదు, తమ మిత్రుల చేత కూడా కొనిపించి మమ్మల్ని ప్రోత్సహించవలసిందిగా కోరుతున్నాం.

పి. హరిబాబు

అధ్యక్షులు

16-3-2018

వి. శ్రీనివాసరావు,
సి.పి.యం. ఆఫీస్, ఎ.కె.జి. భవన్,
27-29, భాయి వీర్ సింగ్ మార్గ్,
గోల్ మార్కెట్, న్యూ ఢిల్లీ – 110001.
PH: 011-23344918.

ముందుమాట

తోలేటి జగన్మోహన రావుగారు రాసిన ఈ పుస్తకం 'రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా' పునర్ముద్రణతో మన ముందుకొచ్చింది. చరిత్రను మలుపు తిప్పడంలో సోవియట్ యూనియన్ పాత్రను ఇది కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తుంది. హిట్లర్ ఫాసిజాన్ని ఓడించడంలో స్టాలిన్ నాయకత్వంలో సోవియట్ యూనియన్ నిర్వహించిన పాత్ర అమోఘం, అద్వితీయం. మొక్కవోని దీక్షతో, పట్టుదలతో, అశేష త్యాగాలు చేసి

Edit with WPS Office
సోవియట్ ప్రజలు తమ మాతృభూమిని కాపాడుకోవడంతో పాటు తూర్పు యూరోపు దేశాలను కూడా విముక్తి చేశారు. మొత్తం ప్రపంచ యుద్ధంలో మరణించిన అయిదు కోట్ల మందిలో రెండున్నర కోట్ల మంది సోవియట్ పౌరులే అంటే వారి త్యాగం ఎంత అసమానమైనదో అర్థం అవుతుంది. ప్రతి తల్లీ ఒక బిడ్డను కోల్పోయింది, ప్రతి ఇంట్లో ఒక అమర దీపం వెలిగింది. ఏ స్ఫూర్తీ, లక్ష్యమూ లేకుండానే సోవియట్ ప్రజలు ఇన్ని త్యాగాలు చేయజాలరు. పోరాడి సాధించుకున్న విప్లవాన్ని వొమ్ము కానీయకూడదన్న పట్టుదల, ప్రపంచంలోనే తొలి కార్మిక రాజ్యాన్ని ఫాసిస్టుల పాలు కానీయకూడదన్న అకుంఠిత దీక్ష, అన్నింటినీ మించి సోషలిజం పట్ల విశ్వాసం, స్టాలిన్ నాయకత్వం పట్ల గౌరవం, వారిని ఈ యుద్ధంలో విజయోన్ముఖంగా నడిపించాయి. సోవియట్ విజయంతో ప్రపంచ పటం రూపు రేఖలే మారి పోయాయి. ఏకైక సోషలిస్టు దేశంగా ఉన్న సోవియట్ యూనియన్ సోషలిస్టు కూటమిగా మారింది. చైనా, వియత్నాం, కొరియాల విముక్తితో సోషలిస్టు సమాజం ఐరోపా నుండి ఆసియాకు విస్తరించింది. అక్కడినుండి క్యూబాతో లాటిన్ అమెరికాలో పిడికిళ్ళై లేచింది. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని చీకట్లు అలముకున్నాయి. మన దేశంతో సహా అనేక ఆసియా, ఆఫ్రికా దేశాలు వలస పీడన నుండి విముక్తి సాధించాయి. నిరంకుశ రాజ్యాల స్థానంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలు ఏర్పడ్డాయి. స్త్రీలతో సహా వయోజన వోటింగు హక్కుని సాధించుకున్నారు. ఒక వోటు - ఒకే విలువ సూత్రం అమలులోకి వచ్చింది. పౌర హక్కులు విస్తరించాయి, కార్మికుల పోరాట శక్తి ఇనుమడించింది. నూతన సమాజం కోసం ప్రపంచ వ్యాపితంగా కొత్త గాలులు వీయడం ఆరంభమైంది. నాటి యువతరానికి సోషలిజం అంతిమ గమ్యంగా మారింది. ఈ ప్రగతిశీల పరిణామాలన్నీ రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ విజయంతో వచ్చాయంటే అతిశయోక్తి కాదు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మరో ప్రపంచ యుద్ధం రాలేదంటే దానికి కారణం ఒక బలమైన వ్యవస్థగా సోషలిజం సంఘటితం కావడమే. వారు శాంతిని కోరుకున్నారు. సామ్రాజ్యవాదుల పన్నాగాలకు బలవుతున్న దేశాలకు తోడుగా నిలిచారు. ఆర్థిక, ఆయుధ శక్తిలలో సమ ఉజ్జీగా నిలిచారు కాబట్టే అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదం యుద్ధాలకు తెగబడలేకపోయింది. దానికి బదులుగా ప్రచ్ఛన్న యుద్ధానికి తెరలేపింది. కుట్రపూరితంగా సోషలిస్టు వ్యవస్థను దెబ్బతీసేందుకు పూనుకుంది.

అత్యంత బల సంపన్నమైన ఫాసిస్టు జర్మన్ రాజ్యాన్ని సోషలిజం బాల్య దశలో ఉన్న సోవియట్ యూనియన్ ఎలా ఓడించగలిగింది? సోవియట్ ప్రజలందరూ ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ సైన్యం పాత్ర పోషించడం వల్లనే ఇది సాధ్యమైంది. జర్మన్ ఆక్రమిత ప్రాంతాలలో గెరిల్లా సైన్యంగా ఏర్పడి, శత్రు సైనికులను ముప్పు తిప్పలు పెట్టి, రష్యన్ సైనికులు వెనుకడుగు వేయాల్సి వచ్చినప్పుడు ప్రజలు వారికి రక్షణ కవచంగా నిలబడ్డారు. ఆయుధాల తయారీ, ఆహార సరఫరా, సమాచార సేకరణ, వైద్య సహాయం - ఇలా అన్నింటిలోనూ ప్రజల పాత్ర ఉంది. శారీరక ధారుఢ్యం ఉన్న ప్రతి ఒక్కరూ సైన్యంలో చేరారు. సోషలిజాన్ని కాపాడుకోవాలన్న తపన, ఫాసిజాన్ని నిర్మూలించాలన్న కసి, స్టాలిన్ తో సహా నాయకత్వమంతా ప్రత్యక్షంగా పాల్గొన్న స్ఫూర్తి, వారిని కదిలించాయి.

స్టాలిన్ మరణానంతరం కృశ్చేవ్ నాయకత్వాన జరిగిన దాడి కమ్యూనిస్టు వ్యతిరేకులకు ఒక ఆయుధంగా మారింది. ఈ విషయంలో చారిత్రక ఆధారాలతో వాస్తవాలను పాఠకుల ముందుంచడంలో జగన్మోహనరావు గారు కృతకృత్యులయ్యారు. సామాన్య పాఠకులకు అంత సులభంగా అర్థం కాని యుద్ధ వ్యూహాలూ ఎత్తుగడలూ చాలా సులభశైలిలో అందరికీ అర్థమయ్యే తేలిక భాషలో వర్ణించార. యుద్ధరంగాలను కళ్ళకు కట్టినట్లుగా రాశారు. క్లిష్టమైన విషయాలను కూడా తేలిగ్గా అర్థమయ్యేట్లు ఆసక్తిగా వివరించారు. ఎంతో శ్రమకోర్చి వివరాలు సేకరించారు. తెలుగులో ఇలాంటి పుస్తకం రావడం ఎంతైనా అభినందనీయమైన విషయం. గతంలో ఇదే అంశం పై సోవియట్ ప్రచురణలు తెలుగులో వచ్చాయి కాని ఈ పుస్తకం వాటికి భిన్నమైనది. రాగద్వేషాలకు అతీతంగా చారిత్రక దృష్టితో సాగిన ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకించి యువతరానికి ఇది ఎంతో ఉపయోగం.

ఇది గతించిన చరిత్ర మాత్రమే కాదు. చారిత్రక దృష్టితో వర్తమానాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడే పుస్తకం. 1991 తర్వాత సోవియట్ యూనియన్ కూలిపోయిన నేపథ్యంలో కమ్యూనిస్టు వ్యతిరేకత ఒక అంటు వ్యాధిలా వ్యాపించి చారిత్రక వాస్తవాలను మరుగున పరిచింది. సోషలిస్టు చరిత్ర వక్రీకరణకు గురయ్యింది. ఈ స్థితిలో చరిత్రని తిరిగి కాళ్ళపై నిలబెట్టడానికి ఈ పుస్తకం దోహద పడుతుంది. చరిత్రను ముందుకు నడిపించడమంటే సోషలిజాన్ని ముందుకు నడపడమే. భవిష్యత్ దర్శనానికి ఇది మార్గదర్శిగా ఉంటుంది.

Edit with WPS Office

చరిత్రలో అనేక యుద్ధాలు జరిగాయి. ఈ యుద్ధాలన్నీ రాజులు, రాజ్యాల సరిహద్దులు మారడానికి తోడ్పడ్డాయి తప్ప పజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకుని రాలేదు. రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ విజయం అలాంటి మార్పు తీసుకు వచ్చింది. పెట్టుబడిదారీ వ్యవస్థను కూడా అది ప్రభావితం చేసింది. అనేక దేశాల్లో పాలకులు సోషలిజమే తమ ధ్యేయం అంటూ కూనిరాగాలు తీయాల్సి వచ్చింది. తమ అవసరాలరీత్యానైనా ప్రభుత్వ రంగాన్ని బలపరిచాయి. సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యతనివ్వాల్సి వచ్చింది. ఉపాధిని పెంచే కార్యక్రమాలు ఎంతో కొంత తీసుకోవాల్సి వచ్చింది. సోషలిస్టు వ్యవస్థ మూలంగా పెట్టుబడిదారీ దేశాల్లోని ప్రజలకు పరోక్షంగా జరిగిన మేలు ఇది. అయినా పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉండే మౌలిక లోపాల వల్ల అందులోని సహజ వైరుధ్యాలు ముందుకు వచ్చాయి. పెట్టుబడిదారీ విధానం వల్ల పెరిగిన ఆర్థిక, సామాజిక, ప్రాంతీయ అసమానతలు సంక్షోభాలకు దారి తీశాయి. అందుకే రెండవ ప్రపంచ యుద్ధం ముగిసినా వర్గ వైరుధ్యాలూ సంఘర్షణలూ పెరిగాయి. నాటి జర్మన్ స్థానాన్ని ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా ఆక్రమించింది. అణుబాంబును తెచ్చింది. యుద్ధం ముగిశాక అవసరం లేకపోయినా జపాన్ పై ప్రయోగించి ప్రపంచాన్ని భయపెట్టింది. సోవియట్ యూనియన్ ను హెచ్చరించడానికే బాంబు ప్రయోగం చేసింది. ప్రతిగా సోవియట్ కూడా బాంబు తయారీకి పూనుకోవాల్సి వచ్చింది. ఇలా రెచ్చగొట్టుడు చర్యాల ద్వారా అమెరికా ప్రచ్ఛన్న యుద్ధానికి తెర లేపింది. సోషలిస్టు వ్యవస్థను ధ్వంసం చేయాలని సంకల్పించింది. అయినప్పటికీ 45 ఏళ్ళు సోవియట్ ప్రజలు సోషలిస్టు వ్యవస్థను కాపాడుకున్నారు. కమ్యూనిస్టు పార్టీనీ సోషలిస్టు వ్యవస్థనూ లోపల నుండి రివిజనిజం అనే చెదలు తొలచి వేసింది. లోపల బలహీన పడ్డ వ్యవస్థను బయటినుండి సామ్రాజ్యవాదుల వత్తాసుతో విద్రోహులు కూల్చేశారు. గోర్బచేవ్ లు యెలస్టిన్ లు ఈ విప్లవ ప్రతీఘాత శక్తులకు సారధ్యం వహించారు. రెండున్నర కోట్ల మంది ప్రాణ త్యాగంతో కాపాడుకున్న సోషలిజం ఇలా అంతమయ్యింది. ఇది మార్క్సిస్టు సిద్ధాంత వైఫల్యంకాదు. లెనిన్ స్టాలిన్ లు ఏనాడో హెచ్చరించినట్లు విప్లవ ప్రతీఘాతకుల అంతర్జాతీయ శక్తికి విజయమిది.

సోవియట్ పతనం తర్వాత తమ పెత్తనానికి ఎదురులేదనుకున్న సామ్రాజ్యవాదం నేడు సంక్షోభంలో పడింది. ప్రపంచీకరణ పేరుతో ఎదురు దాడికి దిగిన అమెరికా సామ్రాజ్యవాదం దీర్ఘ కాల సంక్షోభంతో తనే ఆత్మ రక్షణలో పడింది. అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి కొత్త శక్తిగా అవతరించింది. తద్వారా వచ్చిన కొత్త సమస్యలను ఎదుర్కోవడంలో పెట్టుబడిదారీ దేశాలు విఫలమయ్యాయి. ఫలితంగా కొత్త వైరుధ్యాలు తలెత్తుతున్నాయి. ఈ వైరుధ్యాల నుండి మరింత మితవాద శక్తులు పుట్టుకొస్తున్నాయి. దాంతో పాటే పోరాట శక్తులూ విజృంభిస్తున్నాయి. ఈ అంతర్గత సంఘర్షణలనుండే నూతన సమాజం దిశగా సరికొత్త అడుగులు పడుతున్నాయి. క్యూబాలో ఉదయించిన సూర్యుడు లాటిన్ అమెరికాకు వెలుగునిచ్చాడు. అనేక దేశాల్లో వామపక్ష ప్రభుత్వాలు ఆవిర్భవించాయి. ప్రగతిశీల ఉద్యమాలు పురుడు పోసుకున్నాయి. రానున్న ఉషోదయాన్ని ఏ మితవాద శక్తులూ ఆపలేవని మరోసారి రుజువౌతోంది. సామ్రాజ్యవాదుల నాయకత్వంలోని అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో ప్రజల పాత్రే కీలకం. రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యా చరిత్ర నేర్పుతున్న పాఠం అదే. ప్రజలు, వారి చేసిన అశేష త్యాగాలే లేకుంటే ఆ విజయం సాధ్యమయ్యేది కాదు. స్టాలిన్ ఆ పాత్ర నిర్వహించాడు కాబట్టే ప్రజల హృదయాత్తో నేటికీ గూడుకట్టుకొని సజీవింగా ఉన్నాడు. శత్రువుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తిస్తున్నాడు. యుద్ధానికి కారకుడైన నియంత హిట్లర్ ను వదిలేసి స్టాలిన్ ను ప్రజల శత్రువుగా చిత్రీకరించడానికి వారు పడరాని పాట్లు పడడానికి ఇదే కారణం. కమ్యూనిస్టులు కొందరు స్టాలిన్ ను మరచిపోవచ్చు, కాని పెట్టుబడిదారీ వర్గాలు మాత్రం అతన్ని మరచిపోవడం లేదు. అతని బొమ్మ చూస్తే ఉలిక్కి పడుతుంటాయి. అందుకే వారు నిరతరం స్టాలిన్ ను దూషిస్తూనే ఉంటారు. దమ వర్గ రయోజనాలకు ఘోరీ కట్టిన స్టాలిన్ ను వారు క్షమించరు. అందుకే గోర్బచేవ్ లాంటి వారికి వారు కమ్యూనిస్టు పార్టీల్లో పెద్దపీట వేస్తుంటారు. వారే నిజమైన నాయకులంటూ కీర్తిస్తుంటారు. అలాంటి వారు ఇప్పటికీ ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో తారపడుతూనే ఉంటారు. చరిత్రలో వ్యక్తుల పాత్రను వివరించేందుకు, నాటి స్టాలిన్ పాత్రను వాస్తవిక దృక్పథంతో అంచనా వేసేందుకు జగన్మోహనరావు గారు చివరలో స్టాలిన్ పేరుతో ప్రత్యేకంగా ఒక అనుబంధాన్ని చేర్చారు.

ప్రజలే చరిత్ర నిర్మాతలన్న నానుడిని మరోసారి వాస్తవ రూపంలోకి తెచ్చిన ఘనత స్టాలిన్ దే. రెండవ ప్రపంచ యుద్ధంలో ఆయన నిర్వహించిన పాత్రే అందుకు తార్కాణం. ఈ చరిత్ర నుండి పాఠాలు

Edit with WPS Office
నేర్చుకోవాలి. పతనమయిన సోవియట్ అనుభవాన్నుండి గుణ పాఠాలు తీయాలి. వాటిని భావితరాలకు అందించాలి. చరిత్ర పుస్తకాల లక్ష్యం అదే. కొత్త తరాన్ని కొత్త నినాదాలతో సంఘటిత పరచాల్సిన ఆవశ్యకతను చరిత్ర మన ముందు ఉంచింది. అందుకు తోలేటి జగన్మోహన రావు గారు రాసిన ఈ పుస్తకం తప్పకుండా స్ఫూర్తినిస్తుంది. శ్రమకోర్చి ఈ పుస్తకాన్ని మనకందించిన జగన్మోహనరావుగారిని అభినందిస్తూ ఈ పుస్తకంలోని ఆఖరి వాక్యాలతో దీన్ని ముగిస్తాను.

'శ్రామిక వర్గం తన వర్గ ప్రయోజనాలను ప్రతిబింబించే కళాసాహిత్యాలను సృష్టించుకుంటుంది. ఈ కళా సాహిత్యాలలో తన విజయాలను నెమరు వేసుకుని గర్విస్తుంది. ఓటమిలో ఊరట పొందుతుంది. నేటి నిరాశా నిస్పృహలనుండి కోలుకుని మళ్ళీ వర్గ పోరాటాలకు సంసిద్ధమవడానికి ఉత్తేజం పొందుతుంది. ఎందుకంటే వర్గ పోరాటాన్నుండి, వర్గ ప్రయోజనాలనుండి దూరమవడమంటే శ్రామిక వర్గానికి మరణమే.'

(సం) వి. శ్రీనివాసరావు
17-03-2018

Edit with WPS Office

తొలి పలుకు

సోషలిస్టు వ్యవస్థ నేడు ప్రపంచ వ్యాపితంగా కూలిపోయింది. 'సోషలిజం విఫలమైంది', 'మార్క్సిజం చచ్చిపోయింది' అనే వాదన, ముఖ్యంగా మేధావి వర్గాలనుంచి, బలంగా వినిపిస్తోంది.

సోషలిస్టు శక్తుల తిరోగమనం ఎప్పుడు ప్రారంభమైంది?

సమాధానం చాలా స్పష్టంగా ఉంటుంది.

స్టాలిన్ మరణానంతరం వ్యక్తిపూజ పేరుతో స్టాలిన్ మీద దాడితో సోషలిష్టు వ్యవస్థ అంతానికి అంకురార్పణ జరిగింది. స్టాలిన్ మీద దాడి కమ్యూనిష్టు ఉద్యమాన్ని నిర్వీర్యం చేసి రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ పునరుద్ధరణకూ ప్రపంచ వ్యాపితంగా పెట్టుబడిదారీ వ్యవస్థ బలం పుంజుకోవడానికీ దారి తీసింది. 1956లో 20వ పార్టీ కాంగ్రెస్ కు కృశ్చేవ్ సమర్పించిన రహస్య నివేదికతో ఈ దాడి ప్రారంభమైంది. ఈ కృశ్చేవ్ రహస్య నివేదిక ఏమిటో యువతరంలో చాలామందికి తెలియకపోవచ్చును కనుక కొంచెం వివరిస్తాను.

రష్యాలో 1917లో అక్టోబరు మహా విప్లవం తర్వాత లెనిన్ నాయకత్వంలో సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడింది. 'ఈ పసిపాపను ఉయ్యాలలోనే గొంతు నులిమి చంపెయ్యాలి' (మాజీ బ్రిటిష్ ప్రధాని విన్స్ టన్ చర్చిల్) అనే లక్ష్యంతో బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, జర్మనీ, ఇటలీ, ఆమెరికా మొదలైన 14 దేశాలు కమ్యూనిస్టు రష్యాపై దాడి చేశాయి. జారిజాన్ని పునరుద్ధరించడానికి కంకణం కట్టుకున్న తెల్ల సైన్యం కూడా ఈ దేశాలతో చేయి కలిపింది. ఒక దశలో కమ్యూనిస్టుల అధీనంలో రష్యాలో 16వ వంతు మాత్రమే ఉంది. 1919-1922ల మధ్య కాలంలో, యుద్ధంలో కాని యుద్ధ ఫలితంగా వచ్చిన కరువులు, రోగాల వలన కాని, 70 లక్షల మంది రష్యన్ పౌరులు మరణించారు. లక్షల మంది నిర్వాసితులయ్యారు. రష్యన్ పరిశ్రమలు, వ్యవసాయం పూర్తిగా నాశనమయ్యాయి. ఈ దురాక్రమణ యుద్ధ ఫలితంగా రష్యా 60 బిలియన్ డాలర్ల సంపదను కోల్పోయింది (2005 నాటి మారక విలువ ప్రకారం దాదాపు రెండు లక్షల ఎనభై వేల కోట్ల రూపాయలు). అపార నష్టాలకు గురయినా లెనిన్ నాయకత్వాన ప్రజల అండదండలతో ఈ యుద్ధంలో కమ్యూనిస్టు రష్యా విజయం సాధించింది.

లెనిన్ అనంతరం రష్యా స్టాలిన్ నాయకత్వంలోకి వచ్చింది. ఈ స్టాలిన్ యుగం రెండు ప్రపంచ యుద్ధాల మధ్య విరామ కాలం – ఒక కల్లోల సముద్రం వంటిది.

'ఉయ్యాలలో పసిపాప' చావలేదు. ఎదిగి పరుగులు మొదలు పెట్టింది. శిశువును హత్య చెయ్యడంలో విఫలమైన కంసులూ నిద్రపోలేదు – కమ్యూనిస్టు రష్యాని నాశనం చెయ్యాలని కుట్రలు పన్నుతూనే ఉన్నారు.

మరో పక్క జర్మనీ సాయుధమవుతూ ప్రపంచ యుద్ధం తీసుకు రాబోతున్నది. ఆ యుద్ధంలోకి రష్యా ఈడ్వబడకుండా రక్షించుకోవడానికి స్టాలిన్ ఇంటా బయటా ఉన్న శత్రువులతో పోరాటం సాగించాల్సి వచ్చింది. శత్రువుతో చేతులు కలిపి సోవియట్ ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి ప్రయత్నించిన వారిని నిర్దాక్షిణ్యంగా అణచి వెయ్యడం జరిగింది. ఈ అణచివేతలో కమ్యూనిస్టుల ముసుగులో పార్టీలో చేరిన కొంతమంది ఏజెంట్లు నిజాయితీ గల కమ్యూనిస్టులను అనేక రకాల కేసులలో ఇరికించి మరణ శిక్ష పడేలా చేశారు. శత్రు పంచమాంగ దళ నిర్మూలన కార్యక్రమంలో అనివార్యంగా కొంతమంది నిరపరాధులు కూడా బలయ్యారు.

1939లో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. ఈ యుద్ధంలో రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలు ఒకవైపూ; జర్మనీ, జపాన్, ఇటలీలు మరొకవైపూ ఉన్నాయి. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలు అంతవరకూ సోవియట్ రష్యాని నాశనం చెయ్యడానికి కుట్రలు పన్నుతూనే ఉన్నా రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైన తర్వాత మాత్రం జర్మనీ ఉమ్మడి శత్రువు అయిన కారణంగా జర్మన్ భయంతో కమ్యూనిస్టు రష్యాతో చేతులు కలిపి పోరాడవలసిన పరిస్థితి వచ్చింది. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలు

Edit with WPS Office
'మిత్ర దేశాలు'గా ఉన్నా రష్యా దాదాపు ఒంటరిగానే జర్మనీతో పోరాడవలసి వచ్చింది. ఈ యుద్ధంలో రష్యా అపారమైన నష్టాలకు గురయింది. మిత్ర దేశాలు రష్యాకి చేసిన సహాయం అంతంత మాత్రమే.

1945లో జర్మనీ ఓటమితో ప్రపంచ యుద్ధం ముగిసింది.

అణుబాంబులతో జర్మనీ బూట్లలోకి అమెరికా అడుగు పెట్టింది. ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది.

1953లో స్టాలిన్ మరణం తర్వాత మెల్ల మెల్లగా స్టాలిన్ మీద విమర్శ ప్రారంభమైంది. 1956లో జరిగిన 20వ పార్టీ కాంగ్రెస్ లో కృశ్చేవ్ స్టాలిన్ 'నేరాల' గురించి ఒక రహస్య నివేదికను సమర్పించాడు. ఈ నివేదిక రష్యాలో రహస్య నివేదిక అయింది కాని అమెరికన్ గూఢచార సంస్థ సి.ఐ.ఎ. ద్వారా ఒక కాపీ న్యూయార్క్ టైమ్స్ కు అందింది. పశ్చిమ దేశాల పత్రికల్లో బాహాటంగా వచ్చింది. ఒక పక్క ప్రపంచమంతటా ఈ రహస్య నివేదిక ప్రచారమవుతుంటే తమ భవిష్యత్తును తారుమారు చేస్తున్న ఈ నివేదిక గురించి స్టాలిన్ అంటే ప్రాణాలిచ్చే రష్యన్ కమ్యూనిస్టు పార్టీ సాధారణ సభ్యులకు కాని, రష్యన్ ప్రజానీకానికి కాని, తెలియదు. రష్యన్ కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో మొట్టమొదటిసారి ఒక పార్టీ ఉన్నతాధికారి పార్టీ కాంగ్రెసులో చేసిన కీలక ప్రసంగం ఎనిమిది లక్షల మంది పార్టీ సభ్యుల నుంచి దాచి ఉంచడం జరిగింది. ఈ నివేదిక ఆరువేల కాపీలు పార్టీలో ఉన్నతాధికారులకు మాత్రం అందజెయ్యబడ్డాయి. ఈ ఉన్నతాధికారులలో అధిక భాగం కృశ్చేవ్ తారుమారు చేస్తున్న స్టాలిన్ విధానాల వలన లాభం పొందేవారే. కృశ్చేవ్ నివేదికలో స్టాలిన్ మీద ఉన్న అసత్యపూరితమైన నిందలు తొలగించి, వ్యక్తిపూజ గురించీ పార్టీ చేసిన తప్పిదాల గురించీ సమంజసంగా ఉన్నట్లు అనిపించే విమర్శ ఉన్న చివరి ఆరు పేరాలకూ పార్టీ పత్రికల్లో ప్రచారం ఇవ్వబడింది.

ఈ నివేదికలో స్టాలిన్ మూర్ఖుడనీ అహంభావ పూరితుడనీ అనిమానించే స్వభావంగలవాడనీ హంతక మనస్తత్వంతో అనేక వేలమంది నిరపరాధులను హత్య చేశాడనీ సోషలిస్టు న్యాయ సూత్రాలను అతిక్రమించి కమ్యూనిస్టు పార్టీకి మచ్చ తీసుకు వచ్చాడనీ, ఇదంతా అతని వ్యక్తి పూజ వల్ల జరిగిందనీ, కమ్యూనిస్టు పార్టీని ఈ వ్యక్తిపూజ మార్గం నుంచి తప్పించి లెనినిస్టు మార్గంలో అసలైన ప్రజాస్వామ్య పార్టీగా మార్చాలనీ – ఇలా చాలా ఉంది.

ఈ నివేదిక అబద్ధాల పుట్ట అని చారిత్రక పత్రాల ఆధారంగా రుజువు చేస్తూ గ్రోవర్ ఫర్ అనే చారిత్రక పరిశోధకుడు 'కృశ్చేవ్ అసత్యాలు' (Khruschev Lied) అనే పరిశోధనా గ్రంధాన్ని 2011లో ప్రచురించాడు. సోవియట్ యూనియన్ పతనం తర్వాత సోవియట్ ప్రభుత్వ రహస్య పత్రాలు బహిరంగమైనప్పుడు ఈ వాస్తవాలు మనకు తెలిశాయి కాని 1956లో ఈ నివేదిక ప్రపంచానికి వెల్లడైనప్పుడు మొత్తం కమ్యూనిస్టు ప్రపంచంలో ఒక భూకంపం వచ్చిందనడంలో అతిశయోక్తి లేదు. ఈ నివేదికలోని విషయాలు కొత్తవి కావు. చాలా కాలంగా సామ్రాజ్యవాద దేశాలు ప్రచారం చేస్తున్నవే. హిట్లర్ జర్మనీ ప్రచారం చేసినవే. ట్రాట్ స్కీయిస్టులు ప్రచారం చేసినవే. అంతవరకూ అది బూర్జువా ప్రచారంగా కొట్టి పడేసిన వారు అవే విషయాలను రష్యన్ కమ్యూనిస్టు పార్టీ ధృవపరచినప్పుడు నిర్ఘాంతపోయారు.

1953లో స్టాలిన్ మరణించినప్పుడు, 'జీవించు జీవించు హే సూర్య బింబమా, జీవించు జీవించు ధరమూల స్తంభమా' అంటూ తన ఆవేదనను వ్యక్తపరచిన ఆరుద్ర గారు, కృశ్చేవ్ నివేదిక వెల్లడైన తర్వాత జుగుప్సతో 'స్టాలినిస్టు చరిత్ర, సగము గాడిద గత్ర, తెలుసుకో ఇతరత్ర, ఓ కూనలమ్మా' అంటూ స్టాలిన్ యుగాన్ని తిరస్కరించారు. ప్రపంచ వ్యాపితంగా అనేక వేలమంది కమ్యూనిస్టులు నిస్పృహతో రాజీనామా చేశారు. ఆ సంక్షోభం నుంచి సోషలిస్టు ఉద్యమం మరి కోలుకోలేదు. సంక్షోభం తర్వాత సంక్షోభానికి గురవుతూ చివరకు కూలిపోయింది.

ఈ నివేదికను మొదటిసారి చదివినప్పుడు నా మనసూ వికలమయింది. ఇటువంటి ఘోరాలు సోషలిజం పేరుతో ఎలా జరిగాయా అని బాధ కలిగింది. స్టాలిన్ అంటే అసహ్యం కలిగింది. మరికొంత కాలం పోయిన తర్వాత రెండో ప్రపంచ యుద్ధం గురించి కొన్ని పుస్తకాలు చదివాను. ఇవన్నీ కూడా పశ్చిమ దేశాల చరిత్రకారులు రాసినవే అయినా వాటిలో రష్యా గురించి కొన్ని వాస్తవాలు తెలుసుకుని ఆశ్చర్యపోయాను. జర్మన్ సైన్యం అప్పటికి ప్రపంచంలో అతి శక్తివంతమైన సైన్యం. అత్యంత అధునాతనమైన 35 లక్షల సైన్యం, వేల టాంకులతో, విమానాలతో హఠాత్తుగా మెరుపుదాడి చేసి విశాలమైన రష్యన్ భూభాగాన్ని ఆక్రమించినా స్టాలినిస్టు రష్యా ఈ దెబ్బనుంచి కోలుకుని హిట్లర్ జర్మనీని ఓడించింది. దాదాపు నాశనమైపోయిందనుకున్న స్టాలినిస్టు రష్యా ఎలా నిలువగలిగి పోరాడగలిగింది? కోట్లమంది నిరపరాధులను హత్య చేసి (స్టాలిన్ రెండున్నర కోట్లమంది రష్యన్లను

Edit with WPS Office
హత్య చేశాడంటారు బూర్జువా చరిత్రకారులు) కోట్లమందిని లేబర్ కేంపుల్లో హింసించిన ఒక హంతకుడు, మూర్ఖుడు, పొగరుమోతు నాయకత్వంలో రష్యా విజయం సాధించగలిగిందా? అన్న సంశయం కలిగింది. బూర్జువా చరిత్రకారులూ కృశ్చేవ్ లూ చిత్రించిన ఈ రాక్షస రూపం వెనుక మరొక రూపం కనిపించసాగింది.

1991లో కమ్యూనిస్టు రష్యా కూలిపోవడంతో రష్యన్ కమ్యూనిస్టులు స్టాలిన్ ను నిరాకరించి నిజమైన 'లెనినిస్టు మార్గం వైపు' ఎలా ప్రయాణించారో అర్థమైంది. ఈ అసత్య ప్రచారం వెనుకనున్న దురుద్దేశం స్పష్టమైంది.

మంచికీ చెడుకూ మధ్య జరిగే పోరాటం సూటిగా, సరళ రేఖకు అటూ ఇటూ జరుగదు. మహాభారత యుద్ధంలో ధర్మరాజంతటివాడు అసత్యం పలకాల్సి వచ్చింది. ఏదైనా కాలం గురించి మనం ఆలోచించేటప్పుడు అప్పటి ప్రధాన దిశను చూడాలి కాని చారిత్రక నేపథ్యాన్ని విస్మరించి అక్కడా అక్కడా జరిగిన 'అన్యాయాలు' 'నేరాలు' 'పొరపాట్లు' చూసి ఒక నిర్ణయానికి రావడం సరియైన పద్ధతి కాదు. ఒక చారిత్రక సంఘటనలో కోట్లమంది ప్రజలు కోట్ల ఉద్దేశాలతో పాల్గొంటారు. అనేక శక్తులు, ఒక్కొక్కప్పుడు ప్రత్యక్షంగానూ మరొకప్పుడు ప్రచ్ఛన్నంగానూ, సంఘర్షిస్తుంటాయి. ఈ సంఘర్షణల ఫలితంగా చరిత్ర ఊహించని దారులలోకి మళ్ళుతుంది. మార్క్స్, లెనిన్, స్టాలిన్ మొదలైన మహా నాయకులంతా మానవ మాత్రులే. భవిష్యత్తును ఎవ్వరూ దర్శించలేరు. మానవులకున్న పరిమితులే వీళ్ళకీ ఉంటాయి.

తప్పులు చెయ్యని మనుషులు ఎవరూ ఉండరు. వీళ్ళూ తప్పులు చేశారు. తప్పులు చేశామని వాళ్ళు నిజాయితీగా ఒప్పుకున్నారు. కేవలం తప్పులనే ఎత్తి చూపి ఒక నాయకుడి పాత్రను అంచనా వెయ్యడం సరికాదు. స్టాలిన్ తప్పొప్పులను నిష్పక్షపాతంగా భవిష్యత్తులో అంచనా వేసినప్పుడు అతను ఒక మహా మేధావిగా, మహోన్నత వ్యక్తిగా నిలుస్తాడనడంలో నాకు సందేహం లేదు.

ఈ పుస్తక ఉద్దేశం రష్యన్ ప్రజలు నాజీ జర్మన్ సైన్యంతో ఎలా పోరాడి విజయం సాధించారో తెలియజెయ్యడమే కాని సోషలిస్టు వ్యవస్థ ఎందుకు ఎలా కూలిపోయిందీ వివరించడం కానీ, స్టాలిన్ మీద విమర్శలన్నింటికీ సమాధానాలు ఇవ్వడం కానీ కాదు. ఈ యుద్ధంలో స్టాలిన్ పాత్ర గురించి కృశ్చేవ్ చేసిన విమర్శ గురించి మాత్రమే స్టాలిన్ మీద అనుబంధంలో వివరంగా చర్చించడం జరిగింది.

స్టాలిన్ మరణించిన ఎనిమిది సంవత్సరాల తర్వాత అతని శవం మీద అతి హేయంగా దాడి చేసిన కృశ్చేవ్ లూ, సోషలిస్టు రాజ్యాన్ని కూలద్రోసి మఫియా కేపిటలిజాన్ని రష్యామీద రుద్ది రష్యన్ ప్రజలనూ ప్రపంచ ప్రజలనూ ఘోరంగా వంచించిన గోర్బచేవ్ లూ ఎల్సిన్ లూ, ద్రోహులుగా కాలగర్భంలో కలిసిపోతారు. స్టాలిన్ చిరంజీవి. ప్రపంచ కార్మిక వర్గం గుండెల్లో అతను ఎప్పటికీ జీవిస్తూనే ఉంటాడు.

స్టాలిన్ అంటే సోషలిజం. స్టాలిన్ అంటే పోరాటం. స్టాలిన్ పేరు పీడిత ప్రజలను ఉత్తేజపరుస్తూనే ఉంటుంది. పోరాటాలకు పురిగొల్పుతూనే ఉంటుంది. అందుకే స్టాలిన్ అంటే వర్గ శత్రువులకూ వర్గ ద్రోహులకూ సింహస్వప్నం. అతని పేరు తుడిచి వెయ్యడానికి వాళ్ళు నిరంతరం విషప్రచారం సాగిస్తూనే ఉన్నారు. ఎంత పెద్ద ఎత్తున ఈ ప్రచారం ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్నదంటే కమ్యూనిస్టులు కూడా స్టాలిన్ పేరు తలవడానికి సందేహిస్తున్నారు. ఎంత అసత్య ప్రచారం సాగించినా నిజాన్ని కప్పి పుచ్చడం ఎవరికీ సాధ్యం కాదు. మబ్బులు సూర్యుడిని కలకాలం కప్పి ఉంచలేవు కదా!

స్టాలిన్ యుగంలో రష్యన్ కార్మిక వర్గం అద్భుత విజయాలు సాధించింది. ఆకలి, నిరుద్యోగం లేని ప్రపంచం సాధ్యమేనని రుజువు చేసింది. ప్రపంచానికి ఒక సుందర స్వప్నం అయింది. స్టాలిన్ అనంతరం అధికారంలోకి వచ్చిన రివిజనిస్టుల వెన్నుపోటు కారణంగా సోషలిస్టు శిబిరం కూలిపోయి ఆ స్వప్నం నేడు చెదిరిపోయింది.

ఇది తాత్కాలిక స్థితి మాత్రమే.

ప్రపంచ కార్మిక వర్గాన్ని బలి ఇచ్చి రివిజనిస్టులు ప్రాణం పోసిన ఈ కేపిటలిస్టు శవానికి భవిష్యత్తు లేదు. చరిత్ర తిరగబడినట్లు కనుపించవచ్చు కాని గతం భవిష్యత్తును ఎంతో కాలం అణచి ఉంచలేదు. ఒక ఓటమితో – అది ఎంత ఘోరమైన ఓటమి అయినా సరే – పోరాటం ముగియదు. ఈ తీవ్ర పరాజయం నుంచి ప్రపంచ కార్మిక వర్గం గుణ పాఠాలు నేర్చుకుంటుంది. ఆత్మహత్యా సదృశమైన వర్గ సామరస్య విధానాలు వదలి వర్గ పోరాటాల వైపు మళ్ళుతుంది. ఈ పోరాటాలకు స్టాలిన్ స్ఫూర్తినిస్తూనే ఉంటాడు. విజయం సాధించాలనే పట్టుదలా, ధర్మమైన ఆగ్రహం, తమ పోరాటం

Edit with WPS Office
న్యాయమైనదన్న విశ్వాసం, ప్రపంచ కార్మిక వర్గం స్టాలినిస్టు రష్యానుంచి అందుకుంటుంది.

స్టాలిన్ మరణం నుంచీ తిరోగమిస్తున్న సోషలిస్టు శక్తులు 'మరో స్టాలిన్ గ్రాడ్' వద్ద నిలిచి ఎదురుదాడి చేస్తాయి. విజయం సాధిస్తాయి. సందేహం లేదు.

ఈ ఇరవై ఒకటవ శతాబ్దం అమెరికన్ సామ్రాజ్యవాదానిది కాదు – శ్రామిక వర్గానిది.

మేడే, 2005 తోలేటి జగన్మోహనరావు

(ఈ ముద్రణలో తొలిపలుకు కొద్దిగా సవరించబడింది)

అధ్యాయం ఒకటి

పూర్వ రంగం

సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానం యొక్క ఉచ్చదశ. ఈ దశలో పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలన్నీ తీవ్ర స్థాయికి చేరుకుంటాయి. సామ్రాజ్యవాదానికి ఆవల ప్రజాపోరాటాలే, విప్లవాలే. ఆ కారణంగా సామ్రాజ్యవాదాన్ని మరణ శయ్య మీద ఉన్న పెట్టుబడిదారీ విధానంగా వర్ణించాడు లెనిన్. సోషలిస్టు శిబిరం కూలిపోయి ఆమెరికన్ సామ్రాజ్యవాదం ఎదురులేకుండా ప్రపంచమంతా వ్యాపిస్తున్న ఈ కాలంలో లెనిన్ మాటలలోని సత్యం స్పష్టంగా కనుపించకపోవచ్చు కాని భవిష్యత్తులో ప్రపంచ వ్యాపితంగా విరుచుకు పడబోయే విముక్తి పోరాటాలూ విప్లవాలూ ఈ సత్యాన్ని రుజువు చేస్తాయి.

సామ్రాజ్యద దశలో పెట్టుబడిదారీ దేశాలు ముడి సరుకుల కోసం, మార్కెట్ కోసం, వలసల కోసం. ప్రపంచాన్ని పంచుకోవడానికి తమలో తాము కలహిస్తూ ప్రపంచాన్ని మారణహోమంలోకి నెట్టుతాయి. 20వ శతాబ్దంలో సామ్రాజ్యవాద దేశాల మధ్య కలహాలు రెండు మహా సంగ్రామాలకు దారి తీశాయి. ఈ రెండు ప్రపంచ యుద్ధాలలోనూ కోట్లమంది బలైపోయారు.

1914 నుంచి 1918 వరకూ మొదటి ప్రపంచ యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో బ్రిటన్, ఫ్రాన్స్ ల చేతుల్లో జర్మనీ ఓడిపోయింది.

1918 నవంబరు 10వ తేదీన బెర్లిన్ సమీపాన ఒక చిన్న పట్టణంలో సైనిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులైన జర్మన్ సైనికులకు జర్మనీ యుద్ధంలో ఓడిపోయిందన్న వార్త పిడుగుపాటులా తోచింది. ఆ వార్త బ్రిటిష్ గేసు దాడిలో తాత్కాలికంగా చూపు పోగొట్టుకుని చికిత్స పొందుతున్న ఓ సైనికుడిని తీవ్రంగా కదిలించి అతనిలో ప్రతీకార జ్వాలలు రగిలించింది – అతని పేరు అడాల్ఫ్ హిట్లర్.

మొదటి ప్రపంచ యుద్ధాంతంలో ప్రపంచాన్ని కుదిపివేసిన సంఘటన మరొకటి జరిగింది. 1917లో లెనిన్ నాయకత్వాన జరిగిన అక్టోబరు మహా విప్లవంతో ప్రపంచంలో మొట్టమొదటి కార్మిక రాజ్యం ఏర్పడింది. లెనిన్ అనంతరం సోవియట్ యూనియన్ ను నడిపించిన మహా నాయకుడు స్టాలిన్.

ప్రతిభావంతులైన నేతలు చరిత్రను తమ చేతుల్లోకి తీసుకుని నడిపించినట్లు అనిపిస్తుంది కాని వారు ఆ కాలంలో సూక్ష్మంగానూ స్థూలంగానూ అనేక స్థాయిలలో జరిగే పరిణామాలకు వారసులు, ప్రతినిధులు. జర్మనీలో హిట్లరయినా, రష్యాలో స్టాలిన్ అయినా అంతే. గొప్ప వ్యక్తులు తమ అసమాన ప్రతిభా విశేషాలతో చరిత్ర గమనాన్ని త్వరితం చెయ్యగలరు లేదా తాత్కాలికంగా అడ్డగించగలరు. కాని వారిష్టం వచ్చినట్లు చరిత్రను మార్చలేరు. చరిత్రను కేవలం వ్యక్తుల చర్యలుగా మనం అర్థం చేసుకోకూడదు.

జర్మన్ సైన్యం వీరోచితంగా పోరాడగా రాజకీయ నాయకత్వం వెన్నుపోటు పొడిచి యుద్ధాన్ని విరమించిందనే భావన జర్మన్ ప్రజలలో బలపడింది. నిజానికి యుద్ధ విరమణ అనివార్య పరిస్థితులలో సైన్యం అంగీకారంతో జరిగినదే. తరువాత జర్మన్ సైన్యం తాము యుద్ధ విరమణకు వ్యతిరేకమని చెప్పడం ప్రారంభించింది.

Edit with WPS Office

యుద్ధ విరమణ తర్వాత 1919లో వెర్సయిల్స్ సంధిమీద సంతకాలు చెయ్యడం జరిగింది. సంధి షరతుల ప్రకారం జర్మనీలో కొంత భూభాగాన్ని ఫ్రాన్స్, బెల్జియం, డెన్మార్క్, పోలండ్ దేశాలకు అప్పగించాలి. యుద్ధం ప్రారంభమవడానికి జర్మనీ తన బాధ్యతను అంగీకరించి 800 మంది జర్మన్లను యుద్ధ నేరస్తులుగా విచారణకు మిత్ర దేశాలకు (బ్రిటన్, ఫ్రాన్స్ లకు) అప్పగించాలి. యుద్ధంలో జరిగిన నష్టాలకు జర్మనీ పరిహారం చెల్లించాలి. జర్మన్లను ఆగ్రహావేశాలకు గురిచేసిన మరొక షరతు – జర్మనీ నిరాయుధం కావాలి.

ఈ షరతులు జర్మనీ అంగీకరించని పక్షంలో మిత్ర దేశాలు జర్మనీ మీద యుద్ధం తిరిగి ప్రారంభిస్తాయి అని హెచ్చరించడం జరిగింది. జర్మనీ తనను తాను రక్షించుకునే స్థితిలో లేదు కనుక సంధి షరతులకు అంగీకరించక తప్పదని జర్మన్ సైన్యం కూడా భావించింది. 1919 జూన్ 28న వెర్సయిల్స్ ఒడంబడిక మీద సంతకాలు పెట్టడం జరిగింది.

ఆ నాటి నుంచీ జర్మనీ చరిత్ర గమనం మారింది. ఈ సంధిలోనే రెండో ప్రపంచ యుద్ధానికి బీజాలు పడ్డాయి. జర్మన్ ప్రజలలో అధిక భాగం వెర్సయిల్స్ సంధిని గాని, ఆ సంధికి (తప్పనిసరి పరిస్థితులలో) ఒడబడిన రిపబ్లిక్ ప్రభుత్వాన్ని కాని అంగీకరించలేదు. సైన్యం కూడా రిపబ్లిక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలిచింది. సంధినీ రిపబ్లిక్ ప్రభుత్వాన్నీ వ్యతిరేకిస్తున్న వర్గాల చేతుల్లో ఆర్థిక సంపద కేంద్రీకృతమై ఉంది. పత్రికలు, మీడియా, వారి చేతుల్లో ఉన్నాయి.

ఇటువంటి సారవంతమైన భూమిలో ప్రతీకార జ్వాలలతో రగులుతున్న హిట్లర్ భావాలు, అవి ఎంత అవాస్తవికమైనవి కాని, మొలకెత్తసాగాయి. కుట్రలు చేసి అతను క్రమంగా సర్వాధికారాలూ హస్తగతం చేసుకుని జర్మనీకి 'ఫ్యూరర్' (నాయకుడు) అయ్యాడు. జర్మన్లలో అధిక భాగం తమ విచక్షణ కోల్పోయి ఈ ఫ్యూరర్ ఎటు నడిపిస్తే అటు నడిచి జర్మనీనీ ప్రపంచాన్నీ మారాణ హోమానికి గురిచేశారు.

హిట్లర్ భావాలు

హిట్లర్ పదవిలోకి రాకముందు, 1924లో జెయిలులో ఉన్నప్పుడు, 'నా పోరాటం (Mein Kampf)' అనే పుస్తకం రాశాడు. ఈ పుస్తకంలో హిట్లర్ తన సిద్ధాంతాలనూ భావాలనూ వివరించాడు. హిట్లర్ జర్మనీ అధినేత అయిన తర్వాత ఈ పుస్తకం జర్మన్లకు బైబిలు అయింది. ప్రతీ జర్మన్ దగ్గరా ఈ పుస్తకం ఉండడం పరిపాటి అయింది. ప్రపంచ నాయకత్వం కోసం తహతహలాడుతున్న జర్మనీ వినాశకరమైన ఈ భావాలను ఉత్సాహంగా స్వీకరించింది. క్లుప్తంగా అతని భావాలు ఇవి:

1. జర్మన్ జాతి ఆర్యన్ జాతి. మానవ నాగరికతలో, కళల్లో, శాస్త్రాలలో, సాంకేతిక రంగంలో సాధించిన ప్రగతి అంతా ఆర్యన్ జాతే సాధించింది. ఆర్యన్లు తక్కువ జాతులను అణచి వెయ్యడం ద్వారానే ఈ ప్రగతిని సాధించగలిగారు. తక్కువ జాతులను జయించి, తను యజమాని అనే స్పృహతో నిర్దాక్షిణ్యంగా వాటిని అణచిపెట్టి ఉంచినంత కాలం ఆర్యన్ జాతి వర్ధిల్లింది. జాతులన్నీ సమానమైనవని నేషనల్ సోషలిజం (హిట్లర్ పార్టీ సిద్ధాంతం) అంగీకరించదు. ఉన్నత జాతులు తక్కువ జాతులను అణచిపెట్టి ఉంచాలి. అణచిపెట్టబడిన జాతి, యజమాని జాతి స్థాయికి చేరుకున్నప్పుడు యజమాని-బానిసల మధ్య భేదం తొలగి పోతుంది. యజమాని భాష బానిస నేర్వడం ద్వారా ఇది జరిగి ఉండవచ్చు. భాష కంటే ముఖ్యమైనది రక్తం. ఆర్యన్ రక్తం కలుషితమైనప్పుడు వారి పతనం ప్రారంభమైంది. ఇతర జాతుల రక్తం కలిసి ఆర్యన్ జాతి తన సంస్కృతిని కోల్పోయింది. ప్రపంచంలో ఆర్యన్ జాతికి చెందని వారంతా పనికిమాలిన వారే.
ఏ మాత్రం లోకజ్ఞానం, శాస్త్ర జ్ఞానం ఉన్నవారికైనా హిట్లర్ జాతి విధానం అర్థం లేనిదిగా తోస్తుంది. కాని జర్మన్లలో తాము ఉన్నతమైన ఆర్యన్ జాతికి చెందిన వారమనీ, మిగిలిన జాతులను అణచి ఉంచి పాలించడానికే పుట్టామనీ ఒక భావం కలిగింది. ఇతర దేశాల మీద దాడి చేసి వాటిని దోచుకోవడానికి సైద్ధాంతిక నేపథ్యం ఇచ్చింది.
2. అన్ని దేశాలలోనూ ఉన్న జర్మన్లను ఐక్యం చెయ్యాలి. జర్మనీ తన బలహీనతలను అధిగమించి ప్రపంచాధినేత కావాలి.
3. జర్మనీ ప్రపంచాధినేత ఎలా కాగలదు? మొదట ఫ్రాన్సును నాశనం చెయ్యాలి. ఫ్రాన్సును

Edit with WPS Office

నాశనం చేసిన తర్వాత జర్మనీ తూరుపు వైపు సాగాలి. జర్మనీకి జీవించడానికి స్థలం (lebensraum) కావాలి. ఈ స్థలం ఎక్కడో ఆఫ్రికాలో కాదు, ఇక్కడే, యూరోపులోనే కావాలి. కాని యూరోపు అంతా ఇప్పటికే వివిధ జాతులతో ఆక్రమించబడి ఉంది. అయితే ప్రకృతి ఈ ప్రాంతాన్ని ఏ జాతికీ రిజర్వు చేసి ఉంచలేదు. రాజ్యం వీరభోజ్యం. గెలుచుకున్న వాడిదే రాజ్యం. శాంతియుతంగా తమ దేశాన్ని ఆ దేశ ప్రజలు జర్మనీ వశం చెయ్యకపోతే? ప్రతిఘటిస్తే? బలవంతుడే నిలుస్తాడు. చరిత్ర జర్మనీకి ఎంతో అనుకూలంగా ఉంది. రష్యాను బోల్షివిక్కుల పరం చేసి బలహీన పరిచింది. బోల్షివిక్ రష్యా శిధిలమై కూలిపోవడానికి సిద్ధంగా ఉంది.

4. ప్రజాస్వామ్య వ్యవస్థ అర్థం లేనిది. నాజీ జర్మనీ నాయకత్వ సూత్రం (Fuehrerprinzip) ప్రకారం నడుస్తుంది – అంటే నాయకుడి (ఫ్యూరర్) నియంతృత్వమన్నమాట. అన్ని స్థాయిలలోనూ నాయకులు పని చేస్తుంటారు. నాయకుడికి సలహాదారులు ఉండవచ్చు కాని నిర్ణయం అతనిదే. మెజారిటీ నిర్ణయం అనే సమస్య లేదు. నాయకుడు తన పై నాయకుడికి జవాబుదారీ. పై నాయకుడి నిర్ణయాలను అమలు పరచడానికి బాధ్యుడు. నాయకుడి నిర్ణయాలను అతని అనుచరులు తూచా తప్పకుండా అమలు జరపాలి. సర్వాధికారాలూ నాయకుడివే. ఆ విధంగా పైనుంచి క్రింది వరకూ ఒక నాయక వర్గం ఉండి పాలిస్తుంది.

క్లుప్తంగా హిట్లర్ సిద్ధాంతాలు ఇవి. ఇవి హిట్లర్ కొత్తగా సృష్టించిన సిద్ధాంతాలు కావు. ఈ సిద్ధాంతాలకు జర్మన్ చరిత్రలో చారిత్రక, సైద్ధాంతిక, మేధోపరమైన పునాదులు ఉన్నాయి కనుకనే జర్మన్ ప్రజలలో ఇవి తేలికగా వ్యాపించాయి.

హిట్లర్ చరిత్రను హెచ్చరించలేదని ఎవరూ ఆరోపించలేరు. జర్మన్ జాతి ఆర్యను జాతి అన్నాడు. ఆ జాతి ఇతర జాతులను అణచిపెట్టి ఉంచితే కాని ఉన్నత స్థితికి చేరుకోలేదని అన్నాడు. జర్మనీ జీవించడానికి స్థలం అంటే ఇతర దేశాలను ఆక్రమించడమే అని స్పష్టంగా చెప్పాడు. పశ్చిమాన ఫ్రాన్సును ఆక్రమించాలన్నాడు. తూర్పున జకోస్లోవేకియా, పోలెండ్, రష్యాలను నాశనం చెయ్యాలన్నాడు. అన్నది అంతా ఆచరణలో పెట్టి మానవ జాతిని మారణ హోమంలోకి నెట్టాడు.

హిట్లర్ పార్టీ పేరు నేషనల్ సోషలిస్టు పార్టీ (నాజీ పార్టీ). నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో ఈ నాజీ సోషలిజంలో సోషలిజం అంత ఉంది. నాజీ సోషలిజం ప్రణాళికా విధానానికి వ్యతిరేకం, స్వేచ్ఛా వ్యాపారానికి అనుకూలం. ఒక పక్క పారిశ్రామికవేత్తలనుంచి ఆర్థిక సహాయం పొందుతూ, సామాన్య ప్రజలను వంచించడానికి నేషనల్ సోషలిస్టులు తాము అధికారంలోకి వస్తే ధనస్వామ్యాన్ని అంతం చేస్తామని ప్రచారం చేసేవారు

కమ్యూనిస్టులనూ సోషలిస్టులనూ ట్రేడ్ యూనియన్లనూ అణచి ఉంచుతుంది కనుక హిట్లర్ పార్టీకి పారిశ్రామికవేత్తలు సహాయం చేశారు. ముఖ్యంగా జర్మనీ ఆయుధీకరణ వలన లాభించే క్రుప్స్, ఐ. జి. ఫార్బెన్, యునైటెడ్ స్టీల్ లాంటి కంపెనీలు హిట్లర్ కు అండగా నిలిచాయి.

జర్మన్ పారిశ్రామికవేత్తల అండతో 1933లో హిట్లర్ జర్మన్ ఛాన్సలర్ అయ్యాడు. కుయుక్తులు, కుతంత్రాల ద్వారా సర్వాధికారాలూ చేబట్టి త్వరలోనే జర్మనీకి నాయకుడు (ఫ్యూరర్) అయ్యాడు. మొదటి రెండు సంవత్సరాలలోనూ శాంతి గురించి మాట్లాడుతూ హిట్లర్ జర్మనీని రహస్యంగా సాయుధం చెయ్యసాగాడు. సైన్యం సంఖ్య అక్టోబరు 1, 1934 నాటికి మూడు లక్షలకు పెరిగింది. నావికా సైన్యం క్రూయిజర్ల, జలాంతర్గాముల నిర్మాణం చేపట్టింది. జర్మన్ వైమానిక బలగానికి రహస్యంగా శిక్షణ ఇవ్వడం మొదలైంది. ఫిరంగులు (artillery), మందుగుండు తయారీ మొదలైంది. ఈ 'రహస్య కార్యక్రమం' నిజానికి రహస్యం కాదు. బ్రిటన్, ఫ్రాన్స్ లకు తెలియకుండా ఇంత పెద్ద ఎత్తున జర్మనీ పునరాయుధీకరణ జరుగదు. 1935 మార్చి 16వ తేదీన హిట్లర్ సార్వత్రిక సైనిక శిక్షణకు (Conscription) ఆదేశాలు ఇచ్చాడు. ఐదు లక్షల సైన్యాన్ని కూడా ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించాడు.

హిట్లర్ అధికారంలోకి రావడానికి ముందు 1929-34ల మధ్య, ఆకలి దశాబ్దంగా వర్ణించబడిన పెట్టుబడిదారీ ఆర్థిక మాంద్య కాలంలో, 70 లక్షల మంది నిరుద్యోగులుండేవారు. హిట్లర్ అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున పబ్లిక్ వర్క్స్ కార్యక్రమాలు మొదలు పెట్టాడు. ప్రజలకు ఉద్యోగాలు దొరకసాగాయి. జర్మనీని సాయుధం చెయ్యడానికి ప్రయత్నాలు ప్రారంభించడంతో ఆయుధ పరిశ్రమలు చురుకుగా పనిచెయ్యసాగాయి. యువకులు లక్షల సంఖ్యలో సైన్యంలో చేరసాగారు. దీర్ఘకాలిక పరిణామాలు అత్యంత ప్రమాదకరమైనవైనా, ఇటువంటి చర్యలతో నిరుద్యోగ సమస్యను చాలావరకు

Edit with WPS Office
పరిష్కరించాడన్న పేరు తెచ్చుకున్నాడు హిట్లర్.

అవమానకరమైన, నిస్పృహతో కూడిన గతాన్ని హిట్లర్ తుడిచి పడేస్తున్నాడు. వెర్సయిల్స్ సంధి సంకెళ్ళను తెంచేసి, వివిధ దేశాలలో ఉన్న జర్మన్లను అందరినీ ఐక్యం చేసి, జర్మనీని ఒక శక్తివంతమైన రాజ్యంగా రూపొందిస్తానని చెబుతున్న హిట్లర్ ను జర్మన్ ప్రజలు అభిమానించారు. జర్మన్లలో అధిక భాగం కోరుకుంటున్నది అదే. జర్మనీ సాధిస్తున్న 'ప్రగతి'ని చూసి జర్మన్లు గర్వించసాగారు. 1500 మైళ్ళ చక్కటి రోడ్లు నిర్మించబడ్డాయి. జర్మన్ నగరాలు పునర్నిర్మించడానికి బ్రహ్మాండమైన పథకాలు తయారయ్యాయి. అతని నాయకత్వంలో జర్మనీ ఏకీకృతమైంది. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీ తలెత్తుకుని సగర్వంగా నిలబడేలా చేశాడు హిట్లర్. జర్మన్ ప్రజల దృష్టిలో హిట్లర్ జర్మనీ ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహోన్నత వ్యక్తిగా నిలిచాడు. ఇది ఒక పార్శ్వం.

మరో పార్శ్వం – హిట్లర్ నిజ రూపం – భయంకరమైనది. అతను యూదు మతస్తులనూ (జ్యూలను) కమ్యూనిస్టులనూ ట్రేడ్ యూనియన్లనూ అణచి వేస్తున్నాడు. సర్వాధికారాలూ తన చేతుల్లో కేంద్రీకరించి జర్మన్ల స్వేచ్ఛను హరిస్తున్నాడు. అయితేనేం? జర్మన్ల కళ్ళ ముందు నిలిచిన అందమైన కల – ప్రపంచాధినేత అవబోతున్న జర్మనీ – వాళ్ళ కళ్ళకు పొరలు కప్పేసింది. జర్మన్ ప్రజలలో అధికభాగం వాస్తవాన్ని చూడలేకపోయారు. ఒక నియంతగా హిట్లర్ సర్వాధికారాలూ తన చేతుల్లోకి తీసుకుంటూ జర్మనీని వినాశకర మార్గం వైపు తీసుకు వెడుతున్నాడని గ్రహించలేక పోయారు. సామాన్య ప్రజలే కాదు, కార్మికుల పరిస్థితి కూడా అలాగే ఉంది. వారి ట్రేడ్ యూనియన్ హక్కులు హరించబడ్డాయి. అయితేనేం? యుద్ధ పరిశ్రమలు చురుకుగా పని చేస్తుండడంతో కార్మికులకు ఉద్యోగాలు దొరకసాగాయి. 1936 సంవత్సరానికి నిరుద్యోగ సమస్య చాలామటుకు తీరింది. కడుపు నిండిన కార్మికులు 'ట్రేడ్ యూనియన్ హక్కులు లేకపోయినా హిట్లర్ పాలనలో కార్మికులకు మాడి చచ్చే స్వేచ్ఛ లేదు' అని నవ్వుకుంటుండేవారు.

అదే సంవత్సరం జర్మనీలో ఒలింపిక్ గేమ్స్ కనీవినీ ఎరుగనంత ఎత్తున అత్యుత్సాహ వాతావరణంలో జరిగాయి. ప్రపంచమంతా ఈ గేమ్స్ నిర్వహించిన తీరు చూసి హిట్లర్ ను ప్రశంసించింది. ప్రపంచాన్ని విస్మయ పరుస్తూ ఉత్సవ వాతావరణంలో కనుపిస్తున్న జర్మనీ వెనుక మరొక జర్మనీ – నియంతృత్వ జర్మనీ – తలెత్తుతోంది.

నాజీలకు బలైపోయిన పాస్టర్ మార్టిన్ నిమోల్లర్ అనే క్రిష్టియన్ మతాధికారి ఈ విషాదాన్ని ఒక గేయంలో ఇలా వర్ణించాడు:

వాళ్ళు (నాజీలు) మొదట జ్యూల కోసం వచ్చారు
నేను మౌనంగా ఉన్నాను
ఎందుకంటే నేను జ్యూను కాను
వాళ్ళు మళ్ళీ కమ్యూనిస్టులకోసం వచ్చారు
నేను మౌనంగా ఉన్నాను
ఎందుకంటే నేను కమ్యూనిస్టుని కాను
వాళ్ళు ట్రేడ్ యూనియన్ లీడర్ల కోసం వచ్చారు
నేను మౌనంగా ఉన్నాను
ఎందుకంటే నేను ట్రేడ్ యూనియన్ లీడర్ని కాను
తర్వాత వాళ్ళు కేథలిక్కులకోసం వచ్చారు
నేను మౌనంగా ఉన్నాను
చివరన వాళ్ళు నా కోసం వచ్చారు
ఇంక మాట్లాడేందుకు ఎవ్వరూ మిగిలి లేరు

హిట్లర్ వెర్సయిల్స్ సంధి షరతులు ఒక్కొక్కటే ఉల్లంఘిస్తూ పెద్ద ఎత్తున జర్మనీని సాయుధం చేస్తున్నప్పుడు బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు హిట్లర్ ను ఆపడానికి ప్రయత్నించలేదు. యూరోపులో శక్తివంతమైన ఈ రెండు దేశాలూ సాయుధమవుతున్న జర్మనీని ఉపేక్షించడమే కాదు, పరోక్షంగా ప్రోత్సహించాయి. హిట్లర్ ను కమ్యూనిస్టు రష్యా మీదకు ఉసిగొల్పాలనే దురుద్దేశంతో చివరి వరకూ ఆత్మహత్యా సదృశమైన విధానాలు అవలంబిస్తూనే ఉన్నాయి. ఈ రెండు దేశాల కుయుక్తులూ కుతంత్రాలూ, హిట్లర్ జర్మనీలో నిలద్రొక్కుకోవడానికీ అత్యంత శక్తివంతమైన సైన్యం సమకూర్చుకుని ప్రపంచాన్ని మారణ హోమంలోకి దించడానికీ పరోక్షంగా కారణం అయ్యాయి.

Edit with WPS Office

ఒకపక్క జర్మనీని సాయుధం చేస్తూ 1935 మే 21న, రైటా (జర్మన్ పార్లమెంటు)లో శాంతి ఆవశ్యకత గురించి ప్రసంగించాడు హిట్లర్:

'యూరోపులో గత 300 ఏళ్ళుగా జరిగిన రక్తపాతమూ, దాని వలన కలిగిన ఫలితాలూ చూస్తే....ఫ్రాన్స్ ఫ్రాన్స్ గానే ఉంది. జర్మనీ జర్మనీగానే ఉంది. పోలెండు పోలెండుగా, ఇటలీ ఇటలీగానే ఉన్నాయి. రక్తపు నదులు పారినప్పటికీ ఈ దేశాలు అలాగే ఉన్నాయి. ఈ దేశాలు ఈ యుద్ధాలకోసం చేసిన త్యాగాలలో అణుమాత్రం సత్ప్రయోజనాలకు వినియోగించి ఉంటే అంతకంటే విజయం సాధించగలిగి ఉండేవి. జర్మనీ ఇతర దేశాలను జయించాలని కోరటం లేదు. మా జాతి సిద్ధాంతం ఇతర జాతులను అణచాలని కోరదు.... నేషనల్ సోషలిస్టు పార్టీ శాంతిని కోరుతుంది. జర్మనీ ఆస్ట్రియాను జర్మనీలో విలీనం చెయ్యాలని కోరడం లేదు. జర్మనీ ఆస్ట్రియా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం కలుగజేసుకోదు. నిరాయుధ ప్రాంతం రైన్ లాండులో జర్మనీ ప్రవేశించదు..... యుద్ధ జ్వాలలు ఎవరైనా రగిలిస్తే అరాచకం తప్ప ఏవీ సాధించలేరు.....'

రైన్ లాండులో జర్మనీ ప్రవేశించదు అని హామీ ఇచ్చిన తర్వాత పదినెలలలోనే 1936 మార్చి 7న హిట్లర్ సైన్యాలు రైన్ లాండులో ప్రవేశించాయి. రైన్ లాండులో జర్మన్ సైన్యం ప్రవేశించిన రెండు గంటల తర్వాత హిట్లర్ కొత్త శాంతి ప్రతిపాదనలతో వచ్చాడు. 'హిట్లర్ తన ప్రతిద్వందిని లాగి లెంపకాయ కొట్టాడు. వెంటనే శాంతి ప్రతిపాదనతో ముందుకు వచ్చాడు' అని ఒక రాజకీయవేత్త ఈ కొత్త శాంతి ప్రతిపాదనలను గురించి వర్ణించాడు.

వెన్నెముక లేని బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు హిట్లర్ కు మళ్ళీ లొంగాయి. మూడు వేలకు మించి లేని జర్మన్ సైన్యం రైన్ లాండును ఆక్రమిస్తుంటే లక్షల ఫ్రెంచి సైన్యం ప్రేక్షకుడిలా చూస్తూ నిలబడింది.

రక్తపాతం లేకుండా, బ్రిటన్, ఫ్రాన్స్ ల నుంచి యుద్ధ ప్రమాదం లేకుండా, సాధించిన ఈ విజయం వలన జర్మన్ ప్రజల్లో హిట్లర్ పరపతి పెరిగింది. యుద్ధ ప్రమాదం లేకుండా హిట్లర్ తాను అనుకున్నది సాధించగలడన్న అభిప్రాయం జర్మన్ ప్రజలలో కలిగింది.

రైన్ లాండు తర్వాత ఆస్ట్రియా వంతు వచ్చింది. ఆస్ట్రియాలో జర్మన్ జనాభా అధికంగా ఉంది. నాజీ పార్టీ అక్కడ బలంగా ఉంది. 1938 మార్చి 12న జర్మన్ సైన్యాలు ఆస్ట్రియాలో ప్రవేశించి ఒక్క తుపాకీ గుండు కూడా పేల్చకుండానే ఆస్ట్రియాను జర్మనీలో విలీనం చేశాయి. ఈ ఆస్ట్రియా విలీనంతో 70 లక్షలమంది జర్మన్లు జర్మనీలో కలిశారు. ఆస్ట్రియా విలీనం వలన, హిట్లర్ తరువాతి లక్ష్యం అయిన జకోస్లోవేకియా సరిహద్దులకు మూడు వైపులా జర్మన్ సైన్యం చేరింది. జర్మనీ దాడి చేస్తే తనను తాను రక్షించుకోలేని దుస్థితిలో పడింది జకోస్లోవేకియా.

సోవియట్ ప్రభుత్వం యూరోపులో కమ్ముకు వస్తున్న యుద్ధ మేఘాలను గమనించి ఆందోళన పడింది. ఆస్ట్రియా జర్మనీ వశమైన తర్వాత సోవియట్ యూనియన్ జర్మనీకి వ్యతిరేకంగా బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలు సమిష్టి రక్షణకు వెంటనే సిద్ధమవ్వాలని విజ్ఞప్తి చేసింది. 'ఇంక జాప్యం చెయ్యకూడదు. ఈ జాప్యం వినాశనానికి దారి తీయవచ్చు' అని హెచ్చరించింది.

మరే ఇతర దేశం పైనా జర్మనీ దురాక్రమణ చెయ్యకుండా నివారించడానికి ఒక సమావేశం ఏర్పాటు చెయ్యాలని సోవియట్ ప్రభుత్వం 1938 మార్చి 17న కోరింది. బ్రిటిష్ ప్రధాన మంత్రి ఛాంబర్లీన్ ఈ సోవియట్ ప్రతిపాదనను తోసి పుచ్చాడు. అంతే కాదు, హిట్లర్ జకోస్లోవేకియా మీద దాడి చేసిన పక్షంలో బ్రిటన్ జకోస్లోవేకియాకు అండగా నిలుస్తుందని హామీ ఇవ్వడానికి నిరాకరించాడు. ఫ్రాన్స్, జకోస్లోవేకియా, రష్యాల మధ్య పరస్పరం సహాయం చేసుకునే సంధి ఉంది. జర్మనీకి వ్యతిరేకంగా, జకోస్లోవేకియాకు అండగా ఫ్రాన్స్ యుద్ధంలోకి దిగితే ఫ్రాన్సుకు బ్రిటన్ సహాయం చెయ్యదని కూడా ఛాంబర్లీన్ అన్నాడు. జకోస్లోవేకియా మీద హిట్లర్ దాడి చేసిన పక్షంలో బ్రిటన్ నుంచి ఎటువంటి ప్రతిఘటనా ఉండదని ఛాంబర్లీన్ స్పష్టం చేశాడు. ఇది నిర్భయంగా జకోస్లోవేకియాను ఆక్రమించుకోమని హిట్లర్ ను పరోక్షంగా ప్రోత్సహించడమే. యూరోపులో హిట్లర్ రగిలిస్తున్న యుద్ధం వ్యాపించడానికి కుయుక్తుల శకుని మామ బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లీన్ శక్తివంచన లేకుండా సహకరిస్తున్నాడు.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం శాంతి ఒడంబడిక ఫలితంగా జకోస్లోవేకియా ఏర్పడింది. జర్మన్లకు ఈ శాంతి ఒడంబడిక పట్ల తీవ్ర వ్యతిరేకత ఉంది. జకోస్లోవేకియాలో అనేక జాతులున్నాయి, మైనారిటీలున్నాయి. ఈ మైనారిటీలు తమ మాతృదేశం అంటే అభిమానం కలిగి ఉండేవి. పోలిష్ మైనారిటీ పోలెండు పట్ల, సుడెటన్ లాండులో ఉన్న జర్మన్లు జర్మనీ పట్ల, రుథేనియన్లు రష్యా పట్ల,

Edit with WPS Office
హంగేరియన్లు హంగరీ పట్ల అభిమానంతో ఉండేవారు. అనేక జాతుల, మైనారిటీల సమస్యతో జకోస్లోవేకియా ఒడిదుడుకులకు లోనవుతుండేది.

హిట్లర్ అధికారంలోకి రాగానే సుడెటన్ (సుడెటన్ లాండ్ జకోస్లోవేకియాలో ఒక ప్రాంతం) జర్మన్లు నాజీ పార్టీ అభిమానులుగా మారిపోయారు. సుడెటన్ ప్రాంతాన్ని జర్మనీలో విలీనం చెయ్యాలని హిట్లర్ డిమాండు చేశాడు. పోలిష్ ప్రజలున్న ప్రాంతాన్ని తనకు అప్పగించాలని పోలెండ్ డిమాండు చేసింది. పోలెండు తన సైన్యాన్ని జకోస్లోవేకియా సరిహద్దుకు తరలించింది. అలాగే హంగరీ కూడా హంగేరియన్ జాతులున్న ప్రాంతాన్ని హంగరీకు అప్పగించాలని డిమాండు చేసి సరిహద్దులకు సైన్యాన్ని తరలించింది.

జకోస్లోవేకియా ఉనికి ప్రమాదంలో పడగానే, ఆ దేశంతో రక్షణ ఒడంబడిక ఉన్న సోవియట్ యూనియన్ జకోస్లోవేకియా తరఫున పోరాడడానికి పశ్చిమ సరిహద్దులకు 40 డివిజన్ల సైన్యాన్ని తరలించింది. 3,40,000 రిజర్వు సైన్యాన్ని సమీకరించడానికి పిలుపునిచ్చింది.

కాని జకోస్లోవేకియా బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల ద్రోహానికి గురయింది. ఈ రెండు మిత్ర దేశాలూ జకోస్లోవేకియాను నాజీ తోడేళ్ళకు వదిలేశాయి. 50 శాతం కంటే ఎక్కువమంది జర్మన్లు ఉన్న ప్రాంతాలను జర్మనీకి అప్పగించాలనీ లేకపోతే యుద్ధం తప్పదనీ బ్రిటన్, ఫ్రాన్సులు జకోస్లోవేకియా మీద ఒత్తిడి తీసుకు వచ్చాయి. 1938 సెప్టెంబరు 30న మ్యూనిచ్ నగరంలో ఒక ఒడంబడిక మీద జర్మనీ, ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు సంతకాలు చేశాయి. ఈ సిగ్గుమాలిన ఒడంబడిక మ్యూనిచ్ ఒడంబడికగా చరిత్రలో అపఖ్యాతి పాలయింది. తన భవిష్యత్తు నిర్ణయించబడిన ఈ సమావేశంలో జకోస్లోవేకియా లేదు. జకోస్లోవేకియా-ఫ్రాన్స్-రష్యాల మధ్య సైనిక సహాయానికి సంబంధించిన ఒడంబడిక ఒకటి ఉన్నా ఈ మ్యూనిచ్ సమావేశాన్నుంచి రష్యాను వెలివేశారు.

మ్యూనిచ్ ఒడంబడిక ప్రకారం సుడెటన్ ప్రాంతాన్ని జర్మన్ సైన్యాలు ఆక్రమించాయి. అలాగే పోలెండు, హంగరీలు కూడా జకోస్లోవేకియాలో కొంత భాగాన్ని ఆక్రమించాయి. ముక్కచెక్కలయిన జకోస్లోవేకియా హిట్లర్ దయాదాక్షిణ్యాల మీద బతికే స్థితికి చేరింది. హిట్లర్ క్రమంగా మిగిలిన జకోస్లోవేకియానంతా ఆక్రమించాడు. సుడెటన్ లాండ్ ను జర్మనీకి అప్పగిస్తే జకోస్లోవేకియా సమగ్రతను కాపాడుతామని మ్యూనిచ్ ఒడంబడికలో హామీ ఇచ్చిన బ్రిటన్, ఫ్రాన్సులు హిట్లర్ జకోస్లోవేకియానంతా ఆక్రమిస్తుంటే కిమ్మనలేదు.

జకోస్లోవేకియా మరణించింది. మరణించింది అనడం సరికాదు - 'శాంతి ప్రియుడైన' బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లీన్ ఆధ్వర్యంలో జకోస్లోవేకియా హత్య చెయ్యబడింది.

దురాక్రమణదారుని డిమాండ్లన్నీ అంగీకరిస్తూ లొంగుతూ పోతుంటే బలపడేది శాంతి కాదు, దురాక్రమణ. హిట్లర్ ఆకలి జకోస్లోవేకియాతో తీరేది కాదు. జకోస్లోవేకియా తరువాత మరో దేశం....జకోస్లోవేకియాను హత్య చెయ్యడంలో తన పాత్ర పోషించిన పోలెండ్ వంతు వచ్చింది. ఒక్కొక్క అడుగే వేస్తూ యుద్ధ రాక్షసి రష్యా సరిహద్దులకు చేరుతోంది.

సోవియట్ యూనియన్ – జర్మనీ నిరాక్రమణ సంధి

హిట్లర్ 'నా పోరాటం'లో చెప్పినదంతా ఆచరణలో పెడుతున్నాడు. ఇప్పుడు పోలెండు...పోలెండ్ తర్వాత తూర్పున రష్యాకాని, పశ్చిమాన ఫ్రాన్స్ కాని హిట్లర్ లక్ష్యం అవుతుందని స్పష్టమయింది. యూరోపు దేశాలు సమిష్టిగా హిట్లర్ ను ఆపాలని రష్యా చేస్తున్న ప్రయత్నాలను నీరు గారుస్తూ, హిట్లర్ ను రష్యా మీదకు ఉసిగొల్పడానికి బ్రిటన్, ఫ్రాన్స్ లు కుతంత్రాలు పన్నుతున్న తరుణంలో, 1939 ఆగష్టులో సోవియట్ యూనియన్ – జర్మనీ దేశాల మధ్య ఒక నిరాక్రమణ సంధి జరిగింది. ప్రపంచంలోని ప్రజాస్వామ్యవాదులనూ కమ్యూనిస్టులనూ జర్మనీతో ఈ నిరాక్రమణ సంధి విస్మయంలో ముంచెత్తింది, గందరగోళంలో పడేసింది.

హిట్లర్ అధికారంలోకి వచ్చినప్పటినుండీ నాజీలను వ్యతిరేకించడంలో రష్యా ముందుంది. యూరోపుని యుద్ధ మేఘాలు కమ్ముతుంటే శాంతి కోసం తపన పడింది. అటువంటి రష్యా హిట్లర్ తో నిరాక్రమణ ఒడంబడికకు ఎలా అంగీకరించింది? ఎందుకు అంగీకరించింది?

పోలెండ్ రష్యా పశ్చిమ సరిహద్దులో ఉంది. పోలెండు మొదటినుంచీ జర్మనీకి అనుకూలంగా ఉంది. పోలెండు సహాయంతో జర్మనీ రైన్ లాండును ఆక్రమించింది, ఆస్ట్రియాను ఆక్రమించింది, జకోస్లోవేకియాను అంతం చేసింది. జకోస్లోవేకియా అంతమైన తర్వాత పోలెండ్ ప్రమాదంలో పడింది.

Edit with WPS Office
జకోస్లోవేకియా లాగానే పోలెండ్ కూడా మూడు వైపులనుంచి జర్మన్ల చే చుట్టముట్టబడిన పరిస్థితి ఏర్పడింది.

పోలెండ్ లోని డాన్జిగ్ ప్రాంతాన్ని జర్మన్ పరం చెయ్యాలన్న డిమాండుతో పాటు జర్మనీ మరికొన్ని డిమాండ్లు కూడా చేసింది. పోలెండ్ ప్రమాదంలో పడ్డాకా 1939 మార్చ్ 21న బ్రిటిష్ ప్రధాన మంత్రి, బ్రిటన్, ఫ్రాన్స్, పోలెండ్, సోవియట్ యూనియన్ – ఈ నాలుగు దేశాలూ యూరోపులో ఇంక దురాక్రమణను ఎలా ఆపాలి అనే విషయం మీద సంప్రదింపులు జరుపుతాయి అని ప్రకటించాలి, అని ప్రతిపాదించాడు. 'సంప్రదింపులు జరుగుతాయి' అని ప్రకటించడం వలన ప్రయోజనం ఉండదని భావించిన రష్యన్ ప్రభుత్వం - ఫ్రాన్స్, బ్రిటన్, పోలెండ్, రష్యా, టర్కీ, రుమేనియాలు సమిష్టిగా హిట్లర్ ను ప్రతిఘటించాలని ప్రతిపాదించింది. కాని బ్రిటిష్ ప్రధాన మంత్రి సమిష్టిగా ప్రతిఘటించాలనే రష్యన్ ప్రతిపాదనను అంగీకరించలేదు. జర్మనీ పోలెండ్ మీద దాడి చేసిన పక్షంలో బ్రిటన్ ఏకపక్షంగా పోలెండ్ కు అండగా నిలుస్తుందని బ్రిటిష్ ప్రధాన మంత్రి మార్చ్ 31న ప్రకటించాడు.

1939 మార్చ్ 10వ తేదీన 18వ పార్టీ కాంగ్రెస్ లో మాట్లాడుతూ స్టాలిన్ – 'ప్రజాస్వామ్య దేశాలు సమిష్టి రక్షణ విధానాన్ని గాలికొదిలేసి, ఇతరుల వ్యవహారాల్లో జోక్యం కలుగజేసుకోమంటూ తటస్థ విధానాన్ని అవలంబిస్తున్నాయి. ఈ తటస్థ విధాన లక్ష్యం ఏమిటంటే దురాక్రమణదారుడిని ఇతర దేశాల మీదకు ఉసిగొల్పడం....తూరుపు వైపుకు వెళ్ళండనీ, తూర్పు దేశాలు తేలిగ్గా పడిపోతాయనీ జర్మన్లను ప్రోత్సహించడం....బోల్షివిక్కులతో యుద్ధం ప్రారంభించండి, అంతా సవ్యంగా ముగుస్తుందని చెప్పడం....వీరి లక్ష్యం జర్మనీ, సోవియట్ యూనియన్ల మధ్య యుద్ధం తీసుకురావడంగా కనుపిస్తోంది...' అన్నాడు. శాంతికోసం పాటుపడాలనీ అన్ని దేశాలతోనూ ఆర్థిక సంబంధాలు మెరుగుపరుచుకోవాలనీ స్టాలిన్ అన్నాడు.

ఇతరులను తమ అవసరాలకు సమిధలుగా చెయ్యడం యుద్ధోన్మాదుల సంప్రదాయం అనీ యుద్ధోన్మాదులు ప్రారంభించే యుద్ధంలోకి రష్యా ఈడ్వబడకుండా రక్షించుకోవాలి అనీ (not to let our country be drawn into conflict by warmongers, whose custom it is to let others pull their chestnuts out of the fire) హెచ్చరించాడు స్టాలిన్.

ఇది బ్రిటన్, ఫ్రాన్స్ లకు హెచ్చరికగా ప్రపంచం భావించింది.

బ్రిటన్, ఫ్రాన్స్, సోవియట్ యూనియన్ - ఈ మూడు దేశాలూ పరస్పర సహకారానికి ఒక ముక్కోణపు ఒడంబడికకు రావాలని సోవియట్ ప్రభుత్వం 1939 ఏప్రిల్ 16న బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ ఒడంబడిక అమలు జరపడానికి మూడు దేశాల సైనిక సమావేశం జరగాలని కోరింది. నాజీ జర్మనీ ఆక్రమణ ప్రమాదం ఉందని భావించే మధ్య, తూరుపు దేశాల రక్షణకు ఈ మూడు దేశాలూ హామీ ఇవ్వాలి. పోలెండ్ కు అంగీకారమైతే ఈ మూడు దేశాలతోనూ చేతులు కలుపవచ్చు – ఇదీ సోవియట్ ప్రతిపాదన. బ్రిటిష్ ప్రభుత్వం మూడువారాల తర్వాత, మే 8వ తేదీన ఈ ప్రతిపాదనను దాదాపు తోసిపుచ్చింది.

పోలెండ్, రుమేనియా దేశాలు బ్రిటన్, ఫ్రాన్స్ ల గేరంటీని స్వీకరించడానికి సిద్ధ పడ్డాయి కాని సోవియట్ గేరంటీని అంగీకరించడానికి నిరాకరించాయి. జర్మనీ దాడి చేసిన పక్షంలో సరిహద్దులో ఉన్న సోవియట్ యూనియన్ మాత్రమే ఈ దేశాలకు సహాయపడగలదు. బ్రిటన్, ఫ్రాన్స్ ల సహాయం అంతగా ఉండదు. అయినా గుడ్డి సోవియట్ వ్యతిరేకత పోలిష్ ప్రభుత్వ బుద్ధిని మందగింపచేసింది. ఒక పక్క జర్మనీ పశ్చిమాన్నుంచి పోలెండ్ మీద దాడి చెయ్యడానికి సిద్ధమవుతుంటే, కమ్యూనిస్టు వ్యతిరేకతతో గుడ్డిదయిన పోలెండ్ లోని భూస్వాముల ప్రభుత్వం తూర్పున సోవియట్ యూనియన్ మీద దాడి చెయ్యడానికి సన్నాహాలు చెయ్యసాగింది. జర్మన్లను ఎదుర్కోవడానికి తమ భూభాగం గుండా సోవియట్ సైన్యాలు ప్రయాణించడానికి అనుమతించలేదు. రష్యన్ వైమానిక బలగం పోలిష్ విమానాశ్రయాలను ఉపయోగించడానికి పోలిష్ ప్రభుత్వం అంగీకరించలేదు.

ఇలా సంప్రదింపులలో ప్రతిష్టంభన ఏర్పడినప్పుడు బ్రిటిష్ విదేశాంగ కార్యదర్శిని సంప్రదింపులకు మాస్కో పంపమని సోవియట్ యూనియన్ బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరింది. బ్రిటిష్ విదేశాంగ కార్యదర్శి వంటి సీనియర్ అధికారి పర్యటన ఈ ప్రతిష్టంభనను తొలగించడానికీ రష్యాతో ఒక ఒడంబడికకు రావడానికీ బ్రిటన్ సీరియస్ గా ఉందనడానికీ నిదర్శనంగా రష్యా భావించింది. కాని విదేశాంగ కార్యదర్శి మాస్కో వెళ్ళడానికి నిరాకరించాడు. మాజీ విదేశాంగ కార్యదర్శి మాస్కో వెళ్ళడానికి సిద్ధపడినా బ్రిటిష్ ప్రధాన మంత్రి అనుమతించలేదు. ఇంత ముఖ్యమైన సమావేశంలో స్టాలిన్,

Edit with WPS Office
మాలటోవ్ లతో సంభాషణలు జరపడానికి విదేశాంగ కార్యాలయంలోని ఒక చిన్న అధికారిని పంపించింది బ్రిటన్. హిట్లర్ కు వ్యతిరేకంగా ఒక ఐక్య సంఘటనను నిర్మించే ఉద్దేశం బ్రిటన్ కు లేదని రష్యన్లకు స్పష్టమయింది. రష్యన్ సైనిక బలం పట్ల బ్రిటన్, ఫ్రాన్స్ లకు చిన్న చూపు ఉంది. అలాగే సైనిక సంప్రదింపులకోసం రష్యా, రక్షణ కమిస్సార్ మార్షల్ వొరోషిలోవ్, ఎర్ర సైన్యం చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ షపోష్నికోవ్ లాంటి వారిని నియమిస్తే, బ్రిటన్ ఉన్నత సైనికాధికారులను పంపించకుండా రిటైరవబోతున్నవారిని పంపించింది. ఈ ఆంగ్లో ఫ్రెంచ్ ప్రతినిధి వర్గం విమానంలో ప్రయాణిస్తే ఒక రోజు పట్టేది. కాని విమానంలో రాకుండా ఈ ప్రతినిధి వర్గం నెమ్మదిగా పాసింజరు ఓడలో ఆగష్టు 5న బయలు దేరి వారం రోజుల తర్వాత లెనిన్ గ్రాడ్ చేరింది.

ఆగష్టు రెండవవారానికి సోవియట్ యూనియన్-పశ్చిమ దేశాల మధ్య సైనిక సంప్రదింపుల ప్రక్రియ దాదాపు నిలిచిపోయే స్థితికి వచ్చింది.

ఇటు రష్యాతో సంభాషణలు జరుపుతున్న సమయంలోనే మరో పక్క, 1939 జూన్-ఆగస్టు లలో, బ్రిటన్-జర్మనీల మధ్య రహస్య సంప్రదింపులు జరుగుతున్నాయి. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చెయ్యనని హిట్లర్ హామీ ఇస్తే, తూరుపు వైపు హిట్లర్ దురాక్రమణలో బ్రిటన్ కలుగజేసుకోదు; బ్రిటన్ సోవియట్ యూనియన్ తో సంధి సంప్రదింపులను నిలుపు చేస్తుంది – ఇదీ ఈ రహస్య సంప్రదింపుల సారాంశం. స్టాలిన్ కు గూఢచారుల ద్వారా ఈ రహస్య సంప్రదింపుల వివరాలు అందుతూనే ఉన్నాయి. సోవియట్ యూనియన్ కు వ్యతిరేకంగా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ – అన్నీ ఏకమయ్యే ప్రమాదం ఎదురవుతున్నదని స్టాలిన్ గ్రహించాడు.

మరో పక్క జర్మనీ సోవియట్ యూనియన్ తో నిరాక్రమణ సంధిని ప్రతిపాదిస్తోంది.

నల్ల సముద్రం-బాల్టిక్ రాజ్యాల మధ్య ప్రాంతాన్ని జర్మనీ, రష్యాల మధ్య విభజించడానికి జర్మనీ ఒక రహస్య ఒడంబడికను ప్రతిపాదించింది. బ్రిటన్, ఫ్రాన్స్ లతో సైనిక సంప్రదింపులు సఫలమవుతాయన్న ఆశతో ఉన్న సోవియట్ యూనియన్ ఆగస్టు 7న జర్మన్ ప్రతిపాదనలను తోసిపుచ్చింది.

ఆగస్టు 15న జర్మన్ ప్రభుత్వం నిరాక్రమణ సంధినీ దానితో పాటు ఒక రహస్య ఒడంబడికనూ ప్రతిపాదించింది. రష్యన్ ప్రభుత్వం మళ్ళీ నిరాకరించింది.

ఆగస్టులో మరో పరిణామం స్టాలిన్ జర్మనీతో నిరాక్రమణ సంధి గురించి ఆలోచించేలా చేసింది.

1938 నుంచీ సోవియట్-జపాన్ల మధ్య మంచూరియా సరిహద్దులలో సాయుధ సంఘర్షణ జరుగుతోంది. 1939 నాటికి సంఘర్షణలు తీవ్రమై జపాన్ అంతకంతకు అధిక సైన్యంతో దాడి చెయ్యసాగింది. 1939 ఆగస్టు నాటికి ఖాల్కిన్ గోల్ ప్రాంతంలో రష్యా, జపాన్ల మధ్య చిన్న సైజు యుద్ధం జరుగుతోంది. ఈ యుద్ధం స్టాలిన్ కు ఆందోళన కలిగిస్తోంది. రష్యా రెండు రంగాలలో, తూర్పున జపాన్ తోనూ పశ్చిమాన జర్మనీతోనూ, ఒంటరిగా యుద్ధం చెయ్యాల్సి వచ్చే ప్రమాదకర పరిస్థితిలోకి నెట్టబడుతోంది. జర్మనీతో నిరాక్రమణ సంధి జర్మనీ మిత్ర దేశమైన జపాన్ ను నిరుత్సాహపరుస్తుంది. జపాన్ తో యుద్ధం రష్యాకు అనుకూలంగా ముగిసే అవకాశం ఉంది.

ఇటువంటి పరిస్థితులలో స్టాలిన్ జర్మనీతో నిరాక్రమణ సంధికి అంగీకరించాడు. ఇది స్టాలిన్ కూ, రష్యాకూ, కమ్యూనిస్టులకూ - అందరికీ చేదుమాత్రే. ఈ సంధి స్టాలిన్ ను ఒక అవకాశవాదిగా చేసిందనీ ఎటువంటి పరిస్థితులలోనూ స్టాలిన్ హిట్లర్ తో ఈ సంధికి అంగీకరించి ఉండకూడదనీ కొంతమంది మార్క్సిస్టులు ఇప్పటికీ తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఉదాహరణకు క్యూబా ప్రెసిడెంటు ఫైడెల్ కాస్ట్రో 1992లో ఒక ఇంటర్వ్యూలో స్టాలిన్ ను ప్రతీదానికీ తప్పు పట్టడం చారిత్రకంగా తప్పు అవుతుందనీ చెబుతూ '.....యుద్ధ ప్రారంభానికి ముందు స్టాలిన్ పాలిసీ పూర్తిగా తప్పు అని నేను అభిప్రాయపడుతున్నాను. ప్రపంచం ఉనికికే ప్రమాదకరమైన రాక్షసుడిగా హిట్లర్ తయారు కావడంలో పశ్చిమ దేశాల పాత్రను ఎవ్వరూ కాదనలేరు. హిట్లర్ ముందు పశ్చిమ దేశాల లొంగుబాటు ధోరణిని ఎవ్వరూ కాదనలేరు. పశ్చిమ దేశాల ఈ ప్రవర్తన హిట్లర్ ను ప్రోత్సహించి స్టాలిన్ భయపడేలా చేసింది. ఈ భయంతో వ్యవధి సంపాదించడం కోసం స్టాలిన్ ఎటువంటి మూల్యాన్నయినా చెల్లించి హిట్లర్ తో శాంతి ఒడంబడికకు సిద్ధపడ్డాడు. ప్రిన్సిపల్స్ గాలికి వదిలేసి స్టాలిన్ ఇలా హిట్లర్ తో శాంతి ఒడంబడిక చేసుకోవడం నేను జీవితాంతం విమర్శిస్తూనే ఉంటాను.....' అన్నాడు.

గత్యంతరం లేని పరిస్థితులలో జర్మనీతో నిరాక్రమణ సంధికి రష్యా అంగీకరించాల్సి వచ్చింది. ఆ నాటి నిర్దిష్ట పరిస్థితులలో ఇది ఒక వాస్తవికమైన చర్యే. ఈ నిరాక్రమణ సంధి షరతులను జర్మనీ

Edit with WPS Office
నిజాయితీతో అమలు జరుపుతుందన్న భ్రమలు స్టాలిన్ కు లేవు. ఈ సంధి వలన రష్యాకు కలిగిన మేలు ఏమిటంటే –

1. యుద్ధానికి సంసిద్ధం కావడానికి రష్యాకు ఒకటిన్నర సంవత్సరాల వ్యవధి లభించింది.
2. అక్టోబరు విప్లవం తర్వాత రష్యా అంతర్యుద్ధంలో చాలా బలహీనపడిన పరిస్థితులలో, 1920లో ఫ్రాన్స్ సహకారంతో పోలెండు రష్యా మీద దాడి చేసి పశ్చిమ యుక్రెయిన్, పశ్చిమ బెలో రష్యాలను ఆక్రమించి 150 మైళ్ళ రష్యన్ భూభాగాన్ని స్వాధీనం చేసుకుంది. ఈ ప్రాంతాలలో ప్రధానంగా యుక్రెయిన్లూ బెలో రష్యన్లూ ఉన్నారు. 1939లో జర్మనీ పోలెండు మీద దాడి చేసినప్పుడు సోవియట్ సైన్యాలు తూర్పు పోలెండులో ప్రవేశించి పశ్చిమ యుక్రెయిన్, పశ్చిమ బెలో రష్యాలను తిరిగి తమ స్వాధీనంలోకి తీసుకున్నాయి. 1939 సెప్టెంబరు నుంచి రష్యాలో కొత్తగా కలిసిన ప్రాంతాలవలన రష్యా సరిహద్దు 150-200 మైళ్ళు పశ్చిమంగా జరిగి రష్యాకు అదనంగా రక్షణ ఏర్పడింది. రెండు కోట్ల 30 లక్షల జనాభా రష్యాతో కలిసింది.
3. మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచమంతా ఏకమై రష్యాను ఏకాకిని చేసి దాడి చేసే ప్రమాదం నుంచి ఈ సంధి కాపాడింది. ఈ సంధి జరగకపోతే బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాల సహకారంతో హిట్లర్ రష్యామీద దాడి చేసే ప్రమాదం ఉంది. తూర్పు నుండి జపాన్ దాడి చేసేది. ఈ సంధి తర్వాత 1941లో జర్మనీ దాడి చేసినప్పుడు రష్యా ఒంటరిగా లేదు. అప్పటికే బ్రిటన్ జర్మనీల మధ్య యుద్ధం ప్రారంభమైంది.
4. ఈ సంధి జర్మనీ మిత్ర దేశాలకు తీవ్రమైన అసంతృప్తి కలిగించింది. ముస్సోలినీ, ఫ్రాంకోలు బహిరంగంగానే ఈ సంధిని వ్యతిరేకించారు. జపాన్ ఈ సంధి జరిగేనాటికి రష్యాతో యుద్ధం చేస్తోంది. పశ్చిమాన్నుంచి హిట్లర్ దాడి చేస్తే తాను చేతులు కలుపుతానని తెలియజేసింది. తనను సంప్రదించకుండా రష్యాతో హిట్లర్ చేసుకున్న ఒడంబడిక జపాన్ కు చాలా ఆగ్రహాన్ని కలిగించింది. ఖాల్కిన్ గోల్ యుద్ధం రష్యాకు అనుకూలంగా ముగిసింది. ఈ యుద్ధంలో రష్యా సైనిక శక్తి జపాన్ అనుభవంలోకి వచ్చింది. ఫలితంగా 1941లో జర్మనీ రష్యామీద కొన్ని వారాలలో దాడి చెయ్యబోతోందనగా జపాన్ రష్యాతో నిరాక్రమణ సంధిని కుదుర్చుకుంది. జర్మనీ రష్యామీద దాడి చేసినప్పుడు తటస్థంగా ఉంది కాని తూరుపు వైపు నుంచి రష్యా మీద దాడి చెయ్యలేదు.

స్టాలిన్ కు బద్ధ శత్రువు అయన బ్రిటిష్ ప్రధాని చర్చిల్, రష్యా ఆనాడు ఉన్న పరిస్థితిలో ఈ సంధి అత్యంత వాస్తవికమైనది అన్నాడు. 'సోవియట్లు తూర్పు పోలెండులో నాజీలను అడ్డుకున్నారు...' అని అభినందించాడు. జార్జ్ బెర్నార్డ్ షా హిట్లర్ ను అడ్డుకున్నందుకు స్టాలిన్ ను అభినందిస్తూ లండన్ టైమ్స్ లో రాశాడు.

తూర్పు పోలెండులో రష్యన్ సైన్యాల ప్రవేశం హిట్లర్ తో చేతులు కలిపి జర్మనీ, రష్యాలు పోలెండును పంచుకోవడంగా కాక, జర్మనీ పోలెండును ఆక్రమిస్తుంటే హిట్లర్ ను అడ్డుకోవడంగా భావించడమే సమంజసంగా ఉంటుంది.

ఈ నిరాక్రమణ సంధి కొంత వ్యవధినిస్తుందే కాని జర్మనీతో యుద్ధం అనివార్యం అని స్టాలిన్ కు తెలుసు.

రష్యా – ఫిన్లాండు సరిహద్దు యుద్ధం

ఫిన్లాండు 600 సంవత్సరాల పాటు స్వీడన్ లో ఒక రాష్ట్రంగా ఉండి, 1808లో రష్యా అధీనంలోకి వచ్చింది. ఫిబ్రవరి విప్లవంలో జార్ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఫిన్లాండు స్వాతంత్ర్యాన్ని కోరింది కాని కెరెన్స్కీ ప్రభుత్వం అంగీకరించలేదు. అక్టోబరు విప్లవం తర్వాత మాత్రమే ఫిన్లాండు ఒక స్వతంత్ర దేశమైంది. ఫిన్లాండులో కమ్యూనిస్టుల నాయకత్వాన ఒక విప్లవం జరిగింది కాని జర్మన్ సైన్య సహాయంతో ఫిన్నిష్ ప్రభుత్వం ఆ తిరుగుబాటును అణచి వేసింది. బోల్షివిక్ విప్లవం వల్లనే ఫిన్లాండుకు స్వాతంత్ర్యం లభించినా ఫిన్నిష్ బూర్జువా ప్రభుత్వం బోల్షివిక్ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించసాగింది. ఫిన్లాండులో ఉన్న ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని జర్మన్ సైన్య సహాయంతో మాజీ జారిస్టు జనరల్ మేనర్ హీం కూలద్రోశాడు. అతని నాయకత్వంలో ఫిన్లాండు సోవియట్ వ్యతిరేక కుట్రలకు స్థావరమైంది.

1920 లో జర్మనీ తదితర దేశాల సహకారంతో ఫిన్లాండు రష్యా మీద దాడి చేసింది. బలహీనంగా

Edit with WPS Office
ఉన్న సోవియట్ ప్రభుత్వం అక్టోబరు 14న ఫిన్లాండుతో కఠినమైన షరతులతో కూడిన ఒక ఒప్పందం మీద సంతకం చెయ్యాల్సి వచ్చింది. ఈ కఠిన మైన షరతులలో రెండు ఏమిటంటే – 1) ఫిన్లాండు ఆక్రమించిన నికెల్ గనులున్న ప్రాంతాన్ని సోవియట్ ప్రభుత్వం గుర్తించాలి 2) రష్యన్ – ఫిన్నిష్ సరిహద్దును పునర్విభజించాలి. ఈ పునర్విభజనతో సరిహద్దు లెనిన్ గ్రాడ్ నగరానికి 18 మైళ్ళ సమీపానికి చేరుతుంది. లెనిన్ గ్రాడ్ కు రక్షణ లేకుండా పోతుంది.

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పర్యవేక్షణలో లెనిన్ గ్రాడ్ మీద దాడికి అనేక దుర్గాలతో కూడిన మేనర్ హీం రేఖను నిర్మించడం జరిగింది. ఫిన్లాండు కు కేవలం 150 విమానాలున్నా 2,000 విమానాలకు ఆశ్రయమివ్వగల విమానాశ్రయాలను నిర్మించడం జరిగింది.

మరో ప్రపంచ యుద్ధం అనివార్యమవుతున్న పరిస్థితులలో, లెనిన్ గ్రాడ్ రక్షణ గురించి ఆందోళన పడుతున్న సోవియట్ ప్రభుత్వం, సరిహద్దును సురక్షితం చెయ్యడానికి ఫిన్నిష్ ప్రభుత్వానికి 1939 అక్టోబరులో ఒక ప్రతిపాదన పంపింది. సోవియట్ ప్రభుత్వం ఫిన్లాండును ఆక్రమించాలని కాని, ఫిన్లాండు స్వాతంత్ర్యాన్ని హరించాలని కాని కోరలేదు. కేవలం లెనిన్ గ్రాడ్ రక్షణకు 1920లో నిర్ణయించబడిన సరిహద్దులను తిరిగి నిర్ణయించాలని కోరింది.

ఫిన్లాండు సరిహద్దుకు 32 కి.మీ సమీపంలో ఉన్న లెనిన్ గ్రాడ్ నగర రక్షణకు ఎదురవుతున్న సమస్యలు వివరించి, లెనిన్ గ్రాడ్ రక్షణను బలపరచడానికి నాలుగు దీవులూ, హేంకో ఓడరేవూ లీజు మీద రష్యాకి ఇవ్వమని రష్యన్ ప్రభుత్వం ఫిన్లాండును కోరింది. దీనికి బదులుగా సోవియట్ కెరీలియానుంచి రెట్టింపు భూభాగాన్ని ఫిన్లాండుకు ఇవ్వడానికి రష్యా సిద్ధపడింది. ఈ ప్రదేశం సారవంతమైనదే కాని వ్యూహరీత్యా సోవియట్ యూనియన్ కు అంత ప్రాముఖ్యతగలది కాదు. కాని జర్మనీ, బ్రిటన్ ల ప్రోత్సాహంతో ఫిన్లాండు ఈ ప్రతిపాదనను నిరాకరించి యుద్ధ ప్రకటన చేసి విదేశీ సహాయం కోరింది. పెట్టుబడిదారీ మీడియా పశ్చిమ దేశాలలో జరుగుతున్న జర్మన్ దురాక్రమణ గురించి మాట్లాడకుండా రష్యా-ఫిన్లాండు యుద్ధం గురించి పెద్ద ఎత్తున సోవియట్ వ్యతిరేక ప్రచారం చెయ్యసాగింది.

జర్మనీతో 'శాంతియుత యుద్ధం' చేస్తున్న బ్రిటన్, ఫ్రాన్స్ లు (1939 సెప్టెంబర్ లో జర్మనీ పోలెండు మీద దాడి చేసిన తర్వాత బ్రిటన్, ఫ్రాన్స్ లు జర్మనీ మీద యుద్ధం ప్రకటించాయి) ఈ బోల్షివిక్ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి ఫాసిస్టు ఇటలీ, అమెరికాలతో చేతులు కలిపి 700 విమానాలూ 1500 ఫిరంగులూ 6000 మర తుపాకులూ సరఫరా చేశాయి. ఫ్రెంచ్ సైన్యం టర్కీనుంచి సోవియట్ యూనియన్ మీద దాడి చెయ్యడానికీ, రష్యాలోని బాకూ చమురు గనులను విమాన దాడులలో నాశనం చెయ్యడానికీ, సన్నాహాలు చేసింది. 50,000 మంది సైనికులను సిద్ధం చేసింది. బ్రిటిష్ ప్రధాన మంత్రి రష్యాతో యుద్ధం చెయ్యడానికి లక్షమంది సైనికులను పంపిస్తున్నట్లు ప్రకటించాడు.

ఈ సైన్యం ఫిన్లాండు చేరేలోగా ఫిన్లాండు ఓడిపోయింది. రష్యాతో 1940 మార్చ్ 14న సంధి చేసుకుంది. ఈ శాంతి ఒడంబడిక ప్రకారం సోవియట్ యూనియన్ లెనిన్ గ్రాడ్ రక్షణకు అవరమైన భూభాగాన్ని, దీవులను స్వాధీనం చేసుకుంది. కాని యుద్ధంలో ఆక్రమించిన నికెల్ గనుల ప్రాంతాన్ని ఫిన్లాండుకు తిరిగి ఇచ్చివేసింది. ఈ యుద్ధాన్ని దురాక్రమణ యుద్ధంగా పెట్టుబడిదారీ దేశాలు ప్రచారం చేశాయి కాని ఇది కేవలం సరిహద్దు సంఘర్షణ మాత్రమే.

ఫిన్లాండు మీద విజయం రష్యాకు తేలికగా లభించలేదు. ఈ యుద్ధంలో 40,000 మంది రష్యన్ సైనికులు మరణించారు. ఈ యుద్ధంలో రష్యన్ సైన్య బలహీనతలు వెల్లడయ్యాయి. ఈ యుద్ధ అనుభవాల్ని సమీక్షించి ఎర్ర సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించి సమూలంగా మార్పులు చేసే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున తలపెట్టాడు స్టాలిన్.

సోవియట్ యూనియన్ బలహీనంగా ఉన్న తొలి సంవత్సరాలలో 1918 లో రుమేనియా బెస్సారాబియాను ఆక్రమించింది. అక్కడ నివసించే ప్రజలు రుమేనియన్లు కారు, ఆరు సంవత్సరాలలో ఈ ప్రజలు 153 సార్లు తిరగబడ్డారు. రష్యా రుమేనియా దురాక్రమణను ఎన్నడూ గుర్తించలేదు. ఈ ప్రదేశం కోసం యుద్ధం చెయ్యాలని కూడా అనుకోలేదు. హిట్లర్ యూరోపును ఆక్రమిస్తుంటే రష్యా బెస్సారాబియాను రష్యాకు తిరిగి అప్పగించాలని కోరింది. యుద్ధం లేకుండానే ఈ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంది.

Edit with WPS Office
ఎస్తోనియా, లాత్వియా, లిథుయేనియా లలో అంతర్గతంగా ఘర్షణ జరుగుతోంది. ఈ దేశాలకు రష్యాతో సైనిక ఒడంబడిక ఉంది. అక్కడ రష్యన్ నావికా స్థావరాలు ఉన్నాయి. కాని అక్కడి ప్రభుత్వాలు అర్ధ ఫాసిస్టు రాజ్యాలు, హిట్లర్ అనుకూల ప్రభుత్వాలు. హిట్లర్ ప్రమాదం తీవ్రమవుతున్నప్పుడు ఈ దేశాలలోకి సోవియట్ యూనియన్ అదనపు సైన్యాలను పంపింది. జర్మన్ అనుకూల ప్రభుత్వాలు కూలిపోయి కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఎస్తోనియా, లాత్వియా, లిథుయేనియాలో సోవియట్ యూనియన్ లో చేరాయి. ఈ రాజ్యాలనుంచి 5 లక్షలమంది జర్మన్లను వెళ్ళగొట్టడం జరిగింది. ఈ రాజ్యాలు శతాబ్దాలుగా జర్మన్ భూస్వాముల అధీనలో ఉన్నాయి. అక్టోబరు విప్లవకాలంలో ఏర్పడిన స్థానిక కమ్యూనిస్టు ప్రభుత్వాలను కూలద్రోయడానికి జర్మన్ సైన్యాన్ని ఆహ్వానించినది వీరే. ఈ పంచమాంగ దళాన్ని వెళ్ళగొట్టడం వలన రష్యాకు రక్షణ లభించింది.

ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తున్న ప్రముఖ పాత్రికేయుడు వాల్టర్ లిప్ మేన్, 'బాల్టిక్ రాజ్యాలనుంచి నల్ల సముద్రం వరకూ రష్యా ఒక బ్రహ్మాండమైన రక్షణ రేఖను నిర్మిస్తోందన్న విషయం రోజు రోజుకు స్పష్టమవుతోంది' అని రాశాడు.

రెండో ప్రపంచయుద్ధ ప్రారంభం

1939 సెప్టెంబరు 1వ తేదీన జర్మనీ పోలెండు మీద దాడి చేసింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు రష్యాను ఏకాకిని చేసి ఒంటరిగా జర్మనీతో పోరాడేలా చెయ్యాలని ఎన్ని కుట్రలు పన్నినా చివరకు ఈ యుద్ధం పెట్టుబడిదారీ దేశాల మధ్య యుద్ధంగానే ప్రారంభమైంది కాని జర్మనీ-రష్యాల మధ్య యుద్ధంగా ప్రారంభం కాలేదు. 1941 జూన్ లో జర్మనీ రష్యా మీద దాడి చేసినప్పుడు అమెరికా, బ్రిటన్ లు జర్మనీకి వ్యతిరేకంగా రష్యాతో చేతులు కలపాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది అతి ముఖ్యమైన పరిణామం.

జర్మనీ పోలెండు మీద దాడి చెయ్యగానే బ్రిటన్ పోలెండు తరఫున పోరాడుతానని ప్రకటించింది. తర్వాత ఫ్రాన్స్ కూడా అటువంటి ప్రకటనే చేసింది. బ్రిటన్, ఫ్రాన్స్ లు జర్మనీ మీద యుద్ధం ప్రకటించడంతో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది.

పోలెండ్ మీద దాడిలో ప్రపంచానికి మొట్టమొదటిసారి జర్మన్ మెరుపుదాడి (Blitzkrieg) అనుభవంలోకి వచ్చింది. నేలమీద వందల టాంకులతో జర్మన్ సైన్యం అతివేగంగా పురోగమించసాగింది. జర్మన్ విమానాలు 48 గంటలలో పోలిష్ వైమానిక బలగాన్ని నాశనం చేసి పోలిష్ నగరాల మీదా సైన్యాల మీదా ప్రజలమీదా నిరాటంకంగా బాంబులు వేస్తూ, మరతుపాకులతో కాల్చి చంపుతూ, భీభత్సం సృష్టించసాగాయి. జర్మన్ పేరాట్రూపర్లు పోలిష్ సైన్యం వెనుక దిగి అల్లకల్లోలం సృష్టించసాగారు. వారం రోజుల్లో 35 డివిజన్ల పోలిష్ సైన్యం నాశనమైంది. పోలిష్ ప్రభుత్వం దేశం వదలి పారిపోయింది. పోలెండు 'రాజులేని రాజ్యం' అయింది. 'పోలెండు రాజధానిగా వార్సా ఇంకెంత మాత్రం లేదు. పోలిష్ ప్రభుత్వం ఎక్కడుందో ఎవరికీ తెలియదు. సోవియట్ యూనియన్ కు ఒక ప్రమాదాన్ని సృష్టించగల ప్రదేశంగా పోలెండు మారింది.' అన్నాడు మాలటోవ్ 1939 సెప్టెంబరు 17న.

జర్మన్ సైన్యం నిరాటంకంగా పోలెండునంతా ఆక్రమిస్తూ రష్యా సరిహద్దులకు చేరి ఒక ప్రమాదంగా మారబోతున్న తరుణంలో సోవియట్ సైన్యం తూర్పు వైపునుండి పోలెండులో ప్రవేశించింది. పైన చెప్పినట్లు తూర్పు పోలెండు ప్రజలు పోల్స్ కారు. తూర్పు పోలెండులోని యుక్రెయన్లూ, బెలో రష్యన్లు రష్యన్ సైన్యాన్ని ఆహ్వానించారు.

బ్రిటన్, ఫ్రాన్సు లు జర్మనీ మీద యుద్ధం ప్రకటించాయి. ఫ్రెంచ్, జర్మన్ సైన్యాలు ఎదురెదురుగా మోహరించబడ్డాయి కాని తుపాకీ పేలలేదు. సెప్టెంబరు మొదటివారంలో ప్రారంభమైన ఈ యుద్ధంలో మొట్టమొదటి బ్రిటిష్ సైనికుడి మరణం డిసెంబరు 9వ తేదీన సంభవించింది. పెట్రోల్ డ్యూటీలో ఉన్న ఒక కార్పోరల్ ప్రమాదవశాత్తూ మరణించాడు. అంత శాంతియుతంగా, పెద్దమనిషి తరహాగా సాగింది ఈ రెండు సైన్యాల మధ్యా యుద్ధం. జర్మన్లు ఈ యుద్ధాన్ని వేళాకోళంగా 'కూర్చుని చేసే యుద్ధం' (Sitzkrieg) అనేవారు. పశ్చిమ దేశాలలో 'మాయ యుద్ధం' (phoney war) అనేవారు.

యుద్ధానంతరం న్యూరెంబర్గ్ లో జరిగిన యుద్ధ నేరస్తుల విచారణలో జర్మన్ జనరల్ జోడెల్ '...

Edit with WPS Office
మేము 1939లోనే కూలిపోలేదంటే దానికి కారణం పోలిష్ యుద్ధ కాలంలో 23 జర్మన్ డివిజన్లకు ఎదురుగా మోహరించబడిన 110 ఫ్రెంచ్, బ్రిటిష్ డివిజన్లు ఆయుధాలు చేపట్టక పోవడమే....' అని జర్మనీ విజయం వెనుక ఉన్న అసలు కారణాన్ని వెల్లడించాడు. లొంగుబాటు ధోరణిని వదలి యుద్ధం చేస్తే బ్రిటన్, ఫ్రాన్స్ లు ఈ 23 డివిజన్ల జర్మన్ సైన్యాన్ని చాలా తేలికగా నాశనం చెయ్యగలిగేవి. యుద్ధం జర్మనీ ఓటమితో ముగిసేది. కొన్ని వేల ప్రాణాలు ఈ యుద్ధంలో బలైనా ప్రపంచ యుద్ధాన్ని నివారించి కొన్ని కోట్ల ప్రాణాలు కాపాడగలిగేవి.

బలి మీద బలి ఇస్తూ హిట్లర్ ను తృప్తి పరచి రష్యా మీదకు ఉసిగొల్పాలని ఎత్తులు వేస్తున్న బ్రిటన్, ఫ్రాన్స్ లు చివరకు తాము తీసిన గోతిలో తామే పడ్డాయి. ఈ మాయ యుద్ధం త్వరలోనే నిజ యుద్ధంగా మారింది.

జర్మనీ దాడి చేసి డెన్మార్క్, నార్వే, బెల్జియం, హాలెండ్, లగ్జెంబర్గ్ లను స్వాధీనం చేసుకుంది. 1940 మే 10 – జూన్ 25ల మధ్య ఆరువారాలు జరిగిన యుద్ధంలో యూరోపులో అతి శక్తివంతమైన దేశంగా పేరుపొందిన ఫ్రాన్స్ ఓడిపోయింది. ఫ్రాన్స్ లో పోరాడడానికి వచ్చిన బ్రిటిష్ సైన్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సముద్రం దాటి బ్రిటన్ కు పారిపోయింది.

ఫ్రాన్స్ పరాజయం రష్యాకు ఆందోళన కలిగించింది. యుద్ధం రష్యా తలుపులు తట్టుతున్నదన్న భావం బలపడింది. ఫ్రెంచ్ సైన్యం శక్తివంతమైనదనే అభిప్రాయం రష్యాకు ఉంది. ఆరు వారాలలో ఫ్రెంచ్ సైన్యం ఓడిపోవడం రష్యన్లను భయాందోళనలకు గురిచేసింది. దేశ రక్షణను బలపరచడానికి రష్యా తీవ్ర చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. 1940 జూన్ 26 నుండి సోవియట్ పరిశ్రమలన్నీ యుద్ధ ప్రాతిపాదిక మీద పని చెయ్యడం ప్రారంభించాయి. 8 గంటల పనిదినం, ఆరు రోజుల పని వారం అమలులోకి వచ్చాయి. కార్మికులూ ఉద్యోగులూ అనుమతిలేకుండా వారి ఫాక్టరీలనూ ఆఫీసులనూ వదలి మరో ప్రదేశానికి వెళ్ళడం నిషేధించబడింది. పని దొంగలనీ పనిలో అలసత్వం చూపించేవారినీ అతి కఠినంగా శిక్షించాలని అదేశాలు ఇవ్వడం జరిగింది. రైల్వే కార్మికుల స్కూళ్ళలోనూ వృత్తి విద్యా పాఠశాలల్లోనూ ఫాక్టరీ స్కూళ్ళలోనూ కార్మికుల నైపుణ్యం పెంచడానికి నూతన శిక్షణా విధానం అమలులోకి వచ్చింది.

బ్రిటన్ తో సంధికి హిట్లర్ ప్రయత్నాలు

ఫ్రెంచ్ పరాజయం తర్వాత హిట్లర్ బ్రిటన్ తో శాంతి ఒడంబడికకు ప్రయత్నించాడు. వెనుక తట్టులో ఉన్న సోవియట్ రష్యాని నాశనం చెయ్యకుండా బ్రిటన్ మీద దాడి చేసే ఉద్దేశం హిట్లర్ కు లేదు. ఎప్పుడూ ఒక రంగంలోనే యుద్ధం చెయ్యడం అతని వ్యూహం. రెండు రంగాలలో - పశ్చిమాన బ్రిటన్ తో, తూర్పున రష్యాతో - యుద్ధం చెయ్యడం జర్మనీ వినాశనానికి దారి తీస్తుందని అతనికి తెలుసు. బ్రిటన్ తో సంధి కుదుర్చుకుని రష్యా మీద దాడి చెయ్యాలని అతని ఆలోచన.

'... బ్రిటిష్ సామ్రాజ్యవాదం కొనసాగవలసిన ఆవశ్యకత గురించీ బ్రిటిష్ సామ్రాజ్యవాదం ప్రపంచాన్ని ఎలా నాగరికం చేసిందీ.... బ్రిటిష్ సామ్రాజ్యాన్ని మెచ్చుకుంటూ (హిట్లర్) మాట్లాడడం మాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. యూరోపులో జర్మనీ ఆధిక్యతను బ్రిటన్ గుర్తించాలని మాత్రమే తను కోరుతున్నట్లు హిట్లర్ చెప్పాడు... బ్రిటన్ కు అగౌరవం కాని విధంగా బ్రిటన్ తో శాంతి ఒడంబడిక కుదుర్చుకోవాలన్నదే తన లక్ష్యం అని చెప్పాడు....' (1939 మే 24న జరిగిన ఒక సైనిక సమావేశంలో హిట్లర్ ప్రసంగం గురించి జనరల్ బ్లూమింట్రిట్).

'... బ్రిటన్ ను పాదాక్రాంతం చెయ్యడం జర్మనీకి లాభించదు. మనం ఇంగ్లండును ఒక సైనిక శక్తిగా నాశనం చేస్తే బ్రిటిష్ సామ్రాజ్యం ముక్కచెక్కలవుతుంది. జర్మన్ రక్తం ఒలికించి మనం సాధించేదేమీ ఉండదు. బ్రిటిష్ సామ్రాజ్యం ముక్కచెక్కలయితే జపాన్, అమెరికా, ఇతర దేశాలూ మాత్రమే లాభపడతాయి...' (మరొక జర్మన్ జనరల్ హాల్డర్ తో హిట్లర్).

ఇటువంటి ఆలోచనలతో డంకిర్క్ వద్ద అవకాశం చిక్కినా బ్రిటిష్ సైన్యాన్ని నాశనం చెయ్యకుండా బ్రిటన్ పారిపోనిచ్చాడు హిట్లర్. డంకిర్క్ వద్ద 1,94,000 బ్రిటిష్ సైన్యం పడవలలో, ఓడలలో సముద్రం దాటి ఇంగ్లండు పలాయనం సాగిస్తుంటే జర్మన్ వైమానిక దళం, జర్మన్ సైన్యం దాడి చెయ్యకుండా నిలిచిపోయాయి. ఘోర అపజయం పొంది అవమానాలు పాలు కాకుండా బ్రిటన్ తో ఉదారంగా వ్యవహరించి శాంతి ఒడంబడిక కుదుర్చుకుని రష్యా వైపు వెళ్ళాలని అతని ఆలోచన. 'నా పోరాటం'

Edit with WPS Office
లో చెప్పినట్లు అతని ప్రధానోద్దేశం యూరోపునంతా ఆక్రమించడం.

జర్మన్ సైన్యాలు సముద్రం దాటి బ్రిటన్ మీద దాడి చెయ్యకపోయినా జర్మన్ వైమానిక దళం ఇంగ్లండ్ మీద పెద్ద ఎత్తున దాడులు చేసింది. లండన్ నగరం బాంబుల దాడికి గురయింది. సముద్ర యుద్ధం కూడా జరిగింది. అయితే విమాన దాడులు ఆస్తి, ప్రాణ నష్టాలు కలుగజేస్తాయే కాని నిర్ణయాత్మకమైన విజయాలు సాధించలేవు. ఈ విమాన యుద్ధ లక్ష్యం బ్రిటన్ ను ఆక్రమించడం కాక బ్రిటన్ మీద ఒత్తిడి తీసుకు వచ్చి, సంధి చేసుకుని, రష్యా వైపు తిరగడంగా కనుపిస్తుంది.

ఇటువంటి పరిస్థితులలో 1941 మే 10వ తేదీన నాజీ పార్టీలో హిట్లర్, గొయరింగ్ ల తర్వాత మూడో స్థానంలో ఉన్న రుడాల్ఫ్ హెస్ ఒక చిన్న విమానంలో ఇంగ్లండుతో శాంతి సంభాషణలు జరపడానికి స్కాట్లండ్ చేరాడు. ఈ ఉదంతం పెద్ద దుమారాన్ని సృష్టించింది. అతను ఎవరి అనుమతి లేకుండా స్కాట్లండ్ వెళ్ళాడని జర్మన్ కథనం. బెర్లిన్ లోని బ్రిటిష్ దౌత్య కార్యాలయంలో ఫస్ట్ సెక్రటరీగా ఉన్న కిర్క్ పేట్రిక్ బ్రిటిష్ ప్రభుత్వం తరఫున హెస్ తో సంభాషణలు జరిపాడు. జూన్ 10వ తేదీన బ్రిటిష్ ప్రభుత్వం హెస్ తో సంప్రదింపులకు లార్డ్ సైమన్ ను పంపించింది. మొదటి ప్రపంచ యుద్ధంలో తగిలిన గాయాల కారణంగా హెస్ మానసికంగా భ్రమలకు లోనవుతున్నాడని అతన్ని ఒక మానసిక రోగిగా ప్రచారం చేసింది జర్మనీ. ఈ ఉదంతం గురించి బ్రిటన్, జర్మనీలు చేస్తున్న ప్రకటనలను స్టాలిన్ నమ్మలేదు. జర్మనీ బ్రిటన్ తో సంధి చేసుకుని రష్యా మీద యుద్ధం చెయ్యాలని చూస్తోందనీ, చర్చిల్, హిట్లర్ లు రష్యాకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారనీ స్టాలిన్ మొదటినుంచీ అనుమానిస్తున్నాడు. హెస్ స్కాట్లండ్ వెళ్ళడం స్టాలిన్ అనుమానాన్ని బలపరిచింది.

ఫ్రాన్స్ తో సహా యూరోపునంతా జర్మనీ ఆక్రమించింది. బ్రిటిష్ సైన్యాలను యూరోపునుంచి తరిమివేసింది. బ్రిటన్ తో సంధి చేసుకుని తూర్పు వైపుకు తిరగడానికి ప్రయత్నిస్తోంది. జర్మనీ తరువాతి లక్ష్యం సోవియట్ యూనియన్ అన్నది స్పష్టమయింది.

ఆపరేషన్ బార్బరోస్సా

'మనం నేషనల్ సోషలిస్టులం....ఆరు వందల సంవత్సరాల క్రితం ఆగిపోయిన చోటు నుంచి మళ్ళీ ప్రయాణం ప్రారంభిస్తాం. అప్పటినుంచీ ఎడతెగకుండా దక్షిణానికీ పశ్చిమ యూరోపు వైపుకూ సాగుతున్న మన ప్రయాణాన్ని ఆపు చేసి తూరుపు భూముల మీదకు దృష్టి సారిద్దాం....యూరోపులో కొత్త భూభాగం అంటే ముఖ్యంగా రష్యా, దాని అధీనంలో ఉన్న రాజ్యాలూ అని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. దైవమే మనకు ఈ దారి చూపిస్తున్నట్లుంది. తూరుపున ఉన్న ఈ బ్రహ్మాండమైన దేశం ముక్కచెక్కలవడానికి సిద్ధంగా ఉంది....' (హిట్లర్ - 'నా పోరాటం' - Mein Kempf).

సోవియట్ యూనియన్ - జర్మనీ నిరాక్రమణ సంధి జరిగిన రెండు నెలల తర్వాత, 1939 అక్టోబరు 18న జరిగిన ఒక సమావేశంలో భవిష్యత్తులో రష్యా మీద దాడిచెయ్యడానికి జర్మన్ సైన్యాలను సమీకరించాలని హిట్లర్ నిర్ణయించాడు. అయితే పశ్చిమాన ఫ్రాన్స్ తదితర దేశాలను ఆక్రమించిన తర్వాత మాత్రమే జర్మనీ రష్యా మీద దాడి చెయ్యాలని హిట్లర్ ఉద్దేశం.

1940లో ఫ్రాన్స్ పతనం తర్వాత హిట్లర్ ఆలోచనలు మళ్ళీ రష్యా వైపుకు తిరిగాయి. పశ్చిమాన అతను సురక్షితంగా ఉన్నాడు. రష్యామీద దాడి చెయ్యడానికి అతనికి పరిస్థితి అనుకూలంగా ఉంది.

1940 సంవత్సరం జులై అంతంలో జరిగిన మరో సమావేశంలో 1941 వసంత కాలంలో రష్యాపై దాడి చెయ్యాలన్న తన అభిప్రాయాన్ని హిట్లర్ వెల్లడించాడు. రష్యాను ఒక్క వేటులో ముక్కలు చెక్కలు చెయ్యగలిగితేనే ఈ యుద్ధం ప్రారంభించాలన్నాడు. రష్యాలో అధిక భూభాగాన్ని ఆక్రమించడం మాత్రమే కాదు, అసలు రష్యాను తుడిచి పెట్టేయడం తన లక్ష్యం అన్నాడు. రెండు జర్మన్ సైన్యాలు - ఒకటి ఉత్తరంగా బాల్టిక్ రాజ్యాల వైపు, మరొకటి దక్షిణంగా కీవ్ వైపు - పురోగమించి రెండు వైపులనుంచి మాస్కో దగ్గర కలుసుకుని రష్యాను అడకత్తెరలో బిగించి నాశనం చెయ్యాలి. పశ్చిమ రంగంలో రక్షణకు 60 డివిజన్ల సైన్యం ఉంటుంది; 120 డివిజన్ల సైన్యం రష్యా మీద దాడి చేస్తుంది. ఈ యుద్ధం 1941 మేలో ప్రారంభమై, ఐదు నెలలలో, శీతాకాలం ప్రారంభం కావడానికి ముందే

Edit with WPS Office
ముగుస్తుందని హిట్లర్ అన్నాడు.

1940 ఆగస్టులో పశ్చిమ రంగం నుంచి రష్యా సరిహద్దున ఉన్న పోలెండుకు జర్మన్ సైన్యాలను తరలించడం ప్రారంభమైంది. ఇంత పెద్ద ఎత్తున సైన్యాలను తరలిస్తుంటే రష్యన్లకు తెలియకపోదు. వీటి లక్ష్యం రష్యాయే కాబట్టి సహజంగానే రష్యన్లలో భయాందోళనలు కలుగక మానవు. సైన్యంలో ఉన్న వయసు మళ్లిన సైనికులను పరిశ్రమలకు తరలించి వారి స్థానంలో యువకుల్ని పంపిస్తున్నామనీ అందుచేత ఈ తరలింపు అవసరమైందనీ జర్మనీ రష్యన్ ప్రభుత్వానికి చెప్పింది.

1940 డిసెంబరు 18న హిట్లర్ డైరెక్టివ్ నం. 21 - రష్యా మీద దాడికి పథకం - మీద సంతకం చేశాడు. ఈ పథకం ఆపరేషన్ బార్బరోస్సా గా చరిత్రలోకి ఎక్కింది. కొన్ని మార్పు చేర్పులతో హిట్లర్ ఇంతకు ముందు వేసిన పథకమే ఇది. రష్యా మీద దాడి 1941 మే నెల మధ్యలో ప్రారంభమవుతుంది. పశ్చిమ రష్యాలో ఉన్న ఎర్ర సైన్యం మీద దాడి చేసి కల్లోల పరచి, ఎర్ర సైన్యాలు విశాలమైన రష్యన్ లోతట్టుకు (rear) తిరోగమించకుండా అడ్డుకుని నాశనం చెయ్యాలని హిట్లర్ ఆదేశించాడు.

ఈ పథకం లక్ష్యం వోల్గా నది నుంచి ఆర్కేంజిల్ వరకూ రక్షణ రేఖను నిర్మించి యూరోపియన్ రష్యా నుంచి ఏషియా రష్యాను విడదీయడం. ఇంతకు ముందు వేసిన పథకంలో లాగానే ఉత్తర, దక్షిణ దిక్కుల నుంచి జర్మన్ సైన్యం దాడి చేసి మాస్కో దగ్గర కలిసి మాస్కోను ఆక్రమిస్తుంది. 'ఈ నగరాన్ని ఆక్రమించడం రాజకీయంగా, ఆర్థికంగా నిర్ణయాత్మకమైన విజయం అవుతుంది. మాస్కో ముఖ్యమైన రైల్వే కూడలే కాకుండా ఆయుధ పరిశ్రమల కేంద్రం' అన్నాడు హిట్లర్. రష్యన్ ధాన్యాగారం యుక్రెయిన్, రష్యన్ పరిశ్రమలలో దాదాపు 60 శాతం ఉన్న డోనెట్స్ బేసిన్ ఆక్రమించడం కూడా మరొక లక్ష్యం.

1941 ఫిబ్రవరి 3న మరో యుద్ధ సమావేశం మధ్యాహ్నం నుంచి సాయంకాలం ఆరు గంటల వరకూ జరిగింది. రష్యన్ బలగాలు 155 డివిజన్లు అనీ జర్మన్ బలగాలు కూడా అంతేననీ అయితే జర్మన్ బలగాలు సుశిక్షితమైన మేలు రకం సైన్యాలు అనీ, డైరెక్టివ్ నం. 21లో ఆదేశించిన విధంగా ఎర్ర సైన్యాన్ని తిరోగమించకుండా అడ్డుకుని నాశనం చెయ్యలనీ జర్మన్ జనరల్స్ కు హిట్లర్ వివరించాడు.

'రష్యాతో జరిగే ఈ యుద్ధం పెద్ద మనుషుల మధ్య యుద్ధంగా జరుగదు. ఈ పోరాటం రెండు సిద్ధాంతాల మధ్యా రెండు జాతుల మధ్యా జరిగే పోరాటం' అన్నాడు హిట్లర్.

నిజమే! హిట్లర్ అన్నట్లు రష్యాతో ఈ యుద్ధం 'పెద్ద మనుషుల' మధ్య యుద్ధం లా జరుగదు. జర్మనీ ఫ్రాన్స్ మీద దాడి చేసినప్పుడు, ఫ్రెంచ్ కార్మికులంటే భయపడే ఫ్రెంచ్ బూర్జువా ఫ్రెంచ్ ప్రజలను సాయుధం చెయ్యడానికి సాహసించ లేకపోయింది. సైన్యం ఓడిపోగానే తెల్ల జెండా ఎత్తి జర్మన్ బూర్జువా తో చేతులు కలిపి ఫ్రాన్స్ ను హిట్లరుకు శాంతియుతంగా, 'పెద్దమనిషి తరహాగా', అప్పగించింది. కాని కమ్యూనిస్టు రష్యా శాంతియుతంగా తన ప్రజలను బానిసలుగా మార్చదు. తన సంపదను జర్మనీకి అప్పగించదు. శాంతియుతంగా తన స్వాతంత్ర్యాన్ని కోల్పోదు. ప్రజలంటే భయపడని ప్రభుత్వం ప్రజలందరినీ సాయుధుల్ని చేసి ఈ యుద్ధాన్ని ప్రజాయుద్ధంగా మారుస్తుంది. తమ చెమటతో తడిసిన పొలాలూ ఫాక్టరీలూ నగరాలూ కాపాడుకోవడం కోసం, తమ దేశంలో ప్రతీ అంగుళం కోసం, సోవియట్ ప్రజలు పోరాడుతారు. సోవియట్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలందరూ ఒక్కటై లేచి హిట్లరును సమాధి చేస్తారు.

కాని రష్యా ఈ విజయం వైపు అగ్ని తుఫానులో ప్రయాణించాలి. పచ్చటి నేల భగ్గుమంటుంది. లెనిన్ గ్రాడ్ దిగ్బంధంలో తినడానికి తిండిలేక కృశించి పోతుంది. స్టాలిన్ గ్రాడ్ మంటల సముద్రంలో మునిగి పోతుంది. నలభై లక్షల సోవియట్ పౌరులు బానిసలుగా జర్మనీకి తరలించబడతారు. లక్షలమంది యుద్ధ ఖైదీలుగా కాన్సెంట్రేషన్ కేంపుల్లో నశించిపోతారు. సోవియట్ పౌరులు మృత్యు కర్మాగారాలలో కాలి బూడిదవుతారు. రెండు కోట్ల ఏభై లక్షల మంది సోవియట్ పౌరులు యుద్ధానికి బలైపోతారు.

రష్యా ఒక సైనిక శక్తిగా, ఒక ఆర్థిక శక్తిగా నామరూపాలు లేకుండా నాశనమవడం మాత్రమే కాదు, ఒక దేశంగా కూడా మిగలదు. రష్యన్లు జర్మన్ బానిసలుగా మాత్రమే, జర్మన్లకు సంపద సృష్టించడానికి మాత్రమే, జీవించాలి - ఇదీ ఆపరేషన్ బార్బరోస్సా లక్ష్యం.

రష్యా భవిష్యత్తు ఎంతో భయంకరంగా ఉండబోతోంది.

Edit with WPS Office

యూగోస్లోవియాలో తిరుగుబాటు

ఈ లోగా యూగోస్లోవియాలో ఒక సంఘటన జరిగింది. యూగోస్లోవియాలో జర్మన్ అనుకూల ప్రభుత్వం ఉంది. ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 1941 మార్చి 26-27 రాత్రి యూగోస్లోవియా వైమానిక దళ నాయకుల నాయకత్వంలో ఒక తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాటుకు సైన్యం మద్దతు కూడా ఉంది. కొత్త ప్రభుత్వం జర్మనీతో నిరాక్రమణ సంధి చేసుకోవడానికి సంసిద్ధతను ప్రకటించింది. యూగోస్లోవియా జర్మనీ చేతుల్లో కీలుబొమ్మలా ఉండాలని హిట్లర్ కోరిక. కొత్త ప్రభుత్వం కీలుబొమ్మలా ఆడదలుచుకోలేదు. యూగోస్లోవియా రాజధాని బెల్ గ్రేడ్ లో ప్రదర్శనల సందర్భంలో జనం జర్మన్ మంత్రి కారు మీద ఉమ్మేయడం కూడా జరిగింది.

ఈ తిరుగుబాటు వార్త తెలియగానే హిట్లర్ మండి పడ్డాడు. మార్చి27న జరిగిన ఒక సైనిక సమావేశంలో యూగోస్లోవియా తిరుగుబాటు వలన ఆపరేషన్ బార్బరోస్సా ప్రమాదంలో పడిందనీ యూగోస్లోవియాను ఒక సైనిక శక్తిగా, ఒక దేశంగా నామరూపాలు లేకుండా నాశనం చెయ్యాలని తాను నిర్ణయించాననీ హిట్లర్ తెలియజేశాడు. విమాన దాడులు జరిపి బెల్ గ్రేడ్ నగరాన్ని నేలమట్టం చెయ్యమని వైమానిక దళాధిపతి గొయరింగ్ ను ఆదేశించాడు. యూగోస్లోవియా సంక్షోభం ముగిసేవరకూ నాలుగు వారాల పాటు ఆపరేషన్ బార్బరోస్సాను వాయిదా వెయ్యాలని హిట్లర్ నిర్ణయించాడు.

ఆవేశంలో హిట్లర్ తీసుకున్న ఈ నిర్ణయం హిట్లర్ జీవితంలో ఘోరమైన తప్పిదమనీ, ఈ నిర్ణయం వలన జర్మనీ శీతాకాల ప్రారంభానికి ముందే మాస్కోను ఆక్రమించగల బంగారు అవకాశాన్ని పోగొట్టుకుందనీ జర్మన్ చరిత్రకారులూ పశ్చిమ దేశాల చరిత్రకారులూ చెబుతుంటారు. హిట్లర్ ను గొప్ప మిలిటరీ ప్రతిభగల వ్యక్తిగా చిత్రించే మరి కొందరు ఆపరేషన్ బార్బరోస్సా టైం టేబులు యూగోస్లోవియా తిరుగుబాటు వలన పెద్దగా మారలేదనీ, ఆ సంవత్సరంలో మంచు కరుగు కాలం ఆలస్యంగా ప్రారంభమైందనీ, దాని వలన తూరుపు యూరోపులోని రోడ్లన్నీ బురదతో నిండిపోయి సైన్యాన్ని తరలించడానికి అనుకూలంగా లేకపోవడం వలన నాలుగు వారాల పాటు వాయిదా వెయ్యాల్సి వచ్చిందనీ చెబుతారు.

యూగోస్లోవియాలో తిరుగుబాటు జరుగకుండా ముందు అనుకున్నట్లు మే లోనే హిట్లర్ రష్యా మీద దాడి చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదా? జర్మనీ పరాజయానికి రష్యన్ ప్రజల ప్రతిఘటనా శక్తినీ ధైర్య సాహసాలనూ కాక యూగోస్లోవియా తిరుగుబాటూ, వానలూ, బురదా, మంచూ కారణాలుగా చూపిస్తారు బూర్జువా చరిత్రకారులు. జర్మనీ ఓటమికి కారణాలు ఏమిటో ముందు ముందు చూద్దాం.

యూగోస్లోవియా తిరుగుబాటును నిర్దాక్షిణ్యంగా అణచి వేసి రష్యా మీద దాడికి సన్నద్ధమైంది జర్మనీ.

జర్మన్ దాడి మరో తొమ్మిది గంటలకు ప్రారంభమవుతుందనగా జూన్ 21 ఉదయం తొమ్మిది గంటలకు రష్యన్ విదేశాంగ మంత్రి మాలటోవ్ జర్మన్ రాయబారి షులెన్ బర్ గర్ ను తన ఆఫీసులో కలుసుకున్నాడు. 'జర్మన్ ప్రభుత్వం రష్యా పట్ల అసంతృప్తితో ఉన్నట్లు కనుపిస్తున్నది. జర్మనీ-సోవియట్ యూనియన్ల మధ్య యుద్ధం రాబోతున్నదన్న వార్తలు వినవస్తున్నాయి. జర్మన్-సోవియట్ సంబంధాలు ఎందువలన ప్రస్తుత దశకు చేరుకున్నాయో వివరిస్తే సంతోషిస్తా'నన్నాడు మాలటోవ్ జర్మన్ రాయబారితో. ఆ రాత్రి జర్మన్ రాయబారి మాలటోవ్ సందేశాన్ని టెలిగ్రాంద్వారా బెర్లిన్ కు పంపించాడు. సమాధానంగా జర్మన్ విదేశాంగ మంత్రి రిబ్బన్ ట్రాప్ దగ్గర నుంచి జూన్ 21 తేదీ ఉన్న సుదీర్ఘమైన రహస్య సందేశం అందింది. దాని మీద 'వెరీ అర్జంట్, సీక్రెట్, రాయబారి మాత్రమే చూడాలి' అని ఉంది.

Edit with WPS Office

టెలిగ్రాం అందిన వెంటనే రాయబార కార్యాలయంలో ఉన్న సైఫర్ యంత్రాన్నీ రేడియోనూ ధ్వంసం చెయ్యాలనీ, జర్మన్ ప్రభుత్వం దగ్గరనుంచి అర్జంటు సందేశం ఒకటున్నదని చెప్పి మాలటోవ్ ను కలుసుకుని ఈ ప్రకటన అందచెయ్యాలనీ ఆ టెలిగ్రాంలో ఉంది.

ప్రకటన సారాంశమేమిటంటే - 'నాజీ జర్మనీ జర్మన్-సోవియట్ యూనియన్ సంధి షరతులన్నీ తూచా తప్పకుండా అమలు జరుపుతుండగా రష్యా ఆ సంధిని అనేక మార్లు ఉల్లంఘించింది. జర్మనీకి వ్యతిరేకంగా గూఢచార చర్యలూ విధ్వంసక చర్యలూ టెర్రరిస్టు చర్యలూ సాగించింది..... యూరోపులో స్థిరమైన విధానాన్ని నెలకొల్పాలని జర్మనీ చేస్తున్న ప్రయత్నాలకు రష్యా అడ్డుపడుతోంది.....రుమేనియా, బల్గేరియాలలో జర్మన్ దళాలపై దాడి చెయ్యడంలో బ్రిటన్ తో చేతులు కలిపి కుట్ర చేసింది. సరిహద్దుల్లో బాల్టిక్ నుంచి నల్ల సముద్రం దాకా తన సైన్యాలను కేంద్రీకరించి జర్మనీకి ప్రమాదంగా తయారైంది. జర్మనీ మీద దురాక్రమణ చేసే ఉద్దేశం రష్యాకు ఉన్నదా అని ఇంతకాలంగా జర్మనీకి ఉన్న సందేహం ఈ చర్యల వలన తొలగింది. క్లుప్తంగా చెప్పాలంటే, సోవియట్ యూనియన్ జర్మనీని, యూరోపునూ బలహీన పరిచే చర్యలు సంధికి విరుద్ధంగా తీసుకుంది. జర్మన్ వ్యతిరేక విదేశాంగ విధానం అవలంబిస్తోంది. సరిహద్దులలో సైన్యాలను కేంద్రీకరించింది. జీవన్మరణ పోరాటంలో ఉన్న జర్మనీ మీద వెనుకనుంచి దాడి చెయ్యడానికి రష్యా సిద్ధమవుతోంది. అందుచేత ఫ్యూరర్ (హిట్లర్) జర్మనీకి ఏర్పడ్డ ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి తగిన చర్యలుతీసుకోవాలని జర్మన్ సైన్యాన్ని ఆదేశించాడు'.

'...ఇది యుద్ధం. ఈ యుద్ధం చెయ్యడం న్యాయమని నీకు అనిపిస్తోందా?' - నిర్ఘాంతపోయిన మాలటోవ్ జర్మన్ రాయబారిని అడిగాడు (ఇది కేవలం కల్పితమనీ తను అలా అనలేదనీ మాలటోవ్ తన 'జ్ఞాపకాలు' లో వివరించాడు). జర్మన్ రాయబారి రష్యన్-జర్మన్ సంబంధాలు మెరుగుపరచడానికి కృషి చేసిన వ్యక్తి. అతనికి నిజానిజాలు తెలుసు. అతను ఏమీ సమాధానం చెప్పలేకపోయాడు (తర్వాత షులెన్ బర్ గర్ పదవినుంచి తొలగించబడి జర్మనీ చేరుకున్నాడు. హిట్లరును వ్యతిరేకించిన జనరల్స్ తోనూ రాజకీయవేత్తలతోనూ చేయి కలిపాడు. 1944 జులైలో హిట్లర్ మీద విఫల హత్యా ప్రయత్నం సందర్భంగా అరెస్టయ్యాడు. నవంబరు 10న గెస్టపో (జర్మన్ రహస్య పోలీసు సంస్థ) అతన్ని ఉరితీసింది).

బెర్లిన్ లోని రష్యన్ రాయబారి ఆ రోజు మధ్యాహ్నం నుంచీ జర్మన్ విదేశాంగ మంత్రి రిబ్బన్ ట్రాప్ ను కలవడానికి ప్రయత్నిస్తున్నాడు. తెల్లవారగట్ల నాలుగు గంటలకు రిబ్బన్ ట్రాప్ అతన్ని కలుసుకుంటాడని సందేశం వచ్చింది. రష్యన్ రాయబారి అతన్ని కలుసుకుని సరిహద్దు అతిక్రమణల విషయం గురించి ప్రస్తావించబోతుంటే 'విషయం అది కాదు' అంటూ విషయమేమిటో తెలియజేశాడు రిబ్బన్ ట్రాప్. తాము సమావేశం అవుతున్న ఆ సమయంలో జర్మన్ సైన్యాలు రష్యా మీద చర్య తీసుకుంటున్నాయని తెలియజేశాడు. నిర్ఘాంతపోయిన రష్యన్ రాయబారి త్వరలోనే తేరుకుని ఈ పరిణామాలకు జర్మనీ బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పి లేచి, రిబ్బన్ ట్రాప్ తో కరచాలనం చెయ్యకుండానే బయటకు వెళ్ళిపోయాడు.

జర్మన్లు యుద్ధం ప్రారంభించవచ్చునని వార్తలు వస్తున్న తరుణంలో జూన్ 21న మాస్కోలో పాలిట్ బ్యూరో సమావేశం జరిగింది. యుద్ధ ప్రమాదం గురించి సైన్యాన్ని హెచ్చరించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. రాత్రి జర్మన్ దాడి ప్రారంభం కాబోతున్నదనగా, మాస్కో నుంచి సైనిక హై కమాండు సరిహద్దుల్లో ఉన్న కమాండర్లకు టెలిగ్రాంల ద్వారా ఆదేశాలు పంపించింది. జూన్ 22న కాని 23న కాని హఠాత్తుగా జర్మనీ దాడి చెయ్యవచ్చుననీ ఈ దాడి కవ్వింపు చర్యలతో ప్రారంభం కావచ్చుననీ హై కమాండు హెచ్చరించింది. జర్మనీ కవ్వింపు చర్యలుగా భావించే ఏ చర్యలూ ఎర్ర సైన్యం తీసుకోరాదనీ అదే సమయంలో సైన్యం రహస్యంగా రక్షణ స్థావరాలలోకి ప్రవేశించాలనీ వైమానిక బలగాలను వివిధ ప్రదేశాలలో సురక్షితంగా ఉంచాలనీ విమాన విధ్వంసక శతఘ్ని దళాలు సిద్ధంగా ఉండాలనీ నగరాలలో బ్లాకౌట్ (రాత్రివేళ దీపాలు తీసెయ్యడం) అమలు జరపాలనీ పౌర రక్షణ చర్యలు తీసుకోవాలనీ ఆదేశించింది. ఇదంతా జూన్ 22 ఉదయానికి ముందే అత్యంత రహస్యంగా జరగాలనీ లేకపోతే జర్మన్లు ఇవి యుద్ధ చర్యలుగా పరిగణించి యుద్ధానికి దిగే అవకాశం ఉందనీ హెచ్చరించింది. ఈ టెలిగ్రాంలు సరిహద్దుల్లో ఉన్న సైన్యానికి చేరే లోగానే జర్మన్ దాడి ప్రారంభమైంది. కొంతమంది

Edit with WPS Office
కమాండర్లకు దాడికి ముందే టెలిగ్రాంలు అందినా తగిన చర్యలు తీసుకోడానికి వ్యవధి చిక్కలేదు.

జూన్ 21వ తేదీ అర్ధ రాత్రి, జర్మన్ రష్యన్ ఫిరంగులు లక్ష్యాల మీద గురి పెట్టబడి, కొన్ని గంటలలో యుద్ధం ప్రారంభం కాబోతున్న సమయంలో, పొగలు చిమ్ముకుంటూ బెర్లిన్ - మాస్కో ఎక్స్ ప్రెస్ పొంచి ఉన్న జర్మన్ సైనిక శ్రేణుల గుండా సరిహద్దులో నది వంతెన దాటి రష్యాలోని బ్రెస్ట్ - లిటోవస్క్ వైపుకు వెళ్ళింది. శాంతి కాలంలో ఆ ఆఖరి రైలు ప్రయాణ దృశ్యం చూస్తున్న జనరల్ బ్లూమింట్రిట్, ఆ రైలు బండి అలా ప్రశాంతంగా జర్మన్ శ్రేణుల మధ్య నుంచి వెళ్ళడం 'మాయగా, వింతగా' అనిపించింది అని రాశాడు.

శాంతి ఆఖరి క్షణాలు అవి.

జూన్ 22వ తేదీ తెల్లవారగట్ల 3.30 నిమిషాలకు 35 లక్షల జర్మన్ సైన్యం సరిహద్దు దాటి రష్యా మీద అకస్మాత్తుగా దాడి చేసింది. ఒక జర్మన్ చరిత్రకారుని కథనం ప్రకారం 'జర్మన్ సైనికులు విజయంలో పూర్తి విశ్వాసంతో రష్యా పై విరుచుకు పడ్డారు.'

Edit with WPS Office

గర్జించు రష్యా
గాండ్రించు రష్యా
పర్జన్య శంఖం
పలికించు రష్యా

- శ్రీశ్రీ

Edit with WPS Office

అధ్యాయం రెండు

జర్మన్ మెరుపు దాడి - తొలి దినాలు

రష్యా గర్జిస్తుంది, గాండ్రిస్తుంది, పర్జన్య శంఖం పలికిస్తుంది. జర్మన్ మెరుపుదాడిని విజయవంతంగా ఎదుర్కొని అజేయమని విర్రవీగుతున్న హిట్లర్ మూకలను బెర్లిన్ దాకా తరిమికొడుతుంది - అదంతా భవిష్యత్తులో. జూన్ 22న మాత్రం రష్యా పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉంది.

సోవియట్ నవలలలో, సినిమాలలో, జర్మన్ దురాక్రమణ యుద్ధం అకస్మాత్తుగా ప్రారంభమైనట్లు చిత్రిస్తుంటారు - 'జీవితం ఆనందంగా శాంతిగా గడుస్తుండగా జూన్ 22న ఆ ఆదివారం నాడు అకస్మాత్తుగా....' అంటూ ప్రారంభమవుతుంది.

ఈ యుద్ధం నిజంగా అకస్మాత్తుగా ప్రారంభమైందా? జర్మన్ దాడి గురించి హెచ్చరికలు లేవా? అంటే యుద్ధం రాబోతోందని హెచ్చరికలూ ఉన్నాయి, యుద్ధం అకస్మాత్తుగానూ ప్రారంభమైంది - రెండూ వాస్తవమే. ఎంతో కాలంగా ఎప్పుడెప్పుడా అని ప్రతీ ఒక్కరూ ఎదరుచూస్తున్న యుద్ధం వచ్చింది. ఆ రావడం ఆకాశం లోంచి పిడుగు పడ్డట్టు అకస్మాత్తుగా వచ్చింది.

మెరుపుదాడి (Blitzkrieg) శత్రువు ఆదమరిచి ఉన్నప్పుడు అకస్మాత్తుగా దాడి చేసే ఎత్తుగడ. వేగం, కదలిక, వైమానిక, టాంకు, పదాతి దళాల మధ్య సమన్వయం, సహకారాల మీద ఆధారపడిన ఎత్తుగడ. జర్మన్ సైన్యం టాంకుల్నీ విమానాలనీ వేల సంఖ్యలో కేంద్రీకరించి దాడి చేసి శత్రు సైన్యం క్రమ పద్ధతిలో తిరోగమించకుండా చెల్లా చెదరు చేస్తూ, శత్రువు వెనుక వైపు చేరి చుట్టుముట్టి, వెనుకతట్టు నుంచి శత్రువుకు సరఫరాల అందకుండా అడ్డుకుని నాశనం చేసేది. ముందుగా వందల స్టుకా డైవ్ బాంబర్లు చెవులు చిల్లులు పడేలా సైరన్లు మోగిస్తూ హఠాత్తుగా ఆకాశం మీంచి దిగి తమ లక్ష్యాల మీద విరామం లేకుండా బాంబుల వర్షం కురిపించేవి. పెద్ద ఎత్తున జరిగే ఈ విమాన దాడి సైన్యంలో, పౌరులలో విపరీతమైన భయోత్పాతం కలిగించేది. ఈ విమాన దాడి ఆగీ ఆగగానే, ఆ షాకు నుంచి కోలుకునే వ్యవధి ఇవ్వకుండానే, టాంకులు దాడి చేసేవి. టాంకులతో పాటు మోటారు వాహనాల మీద వేగంగా ప్రయాణించే సైనిక దళాలుండేవి. ఒక లక్ష్యం జయించిన తర్వాత ఈ సైన్యం ఆగదు. మరో లక్ష్యం వైపు పరుగులు తీస్తుంది. జర్మన్ సైన్యం నుంచి పారిపోతున్న లక్షల పౌరులతో రోడ్లు నిండిపోయి దాడికి గురయిన దేశ సైన్యం కదలికలకు అంతరాయం కలిగేది. దీనికితోడు జర్మన్ పేరాట్రూపర్లు శత్రు సైన్యం వెనుక దిగి వంతెనలూ, రవాణా, సమాచార కేంద్రాలూ పేల్చి వేస్తుండేవారు. జర్మన్ పంచమాంగ దళం విధ్వంస చర్యలు సాగిస్తూ నీలి వార్తలు ప్రచారం చేసేది.

ఈ జర్మన్ మెరుపుదాడిని ఎలా ఎదుర్కోవాలో తెలియక ప్రభుత్వాలూ సైన్యాలూ స్థంభించిపోయేవి. పోలెండ్, ఫ్రాన్స్ లు ఈ ఎత్తుగడను ఎదుర్కోలేక వారాలలో కూలిపోయాయి. 'మానవ శక్తి దీన్ని తట్టుకోలేదు' అని బెర్లిన్ లోని అమెరికన్ రాయబారి తనతో అన్నట్లు అన్నా లూయిస్ట్రాంగ్ 'స్టాలిన్ యుగం' అన్న పుస్తకంలో రాసింది.

దీర్ఘ కాలిక యుద్ధం చెయ్యడానికీ ఆ యుద్ధంలో కలిగే భయంకరమైన నష్టాలను తట్టుకోవడానికీ శక్తి లేని జర్మనీకి ఈ మెరుపుదాడి ఎత్తుగడ అనివార్యమైంది. తొలి రోజునే ప్రధాన బలగాలన్నింటినీ రంగంలోకి దించి, నష్టాలను లక్ష్య పెట్టకుండా దాడి చేసి, శత్రువు కోలుకుని తన బలగాలను యుద్ధానికి సంసిద్ధం చెయ్యడానికి అవకాశం ఇవ్వకుండా చావు దెబ్బలు కొట్టడం వలన తక్కువ నష్టాలతో

Edit with WPS Office
బలమైన శత్రువును ఓడించవచ్చునన్న అవగాహన మీద ఆధారపడిన ఎత్తుగడ ఇది. ఒకవేళ శత్రువు మొదటి దెబ్బకు నాశనమవ్వకపోతే? శత్రువు మొదటి దెబ్బలో లాగా ఆదమరచి ఉండకపోయినా, పూర్తిగా కోలుకోవడానికి ముందు రెండోసారి, మూడోసారి మిగిలిన సైన్యాన్నంతా కేంద్రీకరించి దాడులు చెయ్యవచ్చు. ఈ దెబ్బలు కూడా తట్టుకుని శత్రువు నిలబడగలిగితే? యుద్ధం దీర్ఘకాలిక యుద్ధంగా పరిణమిస్తే? జర్మనీ సర్వనాశనానికి గురయ్యే ప్రమాదం ఉంది. మెరుపుదాడి జూదం లాంటిది. హిట్లర్ కు ఆ విషయం బాగా తెలుసు.

ఫ్రాన్స్ మీద దాడి చేయబోతున్నప్పుడు హిట్లర్ '....ఈ దాడిని ఒక 'జూదం'గా, 'విజయానికీ', 'వినాశనానికీ' మధ్య ఒక ఎంపికగా అతను వర్ణించాడు.....' 'నేను ఈ పోరాటంలో నిలవనైనా నిలుస్తాను, లేదా కూలిపోతాను. నా ప్రజల ఓటమి తర్వాత నేను ఉండను' అన్నాడు....' (B. H. Liddel Hart, The German Generals Talk, p. 110).

ఈ జూదంలో హిట్లర్ ఇంతవరకూ గెలిచాడు. అతను ఊహించినట్లుగానే అతి స్వల్ప నష్టాలతో జర్మనీ ఈ ఎత్తుగడతో దాదాపు యూరోపునంతా గెలిచింది.

రష్యా మీద దాడి కూడా ఇటువంటి జూదమే. తను స్వయంగా చెప్పినట్లు హిట్లర్ ఈ జూదంలో గెలిస్తే నిలుస్తాడు, ఓడితే కూలిపోతాడు. రష్యా ఆంతరంగిక ఘర్షణలతో శిథిలమైపోయి ఒక తాపు తంతే కూలిపోడానికి సిద్ధంగా ఉన్నదనే, జర్మనీతో యుద్ధంలో తొలి అపజయాలు స్టాలిన్ మీద ఒక సైనిక, రాజకీయ తిరుగుబాటుకు దారి తీస్తాయనే, భావన మీద ఈ దాడి ప్రధానంగా ఆధారపడి ఉంది.

'రష్యామీద దాడి ఒక రాజకీయ తిరుగుబాటును తీసుకు వస్తుందనే ఆలోచన మీద యుద్ధంలో విజయం గురించి ప్రధానంగా ఆశలు పెట్టుకోవడం జరిగింది. రష్యన్లు యుద్ధం చెయ్యకుండా తిరోగమించాలని నిర్ణయిస్తే, అటువంటి రాజకీయ తిరుగుబాటు లేకుండా అంతిమ విజయం సాధ్యం కాదని జనరల్స్ లో చాలామందిమి ముందే గుర్తించాం. తీవ్ర అపజయాలు సంభవించిన పక్షంలో సోవియట్ ప్రజలు స్టాలిన్ ను కూలద్రోస్తారనే నమ్మకం మీద అత్యాశలు పెట్టుకోవడం జరిగింది..' – (General Kleist, The German Generals Talk, p. 174).

'సుదీర్ఘ పోరాటానికి సన్నాహాలు ఏమీ లేవు. ఆకురాలు కాలానికి ముందే ఒక నిర్ణయాత్మక విజయం అనే భావన మీదే ప్రతీదీ ఆధారపడింది.' – (The German Generals Talk, p. 174).

హిట్లర్ తనకు అనుకూలమైన పరిస్థితులలో, మిగిలిన దేశాలు సైనికంగా, మానసికంగా, ఆయుధపరంగా సిద్ధంగా లేనప్పుడు, ప్రపంచ యుద్ధాన్ని రగిల్చాడు కాని అతనికి జర్మనీ బలహీనతలు తెలుసు. జర్మనీ ప్రపంచాధినేత అయినా కావాలి, లేదా సర్వ నాశనమైనా అవాలి. అంతవరకూ ఈ యుద్ధం ఆగదన్న సంగతి హిట్లర్ కు తెలుసు. తను ముందు దెబ్బ తియ్యకపోతే, ఇతర దేశాలకు కొంచెం వ్యవధి ఇస్తే, తగినంత సైన్యాన్ని, ఆధునిక ఆయుధాల్ని సమకూర్చుకుని ఆ దేశాలు తన మీద అనివార్యంగా దాడి చేస్తాయని కూడా హిట్లర్ కు తెలుసు.

'...సోవియట్ యూనియన్ తో యుద్ధం అనివార్యమవుతోందనీ, ఆ యుద్ధం మన మీద పడేదాకా వేచి కూర్చుంటే మన విజయావకాశాలు క్షీణిస్తాయనీ (హిట్లర్) 1941 మార్చి అంతంలో చెప్పాడు. ఆ సమయంలో, ఏ మాత్రం ఊగిసలాట చూపించినా బలాబలాలలో మార్పులు మనకు వ్యతిరేకంగా మారుతాయని అతను అంగీకరించాడు. మన శత్రువులకు అపారమైన వనరులున్నాయనీ, వాళ్ళు ఆ వనరులను ఇంకా వినియోగించడం ప్రారంభించలేదనీ అతను అన్నాడు. మన మానవ బలగాలను కాని, యుద్ధ నిర్వహణకు అవసరమైన సామగ్రి వనరులను గాని ఇంతకు మించి పెంచలేమని అతను అన్నాడు....' అన్నాడు ఫీల్డ్ మార్షల్ కైటెల్ (In the Service of the Reich – The Memoirs of Field Marshal Keitel, p. 156-57)

తొలి నెలలలో రష్యాలో కూడా ఈ జూదంలో హిట్లర్ నెగ్గుతున్నట్లే కనుపించింది. తొలి నెలలలో నష్టాలను లక్ష్యపెట్టక జర్మన్ సైన్యం రష్యా గుండెకాయ మాస్కో వైపుకు చొచ్చుకు పోయింది. జర్మన్ సైన్యం ఉత్తర రంగంలో లెనిన్ గ్రాడ్ వైపుకూ దక్షిణ రంగంలో రష్యన్ ధాన్యాగారం యుక్రెయిన్ వైపుకూ పరుగులు తీసింది. అన్ని రంగాలలోనూ రష్యన్ సైన్యం భయంకరమైన నష్టాలకు గురవుతూ రష్యన్ భూభాగాన్ని శత్రువుకు అప్పగిస్తూ రోజురోజుకూ వెనక్కు తిరోగమించాల్సి వచ్చింది.

రష్యన్ తిరోగమనానికి కారణాలు

Edit with WPS Office

తొలి నెలలలో రష్యన్ సైన్యాలు విపరీతమైన నష్టాలకు గురవుతూ తిరోగమించడానికి జర్మనీ ఆర్థిక, సైనిక శక్తి, సంవత్సరాలుగా యుద్ధ రంగంలో జర్మన్ సైన్యం గడించిన అనుభవం, ఒక్క వేటుతో రష్యాను ముక్కలు చేసి నాశనం చెయ్యాలని హఠాత్తుగా మెరుపుదాడి చేసిన తీరు, రష్యన్ సైన్యాలకు ఆధునిక యుద్ధ అనుభవం లేకపోవడం, ఆధునిక ఆయుధాల కొరత, జర్మనీ ఎలా దాడి చేస్తుందనే విషయం మీద రష్యన్ సైనిక నాయకత్వానికి ఉన్న తప్పుడు అవగాహన లాంటివి కొన్ని కారణాలు.

యుద్ధ ప్రారంభ సమయానికి జర్మనీ, జర్మనీ ఆక్రమణలో ఉన్న దేశాలతో సహా, సంవత్సరానికి 31.8 మిలియన్ టన్నుల ఉక్కు, 257. మి. టన్నుల బొగ్గు (ఉపగ్రహ రాజ్యాలను కూడా కలిపితే 439 మి.ట) ఉత్పత్తి చేస్తోంది. సోవియట్ యూనియన్ 18.3 మి. టన్నుల ఉక్కు, 165.9 మి. టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. జర్మనీ తన ఆర్థిక శక్తిని పూర్తిగా సైనిక అవసరాలకు అనుగుణంగా మార్చి బ్రహ్మాండమైన సైనిక శక్తిని సమకూర్చుకుంది. అతి స్వల్పకాలంలో 300 పెద్ద మందుగుండు ఫాక్టరీలను నిర్మించింది. యుద్ధ సామగ్రి ఉత్పత్తి 1939 కంటే 1940లో మూడింట రెండు వంతులు పెరిగింది. 1932తో పోల్చి చూస్తే 22 రెట్లు పెరిగింది. 1941లో జర్మన్ పరిశ్రమలు 11,000 విమానాలు, 5200 టాంకులు, కవచ శకటాలు (armoured vehicles), 7000 75mm ఫిరంగులు, 17 లక్షల తుపాకులు, సబ్ మెషీన్ గన్నులూ ఉత్పత్తి చేశాయి. ఇవి కాక జర్మనీ తన ఆక్రమణలో ఉన్న దేశాలనుండీ ఉపగ్రహ రాజ్యాలనుండీ పెద్దఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. ఆ దేశాల పారిశ్రామిక శక్తిని జర్మనీ తన సైనిక అవసరాలకు ఉపయోగించుకుంటోంది. యుద్ధ సమయానికి జర్మనీ ఆయుధ సంపత్తిలో రష్యా కంటే 5:2 ఆధిక్యతతో ఉంది.

రష్యా మీద దురాక్రమణ ప్రారంభమయ్యేనాటికి జర్మన్ సైన్యం సంఖ్య 85 లక్షలు. సైన్యంలో 60 లక్షలు, వైమానిక బలగాలలో 17 లక్షలు, మిగిలిన సైన్యం నావికాదళంలోనూ సహాయక సైన్యంలోనూ ఉంది. రష్యా మీద దాడి చేసిన 35 లక్షల జర్మన్ సైన్యానికి తోడుగా మిత్ర దేశాలు ఫిన్లాండు, రుమేనియా, హంగరీలకు చెందిన సైన్యాలున్నాయి. రష్యా మీద దాడి చేసిన సైన్యానికి 48,000 ఫిరంగులూ (artillery), 4,200 టాంకులూ, స్వయంచలిత శతఘ్నులూ (self-propelled artillery), 5,000 విమానాలూ ఉన్నాయి. యూరోపులోని ఆర్థిక, సైనిక వనరులన్నీ స్వాధీనం చేసుకున్న జర్మనీ తన సైన్యానికి అత్యంత ఆధునిక ఆయుధాలను సమకూర్చింది. వైమానిక, టాంకు, పదాతి దళాల దాడులను సమన్వయపరిచి నడిపించే అధునాతన రేడియో, టెలిఫోన్, టెలిగ్రాఫ్ సమాచార సాధనాలు ఈ సైన్యానికున్నాయి. జకోస్లోవేకియా, పోలెండ్, నార్వే, బెల్జియం, డెన్మార్క్ లాంటి దేశాలనే కాకుండా, యూరోపులో అతి శక్తివంతమైన దేశంగా పరిగణించబడిన ఫ్రాన్స్ ను, మిత్ర దేశం బ్రిటన్ సైన్యాలతో సహా రోజులలో, వారాలలో, మట్టి కరిపించిన సుశిక్షితమైన, అజేయమని కీర్తిగాంచిన, ఆత్మ విశ్వాసంతో ఉన్న సైన్యం అది.

రష్యన్ డిప్యూటీ కమాండర్ ఇన్ చీఫ్ మార్షల్ ఝుకోవ్ మాటలలో -

'.... సోవియట్ ప్రజలు మాతృదేశ రక్షణకు ఎంత కష్టమైన పోరాటం చెయ్యాల్సి వచ్చిందో యువతరం అర్థం చేసుకోవాలి. సాహిత్యం, జ్ఞాపకాలు, ఆత్మ కథలూ సోవియట్ సైనికులు ఎంత అనుభవం ఉన్న, ఎంత శక్తివంతమైన శత్రువుతో తలపడాల్సి వచ్చినదీ సరియైన అవగాహన ఇవ్వడం లేదు. జర్మన్ సైన్యంలోని ఆఫీసర్లూ సైనికులూ ఫ్రాన్స్ లో, యూరోపులో తేలికగా విజయాలు సాధించి మదోన్మత్తతో, జర్మనీ గురించీ జర్మన్ జాతి గురించీ గోబెల్స్ ప్రచారంతో విషపూరితమైన మనస్సులతో, అన్య జాతులకంటే జర్మన్ జాతి ఉన్నతమైన జాతి అనే అహంకారంతో, ఉన్నారు. సోవియట్ యూనియన్ నూ ఎర్ర సైన్యాన్నీ తేలికగా తుడిచి పెట్టేయగలమన్న విశ్వాసంతో ఉన్నారు. ముఖ్యంగా జర్మన్ వైమానిక, టాంకు బలగాలలో నాజీ సంస్థలకు చెందిన యువ సైనికులూ ఆఫీసర్లూ చాలా అహంభావంతో ఉండేవారు. యుద్ధం తొలి నెలలలో జర్మన్ యుద్ధ ఖైదీలను నేను ప్రశ్నించాను. హిట్లర్ చెప్పినదంతా వారు విశ్వసించారన్న విషయాన్ని నేను స్పష్టం చెయ్యాలి. వారి పోరాట శక్తి, ముఖ్యంగా వైమానిక, టాంకు బలగాలలో వారికి ప్రత్యేకంగా ఇవ్వబడిన శిక్షణా, నిస్సందేహంగా ప్రథమ శ్రేణికి చెందినది. జర్మన్ సైనికుడికి యుద్ధ రంగంలో తన విధి ఏమిటో తెలుసు. యుద్ధ రంగంలో ఆత్మ విశ్వాసంతో, క్రమ శిక్షణతో, ధైర్యంగా నిలబడి పోరాడేవాడు. స్టాలిన్ గ్రాడ్ లో పరాజయం తర్వాత జర్మన్ ఆఫీసర్లూ సైనికులూ తమ విశ్వాసం కోల్పోయారు. వారి మనో నిబ్బరం దెబ్బతింది. సోవియట్ సైనికుల ఎదురుగా నిలబడలేక పోయేవారు. కాని మొత్తం మీద సోవియట్ ప్రజలు తేలికగా ఓడించలేని, అనుభవం, ఆత్మ విశ్వాసం గల శత్రువుతో పోరాడవలసి వచ్చింది. జర్మన్ హెడ్ క్వార్టర్స్

Edit with WPS Office
బలగాలూ మిలిటరీ బలగాలూ ఆధునిక యుద్ధం యొక్క అన్ని విభాగాలలోనూ శిక్షణ పొందినవి. యుద్ధ రంగంలో పోరాడుతున్న దళాలతో వారు రేడియో ద్వారా సంపర్కం పెట్టుకునే వారు. పదాతి దళాలు తమకు ఇవ్వబడిన కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి కృషి చేసేవి. వీరికి తోడుగా అనుభవంగల వైమానిక దళం ఉండేది. దాడికి ముందు తరచు ఈ వైమానిక బలగాలు దాడి చేసి జర్మన్ పదాతి దళాల పురోగమనాన్ని సుకరం చేసేవి. యుద్ధం తొలి దశలో జర్మన్ ఉన్నత సైనికాధికారులు జాగ్రత్తగా తమ లక్ష్యాలను నిర్ణయించారు. రష్యా మీద దాడులకు నేతృత్వం వహించడానికి అనుభవంగల కమాండర్లను ఎన్నుకున్నారు. దాడులకు అవసరమైన బలగాలను తగిన విధంగా కేంద్రీకరించారు...' (G. Zhukov, Reminiscences and Reflections, Vol. 2, Page 106).

నాజీ జర్మనీతో యుద్ధం ఎలా ప్రారంభమవుతుందీ అనే విషయం మీద రష్యన్ జనరల్ స్టాఫ్ అంతవరకూ జరిగిన యుద్ధాలను దృష్టిలో పెట్టుకుని ఒక అవగాహనకు వచ్చింది.

మొదటి విషయం. జర్మనీ రష్యా మీద దాడి చేసినట్లయితే పశ్చిమ రంగంలో (అంటే జర్మన్ ఆక్రమణలో ఉన్న ఫ్రాన్స్ తదితర దేశాలలో) సగం సైన్యాన్ని ఉంచుతుందనీ, సగం సైన్యంతో మాత్రమే రష్యా మీద దాడి చేస్తుందనీ భావించడం జరిగింది. వాస్తవంలో ఆ రంగంలో జర్మనీ మూడవ వంతు సైన్యాన్ని మాత్రమే ఉంచింది. ఈ సైన్యం కూడా ద్వితీయ శ్రేణి సైన్యం. ప్రధమ శ్రేణి సైన్యాన్నంతా రష్యన్ రంగానికి పంపించింది.

రెండో విషయం. జర్మనీ-రష్యాల వంటి రెండు పెద్ద దేశాల మధ్య యుద్ధం పాత పద్ధతిలో మొదలవుతుందని - అంటే కొన్ని రోజులు సరిహద్దు దళాల మధ్య సంఘర్షణ జరుగుతుందనీ, తరువాత మాత్రమే ప్రధాన సైన్యాలు తలపడుతాయనీ - రష్యన్ సైనిక నాయకత్వం భావించింది. యుద్ధ సంఘర్షణలు మొదలైన తర్వాత సైన్యాన్ని సమీకరించి సరిహద్దులకు తరలించవచ్చునన్న అవగాహనతో ఉంది. తొలిరోజునే 35 లక్షల జర్మన్ సైన్యం దాడి చేసినప్పుడు అటువంటి దాడికి సిద్ధంగా లేని రష్యన్ సైన్యం తిరోగమించాల్సి వచ్చింది.

నాజీ జర్మనీ జూన్ 22న దాడి చేయబోతోందన్న విషయం స్టాలిన్ కు ముందే తెలుసా? తెలిసి అతను నిర్లక్ష్యం చేశాడా? ఈ ముఖ్యమైన ప్రశ్నకు మార్షల్ ఝుకోవ్ తన జ్ఞాపకాలలో ఇలా సమాధానం ఇచ్చాడు.

'..... (స్టాలిన్ అనంతరం).... ఆపరేషన్ బార్బరోసా పథకం గురించి యుద్ధ ప్రారంభంలోనే తెలిసిందనీ, జర్మన్ సైనిక బలగాలూ ఆయుధాలూ ఎలా మోహరించబడినదీ, శత్రువు ఏ దిశగా ప్రధాన దాడులు చెయ్యబోతున్నదీ సమాచారం ఉందనీ పత్రికలు రాయడం మొదలు పెట్టాయి. సోవియట్ గూఢచారి రిచర్డ్ సార్జ్, స్విడ్జర్లాండ్ లోనూ బ్రిటన్ లోనూ ఇతర దేశాలలోనూ ఉన్న సోవియట్ గూఢచారులూ ఈ సమాచారాన్ని రష్యన్ ప్రభుత్వానికి అందజేశారనీ, అయినా రాజకీయ, సైనిక నాయకత్వం ఈ ఏజెంట్ల రిపోర్టులను పట్టించుకోలేదనీ నిర్లక్ష్యం చేసిందనీ, ఆరోపించాయి.

ఇదంతా కట్టుకథ అని చెప్పడానికి నేను సందేహించను. నాకు తెలుసున్నంతవరకూ సోవియట్ ప్రభుత్వానికి కాని, రక్షణ కమిస్సారియేట్ కు గాని, జనరల్ స్టాఫ్ కు గాని అటువంటి సమాచారం చేరలేదు....' (G. Zhukov, Reminiscences and Reflections, Vol. I, Page 274).

సైనిక గూఢచార శాఖ సకాలంలో శత్రు సైన్యాల కదలికలనూ, దాడి చెయ్యబోతున్న ప్రాంతాలలో సైనిక మోహరింపులనూ కనుగొనగలిగిందా అన్న ప్రశ్నకు సమాధానం చెబుతూ, శత్రువు తన సైన్యాన్ని సరిహద్దుకు దూరంలో ఉంచి, యుద్ధ ప్రారంభ సమయానికి మాత్రమే నిర్ణీత ప్రాంతాలకు తరలించాడని ఝుకోవ్ వివరించాడు. ముఖ్యంగా టాంకు, కవచ శకటాలను సరిహద్దుకు చాలా దూరంలో ఉంచాడనీ, జూన్ 21వ తేదీ రాత్రి మాత్రమే అవి నిర్ణీత ప్రాంతాలలో మోహరించబడ్డాయనీ చెప్పాడు. అటువంటి పరిస్థితులలో శత్రువు కదలికల గురించి తెలుసుకోవడం చాలా కష్టమని వివరించాడు.

ఈ ఆరోపణ గురించి మాలటోవ్ సమాధానం చెబుతూ – '...హిట్లర్ తో యుద్ధం అనివార్యమని మాకు తెలుసు. కాని ఏ రోజున, కనీసం ఏ నెలలో అనేది అసలు ప్రశ్న.... మా గూఢచార శాఖ ఇచ్చే సమాచారాన్ని మేము నిర్లక్ష్యం చేశామని ఆరోపించడం జరుగుతోంది. గూఢచార శాఖ హెచ్చరించిన మాట వాస్తవమే.... ఈ రోజున హిట్లర్ దాడి చెయ్యవచ్చునని గూఢచార శాఖ 14 రోజులు సూచించింది. ఆ హెచ్చరికలను మేము లక్ష్య పెట్టి హిట్లర్ కు ఏ మాత్రం అవకాశం ఇచ్చినా, అంతకు ముందే అతను మా మీదా దాడి చేసేవాడు. ...గూఢచారులు నువ్వు మళ్ళీ కోలుకోలేని ప్రమాదకర పరిస్థితులలోకి

Edit with WPS Office
నెట్టగలరు. శత్రు గూఢచారులు అసంఖ్యాకమైన తప్పుడు వార్తలు ప్రచారంలో పెడుతుంటారు. ఆ కారణంగా గూఢచార శాఖ చెప్పే విషయాలను జాగ్రత్తగా పదే పదే పరిశీలించకుండా నమ్మకూడడు....' (Felix Chuev, Molotov Remembers, p.22)

జర్మన్ దాడి గురించి చర్చిల్ చేసిన హెచ్చరిక గురించి ప్రస్తావిస్తూ మాలటోవ్, 'జర్మనీ తో మేం యుద్ధంలో చిక్కుకునేలా అతను ప్రయత్నిస్తున్నాడు. అటువంటి చర్చిల్ ను ఈ విషయంలో నమ్మగలమా?' అన్నాడు. (Molotov Remembers, p. 28).

స్టాలిన్ మరణానంతరం జూన్ 21న కమాండర్లూ, స్టాఫ్ హాయిగా నిద్రపోతున్నారనీ లేదా రానున్న ప్రమాదం గురించి ఏ మాత్రం తెలియక కులాసాగా విలాసాలలో మునిగి తేలుతున్నారనీ రకరకాల కథలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ కథలు వాస్తవం కావు. మరునాడు యుద్ధం ప్రారంభమవుతుందనగా జూన్ 21న జనరల్ స్టాఫ్ అంతా డ్యూటీలో ఉంది అని కూడా ఝుకోవ్ రాశాడు.

స్టాలిన్ మరణం తర్వాత, దేశం వెనుక తట్టునుంచి ప్రధాన బలగాలను సకాలంలో సరిహద్దులకు తరలించి ఉంటే ఇంత నష్టం జరిగి ఉండేది కాదు అన్న విమర్శ ప్రారంభమైంది. ఈ విమర్శ గురించి ప్రస్తావిస్తూ మార్షల్ ఝుకోవ్, జర్మన్ సైనిక నాయకత్వం రష్యా తన ప్రధాన సైనిక బలగాలను సరిహద్దుకు తరలిస్తుందనీ, అలా తరలించిన ప్రధాన బలగాలను చుట్టుముట్టి నాశనం చెయ్యాలని ఆశించిందనీ, ఆపరేషన్ బార్బరోస్సా ప్రధాన లక్ష్యం అదేననీ వివరించాడు. అన్ని రంగాలలోనూ ఆధిక్యత, అనుభవం ఉన్న జర్మన్ సైన్యంతో రష్యన్ ప్రధాన బలగాలు తొలిదశలోనే తలపడితే సరిహద్దు సైన్యానికి పట్టిన గతే ప్రధాన బలగాలకు కూడా పట్టేదనీ, మాస్కో, లెనిన్ గ్రాడ్ ల రక్షణకు మరి సైన్యం మిగిలేది కాదనీ చెప్పాడు.

యుద్ధ మేఘాలు కమ్ముతుంటే, సమీప భవిష్యత్తులో యుద్ధ జ్వాలలు రష్యాకు కూడా వ్యాపించే ప్రమాదం ఉందని గుర్తించిన సోవియట్ ప్రభుత్వం 1940లో దేశ రక్షణను బలపరచడానికి అనేక చర్యలు తీసుకుంది కాని దేశ ఆర్థిక పరిస్థితి అతి స్వల్పకాలంలో ఈ చర్యలన్నీ పూర్తిగా అమలు జరపడానికి అవకాశం ఇవ్వలేదు. ఎర్ర సైన్యాన్ని పునర్వవస్థీకరిస్తున్న సమయంలో, సైన్యానికి నూతన ఆయుధాలు సమకూర్చి శిక్షణ ఇస్తున్న సమయంలో, ఆయుధ సామగ్రి నిలవలూ రిజర్వు సైన్యాలూ ఏర్పాటు చేస్తున్న సమయంలో - ఇదంతా పూర్తి కాకుండానే హఠాత్తుగా యుద్ధం ప్రారంభమైంది.

1941 జూన్ నాటికి రష్యన్ బలగాలు 50 లక్షలు. పశ్చిమ సరిహద్దు ప్రాంతాలలో 29 లక్షల సైన్యం ఉంది. పశ్చిమ సరిహద్దులోని నాలుగు జిల్లాలలోనూ 149 డివిజన్ల సైన్యం ఉంది. ఈ సైన్యంలో 48 డివిజన్లు సరిహద్దు నుంచి 10-50 కి. మి. దూరంలో ఉన్నాయి. సరిహద్దు జిల్లాల ప్రధాన బలగాలు సరిహద్దు నుంచి 80-300 కి. మీ. దూరంలో ఉన్నాయి. ఈ సైన్యం 3375 కి.మి. సరిహద్దును రక్షించాలి. ఇంత దీర్ఘమైన సరిహద్దులో శత్రువుకు తను ఎంచుకున్న రంగంలో తన బలగాలను కేంద్రీకరించి అనేక రెట్ల ఆధిక్యతతో దాడి చెయ్యడానికి అవకాశం ఉంటుంది. సరిహద్దులో ప్రతీ ప్రాంతాన్నీ ఎంత శక్తివంతమైన దేశం కూడా రక్షించలేదు. హఠాత్తుగా దాడిచేసే శత్రువు తేలికగా సరిహద్దులలో విజయాన్ని సాధించగలడు. జూన్ 22న అదే జరిగింది. విశాలమైన సరిహద్దులో తను ఎంచుకున్న ప్రాంతాలలో తన బలగాలను అధిక సంఖ్యలో కేంద్రీకరించి జర్మనీ హఠాత్తుగా దాడి చేసింది.

జర్మన్ దాడి - ఎర్ర సైన్యం ప్రతిఘటన

పోలెండ్ లో లాగానే ఈ మెరుపుదాడిలో కూడా పశ్చిమ రష్యాలోని రష్యన్ వైమానిక బలగాన్ని తొలి గంటల్లోనే జర్మన్ వైమానిక దళం తుడిచి పెట్టేసింది. రష్యన్ విమానాశ్రయాల మీద హఠాత్తుగా దాడి చేసి నేల మీద ఉండగానే రష్యన్ విమానాలను నాశనం చేసింది. జూన్ 22 మధ్యాహ్నానికి 1200 రష్యన్ విమానాలు ధ్వంసమయ్యాయి. మధ్య రంగంలో 528 విమానాలను నేలమీదా, 210 విమానాలను ఆకాశ యుద్ధంలోనూ రష్యా కోల్పోయింది. జర్మన్ వైమానిక దళం ఎదురు లేకుండా బాంబులు వేస్తూ, మర తుపాకులతో కాలుస్తూ, రోడ్లు, వంతెనలు, రైల్వే జంక్షన్ల మీద దాడి చేస్తూ, నగరాలను బూడిద చేస్తూ భయోత్పాతం సృష్టించసాగింది. జర్మన్ పేరాట్రూపర్లు ఎర్ర సైన్యం వెనుక దిగి కల్లోలం సృష్టించ సాగారు. తొలి రోజుల్లోనే రష్యన్లు వేల టాంకులను నష్టపోయారు.

జర్మన్ సైన్యాలు సరిహద్దు దాటి మూడు దిశలుగా - ఉత్తరాన లెనిన్ గ్రాడ్ వైపూ, మధ్య రంగంలో

Edit with WPS Office
మాస్కో వైపూ, దక్షిణాన యుక్రెయిన్, కకాసస్ ల వైపూ - విరుచుకు పడ్డాయి. వేల జర్మన్ టాంకులూ స్వయంచలిత భారీ ఫిరంగులూ, ఎర్ర సైన్యాలను చెల్లా చెదరు చేస్తూ వేగంగా రోజుకు ముప్ఫయి-నలభై మైళ్ళు పురోగమించసాగాయి. వీటితో పాటు మోటారు వాహనాలలో పదాతి దళాలు కూడా చాలా వేగంగా ముందుకు సాగాయి.

అజేయమని పేరుగాంచిన ఈ జర్మన్ సైన్యం ఏబ్ విల్లీ నుంచి ఫ్రాన్స్ వరకూ 185 మైళ్ళు పది రోజులలో పురోగమించింది. బెల్జియన్ వీరులనూ బ్రిటిష్ యోధులనూ ఫ్రెంచ్ సైన్యాన్నీ 65 మైళ్ళు, ఫ్లాండర్సు వరకూ, పది రోజులలో తరిమేసింది. రష్యన్ సైన్యం ఎన్ని రోజులు నిలబడగలదు? రష్యా నిపుణులు అని ఖ్యాతి పొందిన వారు జర్మనీ మూడు రోజులలోనో లేక మూడు వారాలలోనో మాస్కోను ఆక్రమించగలదని చెప్పారు.

తొలి రోజులలో సరిహద్దులలో పరిస్థితి ఎలా ఉంది?

(రష్యన్) జనరల్ ఫెడ్యూన్ స్కీ ఏప్రిల్ లో పశ్చిమ యుక్రేన్ లో ఉన్న కోవెల్ పట్టణంలో కమాండరుగా ఛార్జి తీసుకున్నాడు. ఈ పట్టణం (జర్మన్ ఆక్రమిత) పోలెండు సరిహద్దుకు 30 మైళ్ళ దూరంలో ఉంది. ఫిబ్రవరి నుండీ సరిహద్దుకావల జర్మన్ సైన్యం కదలికల గురించి వార్తలు వస్తున్నాయి. జర్మన్ విమానాలు తరచు సరిహద్దులు ఉల్లంఘిస్తున్నాయి. పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది.

జూన్ 18న ఒక జర్మన్ సైనికుడు సరిహద్దు దాటి రష్యన్ల వైపుకు వచ్చాడు. అతను తాగి ఉన్న స్థితిలో ఒక ఆఫీసరును కొట్టాడు. జర్మన్ సైన్యం శిక్షిస్తుందన్న భయంతో అతను రష్యన్ల వైపుకు వచ్చాడు. తన తండ్రి కమ్యూనిస్టు అనీ, జర్మనీ జూన్ 22 ఉదయం నాలుగు గంటలకు రష్యా మీద దాడి చెయ్యబోతోందనీ అతను చెప్పాడు. జనరల్ ఫెడ్యూన్ స్కీ వెంటనే స్టాఫ్ కమాండరుకు ఈ విషయం తెలియజేశాడు. ఇదంతా జర్మన్ల కవ్వింపు చర్య అనీ, అనవసరంగా భయభ్రాంతం కావద్దనీ కమాండర్ సర్ది చెప్పాడు. రెండు రోజుల తర్వాత పరిస్థితిని అధ్యయనం చెయ్యడానికి వచ్చిన జనరల్ రోకోస్సోవస్కీ పరిస్థితి తీవ్రంగా ఉందని ఆందోళన చెందుతాడు. జూన్ 22న జర్మన్ దాడి మొదలవుతుంది. జనరల్ ఫెడ్యూన్ స్కీ అధీనంలో ఉన్న 15వ సైన్యం 60 మైళ్ళ రక్షణ రేఖను కాపాడాలి. తొలి రోజులలో తన అనుభవాలను అతను ఇలా వివరించాడు.

'ఒక పక్క విమాన దాడులు, మరో పక్క విరామం లేకుండా ఫిరంగి గుళ్ళ వర్షం.... సైనిక యూనిట్ల మధ్య సంబంధాలు తరచు తెగిపోసాగాయి. ఆదేశాలు చాలా ఆలస్యంగా చేరసాగాయి. అయినా ఆఫీసర్లు యూనిట్లతో సంబంధాలు కోల్పోలేదు. యుద్ధం ప్రారంభమైన వెంటనే మేము సరిహద్దు స్థావరాలకు చేరుకున్నాం. అప్పటికే సరిహద్దు దళాలు కొన్ని గంటలుగా జర్మన్లతో యుద్ధం చేస్తున్నాయి. వారి భార్యలు కూడా యుద్ధ రంగంలో మందుగుండు చేరవేస్తూ, నీళ్ళు అందిస్తూ, క్షతగాత్రులను తరలిస్తూ సహాయపడుతున్నారు. సరిహద్దు దళాల సంఖ్య తరిగి పోతోంది. ఎక్కడ చూసినా మంటలు....బేరక్స్, ఇళ్ళూ మండిపోతున్నాయి. సరిహద్దు దళాలు చివరి సైనికుడి వరకూ పోరాడుతున్నాయి....' - జనరల్ ఫెడ్యూన్ స్కీ.

ఎర్ర సైన్యం రోజంతా జర్మన్లతో పోరాడింది. సాయంకాలానికి తీవ్ర నష్టాలకు గురై తిరోగమించసాగింది. ఈ లోగా ఎర్ర సైన్యం వెనుక తట్టులో జర్మన్ పేరాట్రూపర్లు దిగడంతో పరిస్థితి విషమించసాగింది. కోవెల్ పట్టణంలో బండేరా గేంగులు (వీళ్ళు పశ్చిమ యుక్రేన్ జాతీయవాదులు - రష్యన్లకు వ్యతిరేకంగా జర్మన్లతో చేతులు కలిపారు) వంతెనలు పేల్చి వేసీ రష్యన్ శకటాల మీద దాడి చేసీ నీలివార్తలు ప్రచారం చేసీ అల్ల కల్లోలం సృష్టించసాగాయి. 15వ సైన్యంలో కొన్ని యూనిట్లు జర్మన్ చక్రబంధంలో ఇరుక్కు పోయినా పోరాడసాగాయి. మూడు రోజుల యుద్ధం తర్వాత 15వ సైన్యం సరిహద్దు నుంచి 15-20 మైళ్ళ దూరం మాత్రమే నెట్టబడింది. ఎర్ర సైన్యం కోవెల్ పట్టణాన్ని వదిలెయ్యాల్సివచ్చింది.

'..... సైన్యం తిరోగమించే ముందు గాయపడ్డవారినీ ఆఫీసర్ల కుటుంబాలనూ తరలించాల్సి వచ్చింది. తరచు ప్రయాణాలకు అలవాటు పడ్డ ఆఫీసర్ల భార్యలు ఈ తరలింపులో అవసరమైనవి మాత్రమే తీసుకు వచ్చారు. కాని కొంతమంది అద్దాలు, పూలకుండీలు లాంటివి తీసుకు వచ్చారు. వాళ్ళకు నచ్చచెప్పేటప్పటికి తల ప్రాణం తోకకు వచ్చింది....' - జనరల్ ఫెడ్యూన్ స్కీ.

కోవెల్ నుంచి తిరోగమనం కథ ఆ సమయంలో సరిహద్దు నుండి తిరోగమిస్తున్న రష్యన్ సైన్యాల తిరోగమన కథ లాంటిదే. రష్యన్ వైమానిక బలగం నాశనం కావడంతో జర్మన్ విమానాలు ఆకాశాన్ని ఏలుతున్నాయి. విమాన దాడులలో నష్టం విపరీతంగా ఉండేది. జర్మన్ ఏజెంట్లు వంతెనలు పేల్చివేసి

Edit with WPS Office
రష్యన్ సైన్యాన్ని తిరోగమనంలో వేధించసాగారు.

'....రైల్వే జంక్షన్లూ రవాణా సమాచార మార్గాలూ, జర్మన్ విమాన దాడులకూ జర్మన్ ఏజెంట్ల దాడులకూ గురయ్యేవి. వైర్ లెస్ సెట్లు చాలా తక్కువగా ఉన్నాయి. మాలో చాలా మందికి అవి ఉపయోగించడం తెలియదు. ఆదేశాలు చాలా ఆలస్యంగా అందేవి. కొన్ని అందేవే కావు. చుట్టు పక్కల సైనిక యూనిట్లతో సంబంధాలు లేవు. శత్రువు తరచు రష్యన్ సైన్యం వెనుక ప్రవేశించి వెనుకతట్టులో ఉన్న హెడ్ క్వార్టర్స్ మీద దాడి చేసేవాడు. జర్మన్ విమాన దాడికి గురవుతున్నా తిరోగమిస్తున్న సైన్యం తగిన రక్షణ చర్యలు తీసుకోలేదు. ఫిరంగి దళాలతో, మోటారు వాహనాలతో ఇరుకు రోడ్ల మీద సైన్య గమనం నిలిచిపోయేది. అటువంటప్పుడు జర్మన్ విమానాలు దిగి ఊచకోత కోసేవి. సైనికులకు ట్రెంచిలు తవ్వుకుని రక్షణ తీసుకునే వ్యవధి ఉండేది కాదు. తవ్వడానికి పరికరాలూ ఉండేవి కావు. పారలు లేకపోతే తరచు ఉక్కు టోపీలతో ట్రెంచిలు తవ్వడానికి సైనికులు ప్రయత్నించేవారు.....' - జనరల్ ఫెడ్యూన్ స్కీ.

ఆ రోజుల్లో యుద్ధ రంగంలో ఉన్న కమాండర్లుకు గాని పై కమాండుకు కాని జర్మన్ బలగాల గురించి సరియైన అవగాహన లేదు. తరచు యుద్ధరంగాన్నుంచి జర్మన్ టాంకు, వైమానిక, మోటారు వాహన బలగాల గురించి అతిశయోక్తులతో కూడిన రిపోర్టులు వస్తుండేవి. జర్మనీ 30,000 టాంకులతో దాడి చేసిందనీ జర్మన్ సైన్యం రహస్య ఆయుధాలను ప్రయోగిస్తోందనీ రకరకాల వార్తలు వచ్చేవి. ప్రత్యేకంగా పంపబడిన జర్మన్ ఏజెంట్లూ విధ్వంస కారులూ టెలిఫోన్ కేబుల్సు తెంపివేస్తూ, లైన్లను బాగు చేసే వారిని హత్య చేస్తూ, ట్రూప్ కమాండర్ల మీద దాడి చేసేవారు. సరిహద్దు జిల్లాలలో చాలా జిల్లాలతో రేడియో సౌకర్యం లేకపోవడం వలన మాస్కోలో ఉన్న నాయకత్వానికి యుద్ధరంగంలోని వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడం కష్టమైంది.

మరొక జనరల్, జనరల్ బోడిన్, జూన్ 21న జర్మన్ సైన్యాలు భారీ, మీడియం టాంకులతో సరిహద్దుల్లో కేంద్రీకరిస్తున్నాయన్న వార్త వింటాడు. జర్మనీ తెల్లవారగట్ల దాడి చెయ్యబోతోన్నదన్న వార్త గూఢచారి దళం మోసుకు వస్తుంది. అతను ఆందోళన పడతాడు.

తెల్లవారగట్ల యుద్ధం ప్రారంభమైంది. 30 మైళ్ళ ప్రాంతంలో టెలిఫోన్, టెలిగ్రాఫ్ సంబంధాలు తెగిపోయాయి. సైన్యంలో ఒక యూనిట్ కూ మరో యూనిట్ కూ మధ్య సంబంధం తెగిపోయింది. జర్మన్లు ఎక్కడ పడితే అక్కడ సైన్యం మీదా ప్రజల మీదా బాంబుల వర్షం కురిపిస్తున్నారు. అక్కడక్కడ జర్మన్ పేరాట్రూపు దళాలు దిగుతున్నాయి. జర్మన్లు చాలా ప్రాంతాలను ఆక్రమించి లోలోపలికి చొచ్చుకు వస్తున్నారు.

యుద్ధ రంగంలో ఏం జరుగుతున్నదీ స్పష్టంగా తెలియని మాస్కోనుండి, హై కమాండు అనుమతి లేకుండా జర్మన్ల మీద ఎటువంటి దాడి చెయ్యకూడదని జనరల్ బోడిన్ కు సందేశం వస్తుంది. రష్యన్ దళాలు తిరోగమిస్తున్నాయనీ నగరాలన్నీ మంటలలో ధ్వంసమవుతున్నాయనీ వేలమంది ప్రజలు మరణించారనీ బోడిన్ చెబుతాడు. అయినా సరిహద్దుకు 30 మైళ్ళు దాటి రష్యన్ విమానాలు గస్తీ తిరగ కూడదని మాస్కో ఆదేశిస్తుంది. అప్పటికే రష్యన్ వైమానిక బలగం తుడిచి పెట్టుకుపోయింది. రష్యన్ సైన్యాలు సరిహద్దునుంచి వెనుకకు తరమబడ్డాయి కాని మాస్కోలో ఉన్న హై కమాండుకు ఈవిషయం తెలియదు. రష్యన్ వైమానిక దళం నాశనమైందనీ జర్మన్లు పెద్ద ఎత్తున యుద్ధం మొదలు పెట్టారనీ జనరల్ బోడిన్ చెబుతాడు. మరికొంత సేపటికి మాస్కోనుంచి సరిహద్దు రక్షణకు చర్యలు తీసుకోమని మరో ఆదేశం వస్తుంది. అప్పటికే యుద్ధం సరిహద్దులు దాటి లోపలకి చొచ్చుకుపోయింది.

జనరల్ బోడిన్ 10వ సైన్యం హెడ్ క్వార్టర్సుకు బయలు దేరుతాడు. అతనితో పాటు ట్రక్కులో పన్నెండు మంది సైనికులు ఉంటారు. ట్రక్కు డ్రైవరు అక్కడికి వెళ్ళడం ప్రమాదకరమని చెబుతాడు. ఇరవై నిమిషాల క్రితం జర్మన్ పేరాట్రూపర్లు అక్కడ దిగినట్లు వార్త విన్నానని అంటాడు.

దారిలో అతనికి కొంతమంది కార్మికులు ఎదురు పడతారు. వాళ్ళు సైనిక శిబిరాలలో పని చేసేవారు. ఎక్కడికి వెడుతున్నారని జనరల్ బోడిన్ వాళ్ళను అడుగుతాడు. మేం పని చేస్తున్న చోటు మంటల సముద్రంలా ఉంది, అంటాడు ఒక వృద్ధుడు. యుద్ధం నుంచి దూరంగా వెళ్ళాలని ప్రయత్నిస్తున్నారు కాని ఎక్కడికి వెళ్ళాలో తెలియదు వాళ్ళకు.

మరికొంత దూరం వెళ్ళాక అతనికి కొన్ని కార్లు ఎదురవుతాయి. పార్టీ ఉన్నత కార్యకర్త కారులో ఇద్దరు స్త్రీలు, ఇద్దరు పిల్లలు ఉంటారు. వారి కారులో ఉన్న పూలమొక్క కొమ్మ ఒకటి కిటికీలోంచి బయటకు వచ్చి గాలికి ఊగుతూ కనుపిస్తుంది. ఇటువంటి సమయంలో ఆ పూలమొక్క బదులు

Edit with WPS Office
వృద్ధులనో పిల్లలనో మీ కారులో తీసుకు వెళ్ళవచ్చుకదా అని వాళ్ళను జనరల్ బోడిన్ మందలిస్తాడు. ఆ స్త్రీలు సిగ్గుతో తలవంచుకుంటారు. డ్రైవరు కూడా సిగ్గుపడి పక్కకు తప్పుకుంటాడు.

అంతలో హఠాత్తుగా జర్మన్ విమానాలు వస్తాయి.

'.....జర్మన్ విమానాలు మర తుపాకులతో మా ట్రక్కు మీద కాల్పులు సాగించాయి. డ్రైవరు మరణించాడు. నేను ట్రక్కులోంచి సమయానికి బయటకు దూకడం వలన బతికాను. నేనూ మరో ఇద్దరు సైనికులూ తప్ప అంతా మరణించారు....ఆ కారు దగ్గరకు వెళ్ళాను. ఆ ఇద్దరు స్త్రీలూ పిల్లలూ ఆ కారు డ్రైవరూ - అందరూ మరణించారు. ఆ పూలమొక్క రెమ్మలు మాత్రం ఏవీ జరగనట్లు కిటికీలోంచి అలా ఊగుతూనే ఉన్నాయి....' - జనరల్ బోడిన్.

బెలోస్టాక్ పట్టణంలో అంతా గందరగోళంగా ఉంటుంది. రైల్వే స్టేషను మీద జర్మన్ విమాన దాడి జరిగింది. స్త్రీలు, పిల్లలతో నిండిన రైలు విమాన దాడికి గురయి వందలమంది మరణించారు. సాయంత్రానికి జనరల్ బోడిన్ 10వ సైన్యం హెడ్ క్వార్టర్సుకు చేరగలుగుతాడు. హెడ్ క్వార్టర్స్ బెలోస్టాక్ నగరం వెలుపలకు తరలించబడింది. అక్కడ రెండు టెంట్లు, ఒక టేబులు, కొన్ని కుర్చీలు మాత్రమే ఉంటాయి. అక్కడి అధికారులు యుద్ధరంగంలో ఉన్న సైన్యాలతో సంబంధాలు పెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు కాని టెలిఫోను లైన్లు తెగిపోవడం వలన కనెక్షన్ దొరకదు. శత్రువు రేడియో జామ్ చెయ్యడం వలన రేడియో సంబంధాలు కూడా తెగిపోయాయి.

తెల్లవారుతోందనగా జర్మన్ సైన్యం రష్యన్ సైన్యం మీద టాంకులతో విమానాలతో పెద్ద ఎత్తున దాడి చేసి తీవ్రంగా నష్టపరుస్తుంది. ఎర్ర సైన్యానికి చెందిన విమానాలనూ విమాన విధ్వంసక శతఘ్నులనూ నాశనం చేస్తుంది. రష్యన్ సైన్య ఇంధన స్థావరాల గురించి జర్మన్ గూఢచారులకు సమాచారం అందింది. విమాన దాడులలో ఇంధన గిడ్డంగులు తొలి గంటలలోనే నాశనమయ్యాయి. రష్యన్ సైనికులు, టాంకుల, విమానాల దాడిని ఎదుర్కొంటూ విపరీతమైన నష్టాలకు గురవుతూ పోరాడుతారు.

జర్మన్లు రష్యన్ సైన్యాన్ని చుట్టుముట్టుతారు. అప్పటికి ఎర్ర సైనికుల వద్ద మందుగుండు అయిపోతుంది. సైన్యం చిన్న చిన్న దళాలుగా విడిపోయి అడవుల గుండా తూర్పు వైపుకు ప్రయాణిస్తుంది. ఈ 45 రోజుల తిరోగమనంలో దారిలో జనరల్ బోడిన్ దళంలో మరి కొంతమంది ఎర్ర సైనికులు చేరుతారు. చివరకు 2,000 మంది సైనికులు స్మోలెన్స్క్ వద్ద జర్మన్ శ్రేణిని దాటి ఎర్ర సైన్యాన్ని చేరగలుగుతారు.

కాని లక్షలమంది ఎర్ర సైనికులు జనరల్ బోడిన్ లా ఎర్ర సైన్యాన్ని చేరుకోలేకపోయారు. తిరోగమిస్తున్న ఎర్ర సైన్యాన్ని జర్మన్ సైన్యం నాశనం చేసింది లేదా ఖైదీలుగా పట్టుకుంది. తొలి రోజుల్లో జర్మన్ విమానాలు 'మాస్కో లొంగిపోయింది. ఇంక ప్రతిఘటన వ్యర్థం. జర్మన్ సైన్యానికి లొంగిపొండి' అని కరపత్రాలు వెదజల్లుతుండేవి. ఈ కరపత్రాల ప్రభావం వలన తొలిరోజుల్లో కొంతమంది ఎర్ర సైనికులు గుండె నిబ్బరం కోల్పోవడం కూడా జరిగిందని జనరల్ బోడిన్ రాశాడు.

చరిత్రకారులు సంఘటన జరిగిన తర్వాత సంఘటనలూ, నేపథ్యం, పరిణామం అధ్యయనం చేసి చరిత్ర రాస్తారు. సాహిత్యంలో పాత్రలు తమ స్థల కాలాల్లో జీవిస్తాయి. సాహిత్యంలో పాత్రలకు తమ అనుభవంలోకి వచ్చిందే తెలుస్తుంది కాని మొత్తం జరుగుతున్న చరిత్రలో వారి పాత్ర చరిత్రకారుడికి కనుపించినంత స్పష్టంగా కనుపించదు. అందుచేత సంఘటనల గురించి తెలుసుకోవడంలో చరిత్ర ప్రాధాన్యత చరిత్రకుంటుంది. సాహిత్యం ప్రాధాన్యత సాహిత్యానికి ఉంటుంది. ఈ ఉద్దేశంతో అక్కడక్కడ సాహిత్యం నుంచి కొన్ని కొన్ని సన్నివేశాలు ఇవ్వడం జరిగింది. 'అతను ఇంకా సైన్యంలో చేరలేదు' అన్న నవల ఆ తొలిరోజులలో రష్యన్లు ఎలా పోరాడారో చెబుతుంది.

కథానాయకుడు పంథొమ్మిదేళ్ళ కోల్యా, ట్రెయినింగు పూర్తయి సైన్యంలో లెఫ్టెనెంటుగా చేరడానికి పోలెండు-రష్యా సరిహద్దులో ఉన్న బ్రెస్ట్ దుర్గానికి చేరుతాడు. ఈ బ్రెస్ట్ దుర్గం చాలా పురాతనమైనది. ఈ దుర్గం అనేక కట్టడాలతో ఆరు కిలోమీటర్ల మేర విస్తరించి ఉటుంది. దుర్గం గోడలు రెండు మీటర్ల మందాన ఉంటాయి. జర్మన్ దాడి నాటికి ఈ దుర్గంలో దాదాపు నాలుగువేలమంది సైనికులున్నారు. నాలుగు వేలమంది ఉన్న ఈ దుర్గం మీద నలభైవేల జర్మన్ సైన్యం విమానాలతో, టాంకులతో దాడి చేస్తుంది.

జూన్ 21వ తేదీ రాత్రికి కోల్యా దుర్గాన్ని చేరుతాడు. తెల్లవారకట్ల అతను భూగర్భంలో ఉన్న స్టోరులో టీ తీసుకుంటుండగా నీలం రంగు మెరుపు మెరిసి ఉరిమినట్లు శబ్దం వినిపిస్తుంది. అక్కడున్న

Edit with WPS Office
వాళ్ళు మొదట మందుగుండు సామాను ఉన్న స్టోరు అంటుకుందని అనుకుంటారు. కాని యుద్ధం మొదలైంది. కోల్యా దగ్గర అతని పిస్టల్ తప్ప మరే ఆయుధం ఉండదు. దుర్గం కొత్త. ఎక్కడికి వెళ్ళాలో, ఎవరికి రిపోర్టు చెయ్యాలో తెలియదు. కోల్యా స్టోరు నుండి మండుతున్న దుర్గంలోకి అడుగు పెడతాడు. జర్మన్ ఫిరంగి దాడి ఇంకా జరుగుతోంది కాని మెల్ల మెల్లగా కేంద్రం నుంచి గుళ్ళ వర్షం దుర్గం అంచులవైపు మళ్ళుతోంది. దుర్గం అంతా అగ్నిగుండంలా మండుతోంది....అర్ధ నగ్నంగా ఉన్న మనుషులు మంటల మధ్య అటూ ఇటూ పరిగెడుతుంటారు....గుర్రపుశాలల్లో కాలిపోతున్న గుర్రాలు.....తగులబడిపోతున్న బేరక్స్ నుంచి కాలిపోతున్న మనుషుల హృదయవిదారక ఆక్రందనలు....అతను తనవారితో కలవడానికి పరిగెడుతుండగా సమీపంలో ఫిరంగి గుండు పేలుతుంది.....అతను గాయపడడు కాని స్పృహ తప్పుతుంది. కోల్యా యువకుడు.....బలవంతుడు.....వెంటనే కోలుకుని ముందుకు పరిగెట్టి కొందరు ఎర్ర సైనికుల్ని కలుసుకుంటాడు. జర్మన్లు దుర్గంలో ప్రవేశించారని తెలుసుకుంటాడు. అతను ఉన్న భవనంలో ఒక భాగం మండుతూనే ఉంటుంది. అక్కడ చనిపోయి ఉన్న సైనికుడి దగ్గర నుంచి రైఫిల్ తీసుకుంటాడు. జర్మన్లు దుర్గ రక్షణలో కీలకమైన క్లబ్బును ఆక్రమిస్తారు. అది తిరిగి స్వాధీనం చేసుకోవాలని అసిస్టెంటు కమిస్సార్ ఆదేశిస్తాడు.

'.....నేను ఆర్డరు ఇవ్వగానే తిన్నగా అటూ ఇటూ చూడకుండా క్లబ్బు వైపు పరిగెట్టాలి. ఏం జరిగినా పట్టించుకోవద్దు. క్లబ్బులో ఉన్న జర్మన్ సబ్ మెషీన్ గన్నర్లను చంపాలి. అర్థమైందా?'

'అర్థమైంది' అని అరిచారు అక్కడున్న వాళ్ళు.

'కాని ఏం చెయ్యగలం?' - నీలం దుస్తులలో ఉన్న వయసు మళ్ళిన వ్యక్తి నిరాశగా అన్నాడు - 'రైఫిళ్ళకు బయెనెట్లు లేవు.....నా దగ్గర రైఫిలు కూడా లేదు'

'రైఫిలు లేకపోతే నీ గోళ్ళు ఉపయోగించు.....ఇటుకలు తీసుకుని వాళ్ళ బుర్రలు బద్దలు కొట్టు. పిచ్చి పిచ్చి ప్రశ్నలు వెయ్యకు....గట్టిగా హుర్రా అని అరుస్తూ పరిగెట్టండి.....క్లబ్బు చేరేవరకూ ఆగకూడదు'

వాళ్ళందరికీ చెయ్యాల్సినదేమిటో అర్థమైంది. ఏం చెయ్యాలో చెప్పి నడిపించగల ఆఫీసరు దొరికాడు.

'రైఫిళ్ళు లేని వాళ్ళు పారలు, గొడ్డళ్ళు, రాళ్ళు, కర్రలు - ఫాసిస్టుల బుర్రలు పగల గొట్టడానికి ఏ ఆయుధమైనా సరే.....తీసుకు రండి.....నేను స్వయంగా ముందుండి దారి తీస్తాను....' అంటూ ముందుండి సైన్యాన్ని నడిపిస్తాడు ఆ కమ్యూనిస్టు కమిస్సార్.

అలా ప్రారంభమవుతుంది రష్యన్ ప్రతిఘటన. ఈ లోగా యుద్ధం సరిహద్దు నుంచి దూరానికి వెళ్ళిపోతుంది. దుర్గంలో ఉన్న ఎర్ర సైనికులు త్వరలోనే అందుతుంది అని ఆశించిన సహాయం అందదు. ప్రధాన సైన్యాలు దూరంగా వెళ్ళిపోయినా కొంత జర్మన్ సైన్యం దుర్గాన్ని చుట్టుముడుతుంది. దుర్గంలో ఉన్న ఎర్ర సైనికులకు బయట ఏమి జరుగుతున్నదీ తెలియదు. గాయపడిన వారికి మందు లేదు. తినడానికి తిండి ఉండదు. పక్కన నది ఉన్నా తాగడానికి చెంచాడు నీళ్ళు కూడా ఉండవు. మాస్కో లొంగిపోయిందనీ మీరు కూడా లొంగి పొండనీ రోజూ జర్మన్లు మైకులో చెబుతుంటారు.

జూన్ 29న పెద్ద ఎత్తున విమానదాడి జరుగుతుంది. జర్మన్లు 1800 కేజీల బాంబు వేస్తారు.

ఆడవాళ్ళనూ పిల్లలనూ జర్మన్లకు లొంగి పొమ్మని చెప్పి పంపించి వేస్తారు. సైనికులు మాత్రం లొంగరు.

రోజల్లా విమానదాడులు.....విమాన దాడుల విరామంలో జర్మన్ సైన్యం దాడి.....మళ్ళీ విమాన దాడులు....ఎర్ర సైనికులు దుర్గం నేల మాళిగల్లో, సొరంగాలలో రక్షణ తీసుకుంటూ జర్మన్ దళాల మీద దాడి చేసి వారి ఆయుధాలు స్వాధీనం చేసుకుంటూ....ఆకలితో.....దాహంతో.....నెల రోజుల పాటు యుద్ధం కొనసాగిస్తారు. ఆఖరి సైనికుడు కోల్యో దాదాపు పది నెలలు, 1941 ఏప్రిల్ దాకా, ఒంటరిగా పోరాడి చనిపోతాడు.

(ఈ బ్రెస్ట్ దుర్గ పోరాటంతో పశ్చిమాన ఫోర్ట్ ఎబెన్ ఎమేల్ పోరాటాన్ని పోల్చి చూస్తే రష్యన్లు పోరాడిన తీరుకూ పశ్చిమ దేశాల సైన్యం పోరాడిన తీరుకూ భేదం స్పష్టంగా కనుపిస్తుంది. ఎబెన్ ఎమేల్ దుర్గం యూరోపు అంతటిలోకి దుర్భేధ్యమైన దుర్గంగా భావించబడేది. భూగర్భంలో ఉక్కు, కాంక్రీటు గేలరీలతో ఇది ఎటువంటి విమాన దాడినయినా తట్టుకునేట్లు నిర్మించబడింది. ఈ దుర్గ రక్షణకు సుశిక్షితులైన 1200 మంది సైనికులున్నారు. ఈ దుర్గం కప్పు మీద 80 మంది జర్మన్ సైనికులు

Edit with WPS Office
గ్లైడర్లలో దిగి, ఈ 1200 మంది సైనికులనూ ఓడించి, 30 గంటలలో దుర్భేధ్యమని భావించబడ్డ ఈ దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఆరుగురు జర్మన్ సైనికులు మరణించారు. పంథొమ్మిది మంది గాయపడ్డారు).

బ్రెస్ట్ దుర్గంలో మాత్రమే కాదు, సరిహద్దు అంతటా రష్యన్లు జర్మన్ సైన్యాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తూ, తాము విపరీతమైన నష్టాలకు గురవుతూ, జర్మన్లను నష్టాలకు గురిచేస్తూనే ఉన్నారు.

జర్మన్ జనరల్ బ్లూమిన్ ట్రిట్ తొలి రోజులలో జరిగిన మరో యుద్ధం, మిన్స్క్ యుద్ధం గురించి ఇలా రాశాడు - 'ఈ మొట్ట మొదటి యుద్ధంలోనే రష్యన్ సైన్యాలు యుద్ధం చేసిన తీరు పోలెండు, పశ్చిమ దేశాల సైనికుల తీరుకు చాలా భిన్నంగా ఉంది.....చుట్టుముట్టబడినప్పుడు కూడా రష్యన్లు లొంగి పోకుండా పోరాడుతున్నారు... '

జర్మన్ చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ జనరల్ హాల్డర్ తన సర్వీసు జర్నల్ లో ఇలా రాశాడు - '.....రష్యన్లు తీవ్రంగా ప్రతిఘటిస్తుండడం వలన తొలి దినాలలో జర్మన్ సైన్యంలో - సైనికులలోనూ ఆయుధాలలోనూ - నష్టం, పశ్చిమరంగంలోనూ పోలెండులోనూ కంటే చాలా ఎక్కువగా ఉంది. ఇంతవరకూ జర్మన్ సైన్యం చేసిన మెరుపు దాడుల విజయాలు ప్రపంచాన్ని దిగ్భ్రాంతిలో ముంచెత్తాయి. (రష్యన్ రంగంలో) శత్రువు యుద్ధం చేసే పద్ధతీ పోరాట పటిమా దేశ నైసర్గిక పరిస్థితులూ పూర్తిగా భిన్నంగా ఉన్నాయి.....'

'1941 జూన్ లో మొట్టమొదటి పోరాటంలోనే కొత్త సోవియట్ సైన్యం అంటే ఏమిటో మాకు తెలిసింది. మా నష్టాలు 50 శాతం దాకా ఉన్నాయి. ఒ.జి.పి.యు., స్త్రీల బెటాలియన్లు చివరి మనిషి వరకూ బ్రెస్ట్ లిటోవస్క్ దుర్గంలో పారాడాయి. మేము భారీ గన్నులనూ, విమాన దాడులను ప్రయోగించినా పోరాటం ఆపలేదు. మా సైన్యం త్వరలోనే రష్యన్లతో పోరాడడం అంటే ఏమిటో తెలుసుకుంది' - జనరల్ బ్లూమింట్రిట్ (The German Generals Talk, p. 225).

ఒక జర్మన్ సైనికుడు హేన్స్ ఎఫెర్ బెర్గెన్ తన లేఖలలో ఇలా రాశాడు: జూన్ 26, 1941: ' .....రష్యన్లు తరచు మేం 20 గజాల సమీపానికి వచ్చేదాకా ఆగి, తాము దాగి ఉన్న చోటునుంచి అగ్నివర్షం కురిపిస్తారు. రష్యన్ సైనికులు ఎంత చాకచక్యంగా మాటు వేస్తారంటే వాళ్ళు మాకు కనుపించనే కనుపించరు...చెట్ల మీద చాలా ఎత్తున దాగి ఉండి, అక్కడ వాళ్ళు ఉన్నారన్న సంగతి నువ్వు గ్రహించే లోపునే హఠాత్తుగా కాల్పులు ప్రారంభిస్తారు. మరో విషయమేమిటంటే, వాళ్ళు పౌరులతో కలిసిపోయి యుద్ధం చేస్తున్నారు. సామాన్యమైన దుస్తులే ధరిస్తారు. కన్నుమూసి తెరిచేలోగా బందిపోట్లుగా (పార్టిజాన్లు జర్మన్లు పెట్టిన పేరు) మారిపోతారు...' – (The Soviet Army Through German Eyes, p. 218).

హేన్స్ రోత్ అనే మరో జర్మన్ సైనికుడు: 'జూన్ 24, 1941....ఒక ఎర్ర సైన్య డివిజన్ ను పూర్తిగా నాశనం చేశాం.....మా నష్టాలు కూడా చాలా ఎక్కువగానే ఉన్నాయి. మేం అలిసిపోయాం. నేల కూలిపోయేలా ఉన్నాం. అయినా మేమంతా మళ్ళీ కూడి లోకోజ్ గ్రామం వైపు పురోగమించాం. అక్కడ మాకు లభించిన స్వాగతం సంతోషకరంగా లేదు. మా మీద గుళ్ళ వర్షం కురిసింది....స్నైపర్ల బెడద ఒకటి....చేతి బాంబులతో ప్రతీ ఇంటినుంచి రష్యన్లను తరిమేయాల్సి వచ్చింది. ఇళ్ళ కప్పులు వాళ్ళ నెత్తిమీద కూలిపోయి ఆ శిధిలాలలో సమాధి అయ్యేవరకూ ఈ రష్యన్ మొండిఘటాలు మా మీద కాల్పులు జరుపుతూనే ఉన్నాయి. కొంతమంది ఆఖరినిమిషంలో కాగడాలలా కాలిపోతూ తప్పించుకుంటారు. వీధుల్లో కూలిపోయి చావనైనా చస్తారు లేదా మేం కొట్టి చంపుతాం. ఒక గంటలో గ్రామమంతా మంటల సముద్రంలా మారింది...' (The Soviet Army Through...p. 284).

హేన్స్ ఎఫెర్ బెర్గెన్: 'ఆగస్టు 10, 1941....శత్రువు నష్టాల గురించి మాకేమీ తెలియదు. శత్రువు 2.00 గం. నుండి 7.30 గం. వరకూ విరామం లేకుండా దాడి చేస్తూనే ఉన్నాడు....శత్రువు ఎంత ధృఢంగా నిలబడ్డాడంటే మా దాడి నీరసించి పోతోంది. కనుపించని ప్రదేశాల్లో దాగి మా మీద అగ్ని వర్షం కురిపిస్తున్నాడు. టెలిస్కోపిక్ సైట్స్ ఉన్న శత్రు స్నైపర్లు మాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నారు. ఈ రోజు మళ్ళీ రెండు రష్యన్ ఫిరంగి దళాలు మా మీద కాల్పులు ప్రారంభించాయి. పిచ్చెక్కించడానికి ఇది చాలు...' (The Soviet Army Through German Eyes, p. 213).

రష్యన్ల ఆయుధ సంపత్తి కూడా తొలిరోజులలోనే జర్మన్లకు ఆశ్చర్యం కలిగించింది.

లెఫ్టెనెంట్ జార్జి క్రూబెర్: '...జులై 7, 1941.....టాంకులు మమ్మల్ని చుట్టుముట్టాయి. రష్యన్ టాంకులు మా మీద దాడి చేస్తున్నాయి. ఆ టాంకులలో రెండు భారీ టాంకులున్నాయి. మా పాక్ గన్ను

Edit with WPS Office
కాని, 5 సెం. మీ గన్ను కాని పేల్చే గుండ్లు ఈ టాంకుల బలహీన ప్రదేశాలనుకున్న వాటిని కూడా దెబ్బతియ్యలేకపోతున్నాయి....మా టాంకులు నిస్సహాయంగా నిలిచిపోయాయి...' (The Soviet Army.... P. 286).

'1941లో కూడా రష్యన్ యుద్ధ సామగ్రి, ముఖ్యంగా టాంకులు, చాలా బాగుంది. పదాతి దళ ఆయుధాలలో అధిక భాగం, రష్యన్ల ఆర్టిలరీ అద్భుతంగా (Excellent) ఉన్నాయి. రష్యన్ల రైఫిళ్ళు మా రైఫిళ్ళ కంటే ఆధునికమైనవి; అవి మా రైఫిళ్ల కంటే వేగంగా పేల్చగలిగేవి. రష్యన్ల టి-34 టాంకు ప్రపంచంలోనే అత్యుత్తమమైన టాంకు' – జనరల్ క్లీస్ట్ (The German Generals Talk, p. 221).

హేన్స్ రోత్ (సెప్టెంబరు 30, 1941): 'మేమందరం, నాయకత్వంతో మొదలు పెట్టి సామాన్య సైనికుడి వరకూ, రష్యన్ సైనికుడి గురించీ, అపారమైన అతని ఆయుధాల గురించీ తక్కువ అంచనా వేశాం....వాళ్ళ ఆర్టిలరీ గురించి కూడా చెప్పాలి. మేం ఊహించిన దాని కంటే చాలా శక్తివంతంగా ఉంది. రష్యన్ల దగ్గర అన్ని రకాల ఆయుధాలు అంతులేకుండా ఉన్నట్లు కనుపిస్తోంది....' (The Soviet Army Through German Eyes, p. 213-214).

అనుకోని విధంగా సోవియట్ సైన్యాలు తీవ్రంగా ప్రతిఘటించడం వలన ఆపరేషన్ బార్బరోస్సా ప్రధాన లక్ష్యం - నీపర్ నది దాటి తూర్పుకు తిరోగమించకుండా రష్యన్ ప్రధాన బలగాలను నదికి పశ్చిమం వైపునే మెరుపు దాడిలో చుట్టుముట్టి నాశనం చెయ్యడం - నెరవేరలేదని హిట్లర్ అంగీకరించవలసి వచ్చింది. రెండు నెలలలో జర్మన్ పదాతి దళాలు 4 లక్షలమంది సైనికులనూ ఆఫీసర్లనూ నష్టపోయాయి. రష్యా-జర్మనీ యుద్ధ రంగానికి వెలుపలి యుద్ధ రంగంలో (పశ్చిమ దేశాలతో యుద్ధంలో) 1941 జూన్-డిసెంబరుల మధ్య ఆరు నెలలలోనూ జర్మనీ కేవలం 9,000 మంది సైనికులను మాత్రమే నష్టపోయింది.

తొలి దినాలలో సోవియట్ సైనికులు గొప్ప సాహసంతో చేసిన ఈ పోరాటాల్ని సరిగా అధ్యయనం చెయ్యలేదని మార్షల్ ఝుకోవ్ అభిప్రాయపడ్డాడు. దానికి కారణం ఉంది. స్టాలిన్ నేరాలు, తప్పుడు అవగాహన, రక్షణవ్యవస్థను చిందరవందర చేశాయనీ అందువలన తొలి అపజయాలు సంభవించాయనీ స్టాలిన్ అనంతరం పెద్ద ఎత్తున నిందా ప్రచారం మొదలైంది. 35 లక్షల సైన్యం వేల టాంకులతో విమానాలతో మెరుపు దాడి చేసినప్పుడు ఓటమి, తిరోగమనం, నష్టాలూ అనివార్యం. గమనించాల్సిన విషయం ఏమిటంటే తొలి క్షణాలనుంచీ సోవియట్ సైనికులు అననుకూల పరిస్థితులలో జర్మన్లను తీవ్రంగా ప్రతిఘటిస్తూ నష్టాలకు గురిచేస్తూ మెరుపుదాడిని బలహీనపరచడం మొదలు పెట్టారు. అడుగడుక్కూ ఇలా యుద్ధం చెయ్యాల్సి వచ్చిన కారణంగా జర్మన్ పదాతి దళం టాంకు దళాలతో పాటు ముందుకు సాగలేక పోయింది. మెరుపుదాడి క్రమంగా బలహీనపడి మాస్కో సమీపించేట్టుటికి ఉధృతాన్ని కోల్పోయింది....

జూన్ 22 మధ్యాహ్నం ఒంటిగంటకు స్టాలిన్ మార్షల్ ఝుకోవ్ కు ఫోను చేసి 'యుద్ధ రంగంలో ఉన్న మన కమాండర్లకు అనుభవం లేదు. వాళ్ళు గందరగోళంలో ఉన్నట్లు కనుపిస్తోంది. హై కమాండు జనరల్ హెడ్ క్వార్టర్స్ (హై కమాండ్, మిలిటరీ, రాజకీయ నాయకులతో ఉన్న సంస్థ) ప్రతినిధిగా పాలిట్ బ్యూరో నిన్ను నైరుతి యుద్ధ రంగానికి పంపించాలని నిర్ణయించింది. పశ్చిమ రంగానికి మార్షల్ షపోష్నికోవ్, మార్షల్ కులిక్ లను పంపిస్తున్నాం' అని చెప్పాడు.

జూన్ 22వ తేదీన స్టాలిన్ చురుకుగా యుద్ధ వ్యూహాన్నీ ఎత్తుగడలనూ రూపొందిస్తున్నది వాస్తవమైతే హేరిసన్ శాలిస్ బరీ 'తొమ్మిది వందల రోజుల దిగ్బంధంలో లెనిన్ గ్రాడ్' అన్న పుస్తకంలో - '....నాజీ దాడి మొదలైన తర్వాత స్టాలిన్ మానసికంగా కూలిపోయాడు. రాజ్య వ్యవహారాలలో పాల్గొనలేని స్థితిలో అతను తన గదికే పరిమితమయ్యాడు.....భయంకరమైన ఈ ప్రమాద దశలో సోవియట్ ప్రభుత్వం కొన్ని రోజులపాటు చుక్కాని, సరంగు లేని నావలా కొట్టుకుపోయింది....' అని రాశాడు (The 900 days - The Siege of Leningrad, Harrison E. Salisbury, P. 160). (ఇతడిని రష్యా యుద్ధంమీద గొప్ప నిపుణుడిగా పరిగణిస్తారు)

సాయంకాలానికి ఝుకోవ్ యుక్రెయిన్ రాజధాని కీవ్ నగరాన్ని చేరుతాడు. జర్మన్ల మీద ఎదురుదాడి చెయ్యమని స్టాలిన్ అదేశించినట్లు తెలుసుకుంటాడు. సైనికాధికారులకు యుద్ధ రంగంలో ఏం జరుగుతున్నది సరియైన అవగాహన లేదనీ అటువంటి పరిస్థితులలో ఎదురు దాడి చెయ్యడం సరికాదనీ అతను భావిస్తాడు. కాని జూన్ 24న 8వ, 15వ సాయుధ శకట దళాలతో విజయవంతంగా ఎదురుదాడి చేసి దెబ్బ తీస్తాడు.

Edit with WPS Office
ఉప్పెనలా విరుచుకుపడుతున్న జర్మన్ సైన్యాలను కొంతకాలం నిలుపు చేసి వ్యవధి సంపాదించే లక్ష్యంతో రష్యన్లు తీవ్రంగా నష్ట పోతున్నా గొప్ప ధైర్య సాహసాలతో మళ్ళీ మళ్ళీ ఎదురు దాడులు చెయ్యసాగారు. జర్మన్ సైన్యాన్ని అడుగడుగునా ప్రతిఘటిస్తూ, నష్ట పరుస్తూ ఎర్రసైన్యం చేసిన ఈ దాడుల వలన రిజర్వు సైన్యాలను సమీకరించి మాస్కో దిశలో స్మోలెన్ స్క్ వద్ద రక్షణ చర్యలు తీసుకోవడానికి రష్యన్ హై కమాండుకు వ్యవధి చిక్కింది.

జూన్ 26న యుద్ధ రంగానికి 300 కి. మీ. దూరంలో రిజర్వు ఫ్రంటును సంసిద్ధం చెయ్యడానికి వ్యూహరీత్యా ప్రాముఖ్యతగల నిర్ణయం తీసుకున్నాడు స్టాలిన్. శత్రువు రష్యన్ ప్రతిఘటనను అధిగమించి ముందుకు వస్తే ఈ రిజర్వు ఫ్రంటు దగ్గర నిలుపు చెయ్యాలని అతని ఆలోచన.

మాలటోవ్ ప్రసంగం

జర్మన్ దాడి ప్రారంభమైన కొన్ని గంటల తర్వాత రష్యన్ విదేశాంగ కమిస్సార్ మాలటోవ్ రేడియోలో ప్రసంగించాడు:

'సోవియట్ పౌరులారా! రష్యన్ ప్రభుత్వమూ, కామ్రేడ్ స్టాలిన్ ఈ ప్రకటన చెయ్యమని నన్ను ఆదేశించారు. ఈ రోజు ఉదయం నాలుగు గంటలకు యుద్ధ ప్రకటన లేకుండా, జర్మనీ సోవియట్ ప్రభుత్వం నుంచి ఏమి కోరుతున్నదో తెలియజేయకుండా, జర్మన్ సైన్యం అనేక ప్రదేశాలలో దాడులు ప్రారంభించింది. ఝిటోమిర్, కీవ్, సెవస్తపోల్, కానాస్ నగరాలపైనా, మరికొన్ని ప్రదేశాలలోనూ విమాన దాడులు చేసింది. రెండు వందలమందికి పైగా గాయపడడం కాని మరణించడం కాని జరిగింది. రుమేనియా, ఫిన్లాండుల నుంచి కూడా రష్యన్ భూభాగంపై ఫిరంగి, విమానదాడులు జరిగాయి..... నాగరిక దేశాల చరిత్రలో ఇటువంటి విద్రోహపూరితమైన దాడి కనీవినీ ఎరుగనిది. జర్మనీ-సోవియట్ యూనియన్ ల మధ్య నిరాక్రమణ సంధి అమలులో ఉండగా, ఆ ఒడంబడికను సోవియట్ యూనియన్ నిజాయితీగా అమలు పరుస్తున్న సమయంలో ఈ దాడి జరిగింది. ఈ సంధి అమలులోకి వచ్చినప్పటినుండి ఇంతవరకూ జర్మనీ ఈ ఒడంబడికను అమలు చెయ్యడంలో సోవియట్ యూనియన్ విఫలమైందని ఒక్కసారి కూడా ఆరోపించలేదు. అందువలన ఈ విద్రోహపూరితమైన దాడికి పూర్తి బాధ్యత నాజీ పాలకులు వహించవలసి ఉంది..... సరిహద్దులలో రష్యా తన బలగాలను కేంద్రీకరించిన కారణంగా జర్మనీ రష్యా మీద దాడి చెయ్యాలని నిర్ణయించిందని జర్మన్ రాయబారి ఈ ఉదయం తెలిపారు.....రష్యన్ విమానాలు రుమేనియాలో ఉన్న నూనె గనుల మీద దాడి చేశాయన్న వార్త అసత్యం.....రష్యన్ విమానాలు ఎన్నడూ సరిహద్దును అతిక్రమించలేదు.....ఇప్పుడు జర్మనీ రష్యామీద దాడి చేసింది కనుక జర్మన్లను మాతృదేశం నుంచి తరిమి వేయమని సోవియట్ ప్రభుత్వం సైన్యాన్ని ఆదేశించింది.....రష్యన్ సైన్యం తన విధిని నిర్వర్తించి జర్మన్ దురాక్రమణ దారులను తుడిచి పెడుతుందన్న విషయంలో ఏమీ సందేహంలేదు.....1812లో రష్యా మీద నెపోలియన్ దాడి చేసినప్పుడు రష్యన్ ప్రజలు ఒక్కటై లేచి నెపోలియన్ ను ఓడించారు. మదోన్మత్తుడైన హిట్లర్ కు కూడా అదే గతి పడుతుంది. సోవియట్ ప్రజలందరూ తమ విద్యుక్త ధర్మం నిర్వర్తిస్తారని సోవియట్ ప్రభుత్వం విశ్వసిస్తోంది. అత్యున్నతమైన క్రమశిక్షణ, నిస్వార్థత, తగిన విధంగా వనరులను రక్షణకు ఉపయోగించే కుశలతా దేశభక్తులందరూ ప్రదర్శించాలి. సైన్యానికీ నావికాబలగానికీ వైమానిక బలగానికీ సహాయ సహకారాలందించి విజయం సాధించేలా తోడ్పడాలి.....మన పోరాటం న్యాయమైంది. శత్రువుకు అపజయం తప్పదు. జయం మనదే...'

జులై 3న స్టాలిన్ ప్రసంగం

మాలటోవ్ ప్రసంగించిన పన్నెండు రోజుల తర్వాత స్టాలిన్ ప్రసంగించాడు. ఈ పన్నెండు రోజులూ స్టాలిన్ నుంచి మాటైనా లేకపోవడం గురించి కృశ్చేవ్ ప్రస్తావిస్తూ, స్టాలిన్ యుద్ధం ప్రారంభమైందని తెలిసిన వెంటనే చెమటలు పట్టి కుప్పకూలిపోయాడనీ కోలుకోవడానికి టైముపట్టిందనీ ఆరోపించాడు.

ఈ ఆరోపణ గురించి స్పందిస్తూ మాలటోవ్ ఇలా చెప్పాడు: '...స్టాలిన్ కాక నేను ఎందుకు

Edit with WPS Office
మాట్లాడాను? యుద్ధం గురించి మొట్టమొదట మాట్లాడే వ్యక్తి తను కాకూడదని స్టాలిన్ భావించాడు. యుద్ధం గురించి ఒక కార్యక్రమం ఇవ్వాలంటే ఏం జరుగుతోంది అన్న దాని గురించి ఒక స్పష్టమైన అవగాహనకు అతను రావాలి. ప్రతీ విషయానికీ స్టాలిన్ ఒక యంత్రంలా స్పందించకూడదు...ఒక రాజకీయ వేత్తగా ఏం జరుగుతోంది అన్నది అతను కొంతకాలం గమనించాలి. అతను మాట్లాడే పద్ధతి ప్రత్యేకమైనది. సరియైన సమాచారం లేకుండా ఖచ్చితమైన సమాధానాలు ఇవ్వడం సాధ్యం కాదు....తను కొన్ని రోజుల తర్వాత, యుద్ధ రంగంలో పరిస్థితి స్పష్టమైన తర్వాత, ప్రసంగిస్తానని స్టాలిన్ చెప్పాడు....' – (Molotov Remembers, p. 38)

యుద్ధం ప్రారంభమైందని తెలిసిన వెంటనే చెమటలు పట్టి కూలిపోయాడన్న ఆరోపణ గురించి: '...అతను ఎప్పటిలాగే రాత్రింపవళ్ళు పని చేశాడు. ఆలోచనా శక్తిని కాని, మాట్లాడే శక్తిని కాని కోల్పోలేదు. అతను ఎలా ఉన్నాడు? స్టాలిన్ ఎలా ఉండాలని ఆశిస్తామో అలాగే, ధృఢంగా, ఉన్నాడు.....' (Molotov Remembers, p. 39).

పన్నెండు రోజుల తర్వాత స్టాలిన్ జులై 3న స్టాలిన్ రేడియోలో ప్రసంగించాడు. స్టాలిన్ నుంచి వచ్చే ప్రతీ మాట కోసం దేశం ఈ పన్నెండు రోజులూ చాలా ఆసక్తిగా ఎదురు చూస్తోంది.

స్టాలిన్ తన ప్రసంగంలో ఎర్ర సైన్యం తీవ్రంగా ప్రతిఘటిస్తోన్నా, జర్మనీకి చెందిన ఉత్తమ శ్రేణి సైన్యాలూ వైమానిక దళాలూ యుద్ధరంగంలో నాశనమవుతున్నా, నాజీ దురాక్రమణ కొనసాగుతోందన్నాడు. జర్మనీ, లిథుయేనియా, లాత్వియాలలో అధికభాగాన్నీ, పశ్చిమ యుక్రెయిన్ లోని కొన్ని ప్రాంతాలనూ ఆక్రమించిందనీ, జర్మన్ విమానాలు రష్యన్ నగరాల మీద విమాన దాడులు చేస్తున్నాయనీ చెప్పాడు. దేశం తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటోందన్నాడు.

'.....అయితే జర్మనీ ప్రచారం చేస్తున్నట్లు జర్మన్ సైన్యాలు అజేయమైనవా? జర్మన్ సైన్యాలు అజేయమైనవి కావు. నెపోలియన్ సైన్యాలు కూడా అజేయమైనవిగా భావించబడ్డాయి. చివరికి అవి చిత్తుగా ఓడిపోయాయి. హిట్లర్ సైన్యానికి కూడా అదే గతి పడుతుంది. రష్యన్ భూభాగం మీదే మొట్టమొదటిసారి హిట్లర్ సైన్యం తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటున్నది. అయినా మన దేశంలోని కొంత భూభాగాన్ని అది ఆక్రమించగలగడానికి కారణం ఈ యుద్ధం జర్మనీకి అనుకూలమైన, ఎర్ర సైన్యానికి అననుకూలమైన పరిస్థితులలో ప్రారంభం కావడమే. యుద్ధం ప్రారంభమయ్యేనాటికి జర్మనీకి చెందిన 170 డివిజన్లు మోహరింపబడి, ఆదేశాలు ఇవ్వబడిన వెంటనే యుద్ధం ప్రారంభించడానికి సర్వసన్నద్ధంగా ఉన్నాయి. సోవియట్ సైన్యాలు సమీకరించబడలేదు. సరిహద్దులకు తరలించబడలేదు. మరొక ముఖ్యమైన కారణం - ఫాసిస్టు జర్మనీ 1939 నిరాక్రమణ సంధిని అతిక్రమించి ప్రపంచమంతా తన్ను దురాక్రమణదారునిగా ముద్ర వేస్తుందన్న ఆలోచన కూడా లేకుండా అకస్మాత్తుగా ఊహించని రీతిలో దాడి చేసింది..... '

తర్వాత స్టాలిన్ సోవియట్-జర్మన్ నిరాక్రమణ సంధి గురించి ప్రస్తావించాడు.

'.....హిట్లర్, రిబ్బన్ ట్రాప్ ల వంటి నీచులతో సోవియట్ యూనియన్ అటువంటి ఒడంబడికకు రావడం తప్పు కాదా? తప్పు కాదు. నిరాక్రమణ సంధి అనేది రెండు దేశాల మధ్య ఒక శాంతి ఒడంబడిక. శాంతిని కోరే ఏ దేశమైనా మరొక దేశం అటువంటి ఒడంబడికను ప్రతిపాదించినప్పుడు - హిట్లర్, రిబ్బన్ ట్రాప్ ల వంటి నీచులు ఆ దేశానికి అధినేతలుగా ఉన్నా - నిరాకరించజాలదు....'

నాజీ జర్మనీ సోవియట్ యూనియన్ మీద దాడి చేయాలని నిర్ణయించిన పక్షంలో, యుద్ధానికి సంసిద్ధం కావడానికి సోవియట్ యూనియన్ కు ఈ ఒడంబడిక వ్యవధినిచ్చిందన్నాడు స్టాలిన్.

'.....ఈ యుద్ధం మన దేశానికి జీవన్మరణ సమస్య. జర్మన్ ఫాసిజం ఈ ద్రోహపూరితమైన యుద్ధం మన మీద చేస్తోంది. టాంకులతోనూ విమానాలతోనూ దాడి చేస్తున్న జర్మన్ సైన్యంతో మన సైన్యం అనేక కష్ట నష్టాలకోర్చి పోరాడుతోంది. ఎర్ర సైన్య ప్రధాన బలగాలు వేల టాంకులతో విమానాలతో ఇప్పుడు యుద్ధ రంగంలో ప్రవేశిస్తున్నాయి. ఎర్ర సైన్యంతో పాటు ప్రజలంతా ఒక్క మనిషిగా దేశాన్ని రక్షించుకోవడానికి లేస్తున్నారు. శత్రువు దయాదాక్షిణ్యాలు లేని వాడు, దుర్మార్గుడు. వాడు మన భూమినీ మన పంటనూ మన నూనె వనరులనూ దోచుకోవాలని చూస్తున్నాడు. భూస్వాముల రాజ్యాన్నీ జారిజాన్నీ పునరుద్ధరించి సోవియట్ యూనియన్ లోని జాతుల సంస్కృతిని నాశనం చెయ్యాలని చూస్తున్నాడు. రష్యన్ ప్రజలను జర్మన్ స్వాముల బానిసలుగా మార్చాలని చూస్తున్నాడు. పిరికి వారికీ, నీలి వార్తలు, పుకార్లు వ్యాపింప చేసేవారికీ, యుద్ధరంగం నుంచి పారిపోయే ద్రోహులకూ మనలో స్థానం లేదు. మన ప్రజలు ఈ దేశభక్తిపూరిత విమోచన యుద్ధంలో మనలను

Edit with WPS Office
బానిసలను చెయ్యాలని చూస్తున్న ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా నిస్వార్థంగా అత్యంత సాహసపూరితంగా పోరాడాలి.

మనం ఉత్పత్తిని యుద్ధావసరాలకు అనుగుణంగా మార్చాలి. శత్రువును నాశనం చేసే లక్ష్యంతో మన వనరులను యుద్ధరంగానికి మళ్ళించాలి. ఎర్ర సైన్యం, నావికా దళాలు, సోవియట్ ప్రజలూ మన భూభాగంలోని ప్రతీ అంగుళం కోసం, మన నగరాలు, పల్లెల కోసం, చివరి నెత్తుటి బొట్టు వరకూ పోరాడాలి. ఎర్ర సైన్యానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలి. ఎర్ర సైన్యానికి అవసరమైనవన్నీ అందేలా చూడాలి. సైనిక దళాలూ ఆయుధ సామగ్రీ త్వరితంగా ప్రయాణించేలా రవాణా అభివృద్ధి చెయ్యాలి. గాయపడిన వారికి వైద్యసహాయం ఏర్పాటు చెయ్యాలి.

ఎర్రసైన్యం తిరోగమించే పరిస్థితులలో రైల్వే సంపదను వెనుకకు పంపించాలి. శత్రువుకు ఒక రైలింజను కాని ఒక బోగీ కాని ఒక రొట్టెముక్క కాని ఒక పైంటు చమురు కాని దొరకకూడదు. రైతులు పశుసంపదను వెనుకకు పంపించాలి. ధాన్యాన్ని వెనుకతట్టుకు పంపించడానికి ప్రభుత్వ సంస్థలకు అందించాలి. విలువైన సంపద ఏదైనా - ధాన్యం గాని చమురు గాని నాన్-ఫెర్రస్ మెటల్ గాని - వెనుకకు తరలించలేని పరిస్థితిలో శత్రువు చేతబడకుండా ధ్వంసం చెయ్యాలి.

శత్రు ఆక్రమిత ప్రాంతాలలో పార్టిజాన్ (గెరిల్లా) దళాలు ఏర్పరచాలి. పార్టిజాన్ దళాలు రోడ్లు, వంతెనలు పేల్చివేయాలి. టెలిగ్రాఫ్, టెలిఫోన్ లైన్లు తెంచి వేయాలి. అడవులు అంటించాలి. ప్రయాణిస్తున్న శత్రు దళాల మీద దాడి చేయాలి. శత్రు సామగ్రినీ గిడ్డంగులనూ నాశనం చెయ్యాలి. ఆక్రమిత ప్రాంతాలలో శత్రువుకూ వాడి తాబేదారులకూ దుర్భర పరిస్థితులను కల్పించాలి. వారిని నిరంతరం వేటాడుతూ వేధిస్తూ నాశనం చెయ్యాలి.

ఈ యుద్ధం రెండు సైన్యాల మధ్య జరిగే సామాన్య యుద్ధం కాదు. జర్మన్ ఫాసిస్టు సైన్యానికీ యావత్ సోవియట్ ప్రజానీకానికీ మధ్య జరిగే యుద్ధం ఇది. ఈ యుద్ధ లక్ష్యం సోవియట్ యూనియన్ మీద పడిన విపత్తును ఎదుర్కోవడం మాత్రమే కాదు, శత్రువు పాదాల క్రింద నలిగిపోతున్న యూరోపు దేశాల ప్రజలందరికీ సహాయపడాలి. ఈ యుద్ధంలో సోవియట్ ప్రజలకు యూరోపు, అమెరికా దేశాల ప్రజలు నమ్మకమైన మిత్రులుగా ఉంటారు. వారే కాదు, జర్మన్ ఫాసిస్టు పాలన క్రింద నలిగి పోతున్న జర్మన్ ప్రజలు కూడా తోడుగా ఉంటారు. సోవియట్ ప్రజల విముక్తి పోరాటం యూరోపు దేశాల ప్రజల విముక్తి పోరాటంతో ఐక్యమవుతుంది.

కామ్రేడ్స్! మన సైన్యం అసంఖ్యాకమైనది. విర్రవీగుతున్న శత్రువు ఇది త్వరలోనే గ్రహిస్తాడు. ఎర్రసైన్యంతో పాటు వేలమంది కార్మికులూ మేధావులూ యుద్ధ రంగానికి తరలుతున్నారు. లక్షలమంది ముందు ముందు చేరుతారు. మాస్కో, లెనిన్ గ్రాడ్ నగరాలలో కార్మికులు నగర రక్షక దళాలను ఏర్పరుస్తున్నారు. అలాంటి రక్షక దళాలు శత్రు దాడి ప్రమాదం పొంచి ఉన్న ప్రతీ నగరంలోనూ ఏర్పడాలి.

మన బలగాలనూ వనరులనూ త్వరితంగా యుద్ధావసరాలకు అనువుగా సమీకరించడానికి స్టేట్ డిఫెన్స్ కమిటీ ఏర్పాటు చెయ్యబడింది.....ప్రజల శక్తియుక్తులన్నీ శత్రువును ఓడించడానికి ఉపయోగపడాలి. విజయం వైపుకు పదండి.....'

ఎర్ర సైన్య తిరోగమనంతో విస్మయపడి, భయభ్రాంతమై, దిక్కు తోచకుండా ఉన్న దేశం మీద స్టాలిన్ ప్రసంగం గొప్ప ప్రభావాన్ని కలిగించింది. స్టాలిన్ దేశం ఎదుర్కొంటున్న పరిస్థితిని ఒక విషాద పరిస్థితిగా వర్ణించలేదు. ఒక భయంకరమైన యుద్ధం అననుకూలమైన పరిస్థితులలో ప్రారంభం కావడం, దేశమూ ప్రజలూ ఎదుర్కుంటున్న విపత్తు - అది ఎంత భయంకరమైనదైనా - అధిగమించరానిది కాదని అతను తన సహజ ధోరణిలో ప్రసంగించడం, బలహీనతను కాక గొప్ప శక్తిని సూచించింది. అతను చేదు నిజం చెప్పాడు. ఆ చేదునిజం చెప్పగానే ప్రజలకు గుండె బరువు తగ్గి కాళ్ళు నేల మీద ఉన్నట్లు అనిపించింది. స్టాలిన్ చిన్న చిన్న వాక్యాలలో దేశానికి యుద్ధ కార్యక్రమం ఇచ్చాడు.....

స్వల్పకాలంలో యూరోపియన్ రష్యాలోని అధికభాగాన్ని జర్మనీ ఆక్రమించింది. జులై రెండో వారానికల్లా జర్మన్ జనరల్స్, వారితో పాటు ప్రపంచంలో చాలా మంది సైనిక ప్రముఖులూ, రష్యాతో యుద్ధం ముగిసిందని భావించసాగారు.

స్టాలిన్ మరణానంతరం రష్యన్ చరిత్రకారులు ఈ తొలి అపజయాలకు ప్రధాన కారణం స్టాలిన్ అనీ, అతని వ్యక్తి పూజ అనీ ప్రచారం చేశారు. ఈ చరిత్రకారుల కథనం ప్రకారం -

Edit with WPS Office

1. 1937 సంవత్సరంలో అనేక వేలమంది సైనిక ఆఫీసర్లకూ జనరల్సుకూ స్టాలిన్ మరణ శిక్ష వేసి చంపివేయడంతో సైన్యం బలహీనపడింది. (1937లో సైన్యంలో ఒక వడపోత కార్యక్రమం జరిగింది. ఈ వడపోత కార్యక్రమంలో జర్మనీ-జపాన్ లతో చేతులు కలిపి సోవియట్ ప్రభుత్వం మీద తిరుగుబాటు చెయ్యాలని కుట్రపన్నిన సైనికాధికారులకు మరణ శిక్ష విధించడం జరిగింది. ఈ విచారణల గురించి స్టాలిన్ గురించిన అనుబంధంలో వివరంగా చూడవచ్చు. స్టాలిన్ 'నేరం' గురించి తెలుసుకోవచ్చు).
2. ఎర్ర సైన్యం అజేయమనే నిరంతర ప్రచారం వలన ఎర్ర సైన్యం తేలికగా శత్రువును ఓడించగలదనే అవాస్తవిక అభిప్రాయం ఏర్పడింది. 'రేపు యుద్ధం వస్తే' లాంటి సినిమాలూ ప్రాపగాండా - అంతా ఎర్ర సైన్యం శత్రువును చిత్తు చిత్తుగా ఓడించగలదనీ, రష్యాతో యుద్ధం జరిగిన పక్షంలో పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికులూ ప్రజలూ వారి వారి ప్రభుత్వాల మీద తిరగబడతారనీ ప్రచారం చెయ్యడం జరిగింది.
3. జర్మనీకి జకోస్లోవేకియా, పోలెండు, ఫ్రాన్స్ లాంటి దేశాల మీద చేసిన యుద్ధాల అనుభవం ఉంది. రష్యన్ ఆఫీసర్లకు అలాంటి యుద్ధానుభవం లేదు. స్పెయిన్ అంతర్యుద్ధ అనుభవాలను సరిగా అధ్యయనం చెయ్యలేదు. అలాగే ఫిన్లాండుతో 1940లో జరిగిన యుద్ధం నుంచి తీసిన గుణపాఠాలను అమలు చెయ్యలేదు.
4. రష్యా-జర్మనీ నిరాక్రమణ సంధి తర్వాత ఊపిరి పీల్చుకోవడానికి వ్యవధి దొరికినా స్టాలిన్ ఈ వ్యవధిని సద్వినియోగం చేసుకుని సైన్యాన్ని తగిన విధంగా బలపరచలేదు.
5. జర్మన్ మెరుపుదాడి తంత్రాన్ని సీరియస్ గా అధ్యయనం చెయ్యకుండా బూర్జువా సిద్ధాంతంగా కొట్టి పడెయ్యడం జరిగింది. పోలెండు, ఫ్రాన్స్ దేశాల మీద జర్మనీ దాడి చేసి వారాలలో వాటిని ఆక్రమించగలిగినా రష్యాలో అటువంటిది జరగడం అసంభవం అని బాధ్యతారహితంగా ఆలోచించడం జరిగింది.
6. రష్యా-జర్మనీ నిరాక్రమణ ఒడంబడిక తర్వాత జర్మనీ వ్యతిరేక ప్రచారం తగ్గించబడింది. రాబోయే యుద్ధంలో ప్రధాన శత్రువు జర్మనీ అని ప్రచారం చెయ్యలేదు.
7. రష్యన్ యుద్ధ తంత్రం ఎదురుదాడి మీదే కేంద్రీకరించింది. విశాలమైన రష్యన్ భూభాగాలను శత్రువు ఆక్రమించగలడని ఊహించలేదు. అందుకు తగిన విధంగా రక్షణ యుద్ధం చెయ్యాల్సిన అవసరాన్ని గుర్తించలేదు.
8. స్టాలిన్ వ్యక్తిపూజ వలన రష్యన్ సైనికాధికారులలో చొరవ పోయిందనీ వారు అతని ఆదేశాల కోసం ఎదురు చూసేవారనీ అతని ప్రభావం వలన జీవితం నుంచీ అనుభవాలనుంచీ కాక సిద్ధాంతాల నుంచి రెడీమేడ్ ఫార్ములాలు వెతికే పద్ధతి అమలులోకి వచ్చిందనీ.....

ప్రధానంగా స్టాలిన్ ను దోషిగా నిరూపించే ప్రయత్నం కనుపిస్తుంది ఈ కథనాలలో. ఈ ఆరోపణల గురించి వివరంగా స్టాలిన్ మీద అనుబంధంలో చూద్దాం.

అకస్మాత్తుగా దాడి ప్రారంభమైనప్పటికీ రష్యన్లు కోలుకుని అత్యంత సాహసంతో అడుగడుక్కూ ప్రతిఘటిస్తూ పోరాడసాగారు. పశ్చిమ దేశాలలో జర్మన్ సైన్యం తమ వెనుక చేరగానే, చుట్టుముట్టగానే, ఆ దేశాల సైన్యం లొంగిపోయేది. రష్యాలో జర్మన్లకు కొత్త అనుభవం ఎదురైంది. వెనుకకు చేరినా, చుట్టుముట్టినా, లొంగిపోక చివరి సైనికుడి వరకూ పోరాడారు రష్యన్లు.

ఈ విషయం గురించి ప్రస్తావిస్తూ 'ది లండన్ టైమ్స్' పత్రిక 1941 జులై 29న సంపాదకీయంలో ఇలా రాసింది: '.... జర్మన్ మోటారు దళాలు తమ శ్రేణిల్లో గండి కొట్టి ముందుకు పురోగమించిన తర్వాత రష్యన్ డివిజన్లు ఆయుధాలు పడేసి లొంగిపోవాలని ఆలోచించవు. చివరి సైనికుడి వరకూ పోరాడుతాయి. శత్రువు ఆధిక్యతను సంపాదించి డివిజన్ ను చిన్నాభిన్నం చేసినా, ముక్క చెక్కలైన సైనిక శకలాలు రైతుల సహాయంతో గెరిల్లా యుద్ధం చెయ్యవచ్చు.....'.

అలాగే జరిగింది. జర్మన్ సైన్యాన్నుంచి తప్పించుకున్న ఎర్ర సైనికులు స్థానిక కమ్యూనిస్టులతో ప్రజలతో కలిసిపోయి అడవుల్లో, చిత్తడి నేలల్లో రక్షణ తీసుకుంటూ తొలి రోజులనుంచీ జర్మన్ సైన్యం వెనుక తట్టులో గెరిల్లా పోరాటం ప్రారంభించారు. జర్మన్ టెలిఫోన్, రవాణా సౌకర్యాల మీద దాడి చేసేవారు. జర్మన్ సైనికుల మీద దాడి చేసి హతమార్చేవారు. జర్మన్ సైన్యం యుద్ధం రంగంలో ఎదురుగా ఉన్న ఎర్ర సైన్యంతో యుద్ధం చెయ్యడం మాత్రమే కాకుండా తన వెనుక తట్టులో, ఆక్రమిత

Edit with WPS Office
ప్రాంతాలలో, గెరిల్లాలతో కూడా తలపడాల్సి వచ్చింది. పశ్చిమ దేశాలతో యుద్ధంలో జర్మనీకి ఎదురుకాని ఈ గెరిల్లా యుద్ధ ప్రమాదం తొలిసారి రష్యాలో అనుభవంలోకి వచ్చింది. ఇలా 'రెండు రంగాలలో' పోరాడవలసి వస్తుందని జర్మనీ ఎప్పుడూ ఊహించలేదు.

యుద్ధరంగంలో కూడా ఊహకందని విధంగా కొత్త రష్యన్ సైన్యాలు కొత్త ఆయుధాలతో జర్మన్లతో తలపడసాగాయి.

'.....ఆర్థిక, రవాణా రంగాలలోనే కాకుండా సైనిక రంగంలో కూడా రష్యన్ల శక్తిని తక్కువ అంచనా వేశామని స్పష్టమవుతోంది. యుద్ధ ప్రారంభంలో రష్యన్ బలగాలు 200 డివిజన్లు అని అంచనా వెయ్యడం జరిగింది. ఇప్పటికే (ఆగస్టు 11, 1941) 360 డివిజన్లను లెక్కించడం జరిగింది. ఒక డజను (రష్యన్) డివిజన్లను నాశనం చేస్తే వెంటనే మరో డజను డివిజన్లు యుద్ధరంగంలోకి వస్తున్నాయి. విశాలమైన యుద్ధ రంగంలో జర్మన్ సైన్యం వెనుకతట్టు బలంగా లేదు. అందువలన రష్యన్లు విరామం లేకుండా చేసే దాడులు తరచు విజయం సాధించగలుగుతున్నాయి.....' - జర్మన్ జనరల్ హాల్డర్.

'.....యుద్ధం ప్రారంభమైన వెంటనే రష్యా గురించి చేసిన ప్రచారమంతా అర్థరహితమైనదని తెలుసుకున్నాను.....' - జర్మన్ జనరల్ రుండెస్టెట్.

సైనిక దళాల విషయంలోనే కాదు, ఆయుధాల విషయంలో కూడా జర్మనీ రష్యాను తక్కువ అంచనా వేసిందని యుద్ధం ప్రారంభం కాగానే జర్మన్లకు స్పష్టం కాసాగింది. యుద్ధ రంగంలో రష్యన్ టి-34 టాంకు ప్రవేశం జర్మన్లను భయాందోళనలకు గురిచేసింది. ఈ టి-34 టాంకు రెండో ప్రపంచ యుద్ధ కాలంలో అత్యుత్తమ టాంకు అని ప్రసిద్ధికెక్కింది. ఇటువంటి టాంకు రష్యన్ల దగ్గర ఉన్నదని జర్మన్లకు యుద్ధరంగంలో దాన్ని చూసే వరకూ తెలియదు. ఈ టాంకు కవచం ఎంత బలంగా ఉందంటే జర్మన్ టాంకు విధ్వంసక శతఘ్నులు దాన్ని నష్టపరచలేకపోయేవి. ఈ టాంకు ప్రవేశంతో జర్మన్లకు 'టాంకు భయం' (Tank terror) పట్టుకుంది. అలాగే ఆకాశంలో కూడా జర్మన్ విమానాలు తొలి నెలల తర్వాత యధేచ్ఛగా సంచరించలేకపోయాయి. తొలిరోజుల్లో భయంకరమైన నష్టాలకు గురయినా, సోవియట్ సైన్యం లాగే సోవియట్ ఫైటర్ విమానాలు కూడా శూన్యంలోంచి అవతరించినట్లు అవతరించి జర్మన్ విమానాలను అడ్డసాగాయి. జర్మన్ సైన్యం వేగంగా పురోగమించడం వలన జర్మన్ విమానాలు దూరాన ఉన్న విమానాశ్రయాలనుంచి రావలసి వచ్చేది. రష్యా భూభాగంలోకి చొచ్చుకుపోయిన కొలదీ తరచు జర్మన్ టాంకు సైన్యాలకు విమాన రక్షణ లభ్యమయ్యేది కాదు.

జనరల్ హాల్డర్ డైరీ ప్రకారం జులై అంతానికి జర్మన్ నష్టాలు 2,13,000. రష్యాలో ఒక నెల యుద్ధంలో జర్మనీ రెండులక్షలకు పైగా సైన్యాన్ని నష్టపోయింది. 1940లో ఫ్రాన్స్ తో సహా యూరోపునంతా ఆక్రమించడానికి జర్మనీ 1,56,000 మంది సైనికులను మాత్రమే నష్టపోయిందన్న విషయాన్ని గుర్తు చేసుకుంటే తొలి రోజులలో రష్యన్ల ప్రతిఘటన ఎంత తీవ్రంగా ఉందో స్పష్టమవుతుంది

స్మోలెన్ స్క్ యుద్ధం

మాస్కో దిశగా పురోగమిస్తున్న జర్మన్ సైన్యాలు జులై 16వ తేదీన స్మోలెన్ స్క్ పట్టణాన్ని చేరాయి. ఈ పట్టణం మాస్కోకు 200 మైళ్ళ దూరంలో ఉంది. ఇంతవరకూ జర్మన్ సైన్యాలు అక్కడక్కడా రష్యన్ సైన్యాల తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటున్నాయి కాని రష్యన్లు స్మోలెన్ స్క్ ప్రాంతంలో విశాలమైన యుద్ధరంగంలో ఒక క్రమపద్ధతిలో ప్రతిఘటించారు. ఈ ప్రతిఘటన వలన జర్మనీ తన ఇష్టం వచ్చినట్లు సైన్యాలను నడిపించే చొరవ కోల్పోయింది. శీతాకాలానికి ముందుగా మాస్కోను ఆక్రమించాలనే జర్మన్ పథకాలను స్మోలెన్ స్క్ పోరాటం వొమ్ము చేసింది. జర్మన్ సైన్యాలను రెండు నెలల పాటు నిలుపు చేసి మాస్కో రక్షణను బలపరచడానికి ఈ యుద్ధం వ్యవధినిచ్చింది.

జర్మన్ సైన్యాలు పురోగమించకుండా అడ్డుకోవాలని స్మోలెన్ స్క్ రక్షణ రేఖ వద్ద రష్యా రిజర్వు సైన్యాలను కేంద్రీకరించింది. స్మోలెన్ స్క్ పట్టణం జర్మన్ల వశమైనా ఆ ప్రాంతంలో తీవ్ర యుద్ధం కొనసాగింది. జర్మన్లు రష్యన్ రక్షణ రేఖను ఛేదించి పురోగమించలేకపోయారు. ఇరు పక్షాలకూ తీవ్ర నష్టాలు కలిగాయి.

ఈ యుద్ధంలో ముఖ్యంగా మూడు అంశాలు రష్యన్లు రెండు నెలలపాటు జర్మన్ సైన్యాన్ని నిలుపు చెయ్యడానికి దోహదం చేశాయి. రష్యన్ సైనికులు దూరంగా ఎక్కడో బెలోరష్యాలోనో

Edit with WPS Office
సరిహద్దులలోనే పోరాడడం లేదు. తమ వెనుక మాస్కో ఉందన్న సంగతి వారు నిలిచి పోరాడేలా చేసింది. రెండోది - రష్యన్లకు టాంకులూ విమానాలూ ఈ యుద్ధంలో తక్కువగా ఉన్నా వారి ఆర్టిలరీ (ఫిరంగులు) జర్మన్ ఆర్టిలరీ కంటే మేలైనది. రష్యన్లు జర్మన్ టాంకులనూ విమానాలనూ మేలైన తమ ఆర్టిలరీతో ఎదుర్కొన్నారు. ఈ యుద్ధ రంగంలోనే ప్రప్రథమంగా రష్యన్లు కాట్యూషా రాకెట్ మోర్టార్లు ప్రయోగించారు. ఇటువంటి ఆయుధం రష్యన్ల దగ్గర ఉన్నట్లు జర్మన్లకు తెలియదు.

'.....జులై 15న మధ్యాహ్నం వేళ మొదటిసారి ఈ కొత్త ఆయుధాన్ని రష్యా ప్రయోగించింది. ఎర్రటి తోకచుక్కల్లాగా ఆకాశంలో ఎగురుతూ కాట్యూషా రాకెట్లు శత్రువు మీద విరుచుకు పడ్డాయి. నేలంతా ప్రేలుళ్ళతో దద్దరిల్లింది. కనులు మిరుమిట్లు గొలుపుతూ తరచు ఒకేసారి అనేక చోట్ల రాకెట్లు పేలుతుంటే అటువంటిదెప్పుడూ చూడని జర్మన్లు భయంతో యుద్ధరంగం నుంచి పారిపోయారు. ఈ రహస్య ఆయుధ ప్రయోగం గురించి యుద్ధ రంగంలో ఉన్న రష్యన్ సైనికులకు కూడా ముందు చెప్పలేదు. అందుచేత వారు కూడా జర్మన్ల మీద కాట్యూషా రాకెట్ల వర్షం కురుస్తున్నప్పుడు ఆశ్చర్యంతో తమ శ్రేణులను వదలి వెనక్కు వచ్చేశారు....' అని ఈ రాకెట్ దాడి గురించి రాశాడు ఒక రష్యన్ జనరల్.

అపజయం అన్నది ఎరుగక యూరోపునంతా గెలిచిన జర్మన్ సైన్యం మొట్టమొదటిసారి పరాజయాన్ని చవి చూసింది. జర్మన్ ఆక్రమణకు గురయిన ప్రాంతం నుంచి దాదాపు 100-150 చదరపు మైళ్ళ ప్రాంతాన్ని తిరిగి రష్యా గెలుచుకుంది. అది తాత్కాలికమే కావచ్చు. చిన్న భూభాగమే కావచ్చు. కాని జర్మన్లకు అది తొలి అపజయం. రష్యన్లకు తొలి విజయం. జర్మన్ జనరల్స్ కథనం ప్రకారం స్మోలెన్ స్క్ యుద్ధంలో జర్మనీ 2,50,000 మంది సైనికుల్ని నష్టపోయింది.

రష్యన్లు స్మోలెన్ స్క్ వద్ద జర్మన్ సైన్యాన్ని రెండు నెలలు నిలుపు చెయ్యడంతో మెరుపుదాడి ప్రభావం ముగిసింది. ఇంక జర్మన్ సైన్యాలను నిలువరించి నాశనం చేసే దీర్ఘకాలిక యుద్ధం ప్రారంభమయింది. జర్మన్ ఆక్రమిత ప్రాంతాలలో పార్టిజాన్లు జర్మన్ రవాణా, సమాచార మార్గాల మీద తీవ్రంగా దాడులు చెయ్యడం మొదలు పెట్టారు. విశాలమైన రష్యన్ వెనుకతట్టులో నూతన సైన్యాల శిక్షణ ప్రారంభమైంది. తూర్పున యురల్స్ లో, జర్మన్ విమానాలు చేరలేని ప్రాంతాలలో, బ్రహ్మాండమైన యుద్ధపరిశ్రమలు ఊపిరి పోసుకుంటున్నాయి. సమీప భవిష్యత్తులో ఈ పరిశ్రమలు రష్యన్ సైన్యానికి అత్యంత ఆధునిక ఆయుధాలూ వాటికి అవసరమైన మందుగుండూ అంతరాయం లేకుండా అందిస్తాయి. ఎర్ర సైన్యం యుద్ధరంగంలో అనుభవం గడించి, సుశిక్షితమైన నూతన సైన్యాలతో, నూతన ఆయుధాలతో జర్మన్లకు సింహస్వప్నమవుతుంది.

తొలివారాలలో వేలాది జర్మన్ టాంకులు దాడి చేసే దృశ్యం రష్యన్లను భయ సంభ్రమాలలో ముంచెత్తేది. వాటిని ఎలా ఆపాలో వారికి తెలిసేది కాదు. ఇంతవరకూ జరిగిన యుద్ధంలో టాంకులను ఎలా ధ్వంసం చెయ్యాలో రష్యన్లు నేర్చుకున్నారు. చేతి బాంబులతోనూ పెట్రోలు సీసాలతోనూ గొప్ప సాహసంతో జర్మన్ టాంకుల మీద దాడి చేసేవారు. సైన్యంలో పార్టీ ప్రచారం కూడా మనో నిబ్బరాన్ని పెంచింది. పార్టీ కార్యకర్తలు ఎర్రసైన్యం ఎందుకు తిరోగమించవలసి వస్తున్నదో, భవిష్యత్తులో ప్రజలందరి సహకారంతో అది ఒక అజేయమైన సైన్యంగా ఎలా రూపుదిద్దుకోబోతోందో వివరించేవారు. నేడు ఎదురులేని శక్తిగా కనుపిస్తున్న జర్మనీ భవిష్యత్తులో ప్రపంచ ప్రజలందరి ఉమ్మడి శత్రువుగా ఒంటరిదై ఎలా నాశనం కాబోతున్నదీ స్పష్టపరచి అంతిమ విజయంలో విశ్వాసం కల్పించేవారు.

స్మోలెన్ స్క్ వద్ద హిట్లర్ వ్యూహానికి సంబంధించిన ఒక సమస్యను ఎదుర్కోవలసి వచ్చింది. మధ్య రంగంలో ఉన్న జర్మన్ సైన్యం మరో 200 మైళ్ళు పురోగమించి మాస్కోను ఆక్రమించాలా లేక ఉత్తర, దక్షిణ సైన్యాలు ప్రధాన దాడులు చెయ్యాలా? - అంటే మాస్కో ప్రధాన లక్ష్యమా లేక ఉత్తరాన లెనిన్ గ్రాడ్, దక్షిణాన యుక్రెయిన్ ప్రధాన లక్ష్యాలుగా ఉండాలా? అనే ప్రశ్న ఎదురైంది. రష్యన్ల తీవ్ర ప్రతిఘటన వలన జర్మన్లకు వ్యూహానికి సంబంధించిన ఈ సమస్య ఎదురైంది. జర్మన్ జనరల్స్ కొందరు దేశ రాజధాని, ముఖ్యమైన కూడలి అయిన మాస్కో లక్ష్యంగా ఉండాలి అని భావించారు. ఆరువారాల యుద్ధం తర్వాత, ఆగష్టు 23న జరిగిన సమావేశంలో హిట్లర్ మాస్కో దిశలో కాకుండా దక్షిణ రంగంలో యుక్రెయిన్, క్రిమియాల మీద దాడి చెయ్యాలని నిర్ణయించాడు. యుక్రెయిన్ వ్యవసాయిక సంపద, పారిశ్రామిక సంపద యుద్ధానికి చాలా అవసరమని అతను భావించాడు. క్రిమియా నుంచి రష్యన్ విమానాలు రుమేనియా చమురు గనుల మీద దాడులు చేసే ప్రమాదాన్ని నివారించేందుకు క్రిమియాను ఆక్రమించాలని నిర్ణయించడం జరిగింది. హిట్లర్ తమ సలహాను కాదని దక్షిణం వైపు తిరగడం తప్పు అనీ, ఆ ఊపులో మాస్కో వైపు జర్మన్ సైన్యాలు పురోగమిస్తే మాస్కో తేలికగా వశమయ్యేదనీ కొందరు

Edit with WPS Office
జర్మన్ జనరల్స్ అంటారు. ఒకవేళ జర్మన్ సైన్యం యుక్రెయిన్ వైపు కాక మాస్కో మీద దాడి చేస్తే మాస్కో వశమయ్యేదా? లెనిన్ గ్రాడ్, స్టాలిన్ గ్రాడ్ లు ఎలా పోరాడాయో గమనిస్తే మాస్కో జర్మన్లకు అంత తేలికగా స్వాగతం చెప్పదు అని అర్థం అవుతుంది. అది బహుశా మరో స్టాలిన్ గ్రాడ్ అయ్యేది.

మార్షల్ ఝుకోవ్ 'జర్మన్లకు మాస్కో మీద దాడి నిలుపు చేసి యుక్రెయిన్ వైపుకు సైనిక బలగాలను మళ్ళించడం కంటే గత్యంతరం లేదు' అన్నాడు. యుక్రెయిన్ కు ఈ సైన్యాలను తరలించకుంటే, మధ్య రంగంలోని జర్మన్ సైన్యాలు మరింత చిక్కుల్లో పడేవి. సుప్రీం సోవియట్ సెప్టెంబరులో యుక్రెయిన్ యుద్ధరంగంలోకి అనేక రిజర్వు సైన్యాలను పంపించింది. యుక్రెయిన్ యుద్ధం లేకుంటే హై కమాండు ఈ రిజర్వు సైన్యాలతో మాస్కో రంగంలో జర్మన్ సైన్యం మీద వెనుకనుంచి, పక్కనుంచి దాడి చేసేది. జర్మన్లు మరిన్ని చిక్కుల్లో పడేవారు, అని కూడా ఝుకోవ్ చెప్పాడు.

జులై మొదటి భాగంలో యుక్రెయిన్ లో రష్యన్లు జర్మన్లను ఆపుచేసి ఎదురు దాడులు చేసి కొన్ని ప్రాంతాలలో సఫలమయ్యారు. కాని జులై అంతంలో జర్మన్లు మెరుపుదాడి మళ్ళీ ప్రారంభించారు. సెప్టెంబరులో యుక్రెయిన్ రాజధాని కీవ్ నగర ప్రాంతంలో జర్మన్లు రష్యన్ సైన్యాలను చుట్టుముట్టి నాశనం చేశారు.

సెప్టెంబరు 9 నాటికి జర్మన్ సైన్యాలు ఉత్తర దక్షిణ దిక్కులలో కీవ్ నగరాన్ని దాటి తూర్పు వైపు పురోగమించడంతో కీవ్ సైన్యాలు చక్రబంధంలో ఇరుక్కున్నాయి. చక్రబంధంలో చిక్కుకున్న రష్యన్ సైన్యాలు బయట పడడానికి ప్రయత్నం చేశాయి కాని అప్పటికే సైనిక యూనిట్ల మధ్య సంబంధాలు తెగిపోయాయి. కొన్ని యూనిట్లు మాత్రమే వలయం నుంచి బయట పడగలిగాయి. జర్మన్ల కథనం ప్రకారం 6,50,00 మంది రష్యన్ సైనికులు పట్టుబడ్డారు. రష్యన్ కథనం ప్రకారం 1,50,541 మంది జర్మన్లకు చిక్కారు.

కృశ్చేవ్ పాలిట్ బ్యూరో సభ్యుడు, యుక్రెయిన్ కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సెక్రటరీ. కీవ్ రంగంలో మిలిటరీ కౌన్సిల్ సభ్యుడు. 'కృశ్చేవ్, బుడెన్నీ (కీవ్ రంగంలో రష్యన్ జనరల్)ల సలహాలు తగిన సమయంలో స్టాలిన్ పాటించి, తూర్పు వైపు తిరోగమనానికి అంగీకరించి ఉంటే ఈ తీవ్ర నష్టం తప్పేది. ఇదంతా స్టాలిన్ మూర్ఖత్వం వలన జరిగింది' అంటూ స్టాలిన్ మరణానంతరం ఈ అపజయానికి స్టాలిన్ ను బాధ్యుడిని చేశారు కృశ్చేవ్ కాల చరిత్ర కారులు.

'అంధకారంలో.....' అనే ఒక కథలో ఒక రచయిత ఈ కీవ్ యుద్ధం గురించి రాశాడు. ఈ కథ కీవ్ యుద్ధం జరిగిన రెండు దశాబ్దాల తర్వాత 1963లో రాసిన కథ.

ఈ కథ 1941 సెప్టెంబరు 17న, ఒక యుక్రెయిన్ గ్రామంలో, రష్యన్ల చుట్టూ జర్మన్ల వలయం బిగుస్తున్నప్పుడు ప్రారంభమవుతుంది. యుద్ధానంతరం ఇరవై ఏళ్ళ తర్వాత ఈ కథ చెబుతున్న కథా నాయకుడు తన అనుభవాలను ఇలా వర్ణిస్తాడు:

'.....చాలా సంవత్సరాల తర్వాత జర్మన్ జనరల్ వాన్ టిపుల్ స్కర్చ్ రాసిన పుస్తకం నేను చదివాను. కీవ్ కు తూరుపు వైపున రష్యన్ సైన్యాలు జర్మన్ సైన్యాలను నిలుపు చేశాయనీ అందుచేత హిట్లర్ పథకం తారుమారయి మాస్కో మీద దాడి చెయ్యడం ఆలస్యం అయిందనీ....

నిజమే! అలాగే జరిగింది. కాని మాకు అదేమీ తెలియదు. ఆ రాత్రులలో జర్మన్ వలయం నుంచి బయట పడడానికి పోరాడుతున్న లక్షలమంది సైనికులకూ, అడవులగుండా చిత్తడి నేలల గుండా జర్మన్ బాంబుల వర్షంలో దారి వెతుకుతున్న సైనికుల గుంపులకూ ఇదంతా ఒక అర్థరహిత విషాదంగా మాత్రమే తోచింది.'

17 రాత్రి కథకుడు రోడ్డు మీద తిరుగుతుంటాడు. అక్కడ రెండు మూడు వేల మోటారు వాహనాలు తగలబడుతుంటాయి. జర్మన్ల చేతిలో పడకుండా వాటిని రష్యన్లు తగలబెట్టారు. ఆ రాత్రి అతను లోఖ్ విస్తా వైపు వెడుతున్న జనరల్ కిర్పోనోస్ ను, మరి పదిమంది ఆఫీసర్ల గుంపును చూశాడు. అక్కడ జర్మన్ వలయం లోంచి బయటపడడానికి దారి దొరుకుతుందని వారి ఆశ.

'.....జనరల్ కిర్పోనోస్ తనను వెనుకకు తరలించడానికి అతి కష్టం మీద పంపించిన విమానం లోకి ఎక్కడానికి నిరాకరించి అక్కడే తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్న వార్త చాలా సంవత్సరాల తర్వాత విన్నాను. ఈ సంఘటన ఆ రాత్రి కాని, ఆ తరువాత రాత్రి కాని జరిగింది. అతన్ని కీవ్ లోనే సమాధి చేశారు. అతనితో పాటు యుక్రెయిన్ కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ రెండవ సెక్రటరీ కూడా మరణించాడు...'

Edit with WPS Office

మరునాడు ఉదయం కథకుడూ ఇంకో ముగ్గురు రష్యన్ సైనికులూ జర్మన్ టాంకులు సమీపించడం చూసి పొదల్లో దాక్కుంటారు. కాని జర్మన్లు వారిని చూసి మరతుపాకులతో కాల్చడం ప్రారంభిస్తారు. ఒక ఎర్ర సైనికుడు మరణిస్తాడు. మిగిలిన ముగ్గురూ లొంగిపోతారు. కథకుడు ఆత్మహత్య చేసుకుందామా అనుకుంటాడు. ఒక జర్మన్ సైనికుడు వాళ్ళను చాచి లెంపకాయ కొట్టి జేబులు ఖాళీ చేస్తాడు. వెనుక నుంచి టాంకు తరుముతుండగా వాళ్ళను కోవలి అనే గ్రామానికి పరిగెట్టిస్తారు. ఆ రోజు సాయంకాలానికి అక్కడ 10,000మంది ఖైదీలను చేరుస్తారు జర్మన్లు.

మరునాడు ఉదయం నల్లని యూనిఫాం ధరించిన 15 మంది సైనికులు వచ్చారు. వారి టోపీల మీద పుర్రె గుర్తు ఉంటుంది. కమిస్సార్లూ, కమ్యూనిస్టులూ, యూదులూ (జ్యూ లు) ముందుకు రావాలని అదేశిస్తారు. మూడు వందల మంది ముందుకు వస్తారు. పై దుస్తులు తొలగించి వారినందరినీ వరుసగా నిలబెడతారు. ఇంకా కొంతమంది కమ్యూనిస్టులూ కమిస్సార్లూ దాగి ఉన్నారనీ వారి గురించి తెలిపిన వారికి వారి దుస్తులు, వస్తువులు ఇచ్చి వేయబడతాయని ప్రకటిస్తారు. పదివేల మందిలో ఒకటి రెండు డజన్ల ద్రోహులు ఉండడం చూస్తూనే ఉంటాం, వారి సంఖ్య ఎక్కువేమీ ఉండదు, కాని అటువంటి వారు ఉంటారు, ఎప్పుడూ ఉంటూనే ఉంటారు, అంటాడు కథకుడు. చివరకు నాలుగు వందలమంది చిక్కుతారు. తడవకు పదిమంది చొప్పున తీసుకు వెళ్ళి వారి సమాధులు వారి చేతనే తవ్విస్తారు. నాలుగు వందల మందిలోనూ ఒక్కడు తప్ప అంతా మౌనంగా జర్మన్ గుళ్ళకు కూలిపోతారు. ఒకడు మాత్రం గొల్లుగొల్లున ఏడుస్తూ జర్మన్ సైనికుల పాదాల మీద పడి 'నన్ను చంపొద్దు. నా తల్లి యుక్రెయిన్' అని వేడుకుంటాడు. ఒక సైనికుడు వాడి మొహం మీద పళ్ళూడేలా తంతాడు. వాడు కాళ్ళావేళ్ళాపడి బతిమాలుతుంటే కాల్చెయ్యడానికి ఈడ్చుకు పోతారు.

మిగిలిన ఖైదీలను జర్మన్లు ఒక కేంపు నుంచి మరొక కేంపుకు తరలిస్తారు. నడకలో వెనుకబడ్డవాళ్ళనీ నడవలేక కూలిపోయిన వాళ్ళనీ దారిపొడుగునా కాల్చివేస్తుంటారు.....మిగిలిన కథంతా ఆకలి.....చలి.....అవమానాలు....కథాంతాన కథకుడూ మరి ఇద్దరు తప్పించుకోగలుగుతారు.

ఇది సాహిత్యంలో కీవ్ ఓటమి విషాద గాథ.

యుద్ధానంతరం కీవ్ అపజయం గురించి అనేక రకాల కథలు ప్రచారంలోకి వచ్చాయి. కీవ్ నుంచి రష్యన్ సైన్యాల ఉపసంహరణను స్టాలిన్, మిలిటరీ కౌన్సిల్ (అంటే కృశ్చేవ్) ఇద్దరూ వ్యతిరేకించారనీ ఇద్దరూ చివరి వరకూ కీవ్ ను వదలి పెట్టకూడదనే ఆలోచనతోనే ఉన్నారనీ మార్షల్ ఝుకోవ్ చెప్పాడు. కీవ్ ను వదలి ఎర్రసైన్యం సకాలంలో తిరోగమించాలని తను పదే పదే చేసిన విజ్ఞప్తులను స్టాలిన్ తిరస్కరించాడని చెబుతూ '.....ఈ సారి కూడా స్టాలిన్ నా సలహా వినలేదు. తను ఇప్పుడే కృశ్చేవ్ నూ (జనరల్) కిర్పోనోస్ నూ సంప్రదించాననీ వారు ఎట్టి పరిస్థితులలోనూ కీవ్ ను వదలిపెట్టకూడదనే అంటున్నారనీ చెప్పాడు.....' - (G. Zhukov, Reminiscences and Reflections, Vol. I, P. 388-389).

ఈ కీవ్ యుద్ధం గురించి అలెగ్జాండర్ వెర్త్ ఇలా రాశాడు -'.....ఎంతకాలం సాధ్యమైతే అంతకాలం కీవ్ ను వదలి పెట్టకూడదనే స్టాలిన్ నిర్ణయం బహుశా సరియైనదేమో అనిపిస్తోంది. కృశ్చేవ్ కాలంలో స్టాలిన్ ను ఈ అపజయానికి బాధ్యుడిని చేస్తూ నిందించిన చరిత్ర కూడా యుక్రెయిన్ లో ఈ జర్మన్ విజయం హిట్లర్ టైం టేబుల్ ను తలకిందులు చేసిందని రాసింది. జర్మన్ చరిత్రకారుల అభిప్రాయం కూడా ఇదే. కొంతమంది ప్రముఖ జర్మన్ జనరల్స్ అభిప్రాయం ప్రకారం కీవ్ యుద్ధంలో వృధా అయిన కాలం, శీతాకాలం ముందే మాస్కోను ఆక్రమించాలనే జర్మన్ హై కమాండు పధకాన్ని తలక్రిందులు చేసింది. కీవ్ యుద్ధాన్ని తూరుపు యుద్ధంలో వ్యూహరీత్యా ఘోరమైన పొరపాటుగా జనరల్ హాల్డర్ వర్ణించాడు. జనరల్ గుడెరియన్ ఈ యుద్ధాన్ని ఎత్తుగడల రీత్యా ఘన విజయంగా వర్ణించినా, వ్యూహరీత్యా ఈ విజయం వలన జర్మనీకి ఏదైనా లాభం చేకూరిందా అని సందేహం వ్యక్తపరిచాడు.....'- (Alexander Werth, Russia At War, P. 203-204).

దక్షిణాన జర్మనీ గొప్ప విజయం సాధించింది. శీతాకాలం రాక ముందే మాస్కోను ఆక్రమించాలని సన్నాహాలు ప్రారంభించింది. మాస్కో యుద్ధం గురించి తెలుసుకునే ముందు, అంతిమంగా రష్యన్ విజయానికి దోహదం చేసిన అతి కీలకమైన విషయం, తూర్పు వైపు పరిశ్రమల తరలింపు, గురించి తెలుసుకుందాం.

Edit with WPS Office

తూర్పు వైపు పరిశ్రమల తరలింపు

యుద్ధం ప్రారంభమైన వెంటనే రష్యా వ్యూహాత్మక రక్షణ (Strategic defence) విధానాన్ని చేపట్టింది. ఈ విధానం యొక్క ముఖ్య అంశాలు - 1) నాజీ సైన్యాలను రక్షణ రేఖల దగ్గర ప్రతిఘటించి వాటి పురోగమన వేగాన్ని తగ్గించి, వెనుకతట్టు నుంచి సైన్యాలను యుద్ధరంగానికి తరలించడానికీ రిజర్వు సైన్యాలను సమకూర్చుకుని ప్రధానమైన రంగాల్లో వాటిని మోహరించడానికీ వ్యవధి సంపాదించడం 2) శత్రువును నష్ట పరుస్తూ, వేధిస్తూ, బలహీనపరచడం 3) లోలోపలకు చొచ్చుకు వస్తున్న శత్రువుకు దూరంగా జనాభానూ పరిశ్రమలనూ లోతట్టు ప్రాంతాలలోకి తరలించి, పరిశ్రమలను యుద్ధ అవసరాలకు అనుగుణంగా మార్చి యుద్ధ సామగ్రి ఉత్పత్తిని వేగంగా పెంచడానికి పార్టీ, ప్రభుత్వమూ వేసిన ప్రణాళికను అమలు జరపడం 4) సైనిక శక్తిని క్రమంగా పెంచుకుని అనుకూల పరిస్థితులలో బలమైన సైన్యాలతో ఎదురుదాడి చేసి శత్రువును ఓడించడం.

యుద్ధం చెయ్యాలంటే బలమైన, సరియైన పద్ధతిలో రూపొందించిన వెనుకతట్టు అవసరమనీ, ఈ వెనుకతట్టు యుద్ధరంగానికి నిరంతరాయంగా అవసరమైన పరిమాణాలలో ఆయుధాలు, ఆహారం, శిక్షణ పొందిన సైన్యాలను అందించేలా ఆర్థిక రంగాన్ని యుద్ధావసరాలకు అనుగుణంగా తీర్చి దిద్దాలన్న లెనిన్ సూచనలను దృష్టిలో ఉంచుకుని పార్టీ తన ప్రణాళికను రూపొందించింది. యుద్ధావసరాలకు అనుగుణంగా మందుగుండు ఉత్పత్తిని అధికం చేసే ప్రణాళిక జూన్ 23న అమలు లోకి వచ్చింది. టాంకులు, గన్నులు, విమానాలూ తదితర యుద్ధ సామగ్రి ఉత్పత్తిని అధికం చెయ్యాలని నిర్ణయించడం జరిగింది. యుద్ధం ప్రారంభమైన వారం రోజుల తర్వాత ఆర్థిక రంగాన్ని యుద్ధావసరాలకు అనుగుణంగా మార్చే ప్రణాళికను ప్రభుత్వం అమలులో పెట్టింది.

రవాణా రంగంలోనూ పరిశ్రమలలోనూ పునర్నిర్మాణం ప్రారంభమైంది. కార్మికులనూ వనరులనూ యుద్ధ పరిశ్రమలలోకి మళ్ళించారు. వ్యవసాయరంగాన్ని కూడా యుద్ధావసరాలకు అనుగుణంగా మార్చారు. ఇంతవరకూ వినియోగ వస్తువులను తయారు చేస్తున్న వేల పరిశ్రమలు సైనిక సామగ్రిని, మందుగుండును తయారు చెయ్యడం ప్రారంభించాయి. ఇంజినీరింగ్, టూల్స్ పరిశ్రమలు టాంకులు, విమానాల ఉత్పత్తి చెయ్యడానికి అనువుగా మారాయి. ఉక్కు ఫాక్టరీలు టాంకుల నిర్మాణానికి అవసరమైన ఉక్కు ఉత్పత్తి చెయ్యసాగాయి. రేడియో, విద్యుత్ పరికరాల పరిశ్రమలు టాంకు ఇంజిన్లు, జనరేటర్లు, రేడార్లు మొదలైనవి ఉత్పత్తి చెయ్యసాగాయి. చమురు రిఫైనరీలు విమానాలకూ టాంకులకూ నౌకలకూ అవసరమైన ఇంధనం తయారు చెయ్యడం ప్రారంభించాయి. గడియారాల ఫాక్టరీలు డిటొనేటర్లు తయారు చెయ్యడం మొదలు పెట్టాయి.

సైనికంగా చాలా ముఖ్యమైన విషయం ఏమిటంటే యుద్ధానికి ముందు రష్యా తూర్పు ప్రాంతాలలో ఇంజినీరింగ్, నాన్-ఫెర్రస్ మెటల్, ఉక్కు ఫాక్టరీలు, అల్యూమినియం ఫాక్టరీలు, చమురు, రసాయన పరిశ్రమలు, జల విద్యుత్తు కేంద్రాలూ పెద్ద ఎత్తున నిర్మించడం. జర్మనీ పశ్చిమ రష్యాను ఆక్రమించినప్పుడు అక్కడ నుంచి తరలించబడిన ఫాక్టరీలు తూర్పు రష్యాలోని ఫాక్టరీలతో కలిసి పోయి బ్రహ్మాండమైన యుద్ధ పరిశ్రమలుగా రూపొందాయి. యుద్ధం ప్రారంభం కావడానికి ముందే రష్యా ప్రతీ ప్రముఖ ఉత్పత్తి కేంద్రానికీ ఒక 'కవల'ను నిర్మించే విధాన్నాన్ని అనుసరించింది. ఉదాహరణకు కకాసస్ లో బాకూ పెద్ద చమురు ఉత్పత్తి కేంద్రం. యుద్ధం వచ్చిన పక్షంలో ఈ బాకూ చమురు గనులు జర్మన్ విమాన దాడులకు గాని, ఆక్రమణకు గాని గురి కావచ్చుననే ఉద్దేశంతో సోవియట్ ప్రభుత్వం దేశానికి మరో మూల, వోల్గా-యురల్ ప్రాంతంలో మరో 'బాకూ'ను నిర్మించింది. ఈ రెండవ బాకూ ఉత్పత్తి మూడవ పంచవర్ష ప్రణాళిక తొలి సంవత్సరాలకు మొత్తం చమురు ఉత్పత్తిలో (6.5 శాతం నుంచి) 21.8 శాతానికి పెరిగింది. ఎంత శక్తివంతమైన బాంబరు విమానాలైనా ఈ రెండో బాకూను చేరలేవు. సోవియట్ పరిశ్రమలూ వ్యవసాయమూ కూడా క్రమంగా తూరుపు వైపున అభివృద్ధి చెందాయి. మాస్కో, లెనిన్ గ్రాడ్ ప్రాంతాలు పారిశ్రామికంగా ముఖ్యమైనవే అయినా కేవలం వాటి మీదే ఆధారపడవలసిన అవసరం తప్పింది. సైబీరియాలోని యురల్స్ ప్రాంతం ప్రాణప్రదమైన పరిశ్రమల కేంద్రంగా మారింది.

జర్మన్ సైన్యాలు ముందుకు చొచ్చుకు వస్తున్న కొలదీ రష్యా విలువైన ప్రాంతాలను కోల్పోసాగింది. యుద్ధం ప్రారంభమైన తొలిదినాలలో సరిహద్దుకు సమీపంలో ఉన్న రీగా, మిన్స్క్ పారిశ్రామిక

Edit with WPS Office
ప్రాంతాలను రష్యా కోల్పోయింది. అతి ముఖ్యమైన పారిశ్రామిక ప్రాంతాలను జర్మనీ ఆక్రమించింది. విలువైన సంపద జర్మనీ చేతుల్లోకి పోయింది. ఉక్కు, ముడి ఇనుము, విద్యుత్తు ఉత్పత్తీ గణనీయంగా తగ్గిపోయింది. మరిన్ని పారిశ్రామిక ప్రాంతాలు శత్రు ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. లిథుయేనియా, లాత్వియా, పశ్చిమ యుక్రెయిన్, బెలో రష్యాలలో చెప్పుకోదగిన పరిశ్రమలు లేవు కాని మధ్య, తూర్పు యుక్రెయిన్ లోనూ, మాస్కో, లెనిన్ గ్రాడ్ ప్రాంతాలలోనూ కీలక పరిశ్రమలున్నాయి. యుద్ధం ప్రారంభం కాగానే లెనిన్ గ్రాడ్, మాస్కో, ఖార్కోవ్, డోన్బాస్ పారిశ్రామిక ప్రాంతాలకు యుద్ధ ప్రమాదం ఉందని నాయకత్వం గుర్తించింది.

యుద్ధంలో జర్మనీ యూరోపియన్ రష్యా భూభాగాన్ని ఆక్రమిస్తే రష్యాకు చాలా ప్రమాదకరంగా పరిణమిస్తుందని భావించిన స్టేట్ డిఫెన్స్ కమిటీ యుద్ధరంగానికి వేల మైళ్ళ దూరంలో తూర్పు వైపున రెండవ పారిశ్రామిక రక్షణ రేఖను సిద్ధపరచాలని జులై 4న ఒక నిర్ణయం తీసుకుంది. జర్మన్ ఆక్రమణ ప్రమాదానికి గురవుతున్న మధ్య, పశ్చిమ యూరోపు రష్యానుండి తూర్పు వైపుకు కీలక పరిశ్రమలను, ముఖ్యంగా యుద్ధ పరిశ్రమలను, తరలించాలనీ, ఇలాతరలించిన పరిశ్రమలను ఏషియా రష్యాలో ఉన్న పరిశ్రమలతో కలిపివేసి ఉత్పత్తిని యుద్ధావసరాలకు అనుగుణంగా వేగంగా పెంచాలనీ నిర్ణయించింది. 1941 జులై-నవంబరు మధ్య కాలంలో 1360 పెద్ద యుద్ధ పరిశ్రమలతో సహా 1523 పరిశ్రమలను అతి తక్కువ కాలంలో తూర్పుకు తరలించారు. ఈ ఫాక్టరీలను తరలించడానికి 15 లక్షల రైల్వే వేగన్లు కావలసి వచ్చాయి. తూర్పుకు వెళ్ళే రైళ్ళు ఫాక్టరీలనూ కార్మికులనూ ప్రజలనూ తూర్పుకు తరలిస్తుంటే, పడమటి దిక్కుకు వెళ్ళే రైళ్ళు యుద్ధ సామగ్రినీ ఆయుధాలనూ సైన్యాన్నీ రాత్రీపగలూ నిరంతరాయంగా తరలిస్తుండేవి.

ప్రపంచం కనీ వినీ ఎరుగని విధంగా సోవియట్ ప్రభుత్వం అనేక కష్టనష్టాలకోర్చి కీలక పరిశ్రమలను జర్మన్ ప్రమాదం ఎదురైన ప్రాంతాలనుంచి సైబీరియా, యురల్స్ ప్రాంతాలకు తరలించడం విస్మయపరిచే ఒక గొప్ప చర్యగా చరిత్రకారులు వర్ణిస్తారు.

తూర్పు వైపున యుద్ధ పరిశ్రమల ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం రెండు కార్యక్రమాలు చేపట్టింది. యుద్ధానికి ముందే తూర్పున నిర్మాణంలో ఉన్న పరిశ్రమలను వేగంగా పూర్తి చెయ్యడం; తరలించబడిన పరిశ్రమలు అతి తక్కువ వ్యవధిలో ఉత్పత్తి ప్రారంభించేలా చూడడం.

శత్రు ప్రమాదం ఏర్పడిన ప్రాంతాల నుండే కాక యుద్ధరంగానికి దూరంగా ఉన్న ప్రాంతాల నుంచి కూడా పరిశ్రమలను యురల్స్, వోల్గా, పశ్చిమ సైబీరియా, మధ్య ఏషియాలకు తరలించడం తొలి దినాలలోనే ప్రారంభమైంది. జులై 2న, శత్రువు ఇంకా వందల మైళ్ళదూరంలో ఉండగానే, పశ్చిమ యుక్రెయిన్ లో మారిపోల్ లో ఉన్న ఆర్మర్డ్ ప్లేటు మిల్లును మాగ్నిటోగోర్స్క్ కు తరలించాలని నిర్ణయించడం జరిగింది. మరుసటి రోజు లెనిన్ గ్రాడ్, మాస్కో, తులాల నుంచి 26 ఆయుధ ఫాక్టరీలను తరలించాలని నిర్ణయించారు. ఆ వారంలోనే లెనిన్ గ్రాడ్ నుంచి కిరోవ్ ఫాక్టరీని, ఖార్కోవ్ నుంచి ట్రాక్టర్ ప్లాంటును తూర్పుకు తరలించాలని నిర్ణయించడం జరిగింది. టాంకు ఇంజిన్లు తయారు చేసే మరో ఫాక్టరీని ఖార్కోవ్ నుంచి యురల్స్ లో చెలియాబిన్ స్క్ కు తరలించాలని నిర్ణయించారు.

అదే సమయంలో కొన్ని పరిశ్రమలను యుద్ధావసరాలకు అనుగుణంగా మార్చాలని కూడా నిర్ణయించడం జరిగింది. గోర్కీ ఆటోమొబైల్ ఫాక్టరీలో టాంకు ఇంజిన్లు తయారు చెయ్యాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ రెండు నిర్ణయాలూ వోల్గా-యురల్స్ లలో పెద్ద ఎత్తున టాంకులను ఉత్పత్తి చెయ్యడానికి దోహదం చేశాయి. విమాన పరిశ్రమకు సంబంధించి కూడా అటువంటి చర్యలు తీసుకోబడ్డాయి.

తూర్పు యుక్రెయిన్ కు జర్మన్ ప్రమాదం పెరుగుతున్న కొలదీ ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా ఝురోఝీ ఉక్కు మిల్లు లాంటి పెద్ద పరిశ్రమలన్నింటినీ తరలించాలని నిర్ణయించారు. ఆగస్టు 7న నీపో పెట్రోవస్ నుంచి బ్రహ్మాండమైన ట్యూబ్ రోలింగ్ మిల్లును తరలించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. మిల్లు యంత్రాల భాగాలతో మొదటి రైలు ఆగస్టు 9న బయలు దేరింది. ఆఖరి బండి సెప్టెంబరు 6న యురల్స్ చేరింది. డిసెంబరు 24న తూర్పున ఈ మిల్లు తిరిగి ఉత్పత్తి ప్రారంభించింది.

ఆగస్టులో అనేక పరిశ్రమలు తరలించబడ్డాయి. తరచు జర్మన్ విమాన దాడులకు గురవుతూ ఫాక్టరీలను విప్పి రైలు వేగన్లకు ఎక్కించి తరలించడం జరిగింది. ఈ పని నిర్విరామంగా 24 గంటలూ జరిగింది. ఝుపోరోస్తాల్ ఉక్కు మిల్లు భాగాలు 50,000 టన్నులు. ఈ ఫాక్టరీని తరలించడానికి 8000 రైల్వే వేగన్లు కావలసి వచ్చాయి. స్థానిక కార్మికులకు తోడుగా పరిసర గని కార్మికులు కూడా ఈ ఫాక్టరీని

Edit with WPS Office
విప్పి తరలించడంలో సహాయం చేశారు.

జర్మన్లు అతి వేగంగా ఆక్రమించిన ప్రాంతాలలోని కొన్ని ఫాక్టరీలను తరలించడానికి వ్యవధి లేకపోయింది. అటువంటి ప్రదేశాలలో ఫాక్టరీలు జర్మన్ల చేతిలో పడకుండా ధ్వంసం చేయడం జరిగింది. తిరోగమిస్తున్న రష్యన్లు జర్మన్లు ఉపయోగించడానికి వీలు లేకుండా నీపర్ డాంను ధ్వంసం చేశారు. జూన్-అక్టోబరుల మధ్య యుక్రెయిన్ నుంచి 283 భారీ పరిశ్రమలనూ 136 చిన్న పరిశ్రమలనూ తరలించారు.

బెలోరష్యాలో తొలిదినాల అయోమయ స్థితిలో పరిశ్రమలను తరలించడం చాలా కష్టమైంది. రైల్వేలు 24 గంటలూ జర్మన్ల విమాన దాడికి గురవుతుండేవి. అయినా ఇక్కడ నుంచి కూడా 100 పరిశ్రమలను తరలించారు.

లెనిన్ గ్రాడ్ రంగంలో జర్మన్లు లూగాను సమీపించిన తర్వాత లెనిన్ గ్రాడ్ నుంచి కార్మికులతో సహా ఫాక్టరీలను తరలించడం ప్రారంభమైంది. కాని 92 యుద్ధ పరిశ్రమలనూ, కిరోవ్, ఇజోరా ఫాక్టరీలలోని కొన్ని వర్కుషాపులనూ మాత్రమే తరలించగలిగారు. జర్మన్లు రైల్వే లైనులను తెంచివేయడంతో మిగిలిన పరిశ్రమలను తరలించడానికి అవకాశం లేకపోయింది.

మాస్కో నుంచి పరిశ్రమల తరలింపు అక్టోబరు 10 ప్రాంతంలో జర్మన్ ప్రమాదం తీవ్రమైనప్పుడు పెద్ద ఎత్తున ప్రారంభమైంది. నవంబరు అంతానికి 2,10,000 మంది కార్మికులతో సహా 498 పరిశ్రమలను తరలించడం జరిగింది. ఈ తరలింపుకు 70 వేల రైల్వే వేగన్లు కావలసి వచ్చాయి.

తరలించబడిన కొన్ని పరిశ్రమలను స్థానిక పరిశ్రమలతో విలీనం చెయ్యడం జరిగింది. యుక్రెయిన్ నుంచి తరలించబడ్డ టాంకు ఫాక్టరీ స్థానికంగా ఉన్న పరిశ్రమలతో విలీనమై స్టాలిన్ యురల్స్ టాంకు వర్క్స్ అనే పేరుతో అతి పెద్ద టాంకు ఫాక్టరీగా రూపొందింది. లెనిన్ గ్రాడ్ నుంచి తరలించబడిన కిరోవ్ ప్లాంటులోని కొన్ని విభాగాలూ, ఖార్కోవ్ నుంచి తరలించబడిన ఖార్కోవ్ డీసెల్ వర్క్స్ ఫాక్టరీ, స్థానికంగా ఉన్న చెలియబిన్ స్క్ ట్రాక్టర్ ప్లాంటుతో కలిపి వేయబడి 'టాంకో గ్రాద్' గా మారింది. లెనిన్ గ్రాడ్ నుంచి ఫాక్టరీ తరలి వచ్చిన నెలలోపునే టాంకు ఇంజినీర్లు టి-34 టాంకులు తయారు చేసి సైన్యానికి అందించారు. కొన్ని భారీ పరిశ్రమలను ఒకే యూనిటుగా తరలించడం వీలుపడలేదు. మాస్కో బాల్ బేరింగు ప్లాంటును విభాగాలు చేసి మూడు ప్రదేశాలకు తరలించడం జరిగింది. ఇదంతా అనేక రకాల సమస్యలను సృష్టించింది.

రష్యన్ కార్మిక వర్గం ఎటువంటి సమస్యలను ఎదుర్కొంటూ పరిశ్రమలను తరలించి అతి తక్కువ వ్యవధిలో కొత్త ప్రదేశాలలో ఉత్పత్తి ప్రారంభించిందో ఒక ఉదాహరణ. యుక్రెయిన్ నుంచి కార్మికులతో సహా స్వెర్ ద్లోవస్క్ తరలివస్తున్న ఒక యుద్ధ పరిశ్రమకు భవనాలను రెండు వారాలలో సిద్ధం చెయ్యాలని అదేశాలు వచ్చాయి. ఫాక్టరీ భవనం పదిహేను రోజులలో తయారు కావాలి. ఒక గంట కూడా ఆలస్యం కావడానికి వీలులేదు. అప్పటికి చలి తీవ్రంగా ఉంది. ఆదేశాలు వచ్చిన వెంటనే యురల్స్ ప్రజలు - విద్యార్థులు, ఉపాధ్యాయులు, గృహిణులు, టైపిస్టులు, ఎక్కౌంటెంట్లు - అందరూ గొడ్డళ్ళు, పారలు, పలుగులు తీసుకు వచ్చారు. సైబీరియన్ మంచులో భూమి ఉక్కులా గట్టి పడుతుంది. పలుగులు, గొడ్డళ్ళు త్రవ్వలేకపోయాయి. మందుపాతర పెట్టి పేల్చి పునాదులు వేశారు. చెట్లకు దీపాలు వేలాడ దీసి రాత్రంతా పని చేసేవారు. కాళ్ళూ చేతులూ మంచుదెబ్బకు వాచిపోయేవి. అయినా పని ఆపేవారు కారు. చెక్క పెట్టెల మీద ఛార్టులూ, బ్లూ ప్రింటులూ పరిచి భవనాలు ఎలా కట్టాలో చూస్తూ మంచు తుఫానుల్లో పని చేసేవారు. వందల ట్రక్కులు నిర్మాణ సామగ్రిని చేరవేశాయి. పన్నెండవ రోజున ఈ కొత్త భవనాలలోకి మంచుతో కప్పబడిన యంత్రాలు చేరసాగాయి. రెండు రోజుల తర్వాత అక్కడ ఉత్పత్తి ప్రారంభమైంది.

యుద్ధ కాలంలో అత్యవసరమైతే తప్ప ఉక్కు, సిమెంటు ఉపయోగించకూడదనీ, సాధ్యమైనంత వరకూ స్థానికంగా లభించే వస్తువులు ఉపయోగించాలనీ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. అందుచేత ఈ భవనాలు చాలా మటుకు స్థానికంగా దొరికే కలపతోనే నిర్మించబడ్డాయి. ఈ విధంగా కలపతో చాలా పెద్ద పరిశ్రమల భవనాలు కూడా పదిహేను, ఇరవై రోజుల్లో నిర్మించబడేవి. ఒక్కొక్కసారి పైన కప్పు ఇంకా పూర్తి కాకుండానే యంత్రాలు పని చెయ్యడం ప్రారంభించేవి. ఉష్ణోగ్రత సున్నాకి నలభై డిగ్రీల దిగువకు పడిపోయినప్పుడు కూడా చలిలో కార్మికులు అలాగే రాత్రింబవళ్ళు పని చేసేవారు. ఫాక్టరీ యంత్రాలను మోసుకు ఆఖరి బండి చేరిన తర్వాత పధ్నాలుగు రోజులలో మొట్టమొదటి మిగ్ విమానం ఆ ఫాక్టరీ నుంచి బయటకు వచ్చింది. అదే విధంగా ఖార్కోవ్ ట్రాక్టర్ వర్క్స్ నుంచి కార్మికుల ఆఖరి జట్టు

Edit with WPS Office
అక్టోబరు 19న బయలు దేరింది. డిసెంబరు 8న వారు యురల్స్ లో కొత్త ఫాక్టరీలో 35 టి-34 టాంకులు ఉత్పత్తి చేసి వెంటనే యుద్ధరంగానికి పంపించారు.

శీతాకాలంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ, తినడానికి తిండి లేకపోయినా, ఉండడానికి వసతి లేకపోయినా, రష్యన్ కార్మికులు పరిశ్రమలను తరలించడంలో, అతి తక్కువ కాలంలో తూర్పు వైపున పెద్ద ఎత్తున టాంకులు, విమానాలు, ఫిరంగులు తదితర ఆయుధాలూ, వాటికి అవసరమైన మందుగుండూ ఉత్పత్తి చెయ్యడంలో గొప్ప దేశభక్తినీ దీక్షనూ ప్రదర్శించారు. చాలా ప్రదేశాలలో కార్మికుల జీవన పరిస్థితులు భయంకరంగా ఉండేవి. సరియైన తిండి ఉండేది కాదు. రోజుకు పధ్నాలుగు, పదిహేను గంటలు పని చేసేవారు. తరచు మూడు నుంచి ఆరు మైళ్ళు నడిచి వచ్చి, పన్నెండు-పదిహేను గంటలు పని చేసి, తిరిగి నడిచి వెళ్ళేవారు. చాలామంది కార్మికులు అలా పని చేస్తూ పని చేస్తూ మరణించేవారు. యుద్ధరంగంలో తమ తండ్రులూ కొడుకులూ కూతుళ్ళూ - తమ వారంతా అతి దుర్భర పరిస్థితులలో పోరాటం సాగిస్తున్నారనీ వారికి అత్యవసరమైన టాంకులు, విమానాలు, ఆయుధాలూ అతి త్వరగా అందించాలనీ దీక్షతో కార్మికులు శ్రమపడేవారు.

ఈ పరిశ్రమల తరలింపులోనూ, తూర్పున ఉన్న పరిశ్రమలతో విలీనం చెయ్యడంలోనూ, అనేక సమస్యలు ఎదురయ్యేవి. కార్మికులందరినీ వారి ఫాక్టరీలతో పాటు ఒకేసారి తరలించడం కొన్ని సమయాల్లో వీలు పడేది కాదు. వివిధ కారణాల వలన కొన్ని ఫాక్టరీలను తరలించినప్పుడు 40-50 శాతం కార్మికులు మాత్రమే ఫాక్టరీతో పాటు వెళ్ళేవారు. చెలియాబిన్ స్క్ లాంటి రైల్వే జంక్షన్లలో రైళ్ళు నిలిచి పోయేవి. శీతాకాలం చలిలో కార్మికులు దారిలో అనేక కష్టాలు పడేవారు. అలాగే ముడి సరుకులకు కూడా తీవ్ర కొరత ఏర్పడింది. మాంగనీసు, మాలిబ్ డెనమ్ ఉత్పత్తి జరిగే ప్రాంతాన్ని జర్మన్లు ఆక్రమించడంతో ఈ ముడి ఖనిజాల కొరత ఏర్పడింది. యురల్స్ లోనూ, కజకస్తాన్ లోనూ కొత్త మేంగనీసు గనులు తవ్వాల్సి వచ్చింది. అక్కడ వాతావరణ పరిస్థితులు గని కార్మికులకు దుర్భరంగా ఉండేవి. యుక్రెయిన్ నుంచి గని యంత్రాలతో సహా తరలించబడిన గని కార్మికులు, స్థానిక కార్మికుల సహాయంతో స్వెర్ డ్లోవసర్ ప్రాంతంలో గనులు తవ్వి మాంగనీసు ఉత్పత్తి చెయ్యడం ప్రారంభించారు. క్రమంగా మాగ్నిటోగోరస్క్ వద్ద బ్రహ్మాండమైన ఫెర్రో మాంగనీస్ ప్లాంటును స్థాపించారు. దుర్భర పరిస్థితులలో కార్మికులు సాధించిన ఈ పారిశ్రామిక విజయం జర్మనీతో యుద్ధంలో సాధించిన విజయాలతో సమానంగా ఎంచబడుతుంది. అలాగే నీటి చుక్క లేని మధ్య ఏషియాలో బల్క్ హేష్ వద్ద మాలిబ్ డెనమ్ గనులు తవ్వడం కూడా ఒక అద్భుత విజయం.

పారిశ్రామికంగా తూర్పు మీద ఆధారపడ్డట్టుగానే ఆహార ధాన్యాలకు కూడా సోవియట్ యూనియన్ తూర్పు మీద ఆధారపడవలసి వచ్చింది. వోల్గా ప్రదేశం, యురల్స్, పశ్చిమ సైబీరియా, కజకస్తాన్ లు యుద్ధ సమయంలో సోవియట్ యూనియన్ కు ఆహారధాన్యాలను అందించే ప్రాంతాలుగా రూపొందాయి. కొత్తగా భూమిని సాగులోకి తీసుకు వచ్చి సాగులో ఉన్న భూమిని పెంచారు. ఈ ప్రాంతాలలో అంతకు ముందు పండించని పంటలను - పంచదార దుంప, పొద్దు తిరుగుడు పువ్వు లాంటి పంటలను - పండించడం మొదలు పెట్టారు.

'...1941 జూలై - డిసెంబరు మధ్య కాలంలో, దాదాపు 2,600 పరిశ్రమలనూ, కోటి మంది ప్రజలనూ రైల్వేల ద్వారా తరలించడం జరిగింది. మరో 20 లక్షలమందిని నీటి మార్గాల ద్వారా తరలించారు. 1941 ఆగస్టు అంతానికి, లెనిన్ గ్రాడ్ నుండే, 100 భారీ పరిశ్రమలనూ, 6 లక్షలమంది జనాభానూ, వెనక్కు తరలించారు.....గ్రామీణ ప్రాంతాలలో ఉన్న కామ్సోమాల్స్ యువతులు, యుద్ధం రంగం నుంచి తూర్పు వైపుకు, 24 లక్షల పశువులనూ, 51 లక్షల గొర్రెలనూ, 8 లక్షల గుర్రాలనూ తోలుకుంటూ తరలిపోయారు. వ్యవసాయ యంత్రాలనూ, లక్షల టన్నుల ఆహార ధాన్యాలనూ, యుద్ధ రంగానికి రిజర్వుగా ఈ యువతులు తరలించారు....తూర్పున కొత్త భూములు సాగు చెయ్యడం ప్రారంభించారు. 50 లక్షల ఎకరాల భూమి తూర్పున కొత్తగా సాగులోకి వచ్చింది...' - Epoch of Stalin, Facts and Figures (Gennady Zuganov).

1942లో సోవియట్ యూనియన్, హిట్లర్ జర్మనీ కంటే 3.9 రెట్లు టాంకులు, 1.9 రెట్లు యుద్ధ విమానాలూ, 3.1 రెట్లు అన్ని రకాల గన్నులూ ఉత్పత్తి చేసి, హిట్లర్ జర్మనీని అధిగమించింది.

యుద్ధానికి పూర్వం యురల్స్ ప్రాంతాలను పారిశ్రామికం చెయ్యడం, యుద్ధం ప్రారంభమైన

Edit with WPS Office
వెంటనే ముఖ్య యుద్ధ పరిశ్రమలను తూర్పుకు తరలించి అక్కడ యుద్ధ ఉత్పత్తిని అతి వేగంగా పెంచడం, యుద్ధంలో రష్యా విజయానికి కీలకంగా మారింది. 1941లో రష్యన్ విమాన పరిశ్రమలు 16,000 విమానాలను ఉత్పత్తి చేశాయి. వీటిలో 10,000 విమానాలు యుద్ధం ప్రారంభమైన తర్వాత జులై-అక్టోబరుల మధ్యన తయారయ్యాయి. అలాగే టాంకుల, ఇతర ఆయుధాల, ఉత్పత్తి కూడా పెరిగింది. మందుగుండు ఉత్పత్తి మొదటి ఆరునెలల కంటే రెండవ ఆరు నెలలలో మూడు రెట్లు పెరిగింది. 1941 నవంబరు 9న స్టేట్ డిఫెన్స్ కమిటీ సమావేశమై 1942లో 22,000 విమానాలు, 22,000-25,000 భారీ లేక మధ్యరకం టాంకులు ఉత్పత్తి చెయ్యడానికి వివరంగా పథకాలు వేసింది. ఊహించ సాధ్యం కాని కష్టాలు అనుభవిస్తూ రష్యన్ కార్మిక వర్గం నాలుగు సంవత్సరాల యుద్ధకాలంలో 4,90,000 ఫిరంగులు, మోర్టార్లు, 1,20,000 టాంకులు, స్వయంచలిత ఫిరంగులు, 1,37,000 యుద్ధ విమానాలు ఉత్పత్తి చేసింది.

హిట్లర్ ప్రభుత్వంలో ప్రచార శాఖ అధిపతి గోబెల్స్ 1943 జనవరిలో '....ఏదో అద్భుతం జరిగింది. కొత్త సైన్యాలూ నూతన ఆయుధాలూ విశాలమైన రష్యన్ స్టెప్పీల నుంచి వస్తూనే ఉన్నాయి. ఒక గొప్ప ఇంద్రజాలికుడు యురల్స్ మట్టిని అసంఖ్యాకమైన బోల్షివిక్ సైనికులుగానూ ఆయుధాలుగానూ మారుస్తున్నట్టు అనిపిస్తోంది...' అని ఆశ్చర్యపోయాడు.

ఈ రష్యన్ అద్భుతం వెనుక రహస్యం సోషలిస్టు వ్యవస్థ. కార్మికుల్లో, కర్షకుల్లో, పీడిత ప్రజల్లో ఈ వ్యవస్థ సృష్టించిన నూతన చైతన్యం. బోల్షివిక్ రష్యాను రక్తసిక్తంగా చిత్రించే పెట్టుబడిదారీ దేశాల మేధావులకు ఈ 'ఇంద్రజాలం' ఎప్పటికీ అర్థం కాని ఒక మిస్టరీగా మిగిలిపోవడంలో అశ్చర్యం లేదు.

Edit with WPS Office

అదిగదిగో క్రెమ్లిన్ పై అరుణారుణ అరుణతార!
అణువణువు చీలుస్తూ ఉరికి వస్తున్న ఎర్రసేన!
గ్రామాలూ నగరాలూ అడవుల నిండా
గాలిదోవల నిండా దావాగ్నియై వీస్తున్న ప్రతిఘటన
ఇది ప్రజలందరూ పంచుకొనే ప్రజాయుద్ధం
ఇది శ్రామికులందరూ ఎగరేసే అరుణపతాక

- డా. అద్దేపల్లి రామమోహనరావు

Edit with WPS Office

మాస్కో యుద్ధం

మాస్కో యుద్ధానికి ముందు పరిస్థితి

సోవియట్ యుద్ధ పరిశ్రమలలో అత్యధిక భాగం తూర్పు వైపుకు తరలించబడి డిసెంబరు అంతానికి ఉత్పత్తి ప్రారంభించగలిగినా, ఈ నాలుగైదు నెలలలోనూ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. పాత పరిశ్రమలు పని చెయ్యడం లేదు. కొత్తవి ఇంకా ఉత్పత్తి ప్రారంభించలేదు. యుద్ధం జరిగిన పక్షంలో ఆర్థిక వ్యవస్థను యుద్ధావసరాలకు అనుగుణంగా మార్చడానికి కొంత వ్యవధి కావలసి ఉంటుందన్న ఆలోచనతో, ఈ వ్యవధిలో సైన్యాలకు నిరంతరాయంగా సరఫరాలు అందించడానికి యుద్ధానికి ముందు రష్యా ఇంధనం, ముడి పదార్థాలు, ఫెర్రస్, నాన్-ఫెర్రస్ మెటల్సు, ఆహార పదార్థాల లాంటి ముఖ్యావసర వస్తువులను నిలువ చేసింది. పరిశ్రమలు తరలిస్తున్న తరుణంలో పోరాటం సాగించడానికి కొంతవరకూ ఈ నిలువలు ఉపయోగపడ్డాయి కాని ఎర్రసైన్యం అక్టోబరు నుంచి తీవ్రమైన ఆయుధాల కొరతను ఎదుర్కొంది. అక్టోబరులో జర్మనీ మాస్కో యుద్ధం ప్రారంభించిన కాలానికి ఉత్పత్తి దాదాపు నిలిచిపోయింది.

అక్టోబరు అంతానికి దక్షిణాన ఒక్క ఫాక్టరీ కూడా పని చెయ్యడం లేదు. జూన్ తో పోల్చి చూసినప్పుడు అక్టోబరులో ముడి ఇనుము ఉత్పత్తి 33 శాతం, ఉక్కు ఉత్పత్తి 42 శాతం, రోల్డ్ ఇనుము ఉత్పత్తి 42 శాతం మాత్రమే ఉంది. మాస్కో బేసిన్, డోన్బాస్ ప్రాంతాలలోని బొగ్గు గనులన్నీ జర్మన్ ఆక్రమణకు గురయ్యాయి. రోల్డ్ నాన్ ఫెర్రస్ మెటల్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి 50 శాతం పడిపోయింది. విమాన పరిశ్రమ తరలింపు వలన యుద్ధ రంగంలో విమానాల కొరత తీవ్రమైంది. సెప్టెంబరుతో పోల్చి చూసినప్పుడు నవంబరులో ఉత్పత్తి అయిన విమానాల సంఖ్య 30 శాతం మాత్రమే ఉంది. మాస్కో, లెనిన్ గ్రాడ్ లలో వైమానిక దళాలు పొందుతున్న భయంకరమైన నష్టాలను పూర్తి చెయ్యడానికి మార్గమే లేదు. మందుగుండు పరిశ్రమలో, ఫెర్రో ఎల్లాయెస్, నికెల్, నాన్ - ఫెర్రస్ మెటల్స్, అల్యూమినియం, రాగి, తగరాల కొరత తీవ్రమైంది. జర్మన్ ఆక్రమణ వలనా రసాయన పరిశ్రమల తరలింపు వలనా పేలుడు పదార్థాల తయారీ గణనీయంగా తగ్గిపోయింది. తూర్పుకు తరలించిన 26 రసాయన ఫాక్టరీలలోనూ డిసెంబరు ప్రారంభానికి 8 మాత్రమే గమ్యాన్ని చేరుకున్నాయి. వాటిలో నాలుగు మాత్రమే ఉత్పత్తి ప్రారంభించాయి. 1941 ఆగస్టు-నవంబరుల మధ్య 303 మందుగుండు సామగ్రి తయారీ ఫాక్టరీలలో ఉత్పత్తి ఆగిపోయింది. 1941 రెండో భాగంలో శాంతి కాలంలో నిలవ ఉంచిన రిజర్వు మందుగుండును ఉపయోగించారు కాని ఆరు నెలల యుద్ధం తర్వాత ఈ మందుగుండు నిలవలు కూడా అయిపోయాయి. సైన్యావసరాలలో 50-60 శాతాన్ని తీర్చడానికి మాత్రమే ఉత్పత్తి సరిపోయేది.

యుద్ధం వలన వ్యవసాయోత్పత్తి తగ్గిపోయింది. ట్రాక్టర్ డ్రైవర్లు టాంకు డ్రైవర్లుగా సైన్యంలో చేరారు. గ్రామీణ ప్రాంతాలలో మగవాళ్ళంతా సైన్యంలో చేరారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న మోటారు వాహనాలూ ట్రాక్టర్లూ గుర్రాలూ సైన్యానికి అప్పగించారు. వ్యవసాయ పనులన్నీ స్త్రీలు, వృద్ధులు, పిల్లలు చెయ్యవలసి వచ్చింది. అనేక వ్యవసాయ క్షేత్రాలలో వ్యవసాయం తిరిగి నాగలితో దున్నే స్థితికి చేరుకుంది. కోతల సమయంలో సమీప నగరవాసులను ఈ స్త్రీలకు సహాయం చేయడానికి పంపించేవారు. నవంబరు నాటికి జర్మన్లు ఆక్రమించిన ప్రాంతాలు, యుద్ధానికి పూర్వం ఆహార ధాన్యాలలో 38 శాతం, పంచదారలో 84 శాతం ఉత్పత్తి చేసేవి. 38 శాతం పశు సంపద, 84 శాతం పందులు ఉండేవి. 1942 సంవత్సరం జనవరి 1కి రష్యాలో ఆవుల సంఖ్య 2,78,00,000 నుంచి 1,50,00,000కు తగ్గిపోయింది. పందుల సంఖ్య 60 శాతానికి పైగా తగ్గిపోయింది.

సైనికంగా, ఆర్థికంగా సోవియట్ యూనియన్ కు ఈ కాలం అత్యంత ప్రమాదకరమైనది. ఇటువంటి గడ్డు కాలంలో మాస్కో యుద్ధం ప్రారంభమైంది.

జులై 21 రాత్రి మాస్కో మీద మొదటి విమాన దాడి జరిగింది. మాస్కోను విమాన దాడుల

Edit with WPS Office
నుంచి రక్షించడానికి మూడు వలయాల రక్షణ ఉంది. ఈ మొదటి విమాన దాడిలో పాల్గొన్న 200 జర్మన్ విమానాలలో పది పదిహేను మాత్రమే మూడు రక్షణ వలయాలను దాటి మాస్కోను చేరగలిగాయి. కాని మాస్కోకు తీవ్రమైన నష్టమేమీ కలిగించలేక పోయాయి. మాస్కోలో ఉన్న అలెగ్జాండర్ వెర్త్ '.....విమాన విధ్వంసక శతఘ్నులు విరామం లేకుండా పేలసాగాయి. ఆకాశమంతా డజన్ల సెర్చ్ లైట్ల వెలుగుతో నిండిపోయింది. విమాన విధ్వంసక శతఘ్నులు పేలుస్తున్న గుళ్ళ శకలాలు వీధుల్లో వడగళ్ళలా కురిశాయి. అటువంటిది నేను విమాన దాడులకు గురయిన లండన్ లో ఎప్పుడూ చూడలేదు..' అని జులై 21 విమాన దాడి గురించి రాశాడు. జులై, ఆగస్టులలో మాస్కో మీద అప్పుడప్పుడు జర్మన్ విమాన దాడులు జరిగాయి.

సెప్టెంబరులో యుక్రెయిన్ లో సాధించిన విజయాలతో మత్తెక్కిన జర్మనీ సోవియట్ శక్తిని తక్కువ అంచనా వేసింది. ఎర్రసైన్యం బలహీనపడిపోయిందనీ మాస్కోను రక్షించుకోగల స్థితిలో లేదనీ సోవియట్ సైనికులు మనోనిబ్బరం కోల్పోయారనీ భావించింది. మాస్కోను స్వాధీనం చేసుకోవాలన్న ఉద్దేశంతో సెప్టెంబరు అంతంలో సైన్యంలో అధిక భాగాన్ని మాస్కో రంగానికి తరలించింది.

జూన్ నుంచి అక్టోబరు వరకు జరిగిన యుద్ధం సోవియట్ సైనికులకూ ఆఫీసర్లకూ శిక్షణనిచ్చే పాఠశాల అయింది. రణరంగంలో నైపుణ్యాన్ని సంపాదించిన కొత్త ఆఫీసర్లు, జనరల్సు తయారయ్యారు. వైమానిక బలగంలోనూ సైన్యంలోనూ అనేక మార్పులు జరిగాయి. ఈ ఐదు నెలల యుద్ధం సైన్యంలో ఒక 'వడపోత' కార్యక్రమానికి దారి తీసింది. అసమర్థులైన ఆఫీసర్లు, జనరల్స్ స్థానంలో నూతన పరిస్థితులలో నైపుణ్యంతో పోరాడగలమని రుజువు చేసుకున్న ఆఫీసర్లను, జనరల్స్ ను స్టాలిన్ నియమించాడు.

మాస్కో నగరానికి ఏర్పడిన ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి సోవియట్ హై కమాండు తగిన రక్షణ చర్యలు తీసుకుంది. మాస్కో సమీప ప్రాంతాలలోనూ మాస్కోకు దారి తీసే రోడ్ల మీద సుదూర ప్రాంతాలలోనూ పెద్ద ఎత్తున రక్షణ కట్టడాలను నిర్మించారు.

ఫ్రెంచ్ సైన్యం ఓడిపోయిన తర్వాత పారిస్ నగరాన్ని 'ఓపెన్ సిటీ' గా ప్రకటించడం జరిగింది. జర్మన్ సైన్యాలు కవాతు చేస్తూ పారిస్ నగరంలో ప్రవేశించి శాంతియుతంగా ఆక్రమించాయి. కాని మాస్కో పోరాడడానికి నిశ్చయించింది. మాస్కో వాసులు తమ నగరాన్ని ఒక కంచుకోటలా మార్చడానికి తీవ్రంగా కృషి చేశారు. జూలై ప్రారంభంలో పార్టీ సంస్థలు 12 ప్రజా వలంటీరు దళాలను ఏర్పరిచాయి. సాధారణ పౌర జీవితాన్ని గడుపుతున్న కార్మికులూ ఇంజినీర్లూ టెక్నీషియన్లూ సైంటిస్టులూ కళాకారులూ - అందరూ ఈ వలంటీరు దళాలలో చేరారు. వీరు శిక్షణ పొందిన సైనికులు కారు. శిక్షణ లేకపోయినా వీరికి దేశభక్తి, పట్టుదల, అంతిమ విజయంలో అచంచలమైన విశ్వాసం ఉన్నాయి. పోరాటాలలో అనుభవం సంపాదించిన తరువాత ఈ వలంటీరు సైన్యాలు గొప్ప పోరాట పటిమ గల సైన్యాలుగా మారాయి.

మాస్కోను విమానదాడుల నుంచి రక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వేలమందికి ప్రథమ చికిత్సలోనూ విమాన దాడుల నుంచి రక్షణ తీసుకోవడంలోనూ శిక్షణ ఇచ్చారు. శత్రువుకు కనుపించకుండా ముఖ్యమైన సైనిక స్థావరాలను కప్పి పుచ్చారు. శత్రువు మాస్కో నగరానికి చేరే దారులలో 12 డివిజన్ల ప్రజా సైన్యం నిలిచింది. మాస్కో నగర కమిటీ అదనపు స్వచ్ఛంద దళాలను ఏర్పాటు చెయ్యడం ప్రారంభించింది.

సెప్టెంబరు వరకూ జరిగిన యుద్ధంలో జర్మనీ గణనీయమైన విజయాలు సాధించింది. బెలోరష్యా, మాల్డేవియా, యుక్రెయిన్ లలో అధిక భాగాన్నీ, లిథుయేనియా, లాత్వియా, ఎస్తోనియాలనూ ఆక్రమించింది. లెనిన్ గ్రాడ్ ను చుట్టుముట్టింది. ఈ విజయాలు జర్మనీకి తేలికగా లభించలేదు. జర్మన్ సైనిక దళాలూ వైమానిక దళమూ తీవ్ర నష్టాలకు గురయ్యాయి. జనరల్ హాల్డర్ డైరీ ప్రకారం సెప్టెంబరు అంతానికి జర్మనీ 5,51,000 సైన్యాన్ని నష్టపోయింది.

సెప్టెంబరు అంతానికి రష్యన్ హై కమాండు మాస్కో రంగంలో 12,50,000 సైన్యాన్నీ, 990 టాంకులు, 7,600 మోర్టార్లు, గన్నులు, 677 విమానాలనూ కేంద్రీకరించింది. జర్మనీ 17 లక్షల సైన్యాన్నీ, 1,683 టాంకులు, 13,680 గన్నులు, మోర్టార్లు, 1,354 విమానాలనూ మాస్కో మీద దాడికి సమీకరించింది. జర్మనీ సోవియట్ సైన్యం కంటే ఈ రంగంలో పదాతి దళాలలో 40 శాతం, టాంకులలో 70 శాతం, మోర్టార్లు గన్నులలో 80 శాతం, విమానాలలో రెట్టింపు ఆధిక్యతా కలిగి ఉంది (G. Zhukov, Reminiscences and Reflections, Vol. 2, P. 10).

Edit with WPS Office
సెప్టెంబరు 27న సుప్రీం హెడ్ క్వార్టర్స్ రాబోయే దినాలలో జర్మన్ దాడి ప్రారంభం కావచ్చునని హెచ్చరించింది. మాస్కో మీద ప్రతీ రోజూ జర్మన్ విమానాలు దాడులు చెయ్యసాగాయి. విమాన దాడుల నుంచి మాస్కోను రక్షించడానికి మాస్కో ప్రాంతంలో రష్యన్లు అధిక సంఖ్యలో వైమానిక బలగాన్ని కేంద్రీకరించారు.

మాస్కో యుద్ధం

మాస్కో యుద్ధాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. మొదటి జర్మన్ దాడి సెప్టెంబరు 30న ప్రారంభమై అక్టోబరు అంతం దాకా సాగింది. రెండో జర్మన్ దాడి నవంబరు 17న మొదలై డిసెంబరు 5 దాకా సాగింది. రష్యన్ ఎదురు దాడి డిసెంబరు 6న ప్రారంభమై 1942 వసంత కాలం దాకా సాగింది.

సెప్టెంబరు 30వ తేదీన ఆపరేషన్ టైఫూన్ (మాస్కో మీద దాడికి జర్మన్ల పథకం) ప్రారంభమైంది. ఒక పెను తుఫాను మాస్కో ముందు రష్యన్ సైన్యాన్ని నాశనం చెయ్యాలి. ఈ తుఫాను తాకిడికి తట్టుకోలేక రష్యా కుప్పకూలిపోవాలి. ఇదీ ఈ ఆపరేషన్ లక్ష్యం. 'రష్యన్లను చుట్టుముట్టండి. చావగొట్టండి. నామరూపాలు లేకుండా చెయ్యండి' అని ఆదేశించాడు హిట్లర్. 'ఒక్క సైనికుడు కాని, ఒక్క మాస్కో నగర నివాసి కాని - స్త్రీ, పురుషుడు, బాలుడు, ఎవరైనా కాని తప్పించుకోలేని విధంగా (మాస్కో) నగరాన్ని చుట్టుముట్టాలి. నగరాన్ని వదలి పారిపోవాలని చేసే ప్రయత్నాలను బలప్రయోగంతో అణచి వెయ్యాలి. మాస్కో, పరిసర ప్రాంతాలూ జలమయమయ్యేలా బ్రహ్మాండమైన కట్టడాలు నిర్మించాలి. నేడు మాస్కో ఉన్న ప్రదేశం ఒక సముద్రమై రష్యన్ ప్రజల రాజధాని నాగరిక ప్రపంచం నుంచి అదృశ్యమవ్వాలి' అన్నాడు హిట్లర్.

జర్మన్ సైన్యం తుఫాను తీవ్రతతోనే విరుచుకు పడింది. రష్యన్ సైన్యాలు ఈ జర్మన్ దాడిని ఎదుర్కోలేక పోయాయి. సెప్టెంబరు 30న ప్రారంభమైన మొదటి దాడిలో, అక్టోబరు 4-5 రాత్రి, యుద్ధంలో అత్యంత ప్రమాదకరమైన రాత్రిగా పరిణమించింది. మాస్కోలో ఉన్న హై కమాండుకు యుద్ధరంగంలో ఉన్న సైన్యాలతో సంబంధాలు తెగిపోయాయి. అక్టోబరు 5న ఉదయం 9.00 గంటలకు జర్మన్ సైన్యాలు రష్యన్ సైన్యాల మధ్య గండి కొట్టి మాస్కో మీదకు వస్తున్నాయని వార్త వచ్చింది. మొదట అది బెదురుగొడ్డుల ప్రేలాపనగా కొట్టి పడేశారు కాని ఆ రోజు మధ్యాహ్నం శత్రు చర్యలను కనిపెడుతున్న గూఢచారి విమానం ఒకటి మాస్కోకు వందమైళ్ళ దూరంలో మాస్కో వైపుగా ప్రయాణిస్తున్న జర్మన్ సైన్యాన్ని కనిపెట్టింది. ఈ జర్మన్ సైన్యం 15 మైళ్ళ పొడుగుంది. జర్మన్లు అంత సమీపంలోకి వచ్చారని ఎవరూ ఊహించలేదు. మరి రెండు విమానాలను పంపి ఆ వార్త నిజమేనని రుజువు చేసుకోవడం జరిగింది. జర్మన్లను అడ్డగించడానికి మాస్కో దారిలో సోవియట్ సైన్యాలు ఏమీ లేవు. రష్యన్లు రిజర్వు సైన్యం నుంచి కొంత సైన్యాన్ని మాస్కో రోడ్డు మీద జర్మన్లను ఆపు చెయ్యడానికి పంపించారు.

అక్టోబరు 8వ తేదీన మాస్కోకు దక్షిణ దిశలో ఉన్న కీలక పట్టణం ఓరెల్ ను జర్మన్లు ఆక్రమించారు. ఇంక మాస్కో పతనం నిశ్చయం అనుకున్నాడు హిట్లర్. హిట్లర్ ప్రభుత్వ పత్రికాధిపతి ఆటో డీట్రిచ్ బెర్లిన్ లో పత్రికా సమావేశంలో 'సోవియట్ యూనియన్ అంతమైంది' అని ప్రకటించాడు. ఆటో డీట్రిచ్ ప్రకటనను జర్మనీలోనే కాకుండా బ్రిటన్, అమెరికాలలో కూడా అంతా నమ్మారు. ఎందుకంటే రష్యా జర్మనీ ముందు నిలవలేదు అన్న అభిప్రాయం అందరికీ ఉంది. జులైలో అమెరికన్ జనరల్ స్టాఫ్ కొన్ని వారాలలో రష్యా ఓటమి తథ్యమని రహస్యంగా అమెరికన్ పత్రికా సంపాదకులకూ విలేఖరులకూ వెల్లడించింది.

అక్టోబరు 7 నాటికి యుద్ధ రేఖలో అనేక చోట్ల గండి పడింది. ఈ గండిని పూడ్చడానికి తగిన రిజర్వు సైన్యాలు లేవు. అక్టోబరు మధ్యలో మాస్కో రక్షణకు తగిన చర్యలు తీసుకోవడానికి వ్యవధి సంపాదించడం కోసం ఎర్రసైన్యం భీషణంగా పోరాడింది. శత్రువు చేత చుట్టుముట్టబడ్డ రష్యన్ సైన్యాలు, తమ సోదర సైన్యాలతో సంబంధాలు తెగిపోయినా, గొప్ప ధైర్య సాహసాలతో పోరాడి శత్రు సైన్యాలలో గండి కొట్టి ఎర్రసైన్య ప్రధాన బలగాలతో కలవడానికి ప్రయత్నించాయి. చివరకు చిన్న చిన్న దళాలు మాత్రమే శత్రు వలయం నుంచి బయటపడగలిగాయి. ఈ సైనికుల త్యాగాల వలన మొజెయిన్స్క్ ప్రాంతంలో రక్షణ ఏర్పాట్లు చేయడానికి వ్యవధి చిక్కింది. జర్మన్ల కథనం ప్రకారం 6,50,000 మంది రష్యన్ సైనికులు, 5000 ఫిరంగులు, 1200 టాంకులతో సహా పట్టుబడ్డారు. అక్టోబరు

Edit with WPS Office
13న ముఖ్య మాస్కో యుద్ధ రంగాలలో భీషణ పోరాటం మొదలైంది.

అక్టోబరు, నవంబరు నెలలలో 2,50,000 మంది పౌరులు రేయింబవళ్ళు పని చేస్తూ మాస్కో రంగంలో 'లోపలి' రక్షణ రేఖను నిర్మించారు. వీరిలో మూడు వంతులు స్త్రీలు, పిల్లలు. నగర సమీప ప్రాంతాలలోనూ నగరానికి దారి తీసే మార్గాలలోనూ రక్షణ స్థావరాలు నిర్మించడానికి చలిలో, వానలో ఎంతో కృషి చేశారు. శారీరక శ్రమ అలవాటు లేని ఈ స్త్రీలు అష్టకష్టాలూ పడేవారు. బూట్లకు బురద అంటుకుని బూట్లు బరువెక్కి కాలు కదల్చడం కష్టమయ్యేది. తోపుడు బళ్ళు బురదలో కూరుకు పోయేవి. పారలు బురదతో బరువెక్కేవి. చలిలో గడ్డకట్టుకు పోయేవారు. అయినా నవంబరు 25 కల్లా వారు 1428 ఆర్టిలరీ స్థావరాలను నిర్మించారు. మూడు వరుసలలో ముళ్ళ కంచెలు వేశారు. టాంకుల గమనాన్ని నిరోధించేందుకు 72000 మీటర్ల కందకాలు తవ్వారు, 52,500 మీటర్ల అడ్డంకులు నిర్మించారు. జర్మన్ సైన్యాన్ని నిరోధించేందుంకు 80,000 గట్లు పోశారు. 1,28,000 మీటర్ల ట్రెంచిలు తవ్వారు ఈ పనంతా చెయ్యడానికి వారు మొత్తం 30 లక్షల ఘనపు మీటర్ల మట్టిని ఏ యంత్ర సహాయం లేకుండా కేవలం చేతులతో తొలగించాల్సి వచ్చింది. కార్మికులూ ప్రజలూ రేయింబవళ్ళు పని చేసి నగర వీధులలోనూ పరిసర ప్రాంతాలలోనూ రక్షణ స్థావరాలు నిర్మించారు. సైనిక ఇంజినీర్లు మందు పాతరలు వేశారు. మాస్కోనూ, పరిసర ప్రాంతాలనూ ఒక దుర్గంలా పటిష్టం చేశారు.

అక్టోబరు-నవంబరులలో మాస్కో నగరం యుద్ధ రంగానికి 5 వలంటీరు డివిజన్లను పంపించింది. యుద్ధం ప్రారంభమైనప్పటినుండీ మాస్కో 17 డివిజన్లను పంపించింది. ఈ వలంటీర్ డివిజన్లు కాకుండా మాస్కో వాసులు టాంకులను నాశనం చెయ్యడానికి దళాలను ఏర్పాటు చేశారు. మాస్కోలో ప్రతీ ప్రాంతంలోనూ కార్మిక బెటాలియన్లను ఏర్పాటు చెయ్యాలని కమ్యూనిస్టు పార్టీ అక్టోబరు 13న పిలుపునిచ్చింది. కొద్ది రోజులలోనే 12,000 మంది పార్టీ, యువ కమ్యూనిస్టు లీగ్ కార్యకర్తలతో 25 కంపెనీలు ఏర్పాటయ్యాయి. ఒక లక్షమంది కార్మికులు ఫాక్టరీలలో తమ విధులతో పాటు మిలిటరీ శిక్షణ పొంది సైన్యంలో చేరారు. 17,000 మంది స్త్రీలూ బాలికలూ నర్సులుగా వైద్య సహాయకులుగా శిక్షణ పొందారు. మాస్కో వాసులు గెరిల్లా దళాలలోనూ, మంచులో పోరాడేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన స్కీ దళాలలోనూ చేరారు.

మాస్కోనుంచి తరలించని ఫాక్టరీలలోని కార్మికులూ ఇంజినీర్లూ నిస్వార్థంగా అంకిత భావంతో పని చేశారు. ఉత్తమ శ్రేణికి చెందిన యంత్రాలను మాస్కోనుంచి తరలించడం వలన వారు పాత యంత్రాల మీద పని చెయ్యాల్సి వచ్చింది. దానికి తోడు నిపుణ కార్మికుల కొరత. అయినా సైనిక సామాగ్రి ఉత్పత్తి అతి స్వల్పకాలంలో మొదలైంది. మాస్కో మోటారు పరిశ్రమ సబ్ మెషీన్ గన్నులను తయారు చెయ్యడం ప్రారంభించింది. ఫస్ట్ బాల్ బేరింగ్స్ పరిశ్రమ ఈ సబ్ మెషీన్ గన్నులకు విడి భాగాలు తయారు చెయ్యసాగింది. గడియారాల ఫాక్టరీ మందుపాతరల డిటొనేటర్లు తయారు చేసింది. ట్రాలీ బస్ డిపో చేతి బాంబులు తయారు చేస్తే క్రాస్నీ పరిశ్రమ టాంకులు రిపెయిర్ చేసింది. నగరంలోని గేరేజీలు, కారు డిపోలు టాంకుల, సైనిక వాహనాల మరమ్మత్తు చెయ్యసాగాయి. శాంతికాలంలో పౌరులకు రకరకాల వినియోగ వస్తువులు తయారు చేసే చిన్న చిన్న పరిశ్రమలు టాంకు విధ్వంసక గ్రెనేడ్లు, డిటొనేటర్లు తయారు చేశాయి. డిసెంబరులో మాస్కో పరిశ్రమలు నవంబరులో కంటే 35 రెట్లు ఎక్కువ ఉత్పత్తి చెయ్యాలని ఆదేశాలిచ్చారు. మాస్కో పరిశ్రమలు ఈ లక్ష్యాన్ని సాధించాయి. మాస్కో కార్మిక వర్గం రోజుకు 12-18 గంటలు శ్రమించి మాస్కో యుద్ధ రంగానికి ఆయుధాలు, సామగ్రి, మందుగుండు అందించింది. రక్షణ స్థావరాలను నిర్మించింది. జర్మన్లు సైనిక శ్రేణులను ఛేదించిన పక్షంలో పోరాడడానికి సిద్ధంగా ఉంది. మాస్కో వశమైన పక్షంలో ఎర్ర సైన్యం వెంట తూర్పుకు తిరోగమించడానికి తయారుగా ఉంది.

రష్యన్ ప్రతిఘటనను అధిగమించి జర్మన్ టాంకులూ సైన్యమూ మాస్కోను సమీపిస్తుండడం వలన మాస్కోనుంచి ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలనూ దౌత్య కార్యాలయాలనూ ముఖ్యమైన ప్రభుత్వ సంపదనూ క్యుబిషేవ్ కు తరలించాలని నిర్ణయించారు. ఈ తరలింపు అక్టోబరు 15 రాత్రి ప్రారంభమైంది. ఈ తరలింపుతో మాస్కో వాసులలో భయాందోళనలు కలుగసాగాయి. నగరవాసులు నగరం వదలి పెట్టి పలాయనం మొదలు పెట్టారు.

అక్టోబరు 16 సంఘటనలు

Edit with WPS Office

మాస్కో ఇటువంటి జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్న సమయంలో అక్టోబరు 16న మాస్కో వాసుల గుండె నిబ్బరం చెదిరింది. సెప్టెంబరులో జర్మన్ దాడి ప్రారంభమైన తర్వాత పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉన్నదీ మాస్కో వాసులకు అర్థం కావడానికి కొన్ని రోజులు పట్టింది. సెప్టెంబరు అంతంలోనూ అక్టోబరు మొదటి రోజులలోనూ యుక్రెయిన్ లో జర్మనీ చేస్తున్న దాడుల గురించే వార్తలు వచ్చేవి. అక్టోబరు 4-5 తేదీలలో మాత్రమే మాస్కో మీద జర్మన్ దాడి గురించి మాస్కో వాసులకు తెలిసింది. అప్పటికీ మాస్కోకు ఏర్పడిన ప్రమాదం ఎంత తీవ్రంగా ఉన్నదీ మాస్కో వాసులకు తెలియదు. మాస్కో మీద ఆఖరి యుద్ధం ప్రారంభిస్తున్నానని అక్టోబరు 2న హిట్లర్ చేసిన ప్రకటన గురించి మాస్కో పేపర్లలో కాని రేడియోలో కాని చెప్పలేదు. అక్టోబరు 7న మాస్కోలో ఒక పత్రికా విలేఖరుల సమావేశంలో 'యుద్ధంలో అంతిమ పరిణామం ఈ నగరాన్నో, ఆ నగరాన్నో జర్మన్లు ఆక్రమించడం వలన నిర్ణయించబడదు' అని ప్రకటించడం జరిగింది. మాస్కో జర్మన్ల వశమయ్యే ప్రమాదం ఉంది కనుక ప్రజాభిప్రాయాన్ని అందుకు అనుకూలంగా మలచడానికి ప్రయత్నిస్తున్నారా అనిపించే విధంగా ఉంది ఆ ప్రకటన. అక్టోబరు 7 వార్తలలో వ్యాజ్మా ప్రాంతంలో తీవ్ర యుద్ధం గురించి పేర్కొనబడింది. ఈ వ్యాజ్మా మాస్కో రహదారి మీద మాస్కో సమీపంలో ఉంది. అక్టోబరు 8న ప్రావ్దా, ఇజ్వెస్తియా పత్రికలు ప్రమాద తీవ్రతను తక్కువ చేసి మాట్లాడాయి. ఎర్రసైన్యం పత్రిక 'అరుణ తార' మాత్రం సోవియట్ రాజ్యం యొక్క ఉనికి ప్రమాదంలో ఉందని రాసింది. ప్రతీ ఎర్ర సైనికుడూ చివరి రక్తపు బొట్టు వరకూ పోరాడాలని విజ్ఞప్తి చేసింది. అక్టోబరు 9న ప్రావ్దా పత్రిక జర్మన్ ప్రమాదం గురించి మాస్కో వాసులను హెచ్చరించింది. ఏ విధమైన అజాగ్రత్తా కూడదనీ శత్రుదాడిని తిప్పి కొట్టడానికి అన్ని బలగాలనూ సిద్ధం చెయ్యాలనీ చెప్పింది. మరుసటి రోజు శత్రువు మాస్కో మీదకు పురోగమించడమే కాక తన గూఢచారి దళాల ద్వారా ఎర్రసైన్యం వెనుక భాగంలో గందరగోళం, భయాందోళనలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు హెచ్చరించింది. అక్టోబరు 12న దేశానికి ఏర్పడిన భయంకరమైన ప్రమాదం గురించి మాట్లాడింది.

శత్రు ఏజెంట్ల అవసరం లేకుండానే ప్రావ్దాలో వస్తున్న వార్తలలోనే భయాందోళనలు కలిగించేంత సమాచారం ఉంది. మాస్కో నుంచి తరలింపు కార్యక్రమం గురించి అక్టోబరు 8న జనం మాట్లాడడం ప్రారంభించారు. అక్టోబరు 13 నాటికి పరిస్థితి విషమించింది. అంతవరకూ వ్యాజ్మా ప్రాంతంలో నిలుపు చెయ్యబడ్డ జర్మన్ సైన్యాలు రష్యన్లను ఓడించి మాస్కో మీద అంతిమ దాడికి సిద్ధ పడసాగాయి. ఎర్రసైన్యం జర్మన్లను ఆపగలదు అన్న గేరంటీ లేని పరిస్థితి ఏర్పడింది. అక్టోబరు 12న స్టేట్ డిఫెన్స్ కమిటీ మాస్కోకు కొంచెం సమీపంలో ఒక రక్షణ రేఖా, మరో రక్షణ రేఖ నగర సరిహద్దులలోనూ, రెండు రక్షణ రేఖలు మాస్కో నగరం లోపలా నిర్మించాలని మాస్కో వాసులకు విజ్ఞప్తి చేసింది.

అక్టోబరు 13న మాస్కో కమ్యూనిస్టు పార్టీ సెక్రటరీ 'మనం కళ్ళు మూసుకోవద్దు. మాస్కో ప్రమాదంలో ఉంది' అని హెచ్చరించాడు. యుద్ధరంగానికి సైనికుల్ని పంపించవలసిందనీ, ఆయుధాలు, మందుగుండు సామాను ఉత్పత్తిని అధికం చెయ్యవలసిందనీ మాస్కో కార్మికులకు అతను విజ్ఞప్తి చేశాడు. మాస్కో పార్టీ, యుద్ధం నుంచి పారిపోయేవారినీ పిరికితనంతో నీలి వార్తలు ప్రచారం చేసే వారినీ కఠినంగా శిక్షించాలంది.

రెండు మూడు రోజులలో ప్రతీ మాస్కో జిల్లా ఒక బెటాలియన్ కు సరిపడా వలంటీర్లను పోగు చెయ్యాలని నిర్ణయించింది. మూడు రోజులలో 12,000 మంది వలంటీర్లు ఈ బెటాలియన్లలో చేరారు. వీటిని మాస్కో కమ్యూనిస్టు బెటాలియన్లు అని పిలిచేవారు. కార్మిక బెటాలియన్లలాగానే ఈ కమ్యూనిస్టు బెటాలియన్లు మాస్కో రక్షణలో ప్రముఖ పాత్ర పోషించాయి. కొద్దిపాటి ఆహారం, దుస్తులు మూట గట్టుకుని వేలమంది సైన్యంలో చేరారు. కొద్దిమందికి సైనిక శిక్షణ ఉంది కాని తగినంత లేదు. అయిదారు రోజుల శిక్షణ తర్వాత ఈ వలంటీరు దళాలు ఒకటవ, రెండవ, మూడవ, నాల్గవ మాస్కో కమ్యూనిస్టు డివిజన్లుగా యుద్ధరంగాన్ని చేరాయి. మెరికల్లాంటి ఈ యువకులకు సరియైన శిక్షణ ఇవ్వడానికీ ఆయుధాలు ఇవ్వడానికీ నెలలు పడుతుంది. కాని జర్మన్లు మాస్కోలో కూతవేటు దూరంలో ఉన్నారు రష్యన్ ప్రభుత్వానికి రిజర్వు సైన్యాలను సమీకరించడానికి వ్యవధి కావాలి. కొన్ని వలంటీరు డివిజన్లు తిన్నగా యుద్ధరంగంలో ప్రవేశించి జర్మన్లతో తలపడితే, మరికొన్ని డివిజన్లు మాస్కో వెలుపల ట్రెంచిలలో జర్మన్లతో పోరాడడానికి సిద్ధంగా ఉన్నాయి. వాళ్ళకి యునిఫాం లేదు. తేలిక మర తుపాకులూ రైఫిల్సూ తప్ప భారీ ఆయుధాలు లేవు. రష్యన్ శ్రేణులలోంచి జర్మన్ సైన్యం ముందుకు చొచ్చుకు వచ్చిన ప్రదేశాల్లో శత్రువును నిలుపడానికి అనుభవం లేని, సరియైన సైనిక శిక్షణ

Edit with WPS Office
లేని ఈ కార్మిక బెటాలియన్లూ కమ్యూనిస్టు బెటాలియన్లూ గొప్ప సాహసంతో పోరాడాయి. ఈ దళాలు చేతి బాంబులతోనూ పెట్రోలు బాంబులతోనూ జర్మన్ టాంకుల మీద మళ్ళీ మళ్ళీ దాడి చెయ్యడం గురించి అసంఖ్యాకమైన కథలు ప్రచారంలోకి వచ్చాయి.

సుశిక్షితమైన జర్మన్ సైన్యాన్ని యునిఫాం కూడా లేని కమ్యూనిస్టు బెటాలియన్లు ప్రతిఘటిస్తున్నాయన్న వార్త హిట్లర్ దృష్టికి వచ్చినప్పుడు, మాస్కో రక్షణకు ఇంక సైన్యం లేదనీ ఆఖరి రష్యన్ సైన్యాలను నాశనం చేస్తున్నాననీ అతను అనుకున్నాడు.

అక్టోబరు 12-13 తేదీలలో ప్రభుత్వ కార్యాలయాలలో అధికభాగం, ప్రజా కమిస్సారియేట్, కమ్యూనిస్టు పార్టీ సంస్థలో కొంత భాగం, రాయబార కార్యాలయాలన్నీ మాస్కో నుంచి క్యుబిషేవ్ తదితర నగరాలకు తరలించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ముఖ్యమైన ఆయుధ కర్మాగారాలను కూడా తరలించాలని నిర్ణయించారు. కాని స్టేట్ డిఫెన్స్ కమిటీ మాత్రం మాస్కోలోనే ఉంది. ముఖ్యమైన వార్తాపత్రికలు - అరుణతార, ఇజ్వెస్తియా లాంటివి - మాస్కోలోనే ఉన్నాయి. ఈ తరలింపు వార్తలతో పాటు మరొక వార్త కూడా అక్టోబరు 16న వెలువడింది. అక్టోబరు 14-15 రాత్రి యుద్ధ రంగంలో పరిస్థితి విషమించిందనీ జర్మన్లు పెద్ద ఎత్తున టాంకులు, సైన్యాలతో దాడి చేశారనీ కొన్ని రంగాలలో రష్యన్ శ్రేణులను ఛేదించగలిగారనీ ఉదయం వార్తలలో వచ్చింది.

రష్యన్ యుద్ధ రికార్డులు వెల్లడించే దాని కంటే వాస్తవానికి అక్టోబరు 15న జర్మన్లు మాస్కోకు చాలా సమీపంగా వచ్చారని అక్టోబరు 16 సంఘటన జరిగిన చాలా కాలం తర్వాత కూడా ప్రజలు నమ్మేవారు. కార్మిక దళాలతో పాటు సైబీరియా నుంచి వచ్చిన దళాలను రైలు దిగిన వెంటనే తిన్నగా యుద్ధ రంగంలో గండి పూడ్చడానికి పంపించి జర్మన్లను ఆపు చెయ్యడం జరిగిందని వార్తలు ప్రచారంలో ఉన్నాయి.

చైతన్యంతో పోరాడుతున్న కమ్యూనిస్టులూ కార్మికులూ సైనికులూ కాక ఒక వర్గంగా విభజించడానికి వీలులేని మాస్కో జనాభా కూడా ఉంది. అక్టోబరు 16న భయాందోళనలతో మాస్కోవాసులు పలాయనం సాగించడానికి ముఖ్య కారణం వీరే.

వీరిలో కొంతమంది పార్టీ కార్యకర్తలూ పార్టీకి చెందని ఉద్యోగులూ కూడా ఉన్నారు. వీరిలో చాలామందికి జర్మన్ ఆక్రమణ అంటే భయం కలిగింది. కొంతమంది ఏదో విధంగా అనుమతి పత్రాలు సంపాదించీ కొంతమంది అనుమతి పత్రాలు లేకుండానూ తమ కార్లలో పారిపోయారు. ఆ రోజు వేలమంది కెరటం విరుచుకు పడ్డట్లు రైల్వే స్టేషన్ల మీదా మాస్కో నుంచి తూర్పుకు పోయే రోడ్ల మీదా పడ్డారు. ఆ వేలమందిలో నిజంగా పిరికిగా ప్రవర్తించిన వారు కొద్దిమందే ఉండొచ్చు. తర్వాత వీరంతా తమ శక్తిలో తమకే విశ్వాసం లేనందుకూ జర్మన్లను అధికంగా అంచనా వేసినందుకూ సిగ్గుపడ్డారు. ఈ పలాయనం గురించి ఆ తరువాతి రోజులలో రకరకాల కథలు వినవచ్చాయి. ఉదాహరణకు మాస్కో రేడియోలో పని చేసే ఒక ఉన్నతాధికారి హఠాత్తుగా మాయమై మూడు వారాల తర్వాత తిరిగి వచ్చాడని చెప్పుకున్నారు. కొంతమంది మీద ప్రభుత్వం చర్య తీసుకుంది. కాని అప్పుడు మాస్కోలో ఉన్న గందరగోళ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించింది.

వీళ్ళు అలా పారిపోతుంటే మాస్కో వెలుపలా మాస్కోలోనూ అనేకమంది వారి శక్తివంచన లేకుండా మాస్కోను రక్షించడానికి కృషిచేశారు. 'సుత్తి-కొడవలి ఫాక్టరీ' కార్మికులు రాత్రింపవళ్ళు పనిచేస్తూ టాంకు అవరోధాలు తయారు చేసి రక్షణ శ్రేణులకు అందించారు. సాధారణంగా అటువంటిది జరిగినప్పుడు నిశ్శబ్దంగా నిరాడంబరంగా కృషి చేసిన ఓల్గా సపోజ్నికోవా లాంటి వ్యక్తుల కంటే పలాయనం చిత్తగించిన వారే ప్రముఖంగా కనుపిస్తారు.

25 ఏళ్ళ ఓల్గా నేత కార్మికురాలు. ఆమె ముగ్గురు సోదరులూ సైన్యంలో చేరారు. ఒక సోదరుడు కనుపించకుండా పోయాడు. ఒకతను గాయపడ్డాడు. ఆ రోజుల్లో ఎంతో ధైర్యవంతులు అనుకున్న వారికి కూడా మాస్కో నిలుస్తాందా అనే సందేహం ఉండేది. అక్టోబరు 12న ఫాక్టరిలో పనిచేసే మిగిలిన స్త్రీలతో పాటు ఓల్గా కూడా శ్రామిక దళంలో చేరింది. వారినందరినీ మాస్కోకు కొన్ని కిలోమీటర్ల దూరానికి తీసుకు వెళ్ళారు. అంతకుముందే వచ్చిన వారితో పాటు ఓల్గా దళం కూడా ట్రెంచిలు తవ్వడం మొదలు పెట్టింది. మొదటి రోజున ట్రెంచిలు తవ్వుతుండగా హఠాత్తుగా జర్మన్ విమానమొకటి మీద పడి మర తుపాకీతో కాల్పులు సాగించింది. పదకొండుమంది అమ్మాయిలు అక్కడికక్కడే మరణించారు. నలుగురు గాయపడ్డారు. అయినా ఆ రోజంతా, మరుసటి రోజూ పని చేశారు. అదృష్టవశాత్తూ జర్మన్ విమానాలు మళ్ళీ రాలేదు. ఆమె తన ముసలి తల్లిదండ్రుల గురించి

Edit with WPS Office
ఆందోళన పడసాగింది. వారిని చూడడానికి ఎవరూ లేరని కమాండరుకు చెప్పి మాస్కోకు వెళ్ళడానికి అనుమతి కోరింది. అతను అనుమతించాడు. యుద్ధరంగం నుంచి గన్నుల శబ్దం మాస్కోలో వినిపిస్తూనే ఉంది. 16న ఆమె ఫాక్టరీకి వెళ్ళింది. ఫాక్టరీ మూసేసి ఉంది. ఫాక్టరీ డైరెక్టర్లలో చాలామంది పారిపోయారు. ఒక్క డైరెక్టర్ మాత్రం ఉన్నాడు. అతను ఆమెకు ఫాక్టరీలో ఉన్న గోధుమ పిండి, పంచదార, వెన్న ఇచ్చాడు. ఆమె కామ్సోమాల్ మెంబరుగా అందరికీ తెలుసు. అందుచేత ఆమె మాస్కోలో ఉండడం క్షేమం కాదు. తల్లిదండ్రులతో సహా ఆమెను చెలియాబిన్ స్క్ కు వెళ్ళి పొమ్మని ఫాక్టరీ వాళ్ళు సలహా ఇచ్చారు. తల్లిదండ్రులను ఎటు పంపించినా ఆమెకు మాత్రం తెలిసిన మార్గం ఒకటే - ఎర్ర సైన్యాన్ని అనుసరించడం.

'నేను అమ్మతో మాట్లాడాను. ఆమె చెలియాబిన్ స్క్ వెళ్ళడానికి ఇష్టపడలేదు. దేవుడు మనల్ని రక్షిస్తాడు. మాస్కోకు ఏం కాదు, అంది అమ్మ. ఆ రాత్రి చిన్న కిరోసిన్ దీపం తీసుకుని అమ్మా నేనూ నేల మాళిగలోకి వెళ్ళాం. మా దగ్గరున్న పంచదార, గోధుమ పిండి, నాన్న పార్టీ కార్డు అక్కడ పాతి పెట్టాము. మాస్కోను జర్మన్లు ఆక్రమిస్తే ఆ నేల మాళిగలో దాక్కుని జీవించాలని మేం అనుకున్నాం. జర్మన్లు మాస్కోలో ఎక్కువ కాలం ఉండబోరని మాకు తెలుసు. బహుశా నేను ఎర్రసైన్యంతో వెళ్ళి పోయేదాన్ని. కాని అమ్మా నాన్నలను వదలి వెళ్ళడం కష్టమనిపించింది. 'కుటుంబం అంతా చెల్లాచెదురై పోయింది. నువ్వూ వదలి వెళ్ళి పోతావా' అంటూ ఆ రాత్రి అమ్మ ఏడ్చింది. ఆ రాత్రి జర్మన్లు వీధిలో ఎప్పుడైనా కనుపించవచ్చునని భయపడ్డాం. మేమున్న ప్రాంతం ద్వారానే జర్మన్లు మాస్కోలో ప్రవేశించాలి. రైళ్ళు నడవడం లేదు. ఎక్కడికి పోవాలి? నాన్న రెండు మూడు కిలో మీటర్లు నడవగలడు. తర్వాత.....' అని ఆలోచిస్తుంది ఓల్గా.

ఆ రోజు రాత్రి జర్మన్లు రాలేదు. మర్నాడు ఫాక్టరీలో మందు పాతర వేశారు. బటను నొక్కడమే తరువాయి, ఫాక్టరీ అంతా అదృశ్యమవుతుంది. అప్పుడు మాస్కో సోవియట్ ఛెయిర్మన్ దగ్గరనుంచి మందు పాతరలేవీ పేల్చకూడదని ఫోను వచ్చింది. 20న ఓల్గా పని చేస్తున్న ఫాక్టరీని మళ్ళీ తెరిచారు.

నిరాడంబరంగా పోరాడే ఓల్గాలాంటి వారే మాస్కోను, రష్యాను రక్షించారు.

అక్టోబరు 17న స్టాలిన్ మాస్కోలోనే ఉన్నట్లు ప్రకటన వెలువడింది. ఆ వార్త ప్రజలలో ఎంతో ధైర్యాన్ని కలిగించింది. మాస్కో జర్మన్ల వశమయ్యే అవకాశం లేదనిపించింది. అదే రోజు మాస్కోకు ఏర్పడిన తీవ్ర ప్రమాదం గురించి కూడా తెలియజెయ్యబడింది. ఎందువలన తరలింపు చర్యలు తీసుకోవలసి వచ్చినదీ వివరించడం జరిగింది. మాస్కోను జర్మన్ల అధీనం చెయ్యబోతున్నట్లు వస్తున్న నీలివార్తలను ఖండించడం జరిగింది. మాస్కో చివరి రక్తపు బొట్టు వరకూ పోరాడుతుందని ప్రకటించబడింది. నగర ఉత్తర ప్రాంతాలనుండి జనాలను మధ్య ప్రాంతాలలోకి తరలించారు. విమాన దాడుల ప్రమాదాన్ని సూచిస్తూ నిరంతరం సైరన్ మోగుతుండేది, బాంబులు పడేవి.

రెండు రోజుల తర్వాత మాస్కోలో 'ముట్టడి పరిస్థితి' (State of Siege) ప్రకటించబడింది. బహుశా అక్కడక్కడ జరిగిన లూటింగును దృష్టిలో పెట్టుకుని ఈ ప్రకటన వెలువడి ఉండవచ్చు. శత్రు గూఢచారులనూ ఏజెంట్లనూ ఎమర్జన్సీ ట్రైబ్యునల్స్ అక్కడికక్కడే విచారించి కాల్చి వెయ్యాలనీ, నగరంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే ఏ విధమైన చర్యనైనా తీవ్రంగా అణచి వెయ్యాలనీ ఆదేశించడం జరిగింది. ఈ చర్యల వలన జనాలకు ధైర్యం చేకూరింది.

అనధికారంగా పలాయనం చిత్తగించిన వారు కాకుండా అక్టోబరు అంతానికి 20 లక్షలమందిని మాస్కో నుంచి తరలించారు.

మొదటి పదిహేను రోజులలోనూ జర్మన్లు మాస్కోకు 50 మైళ్ళ సమీపానికి చేరారు. కొన్ని రంగాలలో ఇంకా దగ్గరకు చేరారు. కాని రోజురోజుకూ రష్యన్ ప్రతిఘటన తీవ్రం కాసాగింది. ఇరు పక్షాలలోనూ తీవ్ర నష్టాలు సంభవించాయి. జర్మన్లు బలహీనపడుతున్నట్లు స్పష్టమయింది. అక్టోబరు 18 నుంచి అక్టోబరు అంతందాకా జర్మన్లు మరి ముందుకు సాగలేక పోయారు.

ఒక నెల యుద్ధం తర్వాత జర్మన్ సైన్యాలు 145-160 మైళ్ళు పురోగమించాయి కాని మాస్కోను స్వాధీనం చేసుకోవాలన్న కల కలగానే మిగిలిపోయింది. జర్మన్ సైన్యం అలిసిపోయింది. క్రమంగా శక్తిహీనమై అక్టోబరు అంతానికి జర్మన్ దాడి నిలిచిపోయింది.

జర్మన్లు మాస్కోకు ఇంకా 40 మైళ్ళ దూరంలోనే ఉన్నారు. కొన్ని రంగాలలో ఇంకా దగ్గరే ఉన్నారు. మాస్కో నగరం 'ముట్టడి స్థితి'లోనే ఉంది. అయినా మాస్కో జర్మన్ల వశం కాదు అన్న నమ్మకం రోజురోజుకూ బలపడసాగింది.

Edit with WPS Office

మొదటి జర్మన్ దాడి ఆగిపోయిన వారం రోజుల తర్వాతా, రెండో దాడి ప్రారంభం కావడానికి పది రోజుల ముందూ, మాస్కో అక్టోబరు విప్లవ వేడుకలు జరుపుకుంది. నవంబరు 6 రాత్రి, మయకోవస్కీ భూగర్భ రైల్వే స్టేషన్లో సమావేశం జరిగింది. మాస్కో నగర సోవియట్, పార్టీ, ట్రేడ్ యూనియన్ల నుంచీ, సైన్యం నుంచీ వచ్చిన ప్రతినిధులతో ఆ స్టేషను కిటకిటలాడింది. స్టాలిన్ తన ప్రసంగంలో యుద్ధం వలన దేశంలో సోషలిజం నిర్మాణం ఆగిపోయిందని చెబుతూ -

'.....నాలుగు నెలల యుద్ధంలో మన సైన్యంలో 3,50,000 మంది మరణించారు. 3,78,000 మంది కనుపించడం లేదు. 10,20,000 మంది గాయపడ్డారు. ఈ కాలంలో శత్రు సైన్యం 45 లక్షలమందిని నష్టపోయింది. (సోవియట్ నష్టాలు తక్కువ చేసీ జర్మన్ల నష్టాలు ఎక్కువ చేసీ స్టాలిన్ ఇచ్చిన ఈ సంఖ్యలు రష్యన్లలో మనో నిబ్బరం కల్పించడానికి ఉద్దేశించబడినవే కాని వాస్తవాలు కావు). జర్మనీ మానవ వనరులు పరిమితమైనవి. అవి తరిగిపోతున్నాయి. సోవియట్ యూనియన్ ఇప్పుడిప్పుడే తన రిజర్వు సైన్యాలను యుద్ధరంగంలోకి దించుతోంది.....జర్మన్ మెరుపుదాడి మూడు కారణాల వలన విఫలమైంది. బ్రిటన్, అమెరికాలు రష్యాకు వ్యతిరేకంగా తనతో చేతులు కలుపుతాయని జర్మనీ భావించింది.....కనీసం తూర్పున తన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించే స్వేచ్ఛ జర్మనీకి ఇస్తాయని భావించింది. కాని అలా జరగలేదు. రష్యా, బ్రిటన్, అమెరికాలు ఏకమయ్యాయి. రెండో కారణం. జర్మన్లు సోవియట్ ప్రభుత్వం కూలిపోతుందనీ సోవియట్ యూనియన్ ముక్కచెక్కలవుతుందనీ ఆశించారు. కాని సోవియట్ వెనుకతట్టు ఇదివరకెన్నడూ లేనంత బలంగా ఐక్యమై ఉంది....ఇలా విశాలమైన ప్రాంతాన్ని కోల్పోయిన మరేదేశమైనా బహుశా కూలిపోయేదేమో. చివరగా, జర్మన్లు సోవియట్ సైన్యాలు కుప్పకూలిపోతాయనీ ఆ తర్వాత ఏ అడ్డూ లేకుండా యురల్స్ వరకూ ఆక్రమించవచ్చుననీ భావించారు. సోవియట్ సైన్యం కంటే జర్మన్ సైన్యానికి యుద్ధానుభవం ఉన్న మాట వాస్తవం. కాని రష్యన్లు ధర్మయుద్ధం చేస్తున్నారు. జర్మనీ తన సరఫరా స్థావరాలకు దూరంగా శత్రుదేశంలో యుద్ధం చేస్తోంది. జర్మనీ సరఫరా మార్గాలు నిరంతరం పార్టిజాన్ దాడులకు గురవుతున్నాయి.....మన సైన్యం తన మాతృదేశంలోనే పోరాడుతోంది. వెనుకతట్టు నుండి ఆయుధాలూ ఆహారం - అన్ని రకాల సహాయం మన సైన్యానికి అందుతోంది. నూతన బలగాలు వచ్చి చేరుతున్నాయి. ఈ దేశభక్తి ప్రపూరిత మహా యుద్ధంలో కొత్త సైనికులు, ఆఫీసర్లు, టాంకు సైనికులు, వైమానికులు, గన్నర్లు, పదాతిదళ సైనికులు, నావికులూ తయారవుతున్నారు. వీరు రేపు జర్మన్ సైన్యానికి సింహస్వప్నం కాగలరు.....అయితే మనం నిరాకరించడానికి వీలులేని అననుకూల పరిస్థితులూ ఉన్నాయి. జర్మనీ మిత్ర దేశాల సహాయంతో - ఫిన్లాండ్, రుమేనియా, ఇటలీ, హంగరీల సహాయంతో - ఎర్ర సైన్యంతో యుద్ధం చేస్తోంది. యూరోపు భూభాగం మీద రష్యాకు సహాయంగా బ్రిటిష్, అమెరికన్ సైన్యాలేమీ లేవు.....యూరోపులో రెండో యుద్ధ రంగం త్వరలోనే ప్రారంభమవుతుందనడంలో ఏమీ సందేహం లేదు.....మన సైన్యానికి అది సహాయకారిగా ఉండి జర్మన్లను మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తుంది.....మరొక అననుకూలమైన పరిస్థితి ఏమిటంటే జర్మనీకి విమానాలలోనూ టాంకులలోనూ ఆధిక్యత ఉంది. జర్మనీకి ఉన్న టాంకుల సంఖ్యతో పోల్చి చూస్తే ఎర్ర సైన్యం టాంకుల సంఖ్య బాగా తక్కువ. కొత్తగా తయారవుతున్న రష్యన్ టాంకులు జర్మన్ టాంకుల కంటే మేలైనవి కాని తగినన్ని లేవు. టాంకుల ఉత్పత్తిని అధికం చెయ్యడమే కాక టాంకు విధ్వంసక విమానాలూ గన్నులూ రైఫిళ్ళూ మోర్టార్లూ చేతి బాంబుల ఉత్పత్తిని అధికం చెయ్యాలి. టాంకులు ముందుకు చొచ్చుకు రాకుండా అనేక అవరోధాలు కలిపించే పద్ధతులను కనిపెట్టాలి.....'

స్టాలిన్ తన ప్రసంగంలో రష్యన్ జాతి ఔన్నత్యం గురించి అతి ముఖ్యమైన ప్రకటన చేశాడు. ఇప్పుడు యుద్ధం ఎక్కడో బెలో రష్యాలోనో యుక్రెయిన్లోనే జరగడం లేదు. రష్యా గుండెకాయ మాస్కో పరిసరాల్లో జరుగుతోంది. ఇటువంటి పరిస్థితులలో నవంబరులో చేసిన రెండు ప్రసంగాలలోనూ స్టాలిన్ రష్యన్ జాతి తను పొందుతున్న అవమానాలకు ఆగ్రహపరవశమవుతున్న విషయం గమనించి ఆ నాటి అవసరాలకు అనుగుణంగా మారడం కనుపిస్తుంది. కొంతమంది పార్టీ సిద్ధాంత వేత్తలకు అది రష్యన్ జాతి దురహంకారాన్ని స్టాలిన్ అంగీకరిస్తున్నట్లు అనిపించినా ఆ పరిస్థితులలో జాతికి సంబంధించిన NEP (విప్లవానంతరం లెనిన్ నూతన ఆర్థిక అవసరాలకు అనుగుణంగా తన ఆర్థిక విధానాన్ని మార్చవలసి వచ్చింది. దీన్నే NEP అంటారు. అలాగే జాతుల సమస్య విషయంలో కూడా స్టాలిన్ నూతన అవసరాలకు అనుగుణంగా మారాడు అని దీని అర్థం) గా అంగీకరించారు.

Edit with WPS Office

'.....జంతువులకుండే నీతి నియమాలున్న ఈ శత్రువులు ప్లెఖనోవ్, లెనిన్, బెలిన్ స్కీ, ఛెర్నిషేవ్ స్కీ, పుష్కిన్, టాలెస్టాయ్, గోర్కీ, ఛెకోవ్.....సువరోవ్, కుటుజోవ్ల రష్యాను నాశనం చెయ్యడానికి కంకణం కట్టుకున్నారు. జర్మన్ దురాక్రమణదారులు దేశాన్ని తుడిచి పెట్టే యుద్ధం చెయ్యాలని ఆశిస్తున్నారు. దేశాన్ని తుడిచి పెట్టేసే యుద్ధాన్ని జర్మనీ కోరుకుంటుంటే అటువంటి యుద్ధమే జరుగుతుంది. జర్మనీ తుడిచిపెట్టుకు పోతుంది. మన కర్తవ్యం ఏమిటంటే మన దేశాన్ని ఆక్రమించడానికి అడుగు పెట్టిన ప్రతీ జర్మన్ నూ నాశనం చెయ్యడమే. జర్మన్ దురాక్రమణదారుల పట్ల దయాదాక్షిణ్యాలను చూపకూడదు....వాళ్ళు అంతం కావాలి.....

ఈ క్రూరజంతువులు చివరకు నాశనమవుతాయనడానికి కారణాలు ధర్మం, నీతి మాత్రమే కాదు. యూరోపులో జర్మన్లను నిర్మించడానికి ప్రయత్నిస్తున్న నూతన వ్యవస్థ (New Order) అనే బలహీనమైన పునాది మీద జర్మనీ నిలబడలేదు. రెండో కారణం, జర్మనీ వెనుకతట్టు కూడా నాజీలకు విశ్వసనీయమైనది కాదు. లక్షలమందిని బలిగొంటున్న ఈ యుద్ధాలతో, కరువుతో, రోగాలతో, జర్మన్ ప్రజలు విసిగిపోయి ఉన్నారు. యూరోపు వెనుకతట్టు ప్రాంతమే కాకుండా జర్మన్ వెనుక తట్టు ప్రాంతం కూడా పేలబోయే అగ్ని పర్వతంలా ఉందని హిట్లర్ లాంటి మూర్ఖులకు మాత్రమే అర్థం కాదు. మూడో విషయం. జర్మన్ ఫాసిస్టులకు వ్యతిరేకంగా మూడు అగ్ర రాజ్యాల ఐక్య సంఘటన. ఈ యుద్ధం యంత్రాల యుద్ధం. బ్రిటన్, సోవియట్ యూనియన్, అమెరికాలు, జర్మనీ కంటే మూడు రెట్లు యంత్రాలను ఉత్పత్తి చెయ్యగలవు.....సోవియట్ యూనియన్ విముక్తి పోరాటం చేస్తున్నది. యూరోపు, ఆసియాలలో ఏ దేశ భూభాగాన్నీ ఆక్రమించాలని సోవియట్ యూనియన్ అనుకోవడం లేదు. సోవియట్ యూనియన్ తన ఇష్టాన్ని కాని, సోవియట్ తరహా ప్రభుత్వాన్ని కాని, ఇతరుల మీద రుద్దాలనుకోవడం లేదు.....'

సోవియట్ సైన్యాలు విజయం సాధించడానికి అన్ని సహాయ సహకారాలూ అందించాలంటూ స్టాలిన్ తన ప్రసంగం ముగించాడు. ఈ ప్రసంగం కంటే మరింత నాటకీయమైనది రెడ్ స్క్వేర్ లో సైనిక వందనం స్వీకరిస్తూ స్టాలిన్ మరునాడు చేసిన ప్రసంగం.

ప్రతీ సంవత్సరం, అక్టోబరు విప్లవ సందర్భంగా నవంబరు 7న సైనిక వందనం జరుగుతుంది. ఆ సంవత్సరం కూడా, మాస్కో ఉనికి సంశయంలో ఉన్నప్పుడు కూడా, సైనిక వందనం ఉండాలని స్టాలిన్ నిర్ణయించాడు. ఆ సైనిక వందనం జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ, రాజకీయంగా చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. పెరేడ్ జరుగుతున్నప్పుడు నేపథ్యంలో రష్యన్, జర్మన్ గన్నుల శబ్దం వినిపిస్తూనే ఉంది. శత్రు విమాన దాడులనుంచి కాపాడడానికి ఆకాశంలో రష్యన్ ఫైటర్ విమానాలు పహరా ఇచ్చాయి. ఈ పెరేడ్ సందర్భంగా ప్రత్యేకంగా మాస్కో రక్షణకు సమీప యుద్ధ రంగాల నుంచి అదనపు ఫైటర్ విమాన దళాలను తరలించారు. ఆ నవంబరు చలికాలం ఉదయం లెనిన్ మసోలియం దగ్గర సైనిక దళాలు కవాతు చేస్తూ తిన్నగా యుద్ధరంగానికి వెళ్ళాయి.

నవంబరు దాడి

నవంబరు 15న రెండో జర్మన్ దాడి ప్రారంభమైంది. ఈ దాడిని ఎదుర్కోవడానికి రష్యా సిద్ధంగా ఉంది. సుప్రీం హెడ్ క్వార్టర్స్ రిజర్వు సైన్యాలనుంచి అదనపు బలగాలు రంగంలో ప్రవేశించాయి. టాంకులూ, ఆయుధాలూ, సిగ్నల్ పరికరాలూ, అన్నీ అందజేయబడ్డాయి. సుప్రీం హెడ్ క్వార్టర్స్ రిజర్వులనుంచి అందిన టాంకులనూ, పదాతి దళాలనూ, శత్రు ప్రమాదం అధికంగా ఉంది అని భావించిన ప్రదేశాల్లో కేంద్రీకరించారు. శీతాకాలం చలిని తట్టుకునేందుకు ఫర్ కోట్లూ, ఫెల్టు బూట్లూ, ఫర్ టోపీలూ లాంటి దుస్తులు సైన్యానికి ఇచ్చారు. జర్మన్ హై కమాండు జర్మన్ సైనికులకు శీతాకాలం దుస్తులను ఇంకా సరఫరా చెయ్యలేదు. వారు స్థానికుల దగ్గర నుంచి దోచుకున్న గడ్డితో చేసిన దుస్తులు వేసుకునే వారు.

నష్టాలను లెక్క చెయ్యకుండా జర్మన్ సైన్యం దాడిని కొనసాగించింది. రష్యన్ రక్షణ రేఖ విల్లులాగా వంగసాగింది. కొన్ని ప్రదేశాలలో జర్మన్లు రక్షణ శ్రేణిని ఛేదించే ప్రమాదం ఏర్పడింది. అటువంటి చోట్ల, అదనపు బలగాలు రాగానే రష్యన్లు జర్మన్లను నిలుపు చేశారు. నవంబరు 29న జర్మన్ దళం ఒకటి మాస్కో-వోల్గా కాలవ వంతెనను స్వాధీనం చేసుకుని తూరుపు గట్టుకు చేరుకుంది. అక్కడ రష్యన్ సైన్యం ఎదుర్కొని తీవ్ర పోరాటం తర్వాత వెనుకకు గెంటివేసింది.

Edit with WPS Office

ఈ ఆపరేషన్ టైఫూన్ పధకాన్ని వెయ్యడంలో జర్మన్ కమాండు రష్యన్ బలగాలను తక్కువ అంచనా వేసింది. తన శక్తి సామర్థ్యాలను ఎక్కువగా అంచనా వేసింది. రష్యన్ శ్రేణులను ఛేదించి మాస్కో చేరుకోగలననుకుంది. సోవియట్ ప్రతిఘటన, శీతాకాలం యుద్ధానికి తగిన విధంగా సిద్ధంగా ఉండకపోవడం, విపరీతమైన నష్టాలూ జర్మన్ల పోరాట పటిమను హరించి వేశాయి. జర్మన్లు, రష్యన్ శ్రేణులను దాటి వెళ్ళలేకపోయారు. ఈ రెండో దాడిలో, 20 రోజులలోనూ జర్మన్ సైన్యంలో మృతులు, క్షత గాత్రుల సంఖ్య 1,55,000. జర్మనీ 800 టాంకులు, 300 ఫిరంగులు, 1500 విమానాలనూ నష్టపోయింది. ఇంక దాడి కొనసాగించడానికి జర్మన్ల వద్ద సైన్యమూ లేదు, ఆయుధాలూ లేవు. ఇంతవరకూ జరిగిన యుద్ధంలో సైనిక బలగాలలోనూ, ఆయుధ సామగ్రిలోనూ విపరీతమైన నష్టాలూ, లక్ష్యంగా పెట్టుకున్నది ఏదీ సాధించలేక జర్మన్ మెరుపుదాడి ముగియడం, జర్మన్ సైన్య మనో నిబ్బరాన్ని దెబ్బ తీసింది. యుద్ధం ఎలా ముగుస్తుందా అన్న సందేహం సైనికులలో కలగసాగింది. ఇదే మాస్కో మార్గం గుండా దాడి చేసిన నెపోలియన్ సైన్యం నాశనమైన చరిత్ర జర్మన్ సైన్యాన్ని పీడకలలా వెన్నాడసాగింది (1821లో, ఆ నాటి ప్రపంచంలో అతి శక్తివంతమైనదిగా పరిగణించబడిన 6 లక్షల గ్రాండ్ ఆర్మీతో నెపోలియన్ రష్యా మీద దాడి చేసి మాస్కో నగరాన్ని కూడా ఆక్రమించాడు, కాని రష్యాలో నిలువలేక పోయాడు. రష్యన్ శీతాకాలం, రష్యన్ ప్రతిఘటన వలన అతని సైన్యం నాశనమైంది. చివరకు కేవలం 21,000 మంది సైనికులతో అతను ఫ్రాన్స్ ను చేరగలిగాడు).

జర్మన్ ఖైదీలను ప్రశ్నించి, జర్మన్ సైన్యాలు విపరీతంగా నష్టపోయాయనీ, వారి ఆత్మ విశ్వాసం దెబ్బతిందనీ, మాస్కోను ఆక్రమించగలమన్న నమ్మకం పోయిందనీ, జర్మన్ దాడి రష్యన్ ప్రతిఘటనను అధిగమించలేక నీరసపడి నిలిచిపోయిందనీ, నవంబరు అంతానికి రష్యన్లు గ్రహించారు.

రష్యన్ ఎదురు దాడి

మాస్కో మీద జర్మన్ దాడి కొనసాగుతున్న సమయంలోనే ఎదురు దాడికి ప్రణాళికను వెయ్యడం ప్రారంభమైంది. జర్మన్ సైన్యం బాగా బలహీనపడిందన్న విషయం స్పష్టమైన తర్వాత ప్లాను పై అంతిమ నిర్ణయం తీసుకోవడం జరిగింది.

రష్యన్ సైన్యం మెల్లగా మాస్కో నగరానికి తిరోగమిస్తుంటే, తూర్పునుంచి వస్తున్న సుశిక్షితమైన రిజర్వు సైన్యాలు యుద్ధ రంగంలోకి ప్రవేశించకుండా మాస్కో దగ్గర అడవుల్లో రహస్యంగా సమీకరించబడ్డాయి. తీవ్రమైన శీతాకాలంలో, మంచులో సైనిక దళాల కదలికలు కష్టమైనా, అత్యంత శ్రమ కోర్చి రష్యన్ సైన్యాలు ఎదురు దాడికి సన్నద్ధమయ్యాయి. నవంబరు 25 తర్వాత కొద్ది కొద్దిగా ఈ సైన్యాలు యుద్ధరంగంలో ప్రవేశించాయి కాని డిసెంబరు 6 వరకూ పెద్ద ఎత్తున దిగలేదు. ఎదురుదాడికై ఉద్దేశించబడ్డ ఈ రిజర్వు సైన్యాలను శకలాలుగా యుద్ధరంగంలోకి దింపడం వలన ఆశించిన ప్రయోజనం చేకూరదు. ఈ రిజర్వు సైన్యాలు డిసెంబరు 6న ఎదురుదాడి చేసే దాకా నాజీ సైన్యాన్ని వలంటీరు సైన్యాలు ప్రతిఘటించాయి.

రష్యన్ ఎదురుదాడి తక్షణ లక్ష్యం ఉత్తరాన్నుంచీ, దక్షిణాన్నుంచీ, మాస్కోను అడకత్తెరలో బిగించిన జర్మన్ ప్రమాదాన్ని నివారించడం. తరువాత ఏమి చెయ్యాలా అనేది ఈ ఎదురుదాడి జరిగే తీరు మీద ఆధారపడి ఉంటుంది. మొత్తం లక్ష్యం ఏమిటంటే, శత్రువుకు విపరీతంగా నష్టం కలిగించి మాస్కోనుంచి ఎంత దూరం సాధ్యమైతే అంత దూరం నెట్టివేసి మాస్కోను కాపాడడం.

డిసెంబరు 6న, తీవ్ర వైమానిక, ఆర్టిలరీ దాడుల తర్వాత, మాస్కోకు ఉత్తరానా, దక్షిణానా రష్యన్ సైన్యాలు 560 మైళ్ళ యుద్ధ రంగంలో జర్మన్ సైన్యం మీద దాడి చేశాయి. రష్యన్లు ప్రతీ చోటా జర్మన్లను తరమసాగారు. ఎర్రసైన్యం ఇలా బలమైన దాడి చెయ్యగలదని జర్మన్లు కలలో కూడా ఊహించలేదు. రష్యన్ సైన్యాలు పది రోజులలో జనరల్ గుడెరియన్ సైన్యాన్ని 85 మైళ్ళు వెనక్కు తరిమి కొట్టాయి. బలహీనపడ్డ జర్మన్ సైన్యాలు రష్యన్ దాడులను తట్టుకోలేక పశ్చిమం వైపు తిరోగమించసాగాయి. కొన్ని చోట్ల జర్మన్లు రష్యన్లను ప్రతిఘటించడానికి ప్రయత్నించారు. కొన్ని చోట్ల భయంతో యుద్ధరంగం వదలి పారిపోసాగారు.

ఉత్తర రంగంలో యుద్ధం జరిగిన కొన్ని వారాల తర్వాత ఆ ప్రాంతాన్ని దర్శించిన వాల్టర్ కెర్ అనే పాత్రికేయుడు - '.....ఇంత వినాశనాన్ని నేను ఎన్నడూ చూడలేదు. రోడ్ల మీదా, కనుచూపు మేర పొలాల్లోనూ, నాశనమైన టాంకులూ, తిరగబడిన ట్రక్కులు....పేలి పోయిన కార్లలోంచి దూరంగా

Edit with WPS Office
ఎగిరిపడిన హెడ్ లైట్లు....ఇంజన్లు....జర్మన్, రష్యన్ హెల్మెట్లూ.....మెషీన్ గన్ బేరల్స్.....చచ్చిపోయిన గుర్రాలు..... జర్మన్లు ఇక్కడ ఘోరపరాజయం చవి చూశారనీ, ఆ తర్వాత వారు ఎంత వేగంగా వీలు పడితే అంత వేగంగా పారిపోవడానికి ప్రయత్నించారనీ, రష్యన్లు వారిని ఆపు చేసి నాశనం చేశారనీ, జనరల్ కుజ్నెట్సోవ్ చెప్పాడు. క్షత గాత్రులనూ, ఆయుధ సంపత్తినీ వదిలేసి జర్మన్లు పారిపోయారు. 14 రోజుల యుద్ధంలో జర్మన్ల దగ్గర నుంచి 299 టాంకులూ, 3000 వాహనాలూ, 190 ఫిరంగులూ స్వాధీనం చేసుకున్నామని అతను చెప్పాడు. క్లైన్ లోనే 3000 మంది జర్మన్లు మరణించారు.....' అని రాశాడు.

మాస్కో మీద జర్మన్ దాడి వైఫల్యం గురించీ, రష్యన్ సైన్యాలు ఎదురుదాడి ఫలితాల గురించీ, మొట్టమొదటి ప్రకటన డిసెంబరు 13న వెలువడింది. గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ యుద్ధంలో రష్యన్లకు జర్మన్ల మీద సంఖ్యలో ఆధిక్యత లేదు. రష్యన్ టాంకుల, తదితర శకటాల సంఖ్య తక్కువ. అటువంటి పరిస్థితులలో ఎదురుదాడి కొనసాగించడం కష్టం. శత్రువు ఎత్తుగడలు ఊహించడానికీ, అతని బలగాలను చుట్టుముట్టడానికీ, అతను పలాయనం చేసే దారులు మూసి వేయడానికీ, బలమైన టాంకు సైన్యాలూ, మోటారు శకటాల బలగాలూ కావాలి. మొత్తం మీద జర్మనీకి కొద్దిగా ఆధిక్యత ఉన్నా, ముఖ్యమైన రంగాలలో ఆధిక్యతను సంపాదించడం ద్వారా రష్యా ఎదురు దాడి చెయ్యగలిగింది.

వెయ్యి కిలోమీటర్ల పైన ఉన్న జర్మన్ సరఫరా మార్గాలు నిరంతరం గెరిల్లా దాడులకు గురయ్యేవి. పార్టిజాన్లు రాత్రివేళ వంతెనలు పేల్చి వేసేవారు. రోడ్ల మీద మందు పాతరలు పాతేవారు. రోడ్డు మీద పోతున్న వాహనాల మీద చేతి బాంబులు విసిరి ధ్వంసం చేసేవారు. వంతెనలు కూల్చివేసిన ప్రదేశాల్లో, లేదా వాహనాలను రోడ్లమీద పేల్చివేసిన చోట, జర్మన్ సైన్యం నిలిచిపోయేది. జర్మన్లు భారీ ఆయుధాలను వదలి పారిపోసాగారు. ఈ తిరోగమనం, కొన్ని చోట్ల క్రమశిక్షణ కోల్పోయి, పలాయనంగా మారింది. జర్మన్ సైనికులను రష్యన్ అశ్విక దళాలు తరిమి వేటాడసాగాయి.

జర్మన్ జనరల్ వెస్ట్ ఫాల్, 'ఒకప్పుడు అజేయమని భావించబడిన జర్మన్ సైన్యం ఇప్పుడు నాశనానికి సిద్ధంగా ఉంది' అని రాశాడు.

జర్మనీ, 5 లక్షలమంది సైనికులనూ, 1300 టాంకులు, 2500 గన్నులు, 15000 ట్రక్కులు తదితర యుద్ధసామగ్రినీ నష్టపోయింది. మాస్కో నుంచి 100-200 మైళ్ళ దూరం గెంటివేయబడింది.

యుద్ధంలో మొట్టమొదటి సారి రష్యన్ సైన్యం మాస్కో యుద్ధంలో జర్మన్ల మీద ఘన విజయం సాధించింది. దేశభక్తి ప్రపూరిత మహా యుద్ధం ప్రారంభమైన తర్వాత మొట్టమొదటి విజయం అది. అంతకు ముందు స్థానిక యుద్ధాలలో జర్మన్లను నిలువరించినా, కొంత దూరం వెనుకకు గెంటివేయగలిగినా, అది జర్మన్ సైన్య పురోగమన వేగాన్ని తగ్గించడానికి మాత్రమే ఉపయోగపడింది. నేర్పుతో దెబ్బకాచుకుంటూ రక్షణ యుద్ధం చెయ్యడం, ఎదురు దాడులు చెయ్యడం, జర్మన్ మెరుపుదాడిని బలహీన పరచి వెంటనే పెద్ద ఎత్తున జర్మన్ సైన్యం మీద ఎదురు దాడి చెయ్యడం - సోవియట్ కమాండ్, సోవియట్ సైనికుల, ఆఫీసర్ల యుద్ధ తంత్ర నైపుణ్యాన్ని సూచిస్తుంది.

జర్మన్ పరాజయం అంతర్జాతీయంగా కూడా ప్రాముఖ్యత కలది. నాజీ ఆక్రమణలో ఉన్న దేశాల ప్రజలు ఫాసిస్ట్ బానిసత్వాన్నుండి విముక్తి లభించే రోజు దగ్గరపడుతున్నదని గుర్తించారు. జపాన్, టర్కీ దేశాలు రష్యా శక్తిని గుర్తించి ఏ దుస్సాహస చర్యలకూ దిగకుండా జాగ్రత్త పడ్డాయి. జర్మన్ల పరాజయం తర్వాత, వ్యూహాత్మకంగా చొరవ జర్మన్ల చేతులనుండి రష్యన్ల చేతుల్లోకి వచ్చింది. తన నష్టాలను భర్తీ చెయ్యడానికి జర్మనీ, ఫ్రాన్స్ నుండీ తదితర ఆక్రమిత రాజ్యాల నుండీ పెద్ద ఎత్తున సైన్యాన్ని రష్యాకు తరలించింది. అదనపు సైనిక బలగాలనూ, యుద్ధ సామాగ్రినీ పంపించవలసిందని తన అధీనంలో ఉన్న ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకు రాసాగింది. ఈ ఒత్తిడి వలన ఆ దేశాలలో రాజకీయ పరిస్థితి సంక్షోభంలో పడసాగింది. మాస్కో పరాజయం తర్వాత ప్రపంచాన్ని జయించడానికి హిట్లర్ వేసిన పథకాలకు అడ్డుగోడలా నిలిచిన సోవియట్ శక్తిని జర్మన్ జనరల్స్, ఆఫీసర్లూ గుర్తించారు.

మాస్కో యుద్ధంలో జర్మన్లు తమ అపజయానికి కారణం బురద, మంచు అని చెబుతుంటారు. ఆ ఏడాది 'రాస్ పుటిట్ జా' - రష్యన్ వానలు, బురద కాలం - త్వరగా మొదలయిందనీ, అందువలన తమ సైన్య కదలికలకు ఇబ్బంది ఏర్పడిందనీ చెబుతారు. గన్నులనూ, ట్రక్కులనూ బురదలోంచి లాగడానికి టాంకులను ఉపయోగించవలసి వచ్చిందనీ, అందుకవసరమైన గొలుసులూ కప్లింగులూ

Edit with WPS Office
లభ్యం కాలేదనీ, జర్మన్ రవాణా విమానాలు యుద్ధరంగానికి కావలసిన అత్యవసర సరఫరాలు నిలుపు చేసి సైన్యానికి ఇవి సరఫరా చెయ్యాల్సి వచ్చిందనీ అంటారు. ఉదాహరణకు జనరల్ బ్లూమింట్రాట్, 'సైనికులు బురదలో కూరుకుపోయేవారు. ఒక్కొక్క గన్ను లాగడానికి అనేక గుర్రాలు కావలసి వచ్చేవి. చక్రాలబళ్ళన్నీ ఏక్సిల్ వరకూ బురదలో కూరుకుపోయేవి. ట్రాక్టర్లు కూడా అతి కష్టం మీద కదలగలిగేవి. భారీ ఆర్టిలరీలో అత్యధిక భాగం ముందుకు కదలలేక నిలిచిపోయేది. నెలల యుద్ధంలో అలిసిపోయిన సైన్యం మీద ఈ అదనపు కష్టాలు ఎంత దుర్భరమైనవో ఊహించవలసిందే.....మాస్కో కళ్ళ ఎదురుగా ఉన్న సమయంలో సైనికుల, ఆఫీసర్ల మూడ్ మారసాగింది. శత్రువు ప్రతిఘటన అంతకంతకు తీవ్రమైంది. చాలా కంపెనీలలో 60-70 మంది సైనికులు మాత్రమే మిగిలారు. పని చేసే ఆర్టిలరీ, టాంకుల సంఖ్య తగ్గిపోయింది. శీతాకాలం ప్రారంభమవుతోంది. కాని సైన్యానికి శీతాకాలపు దుస్తులు వచ్చే అవకాశం కనుపించడం లేదు. వెనుకతట్టులో, విశాలమైన అడవుల్లోనూ, చిత్తడినేలల్లోనూ పార్టిజాన్లు సరఫరా వాహనాల మీదా, సైన్య శకలాల మీదా దాడి చేస్తున్నారు....' అని వాపోయాడు.

తమ అపజయానికి అసలు కారణాలు వదలి బురదను నిందించే జర్మన్ జనరల్స్ అక్టోబరులో బురద కాలం అతి తక్కువగా ఉన్నదనే వాస్తవాన్ని మరుగు పరుస్తారు. చలికాలం మొదలై నవంబరులో మంచు పడడంతో రోడ్లు గట్టిపడి ప్రయాణానికి అనువుగా తయారయ్యాయి. నవంబరులో జర్మన్లు మాస్కో మీద దాడి చేసే సమయానికి ఉష్ణోగ్రత సున్నాకు 7-10 డిగ్రీలకు తక్కువగా ఉంది. ఇటువంటి స్థితిలో బురద అన్నది ఉండదు.

మంచు పడితే రోడ్లు గట్టిపడతాయని మంచుకోసం తహతహలాడిన జర్మన్ జనరల్స్, వానలు తగ్గి మంచు పడడం మొదలు కాగానే మంచు గురించి వాపోవడం మొదలు పెట్టారు. జనరల్ గుడెరియన్ '.... మంచు చాలా ఇబ్బందిని కలిగిస్తోంది....టాంక్ ట్రాక్స్ ఇంకా సరఫరా చెయ్యకపోవడం వలన మంచులో టాంకులు నడవడం కష్టమవుతోంది. మంచువల్ల గన్నుల టెలిస్కోపిక్ సైట్సు పని చెయ్యడం లేదు. టాంకు ఇంజిన్లు స్టార్టు చెయ్యాలంటే వాటి కింద మంటలు పెట్టాల్సి వస్తోంది. ఇంధనం కూడా అప్పుడప్పుడు గడ్డ కడుతోంది. మంచు దెబ్బ వలన ప్రతీ రెజిమెంటులోనూ సైనికుల సంఖ్య సుమారు 500కు తగ్గిపోయింది. మంచువల్ల మరతుపాకులు పని చెయ్యడం లేదు. జర్మన్ ఏంటీ టాంకు గన్నులు (రష్యన్) టి-34 టాంకులకు ఏమీ నష్టం కలిగించలేకపోతున్నాయి.....ఎముకలు కొరికే చలి, ఉండడానికి నెత్తిమీద కప్పు లేకపోవడం, శీతాకాలపు దుస్తుల కొరత, ఆయుధాలలోనూ, సంఖ్యలోనూ సైన్యం విపరీతంగా నష్టపోవడం, ఇంధన సరఫరా తగినంతగా లేకపోవడం - ఇదంతా చూస్తుంటే కమాండరుగా నా బాధ్యత గుర్తుకొచ్చి నా గుండె బరువెక్కుతోంది.....' అని రాశాడు.

ఈ జనరల్స్ కథనాల ప్రకారం జర్మన్ సైన్యం ఓడిపోవడానికి కారణం సోవియట్ సైనికుల అసమాన ధైర్య సాహసాలు కావు. దుర్గమమైన అడవులలో, చిత్తడి నేలల్లో దుర్భరమైన జీవితం గడుపుతూ దాడులు చేస్తున్న గెరిల్లా వీరులు కారు. సైబీరియాలో ఉక్కులా గట్టి పడిన మంచు పగలగొట్టి కొత్త గనులు తవ్విన గని కార్మికుల పట్టుదల కాదు. రోజుకు పదిహేను గంటలు పని చేస్తూ యంత్రాల దగ్గరే మరణించిన కార్మిక వీరుల త్యాగాలు కాదు. ఎముకలు కొరికే చలిలో మాస్కోలో వందల మైళ్ళ ట్రెంచిలు, ఏంటీ టాంకు కందకాలు తవ్వి, ముళ్ళ కంచెలు వేసిన మాస్కో స్త్రీలు కాదు. స్టాలిన్ పిలుపునందుకుని ఒక్కటిగా లేచి నిలబడిన రష్యన్ ప్రజానీకం కాదు. కేవలం బురద, మంచు. బురద, మంచు జర్మన్లనే బాధించాయనుకోవాలా? అదే ప్రదేశంలో యుద్ధం చేస్తున్న రష్యన్ సైనికులు బురదలో కూరుకు పోలేదా? మంచు వాళ్ళని బాధించలేదా?

యుద్ధంలో వాతావరణానికి పాత్ర ఉంటుంది. ఈ వాతావరణ ప్రభావం ఇరు పక్షాల మీదా సమానంగా ఉంటుంది. శీతాకాల యుద్ధానికి అవసరమైన శిక్షణ, ఆయుధాలు, సామగ్రి, వెచ్చని దుస్తులూ ఎర్ర సైన్యానికి అందించడం, రష్యన్ నాయకత్వ ముందుచూపునూ, దీర్ఘకాలిక యుద్ధానికి అది సిద్ధమైన తీరునూ తెలియజేస్తుంది. జర్మనీ శీతాకాల యుద్ధానికి సిద్ధంగా లేదు. జర్మన్ విమానాలలో శీతాకాలం ఎగరడానికి అవసరమైన పరికరాలులేవు. రష్యన్ విమానాలకు చక్రాలకు బదులు మంచులో స్కీలు మీద దిగే ఏర్పాటు ఉంది. ఇంజన్లు వేడి చెయ్యడానికీ, బాంబింగ్ పరికరాలలో, గన్నులలో చమురు గడ్డకట్టకుండా ఉండడానికీ రష్యన్లు ఏంటీ ఫ్రీజ్ ఉపయోగించేవారు. రష్యన్ పైలట్లు వెచ్చగా ఉండే దుస్తులు ధరించేవారు. విమానాశ్రయాలలో రన్వేలనుంచి మంచును తొలగించడానికి పరికరాలుండేవి. ఇవన్నీ లోపించిన జర్మన్ విమానాలు రష్యన్ విమానాలను ఎదుర్కోలేకపోయేవి. సోవియట్ విమానాలు జనవరి, ఫిబ్రవరి నెలలలో ఆకాశంలో ఆధిక్యత

Edit with WPS Office
సంపాదించగలిగాయి. చలికాలంలో వెచ్చని దుస్తులు ఆయుధాల వంటివే. శీతాకాలపు పోరాటానికి అనువుగా రష్యన్ ప్రభుత్వం ముందు చూపుతో తమ సైన్యానికి వెచ్చని దుస్తులు సరఫరా చేసింది. నాజీ నాయకత్వం, రష్యాను వారాలలో నెలలలో భూమండలం నుంచి తుడిచి పెట్టెయ్యగలమన్న అహంభావంతో శీతాకాలపు యుద్ధానికీ దీర్ఘకాలిక యుద్ధానికీ సిద్ధం కాలేదు.

మాస్కో యుద్ధంలో జర్మనీ పరాజయానికి కారణం మంచూ కాదు, బురదా కాదు. అసలు కారణం మరొకటి ఉంది.

జర్మన్ నాయకత్వం చేసిన ఘోరమైన పొరపాటు - ఏ సైన్యాధిపతీ చెయ్యకూడని పొరపాటు - ఏమిటంటే శత్రువు గురించి తెలియకుండా యుద్ధానికి దిగడం. జర్మన్లకు వారి శత్రువు శక్తి గురించి తెలియదు. రష్యన్ ప్రభుత్వం ఎన్ని లక్షల సైన్యాన్ని సమీకరించగలదో తెలియదు. రష్యన్ ఆర్థిక, సైనిక వనరుల గురించీ రష్యన్ రైల్వేల రవాణా శక్తి గురించీ అంచనా లేదు. రష్యన్ కార్మిక వర్గం గురించీ ప్రజల గురించీ ప్రభుత్వం గురించీ, సోషలిస్టు సమాజం రష్యన్ ప్రజల్లో తీసుకు వచ్చిన నూతన చైతన్యం గురించీ అవగాహన లేదు.

దీనికి మూలం స్టాలినిస్టు రష్యా గురించి తప్పుడు అవగాహన. ఆకలితో, కరువులతో, అంతఃకలహాలతో రష్యా విచ్ఛిన్నమవుతోందని అసత్యాలు ప్రచారం చేసి చేసి, చివరకు తన అసత్యాలను తానే నమ్మే స్థితికి చేరాడు హిట్లర్. 'ఒక్క తాపు తంతే శిథిలమైన రష్యా కూలిపోతుందనుకున్నాడు'. హిట్లర్ ఆశించినట్లు రష్యా తాపు తంతే కూలిపోలేదు. లక్షల సైన్యం బందీ అయిన తర్వాత కూడా, విశాలమైన రష్యన్ భూభాగాలను జర్మనీ ఆక్రమించిన తర్వాత కూడా, అతను ఆశించినట్లు రష్యన్ ప్రజలూ, సైన్యమూ స్టాలిన్ పై తిరుగుబాటు చెయ్యలేదు. కమ్యూనిస్టు పార్టీ, స్టాలిన్ ల నాయకత్వంలో సంఘటితమయ్యారు. దేశమంతా రణరంగమైంది. మొదటి ఆరునెలల గడ్డుకాలంలో ఎర్ర సైన్యం భయంకరమైన నష్టాలకు గురవుతూ వందల మైళ్ళు తిరోగమించినా, పశ్చిమ దేశాల సైన్యాలు కూలిపోయినట్లు కూలిపోలేదు. పైగా క్రూరమైన ఈ యుద్ధంలో రాటుదేలింది. 1942లో కొత్త టాంకు సైన్యాలూ, ఆయుధాలూ, విమానాలూ ఎర్రసైన్యానికి అందినప్పుడు అది ఆపలేని శక్తిగా విజృంభించింది.

జర్మన్ ఉన్నత సైనికాధికారులు తమ లక్ష్యాలను జాగ్రత్తగానే నిర్ణయించారు. కాని రష్యా మీద మూడు రంగాలలో ఒకేసారి దాడి చెయ్యడానికి జర్మన్ సైనిక శక్తి సరిపోదు. వ్యూహాత్మకమైన ఈ సమస్య వలన దక్షిణాన సోవియట్ సైన్యం ఎదురు దాడి చేసినప్పుడు మాస్కో పై దాడిని నిలుపు చేసి దక్షిణానికి కొన్ని బలగాలను తరలించాల్సి వచ్చింది. అలాగే లెనిన్ గ్రాడ్ ను స్వాధీనం చేసుకోవడానికి ముందే కొంత వైమానిక బలగాన్నీ, టాంకు దళాలనూ మాస్కో రంగానికి తరలించాల్సి వచ్చింది. ఇల్లాంటి సమస్యలే 1942లో కూడా జర్మనీకి ఎదురయ్యాయి.

ఈ అధ్యాయాన్ని ముగించే ముందు మాస్కో యుద్ధంలో స్టాలిన్ పాత్ర గురించి మార్షల్ ఝుకోవ్ ఏం చెప్పాడో తెలుసుకుందాం.

'....మాస్కో యుద్ధంలో స్టాలిన్ పాత్ర గురించి నన్ను తరచు అడుగుతుంటారు. ఈ యుద్ధకాలమంతా స్టాలిన్ శత్రువును ఓడించడానికి సైన్యాలూ ఆయుధాలూ సమకూరుస్తూ మాస్కోలోనే ఉన్నాడు. స్టేట్ రక్షణ కమిటీ అధినేతగా, ప్రజా కమిస్సారియేట్ల అధికారుల సహకారంతో, అవసరమైన వ్యూహాత్మక, సాంకేతిక, ఆర్థిక వనరులను సమీకరించడంలో సాటిలేని అతని కృషిని గుర్తించి తీరాలి. నిక్కచ్చిగా పనిచేయించే అతని పద్ధతి ద్వారా అతను దాదాపు అసాధ్యమైనదాన్ని సాధ్యం చేశాడు.....' - (G. Zhukov, Reminiscences and Reflections, Vol. 2, P. 66).

1941 లో ఒక్క లక్ష్యం కూడా నెరవేరకుండానే యుద్ధరంగంలో దాడి చేసే పరిస్థితి నుండి రష్యన్ దెబ్బనుండి కాచుకోవాల్సిన పరిస్థితి వస్తుందని జర్మనీ ఎన్నడూ ఊహించలేదు. మాస్కో యుద్ధంలో జర్మనీ చొరవ కోల్పోయింది. జర్మన్ సైన్యం అలిసిపోయింది. మనో నిబ్బరం దెబ్బతింది.

మాస్కోనుంచి జర్మన్లను తరిమివేసిన తర్వాత జర్మన్లు బలహీన పడ్డారు కనుక వెంటనే దాడిని విస్తృత పరచి లెనిన్ గ్రాడ్ ను విముక్తి చెయ్యాలనీ, దక్షిణాన డోనెట్స్ బేసిన్, క్రిమియాలను విముక్తి చెయ్యాలనీ నిర్ణయించడం జరిగింది. ఇందులో రష్యన్లు తమ శక్తిని అతిగానూ, జర్మన్ ప్రతిఘటనా శక్తిని తక్కువగానూ, అంచనా వేశారు. 1942 ఏప్రిల్ అంతానికి రష్యన్ ఎదురు దాడి శక్తిహీనమై నిలిచిపోయింది. యుద్ధ రంగంలో ప్రతిష్టంభన ఏర్పడింది. ఇరు పక్షాలూ వేసవిలో చెయ్యబోయే యుద్ధాలకు తయారు కాసాగాయి

Edit with WPS Office

సైనిక బలగాల సంఖ్య, వారి మనో నిబ్బరం, ఆయుధాల సంఖ్య, నాణ్యత, యుద్ధరంగానికి అవసరమైనదంతా అందించగల ఆర్థిక రంగం, ప్రజల మనో నిబ్బరం, నాయకత్వ నిపుణత – ఇల్లాంటివన్నీ యుద్ధంలో జయాపజయాలను నిర్ణయించే అంశాలు. కాలం గడచిన కొద్దీ మెరుపుదాడి లాంటి దుస్సాహస విధానాలు కాక ఇటువంటి మౌలిక అంశాలు యుద్ధ పరిణామాన్ని నిర్ణయిస్తాయి. జర్మన్లు శక్తిహీనులైపోయారని కాదు. జర్మనీ ఇంకా అత్యంత ప్రమాదకరమైన శత్రువే. మళ్ళీ వేసవికాలం రాగానే పెద్ద ఎత్తున యుద్ధం తిరిగి ప్రారంభించి రష్యాను మరింత ప్రమాదానికి గురి చెయ్యగల శక్తి జర్మనీకి ఉంది.

మాస్కో జర్మన్లను నిలిపి తరిమికొడుతున్న సమయంలో, ఉత్తరాన జర్మన్ దిగ్బంధంలో చిక్కుకున్న లెనిన్ గ్రాడ్ ఆకలితో మాడిపోతోంది, చలిలో గడ్డకట్టుకుపోతోంది.

లెనిన్ గ్రాడ్ పోరాటం మరో వీర గాథ.

Edit with WPS Office

‘....మృత్యువు విహరించిన ఈ ప్రదేశంలో
ఈ నల్లటి ధూళినుంచి, ఈ బూడిద నుంచి
ఒక ఉద్యానవనం గతంలో లాగే చిగురిస్తుంది
అవును, నేను అద్భుతాలు జరుగుతాయని నమ్ముతాను
ప్రియమైన నా లెనిన్ గ్రాడ్ నగరమా!
నువ్వు నాకు ఆ నమ్మకాన్నిచ్చావు.....’

- ఓల్గా బెర్గోల్ఫ్

Edit with WPS Office

అధ్యాయం నాలుగు

లెనిన్ గ్రాడ్ దిగ్బంధం

రెండో ప్రపంచ యుద్ధంలో ఎన్నో విషాదకర సంఘటనలు జరిగాయి. హిరోషిమా మీద అమెరికా అణుబాంబు ప్రయోగించినప్పుడు సెకన్లలో రెండు లక్షలమంది చనిపోయారు. 1942 ఆగస్టు 23న జర్మనీ 600 విమానాలతో స్టాలిన్ గ్రాడ్ మీద దాడి చేసినప్పుడు ఆ ఒక్క రోజులోనే 43,000 మందికి పైగా మరణించారు. 1,50,000 మంది గాయపడ్డారు. ఇల్లాంటివే ఎన్నో సంఘటనలు జరిగాయి. కాని జర్మన్ దిగ్బంధంలో ఇరుక్కున్న లెనిన్ గ్రాడ్ నగర జనాభాలో మూడోవంతు, దాదాపు పది లక్షల మంది, బయట నుంచి సహాయం అందే మార్గం లేక ఆకలితో మెల్లగా చనిపోవడం లాంటి అత్యంత విషాదకరమైన సంఘటన మరెక్కడా సంభవించలేదు. ఒక ఆధునిక నగరం 900 రోజులు దిగ్బంధంలో ఉండడం చరిత్రలోనే అపూర్వం.

విప్లవానికి ముందు లెనిన్ గ్రాడ్ పేరు సెయింట్ పీటర్స్ బర్గ్. తర్వాత పెట్రోగ్రాడ్ గా మారింది. రష్యాకు ఉత్తర ప్రాంతంలో ఫిన్లాండు సరిహద్దులో ఉన్న నగరం ఇది. రెండు శతాబ్దాలపాటు రష్యాకు రాజధానిగా ఉంది. రాజధాని మాత్రమే కాదు, లెనిన్ గ్రాడ్ రష్యాలో ఒక మహత్తర సాంస్కృతిక కేంద్రం కూడా. పుష్కిన్, గోగోల్, డోస్టోవస్కీ లాంటి ప్రసిద్ధ రచయితల పేర్లు ఈ నగరం పేరుతో కలిసిపోయాయి. లెనిన్ గ్రాడ్ లో అసంఖ్యాకమైన సాహితీ సంస్థలుండేవి. 1941 నాటికి లెనిన్ గ్రాడ్ రష్యాలో ప్రధాన పారిశ్రామిక, సాంస్కృతిక కేంద్రమైంది. సోవియట్ యూనియన్ లో గొప్ప విద్యా కేంద్రంగా ప్రసిద్ధికెక్కింది. ఏ నగరంలోనూ లేనంత మంది విద్యార్థులు లెనిన్ గ్రాడ్ నగరంలో ఉండేవారు. అందమైన భవనాలతో, వనాలతో లెనిన్ గ్రాడ్ ప్రపంచంలో సుందరమైన నగరాలలో ఒకటిగా పేరుపొందింది.

1917 విప్లవం ఈ నగరంలోనే ప్రారంభమైంది. ఆ తర్వాత రెండు మూడు సంవత్సరాలు సోవియట్ యూనియన్ కు రాజధానిగా ఉంది. సరిహద్దులకు 20 మైళ్ళ సమీపంలో ఉన్న ఈ రాజధాని అతి తేలికగా శత్రు దాడికీ ఆక్రమణకూ గురయ్యే ప్రమాదం ఉన్నందున సోవియట్ యూనియన్ రాజధాని మాస్కోకు మారింది. రెండో అధ్యాయంలో వివరించినట్లు, బాల్టిక్ రాజ్యాలు (లాత్వియా, లిథుయేనియా, ఎస్తోనియాలు) 1939లో రష్యాలో విలీనం అయిన కారణంగానూ, ఫిన్లాండుతో శాంతి ఒడంబడిక కారణంగానూ లెనిన్ గ్రాడ్ కు కొంత రక్షణ ఏర్పడింది. బాల్టిక్ రాజ్యాల విలీనం వలన పశ్చిమ సరిహద్దు 400 మైళ్ళు వెనక్కు జరిగింది. ఉత్తరం నుంచీ, పశ్చిమం నుంచీ కొద్ది నిమిషాలలో శత్రు విమానాలు దాడి జరిపే ప్రమాదం తప్పింది. లెనిన్ గ్రాడ్ రక్షణకూ సైన్యాల కదలికలకూ విశాలమైన ప్రదేశం లభ్యమైంది. శత్రువుకు రెండు మూడు వందల మైళ్ళ దూరంలో స్థావరాలను ఏర్పరుచుకోవడానికి రష్యన్ నావికా దళానికి అవకాశం చిక్కింది. ఈ పరిణామాల వలన ఆధునిక యుద్ధంలో కూడా బలమైన శత్రువు దాడి చేసినప్పుడు లెనిన్ గ్రాడ్ ను రక్షించవచ్చు అనే ఆశ కలిగింది.

లెనిన్ గ్రాడ్ తేలికగా జర్మన్ల వశమవుతే జర్మన్-ఫిన్నిష్ సైన్యాలు చేతులు కలిపేవి. లెనిన్ గ్రాడ్ పతనం జర్మన్, జర్మనీ మిత్ర దేశ సైన్యాల ఆత్మ విశ్వాసాన్ని పెంచేది. ఉత్తర దిశనుంచి మాస్కో మీద దాడి చేసే ప్రమాదం ఏర్పడేది. జర్మన్ దాడి ఎలా పరిణమిస్తుందా అని చూస్తూ గోడమీద పిల్లుల్లా ఎటూ మొగ్గకుండా ఉన్న దేశాలు, లెనిన్ గ్రాడ్ పతనమైతే జర్మనీతో చేతులు కలిపే అవకాశం కూడా ఉంది. లెనిన్ గ్రాడ్ పతనమయిన పక్షంలో, ఆ నగర ఆక్రమణకు కేటాయించిన సైన్యాన్ని మాస్కో తదితర రంగాలకు పంపితే, రష్యన్ల పరిస్థితి మరింత అధ్వాన్నమయ్యేది. ఈ కారణాల వలన లెనిన్ గ్రాడ్ యుద్ధం ఈ మహాయుద్ధంలో కీలకమైంది.

యుద్ధం ప్రారంభమైన వెంటనే లెనిన్ గ్రాడ్ రక్షణకు అనేక చర్యలు తీసుకోబడ్డాయి. లెనిన్ గ్రాడ్ కు నైరుతి దిశలో 150 మైళ్ళ దూరంలో, నిర్మాణంలో ఉన్న రక్షణ కట్టడాలను వెంటనే పూర్తి చెయ్యాలనీ, అదే దిశలో 120 మైళ్ళ దూరంలో ఒక బలమైన రక్షణ రేఖను నిర్మించాలనీ, ఉత్తర దిశన ఫిన్లాండు సరిహద్దులో ఉన్న రక్షణ కట్టడాలను బలపరచాలనీ, నగరానికి ఆగ్నేయ దిశలో మరో రక్షణ రేఖ నిర్మించాలనీ నిర్ణయం తీసుకోవడం జరిగింది.

Edit with WPS Office
లెనిన్ గ్రాడ్ ఇప్పటివరకూ ఉత్తర దిశలో 20 మైళ్ళ దూరంలో ఉన్న సరిహద్దు గురించి భయపడుతోంది కనుక ఆ దిక్కులో బలమైన రక్షణ రేఖను నిర్మించింది. శత్రువు దక్షిణ దిక్కునుంచి గాని నైరుతి దిక్కునుంచి గాని దాడి చేస్తే లెనిన్ గ్రాడ్ కు రక్షణ లేదు. జర్మనీ నుంచి కొత్తగా ఏర్పడిన ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి ఈ రక్షణ చర్యలు జూన్ 22న రష్యా తీసుకుంది.

లెనిన్ గ్రాడ్ మీద దాడికి కేటాయించబడ్డ జర్మన్ సైన్యం సంఖ్య 7 లక్షలు. ఈ సైన్యానికి 500 టాంకులు, 12,000 ఫిరంగులు, 1200 విమానాలూ ఉన్నాయి. యుద్ధం ప్రారంభమైన మొదటి రెండు రోజులలో ఈ సైన్యం రష్యన్ సైన్యాల ప్రతిఘటనను అధిగమించి 105 మైళ్ళు పురోగమించింది. ఈ పురోగమన వేగం జర్మన్ జనరల్స్ ను కూడా ఆశ్చర్యచకితుల్ని చేసింది. లెనిన్ గ్రాడ్ ను సమీపించిన జర్మన్లు, లెనిన్ గ్రాడ్ కూడా పారిస్ నగరంలా ప్రతిఘటించకుండా 'ఓపెన్ సిటీ' గా తమకు స్వాగతం చెప్పాలని లెనిన్ గ్రాడ్ మీద కరపత్రాలు వెదజల్లారు. లెనిన్ గ్రాడ్ వాసుల ముందు ఒక ప్రశ్న నిలిచింది - బానిసలుగా జర్మన్ల చేతుల్లో మరణించడమా లేక గౌరవప్రదంగా తమ నగరాన్ని రక్షించుకునే ప్రయత్నంలో మరణించడమా?

విప్లవానికి పుట్టినిల్లయిన ఈ నగరం ప్రతిఘటించడానికే నిశ్చయించింది.

జర్మన్ దాడి గురించి తెలియగానే జూన్ 22న లెనిన్ గ్రాడ్ లో బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిగాయి. సైనిక యూనిట్లలో మనో నిబ్బరం పెంచడానికి జూన్ 27న 4,000 మంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు సైన్యంలోకి వెళ్ళారు. లెనిన్ గ్రాడ్ సోవియట్ ప్రజా వలంటీరు సైన్యాన్ని ఏర్పరచడానికి నిర్ణయించింది. కొద్దిపాటి శిక్షణ పొందిన ఈ సైన్యం యుద్ధరంగంలో జర్మన్ సైన్యంతో పోరాడడానికీ యుద్ధరంగం వెనుక రక్షణ బాధ్యత నిర్వహించడానికీ ఉద్దేశించబడింది (లెనిన్ గ్రాడ్ తర్వాత రష్యాలో ప్రతీ నగరంలోనూ ఈ ప్రజా వలంటీరు సైన్యాలు ఏర్పడి నగర రక్షణలో ప్రముఖ పాత్ర పోషించాయి).

ఈ ప్రజా వలంటీరు సైన్యానికి ఆయుధాలను సైన్యం ఇస్తుంది. కాని యూనిఫాం మాత్రం ఉండదు. మొదటి రోజున లక్షమంది ప్రజలూ, కార్మికులూ సైన్యంలో చేరడానికి ముందుకు వచ్చారు. వారం రోజుల్లో 18-50 సంవత్సరాల మధ్య వయసు గల 2,12,000 మంది వలంటీర్లు యుద్ధంలో చేరడానికి సిద్ధపడి వచ్చారు. జులై 7 నాటికి 1,60,000 మంది వలంటీర్లు చేరారు. వీరిలో 32,000 మంది స్త్రీలు, 20,000 మంది కమ్యూనిస్టులు, 18,000 మంది యువ కమ్యూనిస్టులూ ఉన్నారు. 2500 మంది లెనిన్ గ్రాడ్ యూనివర్సిటీ విద్యార్థులు సైన్యంలో కాని వలంటీరు దళాల్లో కాని చేరారు. మొదటి మూడు ప్రజా వలంటీరు సైన్యాలలోనూ పార్టీ సభ్యులు 20-46 శాతం, కార్మికులు దాదాపు 61 శాతం, ఉన్నారు. వీరుకాక సైన్యంలో చేరడానికి ఇంకా వయసురాని పద్ధెనిమిది సంవత్సరాల లోపు 90,000 మంది పిల్లలు సహాయక దళాలలో చేరారు. నగరంలో శాంతి భద్రతలు కాపాడడానికి బాలురతోనూ వృద్ధులతోనూ రక్షక దళాలు ఏర్పడ్డాయి. శత్రు సైన్యం వెనుక గెరిల్లా యుద్ధం చెయ్యడానికి 15,000 మంది స్త్రీ పురుషులతో 200 పార్టిజాన్ దళాలు తయారయ్యాయి. చివరకు ఈ ప్రజా వలంటీరు దళాలలో రెండు లక్షలమంది చేరారు.

పార్టీ సభ్యులూ, యువ కమ్యూనిస్టులూ వలంటీరు దళాలలోనే కాకుండా,సైన్యంలో కూడా అధికంగానే చేరారు. 1941 మే 1 నాటికి లెనిన్ గ్రాడ్ నగరంలోనూ పరిసర ప్రాంతంలోనూ 2,01,721 మంది పార్టీ సభ్యులుండేవారు. పార్టీ సభ్యులలో 70 శాతం, యువ కమ్యూనిస్టులలో 90 శాతం సైన్యంలో చేరారు. నీవా ప్రాంతంలో ఉన్న 10,143 మంది కమ్యూనిస్టులలోనూ 4,215 మంది సైన్యంలో చేరారు. 1941 వేసవిలో 90,000 మంది లెనిన్ గ్రాడ్ పార్టీ సభ్యులూ యువ కమ్యూనిస్టులూ యుద్ధరంగానికి వెళ్ళారు. మొదటి మూడు నెలలలోనూ 57 శాతం పార్టీ సభ్యులు సైన్యంలో చేరారు. అక్టోబరు నాటికి లెనిన్ గ్రాడ్ పార్టీ నుంచి 54,000 మంది పార్టీ సభ్యులూ 93,000 మంది యువ కమ్యూనిస్టులూ సైన్యంలో చేరారు.

మొదటి వలంటీరు దళానికి జులై 3-4లలో శిక్షణ ప్రారంభమైంది. ఇందులో 11,000 మంది వలంటీర్లున్నారు. వీరిలో మూడవ వంతు పార్టీ సభ్యులు లేదా యువ కమ్యూనిస్టులు. దేశంకోసం పోరాడలన్న దీక్షే కాని సైన్యంలో పని చెయ్యగల దేహ దారుఢ్యం, ఆరోగ్యం లేని కారణంగా చాలామంది యుద్ధరంగాన్ని చేరక మునుపే, దారిలోనే అలసటతో, అనారోగ్యంతో మరణించారు. ఒక వలంటీరు దళంలో 1000 మందిలోనూ 200 మంది యుద్ధ రంగం చేరక మునుపే మరణించారు.

కిరోవ్ ఫాక్టరీ కార్మికుల మొదటి ప్రజా వలంటీరు దళం ఎర్ర జెండా చేతబట్టి, బేండ్లు వాయిస్తుండగా, జులై 10న లూగా రక్షణ రేఖను కాపాడడానికి యుద్ధరంగానికి తరలింది. ప్రతీ

Edit with WPS Office
కార్మికుడికి చేతి బాంబులు, పెట్రోలు బాంబులూ ఇచ్చారు. ఈ దళానికి మర తుపాకులు, ఫిరంగులూ చాలా తక్కువగా ఉన్నాయి. కొంతమంది వేట కత్తులు, గొడ్డళ్ళు, పలుగులు, పారలు తీసుకుని నడిచారు. కొంతమంది విప్లవ కాలం నాటి తుపాకులు చేపట్టారు. ఈ కార్మిక దళానికి ఆయుధాలు తక్కువయినా గుండె నిబ్బరం మాత్రం ఎక్కువే. యుద్ధ రంగంలో ఈ దళం రైలునుంచి దిగుతుండగా జర్మన్ విమానాలు దాడి చేశాయి. ఈ దాడిలో నష్టాలకు గురయినా ఈ దళం యుద్ధ రంగాన్ని చేరింది. అలాగే రెండవ వలంటీరు దళం కూడా విమాన దాడి జరుగుతుండగా రైలు దిగి యుద్ధ రంగాన్ని చేరింది. తొమ్మిది కార్మిక డివిజన్లలోనూ నాలుగు డివిజన్లు 1941లో లెనిన్ గ్రాడ్ దారులలో పోరాడుతూ అంతమయ్యాయి. సెప్టెంబరు ప్రారంభంలో ఈ కార్మిక డివిజన్లూ, నల్ల సముద్రపు నావికా సైన్యమూ అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులలో లెనిన్ గ్రాడ్ ను కాపాడాయి. జర్మన్లను నిలుపు చేసి ఎర్ర సైన్యం తిరోగమించేందుకు వ్యవధిని సంపాదించాయి.

లెనిన్ గ్రాడ్ ముఖ్య నగరం మాత్రమే కాక ముఖ్య పారిశ్రామిక ప్రాంతం కూడా. నగరంలో 520 ఫాక్టరీలుండేవి. ఈ ఫాక్టరీలలో 7,80,000 మంది కార్మికులు పని చేస్తుండేవారు. ఫాక్టరీలలో పని షిఫ్ట్ కు అదనంగా రోజుకు నాలుగు గంటలు కార్మికులకు సైనిక శిక్షణ ఇవ్వడం ప్రారంభమైంది. నగర పరిశ్రమలన్నీ యుద్ధావసరాలకు అనుగుణంగా ఉత్పత్తి చెయ్యసాగాయి. జులై నుండి డిసెంబరు వరకూ లెనిన్ గ్రాడ్ కార్మికులు, 713 టాంకులు, 480 కవచ శకటాలు, 58 సాయుధ రైళ్ళు, 3000 ఏంటీ టాంకు గన్నులు, 10000 మోర్టార్లు, 30 లక్షల మందుపాతరలు, షెల్సు, 80000 పైన రాకెట్ బాంబులూ ఉత్పత్తి చేశారు. మందుగుండు ఉత్పత్తి, మొదటి ఆరునెలలతో పోల్చి చూస్తే 10 రెట్లు పెరిగింది. పిల్లలకు బొమ్మలు తయారు చేసే ఫాక్టరీలలోనూ, స్టౌలు తయారు చేసే ఫాక్టరీలలోనూ గ్రెనేడ్లు తయారయ్యేవి. సంగీత పరికరాలూ, సెంట్లూ తయారు చేసే ఫాక్టరీలు ఏంటీ టాంకు మందు పాతరలను తయారు చెయ్యడం ప్రారంభించాయి. లెనిన్ గ్రాడ్ లో మద్యం తయారు చేసే ఫాక్టరీలు, ఆగస్టు అంతానికి లక్షకు పైగా పెట్రోలు బాంబులు తయారు చేశాయి.

విమాన దాడుల నుంచి రక్షణ ఎలా తీసుకోవాలీ, బాంబులను పేలకుండా ఎలా సురక్షితం చెయ్యాలీ, విమాన దాడులలో నగరం మంటలలో చిక్కుకున్నప్పుడు మంటలను ఎలా ఆర్పాలీ లాంటి విషయాల మీద పది లక్షలమంది నగర వాసులకు 1940లోనే శిక్షణ ఇచ్చారు. నగరాన్ని విమాన దాడి నుంచి రక్షించడానికి విమాన విధ్వంసక దళాలూ, ఫైటర్ విమానాశ్రయాలూ ఉన్నాయి. మొదటి రోజు రాత్రి విమాన దాడి నుంచి రక్షణకు 14000 మంది సిద్ధమయ్యారు. ఫాక్టరీలు, ఆఫీసులు, స్టోర్స్, భవనాలలోనూ ఉన్న అగ్నిమాపక దళాలలో 10,000 మంది చేరారు. ఇళ్ళ కప్పుల మీద నుంచి 24 గంటలూ కాపలా కాసేవారు. ఇసుక బస్తాలతో, నీటి బకెట్లతో, పలుగు పారలతో సిద్ధంగా ఉండేవారు. అగ్నిమాపక సంస్థ 2,20,000 ఘనపు గజాల నీరు నిలువకు టాంకులు నిర్మించింది. ఈ రక్షణ చర్యలన్నీ విమాన దాడుల్లో, ఫిరంగి దాడుల్లో లెనిన్ గ్రాడ్ నాశనమవకుండా కాపాడాయి. యుద్ధ ప్రాంతాలనుంచి పారిపోయి వస్తున్న నిర్వాసితులతో పాటు జర్మన్ ఏజెంట్లు కూడా లెనిన్ గ్రాడ్ లో ప్రవేశించి, సిగ్నల్ రాకెట్లు పేల్చి, జర్మన్ విమానాలకూ, ఫిరంగి దళాలకూ లక్ష్యాలు చూపించడం, జర్మన్ సైనిక శక్తి గురించి ప్రచారం చేసి లెనిన్ గ్రాడ్ వాసులను భయకంపితులను చెయ్యడానికి ప్రయత్నించడం లాంటి విధ్వంసక చర్యలకు పాల్పడ్డారు, కాని లెనిన్ గ్రాడ్ ప్రజలు త్వరలోనే ఈ ఏజెంట్లను గుర్తించి అంతం చేశారు.

జులై మధ్యలో పార్టీ నేతృత్వంలో లక్షమంది స్త్రీలూ పురుషులూ లెనిన్ గ్రాడ్ చుట్టూ అనేక రక్షణ రేఖలు నిర్మించారు. ఆగస్టు మొదటి వారానికి 10 లక్షలమంది ఈ రక్షణ రేఖల నిర్మాణంలో పని చేశారు. కార్మికులూ, ఉద్యోగులూ, స్కూలు పిల్లలూ, గృహిణులూ, సైంటిస్టులూ, ఉపాధ్యాయులూ, కళాకారులూ, నటులూ - అందరూ గునపాలూ, పారలూ తీసుకుని, ఉదయం నుంచి రాత్రి దాకా, తరచు శత్రు కాల్పులకు గురవుతూ పని చేశారు. ఉత్సాహం, దీక్ష తప్ప వీరికి అంత అనుభవం లేదు. కాని వీరి త్యాగం, కష్టం వృధా కాలేదు. మొదటి మూడు వారాల్లోనూ జర్మన్లు 124 మైళ్ళు చొచ్చుకు వచ్చినా, తర్వాత ఈ రక్షణ రేఖలను అధిగమించి లెనిన్ గ్రాడ్ ను చేరుకోవడానికి వారికి ఆరు వారాలు పట్టింది. లెనిన్ గ్రాడ్ రక్షణకు ఈ రక్షణ రేఖల నిర్మాణం కీలకమైనది. లెనిన్ గ్రాడ్ ప్రజలు, 340 మైళ్ళ ప్రాంతంలో టాంకుల గమనాన్ని నిరోధించే కందకాలూ, 15,875 మైళ్ళ ట్రెంచీలు, 400 మైళ్ళ ముళ్ల కంచెలు, 190 మైళ్ళ అడ్డంకులు (అడవి మార్గాలలో చెట్లతో), చెక్కతో కాని కాంగ్రీటుతో కాని 5,000 ఫైరింగ్ పాయింట్లూ (మరతుపాకులూ, ఫిరంగులూ పేల్చడానికి) నిర్మించారు. ఇవి కాకుండా లెనిన్ గ్రాడ్

Edit with WPS Office
నగరంలో అనేక రక్షణ స్థావరాలు నిర్మించారు.

బలమైన శత్రువుతో నిరంతరం పోరాడుతూ, 18 రోజుల యుద్ధం తర్వాత భయంకరమైన నష్టాలతో ఎర్ర సైన్యం జులై 10 నాటికి సరిహద్దునుంచి 300-325 మైళ్ళు తిరోగమించింది. ఈ సైన్యంలో కేవలం 1442 ఫిరంగులు మాత్రమే ఉన్నాయి. వైమానిక బలగమంతా తొలిరోజునే తుడిచి పెట్టుకు పోవడం వలన విమాన రక్షణ లేదు. బలహీనమైన ఈ సైన్యం లూగా రక్షణ రేఖ దగ్గర నిలిచి పోరాడగల స్థితి లేదు. ఈ సైన్యానికి సహాయంగా ప్రజా రక్షణ దళాలు వెళ్ళాయి. మొదటి కార్మిక దళం 37 మైళ్ళు విరామం లేకుండా మార్చ్ చేస్తూ యుద్ధ రంగాన్ని చేరుకుంది. ఈ 37 మైళ్ళూ జర్మన్ విమానాలు దాడులు చేస్తూనే ఉన్నాయి. ఈ సైన్యం యుద్ధరంగం చేరిన వెంటనే టాంకులతో దాడి చేసే జర్మన్ సైన్యంతో తలపడాల్సి వచ్చింది.

అలెగ్జాండర్ వెర్త్, 'లెనిన్ గ్రాడ్' అన్న పుస్తకంలో బెసనోవ్ అనే 67 ఏళ్ళ వృద్ధ కార్మికుడు యుద్ధ రంగానికి వెళ్ళిన వైనం గురించి చెప్పాడు. బెసనోవ్ ఆరుగురు కొడుకులూ యుద్ధానికి వెళ్ళారు. ఈ వృద్ధుడిని వారించినా వినక యుద్ధ రంగానికి వెళ్ళాడు. లెనిన్ గ్రాడ్ కార్మికుల చైతన్యం అటువంటిది. రష్యన్ సైన్యమూ, ప్రజా వలంటీరు దళాలూ తీవ్రంగా ప్రతిఘటిస్తుండడం వలన జర్మన్ సైన్యం ఆగస్టు 8న కాని లెనిన్ గ్రాడ్ మీద దాడి చెయ్యలేకపోయింది. లెనిన్ గ్రాడ్ వైపుకు పురోగమిస్తున్న జర్మన్ సైన్యం దారిలో ఉన్న గ్రామాలను తగలబెడుతుండేది. లెనిన్ గ్రాడ్ ను అర్ధ చంద్రాకారంలో చుట్టుముట్టుతూ సమీపిస్తున్న అగ్ని కెరటం, పొరులకు రాత్రి వేళ స్పష్టంగా కనుపించేది.

ఆగస్టు 20న లెనిన్ గ్రాడ్ పార్టీ కమిటీ, తుపాకీ కాల్చడంలోనూ వీధిపోరాటంలోనూ చేతి బాంబులు విసరడంలోనూ లెనిన్ గ్రాడ్ ప్రజలందరికీ శిక్షణ ఇవ్వాలని ఆదేశించింది. 'లెనిన్ గ్రాడ్ కార్మిక వర్గం జర్మనీకి బానిసలైనా కావాలి లేక లెనిన్ గ్రాడ్ జర్మనీకి సమాధియైనా కావాలి' అని హెచ్చరించింది.

మరుసటి రోజు లెనిన్ గ్రాడ్ సోవియట్ - 'మనమందరం మన స్వాతంత్ర్యాన్నీ, మన నివాసాలనూ, మన కుటుంబాలనూ, మన స్వేచ్ఛనూ, మన గౌరవాన్నీ కాపాడుకోవడానికి ఒక్కటై లేచి పోరాడుదాం. శత్రు గూఢచారులూ, లొంగుబాటు దారులూ, పోరాటం నుంచి పలాయనం చేసే వారూ, పిరికి వారూ - ఇటువంటి వారి పట్ల నిర్దాక్షిణ్యంగా ఉండాలి. క్రూరుడైన శత్రువుతో విరామం లేకుండా పోరాడడం సోవియట్ దేశ భక్తులుగా మన కర్తవ్యం. నగరంలో విప్లవాత్మక క్రమశిక్షణ ఉండాలి. అటువంటి ఉక్కు క్రమశిక్షణతో, బోల్షివిక్ సంస్థల సహాయంతో మనం శత్రువుతో తలపడి తరిమికొడదాం' అని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

నగరం లోపల శత్రువుతో తలపడడానికి నగర రక్షణ ఏర్పాట్లు చెయ్యబడ్డాయి. ఫాక్టరీలలోనూ, వంతెనల దగ్గరా, భవనాలలోనూ మందు పాతరలు వేశారు. శత్రువు నగరంలో ప్రవేశించగానే అవి పేల్చి వేయబడతాయి. శత్రు టాంకులు ముందుకు సాగడానికి అవరోధం ఏర్పడుతుంది. సైనికులే కాకుండా నగర ప్రజలంతా ప్రతీ వీధీ, ప్రతీ ఇల్లూ ఒక దుర్గంగా చేసి పోరాడడానికి సిద్ధమయ్యారు. అక్టోబరు, నవంబరు, డిసెంబరులలో 4 లక్షలమంది ప్రజలు రాత్రింబవళ్ళు మూడు షిప్టులలో పని చేస్తూ, విరామం లేకుండా ట్రెంచిలూ, కందకాలూ తవ్వారు.

సెప్టెంబరు 4న లెనిన్ గ్రాడ్ మీద జర్మన్ ఫిరంగుల దాడి ప్రారంభమైంది. లెనిన్ గ్రాడ్ జర్మన్ సైన్యాలకు లొంగిపోవడానికి సిద్ధమైనా అంగీకరించకూడదనీ, లెనిన్ గ్రాడ్ నగరాన్ని ప్రపంచ పటం నుంచి తుడిచి వేయాలనీ హిట్లర్ ఆదేశించాడు. మాస్కో విషయంలో ఆదేశించినట్లుగానే, నగరం నుంచి ప్రజలు పారిపోయే ప్రయత్నంలో జర్మన్ సైన్యం వైపుకు వస్తే, వారిమీద కాల్పులు జరిపి వెనక్కు తరిమేయాలనీ, విమానదాడుల తోనూ, ఫిరంగి దాడులతోనూ లెనిన్ గ్రాడ్ నగరాన్ని, 30 లక్షల జనాభాతో సహా, నేలమట్టం చెయ్యాలనీ హిట్లర్ ఆదేశించాడు.

సెప్టెంబరు 8, 9, 10వ తేదీలలో పెద్ద ఎత్తున విమాన దాడులు జరిగాయి. పాతరకం సోవియట్ విమానాలు జర్మన్ విమానాలను ఎదుర్కోలేకపోయాయి. సోవియట్ పైలట్లు తమ విమానాలను జర్మన్ విమానాలకు ఢీకొట్టి కూల్చడానికి ప్రయత్నించారు. ఈ విమాన దాడులలో జర్మన్లు ఆలస్యంగా పేలే బాంబులు, మందు పాతరలు ప్రయోగించారు. వీటిని ఎలా ప్రమాదరహితం చెయ్యాలో తెలియని వలంటీర్లు అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. 8వ తేదీన జరిగిన దాడులలో ప్రధాన ఆహార ధాన్యాల గిడ్డంగులు కాలిపోయాయి. ఆహార గిడ్డంగులు అగ్నిప్రమాదంలో ఇలా నాశనమవడం జర్మన్ దిగ్బంధంలో ఉన్న లెనిన్ గ్రాడ్ లో భయంకరమైన కరువుకూ ఆకలి చావులకూ దారి తీసింది.

సెప్టెంబరు 8వ తేదీకి అన్ని మార్గాలూ మూసుకుపోయి, లెనిన్ గ్రాడ్ నగరానికి రష్యన్ భూమితో

Edit with WPS Office
సంబంధాలు తెగిపోయాయి. లగోడా సరస్సు ద్వారా కాని, విమానాల ద్వారా కాని మాత్రమే బయటి ప్రపంచంతో సంబంధం మిగిలింది. లగోడా సరస్సు మీద ప్రయాణించే ఓడల పైన జర్మన్ విమానాలు బాంబుల వర్షం కురిపించి విపరీతంగా నష్టం కలిగిస్తుండేవి. అటువంటి పరిస్థితులలో స్టాలిన్, లెనిన్ గ్రాడ్ రక్షణ ఏర్పాట్లను సరిదిద్దడానికి జనరల్ ఝుకోవ్ ను సెప్టెంబరు 11న లెనిన్ గ్రాడ్ కు పంపించాడు. అక్టోబరు మధ్య వరకూ ఝుకోవ్ లెనిన్ గ్రాడ్ రక్షణకు బాధ్యత వహించాడు. అక్టోబరులో మాస్కో రంగంలో పరిస్థితి విషమించగానే అతను మాస్కో చేరుకున్నాడు. మాస్కో రక్షణలో లాగానే లెనిన్ గ్రాడ్ రక్షణలో కూడా ఝుకోవ్ ప్రముఖ పాత్ర పోషించాడు. అక్టోబరు ప్రారంభానికి లెనిన్ గ్రాడ్ మూడు లక్షల జర్మన్ సైన్యాన్ని ఆ రంగంలో కట్టివేసి ఉంచింది. లెనిన్ గ్రాడ్ పతనమవుతే ఈ మూడు లక్షల సైన్యం మాస్కో మీదకు మళ్ళించడానికి హిట్లర్ కు అవకాశం చిక్కేది. కాని గుండెకు గాయమైనా, ఆకలితో, నిస్త్రాణతో నీరసించినా, తలవంచని లెనిన్ గ్రాడ్ శత్రువుకు ఆ అవకాశం ఇవ్వలేదు.

లెనిన్ గ్రాడ్ ను ఆక్రమించడంలో విఫలమైన జర్మన్ హై కమాండ్, లెనిన్ గ్రాడ్ ను మాడ్చి లొంగదీయవచ్చునని భావించింది. దిగ్బంధంలో చిక్కుకున్న నగరానికి విమానాల ద్వారా కాని, లగోడా సరస్సు ద్వారా కాని, ఆహార ధాన్యాలు, వైద్య సహాయం, ఆయుధాలూ అందించాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ కాలంలో రష్యన్లకు విమానాల కొరత ఉంది. ఒకవేళ ఏ రష్యన్ విమానమైనా లెనిన్ గ్రాడ్ లో దిగడానికి ప్రయత్నిస్తే జర్మన్ విమానాలు కూల్చేసేవి. నిరంతరం దాడులకు గురవుతూ, ఓడరేవులు లేని లగోడా సరస్సు ద్వారా 30 లక్షల జనాభాకు ఆహారధాన్యాలు సరఫరా చెయ్యడం రష్యన్లకు అసాధ్యమైంది.

యుద్ధం తొలిరోజుల్లో, శత్రువు వేగంగా పురోగమిస్తూ నగరానికి తీవ్ర ప్రమాదం ఏర్పడినప్పుడు, నగరం నుంచి జనాభాను సకాలంలో తరలించక పోవడం వలన 30 లక్షల జనాభా నగరంలో చిక్కుకు పోయింది. జర్మన్లను నగరానికి కొంత దూరంలో కొన్ని వారాలపాటు నిలుపు చేసినప్పుడు ఆశాజనకమైన ప్రచారం జరిగిందే కాని నగరం దిగ్బంధంలో ఇరుక్కుపోవచ్చునని ఎవరూ ఊహించలేదు. జులై, ఆగస్టు నెలలలో జర్మన్ ఆక్రమణ ప్రమాదం ఎదురైన ప్రాంతాల నుంచి ఆహార ధాన్యాలను వెనుకకు మళ్ళిస్తున్నప్పుడు, వాటిని లెనిన్ గ్రాడ్ వైపుకు మళ్ళించకుండా, తూర్పుకు పంపారు. విమాన దాడుల ప్రమాదం వలన పిల్లలను మాత్రం లెనిన్ గ్రాడ్ నుంచి తరలించారు. దురదృష్టవశాత్తూ జర్మన్ సైన్యాల దారిలో ఉన్న పట్టణాలకు ఈ పిల్లలను తరలించడం జరిగింది. ఆ పట్టణాలకు ఆక్రమణ ప్రమాదం వాటిల్లినప్పుడు ఆ పిల్లలను మళ్ళీ లెనిన్ గ్రాడ్ కే తీసుకు వచ్చారు. వారిలో కొంతమందిని తిరిగి తూర్పు వైపుకు తరలించారు కాని అందరినీ తరలించడానికి వీలుపడలేదు. కొంతమంది లెనిన్ గ్రాడ్ వాసులు తూర్పు వెళ్ళడానికి నిరాకరించడం తమ దేశభక్తికి నిదర్శనంగా భావించారు. లెనిన్ గ్రాడ్ లో ట్రెంచీలు తవ్వుకుని పోరాడుతాం కాని నగరాన్ని వదలి పోం అనేవారు. నగరంలో పిల్లలు, వృద్ధులు, శారీరకంగా బలహీనులూ ఉన్నారనీ, వీరు నగర రక్షణకు తోడ్పడడం మాట అటుంచి, వీరిని నగరంలో ఉంచడం వలన ఆహారధాన్యాల కొరత మరింత ఎక్కువవుతుందనీ ఎవరూ ఆలోచించలేదు. జులై, ఆగస్టు నెలలలో లెనిన్ గ్రాడ్ ప్రజలకు జర్మన్లు ఎక్కుడ ఉన్నారో స్పష్టంగా తెలియలేదు. ఈ నెలలలో విమాన దాడులు కూడా లేవు. అందువలన ప్రజలలో అంతా సవ్యంగా ముగుస్తుందన్న ఒక అలసత్వం ఏర్పడింది. ఈ తప్పిదాల వలన, 4 లక్షలమంది పిల్లలతో సహా 30 లక్షల మంది పౌరులు దిగ్బంధంలో చిక్కుకు పోయారు. వీరికి తోడు లెనిన్ గ్రాడ్ రంగంలో పోరాడుతున్న ఎర్ర సైనికులకు కూడా ఆహారం అందించాల్సిన బాధ్యత లెనిన్ గ్రాడ్ మీద పడింది. నగరంలో ఆహారధాన్యాలు చాలా తక్కువగా ఉన్నాయనీ, వెంటనే రైల్వే ద్వారా ఆహారధాన్యాలు పంపించమనీ సెప్టెంబరు 6న లెనిన్ గ్రాడ్ మాస్కోను కోరింది. అప్పటికే రైల్వేలైనూ, రహదారులూ - అన్నింటినీ జర్మన్లు తెంచివేశారు.

సెప్టెంబరు 2న, సెప్టెంబరు 12న - రెండు సార్లు రేషను తగ్గించడం జరిగింది, కాని అప్పుడు కూడా ఉన్న ఆహార నిలవలనూ, జనాభానూ అధికారులు వాస్తవికంగా లెక్కలోకి తీసుకోలేదు. త్వరలోనే దిగ్బంధం ముగిసి పోతుందనే ఆశాభావంతో రేషను తగ్గించిన తర్వాత కూడా పంపిణీ కొంచెం ఉదారంగానే జరిగింది. కాని దిగ్బంధం కొనసాగడంతో లెనిన్ గ్రాడ్ లో ఆహార కొరత తీవ్రమైంది. రొట్టెల తయారీకి గోధుమ పిండిలో మరేదైనా కలపడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. సెప్టెంబరులో లగోడా సరస్సు ద్వారా పడవల మీద వస్తున్న ఆహార ధాన్యాలు జర్మన్ విమాన దాడులకు గురయి నీటిపాలయ్యాయి. డైవర్లు నీటి అడుగుకు పోయి మునిగిపోయిన ఆహారధాన్యాలను చాలా మటుకు తీసుకు వచ్చారు. మామూలు పరిస్థితులలో ఇది రొట్టెలు చెయ్యడానికి పనికి రాదు. కాని ఈ పిండిని

Edit with WPS Office
గోధుమపిండిలో కలిపి రొట్టెలు చేసేవారు. రొట్టెల పిండిలో సెల్యూలోస్ కలిపేవారు. వీటి వలన రొట్టె చేదుగా అనిపించేది కాని రేషన్ కొంత మిగిలింది. గుర్రాలకు ఉపయోగించే ఓట్ ధాన్యాలను రొట్టెలకు ఉపయోగించారు. సైన్యానికి అవసరమైన గుర్రాలను ఆకులతో మేపేవారు. మాంసానికి బదులు గొర్రె పేగులతో తయారు చేసిన జెల్లీ రేషన్ కార్డుల ద్వారా పంచేవారు. ఇది దారుణమైన కంపు కొడుతుండేది. ఈ కంపు పోవడానికి దానిలో లవంగాలు కలిపేవారు. ప్రతీదీ రేషన్ కార్డు మీద పంచేవారు.

లెనిన్ గ్రాడ్ పార్టీ, డిసెంబరులో ఉక్కు నరాలతో నిర్ణయాలు తీసుకోవలసి వచ్చింది. కొంచెం రేషన్ పెంచితే పౌరులలో మరణాల సంఖ్య తగ్గవచ్చు, కాని భవిష్యత్తులో జర్మన్లు దాడి చేస్తే సైన్యానికి కూడా తినడానికి ఏమీ ఉండదు. భవిష్యత్తులో లగోడా సరస్సు గడ్డ కట్టినప్పుడు, ఐసు రోడ్డు నిర్మించడానికి అవకాశం ఉంటుందో ఉండదో తెలియదు. ఆకలితో నీరసించిపోయిన సైన్యం జర్మన్లను ఎదిరించి పోరాడలేదు. సైన్యం, పౌరులు, లెనిన్ గ్రాడ్, మొత్తం దేశం, విపత్కర పరిస్థితిలో పడతాయి. ఇటువంటి పరిస్థితులలో ప్రతీ ఔన్స్ ఆహారం పొదుపు చెయ్యాలని కఠోర నిర్ణయం తీసుకోవలసి వచ్చింది.

లెనిన్ గ్రాడ్ పౌరులతో పాటు, నగర యుద్ధ రంగం లోని సైనికులకు కూడా రేషన్ తగ్గించారు. సైనికులకు నగర పరిస్థితి గురించి తెలుసు. నగరాన్నుంచి ఎవరైనా పౌరులు వస్తే తమ రేషన్ నుంచి కొంత వారికి ఇస్తుండేవారు.

లెనిన్ గ్రాడ్ లో రేషన్ కార్డు పోవడమంటే ప్రాణం పోవడమే. సెప్టెంబరు, అక్టోబరులలో రేషన్ కార్డులలో అనేక మోసాలు జరిగాయి. కొంతమందికి ఒక కార్డు కంటే ఎక్కువే ఉండేవి. చచ్చిపోయిన వారి కార్డులూ నగరం వదలి వెళ్ళి పోయిన వారి కార్డులూ ఉపయోగించి అదనంగా రేషను తీసుకునే వారు. రేషన్ కార్డులు ప్రింటు చేసే ప్రెస్ కార్మికురాలి దగ్గర నుంచి వంద కార్డులు అధికారులు స్వాధీనం చేసుకుని ఈ నేరానికి ఆమెను కాల్చివేశారు. ఈ గందరగోళానికి తోడు జర్మన్ విమానాలు కూడా నకిలీ కార్డులు నగరంలో వెదజల్లేవి. అక్టోబరు మధ్యలో రేషన్ కార్డులు తిరిగి రిజిస్ట్రేషన్ చెయ్యాలని ఆదేశించారు. ఈ రిజిస్ట్రేషన్ లో 70,000 కార్డులు అధికంగా ఉన్నట్లు వెల్లడయింది.

డిసెంబరులో కరువు తీవ్రంగా ఉన్నప్పుడు రేషన్ కార్డులు పోవడమనేది అంటువ్యాధిలా వ్యాపించింది. అక్టోబరులో రేషను కార్డులు పోయాయన్న వారి సంఖ్య 5,000 ఉంటే. ఈ సంఖ్య డిసెంబరులో 24,000 కు చేరుకుంది. విమాన దాడులలో రేషను కార్డులు నాశనమయ్యాయని సాధారణంగా చెబుతుండేవారు. ఒక రేషను కార్డు, రెండు రేషను కార్డుల మధ్య అంతరం జీవితమా, చావా అన్న పరిస్థితులలో, 30 లక్షల జనాభాలో కేవలం 24,000 మంది రేషను కార్డులు పోయాయని రావడం ఆశ్చర్యకరమైన విషయమే. కార్డు నిజంగా పోయిందని బలమైన రుజువులు చూపిస్తే తప్ప కొత్త కార్డు ఇవ్వడానికి నిరాకరించడంతో ఈ 'అంటు వ్యాధి' క్రమంగా తగ్గిపోయింది.

నవంబరు, డిసెంబరులలో లెనిన్ గ్రాడ్ జనాభా అతి తక్కువ రేషన్ల మీద జీవించడానికి ప్రయత్నించింది. పైన చెప్పినట్లు, సెప్టెంబరు 2, సెప్టెంబరు 10, అక్టోబరు 1, నవంబరు 13 - నాలుగు తడవలు రేషన్ తగ్గించబడింది. అయినా ఆహార ధాన్యాల నిల్వలు అంతరించిపోవడంతో ఐదో తడవ, నవంబరు 20న, రేషను తగ్గించారు.

నవంబరు 13న ఫాక్టరీ కార్మికులకు 300 గ్రా. బ్రెడ్, నగర వాసులకు 150 గ్రా. బ్రెడ్ ఇస్తే, ఐదో తడవ తగ్గింపు తర్వాత, ఫాక్టరీ కార్మికులకు 250 గ్రా. బ్రెడ్, నగరవాసులకు 125 గ్రా. బ్రెడ్ (రెండు చిన్న స్లైసులు), యుద్ధ రంగంలో పోరాడుతున్న సైనికులకు 500 గ్రా. బ్రెడ్, యుద్ధ రంగానికి వెనుకనున్న సైనికులకు 300 గ్రా. బ్రెడ్, ఇవ్వసాగారు.

'లెనిన్ గ్రాడ్ స్కయా ప్రావ్దా' పత్రిక, సెప్టెంబరు 20న సంపాదకీయంలో, '....బోల్షివిక్కులు ప్రజలనుంచి ఏదీ, ఎప్పుడూ దాచలేదు. వారెప్పుడూ, అది ఎంత భయంకరమైనదైనా సరే, నిజమే చెబుతారు. ఈ దిగ్బంధం కొనసాగినంత వరకూ ఆహారం పెంచడం సాధ్యం కాదు. శత్రువును వెనక్కు నెట్టి వేయగలిగేంత వరకూ, దిగ్బంధంలో గండి కొట్టేంతవరకూ, మనం నిలవాలంటే రేషను తగ్గించాలి. ఇది కష్టం కాదా? కష్టమే కాని వేరే మార్గం లేదు. ప్రతీ ఒక్కరూ ఇది అర్థం చేసుకోవాలి.....' అని పరిస్థితిని వివరించింది.

కమ్యూనిస్టు నాయకుడు ఝుడ్నోవ్, యువ కమ్యూనిస్టుల సమావేశంలో - '.....ఫాక్టరీలు మూతపడుతున్నాయి. విద్యుత్తు లేదు, నీరు లేదు, ఆహారం లేదు. టిక్విన్ పట్టణ పతనంతో మనం

Edit with WPS Office
మరిన్ని చిక్కుల్లో పడ్డాం. ఇప్పుడు మన ప్రధాన కర్తవ్యం ఏమిటంటే, కార్మికులకు ధైర్యం చెప్పి, ఉత్తేజ పరచి, అన్ని అడ్డంకులను అధిగమించి పోరాడేలా చెయ్యడం. ఇది మీ కర్తవ్యం.....' అని యువ కమ్యూనిస్టులకు విజ్ఞప్తి చేశాడు.

ఆహార ధాన్యాల కొరతకు తోడు ఇంధనం కొరత కూడా ఏర్పడింది. గడ్డ కట్టే శీతాకాలంలో ఇళ్ళు వెచ్చబెట్టుకోవడానికి కట్టెల కొరత ఏర్పడింది. సెప్టెంబరు అంతానికి బొగ్గు, చమురు నిల్వలు అయిపోయాయి. ఇంక దిగ్బంధంలో ఉన్న ప్రాంతంలోని చెట్లు కొట్టాల్సి వచ్చింది.

నగర ఉత్తర ప్రాంతాలలో చెట్లు కొట్టి కలప చేరవేయడానికి అక్టోబరు 8న దళాలను పంపించారు. వీరిలో ప్రధానంగా స్త్రీలూ, వయసు మళ్ళిన వారూ ఉండేవారు. అక్టోబరు అంతానికి, అనుకున్న దానిలో 24 శాతం పని మాత్రమే జరిగింది. అటువంటి పరిస్థితులలో లెనిన్ గ్రాడ్ కామ్సొమాల్ (యువ కమ్యూనిస్టుల సంస్థ) నుంచి యువతులను పంపించారు. సరియైన దుస్తులూ, బూట్లూ లేకుండా, - 40 డిగ్రీల చలిలో, ఆకలితో బాధపడుతూ ఈ యువతులు అద్భుత కార్యాలు చేశారు. అడవినుంచి దగ్గర రైల్వే స్టేషనుదాకా నేరో గాజ్ రైలు మార్గాన్ని నిర్మించారు, బేరక్స్ నిర్మించారు. వీరి కృషి వలన లెనిన్ గ్రాడ్ కు కొంత ఇంధనం చేరింది. లెనిన్ గ్రాడ్ పరిస్థితి కొద్దిగా మెరుగైంది కాని కొరత తీరలేదు. అక్టోబరు అంతానికి నగరంలో విద్యుత్ సరఫరా బాగా తగ్గిపోయింది. చాలా ఫాక్టరీలు నిలిచిపోయాయి. తిండి లేదు, దీపాలు లేవు, ఎముకలు కొరికే చలిలో వెచ్చగా ఉండడానికి ఇంధనం లేదు. దీనికి తోడు జర్మన్ విమానాల, ఫిరంగుల దాడులు.

అక్టోబరు మహా విప్లవ దినోత్సవానికి ముందు రోజు, నవంబరు 6న, జర్మన్ విమానాలు 'ఈ రోజు మేం బాంబులు వేస్తాం. రేపు మీరు సమాధులు తవ్వుతారు' అని హెచ్చరిస్తూ కరపత్రాలు వెదజల్లాయి.

1941-42 శీతాకాలంలో లెనిన్ గ్రాడ్ పరిస్థితి ఇది.

అక్టోబరు మొదటి వారానికి జర్మన్లు, లెనిన్ గ్రాడ్ ను ఆక్రమించడం అసంభవం అనే నిర్ణయానికి వచ్చారు. లెనిన్ గ్రాడ్ రక్షణ రేఖలను అధిగమించి ఈ రంగంలోని ఎర్ర సైన్యాన్ని నాశనం చేసి నగరాన్ని స్వాధీనం చేసుకోవాలంటే జర్మన్ నష్టాలు 15 లక్షలకు పైగా ఉంటాయి. ఈ నష్టాలను భరించగల స్థితిలో జర్మన్ సైన్యం లేదు. ఒకవేళ నష్టాలను లెక్క చెయ్యక లెనిన్ గ్రాడ్ నగర దక్షిణ ప్రాంతాన్ని ఆక్రమించగలిగినా, ఎర్ర సైన్యం, ప్రజలూ ఉత్తర లెనిన్ గ్రాడ్ కు తిరోగమించి, అక్కడనుంచి జర్మన్లను ప్రతిఘటించవచ్చు. అదీకాక ప్రధాన రంగమైన మాస్కో రంగంలో జర్మన్లు అంతిమ దాడికి తయారవుతున్నారు. రెండు పెద్ద నగరాల మీద ఒకే సారి దాడి చెయ్యగలిగినంత సైన్యం జర్మనీకి లేదు. అందుచేత జర్మన్లు లెనిన్ గ్రాడ్ ను ఆక్రమించే ఉద్దేశం విరమించుకుని బంకర్లూ, మందుపాతరలూ, రక్షణ కట్టడాలతో శీతాకాలానికి సిద్ధపడసాగారు. రష్యన్లకు జర్మన్లను ప్రతిఘటించే శక్తి ఉంది కాని ఎదురు దాడి చేసి లెనిన్ గ్రాడ్ ని విముక్తి చేసేంత బలం లేదు. అందువలన అక్టోబరు మధ్య ప్రాంతానికి యుద్ధ రంగంలో ప్రతిష్టంభన ఏర్పడింది.

దిగ్బంధం మరి కొంతకాలం కొనసాగగలదు అనే అభిప్రాయానికొచ్చిన తర్వాత లెనిన్ గ్రాడ్ వార్ కౌన్సిల్, లగోడా సరస్సు పశ్చిమ తీరాన, లెనిన్ గ్రాడ్ కు ఈశాన్య దిశలో రైల్వే లైను సమీపంలో ఒక రేవును నిర్మించింది. లెనిన్ గ్రాడ్ నుంచి కొన్ని పరిశ్రమలనూ జనాభానూ తరలించవచ్చనీ, ఆహారధాన్యాలూ తదితర సామగ్రినీ లెనిన్ గ్రాడ్ కు చేరవేయవచ్చుననీ, ఆశించింది. లగోడా సరస్సు నావికా దళం దగ్గర విమాన విధ్వంసక శతఘ్నులు ఉన్నాయి కనుక నావికాదళం ఈ రేవును కాపాడగలదని ఆశించింది. జర్మన్లు ఈ రేవుకు 25 మైళ్ళ దూరంలోనే ఉన్నారు. వారి విమానాలు ఈ రేవు మీద ఒక కన్ను వేసి ఉంచేవి. రేవుకు వచ్చేపోయే నావల మీద నిరంతరం దాడులు చేస్తుండేవి. మొదటి వారాలలో ఎన్నో నావలు విమాన దాడుల్లో నాశనమయ్యాయి. లెనిన్ గ్రాడ్ నుంచి తరలించబడుతున్న స్త్రీలూ, పిల్లలతో ఉన్న ఓడలు కూడా చాలా నాశనమయ్యాయి. ఈ నీటి మార్గం కొంత వరకూ లెనిన్ గ్రాడ్ కు ఉపయోగపడింది. సెప్టెంబరు 12నుంచి నవంబరు 15 దాకా 24,000 టన్నుల ఆహారధాన్యాలూ, మందుగుండూ లెనిన్ గ్రాడ్ కు చేరింది. కాని ఇదంతా లెనిన్ గ్రాడ్ మరో 20 రోజులు జీవించడానికే సరిపోతుంది. రేవు కార్మికులూ, నావికులూ, తదితరులూ నిరంతరం విమాన దాడులకు గురవుతూ తమ ప్రాణాలను బలిపెట్టి లెనిన్ గ్రాడ్ కు ఆహార ధాన్యాలను అందజేశారు.

నవంబరు 16 నుండి సరస్సులో నీరు గడ్డ కట్టడంతో నావల రాకపోకలు నిలిచిపోయి లెనిన్ గ్రాడ్ కు విమానాల ద్వారా మాత్రమే సరఫరా చెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాస్కోకు తీవ్ర

Edit with WPS Office
ప్రమాదం ఏర్పడిన తరుణంలో కూడా లెనిన్ గ్రాడ్ రంగానికి కొన్ని రవాణా విమానాలనూ ఫైటరు విమానాలనూ తరలించింది సోవియట్ ప్రభుత్వం. వీటి ద్వారా లెనిన్ గ్రాడ్ కు చేరగలిగింది తక్కువే.

నవంబరులో రష్యన్ సైన్యాన్ని వెనక్కు నెట్టివేసి జర్మన్ సైన్యం టిక్విన్ పట్టణాన్ని ఆక్రమించడంతో లెనిన్ గ్రాడ్ పరిస్థితి మరింత విషమించింది. సైనికుల, రైతుల సహాయంతో 100 మైళ్ళ దూరంలో ఉన్న మరో రైలు స్టేషనుకు 200 మైళ్ళ రోడ్డు, అడవుల గుండా నిర్మించారు. ఈ రోడ్డు ద్వారా లెనిన్ గ్రాడ్ కు వెళ్ళి రావాలంటే 14 రోజులు పడుతుంది. దిక్కుతోచని స్థితిలో ఈ రోడ్డు వేశారు కాని ఈ రోడ్డు ద్వారా నిజంగా లెనిన్ గ్రాడ్ కు ఏ సహాయం అందగలిగేది కాదు. ఈ లోగా రష్యన్ సైన్యం జర్మన్ సైన్యాన్ని టిక్విన్ నుండి తరిమి వేసింది. మిగిలిన చోట్ల కూడా రష్యన్ సైన్యం జర్మన్లను లెనిన్ గ్రాడ్ నుంచి కొంచెం దూరం నెట్టి వేయగలిగింది. ఈ విజయాల వలన, లగోడా సరస్సు గడ్డ కట్టినప్పుడు ఆ సరస్సు మీద ఐసు రోడ్డు వేసి లెనిన్ గ్రాడ్ కు సరఫరాలు అందజేయడానికి వీలుపడింది.

నాలుగో తడవ రేషను తగ్గించిన తర్వాత ప్రజలు ఆకలితో చనిపోవడం మొదలు పెట్టారు. నవంబరులో లెనిన్ గ్రాడ్ లో వృద్ధులు చనిపోసాగారు. నవంబరులో 11000 మంది చనిపోయారు. నవంబరు 20న రేషను మరింత తగ్గించిన తర్వాత మరణాల సంఖ్య పెరగసాగింది. లెనిన్ గ్రాడ్ యుద్ధ రంగంలోని సైనికులు తమ రేషను తగ్గించి పౌరుల రేషన్ పెంచమని హై కమాండుకు విజ్ఞప్తిచేశారు. సైనికులకు కనీస అవసరం, రోజుకు 350 గ్రా. బ్రెడ్, మాత్రమే అందుతోంది. ఈ కనీస రేషనును తగ్గించడానికి హై కమాండు అంగీకరించ లేదు. డిసెంబరులో 52,000 మంది చనిపోయారు. 1942 జనవరిలో ప్రతీ రోజూ దాదాపు 4,000 మంది చనిపోయేవారు. డిసెంబరు, జనవరి నెలలలో రెండు లక్షలమందికి పైగా చనిపోయారు. జనవరిలో రేషను కొంచెం పెంచినా రెండు నెలల ఆహార లోపాల వలన తరువాతి నెలలలో 6,32,000 మంది మరణించారు. మొత్తం పది లక్షలకు పైగా ఆకలితో మాడి మరణించారని అంచనా. ఆహారలేమికి తోడు రక్తం గడ్డకట్టించే శీతాకాలపు చలి.

ఇంధనం లేకపోవడం వలన శీతాకాలంలో గడ్డకట్టి పోకుండా ఉండడానికి లక్షల పుస్తకాలు తగులబెట్టి చలిమంటలు వేసుకోవలసి వచ్చింది. జనం వీధుల్లో నడుస్తూ, నడుస్తూ రాలిపోయేవారు. ఇళ్ళల్లో నిద్రపోతూ, నిద్రపోతూ కన్నుమూసేవారు. ఫాక్టరీలలో పనిచేస్తూ, పనిచేస్తూ కూలిపోయేవారు. ఈ మనిషి ఒకటి రెండు రోజులలో చనిపోతాడని మొహం చూస్తే తెలిసేది. నడుస్తూ, నడుస్తూ రోడ్డుమీద కూలిపోయి చనిపోవడం సర్వ సామాన్యమైంది. ఎవరూ చెయ్యగలిగిందేమీ లేదు. జనాలు, బంధువులను, స్నేహితులను పూడ్చి పెడుతున్నప్పుడు ఏడ్చేవారు కారు. మౌనంగా ఉండేవారు. ఎటువంటి భావమూ కనుపించేది కాదు. శవాలను శ్మశానికి తీసుకు వెళ్ళడం కష్టమయ్యేది. శవాన్ని స్లెడ్జి బండి మీద ఎక్కించి, ఇద్దరు ముగ్గురు తాళ్ళతో లాగుతూ తీసుకు వెళ్ళేవారు. శ్మశానం దాకా తీసుకెళ్ళ లేక దారిలోనే వదిలి పెట్టి వచ్చేవారు, లేదా ఇళ్ళ పక్కన గుడ్డచుట్టి అలాగే వదిలేసేవారు. వీధుల్లో, భవనాల మెట్ల దగ్గరా శవాలు పడి ఉండేవి. శవ పేటికలు దొరికేవి కావు. శ్మశానాలలో వందల శవాలుండేవి. ఉక్కులా గడ్డ కట్టిన మంచును పగులగొట్టి సమాధులు తవ్వడానికి జనాలకి శక్తి ఉండేది కాదు. పేలుడు పదార్థాలు ఉపయోగించి పెద్ద గొయ్యి చేసి ఈ శవాలన్నింటినీ సామూహికంగా సమాధి చేసేవారు.

ఏప్రిల్ లో, వసంత కాలంలో, అంటు వ్యాధుల నివారణకు నగరమంతా శుభ్రం చేస్తుంటే, ట్రెంచిల లోనూ, కరుగుతున్న మంచు కిందా, నివాస స్థలాల్లోనూ వేల శవాలు అధికారులకు కనుపించాయి. నెలలుగా ఈ శవాలు మంచు కింద అలాగే ఉన్నాయి.

ఆకలి, చలి, నిరంతరం జర్మన్ విమాన దాడులు, అసంఖ్యాకమైన చావులు; మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యుల మరణాలతో లెనిన్ గ్రాడ్ వాసులలో కొందరు మానసిక సంక్షోభానికి గురయ్యారు. కొంతమందికి ఆకలితో మతి చలించింది. స్త్రీల కంటే పురుషులు ముందు మరణించ సాగారు. కాని కరువు ప్రభావం వలన, కరువు అంతమయ్యాకా స్త్రీలలో మరణాల సంఖ్య పురుషులలో మరణాల సంఖ్య కంటే ఎక్కువగా ఉండేది. తల్లిదండ్రులు తమ రేషను కూడా పిల్లలకు పెట్టడం వలన పిల్లలలో మరణాల సంఖ్య తక్కువగానే ఉండేది.

ఆసుపత్రులు నిరుపయోగమయ్యాయి. డాక్టర్లూ నర్సులూ ఆకలితో సగం మరణించి ఉండేవారు. పైగా రోగులకు కావలసింది తిండి కాని మందులు కావు. దీనికి తోడు మరో కష్టం వచ్చింది. డిసెంబరు-జనవరి నెలలలో మంచినీటి, మురికి నీటి గొట్టాలలోని నీరు గడ్డకట్టి, గొట్టాలు బద్దలవడంతో నీరు

Edit with WPS Office
తాగడానికి నిరుపయోగమయింది. నీవా నది నుంచి కాలువల ద్వారా, పాత్రల ద్వారా, నీరు తీసుకురావాల్సి వచ్చేది. ఈ నీరు కలుషితమై ఉండడం వలన అంటు వ్యాధుల ప్రమాదం ఏర్పడింది. 5 లక్షలమంది ప్రజలకు ఏంటీ టైఫాయిడ్ వేక్సిన్ ఇవ్వడం జరిగింది. నవంబరు-డిసెంబరుల మధ్య 35,000 మంది పౌరులను నగరాన్నుంచి విమానాల ద్వారా తరలించడం జరిగింది. స్కర్వీ వ్యాధి రాకుండా లెనిన్ గ్రాడ్ వాసులు పైన్, ఫిర్ చెట్ల ముళ్ళతో కషాయం చేసి తాగేవారు. లెనిన్ గ్రాడ్ లో ఎక్కడకు వెళ్ళినా ఈ కషాయం దొరికేది. ఆ విధంగా 1942 కరువు తర్వాత లెనిన్ గ్రాడ్ వాసులు స్కర్వీ వ్యాధినుంచి తప్పించుకోగలిగారు.

లెనిన్ గ్రాడ్ ఈ సంక్షోభం నుంచి బయటపడాలంటే రెండు మార్గాలున్నాయి. ఒకటి, నగరం నుంచి ఎంతమందిని వీలు పడితే అంతమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం. రెండవది, నగరానికి ఆహారధాన్యాలు, ఇంధనం, ముడి సరకుల సరఫరాకి నమ్మకమైన మార్గం ఒకటి ఏర్పరుచుకోవడం. లగోడా సరస్సు మీద ఐసు రోడ్డు నిర్మించే ఆలోచన అధికారులకు సెప్టెంబరు నుండీ ఉంది, కాని ఆ రోడ్డు వెయ్యాలంటే సరస్సులో నీరు కనీసం రెండు మీటర్ల మందాన గడ్డ కట్టాలి. లడోగా సరస్సు గడ్డ కట్టడం ప్రారంభించిన తర్వాత, గడ్డ కట్టిన సరస్సు మీద నడిచి అవతలి ఒడ్డును చేరుకోవడానికి ప్రయత్నించి, వేలమంది దారిలోనే మరణించారు. నవంబరు 17 నాటికి ఐసు ఒక మీటరు మందం ఉంది. నవంబరు 20 నాటికి, ఐదో తడవ రేషను తగ్గించిన రోజుకు, 1.8 మీటరు మందాన ఉంది. గుర్రాలు లాగే బళ్ళు అవతలి ఒడ్డుకు పంపించడం జరిగింది కాని ఆహారం లేక నీరసించిపోయిన చాలా గుర్రాలు దారిలోనే కూలిపోయి చచ్చిపోయాయి. అలా చచ్చిపోయిన గుర్రాలను ముక్కలు చేసి ఆ మాంసాన్ని లెనిన్ గ్రాడ్ కు పంపేవారు. నవంబరు 22న మొదటి సారి మొటారు వాహనాలు ఐసు మార్గం మీద ప్రయాణించాయి. ఐసు పలచగా ఉండడం వలన పూర్తి లోడు కాకుండా కొద్ది కొద్దిగానే తీసుకు రాగలిగాయి. ఆ లారీలలో కొన్ని ఐసు పగిలి నీళ్ళలో మునిగిపోయాయి. మరుసటి రోజు, లారీలలో కొద్ది లోడుతో పాటు లారీలకు స్లై (మంచు మీద జారే బళ్ళు)లు కట్టి, వాటి మీద సామాను ఉంచి రవాణా చెయ్యడం మొదలు పెట్టారు. ఆ విధంగా డిసెంబరు 1 వరకూ కొద్దిపాటి సరకులను రవాణా చెయ్యడం జరిగింది. దాదాపు 40 లారీలు కొంతమంది డ్రైవర్లతో సహా నీళ్ళపాలయ్యాయి.

అంతవరకూ రవాణా చెయ్యబడిన పదార్థాలు అంతంత మాత్రమే. లెనిన్ గ్రాడ్ జనాభానూ సైన్యాలనూ పోషించాలంటే రోజుకు వెయ్యి టన్నుల ఆహార ధాన్యాలు కావాలి. అదీ కాక సైన్యానికి మందుగుండు సామగ్రి, పెట్రోలు కావాలి.

జర్మన్ల నుంచి స్వాధీనం చేసుకున్న తర్వాత టిక్విన్ పట్టణం లెనిన్ గ్రాడ్ కు వస్తువుల సరఫరాకు ప్రధాన కేంద్రమయింది. కాని టిక్విన్ నుంచి లెనిన్ గ్రాడ్ కు రవాణా పెద్ద సమస్య అయింది. జర్మన్లు తిరోగమిస్తూ రైల్వే వంతెనలన్నింటినీ పేల్చి వేయడం వలన దాదాపు వందమైళ్ళు రోడ్డు ద్వారా మాత్రమే రవాణా చెయ్యాల్సి వచ్చేది. జనవరి 1కి రైల్వే వంతెనలన్నింటినీ నిర్మించారు. 1942 ఫిబ్రవరిలో దిగ్బంధంలో దారి తెరిచిన తర్వాత, స్టాలిన్ ప్రత్యేక ఆదేశాల మీద 22 రోజులలో 45 కి. మీ. రైలు మార్గం నిర్మించబడింది. ఈ రైలు మార్గం ద్వారా లెనిన్ గ్రాడ్ కు అవసరమైన బొగ్గు, మందుగుండు, పశుసంపద, ముడిపదార్థాలూ నిరాటంకంగా అందసాగాయి.

లెనిన్ గ్రాడ్ లో ఆహార సమస్య తీవ్రంగా ఉన్నా, డిసెంబరు 25న రేషను కొద్దిగా పెంచబడింది. దీని వలన ఆకలి మరణాల సంఖ్య తగ్గలేదు కాని ప్రజలలో విశ్వాసం పెరిగింది. అనేక సమస్యలను ఎదుర్కొంటూ ఫిబ్రవరికి ఐసు రోడ్డు పని చెయ్యడం మొదలు పెట్టింది. రోజూ వందల లారీలు లెనిన్ గ్రాడ్ కు అవసరమైన ఆహారం, ఇంధనం, మందుగుండు, ఆయుధాలూ చేరవేసేవి. జర్మన్లు, రైల్వే లైనుల మీదా ఐసు రోడ్డు మీదా తరచు విమాన దాడులు చేస్తుండేవారు. రష్యన్ ఫైటరు విమానాలు, రైల్వే లైనులనూ ఐసు రోడ్డునూ కాపాడడానికి ప్రయత్నిస్తుండేవి. ఐసు రోడ్డు మీద ఉన్న ట్రాఫిక్ పోలీసులు, జర్మన్ విమాన దాడులలో రోడ్డులో గోతులూ పగుళ్ళూ ఏర్పడినప్పుడు వంతెనలు వేసి రవాణా ఆగిపోకుండా చూస్తుండేవారు.

జనవరి 24న రేషను మళ్ళీ పెంచారు.

జనవరి 22న లెనిన్ గ్రాడ్ నుంచి జనాభాను తరలించాలని నిర్ణయించారు. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, రోగులు - వీరిని మొదట తరలించడం మొదలు పెట్టారు. ఏప్రిల్ నాటికి దాదాపు 5 లక్షల మందిని తరలించారు. మేలో మంచు కరిగి సరస్సులో ఓడలు నడవడం ప్రారంభం కావడంతో, మే

Edit with WPS Office
నుంచి నవంబరు దాకా ఓడలలో మరో 5 లక్షల మందిని తరలించారు. అలాగే లెనిన్ గ్రాడ్ లో ఉన్న పరిశ్రమలను కూడా తరలించారు. 1942 నవంబరు నాటికి లెనిన్ గ్రాడ్ లో 6,50,000 జనాభా మాత్రమే ఉంది.

ఈ 'జీవిత రహదారి', వేసవిలో ఓడల ద్వారానూ, శీతాకాలంలో ఐసు రోడ్డు ద్వారానూ, 1943లో లెనిన్ గ్రాడ్ దిగ్బంధం నుంచి విముక్తి అయ్యేవరకూ సంతృప్తికరంగా పని చేసింది.

లెనిన్ గ్రాడ్ పార్టీ మొదటి రెండున్నర నెలలలోనూ కొన్ని పొరపాట్లు చేసినా దిగ్బంధంలో చిక్కుకున్న తర్వాత పోరాటంలో కీలక పాత్ర పోషించింది. మొదటిది - అటువంటి పరిస్థితులలో రేషను అందరికీ అందేలా చూసింది. రెండవది - భారీ ఎత్తున నగరంలో పౌర రక్షణ ఏర్పాట్లు చేసింది. మూడవది - ఇంధనం కొరత ఏర్పడినప్పుడు పెద్ద ఎత్తున అడవులను కొట్టడానికి ప్రజలను సమీకరించింది. నాలుగోది - రకరకాల 'జీవిత రహదారు'లను, నీటి మీదా, మంచు మీదా నిర్మించడంలో సఫలమైంది. 900 రోజులు లెనిన్ గ్రాడ్ దిగ్బంధంలో ఉండి మొక్కవోని ధైర్యంతో పోరాడింది.

అన్ని రకాల సమాజ వ్యతిరేక చర్యలకూ కఠిన శిక్షలుండేవి. ప్రజల దగ్గర నుంచి చిన్న రొట్టె ముక్క దొంగిలించిన నేరానికి కాల్చివేసిన సందర్భాలున్నాయి. అక్కడక్కడ చెదురుమదురుగా అటువంటి సంఘటనలు జరిగినా మొత్తం మీద క్రమ శిక్షణ ఉండేది. బ్రెడ్ తీసుకు వస్తున్న ట్రక్కు ఒకటి ఫిరంగి కాల్పులకు గురై ట్రక్కు డ్రైవరు అక్కడికక్కడే చనిపోయాడు. ట్రక్కులోని రొట్టెలన్నీ చెల్లాచెదురై రోడ్డునిండా పడిపోయాయి. అటువంటి సమయాల్లో లూటింగ్ జరగవచ్చు. కాని జరగలేదు. అక్కడ పోగుపడ్డ జనం చుట్టూ కాపలాగా నిలబడ్డారు. వీళ్ళంతా ఆకలితో చావడానికి సిద్ధంగా ఉన్నవాళ్ళే. ఒక రొట్టె ముక్క దొంగిలించడానికి అటువంటి సమయాల్లో అవకాశం ఎక్కువ. అయినా మరొక ట్రక్కు వచ్చి రొట్టెలు తీసుకు వెళ్ళేవరకూ వాళ్ళు కాపలా కాస్తూ నిలబడ్డారు కాని ఒక్క రొట్టె కూడా దొంగిలించలేదు.

లెనిన్ గ్రాడ్ కామ్సోమాల్ సభ్యులు ప్రజలకు అనేక విధాల సేవ చేశారు. భయంకరమైన పరిస్థితులలో తాము అనేక ఇబ్బందులకు గురవుతూ ప్రజలకు సహాయం అందేలా చూశారు. అనేక వేలమంది సభ్యులతో కూడిన దళాలు నగరంలో పని చేస్తుండేవి. ఈ దళాలలో ప్రధానంగా బాలికలుండేవారు. వారు నగరమంతా తిరుగుతూ ప్రజలకు తోడ్పడుతుండేవారు. కట్టెలు కొట్టి, చలిలో గడ్డ కట్టుకుపోయిన ఇళ్ళల్లో మంటలు వేసేవారు. ఇళ్ళు పరిశుభ్రం చెయ్యడం, బట్టలుతకడం లాంటి పనులు చేసేవారు. అనాధలైన పిల్లలను అనాధాశ్రమాలకు తరలించేవారు. జనవరి-మే నెలల మధ్య ఈ విధంగా 3,000 మంది పిల్లలను తరలించారు.

ఈ ఆకలి చావుల మధ్య పని అనేది ఒక మందు లాగా పని చేసేది.

ఈ చలికాలమంతా థియేటర్లలో మామూలుగానే ప్రదర్శనలు జరిగాయి. నీరసంతో కూలిపోతున్నా నటులు నటించడం మానలేదు. ఆర్కిటెక్ట్ సంస్థలోని ఆర్కిటెక్టులు, యుద్ధంలో నాశనమైన చారిత్రక భవనాలను పాత వైభవం మళ్ళీ వచ్చేలా ఎలా పునరుద్ధరించాలి అనే విషయం మీద ఆ గడ్డు కాలంలోనే పని చెయ్యడం మొదలు పెట్టారు. స్కూళ్ళు కూడా కరువు కాలంలో పని చేస్తూనే ఉండేవి. తాంబోస్ వీధిలో ఉన్న మాధ్యమిక పాఠశాల నాలుగు సార్లు జర్మన్ ఫిరంగి దాడులకు గురయి చాలా మటుకు ధ్వంసమైంది. కాని విద్యార్థులు, ప్లైవుడ్ తో కిటికీలు మూసి, కూలిన గోడలు తిరిగి నిర్మించి, పాఠశాల నడిచేలా చేశారు. పిల్లల తండ్రుల్లో 85 శాతం మంది లెనిన్ గ్రాడ్ యుద్ధ రంగంలోనైనా ఉన్నారు, లేదా యుద్ధంలోనో కరువులోనో మరణించారు, లేదా ఫాక్టరీలలోనో, రవాణా రంగంలోనో మరో చోటో పని చేస్తుండేవారు. మైనస్ 20 డిగ్రీల చలిలో చదువు కొనసాగేది. క్లాసు రూంలో చిన్న చిన్న చెక్క స్టవులు వెలిగించేవారు. కాని కొంచెం దూరంలో ఉన్న వాళ్ళు చలికి వణికి పోయేవారు. కిరోసిన్ లాంపు సహాయంతో చదువుకునే వారు. ఈ స్కూలులో చాలామంది ఉపాధ్యాయులు మరణించారు, కాని పిల్లలకు ఆహారం అందేలా చూసేవారు.

1943లో లెనిన్ గ్రాడ్ తను ఉత్పత్తి చేసిన వస్తువులనూ సైనిక సామగ్రినీ దేశంలో ఇతర ప్రాంతాలకు పంపించగలిగింది. లెనిన్ గ్రాడ్ ఆహారధాన్యాలను పెద్ద ఎత్తున నిలువ చేసింది కనుక ఆహార సమస్య తీరింది. 1943 సెప్టెంబరుకి లెనిన్ గ్రాడ్ లోని అన్ని ప్రాంతాలకూ విద్యుత్తు సరఫరా ప్రారంభమైంది. జర్మన్ ఫిరంగి దాడుల వలన నష్టమైన, నష్టమవుతున్న నీటి గొట్టాల కారణంగా 20 శాతం నీరు వృధా అయ్యేది, కాని మొత్తం మీద నీటి సరఫరా కూడా సంతృప్తికరంగానే ఉండేది. లెనిన్ గ్రాడ్ యుద్ధ రంగానికి కావలసిన ఫిరంగి, తుపాకి గుళ్ళు దాదాపు లెనిన్ గ్రాడ్ లోనే తయారయ్యేవి.

Edit with WPS Office
లెనిన్ గ్రాడ్ పరిసర ప్రాంతాలలో 12,500 హెక్టార్ల ప్రాంతంలో కూరగాయలు పండించేవారు. ఇవి కాక నగరానికి వెలుపల ప్రభుత్వ క్షేత్రాలుండేవి. లెనిన్ గ్రాడ్ బయట నుంచి బంగాళా దుంపలు మాత్రం తీసుకునేది. కేబేజి, కేరట్ తదితర కూరగాయలను లెనిన్ గ్రాడ్ పండించేది. యుద్ధానికి ముందు లెనిన్ గ్రాడ్ వాసులకు కూరలు తినడమే కాని పండించడం తెలియదు. యుద్ధకాలంలో ప్రతీ ఒక్కరూ తోటపనిలో నిపుణులయ్యారు. 'బయటనుంచి ఏ సహాయం ఆశించవద్దు. మీరు ఎంత పండిస్తే అంత తినగలుగుతారు', అన్నది లెనిన్ గ్రాడ్ నినాదమైంది. తోటల పెంపకం గురించి ప్రసంగాలు ఇస్తున్నప్పుడు వేలమంది ప్రజలు ఉత్సాహంగా వినేవారు.

1941-42 సంవత్సరాలలో రోజుకు 200-300 ఫిరంగి గుళ్ళు లెనిన్ గ్రాడ్ మీద పడేవి. ఈ కాలంలో జర్మన్లు దాదాపు 40,000 ఫిరంగి గుళ్ళు లెనిన్ గ్రాడ్ మీద కురిపించారు. ఇవి కాక విమాన దాడులు. 1942లో ఈ రంగంలో రష్యన్లు వైమానిక ఆధిక్యత సంపాదించిన తర్వాత విమాన దాడులు తగ్గినా జర్మన్ ఫిరంగులు గుళ్ళ వర్షం కురిపిస్తూ, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలుగజేసేవి. లెనిన్ గ్రాడ్ లో కొన్ని ప్రాంతాలు తీవ్ర నష్టానికి గురయ్యాయి. రాతితోనూ ఇటుకలతోనూ కట్టిన భవనాలు మాత్రం నిలిచాయి. లెనిన్ గ్రాడ్ లో ఇళ్ళు మరమ్మత్తు చేసే వారికీ జర్మన్ ఫిరంగి దళాలకూ మధ్య 'యుద్ధం' జరుగుతుండేది. 1943 సెప్టెంబరు నాటికి మరమ్మత్తు దళాలు 8,60,000 చదరపు మీటర్ల పరిమాణంతో సమానమైన ఇంటి కప్పులను బాగు చేశాయి. 30 లక్షల చదరపు మీటర్ల కిటికీలు నిర్మించాయి. ఈ కిటికీలకు అద్దాలు వాడేవారు కాదు. బాంబుల దాడిలో అద్దాలు పగిలి గాయాలవుతాయన్న ఉద్దేశంతో ప్లైవుడ్ తో కిటికీలను మూసేవారు. వెలుగు రావడానికి ప్రతీ గదిలోనూ ఒక చిన్న అద్దం మాత్రం ఏర్పాటు చేసేవారు. 1943 నాటికి 7000 గదులు పూర్తిగా మరమ్మత్తు చేశారు. 49,000 కుళాయిలు బాగు చేశారు. 25 కి. మీ. ప్రధాన నీటి గొట్టాలు వేశారు. 1941-42 శీతాకాలం తర్వాత లెనిన్ గ్రాడ్ లో నీటి సరఫరా మార్గాలన్నింటినీ మళ్ళీ వెయ్యాల్సి వచ్చింది. ఈ పని జరుగుతుంటే జర్మన్లు ఫిరంగి కాల్పులతో నాశనం చేసేవారు. మరమ్మత్తు దళాలు మళ్ళీ మరమ్మత్తు చేసేవి. లెనిన్ గ్రాడ్ జీవితం ఇది. అలాగే ట్రామ్ లు కూడా నడుస్తుండేవి. ఈ ట్రామ్ లైన్లు జర్మన్ ఫిరంగి దాడుల్లో దెబ్బ తింటుంటే, మరమ్మత్తు దళాలు బాగు చేస్తుండేవి. 1943లో చుట్టుముట్టిన జర్మన్ సైన్యాన్ని తరిమి వేసేదాకా దిగ్బంధంలో ఉన్న లెనిన్ గ్రాడ్ పరిస్థితి అలాగే ఉంది.

ఈ అధ్యాయాన్ని ముగించే ముందు కిరోవ్ వర్క్స్ యుద్ధకాలంలో ఎలా పోరాడి నిలిచినదీ తెలుసుకుందాం. లెనిన్ గ్రాడ్ ప్రజలలో, కార్మికులలో, మొక్కవోని ధైర్యానికీ, త్యాగ దీక్షకూ కిరోవ్ వర్క్స్ ఒక ఉదాహరణ.

కిరోవ్ వర్క్స్ పోరాటం

విప్లవానికి ముందు ఈ ఫాక్టరీ పేరు ప్యుటిలోవ్ వర్క్స్. 1917 విప్లవంలో ప్యుటిలోవ్ వర్క్స్ కార్మికులు చురుకుగా పాల్గొన్నారు. ఈ ఫాక్టరీకి అప్పటినుండీ విప్లవ సంప్రదాయం ఉంది. 1941లో జర్మన్ దాడి సమయానికి ఈ ఫాక్టరీలో 30,000 మంది కార్మికులు పని చేస్తున్నారు. యుద్ధ ప్రారంభ సమయానికి స్త్రీ కార్మికుల సంఖ్య చాలా తక్కువ. యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ఈ ఫాక్టరీ టర్బైన్లు, టాంకులు, ఫిరంగులు, ట్రాక్టర్లూ తయారు చేసేది. మాస్కో-వోల్గా కాలువ నిర్మాణానికి కావలసిన పరికరాలలో అధిక భాగం ఈ ఫాక్టరీయే తయారు చేసింది. నావికా దళానికి యంత్రాలను తయారు చేసేది. విమానాలకూ టాంకులకూ ఇంజిన్లు తయారు చేసేది. ఈ ఫాక్టరీ యుద్ధ రంగానికి రెండు మైళ్ళ సమీపంలో ఉన్న కారణంగా, 1944లో దిగ్బంధం ముగిసేదాకా జర్మన్ ఫిరంగి దాడులకు గురవుతుండేది.

'లెనిన్ గ్రాడ్ ప్రమాదంలో ఉంది' అని పార్టీ హెచ్చరించిన వెంటనే కిరోవ్ ఫాక్టరీ కార్మికులు యుద్ధంలో చేరడానికి ముందుకు వచ్చారు. ఈ ఫాక్టరీ కార్మికులు రక్షణకు అవసరమైన పరిశ్రమలలో పని చేస్తున్నారు కనుక వీరు సైన్యంలో చేరాలన్న నియమం లేదు. కాని ఫాక్టరీలో పని చేసే మొత్తం 30,000 మంది కార్మికులూ సైన్యంలో చేరడానికి ముందుకు వచ్చారు. 10,000 మంది కార్మికులకు మాత్రమే సైన్యంలో చేరడానికి అనుమతి ఇచ్చారు. ఈ కార్మికులు కిరోవ్ డివిజన్ గా యుద్ధ రంగంలోకి వెళ్ళారు. యుద్ధానికి ముందు కొద్దిగా సైనిక శిక్షణ పొందినా, ఈ కిరోవ్ డివిజన్ నిజానికి సుశిక్షితమైన సైన్యం అనడానికి లేదు. కాని వారి దీక్ష, దేశభక్తి, వర్గ చైతన్యం సాటిలేనివి. లెనిన్ గ్రాడ్ లో ఉన్న

Edit with WPS Office
ఫాక్టరీలనుండి ఇలా అనేక కార్మిక డివిజన్లు జర్మన్లను నిలువరించే లక్ష్యంతో యుద్ధ రంగానికి వెళ్ళాయి. కిరోవ్ డివిజన్, లూగా, నోవోగ్రాద్, పుష్కినో ప్రాంతాలలో తీవ్ర నష్టాలకు గురవుతూ పోరాడి, ఆఖరి క్షణంలో లెనిన్ గ్రాడ్ ముందు జర్మన్లను ఆపు చేసింది. ఈ కార్మిక డివిజన్లలోని అధిక సంఖ్యాక కార్మికులు యుద్ధ రంగాన్నుంచి తిరిగి రాలేదు. ఈ డివిజన్లలో నష్టాలు చాలా ఎక్కువగా ఉండేవి. లెనిన్ గ్రాడ్ దగ్గర జర్మన్లను ఆపుచేసిన తర్వాత, ఈ డివిజన్లలోని మిగిలిన కార్మికులలో కొందరు ఎర్రసైన్యంలో చేరారు. కొంతమందిని, వారి నైపుణ్యం కారణంగా ముఖ్య రక్షణ పరిశ్రమలలో పని చెయ్యడానికి వెనుకకు పిలిపించారు.

యుద్ధ రంగానికి కొద్దిమైళ్ళ దూరంలో ఉన్న ఈ ఫాక్టరీని జర్మన్ల దాడి నుంచి రక్షించుకోవాల్సి వచ్చింది. ఆ రోజుల్లో జర్మన్లు పేరాట్రూపర్ దళాలతో పెద్ద ఎత్తున దాడి చేస్తుండేవారు. జర్మన్ దాడి నుంచి రక్షించుకోవడానికి ఫాక్టరీ ఆవరణలోనే కార్మికులతో కూడిన ఒక ఫిరంగి దళాన్నీ ఒక టాంకు బ్రిగేడ్ నూ దళాలనూ ఉంచడం జరిగింది. రాత్రింబవళ్ళు వీరందరూ అప్రమత్తులై కాపలా కాస్తుండేవారు.

కిరోవ్ ఫాక్టరీ మీద మొట్టమొదటి సారి 1941 సెప్టెంబరు 8న ఫిరంగి దాడి జరిగింది. 15వ తేదీనుంచి భయంకరమైన ఫిరంగి దాడి అనేక వారాల పాటు జరిగింది. 15న ఫాక్టరీకి ఎనిమిది మైళ్ళ దూరంలో ఉన్న కార్మికుల నివాస ప్రాంతాల మీద జర్మన్లు దాడి చేశారు. ఫాక్టరీకూ ఈ కార్మిక నివాస ప్రాంతానికీ మధ్య సంబంధం తెగిపోయింది. కార్మికుల్లో కొందరు తప్పించుకుని ఎర్రసైన్యాన్ని చేరుకోగలిగారు. మిగిలిన వారు జర్మన్ల వాత పడి మరణించారు. సెప్టెంబరు నుంచి జర్మన్ ఫిరంగి దాడి తీవ్రంగా ఉండడం వలన, ఫాక్టరీలో కొంత భాగాన్ని లెనిన్ గ్రాడ్ ఉత్తర ప్రాంతానికి తరలించారు. ఆ రోజుల్లో దక్షిణ లెనిన్ గ్రాడ్ జర్మన్ల వశమయ్యే ప్రమాదం ఉంది. అక్టోబరు మధ్య ప్రాంతంలో ఫాక్టరీ సామగ్రిలో అధిక భాగాన్ని తూర్పుకు తరలించాలని నిర్ణయించారు. కాని 525 మెషీన్ టూల్స్, 2200 మంది కార్మికులను మాత్రమే సకాలంలో తరలించగలిగారు. నవంబరు, డిసెంబరు నెలలలో మిగిలిన ముఖ్య ఫాక్టరీ విభాగాలను విప్పి పేక్ చెయ్యగలిగారు, కాని 1942 వసంత కాలం తర్వాత మాత్రమే వీటిని తూర్పుకు పంపించగలిగారు.

అయితే నైపుణ్యం కలిగిన కార్మికులను, వారి కుటుంబాలతో సహా, సైబీరియాకూ యురల్స్ ప్రాంతానికీ విమానాలలో తరలించారు. ఈ కార్మికులు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులలో, జర్మన్ ఆక్రమిత ప్రాంతాల గుండా, మంచులో దిగబడిపోతూ, డజన్ల కిలోమీటర్లు నడిచి విమానాశ్రయాలను చేరుకోవలసి వచ్చింది. కిరోవ్ ఫాక్టరీని తరలించ లేకపోయినా ఖార్కోవ్, కీవ్, మాస్కో తదితర ప్రాంతాలనుంచి తరలించిన ఫాక్టరీలు యురల్స్ ను చేరాయి. 2,000 కిలో మీటర్ల దూరంలో కొత్త ప్రదేశాలలో ఆ ఫాక్టరీలను పునర్నిర్మించడంలోనూ ఉత్పత్తిని ప్రారంభించడంలోనూ కిరోవ్ ఫాక్టరీ కార్మికులు పని చేశారు. కార్మికులనూ సామగ్రినీ తీసుకు వెడుతున్న రైళ్ళు తరచు జర్మన్ విమాన దాడికి గురయ్యేవి. కార్మికులను తీసుకు వెళ్ళే విమానాలు రాత్రి వేళల్లో మాత్రమే కష్టమైన పరిస్థితుల్లో ఎగరగలిగేవి.

యుద్ధకాలంలో ఈ ఫాక్టరీ టాంకులూ డీసెల్ ఇంజిన్లూ మరమ్మత్తు చేసింది. మందుగుండూ చిన్న ఆయుధాలూ తయారు చెయ్యసాగింది. డిసెంబరు 15న ఫాక్టరీ ఆగిపోయింది. ఇంధనం లేదు, విద్యుత్తు లేదు, ఆహారం లేదు, నీరు లేదు. కరువులో ఉత్పత్తి నిలిచిపోయింది. ఇటువంటి పరిస్థితిలో ఏప్రిల్ 1వ తేదీ వరకూ కిరోవ్ ఫాక్టరీ నిలిచిపోయింది. ఫిబ్రవరిలో లగోడా ఐసు రోడ్డు మీద నుంచి లెనిన్ గ్రాడ్ కు ఆహారం అందసాగింది, కాని కిరోవ్ వర్క్స్ మామూలుగా పని మొదలు పెట్టడానికి మరో నెల తీసుకుంది. కాని భయంకరమైన ఆకలితో కూడా కిరోవ్ ఫాక్టరీ చెయ్యగలిగినదంతా చేసింది. గన్నులు మరమ్మత్తు చేసింది, ఫౌండ్రి చిన్న ఎత్తున నడిచింది. బ్రహ్మాండమైన కిరోవ్ ఫాక్టరీ కుగ్రామం లోని కమ్మరి కొలిమిలా మారిందా అనిపించేది. సముద్రం నుంచి నీరు సరఫరా చెయ్యడానికి చిన్న పంపు పని చేస్తుండేది. లెనిన్ గ్రాడ్ లో తీవ్ర అగ్ని ప్రమాదాలు సంభవించినా కిరోవ్ ఫాక్టరీలో తీవ్ర అగ్ని ప్రమాదం ఏదీ సంభవించలేదు. తిండిలేక నీరసించిపోయిన కార్మికులకు శ్రమ తగ్గించడానికి ఫాక్టరీ ఆవరణలోనే హాస్టల్స్ ఏర్పాటు చేశారు. దూరం నుంచి నడిచి వచ్చే కార్మికులను వారానికి రెండు రోజులు మాత్రమే రమ్మని చెప్పేవారు. డిసెంబరులో కార్మికుల సమావేశంలో, కార్మికులకు రేషన్ 400 గ్రాములనుంచి 250 గ్రాములకు తగ్గించాలనీ; ఇతర ఉద్యోగులకూ కుటుంబాలలోని ఇతర వ్యక్తులకూ రోజుకు 125 గ్రా. ఇవ్వాలనీ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ నిర్ణయం మరణ శిక్ష వంటిది అయినా

Edit with WPS Office
కార్మికులు ఏకగ్రీవంగా అంగీకరించారు. కార్మికులకు కొద్దిగా సోయా కలిపిన ఈస్ట్ సూప్ ఇచ్చేవారు. ఇది దాదాపు నీరు లాగానే ఉండేది కాని ఏదో తింటున్నామన్న తృప్తి కలిగించేది. ఈ 250-125 గ్రా. బ్రెడ్ లోనూ, 40-50 శాతం రంపపు పొట్టు లాంటి పదార్థాలు కలిపేవారు. ఈ కరువులో కిరోవ్ కార్మికులు చాలామంది మరణించారు. ముఖ్యంగా వయసు వచ్చి, అనుభవం గడించిన కార్మికులలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉండేది. వయసు రావడం వలన వీరు శారీరకంగా బలహీనులై త్వరలోనే మరణించారు. శవాలను శ్మశానానికి తరలించడం అసాధ్యమై ఫాక్టరీ ఆవరణలోనే ఒక శ్మశానాన్ని ఏర్పాటు చేశారు. ఇంక చావు తప్పదు అని గుర్తించిన కార్మికులు తోటి కార్మికులకు వీడ్కోలు చెప్పడానికి వచ్చేవారు. అలా వీడ్కోలు చెబుతూనే చనిపోయేవారు. 1942 వసంతకాలం తర్వాత జీవించి ఉన్న కార్మికులలో చాలామందిని తూర్పు పారిశ్రామిక ప్రాంతాలకు తరలించారు.

ఏప్రిల్ తర్వాత ఆహార కొరత తీరింది, కాని జర్మన్ సైన్యం రెండు మైళ్ళ దూరంలోనే ఉండడం వలన తరచు ఫిరంగి దాడులకు గురవుతుండేది. అనేక మంది కార్మికులు ఈ దాడులలో చనిపోయేవారు. ఫాక్టరీ కాంక్రీటు గోడ పన్నెండు అంగుళాల మందం గలది. పై కప్పుకు బలమైన ఉక్కు దూలాలుండేవి. ఫిరంగి గుండు సూటిగా తగిలితే తప్ప ఫాక్టరీకి అంత నష్టం ఉండేది కాదు. 1943 సెప్టెంబరు నాటికి, రెండు సంవత్సరాలుగా కిరోవ్ ఫాక్టరీ దాడికి గురవుతూనే ఉంది. చాలా వర్క్ షాపులు దెబ్బతిన్నాయి. అయినా మందుగుండు ఉత్పత్తి ఆగలేదు, రోజురోజుకు పెరగసాగింది. జర్మన్ ఫిరంగి దాడి ఒక్కొక్కసారి తీవ్రంగా ఉండేది. ఫాక్టరీ ఆవరణలోని చెక్క భవనాలన్నింటినీ కూల్చి వెయ్యడం వలన మంటల బాంబులనుంచి ప్రమాదం తగ్గింది.

జర్మన్ ఫిరంగి దాడిని తట్టుకుని కిరోవ్ ఫాక్టరీ ఎలా పని చేసింది?

ఏ రకమైన హెచ్చరికా లేకుండా పేలే మొదటి గుండు మాత్రమే తీవ్ర నష్టం కలిగించేది. మొదటి గుండు పడిన వెంటనే ప్రతీ కార్మికుడూ రక్షణ స్థావరాలలోకి వెళ్ళి పోయేవాడు. అందువలన తర్వాత ఫిరంగి దాడి తీవ్రంగా ఉన్నా ప్రాణ నష్టం ఎక్కువగా ఉండేది కాదు. ఈ మొదటి గుండు కూడా తరచు ఎక్కువ నష్టం కలిగించకుండా కార్మికులు లేని ప్రాంతంలో దిగేది.

యంత్రాలను ఒక చోట కేంద్రీకరించి ఉంచకుండా వివిధ ప్రాంతాలలో ఉంచేవారు. ఒక పనిని చిన్న చిన్న విభాగాలుగా చేసి, ప్రతీ పనీ వర్క్ షాపులో ఒక మూల జరిగేలా ఏర్పాటు చేశారు. ఈ మూల ప్రాంతానికి బాంబు ప్రేలుడు వలనా, తునకల వలనా, నష్టం కలుగకుండా రక్షణ ఏర్పాట్లు చేసేవారు. అందువలన జర్మన్ ఫిరంగి గుండు వర్క్ షాపు మీద పేలిన పక్షంలో కూడా యంత్రాలలోనూ కార్మికులలోనూ నష్టం తక్కువగానే ఉండేది. అయినా నష్టాలను నివారించడం అసంభవమయ్యేది. 1943 సెప్టెంబరు నెలలో, మూడు వారాలలో, కిరోవ్ ఫాక్టరీ 43 మంది కార్మికులను నష్టపోయింది. వీరిలో పదముగ్గురు మరణించారు. మిగిలిన వారు గాయపడ్డారు. ఇతర నెలలతో పోల్చి చూస్తే ఆ నెలలో మరణాల సంఖ్య కొంచెం తక్కువే.

జర్మన్ ఫిరంగి గుండు పేలిన వర్క్ షాపులో పని ఒకటి రెండు రోజులు ఆగిపోయేది. తోటి కార్మికులలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉంటే ఒకటి రెండు రోజుల పాటు ప్రమాద ప్రభావం కార్మికుల మీద ఉండేది. చిమ్మిన రక్తం, శరీర శకలాలతో కూడిన ఆ భయంకర దృశ్యం చూసిన ఎల్లాంటి కార్మికుడి మనసైనా చలించేది. కాని త్వరలోనే కార్మికులు కోలుకుని మళ్ళీ పని లోకి వచ్చి ఈ రెండు రోజులలో నిలిచిపోయిన ఉత్పత్తి కోటాని పూర్తి చెయ్యడానికి ప్రయత్నించేవారు. ఏ కార్మికుడైనా ఈ ఒత్తిడిని తట్టుకోలేని పరిస్థితిలో ఉంటే, అతనిని నెల రోజుల పాటు విశ్రాంతి గృహానికి పంపేవారు. ఫాక్టరీ మీద జర్మన్ దాడి జరిగే ప్రమాదం ఉన్న రోజులలో మెషీన్ గన్ లకు రక్షణ స్థావరాలు ఏర్పాటు చేశారు. ఈ మెషీన్ గన్ స్థావరం కప్పు ఉక్కు దూలాలతో ఉండేది. గోడలు పన్నెండు ఇటుకల మందం ఉండేవి. ఇటువంటి అనేక కట్టడాలతో కిరోవ్ ఫాక్టరీ అంతా ఒక దుర్గంలా తయారయింది.

1943 నాటికి ఈ ఫాక్టరీ కార్మికులలో 69 శాతం స్త్రీలూ, ఇంకా వయసు రాని బాలికలే. 14 సంవత్సరాల బాలికలు కూడా పని చేసేవారు. ఈ బాలికలలో చాలామంది తల్లిదండ్రులూ అన్నదమ్ములూ కరువులో మరణించారు, లేదా యుద్ధరంగంలో ఉండేవారు. ఈ బాలికలకు తాము పని చేసే ఫాక్టరీ యుద్ధరంగమంతటి ప్రమాదకరమైన ప్రదేశం అని తెలుసు. కిరోవ్ వర్క్స్ లో పని చేస్తున్న 16 ఏళ్ళ తమారా గురించి అలెగ్జాండర్ వెర్త్ 'లెనిన్ గ్రాడ్' అన్న పుస్తకంలో రాశాడు. 1943లో లెనిన్ గ్రాడ్ పర్యటించిన వెర్త్ విశ్రాంతి గృహంలో ఉన్న తమారాను కలుసుకున్నాడు. ఆమె గౌను మీద పచ్చటి రిబ్బనుతో ఒక మెడల్ ఉంది. ఈ మెడల్ ఆమెకు కిరోవ్ వర్క్స్ లో పని చేసినప్పుడు ఇచ్చారు.

Edit with WPS Office

'.... నా తండ్రి జనవరి 7వ తేదీన చనిపోయాడు. నేను పధ్నాలుగేళ్ళ వయసు వచ్చినప్పటినుంచీ కిరోవ్ వర్క్స్ లో పని చెయ్యడం ప్రారంభించాను. బహుశా అందుకని ఈ మెడల్ ఇచ్చి ఉంటారు....' అని చెప్పింది ఆ అమ్మాయి. జర్మన్ ఫిరంగి దాడులు నీకు భయం కలిగించవా అన్న ప్రశ్నకు సమాధానం చెబుతూ, '.....అలవాటు పడితే అంత భయం అనిపించదు. ఫిరంగి గుండు ఊళలు వేస్తూ వెడుతుంటే అది చాలా ఎత్తులో పోతోందన్న మాట. దాని నుంచి ప్రమాదం ఉండదు. బుస కొడుతున్నట్లు శబ్దం వినిపిస్తే మాత్రం ప్రమాదం. ఫిరంగి గుండు క్రిందకు దిగుతోందన్న మాట. తరచు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. క్రిందటి వారం ఒక ప్రమాదం జరిగింది. నేను పని చేస్తున్న వర్క్ షాపులో ఒక గుండు పేలింది. చాలమంది గాయపడ్డారు. ఇద్దరు అమ్మాయిలు మంటల్లో కాలిపోయారు.....నేను కిరోవ్ ఫాక్టరీ కార్మికురాలిని. నా తండ్రి కిరోవ్ ఫాక్టరీలో పని చేశాడు. నేను ఈ ఫాక్టరీ వదలి పోయే ప్రశ్న లేదు. గడ్డుకాలం గడిచింది. మేం చివరిదాకా నిలబడగలం.....నా తల్లి యుద్ధానికి ముందే చనిపోయింది. పెద్దన్నయ్య లెనిన్ గ్రాడ్ రంగంలో సైన్యంలో ఉన్నాడు. తరచు ఉత్తరాలు రాస్తుంటాడు.....' అని చెప్పింది ఆ అమ్మాయి.

లెనిన్ గ్రాడ్ లో ప్రతీ ఫాక్టరీలోనూ, కార్మికులలోనూ, ప్రజలలోనూ ఉవ్వెత్తున లేచిన ఈ చైతన్యం లెనిన్ గ్రాడ్ ప్రజలు భయంకరమైన విపత్తులను తట్టుకుని నిలిచి పోరాడడానికి ప్రధాన కారణమైంది. ఈ చైతన్యం లెనిన్ గ్రాడ్ కు మాత్రమే పరిమితమై లేదు. లెనిన్ గ్రాడ్ ఒక ఉదాహరణ మాత్రమే. మొత్తం రష్యా అంతటా - మాస్కోలో, స్టాలిన్ గ్రాడ్ లో, సెవస్తపోల్ లో, ఒడెస్సాలో, సైబీరియాలో - రష్యన్ కార్మిక వర్గమూ ప్రజలూ ఇలాగే కష్టాలకు తట్టుకుని నిలిచారు, నిలిచి పోరాడారు, పోరాడి విజయం సాధించారు.

1942 వేసవి కాల అపజయాలు అధైర్యం కలిగించినా స్టాలిన్ గ్రాడ్ లో రష్యన్ సైన్యాల విజయాలు లెనిన్ గ్రాడ్ ప్రజల్లో విముక్తి త్వరలోనే సాధ్యమనే విశ్వాసాన్ని కలిగించాయి. 1943 జనవరి లో లెనిన్ గ్రాడ్ సైన్యం జర్మన్ల మీద దాడి చేసి, దిగ్బంధంలో 20 మైళ్ళ మేర గండి కొట్టగలిగింది. లెనిన్ గ్రాడ్ నుంచి మాస్కోకు త్వరలోనే రైళ్ళు నడవడం మొదలు పెట్టాయి. ఈ మార్గంలో గుడ్సు బళ్ళు మాత్రమే నడుస్తుండేవి. ఈ రైలు మార్గం నిరంతరం జర్మన్ దాడులు గురవుతుండడం వలన రైల్వే కార్మికులు దీనిని 'మృత్యుమార్గం' అని పిలిచేవారు.

1944 జనవరి వరకూ లెనిన్ గ్రాడ్ దిగ్బంధంలో ఇలాగే జీవించింది.

1944 జనవరిలో లెనిన్ గ్రాడ్ విముక్తి యుద్ధం ప్రారంభమైంది. లెనిన్ గ్రాడ్ రంగంలో రష్యన్లు 12,41,000 సైన్యాన్ని సమీకరించారు. ఈ సైన్యానికి 21,600 ఫిరంగులు, 600 విమానాలు, 1500 కాట్యూషా రాకెట్ వాహనాలు, 1475 టాంకులూ ఉన్నాయి. ఈ సైన్యంలో కమ్యూనిస్టులు 1,55,000, యువ కమ్యూనిస్టులు 1,15,000. రష్యన్ సైన్యం దాడిచేసే సమయంలో, జర్మన్ల వెనుకనున్న పార్టిజాన్ దళాలు జర్మన్ స్థావరాల మీదా రవాణా మార్గాల మీదా సరఫరాల మీదా దాడి చేసి తీవ్ర నష్టం కలిగించాయి.

ఈ రంగంలో ఉన్న జర్మన్ సైన్యం సంఖ్య 7,41,000. ఈ సైన్యానికి 10,700 ఫిరంగులు, 385 టాంకులు, 370 విమానాలూ ఉన్నాయి. దృఢమైన రక్షణ కట్టడాలతో ఉన్న ఈ 'ఉక్కు గోడ'ను రష్యన్లు పగలగొట్టలేరనే విశ్వాసంతో ఉన్నారు జర్మన్ సైనికాధికారులు.

జనవరి 15న 2,20,000 ఫిరంగి గుళ్ళ వర్షంలా కురిపిస్తూ దాడి చేసింది ఎర్ర సైన్యం. జనవరి 22 నాటికి జర్మన్ సైన్యం ఎర్రసైన్యం ఎదుట నిలవలేక పారిపోసాగింది. పారిపోతున్న ఈ జర్మన్ సైన్యాన్ని అందుకోవడం తరుముకు వెడుతున్న రష్యన్ సైన్యానికి కష్టమైంది.

1944 జనవరి 27న, 900 రోజుల దిగ్బంధం తర్వాత, లెనిన్ గ్రాడ్ విముక్తి చెయ్యబడింది. దిగ్బంధం ముగిసిందని సూచిస్తూ 324 ఫిరంగులు వందనం సమర్పించాయి. ఆ రోజు అందరూ వీధుల్లోకి వచ్చి సంతోషంతో డాన్సు చేశారు. ఒకళ్ళనొకళ్ళు కౌగిలించుకుని ఏడ్చారు.

ఓల్గా బెర్గోల్డ్స్ అనే లెనిన్ గ్రాడ్ కవయిత్రి ఆ రోజున చిన్న కవిత ఒకటి రాసింది.

'....మృత్యువు విహరించిన ఈ ప్రదేశంలో
ఈ నల్లటి ధూళినుంచి, ఈ బూడిద నుంచి
ఒక ఉద్యాన వనం గతంలో లాగే చిగురిస్తుంది
అవును, నేను అద్భుతాలు జరుగుతాయని నమ్ముతాను
ప్రియమైన నా లెనిన్ గ్రాడ్ నగరమా

Edit with WPS Office
నువ్వు నాకు ఆ నమ్మకాన్నిచ్చావు.....'

ఈ కవయిత్రి లెనిన్ గ్రాడ్ పోరాటాన్ని ఒక విషాద కథగా చూపలేదు. ఒక వీరోచిత గాథగా చిత్రించింది. మార్క్సిజం నిరాశావాదం కాదు. జీవితాన్ని అంతులేని విషాదంగా మార్క్సిజం వర్ణించదు. జీవితాన్ని అంతులేని పోరాటంగా గుర్తిస్తుంది. ఈ పోరాటం ఎంత కష్టసాధ్యమైనా, విజయం సాధించాలనే పట్టుదలతో పోరాడాలంటుంది.

ఈ లెనిన్ గ్రాడ్ కవయిత్రి దృక్పథానికి విరుద్ధమైన దృక్పథంతో రాసిన పుస్తకం హేరిసన్ శాలిస్ బరీ రచన - 'తొమ్మిది వందల రోజుల దిగ్బంధంలో లెనిన్ గ్రాడ్'

ఈ పుస్తకం చదివితే లెనిన్ గ్రాడ్ ఒక విషాదంగా మాత్రమే కనుపిస్తుంది. లెనిన్ గ్రాడ్ విషాదానికీ, నమ్మశక్యం గాని లెనిన్ గ్రాడ్ ప్రజల పోరాట దీక్షకూ గల కారణాలనూ లెనిన్ గ్రాడ్ విజయం రష్యా విజయానికీ, అంతిమంగా హిట్లర్ నాశనానికీ ఎలా దారి తీసినదీ, హిట్లర్ నాశనమవడం వలన ప్రపంచం ఎటువంటి భయంకరమైన ప్రమాదనుంచి రక్షించబడినదీ - ఈ సంపూర్ణ చిత్రాన్ని నిజాయితీ లోపించిన ఈ రచయిత చిత్రించడు. లెనిన్ గ్రాడ్ జీవితంలోని అత్యంత విషాదకరమైన సంఘటనలను ఇతను వర్ణించాడు. ఈ పుస్తకం చదివితే లెనిన్ గ్రాడ్ ప్రజల త్యాగాలూ లెనిన్ గ్రాడ్ యుద్ధరంగంలో సైనికుల పోరాటాలూ ఒక అర్థరహితమైన, అంతులేని విషాదంగా అనిపిస్తుంది. దాదాపు 750 పేజీలున్న ఈ పుస్తకంలో రిఫరెన్సుల లిస్టు 14 పేజీలుంది. వందల పుస్తకాలూ రష్యన్ పత్రికలూ ఆధారంగా ఇతను ఈ పుస్తకం రాశానన్నాడు. ఎంతో పరిశోధించి ఇతను రాసినది వాస్తవం కాదా? అతను అసత్యం చెప్పి ఉండకపోవచ్చు, కాని పూర్తి సత్యాన్ని మాత్రం చెప్పలేదు. ఈ వాస్తవాలను పాక్షికంగా చిత్రీకరించడంలోనే అతని కమ్యూనిస్టు వ్యతిరేక, సోవియట్ వ్యతిరేక దృక్పథం స్పష్టమవుతుంది. ఎంతో నిజాయితీతో రాసినట్లు కనుపించే పశ్చిమ దేశాల చరిత్రకారులు చరిత్రను వక్రీకరించే తీరు ఇది.

లెనిన్ గ్రాడ్ యుద్ధం అర్థం లేని విషాదం కాదు. ఊహకు సాధ్యం కాని కష్టాలు అనుభవిస్తూ ఫాసిజాన్ని నిలువరించిన వీర ప్రజానీకపు చరిత్ర. గుండెకు గాయమై నిస్త్రాణతో తూలిపోతున్నా తడబడక విజయం వైపు అడుగులు వేసిన ఈ వీర నగరం కొందరికి మృత్యువు విహరించిన ప్రదేశంగా గోచరిస్తే, మరికొందరికి మనిషి అద్భుతాలను సృష్టించగలడన్న నమ్మకాన్నిస్తుంది.

అవును, లెనిన్ గ్రాడ్ కథ ఒక విషాద గాథ కాదు, కార్మిక వర్గ వీరోచిత పోరాట గాథ.

Edit with WPS Office

అధ్యాయం ఐదు

1942 వసంతకాలం నుండి స్టాలిన్ గ్రాడ్ వరకూ.....

1941 శీతాకాలం ఎదురుదాడిలో జర్మన్ సైన్యం అజేయం కాదని రష్యా రుజువు చేసింది. జర్మనీ ఆశించినట్లు రష్యా ఆరు వారాలలో కూలిపోలేదు, ఆరు నెలల తర్వాత జర్మనీకి ఒక గుణ పాఠం నేర్పింది. ఈ రష్యన్ విజయం జర్మన్ వ్యతిరేక శక్తులకు ఉత్సాహాన్నిచ్చింది. హిట్లర్ జర్మనీ నాశనం తప్పదనే ఒక విశ్వాసం ఏర్పడింది. డిసెంబరులో ప్రారంభమైన రష్యన్ ఎదురు దాడి వసంతకాలానికి నీరసించి నిలిపోయి, యుద్ధ రంగంలో ఒక ప్రతిష్టంభన ఏర్పడింది. ఇరు పక్షాలూ రాబోయే యుద్ధాలకు సిద్ధం కాసాగాయి. జర్మనీ గాయపడి వెనుకంజ వేసింది, కాని ఆక్రమిత దేశాల ఆర్థిక వనరులన్నింటినీ గుప్పెట్లోకి తీసుకుని అత్యంత బలోపేతంగానే ఉంది.

రష్యన్ హై కమాండు ఇంతవరకూ జరిగిన యుద్ధాన్నీ, వ్యూహానికీ ఎత్తుగలకూ సంబంధించిన అనుభవాన్నీ సమీక్షించి, గుణపాఠాలు నేర్చుకుని, వేసవి యుద్ధానికి సంసిద్ధం కాసాగింది. యుద్ధరంగమంతటా సైన్యం ట్రెంచిలు తవ్వింది. ముళ్ళ తీగలూ టాంకు అవరోధాలూ ఏర్పాటు చేసింది. మందు పాతరలు పాతింది. కమాండర్లు, వివిధ సైన్యాల మధ్య సమన్వయం ఎలా ఉండాలి అన్నది చర్చించారు. యుద్ధావసరాలకు అనుగుణంగా సోవియట్ ఆర్థిక వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ పూర్తయింది. కొత్తం టాంకులు, విమానాలు, ఆధునిక 45 మి.మి. టాంకు విధ్వంసక గన్నులు, 76 మి. మి. గన్నులు, రాకెట్లూ సైన్యానికి అందసాగాయి. రష్యా లోతట్టులో రిజర్వు సైన్యాల ఏర్పాటు మొదలైంది. అత్యంత ఆధునికమైన టాంకులతో ప్రత్యేక టాంకు సైన్యాల నిర్మాణం ప్రారంభమైంది. పెద్ద ఎత్తున జరిగే శత్రు టాంకు దాడిని ప్రతిఘటించడానికి టాంకు విధ్వంసక బ్రిగేడ్లూ డివిజన్లూ ఏర్పడ్డాయి. విమాన దాడుల నుంచి రక్షణ అభివృద్ధి చెయ్యబడింది. ప్రత్యేక వైమానిక సైన్యాలు ఏర్పడ్డాయి. జూన్ అంతానికి ఎనిమిది వైమానిక సైన్యాలు ఏర్పడ్డాయి.

1942 వేసవికాలం నాటికి సోవియట్ యూనియన్ బలగాలు - 56 లక్షల సైన్యం, 3,882 టాంకులు, 44,900 ఫిరంగులు, మోర్టార్లు (ఇవి కాక 50 మి. మీ. మోర్టార్లు 21,400), 2,221 విమానాలు. 1942 మే నాటికి జర్మన్ బలగాలు - 60 లక్షలకు పైగా (మిత్ర దేశాల సైన్యాలు 8,10,000తో సహా), 3,229 టాంకులు, స్వయంచలిత ఫిరంగులు, 57,000 ఫిరంగులు, మోర్టార్లు, 3,395 విమానాలు (G.Zhukov, Reminiscences and Reflections, Vol. 2, P. 70). సైనికుల సంఖ్యలోనూ ఆర్టిలరీలోనూ జర్మనీ ఆధిక్యత కలిగి ఉంది. రష్యాకు టాంకులలో కొద్దిగా ఆధిక్యత ఉంది, కాని జర్మన్ టాంకుల కంటే నాణ్యతలో వెనుకబడి ఉంది. యూరోపులో రెండో యుద్ధ రంగం లేకపోవడంతో జర్మనీ తన సైనిక బలగాల్లో 80 శాతానికి పైగా రష్యన్ రంగానికి పంపించగలిగింది. ఆక్రమిత దేశాలలోనూ ఇతర యుద్ధ రంగాలలోనూ 20 శాతం జర్మన్ సైన్యం మాత్రమే ఉంది. బ్రిటన్ ప్రారంభిస్తానన్న రెండో యుద్ధరంగం ప్రారంభం కాలేదు.

1942లో జర్మన్ సైన్యం రష్యన్ సైన్యం కంటే ఆధిక్యతలో ఉన్నా 1941లోలా అనేక రంగాల్లో ఒకేసారి దాడి చెయ్యగల స్థితిలో లేదు. 1942 వేసవిలో జర్మనీ యుద్ధ లక్ష్యాలు - దక్షిణాన ఎర్ర సైన్యాలను నాశనం చెయ్యడం; కకాసస్ ను ఆక్రమించి, కకాసస్ చమురును తన అధీనంలోకి తెచ్చుకోవడం; వోల్గానది వైపు పురోగమించి స్టాలిన్ గ్రాడ్ ను స్వాధీనం చేసుకోవడం ద్వారా రష్యాను నాశనం చెయ్యడం.

1943 ఏప్రిల్ 5వ తేదీ గల హిట్లర్ డైరెక్టివ్ నం.41 పధకం ప్రకారం జర్మన్ సైన్యం, విలువైన రష్యన్ పారిశ్రామిక, ఆర్థిక వనరులనూ వ్యవసాయిక ప్రాంతాలనూ ఆక్రమించి, జర్మనీకి అదనపు వనరులు, ముఖ్యంగా చమురు, అందేలా చేసి, సైనిక, రాజకీయ లక్ష్యాలు నెరవేరేలా చెయ్యాలి. కకాసస్, వోల్గాల ఆక్రమణతో కకాసస్ ద్వారా మిత్ర దేశాలతో రష్యాకున్న సంబంధాలను కూడా తెంపి వెయ్యాలి. ఈ పధకంలో ఉద్దేశించినట్లు, స్టాలిన్ గ్రాడ్ జర్మన్ల వశమయిన పక్షంలో కకాసస్ నుంచి రష్యాకు వోల్గా నది మీద భారీ ఎత్తున జరుగుతున్న రవాణా నిలిచిపోతుంది. దక్షిణ రష్యాను ఉత్తర రష్యానుంచి తెగ గొట్టడానికి జర్మన్ కమాండుకు అవకాశం ఏర్పడుతుంది.

Edit with WPS Office

బ్రిటన్, అమెరికా దేశాలు 1942లో రెండో యుద్ధరంగం ప్రారంభిస్తాయని స్టాలిన్ నమ్మలేదు. ముఖ్యంగా చర్చిల్ పట్ల స్టాలిన్ కు చాలా అపనమ్మకం ఉంది. చర్చిల్ సోవియట్ వ్యతిరేక స్వభావం అతనికి బాగా తెలుసు. 1942 వేసవి కాలంలో జర్మనీకి రెండు రంగాలలో పెద్ద ఎత్తున దాడి చెయ్యగల శక్తి ఉందని అతను భావించాడు. ఒకటి మాస్కో రంగం, రెండోది దక్షిణ రంగం. ఉత్తరాన చెప్పుకోదగ్గ జర్మన్ దాడులు ఉండవని అతను అభిప్రాయపడ్డాడు. ఈ రెండు రంగాలలోనూ మాస్కో రంగం గురించి అతను ఆందోళన చెందాడు. ఆ రంగంలో జర్మన్లు 70 డివిజన్లను సమీకరించారు.

వేసవికాలంలో పెద్ద ఎత్తున జర్మన్ సైన్యం మీద ఎదురు దాడులు చెయ్యడానికి రష్యాకు తగిన సైనిక బలగం కాని ఆయుధ సంపత్తి కాని లేవని స్టాలిన్ భావించాడు. రష్యన్ సైన్యాల తక్షణ కర్తవ్యం ఏమిటంటే - జర్మనీని రక్షణ యుద్ధాలలో ప్రతిఘటించి బలహీన పరచడం, పరిమిత ప్రదేశాలలో ఎదురు దాడులు చెయ్యడం. వేసవి యుద్ధం ఎలా జరపాలన్న విషయం గురించి రష్యన్ జనరల్స్ లో అభిప్రాయభేదాలు తలెత్తడంతో పరిస్థితిని సమీక్షించి వేసవి యుద్ధ ప్రణాళికలను నిర్ణయించడానికి స్టాలిన్ ఒక సమావేశం ఏర్పాటు చేశాడు. ఈ సమావేశం మార్చి నెల చివరన జరిగింది. ఈ సమావేశంలో వోరోషిలేవ్, టిమోషెంకో, పపోష్నికోవ్, వాసిలేవస్కీ, మార్షల్ ఝుకోవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో జనరల్ టిమోషెంకో నైరుతి రంగంలో పరిస్థితి గురించి వివరించి, తన సైన్యం నైరుతి రంగంలోని ఖార్కోవ్ ప్రాంతంలో జర్మన్ సైన్యం మీద దాడి చేస్తుందని ప్రతిపాదించాడు. రష్యన్ సైన్యం మీద జర్మన్ సైన్యం దాడి చెయ్యడానికి ముందే రష్యన్ సైన్యం దాడి చేసి శత్రువును దెబ్బ తియ్యాలనీ లేకపోతే యుద్ధ ప్రారంభంలో జరిగినట్లుగానే మళ్ళీ జరుగుతుందనీ మార్షల్ టిమోషెంకో అభిప్రాయపడ్డాడు (G. Zhukov, Reminiscences and Reflections, Vol. 2, P. 74). ఈ విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. ఎందుకంటే తర్వాత ఖార్కోవ్ ప్రాంతంలో రష్యన్ సైన్యం విపరీతమైన నష్టాలకు గురయినప్పుడు, కృశ్చేవ్ ఈ 'దుస్సాహసానికి' స్టాలిన్ ను నిందించి, లక్షల సైన్యాలను బలి చేసిన నేరస్తుడిగా చిత్రించాడు.

ఏప్రిల్ చివరన ఎర్ర సైన్యం క్రిమియాలో జర్మన్ సైన్యం మీద చేసిన దాడి విఫలమై తీవ్ర నష్టాలకు గురయింది. రష్యన్ సైన్యం రక్షణ యుద్ధానికి చర్యలు తీసుకోవాలని హై కమాండు ఆదేశించింది. కాని మే 8న జర్మన్ సైన్యం క్రిమియన్ రంగంలో పెద్ద ఎత్తున దాడి చేసి రష్యన్ సైన్య రక్షణ రేఖను ఛేదించి ముందుకు సాగింది. దీనితో సెవస్తపోల్ నగరానికి తీవ్ర ప్రమాదం ఏర్పడి అక్కడున్న ఎర్ర సైన్యం, నావికులూ నగరాన్ని వదలి పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది.

సెవస్తపోల్ దిగ్బంధం

లెనిన్ గ్రాడ్ లాగానే సెవస్తపోల్ కూడా జులై 4 నుండి తొమ్మిది నెలలుగా దిగ్బంధంలో చిక్కుకుని జర్మన్ సైన్యాలతో తీవ్రంగా పోరాడుతోంది.

1853-54 యుద్ధంలో కూడా సెవస్తపోల్ ముట్టడికి గురయి వీరోచితంగా పోరాడిన చరిత్ర ఉంది. అదీకాక ఈ రేవు పట్టణంలో నల్ల సముద్ర నావికా సైన్యం కూడా ఉంది. ఈ నావికా సైన్యం విప్లవాత్మక సంప్రదాయమూ, గొప్ప పోరాట పటిమా గల సైన్యం. సెవస్తపోల్ తొమ్మిది నెలలు జర్మన్ ముట్టడిని ఎదుర్కోవడంలో ఈ నావికా సైన్యం ప్రముఖ పాత్ర పోషించింది. మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే సెవస్తపోల్ లో చాలా బలమైన కమ్యూనిస్టు పార్టీ, కామ్సోమాల్ సంస్థలూ ఉన్నాయి.

1941 అక్టోబరులో జర్మన్లు, సెవస్తపోల్ తప్ప, క్రిమియా అంతా ఆక్రమించారు. సెవస్తపోల్ ప్రమాదంలో పడింది. నగరానికి ప్రమాదం ఏర్పడగానే సెవస్తపోల్ ప్రజలు నగరానికి ముందు అర్ధ చంద్రాకారంలో మూడు రక్షణ రేఖలు నిర్మించారు. అక్టోబరు 20న ఈ నావికా స్థావర ముట్టడి ప్రారంభమైంది. జర్మన్ సైన్యం అక్టోబరు 30 నుంచి నవంబరు 21 దాకా ఈ రక్షణ రేఖలను ఛేదించి సెవస్తపోల్ ను ఆక్రమించడానికి దాడి చేసింది. ప్రజలూ సైనికులూ ఈ దాడిని వీరోచితంగా ప్రతిఘటించారు. ఈ యుద్ధంలో నావికా సైన్య ఫిరంగులు రష్యన్ ప్రతిఘటనకు చాలా తోడ్పడ్డాయి. సెవస్తపోల్ లో 21,000 నావికా సైన్యంతో సహా 50,000 ఎర్ర సైన్యం ఉంది. జర్మన్-రుమేనియన్ సైన్యం రష్యన్ సైన్యానికంటే కనీసం రెండింతలు ఉంది. జర్మనీకి 450 టాంకులు, 600 విమానాలు ఉంటే రష్యాకు కేవలం 38 టాంకులు, 109 విమానాలు మాత్రమే ఉన్నాయి. అయితే సెవస్తపోల్ పట్టణానికి

Edit with WPS Office
ప్రకృతి సహజమైన రక్షణ ఉంది. మూడు వారాల పాటు జరిగిన మొదటి దాడిలో జర్మన్ సైన్యం మొదటి రక్షణ రేఖను కూడా ఛేదించలేకపోయింది. ఈ దాడిలో ఐదుగురు నల్ల సముద్ర నావికులూ వారి రాజకీయ శిక్షకుడూ చేసిన వీరోచిత పోరాటం ప్రసిద్ధికెక్కింది. ఈ ఆరుగురు చివరి బుల్లెట్ వరకూ పోరాడి, మందుగుండు అయిపోయిన తర్వాత చేతిబాంబులతో ముందుకు వస్తున్న జర్మన్ టాంకుల మీద దూకి, వాటిని ధ్వంసం చేసి, వాటితో పాటు తామూ పేలిపోయారు. వారి వీరోచిత చర్య జర్మన్ సైన్యాన్ని నిలుపు చేసింది. ఈ సాహస గాధ అనేక పాటలలోనూ కవితలలోనూ వర్ణించబడింది.

మొదటి దాడి విఫలమైన తర్వాత జర్మన్ సైన్యం డిసెంబరు 17-31ల మధ్య రెండో దాడి చేసింది. ఈ రెండో దాడిలో జర్మన్లు సెవస్తపోల్ నగరానికి ఐదు మైళ్ళ సమీపానికి రాగలిగారు. డిసెంబరులో రష్యన్ సైన్యం కెర్చిలో దిగింది. ఆ సైన్యాన్ని ఎదుర్కోవడానికి జర్మన్లు కొంత సైన్యాన్ని సెవస్తపోల్ నుంచి తరలించడంతో జర్మనీ రెండో దాడిలో కూడా విజయం సాధించలేకపోయింది. ఈ రెండో దాడిలో, కొద్దిమంది నావికులు ఒక రక్షణ స్థావరంలో చివరి మనిషి వరకూ పోరాడారు. రష్యన్లు ఈ స్థావరాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నప్పుడు ఒక నావికుడు రాసిన లేఖ ఒకటి దొరికింది.

'రష్యా! నా మాతృభూమీ! డియర్ కామ్రేడ్ స్టాలిన్! (స్టాలిన్ అనంతరం రాసిన పుస్తకాలలో, చరిత్రలో, 'డియర్ కామ్రేడ్ స్టాలిన్' అన్న మాటలు తొలగించబడడం కాని, లేదా ఆ మాటల స్థానంలో చుక్కలు పెట్టడం కాని జరిగింది) నేను నల్ల సముద్ర నావికుడిని, లెనిన్ కామ్సోమాల్ ని, నా మనసు ఆదేశించినట్లు చివరి వరకూ పోరాడాను. నా గుండెలు కొట్టుకుంటున్నంత వరకూ జర్మన్ మృగాలను చంపుతూనే ఉన్నాను. ఇప్పుడు ఇంక నేను చనిపోతున్నాను, కాని అంతిమ విజయం మనదే అని నాకు తెలుసు. నల్ల సముద్ర నావికులారా! తీవ్రంగా పోరాడండి! ఫాసిస్టు కుక్కల్ని నిర్దాక్షిణ్యంగా చంపండి. సైనికుడిగా నా ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నాను - కాల్యూఝిన్నీ'. ఇదొక్కటే కాదు, అనేక సాహస చర్యలు.....సెవస్తపోల్ వైమానికులు తమ విమానాలను జర్మన్ విమానాలతో ఢీకొట్టి నాశనం చేసి తామూ నాశనమైపోయేవారు.

సెవస్తపోల్ తీవ్ర విమాన దాడులకు గురయ్యింది. నగర జనాభా ఆంతా భూగర్భంలోకీ గుహలలోకీ ఇతర రక్షణ స్థావరాలలోకీ తరలించబడింది. ఒక బ్రహ్మాండమైన గుహలో మోర్టార్లు, చేతి బాంబులు, మందుపాతరలూ తయారు చేసే వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. అలాగే మరొక గుహలో చెప్పులూ దుస్తులూ భారీ ఎత్తున తయారయ్యేవి. పిల్లలకు భూగర్భంలోనే పాఠశాలలు నడిపేవారు. ఒడెస్సా, కకాసస్ లు జర్మన్ల వశమయిన తర్వాత, అక్కడనుంచి తిరోగమించిన రష్యన్ సైన్యం సముద్ర మార్గం ద్వారా సెవస్తపోల్ ను చేరి, సెవస్తపోల్ లో ఉన్న సైన్యంతో కలిసి పోరాడింది.

విషాదకరమైన విషయమేమిటంటే, రెండో జర్మన్ దాడి విఫలమైన తర్వాత సెవస్తపోల్ విముక్తి దగ్గరలోనే ఉంది అనే ఆశ కలిగింది. జనవరి, ఫిబ్రవరి నెలలలో రష్యన్లు కెర్చి పెనిన్సులాలో దిగారు. కెర్చి, సెవస్తపోల్ - ఈ రెండూ రష్యన్ల చేతిలో ఉంటే మొత్తం క్రిమియాను విముక్తి చెయ్యవచ్చుననే ఆశ కలిగింది. ప్రజలు గుహలు వదలి నగరంలోకి రాసాగారు. ఇళ్ళు మరమ్మత్తు చెయ్యడం మొదలు పెట్టారు. జర్మన్లు నగరానికి ఐదు మైళ్ళ దూరంలోనే ఉన్నా ట్రాం కార్లు తిరగడం ప్రారంభమైంది. జర్మన్ విమాన దాడులూ ఫిరంగి దాడులూ జరుగుతున్నా మేడే రోజున అనేక సమావేశాలు ఉత్సవ వాతావరణంలో జరిగాయి.

ఆ సమయంలో కెర్చ్ లో రష్యన్ పరాజయ వార్త సెవస్తపోల్ చేరింది. కెర్చ్ లో పరాజయం తర్వాత సెవస్తపోల్ లో రష్యన్ ఓటమి నిశ్చయం అని అందరికీ అర్థమైంది. వృద్ధులను, పిల్లలను నగరం నుంచి తరలించడం ప్రారంభమైంది. నగరంలో ఉన్న కామ్సోమాల్స్ లో అధిక భాగం, యువతులతో సహా, సైన్యంలో చేరడానికి ముందుకు వచ్చారు. సైన్యంలో చేరని వారు వర్క్‌షాపులలోనూ ఆయుధ ఫాక్టరీలలోనూ రెండు షిఫ్టులు పని చేయసాగారు. జర్మన్ వైమానిక ఆధిక్యత వలన సమద్రం మీద రవాణా ప్రమాదకర పరిస్థితిలో పడింది.

క్రిమియాలో ఉన్న గెరిల్లాల ద్వారా పెద్ద జర్మన్ సైన్యం సెవస్తపోల్ మీద దాడి చెయ్యబోతోందన్న సమాచారం మే 20 ప్రాంతంలో అందింది. జూన్ 2న వందల విమానాలతో జర్మన్లు సెవస్తపోల్ మీద దాడి చేశారు. ఆరు రోజులలో 50,000 మంటల బాంబులూ ప్రేలుడు బాంబులూ సెవస్తపోల్ మీద కురిపించారు. వీటికి తోడు జర్మన్ ఫిరంగి దళాలు గుళ్ళ వర్షం కురిపించేవి. ఈ దాడుల్లో రష్యన్లకు విపరీతమైన నష్టం కలిగింది. జర్మన్లు 'డోరా' అనే ప్రత్యేకమైన భారీ ఫిరంగిని ఈ దాడిలో ప్రయోగించారు.

జూన్ 7వ తేదీన మూడవ – ఆఖరి - జర్మన్ దాడి ప్రారంభమైంది. ఆకాశంలో ఆధిక్యత వలన

Edit with WPS Office
జర్మన్ విమానాలు సెవస్తపోల్ పరిసర ప్రాంతాలలోని రష్యన్ విమానాశ్రయాలను నాశనం చేశాయి. సెవస్తపోల్-కకాసస్ ల మధ్య, సముద్రం మీదుగా రవాణా అసంభవం అయ్యేలా చేశాయి. కొద్దిగా ఆహారం, ఆయుధాలు, ముడి సరుకులు, పెట్రోలూ జలాంతర్గాముల ద్వారా సెవస్తపోల్ కు చేరవేయడం జరిగింది, కాని జలాంతర్గాముల ద్వారా అతి కొద్ది సరఫరా మాత్రమే సాధ్యమవుతుంది. ఇది సెవస్తపోల్ అవసరాలకు ఏ మాత్రం సరిపోదు. గాయపడిన వారిని కూడా జలాంతర్గాముల ద్వారా తరలించవలసి వచ్చింది. సెవస్తపోల్ లో ఉన్న వర్క్ షాపులు సైనిక అవసరాలను తీర్చలేకపోయాయి. నిరంతరం విమాన దాడుల వలన గుహలలో రక్షణ తీసుకుంటున్న జనానికి నీరు, ఆహారం అందించడం అసంభవమైంది.

మూడు వారాల యుద్ధం తర్వాత జర్మన్లు నగరంలో ప్రవేశించారు. నగర వీధుల్లో మరో రెండు రోజులు యుద్ధం జరిగింది. సెవస్తపోల్ పోరాట అంతిమ దశలో, జులై వేసవి వేడిలో నగర వీధుల్లో కుళ్ళుతున్న అసంఖ్యాకమైన శవాలనుంచి వచ్చే దుర్భరమైన కంపు తట్టుకోవడానికి ఎర్ర సైనికులు గేస్ మాస్కులు వేసుకోవలసి వచ్చింది. సెవస్తపోల్ కామ్సోమాల్స్ అనేక మంది పోరాడుతూ వీరమరణం పొందారు. కొంతమంది గాయపడి శత్రువుకు చిక్కారు. 26,000 మంది క్షతగాత్రులైన రష్యన్ సైనికులు జర్మన్లకు పట్టుబడ్డారు. సెవస్తపోల్ పోరాటం ముగిసిన తర్వాత 90,000 మందిని ఖైదీలుగా పట్టుకున్నామని జర్మనీ ప్రకటించింది. సెవస్తపోల్ ఊహించిన దాని కంటే ఎక్కువ కాలమే నిలిచింది. సెవస్తపోల్ ప్రజలు – స్త్రీలూ, పురుషులూ - జనరల్ వాన్ మాన్ స్టీన్ 11వ సైన్యాన్ని తమ వీరోచిత పోరాటంతో మరో యుద్ధ రంగంలోకి పోనివ్వకుండా నిలిపివేసి అంతిమ రష్యన్ విజయానికి తోడ్పడ్డారు.

సెవస్తపోల్ పోరాటం సువర్ణాక్షరాలతో లిఖించ తగ్గ పోరాటం.

సెవస్తపోల్ నుంచి ఎర్ర సైన్యం తిరోగమించడంతో క్రిమియా జర్మన్ల వశమైంది. క్రిమియా ఆక్రమణకు ఉద్దేశించబడిన జర్మన్ సైన్యం ఆ కర్తవ్యం పూర్తి కావడంతో మరో రంగంలో యుద్ధం చెయ్యడానికి వీలుపడింది.

ఖార్కోవ్ లో రష్యన్ పరాజయం

మార్షల్ టిమోషెంకో నాయకత్వంలో మే 12న ఎర్ర సైన్యం ఖార్కోవ్ దిశగా దాడి ప్రారభించింది. కృశ్చేవ్, ఈ సైన్యంలో మిలిటరీ కౌన్సిల్ మెంబరు. ఈ రంగంలో జర్మన్లు కూడా దాడికి సిద్ధమవుతున్నారు. ఎర్ర సైన్యం జర్మన్ రక్షణ రేఖను ఛేదించి మూడు రోజులలో 10-20 మైళ్ళు పురోగమించగలిగింది, కాని దాడికి సర్వ సన్నద్ధంగా ఉన్న జర్మన్ సైన్యం ఎదురుదాడి చేసి రష్యన్ సైన్యాన్ని తరిమికొట్టసాగింది. పదిరోజులలో మూడు ఎర్ర సైన్యాలను జర్మన్లు చుట్టుముట్టారు. వేలమంది ఎర్ర సైనికులు మరణించారు. 2,39,000 మంది ఖైదీలుగా పట్టుబడ్డారు.

1956లో కృశ్చేవ్ తన రహస్య నివేదికలో దీనికి బాధ్యత స్టాలిన్ దే నని ఆరోపించాడు.

'...ఖార్కోవ్ రంగంలో తీవ్రమైన పరిస్థితి ఏర్పడినప్పుడు ఖార్కోవ్ ను చుట్టుముట్టే చర్యను నిలుపు చెయ్యాలని మేము సరియైన నిర్ణయం తీసుకున్నాం. నూతన పరిస్థితులకు అనుగుణంగా ఆపరేషనల్ ప్లానులో మార్పులు చెయ్యాలని మేం స్టాలిన్ ను కోరాం. కాని ఇంగిత జ్ఞానం లేనివాడులా (contrary to common sense) స్టాలిన్ మా ప్రతిపాదనను తోసిపుట్టాడు. రష్యన్ సైన్యాలు చుట్టుముట్టబడి నాశనం అవబోతున్న పరిస్థితి ఎదురవుతున్నా ఖార్కోవ్ ఆపరేషన్ కొనసాగించవలసిందేనన్నాడు.....ఫలితంగా ఏం జరిగింది? ఎంత ఘోరం జరగాలో అంతా జరిగింది. జర్మన్లు మన సైన్యాన్ని చుట్టుముట్టారు. లక్షలమంది సైనికులను మనం కోల్పోయాం.....' - (కృశ్చేవ్ రహస్య నివేదిక నుండి.....Extract from Khrushev's Secret Report, Russia At War, Alexander Werth, P. 362).

రష్యన్ దాడిని నిలిపి వేయాలనీ, హఠాత్తుగా జర్మన్ సైన్యం దాడి చెయ్యడం వలన రష్యన్ సైన్యం చుట్టుముట్టబడే ప్రమాదం ఎదురవుతోందనీ, ఈ విషయం స్టాలిన్ దృష్టికి తీసుకు రమ్మనమనీ కృశ్చేవ్, జనరల్ వాసిలేవస్కీ (చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్)కి ఫోను చేసి ప్రార్థించాడుట. స్టాలిన్ ఈ విషయమై ఏమీ వినదలుచుకోలేదని వాసిలేవస్కీ సమాధానం చెప్పాడు. అప్పుడు కృశ్చేవ్ స్టాలిన్ నివాసానికి ఫోను చేశాడు. అక్కడున్న మాలెంకోవ్ ఫోను అందుకున్నాడు. స్టాలిన్ కృశ్చేవ్ తో

Edit with WPS Office
మాట్లాడడానికి నిరాకరించడంతో కృశ్చేవ్ మాలెంకోవ్ తో ఈ విషయం చెప్పాడు. మాలెంకోవ్ కృశ్చేవ్ ప్రార్థనను స్టాలిన్ కు నివేదించాడుట. అయినా స్టాలిన్ రష్యన్ దాడిని నిలిపి వెయ్యడానికి నిరాకరించాడు. 'ముందు నిర్దేశించిన విధంగానే జరగనీ' అన్నాడు. స్టాలిన్ కు నేను స్వయంగా పరిస్థితిని వివరిస్తాను అని కృశ్చేవ్ ప్రార్థించినా స్టాలిన్ ఫోనులో మాట్లాడడానికి నిరాకరించాడు. స్టాలిన్ నిర్లక్ష్యం, మూర్ఖత్వం కారణంగా లక్షలమంది ఎర్ర సైనికులు తమ ప్రాణాలను కోల్పోయారు - ఇదీ కృశ్చేవ్ కథ.

మార్చి సమావేశంలో మార్షల్ టిమోషెంకో ఖార్కోవ్ మీద దాడి చెయ్యడానికి తన సైన్యం సర్వ సన్నద్ధంగా ఉన్నదనీ, అందుకు అనుమతి కావాలని కోరాడనీ ఇంతకు ముందు తెలుసుకున్నాం. మార్షల్ టిమోషెంకో శత్రు బలగాన్ని తక్కువగా అంచనా వేసి ఉండవచ్చు, లేదా రష్యన్లు ముందు దాడి చెయ్యడమే మంచిదనే అభిప్రాయంతో ఉండి ఉండవచ్చు. ఒక మహా సంగ్రామంలో వ్యూహం, ఎత్తుగడలలో ఇలాంటి పొరపాట్లు అనివార్యంగా జరుగుతూనే ఉంటాయి. అవి విషాద పరిణామాలకు దారి తీస్తూనే ఉంటాయి.

కృశ్చేవ్ ఆరోపణ పై మార్షల్ ఝుకోవ్ తన జ్ఞాపకాలలో ఏం చెప్పాడో ఒకసారి చూద్దాం.

'.....(మే 17న మాస్కోలో జనరల్ స్టాఫ్ వ్యవహారం చూస్తున్న జనరల్ వాసిలేవస్కీ) సాయంత్రం యుద్ధ రంగంలో పరిస్థితి ప్రమాదకరంగా ఉందనీ రష్యన్ దాడిని నిలిపివేయడం మంచిదనీ స్టాలిన్ కు సూచించాడు.....(ఖార్కోవ్ రంగంలో ఉన్న జనరల్ టిమోషెంకోను సంప్రదించాడు స్టాలిన్. ఖార్కోవ్ ఆపరేష్ నిలిపి వెయ్యాల్సినంత ప్రమాదమేమీ లేదని అతను స్టాలిన్ కు చెప్పాడు. ఆ కారణంగా స్టాలిన్ ఖార్కోవ్ ఆపరేషన్ నిలిపి వెయ్యడానికి నిరాకరించాడు)..... మే 18న మరొకసారి జనరల్ స్టాఫ్ ఖార్కోవ్ ఆపరేషన్ ను నిలిపి వెయ్యవలసిందని స్టాలిన్ ను కోరింది..... మే 18న మార్షల్ టిమోషెంకో-స్టాలిన్ ల మధ్య సంభాషణ జరిగినప్పుడు నేను ఉన్నాను. జర్మన్ సైన్య దాడి ప్రమాదం గురించి తను తీవ్రంగా ఆందోళన పడుతున్నానని స్టాలిన్ మార్షల్ టిమోషెంకోకు స్పష్టం చేశాడు.....ఆ రోజు సాయంకాలం స్టాలిన్ మిలిటరీ కౌన్సిల్ మెంబర్ కృశ్చేవ్ తో ఈ విషయం చర్చించాడు. టిమోషెంకో అభిప్రాయాలనే - శత్రు ప్రమాదం గురించిన రిపోర్టులు అతిశయోక్తులతో కూడుకున్నవనీ, ఆ కారణంగా రష్యన్ దాడిని నిలిపివేయవలసిన అవసరం లేదనీ - కృశ్చేవ్ కూడా వ్యక్త పరిచాడు. దాడి కొనసాగించాలన్న టిమోషెంకో, కృశ్చేవ్ ల అభిప్రాయాల ఆధారంగా, దాడిని నిలిపి వేయమన్న జనరల్ స్టాఫ్ నివేదనను స్టాలిన్ అంగీకరించలేదు. నేడు చెబుతున్నట్లు మిలిటరీ కౌన్సిల్ (అంటే కృశ్చేవ్) ఖార్కోవ్ ఆపరేషన్ కొనసాగించడం వలన రానున్న ప్రమాదం గురించి స్టాలిన్ ను హెచ్చరించిందన్న మాట నిజం కాదు. ఈ మాట నేను సాధికారంగా చెప్పగలను. ఎందుకంటే స్టాలిన్ తో సంభాషణల సమయంలో నేను అక్కడ ఉన్నాను...' (G. Zhukov, Reminiscences and Reflections, Vol. 2, P. 76, 77).

'....1942 వేసవిలో (ఎర్ర సైన్యాలకు) ప్రతికూలమైన పరిస్థితి ఏర్పడడానికి, సోవియట్ బలగాల వేసవి కాల ఎదురుదాడి పథకాన్ని ఆమోదించిన తన పొరపాటు కూడా కారణమని స్టాలిన్ గుర్తించాడని చెప్పాలి. దీనికి అతను జనరల్ హెడ్ క్వార్టర్స్ లో కాని జనరల్ స్టాఫ్ లో కాని ఎవరినీ బాధ్యుల్ని చెయ్యాలని ప్రయత్నించలేదు.....' - (G. Zhukov, Reminiscences & Reflections, Vol. 2, P. 86).

తన నేరాలను ఇతరుల మీద రుద్దే కృశ్చేవ్ ఎక్కడ? ఇతరులను బాధ్యుల్ని చెయ్యకుండా తన తప్పు అంగీకరించిన స్టాలిన్ ఎక్కడ?

మే 19న మిలిటరీ కౌన్సిల్ కు పరిస్థితి అర్థమైంది, కాని అప్పటికే చాలా ఆలస్యమైంది. చుట్టుముట్టుబడిన ఎర్ర సైనికులు వీరోచితంగా పోరాడారు. కొంతమంది చక్రబంధం నుంచి తప్పించుకోగలిగారు. కాని చాలామంది మరణించారు, లేదా ఖైదీలుగా జర్మన్లకు చిక్కారు.

జూన్ నెలంతా దక్షిణ-పశ్చిమ రంగాలలో తీవ్ర యుద్ధం కొనసాగింది. నష్టాలకు గురవుతూ ఎర్రసైన్యం తిరోగమించింది. జర్మనీ మళ్ళీ వ్యూహాత్మక చొరవ చేజిక్కుంచుకుని, కొత్త రిజర్వు సైన్యాలతో కకాసస్ లోకీ వోల్గా నది వైపూ వేగంగా పురోగమించింది. ఎర్ర సైన్యాన్ని దాన్ నదివరకూ నెట్టివేసింది. స్టాలిన్ గ్రాడ్ కు ప్రమాదం ఏర్పడింది.

అంతర్యుద్ధ కాలంలో, ఈ ప్రాంతంలో స్టాలిన్ ఎర్ర సైన్యాలను నైపుణ్యంతో నడిపి తెల్ల సైన్యాలను నాశనం చేశాడు. ఆ విజయం తర్వాత జారిట్సిన్ అనే పేరు ఉన్న ఈ నగరానికి 'స్టాలిన్ గ్రాడ్' అని పేరు

Edit with WPS Office
పెట్టారు. స్టాలిన్ గ్రాడ్ దిశగా జర్మన్లు పురోగమిస్తున్న సమయంలో, ఇదీ అని స్పష్టంగా చెప్పలేకపోయినా, స్టాలిన్ గ్రాడ్ వద్ద ఏదో జరుగుతుంది అన్న అభిప్రాయం అందరిలోనూ కలుగసాగింది.

స్టాలిన్ అంటే ఉక్కు మనిషి అని అర్థం. ఈ ఉక్కు మనిషి పేరుతో ఉన్న ఈ నగరం జర్మన్ల ముందు ఉక్కు గోడలా నిలువగలదా? నిలిచి, ఉక్కు పిడికిలి బిగించి మళ్ళీ కోలుకోలేని విధంగా చావు దెబ్బ తియ్యగలదా?

ప్రపంచం ఊపిరి బిగబట్టి ఈ ప్రశ్నకు సమాధానం కోసం ఎదురుచూడసాగింది.

Edit with WPS Office

శిలలారా!
మీరూ ఈ వీరుల్లా
ధృఢంగా నిలబడండి!

Edit with WPS Office

అధ్యాయం ఆరు

స్టాలిన్ గ్రాడ్ యుద్ధం

స్టాలిన్ గ్రాడ్, దక్షిణ రష్యాలో వోల్గా నది పశ్చిమ తీరాన 25 మైళ్ళు వ్యాపించి ఉన్న నగరం. 1941 నాటికి నగర జనాభా ఆరు లక్షలు. నగరం కాంక్రీటు భవనాలతో, విశాలమైన చతురస్ర ప్రదేశాలతో, చెట్లతో, పూలవనాలతో సుందరంగా ఉండేది. రాత్రి వేళ విద్యుద్దీపాలు వెలుగుతుంటే నగరం మెడలో దీపాల హారం వేసినట్లు కనుపించేది. 20వ శతాబ్ద ప్రారంభంలో ఈ నగరంలో ఉన్నత పాఠశాలలు కేవలం రెండు ఉంటే పానశాలలు 400 ఉండేవి. అలా ఉండేది జారు ప్రభువు పాలన. విప్లవానంతరం 1941 నాటికి 15,000 మంది విద్యార్థులూ, ఇంజినీరింగ్, వైద్య కళాశాలలూ, డజన్ల సాంకేతిక పాఠశాలలూ, వందల పాఠశాలలూ లైబ్రరీలతో స్టాలిన్ గ్రాడ్ ప్రముఖ విద్యా కేంద్రమైంది. స్టాలిన్ గ్రాడ్ విద్యా కేంద్రం మాత్రమే కాదు - ప్రముఖ పారిశ్రామిక కేంద్రం కూడా. ఈ నగరం - ఫిరంగులు, టాంకులు, ఓడలు, జలాంతర్గాములు, విమానాలు, మందు పాతరలు, యూనిఫాంలు, గొర్రె చర్మపు కోట్లు - ఇలా రక్షణకు అవసరమైన 80 రకాల సామగ్రిని తయారు చేసేది. ఇక్కడ పరిశ్రమలలో ముఖ్యమైనవి - స్టాలిన్ గ్రాడ్ ట్రాక్టర్ ఫాక్టరీ, రెడ్ అక్టోబర్ ఉక్కు ఫాక్టరీ, బారికేడ్ ఆర్డినెన్స్ ఫాక్టరీలు. ఈ మూడు ఫాక్టరీలూ స్టాలిన్ గ్రాడ్ ఉత్తర ప్రాంతంలో నది ఒడ్డున వరుసగా ఉండేవి. స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో ఈ మూడు ఫాక్టరీలు ఒక దుర్గంలా స్టాలిన్ గ్రాడ్ ను రక్షించాయి.

వోల్గా నది ఇక్కడ దాదాపు మైలు వెడల్పు ఉంటుంది. అందులో అనేక దీవులున్నాయి. నది మీద వంతెనలు లేవు. రైళ్ళ ద్వారా, రోడ్డు ద్వారా వచ్చే సామగ్రిని స్టాలిన్ గ్రాడ్ కు చేర్చడానికి ఫెర్రీలుండేవి. జర్మన్లు నదీ తీరం చేరితే ఈ రేవులు ప్రమాదంలో పడతాయి. అందుకని ఈ ఫెర్రీ రేవులను కాపాడుకోవడానికి, జర్మన్లు వోల్గా నది తీరం చేరకుండా ఎర్ర సైన్యం తీవ్రంగా పోరాడింది. పశ్చిమ గట్టు, అంటే స్టాలిన్ గ్రాడ్ వైపు గట్టు, ఎత్తుగా ఉంటుంది. ఈ ఎత్తుగట్టు స్టాలిన్ గ్రాడ్ రక్షణకు చాలా ఉపయోగపడింది. ఈ ఎత్తుగట్టులో అనేక చోట్ల గుహలుండేవి. గట్టు వాలులో ఎర్ర సైన్యం బొగ్గు గనుల్లో సొరంగాలు తవ్వినట్లు సొరంగాలు తవ్వి విమాన దాడి నుంచి రక్షణ తీసుకుంటూ పోరాడింది. ఒక్కొక్క చోట ఈ సొరంగాలు దాదాపు వంద అడుగుల లోతు ఉండేవి. నగరంలో ఎత్తుపల్లాలు, లోయలు, చిన్న కొండలు, అనేకం ఉన్నాయి. ఈ కొండలలో ముఖ్యమైనది మామై కుర్గాన్ అనే 335 అడుగుల ఎత్తు కొండ. రక్షణ దృష్ట్యా కీలకమైన ఈ కొండను స్వాధీనం చేసుకోవడానికి జర్మన్, రష్యన్ సైన్యాలు నెలల తరబడి సంఘర్షించాయి. ఈ కొండ అనేక మార్లు చేతులు మారింది.

కొంతమంది చరిత్రకారులు హిట్లర్ కు స్టాలిన్ అంటే ఉన్న ద్వేషంతో స్టాలిన్ పేరుతో ఉన్న ఈ నగరాన్ని నాశనం చెయ్యాలని అనుకున్నాడనీ, స్టాలిన్ గ్రాడ్ కు వ్యూహరీత్యా అంత ప్రాముఖ్యత లేదనీ అంటారు. హిట్లర్ ను ఒక మూర్ఖుడిగా చిత్రించి, జర్మనీ పరాజయానికి అతని మూర్ఖత్వం కారణంగా చిత్రిస్తారు. కాని ఇందులో వాస్తవం లేదు. స్టాలిన్ గ్రాడ్ వ్యూహరీత్యానూ పారిశ్రామికంగానూ కీలకమైన స్థానంలో ఉంది. ఈ నగరాన్ని జర్మన్లు ఆక్రమిస్తే కకాసస్ నుంచి వోల్గా నది మీద మధ్య రష్యాకు రవాణా అవుతున్న చమురు నిలిచి పోతుంది. డోనెట్స్, స్టాలిన్ గ్రాడ్ పారిశ్రామిక ప్రాంతాలు జర్మన్ల పరమవుతాయి. జర్మనీ మిత్ర దేశంగా టర్కీ యుద్ధంలో దిగే అవకాశం ఉంది. రష్యాని నాశనం చెయ్యడానికి అవసరమైన ప్రాతిపాదిక ఏర్పడుతుంది. ఈ కారణాల వలన స్టాలిన్ గ్రాడ్ యుద్ధం జర్మన్ వ్యూహంలో కీలకమైన యుద్ధమే.

చారిత్రాత్మకమైన స్టాలిన్ గ్రాడ్ యుద్ధం ఆరు నెలలకు పైగా సాగింది. ఈ యుద్ధంలో ఇరు పక్షాలనుండీ 26,000 ఫిరంగులు, మోర్టార్లు, 2,000 టాంకులు, 2,000 విమానాలతో కూడిన 20 లక్షల సైన్యం పాల్గొంది. ఈ యుద్ధాన్ని ప్రధానంగా రెండు దశలుగా విభజించవచ్చు. 1942 జులై 17 నుండి నవంబరు 18 వరకూ రక్షణ యుద్ధాల దశ. నవంబరు 19 నుండి ఫిబ్రవరి 2, 1943 వరకూ ఎదురు దాడి దశ.

1. 1942 జులై 17 నుండి ఆగస్టు 4 వరకూ ప్రధానంగా దాన్ నది వంపులోనే యుద్ధం జరిగింది. ఇక్కడ 'వెనుకంజ వెయ్యకూడదు' అని స్టాలిన్ హెచ్చరించిన తర్వాత రష్యన్లు జర్మన్ పురోగమన వేగాన్ని తగ్గించ గలిగారు. స్టాలిన్ గ్రాడ్ లో రక్షణ ఏర్పాట్లు పూర్తి చెయ్యడానికీ, దాన్

Edit with WPS Office
వంపులో రష్యన్ సైన్యాలను జర్మన్లు చుట్టుముట్టకుండానూ, స్టాలిన్ గ్రాడ్ ను ఒక్క ఊపులో స్వాధీనం చేసుకోకుండానూ, ఈ దాన్ వంపులో ప్రతిఘటన తోడ్పడింది.

2. ఆగస్టు 5 నుండి ఆగస్టు 18 వరకు - ఈ దశలో జర్మన్ 6వ సైన్యంలోని అనేక విభాగాలు దాన్ నది దాటి స్టాలిన్ గ్రాడ్ వైపు పురోగమించాయి. దక్షిణం వైపు నుంచే కాకుండా పశ్చిమ, వాయవ్య దిశలుగా స్టాలిన్ గ్రాడ్ వైపు పురోగమించాయి.

3. ఆగస్టు 19 నుండి సెప్టెంబరు 3 వరకు - ఈ దశలో దాన్-వోల్గా నదుల మధ్య ప్రదేశంలో యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఆగస్టు 23న జర్మన్లు స్టాలిన్ గ్రాడ్ ఉత్తర దిక్కున వోల్గా నదీ తీరాన్ని సమీపించారు. వోల్గా తీరం చేరిన జర్మన్లు స్టాలిన్ గ్రాడ్ నగరం మీద దాడి చెయ్యకుండా ఆపడానికి రష్యన్ సైన్యం నగరంలో ప్రవేశించింది. ఆ రోజు 600 విమానాలతో జర్మన్ వైమానిక దళం పెద్ద ఎత్తున స్టాలిన్ గ్రాడ్ మీద దాడి చేసింది. ఇంత పెద్ద ఎత్తున దాడి జరిగినా, ఇంత భయంకరమైన నష్టానికి గురయినా, సైనికాధికారులు కాని పౌర నాయకత్వం కాని ధైర్యం కోల్పోలేదు.

4. సెప్టెంబరు 4 - 13 - ఈ దశలో నగరం వెలుపలి ప్రాంతంలో యుద్ధం జరిగింది. జర్మన్లు ఉత్తర దిశ వైపునే కాకుండా నగరానికి దక్షిణ దిశ వైపు కూడా వోల్గా తీరాన్ని చేరారు. ఉత్తర దక్షిణాలుగా జర్మన్లు - వెనుక వోల్గా నది. స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న 62వ ఎర్ర సైన్యానికి ఇతర రష్యన్ సైన్యాలతో సంబంధం తెగిపోయి వేరుపడిపోయింది.

5. సెప్టెంబరు 13 - నవంబరు 18 - ఈ దశలో స్టాలిన్ గ్రాడ్ నగరం లోపల చారిత్రాత్మకమైన పోరాటం జరిగింది. అక్టోబరు మధ్య ప్రాంతంలో రష్యన్లు వోల్గా తీరంలో మూడు చిన్న ప్రాంతాలకు పరిమితం చెయ్యబడ్డారు. జర్మన్ సైన్యం నగరంలో దాదాపు 90 శాతాన్ని వశం చేసుకుంది. అయినా రష్యన్లను ఈ ప్రాంతాల నుంచి తరిమి వేయలేకపోయింది.

తర్వాత రష్యన్ ఎదురు దాడి ప్రారంభమైంది.

1. నవంబరు 19 - డిసెంబరు 11 - రష్యన్లు స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న 3,30,000 మంది జర్మన్ సైన్యాన్ని చుట్టుముట్టారు.

2. డిసెంబరు 12 - జనవరి 1 1943 - రష్యన్ వలయంలో చిక్కుకున్న జర్మన్ సైన్యాన్ని విముక్తి చెయ్యడానికి ఫీల్డ్ మార్షల్ వాన్ మాన్ స్టీన్ నాయకత్వాన ప్రయత్నం జరిగింది. స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న జర్మన్ సైన్య సహాయానికి వస్తున్న వాన్ మాన్ స్టీన్ సైన్యాన్ని రష్యన్లు అడ్డుకుని వెనక్కు తరిమేశారు. రష్యన్ వలయం మరింత బిగిసింది. దాన్ ప్రాంతంలో ఇటాలియన్ (జర్మనీ మిత్ర) సైన్యాలను రష్యన్ సైన్యం తుడిచి పెట్టేసింది.

3. జనవరు 10 - ఫిబ్రవరి 2 1943 - స్టాలిన్ గ్రాడ్ లో చిక్కుకున్న జర్మన్ సైన్యాన్ని అంతం చేసింది. 91,000 మంది జర్మన్ సైనికులను ఖైదీలుగా పట్టుకుంది.

1941లో యుద్ధం ప్రారంభమైన తొలి నెలలలో స్టాలిన్ గ్రాడ్ నగరానికి ప్రత్యక్ష ప్రమాదం ఎదురవలేదు. 1941 అక్టోబరులో జర్మన్ విమానాలు స్టాలిన్ గ్రాడ్ నగరం మీద బాంబులు వెయ్యడానికి ప్రయత్నించాయి, కాని రష్యన్ విమానాలూ విమాన విధ్వంసక ఫిరంగులూ ఆ ప్రయత్నాన్ని విఫలం చేశాయి.

స్టాలిన్ గ్రాడ్ పోరాటం గురించి వివరంగా తెలుసుకునే ముందు స్టాలిన్ గ్రాడ్ నిలిచి పోరాడి విజయం సాధించడానికి ప్రధాన కారణమైన కమ్యూనిస్టు పార్టీ పాత్ర గురించి తెలుసుకోవాలి. యుద్ధ ప్రారంభానికి స్టాలిన్ గ్రాడ్ ప్రాంతీయ పార్టీ కమిటీ శాఖలో 58,000 మంది సభ్యులుండేవారు. వీరిలో 33,000 మంది యుద్ధానికి తరలారు. పార్టీ, లెనిన్ గ్రాడ్, ఒడెస్సా, సెవస్తపోల్ తదితర నగరాల అనుభవాన్ని అధ్యయనం చేసి నగరాన్నీ పౌరులనూ యుద్ధానికి సిద్ధం చేసింది. ఈ నగరాలలో లాగానే స్టాలిన్ గ్రాడ్ లో కూడా ప్రజా వలంటీరు దళాలూ కార్మిక దళాలూ ఏర్పడ్డాయి. దాదాపు 60 శాతం సభ్యులు యుద్ధ రంగానికి తరలినా, ప్రాంతీయ పార్టీ శాఖ యుద్ధ రంగానికి అవసరమైనవన్నీ అందించడానికి అవిరామంగా కృషి చేసింది. 1941లో స్టాలిన్ గ్రాడ్ ప్రాంత యువ కమ్యూనిస్టు లీగ్ లో 1,20,000 మంది సభ్యులుండేవారు. యుద్ధం తొలి నెలలలో 60,000 మంది యువ కమ్యూనిస్టులు ఈ ప్రాంతం నుండి యుద్ధంలో చేరారు. ఆగస్టు 23-సెప్టెంబరు 15 మధ్య కాలంలో, స్టాలిన్ గ్రాడ్ కు దారి తీసే మార్గాలలో తీవ్రమైన పోరు జరుగుతున్నప్పుడు, స్టాలిన్ గ్రాడ్ పార్టీ 8000 మంది కమ్యూనిస్టులనూ యువ కమ్యూనిస్టులనూ కార్మికులనూ యుద్ధ రంగానికి పంపించింది.

Edit with WPS Office

1941 అక్టోబరులో, జర్మన్ సైన్యాలు మాస్కో మీద దాడి చేస్తున్న తరుణంలో, స్టాలిన్ గ్రాడ్ కు ప్రత్యక్ష ప్రమాదం ఏమీ లేనప్పటికీ నగర ప్రాంతంలో మూడు రక్షణ రేఖలను - వెలుపల, మధ్య ప్రాంతంలోనూ, లోపల - నిర్మించాలని స్టేట్ రక్షణ కమిటీ నిర్ణయించింది. సోవియట్ సైనిక ఇంజినీర్లు, 2,000 మంది పార్టీ కార్యకర్తలు, 50,000 మంది యువ కమ్యూనిస్టులూ, 1,90,000 మంది ప్రజల సహకారంతో, 99,000 ఫిరంగుల, మర తుపాకుల స్థావరాలతో కూడిన ఈ రక్షణ రేఖలను నిర్మించారు. 1942 జులైలో స్టాలిన్ గ్రాడ్ ప్రాంతం మీద జర్మన్ సైన్యం దాడి చేసిననప్పుడు నగర సరిహద్దులలో మరో రక్షణ రేఖను నిర్మించడం జరిగింది. స్టాలిన్ గ్రాడ్ యుద్ధం ప్రారంభమయ్యేటప్పటికి పూర్తి కాకపోయినా ఈ రక్షణ రేఖలు స్టాలిన్ గ్రాడ్ రక్షణకు తోడ్పడ్డాయి.

ఈ రక్షణ రేఖల పొడవు 3,850 కి. మీ. ఈ రేఖల నిర్మాణానికి రెండు కోట్ల 15 లక్షల ఘనపు మీటర్ల మట్టిని తవ్వారు. రెండు లక్షల ఘనపుటడుగుల చెక్క, వెయ్యి టన్నుల సిమెంటు, 21,000 టన్నుల ఇనుము, ఉక్కు వాడారు.

1942 జలై అంతానికి 60,000 మందితో ప్రజా వలంటీరు సైన్యం తయారయింది. ఇంకా ఎక్కువమందే ప్రజా సైన్యంలో చేరడానికి వచ్చారు కాని పారిశ్రామిక ఉత్పత్తిని కొనసాగించడానికి కార్మికులు కావాలి కనుక ఎక్కువమందిని ఈ ప్రజా వలంటీరు సైన్యంలోకి చేర్చుకోలేదు. యుద్ధం తీవ్రమవుతున్నది కొలదీ ముఖ్య పరిశ్రమలనూ పిల్లలనూ వృద్ధులనూ విలువైన వస్తువులనూ నగరం నుంచి తరలించారు. నాలుగు లక్షల మంది పౌరులను విమాన, ఫిరంగి దాడుల మధ్య తరలించారు.

జులై అంతానికి స్టాలిన్ గ్రాడ్ రంగంలో 1,87,000 మంది సైనికులు, 300 టాంకులు, 337 విమానాలు, 7900 ఫిరంగులు, మోర్టార్లు ఉన్న ఎర్ర సైన్యం ఉంది. ఈ కొద్దిపాటి సైన్యం 330 మైళ్ళ పొడవున్న యుద్ధరంగానికి బాధ్యత వహించింది. జర్మనీకి ఈ ప్రాంతంలో 2,50,000 మంది సైనికులు, 740 టాంకులు, 1200 విమానాలు, 7500 ఫిరంగులు, మోర్టార్లు ఉన్న సైన్యం ఉంది. అంటే జర్మనీ, సైన్యం సంఖ్యలో 1.3:1, టాంకులలో 2:1, విమానాలలో 3.6 : 1 ఆధిక్యత కలిగి వుంది. ఇది కాక ఖకాసస్ యుద్ధం ముగిసిన తర్వాత విడుదలైన జర్మన్ సైన్యం, జర్మనీ మిత్ర దేశాల సైన్యాలూ ఉన్నాయి.

జర్మన్ దాడి తీవ్రతను తట్టుకోలేక రష్యన్లు స్టాలిన్ గ్రాడ్ వైపుకు తిరోగమించసాగారు. చాలామంది జనరల్ను, కమాండర్లు కూడా ధైర్యం కోల్పోయారు. స్టాలిన్ గ్రాడ్ పోరాటంలో సుప్రసిద్ధుడైన జనరల్ ఛుకోవ్ తన అనుభవాలను వివరిస్తూ ఇలా రాశాడు:

'.... (స్టాలిన్ గ్రాడ్ వైపు పలాయనం చేస్తున్న వారు).....నీటి చుక్కలేని స్టెప్పీలలో, విపరీతమైన వేసవి వేడిలో పశ్చిమాన్నుంచి తూర్పుకు పారిపోతున్నారు. వాళ్ళ దగ్గరున్న ఆహారం కూడా అయిపోవచ్చింది. 'ఎక్కడికి వెడుతున్నారు?' అనడిగాను. వాళ్ళు అర్థంపర్థం లేని సమాధానాలిచ్చారు.....9వ సైన్యం ఆఫీసర్లను కొంతమందిని కలిశాను. వారు మూడు నాలుగు కార్లలో పారిపోతున్నారు. కార్లనిండా పెట్రోలు టిన్నులు. 'జర్మన్లు ఎక్కడ? మీ యూనిట్లు ఎక్కడ? ఎక్కడికి వెడుతున్నారు?' అని ప్రశ్నించాను. వాళ్ళు సమాధానం చెప్పలేకపోయారు. ఇటువంటి పరిస్థితులలో పలాయనం సాగిస్తున్న సైన్యానికి మనో నిబ్బరం కలిగించి పోరాడేలా చెయ్యడం తేలిక కాదని స్పష్టమయింది.....'

జులై 25న ఛుకోవ్ సైన్యం జర్మన్ దాడికి గురవుతుంది. రెండు రోజుల తీవ్ర యుద్ధంలో రష్యన్, జర్మన్ సైన్యాలు తీవ్రంగా నష్టపోతాయి. అయితే జర్మన్ సైన్యం రష్యన్ రక్షణ రేఖలో గండి కొట్టగలుగుతుంది.

'.....మా దగ్గర టాంకులు లేవు. జర్మన్లు గండి కొట్టిన ప్రాంతానికి కొన్ని బెటాలియన్లను పంపించాను. సైనిక శ్రేణిలో పడ్డ గండిని పూడ్చగలిగామనిపించింది. దురదృష్టవశాత్తూ అదే సమయంలో రష్యన్ సైన్యం భయోత్పాతానికి గురయింది. ఈ భయం యుద్ధ రంగంలో మొదలవలేదు. యుద్ధరంగం వెనుక ప్రాంతంలో, దాన్ నది అవతలి ఒడ్డున ఉన్న మెడికల్, రవాణా యూనిట్లు ఉన్న చోట ప్రారంభమైంది. జర్మన్ టాంకులు రెండు మైళ్ళ సమీపంలో ఉన్నాయన్న పుకారు వాళ్ళకు చేరింది. ఆ రోజుల్లో జనం పారిపోవడం మొదలు పెట్టడానికి అటువంటి నీలివార్త చాలు. ఈ పుకారు ఎలా చేరిందో కాని యుద్ధరంగంలో ఉన్న సైనికులకు కూడా చేరింది. దాన్ నది దాటి అవతలి ఒడ్డుకు చేరడానికి అంతా పారిపోవడం మొదలు పెట్టారు. వాళ్ళను ఆపడానికి నా ఆఫీసర్లను పంపించాను కాని అప్పటికే ఆలస్యం అయింది. శత్రు విమానాలు వంతెన దగ్గర పెద్ద ఎత్తున పోగుపడ్డ జనాన్ని, కార్లను చూసి బాంబులు వెయ్యడం మొదలు పెట్టాయి.....'

Edit with WPS Office
చీకటి పడే వేళకు జర్మన్లు నది మీద వంతెనను ధ్వంసం చేశారు. ఒక డివిజన్, మరి కొన్ని చిన్న యూనిట్లూ నది ఇవతల ఒడ్డున ఉండిపోయాయి. జనరల్ ఛుకోవ్ లేని సమయంలో అతని క్రింది ఆఫీసరు ఈ సైన్యాన్ని నది దాటి ఆవతలి ఒడ్డుకు వెళ్ళమని ఆదేశిస్తాడు. ఛుకోవ్ హెడ్ క్వార్టర్సుకు తిరిగి వచ్చాకా ఈ విషయం తెలిసి నిర్ఘాంతపోతాడు. జర్మన్ విమానాలు నది మీద వంతెనను ధ్వంసం చెయ్యడంతో నది దాటడానికి ఏ మార్గమూ లేదు. అటువంటి పరిస్థితులలో ఈ సైన్యం నదిని దాటడానికి ప్రయత్నిస్తే జర్మన్ విమానాలకు బలయిపోతుందని గుర్తించి వెంటనే ఆ ఆదేశాలను రద్దు చేస్తాడు.

ఆ నాటి గందరగోళ పరిస్థితి, రష్యన్ సైన్యంలో జర్మన్ సైన్యం కలిగించిన భయోత్పాతానికి ఇది ఒక ఉదాహరణ.

త్వరలోనే దాన్ నది వంపు ప్రాంతాన్నంతా జర్మన్లు ఆక్రమించారు. 62వ సైన్యం తీవ్ర నష్టాలతో దాన్ నది ఆవతలి ఒడ్డుకు తిరోగమించింది. జర్మన్ సైన్యం కూడా నదిని దాటి అర్ధచంద్రాకారంలో స్టాలిన్ గ్రాడ్ వైపుకు పురోగమించసాగింది. జర్మన్ టాంకులు, విమానాలు రష్యన్ సైన్యాల మీద దాడి చేసి విపరీతంగా నష్టపరిచాయి. సైబీరియానుంచి యుద్ధ రంగానికి వచ్చిన సైనికులు కోటోల్నికోవ్ రైలు స్టేషనులో రైలు లోంచి దిగుతుండగా హఠాత్తుగా జర్మన్ విమానాలు, టాంకులు దాడి చేశాయి. ఈ సైన్యం భయంకరమైన నష్టానికి గురయింది. బతికున్న సైనికులు చెల్లా చెదురై స్టెప్పీలలోకి పారిపోయారు. జర్మన్ విమానాలూ టాంకులూ ఇలా అనేక స్టేషన్లలో రైళ్ళ మీద దాడి చేసి రష్యన్ సైన్యానికి విపరీతంగా నష్టాలు కలిగించి చెల్లాచెదరు చేశాయి.

రష్యన్ సైన్యం ఇలా చెల్లాచెదురై పారిపోతున్న సమయంలో, 1942 జులై 28న 'వెనుకంజ వెయ్యవద్దు' అని స్టాలిన్ ప్రసిద్ధి చెందిన ఆర్డర్ నం.227లో రష్యన్ సైన్యాన్ని తీవ్రంగా హెచ్చరించాడు.

ఈ ఆర్డర్ లో స్టాలిన్, రష్యన్ సైన్యాలు తీవ్రంగా ప్రతిఘటించకుండా రష్యన్ భూభాగాన్నీ నగరాలనూ జర్మన్లకు అప్పచెప్పి పారిపోతున్నాయనీ, సిగ్గుతో తలవంచుకునేలా చేస్తున్నాయనీ విమర్శించాడు.

'.....ఎర్ర సైన్యంలో విశ్వాసం ఉంచిన ప్రజలు నిరాశ చెందుతున్నారు. ఎర్ర సైన్యంలో విశ్వాసం కోల్పోతున్నారు. తమను రక్షించాల్సిన సైన్యం తమని జర్మన్లకు అప్పచెప్పి క్షేమంగా తూర్పుకు పారిపోతున్నందుకు శపిస్తున్నారు. యుద్ధరంగంలో కొంతమంది మూర్ఖులు తూర్పున విశాలమైన ప్రదేశం ఉందనీ జనాభా ఉందనీ తిండి ఉందనీ తూర్పుకు తిరోగమిద్దామనీ అంటున్నారు. తలవంపులు తెచ్చే తమ పిరికితనాన్ని కప్పి పుచ్చుకోవడానికి వాళ్ళు తిరోగమిద్దామంటున్నారు. ఇది ప్రమాదకరమైన ధోరణి.....మనం ఎంత దూరమైనా తిరోగమించగలం అనే భావాన్ని నిర్మూలించాలి.....'

జర్మనీ ఇప్పటికే చాలా రష్యన్ భూభాగాన్ని ఆక్రమించిందనీ, జర్మన్ ఆక్రమణలో ఇప్పుడు 7 కోట్లమంది రష్యన్లు ఉన్నారనీ, జర్మనీ కంటే మానవ వనరులలోనూ ఆహార ధాన్యాలలోనూ రష్యాకు ఆధిక్యత లేదనీ స్టాలిన్ హెచ్చరించాడు - '....ఇంక తిరోగమిస్తే మనకు ఆహారం ఉండదు, ముడి పదార్థాలుండవు, చమురు ఉండదు, ఫాక్టరీలుండవు, రైలు మార్గాలుండవు. ఇంక తిరోగమనం ఆపు చెయ్యాలి. ఒక్క అడుగు కూడా వెనక్కు వెయ్యడానికి వీలులేదు.....'

సైన్యంలో ఉక్కు క్రమశిక్షణ అమలుజరపాలని స్టాలిన్ ఆదేశించాడు. అనుమతి లేకుండా కమాండర్లూ కమిస్సార్లూ యుద్ధరంగంనుంచి వెనుకకు మళ్ళకూడదనీ, పిరికితనం చూపించేవారిని నిర్దాక్షిణ్యంగా నిర్మూలించాలనీ అన్నాడు. శీతాకాల పోరాటంలో రష్యన్ల ముందు నిలువలేక జర్మన్లు పారిపోతున్నప్పుడు జర్మన్ నాయకత్వం తీవ్రమైన చర్యలు తీసుకుని తమ సైన్యంలో క్రమశిక్షణ ఉండేలా చేసిందనీ, ఫలితంగా ఇతరులను దోచుకోవడం తప్ప ఒక ఉన్నత ఆశయం లేని జర్మన్లు ఇప్పుడు క్రమ శిక్షణతో పోరాడుతున్నారనీ, తమ మాతృదేశాన్ని రక్షించడమనే ఉన్నతాశయంగల రష్యన్లు క్రమశిక్షణ లోపించి ఓటమి పాలవుతున్నారనీ, స్టాలిన్ విమర్శించాడు.

'....మన పూర్వీకులు తమ శత్రువును అధ్యయనం చేసి గుణపాఠాలు నేర్చుకుని విజయం సాధించారు. మనం కూడా మన శత్రువునుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందా? ఉంది అని నేను అనుకుంటున్నాను.....'

స్టాలిన్ ఈ ఆర్డర్ లో పై కమాండ్ అనుమతి లేకుండా యుద్ధరంగం నుంచి పలాయనం చేసే కమాండర్లను కోర్ట్ మార్షల్ చెయ్యాలనీ, క్రమ శిక్షణ ఉల్లంఘించిన కమాండర్లూ కమిస్సార్లూ సైనికులతో

Edit with WPS Office
పీనల్ బెటాలియన్స్ ఏర్పరచి, ప్రమాదకరమైన యుద్ధరంగాలకు పంపించి, వారు చేసిన ద్రోహానికి ప్రాయశ్చిత్తం చేసేలా చెయ్యాలనీ అన్నాడు. ప్రతీ సైన్యం 200 మంది సైనికులతో మూడు నుంచి ఐదు సాయుధ రక్షణ స్క్వాడ్ లను ఏర్పరిచి, యుద్ధరంగంలో ధృఢంగా నిలువని డివిజన్ల వెనుకాల ఉంచి, యుద్ధరంగంనుంచి పారిపోయి వచ్చే వారిని కాల్చి వేసి, ధైర్యంతో యుద్ధరంగంలో పోరాడే సైనికులు ప్రమాదంలో పడకుండా కాపాడాలని ఆదేశించాడు.

పార్టీ స్టాలిన్ ఆదేశానికి సైన్యంలో విపరీతంగా ప్రచారం ఇచ్చింది. ఫలితంగా సైన్యంలో క్రమశిక్షణ మెరుగైంది.

జర్మన్ సైన్యం వేగంగా స్టాలిన్ గ్రాడ్ వైపు పురోగమించినా, ప్రధాన లక్ష్యాన్ని - రష్యన్ సైన్యాలు క్రమపద్ధతిలో తిరోగమించకుండా చుట్టుముట్టి నాశనం చెయ్యడాన్ని - సాధించలేకపోయింది. రష్యన్లు స్టెప్పీ మైదానాలలో నిలిచి పోరాడలేదు. మైదానాలలో వైమానిక రక్షణ లేకుండా వందల టాంకులతో దాడి చేస్తున్న జర్మన్లతో నిలిచి పోరాడడం అంటే నాశనం కావడమే. నిలిచి పోరాడకుండా రష్యన్లు మరో రోజు, మరో చోట నిలిచి పోరాడడానికి భారీ ఆయుధాలతో సహా స్టాలిన్ గ్రాడ్ వైపు తిరోగమించసాగారు. జులై నుంచి రష్యన్ సైన్యం తిరోగమించడానికి ముఖ్య కారణాలు - తగినంత సైన్యం లేకపోవడం, ఆయుధాల- ముఖ్యంగా టాంకుల, విమానాల - కొరత. 1941లో తొలి నెలలలో జరిగినట్లే అంతులేని యుక్రెయిన్ పొలాలగుండా జర్మన్ సైన్యాలు అతి వేగంగా పురోగమిస్తుంటే రష్యా అంతమైంది అన్న భావం జర్మన్ సైనిక నాయకత్వంలో కలుగసాగింది.

అయితే హిట్లర్ ఆశించినట్లు రష్యా అంతం కాలేదు. ప్రతిఘటిస్తూ తిరోగమిస్తున్నదే కాని ఎర్ర సైన్యం నిజమైన పోరాటం ఇంకా ప్రారంభించనే లేదు.

స్టాలిన్ గ్రాడ్ యుద్ధం ప్రారంభమైన సమయంలో, స్టాలిన్ గ్రాడ్ మీద శత్రువు ఒత్తిడిని తగ్గించడానికీ, మాస్కో రంగంనుంచి సైన్యాలను స్టాలిన్ గ్రాడ్ కు మళ్ళించే అవకాశం ఇవ్వకుండా ఉండడానికీ, ఎర్రసైన్యం మాస్కో రంగంలో జర్మన్ సైన్యాల మీద దాడి ప్రారంభించింది. ఈ దాడిలో జర్మన్ సైన్యం తీవ్ర నష్టాలకు గురయింది. రష్యన్ పురోగమనాన్ని ఆపడానికి జర్మన్ సైనికాధికారులు స్టాలిన్ గ్రాడ్ కకాసస్ రంగాలకు ప్రయాణమవబోతున్న అనేక డివిజన్లను మాస్కో రంగానికి పంపాల్సి వచ్చింది. ఆ విధంగా స్టాలిన్ గ్రాడ్ రంగంలో పోరాడుతున్న ఎర్రసైన్యం మీద కొంత మేరకు ఒత్తిడి తగ్గింది.

తిరోగమిస్తున్న రష్యన్లు ఆక్సాయ్ నది తీరంలో రక్షణ రేఖ దగ్గర నిలిచి ఆగస్టు 6న జర్మన్ల మీద ఎదురు దాడి చేశారు. స్టెప్పీలలోకి పారిపోయి చెల్లా చెదురైన రష్యన్ సైనికులను పోగుచేసి ఈ దాడి చెయ్యడం జరిగింది. ఈసారి వాళ్ళు భయంతో పరిగెట్టలేదు. ధైర్యంగా పోరాడి అక్కడ జర్మన్ సైన్యాన్ని వారం రోజులు నిలుపు చేశారు. జర్మన్లు చుట్టుముట్టే ప్రమాదం ఏర్పడినప్పుడు ఎర్రసైన్యం అక్కడనుంచి మరో ప్రకృతి సహజమైన రక్షణ రేఖ దగ్గరకు - మైష్కోవా నది తీరానికి - తిరోగమించింది. ఈ నది స్టాలిన్ గ్రాడ్ కు దక్షిణ దిశలో 40 మైళ్ళ దూరంలో ఉంది.

దాన్ నది వంపు పోరాటంలో అధైర్యం చూపినా, దాన్-వోల్గాల మధ్య ప్రదేశంలో ఎర్రసైన్యం జర్మన్లను తీవ్రంగా ప్రతిఘటించింది. సైనికులు బాంబులు నడుంకు కట్టుకుని జర్మన్ టాంకుల కిందకు దూకేవారు. కొత్తగా వచ్చిన సైనిక దళాలు త్వరలోనే గొప్ప పోరాట పటిమ గల సైన్యాలుగా రూపొందాయి. వోల్గా తీరాన్ని చేరుకుని 62వ, 64వ సైన్యాలను చక్రబంధంలో బిగిద్దామని జర్మనీ చేసిన ప్రయత్నం ఫలించలేదు. 64వ సైన్యం స్టాలిన్ గ్రాడ్ వెలుపల దక్షిణ దిశలోనూ, 62వ సైన్యం స్టాలిన్ గ్రాడ్ నగరం లోపలా, జర్మన్ దాడిని ఎదుర్కొన్నాయి. ఈ రెండు సైన్యాలూ స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో ప్రముఖ పాత్ర పోషించాయి.

ఆగస్టు 25 నాటికి స్టాలిన్ గ్రాడ్ ను ఆక్రమించాలని హిట్లర్ ఆదేశించాడు. జర్మన్ విమానాలు నగరం మీదా వోల్గా నదిలో రేవుల మీదా నగరానికి పోయే రైలు మార్గాల మీదా దాడులు తీవ్రం చేశాయి. ఆగస్టు 23న జర్మన్లు స్టాలిన్ గ్రాడ్ ఉత్తర దిశలో వోల్గా తీరం చేరారు.

ఆ రోజున 600 విమానాలతో జర్మన్ వైమానిక దళం స్టాలిన్ గ్రాడ్ నగరం మీద దాడి చేసింది. జర్మన్ విమానాశ్రయాలు సమీపంలో ఉండడం వలన ఈ 600 విమానాలూ 24 గంటలలో 2000 దాడులు చేశాయి. ఈ దాడిలో ఆ ఒక్క రోజులోనే 43,000 మంది పౌరులు చనిపోయారు. 1,50,000 మంది గాయపడ్డారు. అంతకు ముందు రెండు నెలల వేసవి కావడం మూలాన నగరం శివార్లలో

Edit with WPS Office
చెక్కలతో నిర్మించిన ఇళ్ళు అగ్గిపుల్లల్లా భగ్గుమన్నాయి. సిమెంటు, కాంక్రీటు భవనాలు కూలిపోయాయి. ఆయిలు టాంకులు అంటుకుని మండుతున్న చమురు వోల్గా నది మీదకు ప్రవహించి వోల్గా నది మండసాగింది. టెలిఫోను స్తంభాలు కాలిపోవడం వలన టెలిఫోన్లు పని చెయ్యలేదు. ఇంతకు ముందు జరిగిన విమాన దాడుల్లో నీటి గొట్టాలు దెబ్బ తినడం వలన తగినంత నీరు లేక మంటలను ఆర్పడం సాధ్యం కాలేదు. 30 మైళ్ళ పొడుగున వ్యాపించిన నగరమంతా అగ్ని గుండమైంది. ఆగస్టు 23, 24 - రెండు రోజులలో జర్మన్ వైమానిక బలగం 4,000 విమాన దాడులు చేసి నగరాన్ని శిథిలం చేసింది. యుద్ధానంతరం జర్మన్ జనరల్స్ ఈ విమాన దాడిని సైనిక లక్ష్యాల మీద దాడిగా వర్ణించినా దీని ప్రధాన లక్ష్యం సైనిక లక్ష్యాలు కాదు, ప్రజలను భయభ్రాంతులను చెయ్యడం.

అన్నా స్టెల్టసోవా అనే 17 ఏళ్ళ బాలిక మాధ్యమిక పాఠశాలనుండి ఉత్తీర్ణురాలై మెడికల్ స్కూల్లో చేరింది. ఆమె తండ్రి ట్రాక్టర్ ఫాక్టరీలో పని చేస్తుండేవాడు. తల్లి, ఒక చిన్న చెల్లెలు ఉన్నారు. ఆగస్టు 23 ఉదయం - '.....నేను మెడికల్ స్కూలు నుండి వచ్చాను. మా అమ్మ బజారుకు వెళ్ళి పుచ్చకాయ తీసుకురమ్మంది. నేను బజారు నుంచి తిరిగి వస్తుంటే విమాన దాడి గురించి హెచ్చరిస్తూ సైరన్ మోగింది. పదిహేడేళ్ళ వయస్సులో నేను దేనికీ భయపడేదాన్ని కాదు. ఇంతకు ముందు కూడా సైరన్ అనేక సార్లు మోగింది కాని ఏమీ జరగలేదు. నేను సైరన్ ను లక్ష్య పెట్టకుండా ఇంటికి వెళ్ళి అమ్మకి పుచ్చకాయ అందించాను. అమ్మ టేబులు దగ్గరకు వెళ్ళి చాకుతో పుచ్చకాయ కోసింది. ఎర్రగా నోరూరించేలా ఉన్నాయి పుచ్చకాయ ముక్కలు. మేం తినబోతుంటే ఒక బాంబు మా భవనంలో పడింది. అద్దాలు పగిలి గాజు ముక్కలు చెల్లికి గుచ్చుకున్నాయి. అమ్మ గుడ్డ చుట్టి రక్తం ఆపడానికి ప్రయత్నించింది కాని ఆగలేదు. అమ్మ చెల్లిని ఎత్తుకుని ఆసుపత్రికి పరుగు తీసింది. మా చుట్టుపక్కల బాంబులు పడుతున్నాయి. ఇళ్ళు అంటుకుని మండుతున్నాయి. అమ్మతో పాటు నేనూ వెడదామనుకున్నాను కాని వీధి అంతా గాయపడిన వారితో నిండిపోయింది. వారికి సహాయం చెయ్యడానికి ఆగిపోయాను. వీధిలో సైనికులు, ప్రజలు, పిల్లలు.....నేను ఇంటికి తిరిగి వెళ్ళడం సాధ్యపడలేదు.....'

తల్లినీ చెల్లినీ కోల్పోయిన అన్నా సైనిక ఆసుపత్రిలో చేరింది. ఐదేళ్ళ తర్వాత 1947లో స్టాలిన్ గ్రాడ్ తిరిగి వచ్చింది. తండ్రిని చూస్తానన్న ఆశ ఉండేది ఆమెకు. కాని ఆమె తండ్రి, తల్లి చెల్లెలు మరణించిన మర్నాడే మరణించాడని తెలుస్తుంది.

'....(1942లో) ఆగస్టు 24న జర్మన్ సైనికులు నాన్న పనిచేసే ట్రాక్టర్ ఫాక్టరీ ప్రాంతానికి చేరారు. మా నాన్న రైఫిలు అందుకున్నాడు. కొంతమంది కార్మికులు మర తుపాకులు అందుకున్నారు. మరికొంతమంది టాంకు అసెంబ్లీ లైను మీద తయారై ఉన్న టి-34 టాంకులు నడుపుతూ బయలు దేరారు. అందరూ ఫాక్టరీ వదలి జర్మన్లను ఆపడానికి పరిగెట్టారు. సమీపంలో రష్యన్ సైనిక దళాలు ఏమీ లేవు. రష్యన్ సైన్యం వచ్చేదాకా మూడు, నాలుగు రోజులు ఈ కార్మికులూ ప్రజలూ జర్మన్లను ఆపు చేశారు. నా తండ్రి ఈ పోరాటంలో చనిపోయాడు.....రెండు రోజుల్లో నా ఇల్లు, కుటుంబం - అంతా మాయమైపోయింది. అప్పటినుండి ఎర్రటి పుచ్చకాయ ముక్కలు చూస్తే నా గుండెలు బరువెక్కుతాయి. ఆ తర్వాత నేను ఎప్పుడూ పుచ్చకాయ తినలేదు.....'

జర్మన్ వైమానికులు హంతకుల్లా పౌరుల్ని వేటాడేవారు.

'.....నది ఒడ్డున పిల్లలతో సహా జనం ఉన్నారు. వాళ్ళు తుపాకీ గుళ్ళ నుండీ, ఫిరంగి గుళ్ళనుండీ రక్షించుకోవడానికి చిన్న పారలతో, పారలు లేకపోతే చేతులతో, గోతులు తవ్వడానికి ప్రయత్నించారు. ఉదయం వోల్గా నది మీద జర్మన్ విమానాలు ప్రత్యక్షమయ్యాయి. పడవల రేవు మీద దాడి చేశాయి. మర తుపాకులతో కాల్చాయి. ఒడ్డున ఉన్నది సైనికులు కాదనీ పౌరులనీ వాళ్ళకు పైనుంచి చాలా స్పష్టంగానే కనుపిస్తుంది. అనేక మార్లు జర్మన్లు హంతకుల్లా ప్రవర్తించడం చూశాను. వాళ్ళు స్త్రీలు, పిల్లల మీదా దాడి చేసేవారు. రేవులో పడవలలో జనం ఎక్కేవరకూ ఆగి జనాలతో నిండిన పడవల మీద బాంబులు వేసేవారు. నది దాటుతున్న పడవల మీద మర తుపాకులతో కాల్చేవారు. వోల్గా నది దీవులలో పోగుపడిన క్షత గాత్రుల గుంపుల మీదా ప్రజల మీదా బాంబులు కురిపించి హత్య చేసేవారు. జనం పడవలలోనూ తెప్పల మీదే కాక దూలాలు, కర్రలు, చెక్క ముక్కలు, డ్రమ్ములు ఏది దొరికితే అది పట్టుకుని నది దాటడానికి ప్రయత్నించారు. వీరందరినీ జర్మన్ విమానాలు

Edit with WPS Office
మరతుపాకులతో కాల్చి చంపేవి. ఇది మనుషుల్ని వేటాడి చంపడం.....' అని చెప్పింది మరో ప్రత్యక్ష సాక్షి బోర్డానోవా.

భయంకరమైన ఈ దాడుల్లో స్టాలిన్ గ్రాడ్ శిధిలమైంది కాని తలవంచలేదు. సైనిక నాయకత్వంలోనూ పౌర నాయకత్వంలోనూ స్టాలిన్ గ్రాడ్ ను ఎలాగైనా రక్షించుకోవాలన్న పట్టుదల ఎక్కువైంది. ఉత్తర, దక్షిణ దిక్కులలో జర్మన్లను కొంతకాలం నిలుపు చెయ్యడం జరిగింది కాని జర్మన్ ఒత్తిడి రోజురోజుకు ఎక్కువకాసాగింది.

ఆగస్టు 23న విమాన దాడి జరుగుతుండగా సాయంత్రం టాంకులు, మోటారు వాహనాలలో ప్రయాణిస్తున్న జర్మన్ సైన్యం ఉత్తర దిశన స్టాలిన్ గ్రాడ్ ఫాక్టరీని సమీపించింది. అప్పుడు స్టాలిన్ గ్రాడ్ నగరమంతా అగ్నిగుండమై తగలబడిపోతోంది. జర్మన్ సైన్యం గురించి వార్త తెలియగానే 1200 మంది యువ కమ్యూనిస్టులు కార్మిక దళాలతో పాటు ఫాక్టరీ రక్షణకు సిద్ధమయ్యారు. ప్రజా వలంటీరు దళాలు మార్చ్ చేస్తూ యుద్ధరంగాన్ని చేరాయి. 48 గంటల పాటు ఈ కార్మికదళాలూ యువ కమ్యూనిస్టులూ ప్రజా వలంటీ సైన్యమూ రెగ్యులర్ సైన్యం వచ్చేవరకూ జర్మన్ సైన్యాన్ని ఆపు చేశాయి. మహిళల విమాన విధ్వంసక దళం ఒకటి తోటి సైన్యాలతో సంబంధాలు తెగిపోయినా ఒంటరిగా జర్మన్ విమానాలతో టాంకులతో 24 గంటలు పోరాడింది. శత్రు విమానాలు దాడి చేస్తున్నప్పుడు కూడా ఈ మహిళలు రక్షణ కూడా తీసుకోకుండా కాల్పులు జరుపుతూ శత్రు దాడిని తిప్పి కొట్టారు.

స్టాలిన్ గ్రాడ్ నగరంలో పోరాడుతున్న సైన్యాన్ని జర్మన్లు అన్ని వైపుల నుండి చుట్టుముట్టి, రైలు రోడ్డు మార్గాలను తెంపి వెయ్యడంతో వోల్గా నది ద్వారానే నగరానికీ సైన్యానికీ సరఫరాలు అందించాల్సిన పరిస్థితి వచ్చింది. జర్మన్లు స్టాలిన్ గ్రాడ్ లో ప్రవేశించినా వోల్గా నది తీరాన్ని చేరలేకపోయారు. కాని నది మీద ప్రయాణించే ఫెర్రీలు, పడవలు, తెప్పలు, రేవులు - అన్నీ పగలూ రాత్రీ జర్మన్ విమాన, ఫిరంగి దాడులకు గురవుతుండేవి. సెప్టెంబరు-అక్టోబరు నెలలలో కొద్ది వారాలలో జర్మన్లు ఈ ఫెర్రీల మీద 8000 బాంబులు, 5000 ఫిరంగి గుళ్ళు వేశారు. అక్టోబరు చివరి పది రోజులలో జర్మన్ విమానాలు 550 బాంబులు వేశాయి.

ఫెర్రీలు, పడవలు నడిపే వారు పగలంతా భూమికి అడుగున సొరంగాలలో రక్షణ తీసుకునే వారు. పగటి జీవితమంతా భూమికి అడుగునే. పైన బాంబులు, ఫిరంగి గుళ్ళ వర్షం కురుస్తుంటే భూమికి అడుగున బేకరీలు రొట్టెలు తయారు చేస్తుండేవి. భూమికి అడుగునే స్నానాల గదులలో ఎర్ర సైనికులు స్నానాలు చేసేవారు. రాత్రి అవుతుండగా వోల్గా నది ఎడం ఒడ్డున బంకర్లూ, ట్రెంచీలూ, విమాన దాడి నుంచి రక్షణనిస్తున్న గుహలూ మేల్కొనేవి. ఫెర్రీల మీదా లాంచీల మీదా పడవల మీదా సైనికులు ఎక్కేవారు. యుద్ధసామగ్రిని పంపేవారు. ఇదంతా జరుగుతున్నప్పుడు జర్మన్ దాడి ఆగేది కాదు. జర్మన్ ఫిరంగి దళాలు నది ప్రాంతాన్ని చతురస్రాలుగా విభజించి ఒక్కొక్క చతురస్రానికి అనేక రకాల ఫిరంగులు గురి పెట్టి దాడి చేసేవి. రాత్రి వేళ నది మీద జరుగుతున్న రవాణా స్పష్టంగా కనుపించడానికి వెలుగు తూటాలు పేల్చేవి. ఈ తూటాలు ఒక్కొక్కసారి గాలికి అటూ ఇటూ పోవడం కాని, పైకీ కిందకూ పోవడం కాని జరిగి జర్మన్లకు నదిలో ప్రయాణిస్తున్న రవాణా పడవల మీద గురి చూసి కాల్చడం సాధ్యమయ్యేది కాదు. అదీకాక రష్యన్లు పొగతెర (smoke screen) వేసి నది దాటుతుండేవారు. లక్ష్యాలు స్పష్టంగా కనుపించకపోవడం వలన జర్మన్ ఫిరంగులు గుడ్డిగా పేల్చవలసి వచ్చేది. అందువలన నష్టం అంత ఎక్కువగా ఉడేది కాదు.

తెల్లవారుతుండగా ఫెర్రీల రవాణా ఆగిపోయేది. నది ఇరువైపులా నిర్మానుష్యమయ్యేది. సైనికులనూ సామాగ్రినీ రాత్రి తరలించిన ఫెర్రీలూ ట్రాలర్లూ తెప్పలూ టగ్ బోట్లూ మోటారు బోట్లూ పడవలూ అదృశ్యమయ్యేవి. పగలు, అరుదుగా, వేగంగా పయనించే మోటారు బోట్లు బాంబుల వర్షం మధ్య అప్పుడప్పుడు నదిని దాటుతుండేవి. మళ్ళీ రాత్రి ఫెర్రీ మేల్కొని తన పని ప్రారంభించేది.

ఆగస్టు అంతం నుండి సెప్టెంబరు 10 వరకూ జర్మన్లు రష్యన్ ప్రతిఘటనను అధిగమించి అన్ని వైపులనుండి స్టాలిన్ గ్రాడ్ వైపు పురోగమించారు. సెప్టెంబరు 10వ తేదీకి జర్మన్లు దక్షిణ దిశలో వోల్గాతీరం చేరాక, మిగిలిన రష్యన్ సైన్యాలనుంచి సంబంధాలు తెగిపోయిన 62వ సైన్యం నగరంలో గుర్రపు నాడా ఆకార ప్రాంతంలో ఒంటరిగా పోరాడాల్సి వచ్చింది. 62వ సైన్యం వేరు చేయబడ్డ రెండు రోజుల తర్వాత సెప్టెంబరు 12న జనరల్ ఛుకోవ్ ఆ సైన్యానికి కమాండరుగా నియమించబడ్డాడు.

సెప్టెంబరు 13 నాటికి 62వ సైన్యం అధీనంలో 20 మైళ్ళ పొడవు, 5 మైళ్ళు వెడల్పు గల ప్రదేశం మాత్రమే మిగిలింది.

Edit with WPS Office

స్టాలిన్ గ్రాడ్ మీద జర్మన్ విమానాలు రోజుకు 3000 దాడులు చేసేవి. రష్యన్ విమానాలు 300 దాడుల కంటే ఎక్కువ చెయ్యలేక పోయేవి. రష్యన్ల దగ్గర చెప్పుకో దగ్గ టాంకు బలగాలూ లేవు. ఎడతెగకుండా సాగే విమాన దాడులు రష్యన్ సైన్యంలో నిస్పృహ కలిగించేవి. భారీ నష్టాలు, నిరంతర తిరోగమనం, తిండి, మందుగుండు కొరత, అదనపు సైన్యాలు సహాయానికి రావడంలో ఇబ్బందులు - ఇవన్నీ ఎర్ర సైన్య మనో నిబ్బరాన్ని దెబ్బతీసేవి. స్టాలిన్ గ్రాడ్ నరకం నుంచి ఎలాగోలా బయటపడి వోల్గా అవతలి తీరానికి చేరుకోవాలని సైనికులు తహతహలాడేవారు. స్టాలిన్ గ్రాడ్ లో ఇంక ప్రతిఘటన కొనసాగించడం వ్యర్థం అని కొంతమంది కమాండర్లు కూడా భావించసాగారు. వారి నుంచి ఈ నిరాశా ధోరణి అంటువ్యాధిలా సైనికులకు కూడా సోకింది.

ఈ పరిస్థితిని సరిదిద్దడానికి పార్టీ సైన్యంలో ప్రచార కార్యక్రమాన్ని తీవ్రం చేసింది. స్టాలిన్ గ్రాడ్ మిలిటరీ కౌన్సిల్ 'స్టాలిన్ గ్రాడ్ వద్ద శత్రువును నాశనం చెయ్యాలి' అనే చారిత్రాత్మకమైన పిలుపునిచ్చింది. ఈ పిలుపు 62వ సైన్యంలో ఉన్న ఆఫీసర్లనూ సైనికులనూ ఉత్తేజపరచింది.

సెప్టెంబరు 13న మామైె కొండను రష్యన్లనుంచి స్వాధీనం చేసుకునే లక్ష్యంతో జర్మనీ పెద్ద ఎత్తున దాడి ప్రారంభించింది. జర్మన్ టాంకులు, సైన్యం, సెంట్రల్ స్టాలిన్ గ్రాడ్ ప్రాంతంలో విరుచుకు పడ్డాయి. స్టాలిన్ గ్రాడ్ తమ స్వాధీనమైందన్న ఆనందంతో నాజీ సైనికులు ట్రక్కుల్లోంచి కిందికి దూకి, మౌత్ ఆర్గాన్లు వాయించుతూ రోడ్ల మీద డాన్సుచేశారు. అక్కడ భవనాలలోనూ నేల మాళిగల్లోనూ మాటు వేసి ఉన్న రష్యన్లు నాజీ సైనికుల మీద దాడి చేసి వందలమందిని హతం చేశారు కాని నాజీ సైన్యం వరదలా వచ్చిపడుతుంటే రష్యన్లు వెనుకడుగు వెయ్యవలసి వచ్చింది.

సెప్టెంబరు 14-15 రాత్రి స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో ప్రమాదకరమైన రాత్రి. జర్మన్లు దాదాపు వోల్గా చేరిపోయారు అన్న సమయంలో రోడిమెట్సేవ్ డివిజనుకు చెందిన 10,000 మంది సైనికులు వోల్గా దాటి ఛుకోవ్ సైన్యానికి సహాయంగా వచ్చారు. ఈ డివిజనుకు చెందిన ఫిరంగులు నది అవతలి ఒడ్డునే ఉన్నాయి. తమతో సైనికులు టాంకు విధ్వంసక తుపాకులు మాత్రం తీసుకు వచ్చారు. ఈ డివిజన్ వోల్గా దాటిన వెంటనే జర్మన్ల మీద దాడి చేసింది. రోడిమెట్సేవ్ డివిజను దాడి చరిత్ర పరిసిద్ధమైనది.

సెంట్రల్ స్టాలిన్ గ్రాడ్ ను స్వాధీనం చేసుకున్న జర్మన్లను తరిమివేయడానికీ మామైె కొండను స్వాధీనం చేసుకోడానికీ సెప్టెంబరు 15న భీషణ పోరాటం జరిగింది. ఆ రోజు సెంట్రల్ స్టేషన్ అనేక మార్లు చేతులు మారింది. సెప్టెంబరు 16 ఉదయం మామైె కొండ రష్యన్ల అధీనంలోకి వచ్చింది (ఆ తర్వాత 1943 జనవరి వరకూ ఈ కొండ కోసం పోరాటం జరుగుతూనే ఉంది). రోడిమెట్సేవ్ డివిజను వెనుకంజ వెయ్యకుండా చివరి మనిషి వరకూ పోరాడింది.

రైల్వేస్టేషను కోసం జరిగిన యుద్ధంలో ఒక బెటాలియన్ స్టేషన్ సమీపంలో ఉన్న రాతి గృహంలో స్థావరమేర్పరుచుకుని జర్మన్లతో పోరాడసాగింది. జర్మన్లు స్టేషన్ను ఆక్రమించి ఈ బెటాలియన్ కూ మిగిలిన రష్యన్ సైన్యాలకూ మధ్య ఉన్న సంబంధాలు తెంపివేశారు. ఒంటరిదైపోయిన ఈ బెటాలియన్ చివరి వరకూ పోరాడింది. తీవ్రంగా గాయపడ్డ ఆరుగురు సైనికులు మాత్రం మిగిలారు. మందుగుండు అయిపోయిన తర్వాత వాళ్ళు ఎలాగోలా వోల్గా తీరం చేరి, తెప్ప లాంటిది తయారు చేసి నదిలో ప్రవేశించారు. వాలుకు కొట్టుకు పోతున్న వీరిని రష్యన్ విమాన విధ్వంసక శతఘ్ని దళాలు చూసి ఒడ్డుకు చేర్చి ఆసుపత్రిలో చేర్చారు. మూడు రోజులుగా ఈ గాయపడ్డ సైనికులకు తిండి లేదు. జర్మన్లు రైల్వే స్టేషన్ను స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా పోరాటం ఆగలేదు. తమ డివిజన్ తో సంబంధాలు తెగిపోయిన కొంతమంది రోడిమెట్సేవ్ సైనికులు స్టేషను చుట్టు పక్కల ఉన్న భవనాలలోనూ రైలు పెట్టెల క్రిందా ఇద్దరూ ముగ్గురూ దళాలుగా ఏర్పడి పోరాడుతూ రాత్రింబవళ్ళు జర్మన్లను వేధించసాగారు. సెప్టెంబరులో స్టాలిన్ గ్రాడ్ ను రోడిమెట్సేవ్ డివిజను రక్షించిందనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. ఈ డివిజనులోని 10,000 మంది సైనికులూ యుద్ధరంగంలో అమరులేనా అయ్యారు లేదా తీవ్రంగా గాయపడ్డారు. సైనికులందరినీ కోల్పోయిన తర్వాత ఈ డివిజను పేరుకు మాత్రమే మిగిలింది.

జర్మన్ విమాన దాడులలో నష్టాన్ని నివారించడానికి ఎడమ ఒడ్డునుంచి కుడి ఒడ్డుకు చేరిన వెంటనే ఆహారం, మందుగుండు, ఆయుధాలూ సైనికులకు అందజేయపడేవి. వోల్గా దాటి వచ్చిన ప్రతీ వస్తువునూ సైనికులు స్వయంగా మోసుకుని యుద్ధ రంగానికి తీసుకు వెళ్ళాల్సి వచ్చేది. పగలల్లా శత్రువుతో పోరాటం, రాత్రి నది తీరం నుండి యుద్ధ రంగానికి ఆయుధాలూ ఆహార పదార్థాలూ మందుగుండూ మొదలైనవి మోసుకు వెళ్ళడం - నిద్ర, విశ్రాంతి లేకుండా సైనికులు శ్రమించవలసి

Edit with WPS Office
రావడంతో చాలా అలిసిపోయేవారు. ఈ శ్రమ వారి పోరాట పటిమను తగ్గించేది. కాని రోజు తర్వాత రోజు, వారం తర్వాత వారం స్టాలిన్ గ్రాడ్ లో ఇలాగే జరిగింది.

సెప్టెంబరు 24న జర్మన్లు సెంట్రల్ స్టాలిన్ గ్రాడ్ లో అత్యధిక భాగాన్ని స్వాధీనం చేసుకుని ఉత్తరాన ఉన్న పారిశ్రామిక ప్రాంతం మీద దాడి మొదలు పెట్టారు. స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో ఈ దశకు ఒక ప్రత్యేకత ఉంది.

ఈ ఉత్తర స్టాలిన్ గ్రాడ్ అంతా ఎత్తుపల్లాలుగా ఉంటుంది. ఈ ప్రాంతంలో రాతితోనూ ఇనుముతోనూ కాంక్రీటుతోనూ కట్టిన భవనాలున్నాయి. ఇక్కడ పోరాటం సమతల ప్రదేశంలో జరిగినట్లు జరగలేదు. ఒక దుర్గంలో జరిగినట్లు జరిగింది. సమతల ప్రదేశంలో జర్మన్లు ఒక కిలోమీటరు ఆక్రమించడానికి ఎంత నష్టానికి గురయ్యారో ఇక్కడ ఒక మీటరు ఆక్రమించడానికి అంత నష్టానికి గురయ్యారు. ప్రతీ ఇల్లూ, వర్కుషాపు, నీటి టాంకు, ఎత్తుగా ఉన్న రైల్వే లైను, గోడ, నేల మాళిగలు, శిథిలాలు, గుట్టలు - ప్రతీదాన్ని ఒక రక్షణ స్థావరం చేసి రష్యన్లు అడుగడుగుకూ పోరాడారు. ఇక్కడ రష్యన్లు సమీపంలో ఉండి పోరాడే ఎత్తుగడ అవలంబించారు. రష్యన్ సైనికులకూ జర్మన్ సైనికులకూ మధ్య దూరం అంతమైంది. అందువలన జర్మన్ విమానాలు తమ సైనికులు నష్టపోకుండా రష్యన్ల మీద దాడి చెయ్యలేకపోయేవి. వీధుల్లో శిథిలాలు, బారికేడ్లతో జర్మన్ టాంకుల గమనం అసాధ్యమయ్యేది. రష్యన్ సైనికులకూ జర్మన్ సైనికులకూ మధ్య దూరం 20-25 మీటర్ల కంటే ఎక్కువ ఉండేది కాదు. చేతిబాంబులతో యుద్ధం చేసేవారు. ట్రెంచిలలో, భోజనాల హాలుల్లో, వంట శాలల్లో, సెంట్రీల దగ్గరా, అవసరమైన వెంటనే అందుబాటులో ఉండేలా చేతి బాంబులు గుట్టలుగా పోసి ఉంచేవారు. పగలంతా జర్మన్లు విమానాలు, టాంకులతో దాడి చేసేవారు. రాత్రిళ్ళు రష్యన్లు ఎదురుదాడి చేసేవారు. రష్యన్లు 6 -8 మంది సైనికులతో కూడిన చిన్న చిన్న దళాలతో దాడి చేసేవారు. ఈ దళాలు చేతి బాంబులతో, పారలు గడ్డపలుగులతో, తుపాకులతో, బాకులతో, భవనాలలో, నేల మాళిగల్లో దాగి ఉన్న జర్మన్ సైనికుల మీద దాడి చేసేవి.

'ఆకాశం అగ్నిని వర్షిస్తుంటే, కాళ్ళ క్రింద నేల కంపిస్తుంటే ఇక్కడ జీవించడం కష్టం.....నిజమే, ఇక్కడ జీవించడం కష్టం. అంతకంటే ముఖ్యం - ఇక్కడ ప్రేక్షకుడిలా జీవించడం కష్టం. ఇక్కడ జీవించడం అంటే పోరాడడం. ఇక్కడ జీవించడం అంటే జర్మన్లను చంపడం.....' అని స్టాలిన్ గ్రాడ్ లో జీవితాన్ని వర్ణించాడు కాన్ స్టాంటిన్ సైమనోవ్ అన్న రచయిత 'పగళ్ళు-రాత్రులు'లో.

స్టాలిన్ గ్రాడ్ అలాగే జీవించింది - పోరాడుతూ, జర్మన్లను హతమారుస్తూ జీవించింది.

'.....ఈ శిథిలాలు నిర్జీవంగా, నిశ్శబ్దంగా కనుపిస్తాయి. హఠాత్తుగా ఒక జర్మన్ టాంకు జాగ్రత్తగా శిథిలమైన భవనం చాటునుంచి ముందుకు కదులుతుంది. అదే క్షణంలో రాత్రింబవళ్ళు అప్రమత్తంగా కాపలా కాస్తున్న (రష్యన్) ఏంటీ-టాంకు రైఫిల్ సైనికుడు టాంకు మీద కాలుస్తాడు. సమీపంలో ఉన్న భవనంలోని ఒక కిటికీ లోంచి ఈ జర్మన్ టాంకుకు రక్షణ ఇస్తున్న జర్మన్ మర తుపాకీ, ఇటుక గోడ వెనుక దాగి టాంకు మీద కాల్పులు సాగిస్తున్న రష్యన్ సైనికుడి మీద కాల్పులు మొదలు పెడుతుంది. రష్యన్ సైనికుడుకి రక్షణ ఇస్తున్న స్నైపర్లలో (మాటు వేసి గురి చూసి కొట్టే నైపుణ్యం గల వారు) ఒకడు మరో భవనం రెండో అంతస్తు నుంచి జర్మన్ మెషీన్ గన్నర్ల మీద కాల్పులు మొదలు పెడతాడు.

మర తుపాకీ నిశ్శబ్దమవుతుంది. స్నైపర్ దాగి ఉన్న చోటును గుర్తించిన జర్మన్ ఫిరంగులు కాల్పులు సాగిస్తాయి. ఇంతవరకూ నిశ్శబ్దంగా ఉన్న రష్యన్ ఫిరంగులు తమ రహస్య స్థావరాలనుంచి జర్మన్ ఫిరంగుల మీద దాడి చేస్తాయి. ఈ లోగా జర్మన్ టాంకు వెనక్కు పారిపోతుంది. స్నైపర్, ఏంటీ-టాంకు రైఫిల్ సైనికుడు, రష్యన్ ఫిరంగులూ త్వరగా తమ స్థానాలను వదలి పెట్టి కొత్త స్థానాలకు మారుతారు.....' అని స్టాలిన్ గ్రాడ్ వీధి పోరాటాల గురించి ఒక పాత్రికేయుడు వర్ణించాడు.

అక్టోబరు అంతంలో రష్యన్ సైన్యం స్టాలిన్ గ్రాడ్ లోని చిన్న చిన్న ప్రాంతాలకు కుదించబడ్డప్పుడు అక్కడ 20,000 మంది సైనికులు మాత్రమే ఉన్నారు. కాని నది ఆవలి ఒడ్డు సరఫరాలు, ఫిరంగులు, విమానాలూ సమీకరించబడి చీమలపుట్టలా ఉండేది. రష్యన్ ఫిరంగులూ, కాట్యూషా రాకెట్ మోర్టార్లూ నది ఆవలి తీరంలో సురక్షితంగా ఉండి జర్మన్ సైన్యాల మీద కాల్పులు చేస్తూ ఉండేవి. జర్మన్లు దాడికి సంసిద్ధులవుతూ సైన్యాలను కేంద్రీకరిస్తున్నప్పుడు ఆవతలి ఒడ్డునుంచి కాట్యూషా రాకెట్లు, ఫిరంగులు దాడి చేసి జర్మన్ సైన్యాలను చిన్నాభిన్నం చేసేవి. ఈ ఫిరంగి రక్షణ స్టాలిన్ గ్రాడ్ లో పోరాడుతున్న సైన్యానికి ఉత్సాహాన్నిచ్చి పోరాడేలా చేసేది.

Edit with WPS Office

స్టాలిన్ గ్రాడ్ పోరాటం గురించి చెప్పేటప్పుడు స్నైపర్ల గురించి కూడా చెప్పాలి. లెనిన్ గ్రాడ్ లో ప్రారంభమైన స్నైపర్ పోరాటం స్టాలిన్ గ్రాడ్ లో ఒక ఉద్యమంగా మారింది. అనేక వందల మంది రష్యన్లు స్నైపర్లుగా స్టాలిన్ గ్రాడ్ వచ్చి, ఒక్కొక్కరు వందలమంది జర్మన్లను హతమార్చారు. స్నైపరుకు వేటగాడికి ఉండే ఓర్పూ నేర్పూ ఉండాలి. మాటు వేసి, గంటల తరబడి నిశ్శబ్దంగా కదలకుండా జర్మన్లకోసం ఎదురుచూస్తూ, జర్మన్ సైనికుడు కంటబడగానే ఒకే ఒక గుండుతో హతమార్చేవారు. వెంటనే స్థలం మార్చి మరో చోట మాటు వేసేవారు. కొందరి దగ్గర టెలిస్కోపిక్ గన్నులుండేవి. అరమైలు దూరం నుంచి వీటి సహాయంతో జర్మన్ సైనికులను కాల్చి చంపేవారు. స్టాలిన్ గ్రాడ్ లో వేలమంది జర్మన్ సైనికులు ఈ స్నైపర్ల బారిన పడి మరణించారు. జర్మన్లు కూడా కొంతమంది స్నైపర్లను తీసుకు వచ్చారు కాని వారు ఎర్ర సైన్యం స్నైపర్లతో పోటీ పడలేకపోయారు.

స్టాలిన్ గ్రాడ్ వీధిపోరాటాలలో సైబీరియన్ సైనికులు కత్తులు, బాకులు బెల్టుల్లో బిగించి జర్మన్ల మీద విరుచుకుపడేవారు. బయోనెట్లతో జర్మన్లను గుచ్చి నెత్తిమీంచి బస్తా విసిరేసినట్లు విసిరేసేవారు. చిన్న చిన్న గ్రూపులుగా తిరుగుతూ, ఇళ్ళల్లో, నేల మాళిగల్లో ఉన్న జర్మన్ల మీద దాడి చేసి హతమార్చేవారు జర్మన్లు చుట్టుముట్టినప్పుడు 'దేశంకోసం, స్టాలిన్ కోసం ప్రాణాలిస్తాం కాని ఆయుధాలు వదలం' అని నినాదాలిస్తూ చివరి రక్తపు బొట్టు వరకూ పోరాడేవారు.

స్టాలిన్ గ్రాడ్ లో ప్రతీ ఇల్లూ ఒక దుర్గం, ప్రతీ ఇటుకా ఒక బారికేడ్ అయింది. శిధిలమైన భవనాల్లో జర్మన్లు పై అంతస్తులో ఉంటే రష్యన్లు కింద అంతస్తులో ఉండి పోరాడేవారు. భవనంలో ఒక మూల భాగం రష్యన్ల అధీనంలో ఉంటే మరో మూల భాగం జర్మన్ల అధీనంలో ఉండేది. ప్రతీ గదికీ గోడకీ శిధిలానికీ పోరాటం జరిగేది. 'పావ్లోవ్ ఇల్లు' అలాంటిదే. బాంబుల దాడిలో శిధిలమైన ఈ భవనం ఎవరి చేతుల్లో ఉండే వారు భవనానికి ఎదురుగా ఉన్న చతురస్ర ప్రదేశాన్ని తమ అదుపులో ఉంచుకోగలరు. ఒక రాత్రి వేళ రష్యన్లు పావ్లోవ్ నాయకత్వంలో ఈ భవనాన్ని ఆక్రమించారు. తర్వాత 55 రోజుల పాటు ఈ భవనం కోసం యుద్ధం జరిగింది. మొదట ఆక్రమించిన పావ్లోవ్ వెళ్ళి పోయినా ఆ ఇల్లు చివరి వరకూ పావ్లోవ్ ఇల్లుగానే పిలువబడింది.

స్టాలిన్ గ్రాడ్ ను కొద్ది రోజుల్లోనే జర్మనీ ఆక్రమిస్తుందని హిట్లర్ వాగ్దానం చేశాడు. జర్మన్ సైనికులు తమ ట్రెంచీల్లోంచి 'త్వరలోనే మీరు వోల్గా నదిలో మునిగి బుడగలు ఊదుతారు'అంటూ రష్యన్ సైనికుల్ని హేళన చేస్తుండేవారు. అన్ని వైపులనుంచీ టాంకులతో గన్నులతో రష్యన్లను చుట్టుముట్టినట్లు బొమ్మలున్న కరపత్రాలను జర్మన్ విమానాలు వెదజల్లుతుండేవి.

ప్రపంచమంతా రష్యన్లు జర్మన్ పాశవిక శక్తికి ఎదురు నిలిచి ఎలా పోరాడగలుగుతున్నారా అని నిర్ఘాంతపోతుంటే, రష్యన్లు అగ్నిగుండమైన స్టాలిన్ గ్రాడ్ లో ఎర్ర సైన్యం ఎలా పోరాడుతోందా అని ఆశ్చర్యపోయేవారు. ఈ అగ్నిగుండంలో పోరాడుతున్న సైనికులు కూడా విస్తుపోయేటంత భీషణంగా సాగింది స్టాలిన్ గ్రాడ్ పారిశ్రామిక ప్రాంతంలో యుద్ధం.

స్టాలిన్ గ్రాడ్ ట్రాక్టర్ ఫాక్టరీ వెనుక వోల్గా నది - వోల్గా దాటితే రష్యా. వోల్గా చేరడానికి దాడి చేస్తున్న జర్మన్లను ఆపు చెయ్యాలన్న ఆదేశంతో, అక్టోబరు మొదటి వారంలో కల్నల్ గుర్తియేవ్ సైబీరియన్ రెజిమెంట్ ట్రాక్టర్ ఫాక్టరీను చేరింది. ఈ ఫాక్టరీ ప్రాంతం ఒకటిన్నర, రెండు కిలోమీటర్లు మాత్రమే. కూలిపోయిన కప్పులు, గోడలు, గుట్టలు పడి ఉన్న బొగ్గు, తిరగబడిన రైల్వే వేగన్లు - ఫాక్టరీ ప్రాంతమంతా జర్మన్ బాంబుల వల్ల గోతులు పడింది. రష్యన్ సైన్యం ఫాక్టరీని చేరగానే ఫాక్టరీ ముందూ, ఫాక్టరీలోనూ రాయిలా ఉన్న నేలను తవ్వి బంకర్లు, ట్రెంచిలు, సొరంగాలు ఏర్పాటు చేసింది. వెనుక నుంచి రక్షణ తీసుకుంటూ తుపాకుల పేల్చడానికి వీలుగా షాపు గోడల్లో రంధ్రాలు చేసింది. డివిజన్ స్టాఫ్ వోల్గా నది ఒడ్డున వాలులో తవ్విన లోతు సొరంగాలలోకి చేరింది. రాత్రివేళ దాడులు చెయ్యడం, విరామం లేకుండా మార్చ్ చెయ్యడం, నేలలో చిన్న గోతులు తవ్వుకుని ఆ గోతుల్లో దాగి టాంకుల నుండి రక్షణ తీసుకోవడం - ఇల్లాంటి చర్యలలో ఈ రెజిమెంటుకు కఠినమైన శిక్షణ ఇవ్వబడింది.

రక్షణ చర్యలు పూర్తయ్యాయో లేదో అక్టోబరు 4న జర్మన్ దాడి ప్రారంభమైంది. మొదటి రోజు జర్మన్ జంకర్స్ విమానాలు సైరన్లు మ్రోగిస్తూ ఎనిమిది గంటలు విరామం లేకుండా బాంబుల వర్షం కురిపించాయి. జర్మన్ ఫిరంగి దళాలు ఆ ఎనిమిది గంటలూ విరామం లేకుండా గుళ్ళ వర్షం కురిపించాయి. ఈ ఎనిమిది గంటల దాడిలో ఫాక్టరీ అంతా పొగలతో, మంటలతో నిండిపోయింది. కాని సైబీరియన్ సైనికులు ఎనిమిది గంటలూ జర్మన్ విమానాల మీద గురి పెట్టి కాల్చడం మానలేదు. చీకటి పడిన తర్వాత రష్యన్లు చనిపోయిన సైనికులను పాతి పెట్టి, గాయపడిన వారిని అవతలి ఒడ్డుకు

Edit with WPS Office
తరలించారు.

రాత్రంతా జర్మన్ ఫిరంగులు ఫాక్టరీ మీద గుళ్ళు కురిపిస్తూనే ఉన్నాయి. సూర్యోదయంతో పాటు 40 జర్మన్ విమానాలు మళ్ళీ వచ్చాయి. మళ్ళీ చెవులు చిల్లులు పడేలా సైరన్లు మ్రోగిస్తూ ఆకాశం నుండి దిగి బాంబులు వేస్తూ భీభత్సం సృష్టించాయి. ఈ విమానదాడి జరుగుతుండగానే భూగర్భంలో కాంక్రీట్ బంకర్లలో రక్షణ తీసుకుంటున్న ఎర్ర సైనికుల దళం పైకి వచ్చి జర్మన్ల మీద దాడి చేసి ఒక కిలోమీటరు పురోగమించింది.

స్టాలిన్ గ్రాడ్ లో ఈ ప్రాంతంలో ఒక కిలోమీటరు అంటే చాలా దూరం క్రిందే లెక్క. ఆ రాత్రి జర్మన్ సైనికులు టాంకులతో ఈ ఎర్ర సైనిక దళం మీద దాడి చేశారు. వెనుకంజ వెయ్యకుండా శిధిలాల్లో రక్షణ తీసుకుంటూ జర్మన్లతో మూడు రాత్రులు పోరాడి ఈ దళం అంతమైంది. వేళ్ళ మీద లెక్క పెట్టగలిగినంత సైనికులు మాత్రమే తిరిగి రెజిమెంటును చేరగలిగారు.

మూడో రోజు జర్మన్ విమానాలు పన్నెండు గంటలు విరామం లేకుండా బాంబులు వేశాయి. చీకటి పడిన తర్వాత కూడా విమాన దాడి ఆగలేదు. చీకటి ఆకాశంలోంచి విమానాలు దిగి బాంబులు వేసి మళ్ళీ చీకట్లో కలిసిపోయేవి. జర్మన్ సైన్యం దాడి చెయ్యడానికి వీలుగా జర్మన్ విమాన, ఫిరంగి దాడి హఠాత్తుగా కొంచెం సేపు ఆగి పోయేది. రష్యన్ సైనికులు బంకర్లలోంచి చేతి బాంబులతో, గన్నులతో పైకి వచ్చి పోరాడి జర్మన్లను తరిమివేసేవారు. జర్మన్లు పారిపోయిన వెంటనే మళ్ళీ విమాన, ఫిరంగి దాడులు ప్రారంభమయ్యేవి.

ఈ పోరాటంలో వోల్గా నది అవతలి ఒడ్డున ఉన్న రష్యన్ ఫిరంగులు చాలా ప్రయోజనకరంగా ఉండేవి. ట్రాక్టర్ ఫాక్టరీలో ఉన్న రష్యన్ సైన్యంతో రేడియో ద్వారా సంపర్కం పెట్టుకుని జర్మన్ సైన్యం మీద అగ్ని వర్షం కురిపించేవి. జర్మన్ సైన్యం దాడి చేసినప్పుడు రష్యన్ సైన్యానికీ జర్మన్ సైన్యానికీ మధ్య ఒక అగ్ని తెర దించేవి. అక్టోబరు 6వ తేదీన జర్మన్లు దాడి చెయ్యబోతుండగా కాట్యూషా రాకెట్లు సూటిగా ఒక జర్మన్ బెటాలియన్ మీద దిగి మొత్తం బెటాలియన్ ను తుడిచి పెట్టేశాయి.

అక్టోబరు 14వ తేదీన జర్మన్లు భయంకరమైన యుద్ధం ప్రారంభించారు. ఉత్తర పారిశ్రామిక ప్రాంతంలో, 5 కి. మీ. యుద్ధరంగంలో క్షణం విరామం ఇవ్వకుండా విమానాలతో 3,000 దాడులు చేశారు. రాత్రి వరకూ జర్మన్ ఫిరంగులూ మోర్టార్లూ గుళ్ళ వర్షం కురిపిస్తూనే ఉన్నాయి. ఆ రోజు సూర్యుడు తీక్షణంగా ప్రకాశిస్తున్నా పొగ, బూడిదలతో ఆకాశం నిండిపోయి 100 గజాల అవతల ఏమున్నదీ కనుపించని పరిస్థితి ఏర్పడింది. సొరంగాలూ, భూగర్భంలో తవ్విన గోతులూ కూలిపోసాగాయి. కమాండు పోస్టులు, యుద్ధం ఎలా జరుగుతున్నదీ గమనిస్తున్న వారి స్థావరాలూ నాశనమయ్యాయి. ఆ రోజు జర్మన్లు రెండు కిలోమీటర్లు పురోగమించారు. రాత్రికి జర్మన్లు ఫాక్టరీని మూడు వైపుల నుంచి చుట్టుముట్టారు. 180 జర్మన్ టాంకులు రష్యన్ రక్షణ రేఖను దాటి ఫాక్టరీ పరిసరాలలోకి వచ్చాయి. ఫాక్టరీ వర్కుషాపుల్లో భీషణ పోరాటం మొదలైంది. ఆ రోజు జర్మన్లు 40 టాంకులను నష్టపోయారు. స్టాలిన్ గ్రాడ్ ఫాక్టరీ చుట్టుపక్కల 3,000 మంది జర్మన్లు చనిపోయారు. రష్యన్ నష్టం కూడా తీవ్రంగానే ఉంది. ఆ రాత్రి రష్యన్లు 3,500 మంది క్షత గాత్రులను ఆవలి ఒడ్డుకు తరలించారు. 15వ తేదీన కూడా దాడి కొనసాగింది. అంతకు ముందు రోజు లాగానే బాంబుల వర్షం కురిసింది. ఒక అంచనా ప్రకారం స్టాలిన్ గ్రాడ్ ఫాక్టరీ ప్రాంతంలో జరిగిన యుద్ధంలో ప్రతీ కిలోమీటరు మీదా 2,000 బాంబులు కురిశాయి. ఇవి కాక మోర్టార్లు, చిన్న ఫిరంగుల గుళ్ళు.

ఒక నెలలో జర్మన్లు ఈ సైబీరియన్ రెజిమెంటు మీద 117 దాడులు చేశారు. ఒక రోజు జర్మన్ టాంకులూ, సైన్యమూ 23 దాడులు చేశాయి. సైబీరియన్ సైనికులు ఈ 23 దాడులనూ తిప్పి కొట్టారు. మూడు రోజులు తప్ప ప్రతీరోజూ జర్మన్ విమానాలు రోజుకు పది, పన్నెండు గంటలు విరామం లేకుండా బాంబుల వర్షం కురిపించాయి. సైబీరియన్ల కళ్ళు గుంటలు పడిపోయాయి. బుగ్గలు లోపలికి పోయాయి. మూడు నాలుగు రోజులు ఏకబిగిని కన్నుమూయకుండా పోరాడేవారు. ఈ ఒకటిన్నర కిలోమీటర్ల యుద్ధ రంగంలో భూమి అడుగునే సైన్యాన్ని అవసరమైనప్పుడు కేంద్రీకరించడం, విమాన దాడి ఉధృతంగా జరుగుతున్న ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలడం, జర్మన్ దాడి మొదలైనప్పుడు త్వరగా భూగర్భంలో ఉన్న బంకర్లనుంచి షాపుల్లోకి ట్రెంచీల ద్వారా చేరుకోవడం లాంటివి నేర్చుకున్నారు.

మూడు వారాల తర్వాత జర్మన్లు నిర్ణయాత్మకమైన దాడి చేశారు. ఈ దాడికి ముందు 80 గంటల పాటు జర్మన్ విమానాలూ ఫిరంగులూ ఫాక్టరీ మీద అగ్ని వర్షం కురిపించాయి. మూడు రాత్రులూ,

Edit with WPS Office
మూడు పగళ్ళూ పొగలు, ఉరుములు, మంటలు. విమానదాడి ఆగిన వెంటనే జర్మన్ సైన్యం భారీ టాంకులు, మధ్యరకం టాంకులతో దాడి చేసింది. ఫాక్టరీలో ప్రవేశించి ఎర్రసైన్యాన్ని చిన్న చిన్న ముక్కలు చెయ్యగలిగింది. ఒక ముక్కకూ మరొక ముక్కకూ సంబంధం తెగిపోయింది. ఎర్ర సైన్య శకలాలు పైనుంచి ఆదేశాలు లేకపోయినా, పోరాటాన్ని సమన్వయపరచడానికి ఒక కమాండ్ సెంటర్ లేకపోయినా, తీవ్రంగా పోరాడాయి. దళ నాయకులు చనిపోతే సైనికులే వారి స్థానం ఆక్రమించి పోరాడారు. స్టాలిన్ గ్రాడ్ ఫాక్టరీలో ఈ యుద్ధం అనేక రోజుల పాటు సాగింది. ఇక్కడ ఒక భవనం కోసం, ఫాక్టరీ షాపు కోసం పోరాటం జరగలేదు. చిన్న వరండాలో ప్రతీ మలుపు కోసం, మెట్ల మీద ప్రతీ మెట్టు కోసం, ప్రతీ మెషీన్ టూల్ కోసం, యంత్రానికి మరొక యంత్రానికి మధ్య ఉండే చిన్న దారి కోసం - ప్రతీ అంగుళం కోసం భీకర పోరాటం జరిగింది. జర్మన్ సైన్యం ఒక ప్రాంతాన్ని ఆక్రమించింది అంటే అర్థం అక్కడ ఎర్ర సైనికులు ఎవ్వరూ ప్రాణాలతో లేరు అని. ఉత్తర స్టాలిన్ గ్రాడ్ పారిశ్రామిక ప్రాంతంలో - రెడ్ అక్టోబరు, స్టాలిన్ గ్రాడ్ ట్రాక్టర్, బారికేడ్ ఫాక్టరీల ప్రాంతంలో - అంత తీవ్రంగా సాగింది యుద్ధం.

ఇంతవరకూ జరిగిన యుద్ధంలో జర్మనీ కొంచెం ముందుకు పురోగమించగలిగింది కాని భయంకరమైన నష్టాలకు గురయింది. జర్మన్ దాడి బలహీన పడింది. రష్యన్ సైన్యంలో కూడా నష్టాలు చాలా ఎక్కువగానే ఉన్నాయి. కొన్ని డివిజన్లలో నష్టాలు 75 శాతం ఉన్నాయి. ఈ నష్టం పూడ్చడానికి చెప్పులు బాగు చేసేవారు, గుర్రాలను మేపే వారు, దర్జీలు, స్టోరు కీపర్లు - సైన్యంలో రకరకాల పనులు చేసేవారినందరినీ నది దాటించి యుద్ధ రంగానికి పంపడం జరిగింది. సరియైన శిక్షణ లేని ఈ సైనికులు వీధి యుద్ధాలలో త్వరలోనే ఆరితేరారు. మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో పాల్గొనడమనేది గొప్ప గౌరవనీయమైన విషయంగా భావించడం ఆ సమయంలో మొదలైంది.

అక్టోబరు 19, 20వ తేదీలలో కూడా జర్మన్ దాడులు కొనసాగాయి కాని తీవ్రత తగ్గింది. జర్మన్లు రిజర్వు సైన్యాలతో దాడి కొనసాగించి వోల్గా తీరానికి 400 గజాల సమీపానికి వచ్చారు. వోల్గా నది మీద ఆఖరి రేవు జర్మన్ మర తుపాకుల రేంజిలోకి వచ్చి వోల్గా మీద రవాణా ప్రమాదంలో పడింది. ఈ రేవును మర తుపాకుల దాడి నుండి కాపాడడానికి రాతితో అడ్డుగోడలు కట్టాల్సి వచ్చింది. భీకర పోరాటం జరుగుతున్నప్పుడు ఇలా అడ్డుగోడలు కట్టడం చాలా కష్టమయింది. అక్టోబర 30 నాటికి జర్మన్ దాడి బలహీనపడింది, కాని ప్రమాదం తొలగలేదు. నదీతీరంలో రష్యన్ అధీనంలో ఉన్న ప్రాంతాలు కొన్ని వందల గజాలకు కుచించుకుపోయాయి. తమ అధీనంలో ఉన్న ప్రదేశాల విస్తీర్ణాన్ని పెంచడానికి రష్యన్లు నవంబరులో మొదటి పదిరోజులూ రాత్రివేళల్లో కూడా దాడులు చేశారు కాని ఫలితం లేకపోయింది.

నవంబరు 7న అక్టోబరు విప్లవ దినోత్సవ సందర్భంగా ప్రసంగిస్తూ స్టాలిన్, 'మనం త్వరలోనే వేడుకలు జరుపుకుంటాం' (There is going to be a holiday in our street, too) అన్నాడు. స్టాలిన్ గూఢంగా అన్న ఈ మాటల అర్థం స్పష్టంగా తెలియకపోయినా స్టాలిన్ గ్రాడ్ లో ఏదో అతి ముఖ్యమైన పరిణామం సంభవించబోతోందన్న భావం ప్రతీవారిలోనూ కలిగింది.

నవంబరు 11న జర్మన్లు ఆఖరి దాడి ప్రారంభించారు. ఐదు మైళ్ళ పొడవు రంగంలో విమానాలు, టాంకుల సహాయంతో ఐదు జర్మన్ డివిజన్లు దాడి చేసి ఒక్క ఊపున వోల్గా చేరుకోవడానికి ప్రయత్నించాయి. కొన్ని ప్రదేశాలలో జర్మన్లు వోల్గాకు 100 గజాల సమీపం వరకూ రాగలిగారు కాని నవంబరు 12 మధ్యాహ్నానికి జర్మన్ దాడి నీరసించి పోయింది. ఈ దాడి తీవ్రంగా సాగింది కాని జర్మనీ అక్టోబరులో ఉన్నంత బలంగా లేదు. అక్టోబరులో రోజుకు 3000 దాడులు చేసిన జర్మన్ వైమానిక దళం నవంబరులో వెయ్యి దాడులు మాత్రమే చెయ్యగలిగింది.

శీతాకాలం సమీపిస్తున్నప్పటికీ జర్మన్ హై కమాండు స్టాలిన్ గ్రాడ్ లో పోరాడుతున్న తమ సైనికులకు వెచ్చని దుస్తులు ఇవ్వలేదు. శీతాకాలం దుస్తులు సరఫరా చేసినట్లయితే, ఈ పోరాటం శీతాకాలానికి ముందు ముగిసే అవకాశం లేదని హై కమాండు భావిస్తోందని సైనికులు అధైర్యపడతారనే ఉద్దేశంతో, సైన్యానికి వెచ్చని దుస్తులు తీసుకు వస్తున్న రైళ్ళను వివిధ రైల్వే స్టేషన్లలో నిలిపి వేశారు. స్టాలిన్ గ్రాడ్ ప్రాంతంలో శీతాకాలం దుర్భరంగా ఉంటుంది. ఉష్ణోగ్రత - 15 సి నుండి - 40 సి దాకా ఉంటుంది. - 40 సి ఉన్నప్పుడు ఊపిరి పీల్చడం కష్టమవుతుంది. చేతి తొడుగుల మీద ఊపిరి వదలినట్లయితే వెంటనే గడ్డకట్టి మంచుపొర ఏర్పడుతుంది. బ్రెడ్, గుడ్లు, ఆహారం - అంతా రాళ్ళలా బిగుసుకుపోతుంది. అటువంటి దుర్భర వాతావారణంలో జర్మన్ సైన్యం శీతాకాలం దుస్తులు

Edit with WPS Office
లేకుండా పోరాడవలసి వచ్చింది.

జూన్ నుంచి నవంబరు దాకా జరిగిన యుద్ధంలో వోల్గా-డాన్-స్టాలిన్ గ్రాడ్ ప్రాంతంలో జర్మనీ 7 లక్షల సైన్యాన్ని నష్టపోయింది. 1000 టాంకులు, 2000 ఫిరంగులు, మోర్టార్లు, 1400 విమానాలూ నష్టపోయింది. (G. Zhukov, Reminiscences and Reflections, Vol. 2, P. 103). జర్మన్ సైన్యానికి తోడుగా స్టాలిన్ గ్రాడ్ రంగంలో పోరాడుతున్న రుమేనియన్, హంగేరియన్, ఇటాలియన్ సైన్యాలకు తమ దుస్థితి అర్థం కాసాగింది.

స్టాలిన్ గ్రాడ్ యుద్ధం ప్రారంభమై నాలుగునెలలయింది. ప్రపంచమంతా ఊపిరి బిగబట్టి ఈ యుద్ధం ఎలా పరిణమిస్తుందా అని ఎదురు చూస్తోంది. ఈ స్టాలిన్ గ్రాడ్ రక్షణ యుద్ధంతో జర్మనీ-రష్యాల మధ్య యుద్ధంలో మొదటి దశ పూర్తయినట్లు భావించవచ్చు.

ఈ దశ అంతా సోవియట్ యూనియన్ కు గడ్డుకాలం. జర్మనీ గణనీయమైన భాభూగాలనూ వనరులనూ వశం చేసుకుంది. నవంబరు 1942 నాటికి రష్యాలో 7 లక్షల మైళ్ళ భూభాగాన్ని జర్మనీ ఆక్రమించింది. ఈ భూభూగంలో 8 కోట్లమంది రష్యన్లు నివసిస్తున్నారు. ప్రపంచంలో ఎదురులేదని విర్రవీగుతున్న శత్రువుతో పోరాడుతూ రష్యన్ సైన్యం పాఠాలు నేర్చుకుంది. సోవియట్ సుప్రీం కమాండు, జనరల్ స్టాఫ్, యుద్ధ రంగంలోని కమాండర్లూ శత్రువు దాడి చేసినప్పుడు ఎదుర్కోవడంలోనూ, శత్రువు బలహీనంగా ఉన్నప్పుడు ఎదురు దాడి చెయ్యడంలోనూ అనుభవం గడించారు. దేశమంతా ఒక యుద్ధ రంగం అయింది. పార్టీ, ప్రజల అవిరామ కృషి ఫలితంగా 1942లో సోవియట్ బలగాలకు 21,000 విమానాలు, 24000 టాంకులు అందాయి. 1942 అంతానికి స్వయం చలిత ఫిరంగుల నిర్మాణం పెద్ద ఎత్తున ప్రారంభమైంది. 1942 నవంబరు అంతానికి జర్మనీ 25 లక్షల సైన్యాన్ని నష్టపోయింది. నాశనమైన ఈ సైన్యం అగ్రగామి సైన్యం. జర్మనీ ఈ నష్టాన్ని పూడ్చగల స్థితిలో లేదు.

స్టాలిన్ గ్రాడ్ సైన్యానికి సరఫరాలు అందించడంలో రవాణా కార్మికులు - రైల్వే కార్మికుల, లారీ డ్రైవర్ల పాత్ర మరువరానిది.

1942 సంవత్సరంలో లారీల ద్వారా 27 లక్షలమంది సైనికుల్ని, 1,23,00,000 టన్నుల సామగ్రిని, 1923 టాంకులను, 3674 ఫిరంగులను చేరవేయడం జరిగింది. రవాణా విమానాలు 1,58,000 మంది క్షత గాత్రులతో సహా 5,32,000 మందిని తరలించాయి. ఒకటిన్నర సంవత్సరాల యుద్ధకాలంలో రైల్వేలు 63,50,000 వేగన్ లోడుల సైనిక సామగ్రిని రవాణా చేశాయి. 1,13,000 వేగన్ల మందుగుండు, 60,000 వేగన్ల ఆయుధాలు, సామగ్రి, 2,10,000 వేగన్ల చమురూ సైన్యానికి అందించాయి.

జర్మన్లు నిరంతరం స్టాలిన్ గ్రాడ్ కు పోయే రైలు మార్గాల మీద విమాన దాడులు చేసేవారు. ప్రతీ కిలోమీటరు రైలు మార్గం మీద సుమారు 16 బాంబులు పడ్డాయి. రైల్వే కార్మికులు విమాన దాడులలో నష్టమయిన మార్గం మరమ్మత్తు చెయ్యడానికి సిద్ధంగా ఉండేవారు. రైలు మార్గం పొడవునా రైలు పట్టాలు పేర్చి ఉంచేవారు. బాంబు దాడులలో మార్గం ధ్వంసమైతే వెంటనే మరమ్మత్తు చేసేవారు. ఎప్పుడూ కూడా దాడులు జరిగిన తర్వాత రెండు గంటలు మించి రాకపోకలు నిలిపోవడం జరుగలేదు. ఐదు నెలలలోనూ వేల రైళ్ళు ప్రయాణం చేశాయి. రవాణా అయిన సామగ్రితో పోల్చి చూస్తే విమాన దాడులలో నష్టపోయినది తక్కువే అని చెప్పవచ్చు.

స్టాలిన్ గ్రాడ్ కు దారి తీసే రోడ్ల మీద రాకపోకలు రాత్రింబవళ్ళు జరిగేవి. రోడ్డు పక్కగా 'ట్రెంచి' 'వెచ్చబడడానికి గది' అని రాసి ఉన్న బోర్డులుండేవి. జర్మన్ విమాన దాడి జరిగినప్పుడు సైనికులు ట్రెంచిలలో రక్షణ తీసుకునే వారు. దుర్భరమైన రష్యన్ శీతాకాలంలో ప్రయాణిస్తున్న సైనికులు వెచ్చబడడానికి అక్కడక్కడ భూగర్భంలో గదులుండేవి. అందులో మండే పొయ్యి ఉండేది. ఆ గదులలో చలిలో గడ్డకట్టుకు పోతున్న సైనికులు కొంచెం సేపు వెచ్చబడేవారు. ఈ మార్గం మీద జర్మన్ విమానాలు బాంబులతో దాడులు చేస్తూ, మర తుపాకులతో కాల్పులు జరుపుతుండేవి. ఈ దాడుల్లో సైనికులలో, గుర్రాలలో నష్టం అధికంగా ఉండేది. ఆగస్టు తర్వాత ఈ రోడ్డు మీద పోయే రవాణాకు రష్యన్ ఫైటరు విమానాలు రక్షణ ఇవ్వడం ప్రారంభించడంతో పరిస్థితి కొంచెం మెరుగైంది.

వోల్గా నది గడ్డకట్టడానికి ముందు రవాణా అంతా పడవలలో జరిగింది. వోల్గా నది నీరు గడ్డకట్టడం ప్రారంభించినప్పుడు స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న సైన్యాలకు సామగ్రి అందించడం కష్టమైంది. నీరు గడ్డ కట్టడం వలన పడవల ప్రయాణం ఆగిపోయింది. మంచు మందం తక్కువగా ఉండడం వలన గుర్రపు బళ్ళు, లారీలు ప్రయాణం చెయ్యలేకపోయేవి. పలచటి మంచపొరమీద వందలమంది సైనికులు

Edit with WPS Office
తమ నడుంకి మందుగుండు ఉన్న పెట్టెలు ఒకటి, రెండు కట్టుకుని, మైలు దూరం పొట్ట మీద పాకుతూ అవతలి ఒడ్డుకు వెళ్ళేవారు. నీరు గడ్డకట్టిన తర్వాత గుర్రపు బళ్ళు, లారీలు నడవడం ప్రారంభమైంది. పాంటూన్ వంతెనలు నిర్మించిన తర్వాత టాంకుల లాంటి భారీ వాహనాలు కూడా అవతలి ఒడ్డుకుచేరవేశారు.

ఇంతవరకూ స్టాలిన్ గ్రాడ్ రంగంలో రక్షణ యుద్ధాలలో జర్మన్లను బలహీన పరచిన రష్యన్లు నవంబరు 19న కొత్త సైన్యాలతో పెద్ద ఎత్తున జర్మన్ల మీద దాడి చేశారు.

రష్యన్ ఎదురుదాడి

రష్యన్ వ్యూహం, శత్రువును రక్షణ యుద్ధాలలో బలహీన పరుస్తూ ఎదురు దాడికి కొత్త సైన్యాలనూ ఆయుధ సంపత్తినీ జాగ్రత్తగా సమీకరించడం, అనుకూల పరిస్థితులలో శత్రువుపై చావు దెబ్బ తియ్యడం. 1941లో జర్మన్ సైన్యాలను సరిహద్దునుంచి మాస్కో దాకా జరిగిన అనేక పోరాటాలలో బలహీన పరచి, మాస్కో దగ్గర రష్యన్ సైన్యం ఎదురు దాడి చేసింది. కాని తగినంత సైనిక, ఆయుధ బలగం లేక ఆ దాడి అనుకున్న ఫలితాలను సాధించలేక పోయింది.

స్టాలిన్ గ్రాడ్ రంగంలో కూడా ఇదే వ్యూహాన్ని ఎర్ర సైన్యం అనుసరించింది. జులై నుంచి నవంబరు 19 దాకా రష్యన్ సైన్యం జర్మన్ సైన్యాన్ని రక్షణ యుద్ధాలలో బలహీన పరుస్తూ వచ్చింది. ఈ లోగా బ్రహ్మాండమైన ఎదురు దాడికి సైన్యాలనూ ఆధునిక ఆయుధాలనూ విమానాలనూ సమీకరించసాగింది. జర్మన్లు బలహీనపడ్డారని స్పష్టమైన తర్వాత స్టాలిన్ కొత్తగా సమకూర్చిన ఈ సైన్యంతో నవంబరు 19న జర్మన్ సైన్యాల మీద దాడి చేశాడు.

దక్షిణాన స్టాలిన్ గ్రాడ్ రక్షణ యుద్ధం జరుగుతున్నప్పుడు మధ్య రంగం మాస్కోలో ఒక విషయం జర్మన్ జనరల్స్ ను కొంచెం కలవరపరిచింది. కొత్త రష్యన్ సైన్యాలు కొంతకాలం యుద్ధరంగంలో కనుపించి అదృశ్యమవుతూ వచ్చాయి. ఈ సైన్యాలు యుద్ధరంగంలో అనుభవం సంపాదించిన తర్వాత రిజర్వు సైన్యాలుగా యుద్ధరంగం నుంచి అదృశ్యమవుతున్నాయని జర్మన్లు ఊహించారే కాని ఇదంతా స్టాలిన్ గ్రాడ్ రంగంలో ఎదురు దాడి ప్రణాళికలో భాగమని గ్రహించలేకపోయారు. ఎంత పెద్ద ఎత్తున రష్యా రిజర్వు సైన్యాలను ఏర్పాటు చేస్తున్నదీ జర్మన్లకు అసలే అంతుబట్టలేదు. ఈ రిజర్వు సైన్యాలు మధ్య రంగంలోనే, మాస్కో ప్రాంతంలోనే ఉన్నాయనీ, వాటి నుంచి జర్మన్ సైన్యానికి అంత ప్రమాదం లేదనీ భావించారు. సెప్టెంబరులో స్టాలిన్ గ్రాడ్ ప్రాంతంలో జర్మన్ వైమానిక బలగం ఆకాశాన్నేలుతున్న సమయంలో రష్యన్లు తమ నూతన వైమానిక బలగాలను యుద్ధ రంగంలో జర్మన్ విమానాలతో పోరాడడానికి వినియోగించకుండా, ఎదురు దాడికి స్టాలిన్ గ్రాడ్ కు ఉత్తర, దక్షిణాలలో కేంద్రీకరించారు.

జులై నుంచి జర్మన్లు స్టాలిన్ గ్రాడ్ వైపు పురోగమిస్తుంటే స్టాలిన్ గ్రాడ్ వద్ద ఒక నిర్ణయాత్మక యుద్ధం జరుగుతుందని ప్రపంచానికి అనిపించేది. అందరూ ఊహించినట్లుగానే స్టాలిన్ గ్రాడ్ వద్ద ఒక రష్యన్ తుఫాను విరుచుకు పడింది. రష్యన్లు పెద్ద ఎత్తున జర్మన్ సైన్యాలపై దాడి చేసి స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న జర్మన్ సైన్యాన్ని చుట్టుముట్టారు.

ఈ రష్యన్ దాడిలో ప్రధానాంశాలు:

1. స్టాలిన్ గ్రాడ్ యుద్ధ రంగంలో రష్యన్ సైనికులు 10,50,000 ఉన్నారు. జర్మన్ సైన్యం కూడా అంతే ఉంది. రష్యాకు 900 టాంకులు, 13000 ఫిరంగులు, 1100 విమానాలు ఉంటే జర్మనీకి 700 టాంకులు, 10000 ఫిరంగులు, 1200 విమానాలూ ఉన్నాయి. ఐతే ఎదురుదాడి జరిగిన రంగాలలో రష్యన్లు మూడు రెట్ల సైన్యాన్నీ నాలుగు రెట్ల ఆయుధాలనూ సమీకరించారు. ఈ ఆయుధాలన్నీ రష్యాలో తయారైనవే.
2. రష్యన్లు ఆత్మ విశ్వాసంతో ఉన్నారు.
3. స్టాలిన్, ఝుకోవ్, వాసిలేవస్కీ లు యుద్ధ రంగంలో ఉన్న కమాండర్లతో సంప్రదించి ఈ యుద్ధ తంత్రాన్ని రచించారు.
4. దాడికి ఏర్పాట్లు అత్యంత రహస్యంగా జరిగాయి. దాడి ప్రారంభమవడానికి వారం ముందు యుద్ధరంగంలో ఉన్న సైనికులతో ఉత్తర ప్రత్యుత్తరాలను నిలుపు చేయడం జరిగింది. సైన్యానికి సామగ్రిని రవాణా చెయ్యడానికి 27000 ట్రక్కులు

Edit with WPS Office

ఉపయోగించబడ్డాయి. ప్రతీ రోజూ 1300 వేగన్ల సరఫరా స్టాలిన్ గ్రాడ్ రంగం చేరేది. నవంబరు 1 నుంచి 19 వరకూ, 1,60,000 మంది సైనికులనూ, 10,000 గుర్రాలనూ, 430 టాంకులనూ, 600 ఫిరంగులనూ 14,000 ట్రక్కులనూ, 7,000 టన్నుల మందుగుండునూ వోల్గా నది దాటించడం జరిగింది. స్టాలిన్ గ్రాడ్ యుద్ధానికి రష్యా 11 సైన్యాలు, టాంకు సైన్యాలు, 13500 ఫిరంగులు, 1100 విమాన విధ్వంసక శతఘ్నులు, 900 టాంకులు, 1115 విమానాలనూ కేంద్రీకరించినా - ఇంత పెద్ద ఎత్తున సైన్యాల కదలిక జర్మన్లకు తెలియనే లేదు. ఈ రవాణా అంతా రాత్రి వేళ జరిగేది. వోల్గా నది మీద నిర్మించిన పాంటూన్ బ్రిడ్జీల ద్వారానూ పడవల ద్వారానూ దక్షిణానికి సైన్యాన్ని పంపించడం జరిగింది. ఈ వంతెనలను నాలుగైదు రోజుల్లో నిర్మించడం జరిగేది. ఇవి కూడా నిరంతరం జర్మన్ విమాన దాడులకు గురవుతుండేవి. స్టాలిన్ గ్రాడ్ కు ఉత్తర దిశలో డాన్ ప్రాంతంలో కొద్దిగా అడవులున్నాయి కాని స్టాలిన్ గ్రాడ్ దక్షిణ ప్రాంతం అంతా స్టెప్పీ మైదానం. అక్కడ సైన్యాన్ని రహస్యంగా దాచి ఉంచడం చాలా కష్టమయింది. అయినా రష్యన్లు తమ సైన్యాన్ని జర్మన్లకు కనుపించకుండా గ్రామాలలో దాచి ఉంచగలిగారు. జర్మన్లు రోజూ రైలు, రోడ్డు మార్గాల మీద తీవ్రంగా దాడులు చేస్తున్నప్పటికీ, జర్మన్ పహారా విమానాలు రష్యన్ సైన్యాల కదలిక మీద ఒక కన్ను వేసి ఉంచినప్పటికీ, ఎంత పెద్ద ఎత్తున సైనికులూ, ఆయుధాలూ స్టాలిన్ గ్రాడ్ రంగాన్ని చేరుతున్నదీ వారికి అంతుబట్టలేదు. వారి గూఢచారి శాఖ పూర్తిగా విఫలమైంది.

5. స్టాలిన్ గ్రాడ్ ఊబిలో లోలోతుకు దిగిపోతున్న జర్మన్ సైన్యం మరిన్ని బలగాలను నగరంలో కేంద్రీకరించింది. జర్మన్ సైనిక బలగాల కొరత కారణంగా జర్మన్లు నగరంలో పోరాడుతున్న తమ సైన్య పార్శ్వాల (flanks) రక్షణకు రుమేనియన్ సైన్యాన్ని ఉంచవలసి వచ్చింది. ఈ రుమేనియన్ సైన్యం ఒడెస్సా యుద్ధంలో బాగా పోరాడినా స్టాలిన్ గ్రాడ్ లో వారి మనో నిబ్బరం దెబ్బతింది. ఇది హిట్లర్ యుద్ధం కాని రుమేనియా యుద్ధం కాదు అన్న భావం వారిలో బలపడసాగింది. జర్మన్, రుమేనియన్ సైన్యాల మధ్య సంబంధాలు కూడా సంతృప్తికరంగా లేవు. రుమేనియన్ సైన్యం కాక పశ్చిమ ప్రాంతంలో ఇటాలియన్ సైన్యం ఉంది. వారి పోరాట పటిమ కూడా దెబ్బ తిని వారు కూడా అధైర్య పడి ఉన్నారు. రష్యన్లకు ఇదంతా తెలుసు.
6. జర్మన్ సైనిక నాయకత్వం తమ సైన్య పార్శ్వాలకు ఎదురవుతున్న ప్రమాదాన్ని గుర్తించినా రష్యన్ సైనిక శక్తి పట్ల వారికి ఉన్న చులకన భావం వలన, రష్యా తీవ్ర నష్టాలకు గురయిందనీ ఇంక అంతం కాబోతోందనీ భ్రమలో ఉండి ఈ ప్రమాదాన్ని చివరి వరకూ నిర్లక్ష్యం చేసింది.
7. శత్రువును గందరగోళ పరచడానికి రష్యన్లు మాస్కో రంగంలో దాడులను తీవ్రం చేశారు. దానితో నాజీ నాయకత్వం మాస్కో రంగంలోనే రష్యన్ దాడి జరుగుతుందని ఊహించి అక్కడ తన సైన్యాలను కేంద్రీకరించసాగింది.

స్టాలిన్ గ్రాడ్ యుద్ధ ప్రణాళిక రష్యన్ నాయకత్వం నిపుణతకు చిహ్నంగా నిలుస్తుంది. ఒకటి - రష్యన్ సైన్యాలకు శత్రువు కంటే ఆధిక్యతలేదు. స్టాలిన్ గ్రాడ్ ప్రాంతంలో జర్మన్, రష్యన్ బలగాలు సమానంగానే ఉన్నాయి. కాని దాడికి ఉద్దేశించిన ప్రాంతాలలో సైన్యాలను కేంద్రీకరించి రష్యన్లు ఆధిక్యతను సంపాదించారు. రెండు - రష్యన్లు ఎదురు దాడి చేసే ప్రాంతం వోల్గా, డాన్, చీరా లాంటి నదులు ప్రవహించే ప్రదేశం. ఈ నదీ పరీవాహక ప్రదేశాలలో దాడులు చెయ్యడం కష్టం. మూడు నదులు ప్రవహించే ప్రదేశంలో రష్యన్లు విజయవంతంగా దాడి చేశారు. మూడవది, అతి ముఖ్యమైనది - సాధారణంగా శత్రువు తిరోగమిస్తున్నప్పుడూ రక్షణ యుద్ధాలలో ఉన్నప్పుడూ చుట్టుముట్టి నాశనం చెయ్యడం జరుగుతుంది కాని స్టాలిన్ గ్రాడ్ లో తమ సైన్యం మీద దాడి చేస్తున్న బలమైన జర్మన్ సైన్యాన్ని రష్యన్లు చుట్టుముట్టారు. ఇది అసాధారణమైన విషయం.

స్టాలిన్ మరణానంతరం ఈ స్టాలిన్ గ్రాడ్ యుద్ధ తంత్రానికి రచయితలెవరు అన్న విషయం మీద వివాదం సృష్టించారు. స్టాలిన్ పాత్రను పూర్తిగా విస్మరిస్తూ పెద్ద ఎత్తున ప్రచారం మొదలైంది. కృశ్చేవ్ కాలంలో ఈ యుద్ధ తంత్రంలో కృశ్చేవ్ ప్రముఖ పాత్ర పోషించినట్లు ప్రచారం జరిగింది.

స్టాలిన్ గ్రాడ్ యుద్ధ తంత్ర రచనలో పాల్గొన్న వాసిలేవస్కీ చెప్పినది చూస్తే ఈ వివాదం గురించి

Edit with WPS Office
కొంత అవగాహన వస్తుంది - '....సెప్టెంబరు 12వ తేదీన మార్షల్ ఝుకోవ్ యుద్ధరంగం నుంచి మాస్కో వచ్చాడు. మరునాడు స్టాలిన్ మా ఇద్దరినీ పిలిచాడు.....దాన్, వోల్గా నదుల ప్రాంతంలో సోవియట్ బలగాల వీరోచిత ప్రతిఘటన వలన జర్మన్ సైన్యంలో అగ్రగామి అయిన 6వ సైన్యం స్టాలిన్ గ్రాడ్ లో పరిమిత యుద్ధరంగంలో దీర్ఘకాలిక యుద్ధం చెయ్యవలసి వస్తున్నదన్న సంగతి మాకు తెలుసు. ఈ సైన్య పార్శ్వాలలో యుద్ధం కొనసాగించాలనే ఆసక్తి లేని బలహీనమైన రుమేనియన్ సైన్యం ఉన్న కారణంగానూ వెనుక జర్మన్ రిజర్వు సైన్యాలు లేకపోవడం వలనా (స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న) జర్మన్ సైన్యం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిలో ఉంది..... జర్మన్ సైన్య పార్శ్వాలలో ఉన్న ఈ రుమేనియన్ సైన్యం మీద బలమైన దాడి చెయ్యాలన్న విషయంలో మాకేమీ సందేహం లేదు.....(ఈ సమావేశంలో) స్టాలిన్ గ్రాడ్ ప్రాంతంలో చెయ్యబోయే దాడి 1942-43 శీతాకాల యుద్ధంలో ప్రధానమైన దాడిగా నిర్ణయించబడింది. పార్టీ, ప్రభుత్వమూ సోవియట్ ప్రజలందరినీ ఈ దాడికి సంసిద్ధం చెయ్యాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. నవంబరు ప్రాంతంలో ఈ దాడి జరగాలని తాత్కాలికంగా నిర్ణయించడం జరిగింది....ఈ ప్రాథమిక నిర్ణయాలను తీసుకున్న తర్వాత ఎదురు దాడికి సంబంధించిన సమస్యలన్నింటినీ అధ్యయనం చెయ్యడానికి స్టాలిన్ నన్నూ, ఝుకోవ్ నూ యుద్ధరంగానికి వెళ్ళమని ఆదేశించాడు.....అంగీకరించిన ఈ పథకం గురించి పీపుల్స్ కమిస్సారియేట్ ఆఫ్ డిఫెన్సులో కాని, యుద్ధరంగంలో ఎవ్వరికి గాని, సమయానికి ముందు చెప్పకూడదని స్టాలిన్ హెచ్చరించాడు....' - (Two hundred days of fire - Accounts by Participants and Witnesses of the Battle of Stalingrad - P. 28-30).

స్టాలిన్ గ్రాడ్ లో భారీ ఎత్తున జరగబోయే ఈ యుద్ధ ప్రణాళిక కేవలం స్టాలిన్ గ్రాడ్ రంగంలో ఉన్న సైన్యాల బలాబలాల మీదే ఆధారపడి ఉండదు. ఆర్థిక పరిస్థితి, వనరుల పరిస్థితి, యుద్ధ పరిశ్రమల ఉత్పత్తి స్థితి, రవాణా సౌకర్యాలూ - ఇవన్నీ లెక్కలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పరిమిత యుద్ధరంగంలో ఉన్న వారెవరూ అటువంటి ప్రణాళికను రచించలేరు. అన్ని యుద్ధ రంగాలనుంచి వస్తున్న సమాచారాన్నీ గూఢచారి శాఖల ద్వారా వస్తున్న సమాచారాన్నీ సమీక్షించి శత్రువు శక్తి సామర్థ్యాలూ ఉద్దేశాలూ ఏమిటో అంచనా వేసి, యుద్ధరంగంలోని కమాండర్ల, వివిధ సైన్యాల అభిప్రాయాలు సేకరించి, అన్నింటినీ సమన్వయపరిచే సంస్థ - అంటే స్టాలిన్ నాయకత్వాన ఉన్న సుప్రీం హెడ్ క్వార్టర్సు, జనరల్ స్టాఫ్ - మాత్రమే ఇటువంటి ప్రణాళిక వెయ్యగలదు. స్టాలిన్ గ్రాడ్ యుద్ధ తంత్రాన్ని ఎవరు రచించగలరు అన్న ప్రశ్నకు సమాధానం స్పష్టమే.

నవంబరు 19 ఉదయం 7.30 గంటలకు స్టాలిన్ గ్రాడ్ నగరానికి 70 మైళ్ళ దూరంలో నైరుతి దిక్కున ఉన్న రుమేనియన్ సైన్యం మీద ఫిరంగి గుళ్ళూ, కాట్యూషా రాకెట్ల వర్షంతో రష్యన్ ఎదురుదాడి ప్రారంభమైంది. రెండు గంటల ఫిరంగి కాల్పుల తర్వాత రష్యన్ సైన్యం, టాంకులూ యుద్ధరంగంలో ప్రవేశించాయి. వాతావరణం అనుకూలంగా లేకపోవడం వలన రష్యన్ వైమానిక బలగం యుద్ధంలో పెద్ద పాత్ర నిర్వహించలేదు. రుమేనియన్ సైన్యం భయకంపితులై యుద్ధరంగం నుంచి పారిపోయింది లేదా లొంగిపోయింది. రుమేనియన్ సైన్యం వెనుకనున్న జర్మన్ సైన్యం ప్రతిఘటించింది కాని నిలవలేకపోయింది. ఎర్రసైన్యం జర్మన్ రక్షణ రేఖలో గండి కొట్టి దక్షిణ దిశకు చొచ్చుకుపోయి ప్లాను ప్రకారం నవంబరు 22వ తేదీన కలాచ్ పట్టణాన్ని స్వాధీనం చేసుకుంది. 30000 మంది శత్రు సైనికులు పట్టుబడ్డారు. మరొక ఎర్ర సైన్యం దక్షిణ దిశనుండి నవంబరు 20న దాడి ప్రారంభించి నవంబరు 23న సోవిట్ స్కీ చేరింది. మూడు రోజుల యుద్ధంలో రుమేనియన్ సైన్యాలను తుడిచి వేసి, జర్మన్ సైన్యాల ప్రతిఘటనను అధిగమించి 125 మైళ్ళు పురోగమించి, నవంబరు 23 సాయంత్రం నాలుగు గంటలకు ఉత్తర, దక్షిణ దిశల నుండి దాడి చేసిన ఈ రెండు రష్యన్ సైన్యాలు కలాచ్ పట్టణం దగ్గర సోవిట స్కీ వద్ద కలుసుకున్నాయి. ఈ కలాట్ పట్టణం స్టాలిన్ గ్రాడ్ వెనుక 70మైళ్ళ దూరంలో ఉంది. దీనితో స్టాలిన్ గ్రాడ్ లోని జర్మన్ సైన్యం రష్యన్ వలయంలో చిక్కుకుంది.

ఈ యుద్ధం జరిగిన కొన్ని రోజుల తర్వాత యుద్ధరంగాన్ని దర్శించిన యునైటెడ్ ప్రెస్ విలేఖరి ఇలా వర్ణించాడు:

'....రైలు మార్గం మీద భారీ ఎత్తున సైనికుల, ఆయుధాల రవాణా విరామం లేకుండా జరుగుతోంది. రాత్రివేళల్లో ఇది మరీ ఎక్కువగా ఉంది.....రష్యన్లు గొప్ప ఆత్మ విశ్వాసంతో ఉన్నారు. మాస్కో యుద్ధంలో ఇటువంటి ఆత్మ విశ్వాసం వాళ్ళలో కనుపించలేదు.....యుద్ధరంగం వెనుక రుమేనియన్ సైనికులు జర్మన్లను తిడుతూ, ఎక్కడ తిండి దొరుకుతుందా అని చూస్తూ, స్టేప్పీలలో దిక్కు

Edit with WPS Office
తోచక తిరుగుతున్నారు. ఖైదీలుగా తీసుకోమని రష్యన్లను బతిమాలుతున్నారు.....స్టాలిన్ గ్రాడ్ సమీపించిన కొలదీ జర్మన్ ఖైదీలు కనుపించసాగారు....ఎక్కడ చూసినా గుర్రాల శవాలు.....రష్యన్ దాడిలో ఇక్కడ పదివేల గుర్రాలు చనిపోయాయి. స్టెప్పీ అంతా నాశనమైన టాంకులూ గన్నులూ వాహనాలతోనూ, రుమేనియన్, జర్మన్ సైనికుల శవాలతోనూ నిండి ఉంది.....స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న జర్మన్ సైన్యానికి ఆహారం, ఇంధనం, ఆయుధాలు తీసుకు వస్తున్న జర్మన్ విమానాలను రష్యన్లు పిట్టల్లా కూల్చి వేస్తున్నారు.....స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న జర్మన్లకు ఆహారం కొరత ప్రారంభమైంది. వాళ్ళు గుర్రాలను చంపి తింటున్నారు.....ఖైదీలుగా పట్టుబడ్డ జర్మన్ సైనికులు యువకులు.....వారిలో నాకు ఆఫీసర్లు ఎవరూ కనుపించలేదు..... - 30 డిగ్రీలున్న భయంకరమైన చలిలో వాళ్ళు మామూలు కోట్లు వేసుకుని ఉన్నారు. వాళ్ళ దగ్గర శీతాకాలపు దుస్తులు లేవు....అసలు ఏం జరిగినదీ వారికి అంతుబట్టినట్లు లేదు.....పిడుగు దెబ్బ తిన్న వారి వలె ఉలుకూపలుకూ లేకుండా ఉన్నారు..... '

ఈ యుద్ధంలో రుమేనియన్ సైన్యం లొంగిపోయింది. రుమేనియన్ సైన్య పరాజయం హిట్లర్, అతని మిత్ర దేశాల మధ్య సంబంధాల మీద చాలా ప్రభావాన్ని కలిగించింది. స్టాలిన్ గ్రాడ్ లో రుమేనియన్ సైన్య పరాజయం తర్వాత రుమేనియన్ సైన్యం ప్రత్యక్షంగా జర్మన్ పర్యవేక్షణలోకి వచ్చింది.

నాలుగున్నర రోజులలో స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న జర్మన్లను చుట్టుముట్టడం పూర్తయింది. అయితే ఈ వలయం బలహీనంగా ఉంది. తరువాతి కార్యక్రమం వలయాన్ని ఉక్కు వలయంగా చేసి స్టాలిన్ గ్రాడ్ నుంచి జర్మన్ సైన్యం బయటపడే అవకాశం లేకుండా చెయ్యడం.

రష్యన్లు మొదట స్టాలిన్ గ్రాడ్ లో 90,000 మంది జర్మన్లు చిక్కుకున్నారని అంచనా వేశారు. కాని వాస్తవానికి 3,30,000కు పైగా జర్మన్లు స్టాలిన్ గ్రాడ్ బోనులో ఇరుక్కున్నారు. ఈ సంఖ్య స్టాలిన్ గ్రాడ్ యుద్ధం పూర్తయిన తర్వాత స్పష్టమైంది. రష్యన్ ఎదురుదాడి మొదలైన తర్వాత స్టాలిన్ గ్రాడ్ పరిసర ప్రాంతంలో ఉన్న జర్మన్ సైన్యాలన్నీ స్టాలిన్ గ్రాడ్ నగరానికి తిరోగమించడంతో రష్యన్లు ఊహించిన దాని కంటే ఎక్కువమందే బోనులో పడ్డారు. రష్యాకు ఇది ఆశించిన దాని కంటే ఘన విజయమైంది.

స్టాలిన్ గ్రాడ్ లో చుట్టుముట్టబడిన జర్మన్ సైన్యం తన ముందున్న రష్యన్ సైన్యంతోనే కాకుండా వెనుకనుంచి దాడి చేసే రష్యన్ సైన్యంతో కూడా పోరాడవలసి వచ్చింది. ఇటువంటి పరిస్థితిలో జర్మనీకి మూడు దారులు మిగిలాయి. మెడ చుట్టూ ఉచ్చు బిగియక ముందే స్టాలిన్ గ్రాడ్ ను వదలి ఎంత త్వరగా వీలు పడితే అంత త్వరగా పలాయన చెయ్యడం, లేదా స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న సైన్యానికి విమానాల ద్వారా సరఫరాలు అందించడం, లేదా సహాయక సైన్యాన్ని పంపించి స్టాలిన్ గ్రాడ్ సైన్యాన్ని బోనులోనుంచి తప్పించడం.

స్టాలిన్ గ్రాడ్ నగరం ఇచ్చే రక్షణ వదలి భయంకరమైన శీతాకాలంలో ఇంధనం, మందుగుండు, వెచ్చని దుస్తులు లేకుండా తిరోగమిస్తే, బలమైన రష్యన్ సైన్యాలు తరుముకు వస్తుంటే, తిరోగమనం త్వరలోనే పలాయనంగా మారి మొత్తం సైన్యం అంతా నాశనమయ్యే ప్రమాదం ఉంది. అందుచేత జర్మన్ సైనిక నాయకత్వం ఊగిసలాడింది. మరో కారణం స్టాలిన్ గ్రాడ్ ను విడిచిపెట్టడం హిట్లర్ కు అంగీకారం కాదు.

రెండవది - విమానాల ద్వారా స్టాలిన్ గ్రాడ్ సైన్యానికి సరఫరాలు అందించడం. జర్మన్ సైనిక నాయకత్వానికి కూడా ఎంతమంది స్టాలిన్ గ్రాడ్ లో చిక్కుకున్నారో సరిగా అంచనా లేదు. దాదాపు మూడు లక్షల మంది ఉన్నారని అంచనా వేసింది. ఈ సైన్యానికి రోజుకు 600 టన్నుల సామగ్రి కావాలి. జర్మన్ రవాణా విమానాలు ఇంత సామగ్రిని రోజూ స్టాలిన్ గ్రాడ్ కు చేరవేయలేవు. కాని జర్మన్ ఎయిర్ మార్షల్ గొయిరింగ్ జర్మన్ సైన్యానికి అవసరమైనదంతా విమానాల ద్వారా సరఫరా చేస్తానని వాగ్దానం చేశాడు. వసంతకాలం దాకా అవసరమైన సరఫరాలు విమానాల ద్వారా అందజేయగలిగితే, వసంతకాలంలో జర్మన్ సైన్యం ఎదురు దాడి చేసి స్టాలిన్ గ్రాడ్ సైన్యాన్ని విముక్తి చెయ్యవచ్చునన్న ఆలోచన ఉంది హిట్లరు కు.

మూడవది - భూమార్గం ద్వారా స్టాలిన్ గ్రాడ్ సైన్యానికి సహాయం అందించడం. స్టాలిన్ గ్రాడ్ లో చిక్కుకున్న జర్మన్ సైన్య సహాయానికి ఫీల్డ్ మార్షల్ వాన్ మాన్ స్టీన్ నాయకత్వంలో సైన్యాన్ని పంపించడానికి హిట్లర్ ప్రయత్నించాడు. అందుకోసం ఫ్రాన్స్ నుండీ జర్మనీ నుండీ సైన్యాలను తరలించాడు. మాన్ స్టీన్ రెండు సైన్యాలతో - ఒకటి కోటిల్నికోవో నుంచి, మరొకటి తార్మాసిన్ నుంచి -

Edit with WPS Office
స్టాలిన్ గ్రాడ్ వైపుకు పురోగమించడానికి ప్లాను వేశాడు. కాని జర్మనీకి రెండు రంగాలనుంచి దాడి చెయ్యడానికి తగిన సైన్యం లేదు. వారు తీసుకు రాదలచిన సైన్యం కూడా దీర్ఘ రవాణా మార్గాల ద్వారా దూరం నుంచి రావాల్సి వస్తోంది. ప్రయాణం చేసే ఈ జర్మన్ సైన్యాల గమ్యం ఏమిటో పార్టిజాన్లకు తెలుసు. జర్మన్ సైన్యం స్టాలిన్ గ్రాడ్ వైపు ప్రయాణించకుండా రైళ్ళ మీదా, రోడ్ల మీదా, అన్ని రవాణా మార్గాల మీదా పార్టిజాన్లు దాడులను తీవ్రం చేశారు. జర్మన్ సైన్యంతో నిండి ఉన్న అనేక రైలుబళ్ళను పట్టాలు తప్పించారు, ధ్వంసం చేశారు. పార్టిజాన్ దాడుల వలన జర్మన్లు అనుకున్న ప్రకారం సైన్యాన్ని కేంద్రీకరించలేక పోయారు. అన్ని సైన్యాలు వచ్చేదాకా ఆగకుండా ఉన్న సైన్యాలతోనే దాడి ప్రారంభించమని హిట్లర్ ఫీల్డ్ మార్షల్ మాన్ స్టీన్ ను ఆదేశించాడు. అందుచేత మొదట ఉద్దేశించిన విధంగా రెండు ప్రదేశాలనుంచి కాక స్టాలిన్ గ్రాడ్ కు 75 మైళ్ళ దూరంలో ఉన్న కోటోల్నికోవో నుంచి మాత్రమే డిసెంబరు 12న మాన్ స్టీన్ సైన్యం దాడి ప్రారంభించగలిగింది. స్టాలిన్ గ్రాడ్ బోనులో ఉన్న సైన్యానికి 3000 టన్నుల సరఫరాలు అందించడానికి ఈ సైన్యం వెనుక వేల లారీలు, ట్రాక్టర్లు, బస్సులూ కదిలాయి.

స్టాలిన్ గ్రాడ్ లో చిక్కుకున్న జర్మన్ సైన్యాలను అంతం చేసే కార్యక్రమాన్ని వాయిదా వేసి మాన్ స్టీన్ సైన్యాన్ని నాశనం చెయ్యడం ప్రధమ కర్తవ్యంగా రష్యన్ కమాండు నిర్ణయించింది.

మాన్ స్టీన్ మూడు రోజులలో 30 మైళ్ళు పురోగమించాడు. డిసెంబరు 15న ఆక్సాయ్ నది దాటాడు. కాని నది దాటిన తర్వాత రష్యన్ ప్రతిఘటన తీవ్రమైంది. జర్మన్ పురోగమనం మందగించింది. వందల విమానాల సహాయంతో డిసెంబరు 19 నాటికి జర్మన్ సైన్యం మైష్కోవా నదిని సమీపించింది. స్టాలిన్ గ్రాడ్ దారిలో ఇది ఆఖరి ప్రకృతి సహజమైన అవరోధం. ఇంక స్టాలిన్ గ్రాడ్ 25 మైళ్ళ దూరంలో మాత్రమే ఉంది. రాత్రి వేళ్ళల్లో స్టాలిన్ గ్రాడ్ నగర కాంతి జర్మన్లకు కనుపించేది.

మాన్ స్టీన్ సైన్యం ఆ నగర కాంతిని మాత్రమే చూడగలిగింది.

మాలినోవస్కీ 2వ గార్డు సైన్యం మంచు తుఫానులో రోజుకు 30 మైళ్ళు మార్చి చేస్తూ 125 మైళ్ళు విరామం లేకుండా ప్రయాణం చేసి మైష్కోవా నది తీరం చేరుకుంది. అప్పటికే జర్మన్లు కొన్ని ప్రదేశాలలో నది దాటారు. రష్యన్లు కొన్ని రోజులు ఫిరంగి దళాల సహాయంతోనే పోరాడవలసి వచ్చింది. డిసెంబరు 24 న కాని టాంకు సహాయం అందలేదు. అంతవరకూ జర్మన్లను నిలుపు చేసి, 24వ తేదీన విమానాలు, టాంకుల సహాయంతో రష్యన్లు ఎదురు దాడి చేసి సహాయక జర్మన్ సైన్యాన్ని ఎక్కడనుంచి బయలుదేరిందో అక్కడికి, కోటోల్నికోవ్ కు, తరిమివేశారు. డిసెంబరు 29 నాటికి జర్మన్ సైన్యాన్ని కోటోల్నికోవ్ నుంచి మరో 60 మైళ్ళ దూరానికి తరిమివేశారు. ఈ యుద్ధంలో 16,000 మంది జర్మన్లు మరణించారు. టాంకులు, గన్నులు, వాహనాలలో అధిక భాగాన్ని జర్మనీ నష్టపోయింది.

ఈ లోగా మరొక రష్యన్ సైన్యం తార్మోసిన్ లో కేంద్రీకరించబడిన జర్మన్ సైన్యం మీద ముందు నుండీ వెనుక నుండీ దాడి చేసి 60,000 మంది జర్మన్లను ఖైదీలుగా పట్టుకుంది. మరో 60,000 మంది ఈ యుద్ధంలో మరణించారు. ఈ తార్మోసిన్ సైన్యం చాలా నష్టపడింది.

స్టాలిన్ గ్రాడ్ లో జర్మన్లు బతికి బయటపడడానికి నిజంగా అవకాశం ఉందో లేదో వివాదాస్పదమే, కాని డిసెంబరు 19-23ల మధ్య, ఆ ఆశ అణుమాత్రంగానైనా ఉన్న సమయంలో, మాన్ స్టీన్, స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న జనరల్ వాన్ పౌలస్ ఊగిసలాడారు. హిట్లర్ అనుమతి లేకుండా స్టాలిన్ గ్రాడ్ వదలడానికి వాన్ పౌలస్ అంగీకరించలేదు. విమానాల ద్వారా సరఫరాలు అందకపోతున్నా వాన్ పౌలస్ తన ప్రతిఘటన ద్వారా రష్యన్ సైన్యాన్ని స్టాలిన్ గ్రాడ్ నుంచి మరో చోటకు తరలకుండా చేస్తున్నాననీ ఆ విధంగా జర్మనీకి సహాయపడుతున్నాననీ కొంతకాలం భావించాడు.

నీరసించిన జర్మన్ సైన్యం స్టాలిన్ గ్రాడ్ నుంచి బయటపడే అవకాశమే లేదని మరికొంతమంది చరిత్రకారుల అభిప్రాయం. బోనులోంచి బయటపడే అవకాశం కనుపించినప్పుడు జర్మన్లు తెగించి పోరాడుతారనుకున్నప్పటికీ విమానాలతో, టాంకులతో రష్యన్ సైన్యం తరుముతుంటే, మంచుతో కూడిన స్టెప్పీలలో 50 కి. మీటర్ల తిరోగమనం పలాయనంగా మారి ఈ సైన్యం సర్వనాశనమయ్యేదని వారి అభిప్రాయం. అసలు హిట్లర్ ఈ ప్రయత్నం వలన ఏమి సాధించదలుచుకున్నాడో స్పష్టం కాదని కొంతమంది చరిత్రకారులు అంటారు. స్టాలిన్ గ్రాడ్ ను వదలడం అతనికి అంగీకారం కాదు. జర్మన్ సహాయక సైన్య లక్ష్యం స్టాలిన్ గ్రాడ్ లో చిక్కుకున్న జర్మన్ సైన్యం బయటపడడానికి ఒక మార్గం తెరవడమా? అదే లక్ష్యమైతే మాన్ స్టీన్ సైన్యం స్టాలిన్ గ్రాడ్ కు 25 మైళ్ళ సమీపానికి చేరుకున్న తరుణంలోనే స్టాలిన్ గ్రాడ్ లోని జర్మన్ సైన్యం తనకు సహాయంగా వస్తున్న సైన్యం దిశగా దాడి చేసి

Edit with WPS Office
దారి చేసుకుని దానితో కలిసి ఉండాల్సింది. అలా జరగలేదు. స్టాలిన్ గ్రాడ్ సైన్యానికి సరఫరాలు అందించేందుకు ఒక మార్గం తెరిచి ఉంచడం లక్ష్యమైతే ఆ మార్గం ఎంతోకాలం తెరవబడి ఉండదు. రష్యన్ల దాడికి గురయి త్వరలోనే మూసుకుపోతుంది. ఈ సహాయక ప్రయత్నంలో లక్ష్యంలో స్పష్టత కొరవడింది.

మాన్ స్టీన్ సైన్య పరాజయంతో స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న జర్మన్ల ఘోర పరాజయం నిశ్చయమైంది. ఇంక హిట్లర్ తమని కాపాడలేడని కమాండర్లకూ సైనికులకూ స్పష్టమైంది. వారిని నిరాశా నిస్పృహలు ఆవరించాయి. స్టాలిన్ గ్రాడ్ ను ఆక్రమించామని అహంభావంతో మౌత్ ఆర్గాన్లు వాయించుతూ సెప్టెంబరులో విజయ నృత్యం చేసిన జర్మన్ల కళ్ళ ముందు ఇప్పుడు మృత్యువు విలయ తాండవం చెయ్యసాగింది. వారి రోజువారీ రేషన్ 4 ఔన్సుల బ్రెడ్, కొంచెం గుర్రపు మాంసం మాత్రమే. సెప్టెంబరు, అక్టోబరు నెలలలో పగలూ రాత్రీ స్టాలిన్ గ్రాడ్ మీద అగ్ని వర్షం కురిపించిన జర్మన్ సైన్యం మందుగుండు కొరత వలన ప్రతీ సైనికుడికీ 25-30 తూటాలు మాత్రమే ఇవ్వగలిగింది. ఈ తూటాలు కూడా రష్యన్ సైన్యం దాడి చేసినప్పుడు మాత్రమే ఆత్మ రక్షణకు ఉపయోగించాలని ఆదేశమివ్వడం జరిగింది. సెప్టెంబరులో హారన్లు మ్రోగిస్తూ కార్లలో తిరిగిన జర్మన్లు స్నైపర్ల భయంతో ట్రెంచిల్లోంచి తలెత్తే వారు కాదు.

1943 జనవరి ఒకటవ తేదీకి స్టాలిన్ గ్రాడ్ లో పడమటినుంచి తూర్పుకు 44 మైళ్ళూ, ఉత్తరాన్నుంచి దక్షిణానికి 14 మైళ్ళు విస్తీర్ణం గల ప్రదేశం జర్మన్ సైన్యం చేతుల్లో మిగిలింది. ఆరు వారాలుగా ఈ జర్మన్ సైన్యం బయటి ప్రపంచాన్నుంచి వేరు చెయ్యబడింది. వారి దగ్గర ఉన్న నిలవలు అయిపోయే పరిస్థితి వచ్చింది. సైనికులకు తిండి లేదు. డిసెంబరు మధ్యలో జర్మన్లు అశ్విక దళాలలోని గుర్రాలను చంపి తినడం మొదలు పెట్టారు. జనవరు 10 నాటికి జర్మన్లు 39,000 గుర్రాలను చంపి తిన్నారు. వారి ఆసుపత్రులు గాయపడ్డవారితో నిండిపోయాయి. గాయాల తోనూ రోగాలతోనూ సైనికులు మరణించ సాగారు. రోజుకు 500 టన్నుల సామగ్రి విమానాల ద్వారా సరఫరా చేస్తానని హిట్లర్ వాగ్దానం చేశాడు. కాని డిసెంబరు అంతానికి రోజుకు వంద టన్నులు తీసుకు రావడమే కష్టమైంది. మాన్ స్టీన్ సైన్యం తరిమి వేయబడిన తర్వాత స్టాలిన్ గ్రాడ్ కు విమానాల ద్వారా రవాణా మరింత కష్టమైంది. స్టాలిన్ గ్రాడ్ కు అతి దగ్గరగా ఉన్న జర్మన్ విమానాశ్రయం 220 మైళ్ళ దూరంలో ఉంది. అంతదూరం నుంచి వచ్చే జర్మన్ రవాణా విమానాలను రష్యన్ విమానాలు వేటాడి కూల్చివేసేవి. నవంబరు 19 నుండి జనవరి 10 దాకా స్టాలిన్ గ్రాడ్ వద్ద రష్యన్లు 600 రవాణా విమానాలను కూల్చివేశారు. చాలా మంది జర్మన్ వైమానికులకు ఈ యాత్ర అంతిమ యాత్ర అయింది.

జనవరి 8న రష్యన్ సైన్యం జనరల్ పౌలస్ కు లొంగి పొమ్మని అల్టిమేటం ఇచ్చింది. లొంగిపోయేందుకు సాధారణంగా పెట్టే షరతులు విధించింది - ఆయుధాలూ మందుగుండూ రష్యన్లకు అప్పగించాలి. రష్యన్ సైన్యం యుద్ధం విరమించిన జర్మన్ ఆఫీసర్లకూ సైనికులకూ ఏ హానీ కలుగదని హామీ ఇస్తుంది. యుద్ధానంతరం వారిని జర్మనీకి కాని మరే దేశానికి కాని వెళ్ళడానికి అనుమతిస్తుంది. యుద్ధ ఖైదీలు వారి యూనిఫాం, పతకాలు, స్వంత సామగ్రి ఉంచుకోవచ్చు. ఖైదీలందరికీ ఆహారం, వైద్య సహాయం అందజేయపడుతుంది. జర్మన్ సైన్యం ఈ అల్టిమేటం ను నిరాకరించిన పక్షంలో ఎర్ర సైన్యం, ఎర్ర వైమానిక దళం జర్మన్ సైన్యాన్ని నాశనం చెయ్యాల్సి ఉంటుంది. ఈ నాశనానికి బాధ్యత జర్మన్ సైన్యం వహించాల్సి ఉంటుంది.' జనరల్ వాన్ పౌలస్ ఈ అల్టిమేటంను తోసిపుచ్చాడు.

జర్మనీ అల్టిమేటంను తోసిపుచ్చిన తర్వాత, జనవరి 10న 7.00 గంటలకు 7000 ఫిరంగులు మృత్యుసంగీతమాలాపిస్తుండగా రష్యన్ దాడి ప్రారంభమైంది. రష్యన్ విమానాలు జర్మన్ సైన్యం మీద బాంబుల వర్షం కురిపించాయి. ఒక గంట తర్వాత రష్యన్ పదాతి దళం, టాంకులూ దాడి ప్రారంభించి మొదటి రోజున 3-5 మైళ్ళు పురోగమించాయి. రష్యన్లు జర్మన్ ఖైదీలపై అత్యాచారాలు చేస్తున్నారని హిట్లర్ చేస్తున్న ప్రచారంతో భయభ్రాంతులైన జర్మన్ సైనికులు తెగించి పోరాడారు.

జనవరి 17న రష్యన్ కమాండు లొంగిపోవడానికి పౌలస్ కు మరో అవకాశమిచ్చింది. అప్పటికి జర్మన్ ఆక్రమణలో ఉన్న ప్రదేశం సగానికి కుచించుకు పోయింది. పౌలన్ లొంగ నిరాకరించాడు. జనవరి 21వ తేదీకి ఆఖరి జర్మన్ విమానాశ్రయాన్ని రష్యన్లు ఆక్రమించారు.

జనవరి 22న ఎర్రసైన్యం జర్మన్లను అంతం చేసే కార్యక్రమం ప్రారంభించింది. ప్రతీ ఆరు గజాలకు ఒక ఫిరంగి లేక మోర్టారు చొప్పున పధ్నాలుగు మైళ్ళ యుద్ధ రంగంలో 4,100 ఫిరంగులతో ఎర్ర సైన్యం దాడి చేసింది.

Edit with WPS Office
ఈ దాడిని జర్మన్ సైన్యం తట్టుకోలేకపోయింది.

జర్మన్ గూఢచార విభాగానికి చెందిన ఒక ఆఫీసరు తన జ్ఞాపకాలలో ఇలా రాశాడు:

'....యుద్ధరంగమంతటా మేము వెనుకంజ వెయ్యాల్సి వచ్చింది. ఇది క్రమ పద్ధతిలో జరిగే తిరోగమనం కాక పలాయనంగా పరిణమించింది. కొన్ని చోట్ల సైనికులు భయంతో పరుగులు తీశారు. అయితే మృత్యువు కూడా అంత వేగంగానూ తరుముకుంటూ వచ్చి అందుకునేది. మా మార్గమంతా శవాలతో నిండిపోయింది. మంచు దయతో ఈ శవాలను కప్పింది.....సైన్యం క్రమంగా చిన్న ప్రదేశంలోకి నెట్టబడసాగింది....'

ఈ సారి జర్మన్లకు వారి పరిస్థితి స్పష్టంగా తెలియవచ్చింది. చిన్న చిన్న గ్రూపులుగా రష్యన్లకు లొంగిపోవడం ప్రారంభించారు. కొన్ని చోట్ల రష్యన్లను తీవ్రంగా ప్రతిఘటిస్తూ వెనక్కు మళ్ళ సాగారు. అలా వెనక్కు మళ్ళుతూ గాయపడ్డ తమ సైనికులు రష్యన్ల చేతుల్లో పడకుండా కాల్చి చంపివేయసాగారు.

స్టాలిన్ గ్రాడ్ లో ఉన్న జర్మన్ సైనికుల్ని పోరాటం కొనసాగించమని హిట్లర్ ఆదేశిస్తూనే ఉన్నాడు. పౌలస్ ఫీల్డ్ మార్షల్ గా ప్రమోట్ చెయ్యబడ్డాడు. కాని జర్మన్ సైన్యం పూర్తిగా మనో నిబ్బరం కోల్పోయింది. రష్యన్లు ఆక్రమించక ముందు జర్మన్ అధీనంలో ఉన్న ఆఖరి విమానాశ్రయాన్నుండి పోరిపోవడానికి కొట్లాటలు జరిగాయి. కొంతమంది ఆఫీసర్లు సీటుకోసం విమాన చోదకులకు భారీ మొత్తాలను లంచంగా చెల్లించారు.

1943 జనవరి 31 తేదీకి హిట్లర్ ప్రభుత్వం పదేళ్ళు పూర్తి చేసింది. కాని ప్రతీ సంవత్సరం ప్రసంగిస్తున్నట్లు ఆ రోజున జర్మన్ ప్రజలను ఉద్దేశించి హిట్లర్ ప్రసంగించలేదు.

అదే రోజున రష్యన్లు యూనివర్ మేగ్ భవనంలోని ముందు భాగాన్ని ఆక్రమించారు. ఖైదీలుగా పట్టుకున్న జర్మన్ సైనికులను లెఫ్టెనెంట్ ఎల్చెంకో ప్రశ్నించగా ఆ భవనంలోనే పౌలస్ ఉన్నట్లు తెలిసింది. రష్యన్ దాడి జరుగుతుండగా ఒక జర్మన్ ఆఫీసరు తలుపు కొద్దిగా తెరిచి ఎల్చెంకోను లోపలికి పిలిచి, 'మా చీఫ్ మీ చీఫ్ తో మాట్లాడాలనుకుంటున్నారు' అన్నాడు. 'మా చీఫ్ కు ముఖ్యమైన పనులున్నాయి. మీరు మాట్లాడాలంటే నాతోటే మాట్లాడాలి' అన్నాడు ఎల్చెంకో. ముగ్గురు సైనికులను తోడు తీసుకుని ఎల్చెంకో బేస్ మెంటులోకి వెళ్ళాడు. బేస్ మెంటు వందలాది జర్మన్ సైనికులతో నిండి ఉంది. వాళ్ళ మొహాల్లో భయం కనిపిస్తోంది.

పౌలస్ ఒక ఫీల్డ్ మార్షల్. ఒక లెఫ్టెనెంటుతో మాట్లాడడానికి అతను మొదట ఇష్టపడలేదు. కాని చివరకు ఎల్చెంకోను పౌలస్ గదిలోకి తీసుకు వెళ్ళారు. పౌలస్ యూనిఫాం ధరించి ఇనప మంచం మీద పడుకుని ఉన్నాడు. అతని గడ్డం పెరిగి ఉంది.

'అంతా అయిపోయింది' అన్నాడు ఎల్చెంకో.

పౌలస్ తలూపాడు. జర్మన్ మేజర్ జనరల్ రస్క్, పౌలస్ ను ఒక కారులో తగిన రక్షణతో తీసుకు వెళ్ళాలని కోరాడు. లేకపోతే ఎర్ర సైనికులు అతన్ని చంపేస్తారని అతను భయపడ్డాడు. కారులో పౌలస్ ను జనరల్ రోకోసోవస్కీ దగ్గరకు తీసుకు వెళ్ళారు.

జనవరి 31న ఫీల్డ్ మార్షల్ పౌలస్ రష్యన్ సైన్యాలకు లొంగిపోయాడు. అతనితోపాటు 15 మంది జనరల్స్ లొంగిపోయారు. ఆ తర్వాత పెద్ద ఎత్తున జర్మన్ సైన్యం లొంగి పోసాగింది. ఉత్తర ప్రాంతంలో ఒక జర్మన్ సైనిక దళం లొంగిపోకుండా పోరాడసాగింది. చివరకు రష్యన్లు భారీ ఫిరంగులను ఉపయోగించాల్సి వచ్చింది. ఫిబ్రవరి 2న ఎనిమిది మంది జనరల్స్ తో సహా ఈ ఆఖరి సైన్యం లొంగిపోయింది.

స్టాలిన్ గ్రాడ్ యుద్ధం ముగిసింది. జర్మనీ మూడు రోజులు సంతాపదినాలుగా ప్రకటించింది. జర్మన్లు పౌలస్ పట్టుబడలేదనీ ఆత్మహత్య చేసుకున్నాడనీ కొంతకాలం ప్రచారం చేశారు.

జర్మన్ 6వ సైన్యం ప్రతిష్టాత్మకమైన సైన్యం. ఈ సైన్యం హిట్లరుకు గర్వకారణంగా ఉండేది. అది విజయవంతంగా బెల్జియం మీద దాడి చేసింది. పారిస్ నగరంలో ప్రవేశించింది. యూగోస్లోవియా, గ్రీసు దేశాల మీద దాడిలో ప్రముఖ పాత్ర నిర్వహించింది. జర్మనీకి ప్రతిష్టాత్మకమైన ఈ సైన్యం స్టాలిన్ గ్రాడ్ లో పూర్తిగా నాశనమైంది. వోల్గా దాటాలన్న ఆశతో వచ్చిన 6వ సైన్యం చివరకు వోల్గా దాటింది కాని విజేతలుగా మాత్రం కాదు - రష్యన్ ఖైదీలుగా వోల్గా దాటి వెళ్ళింది.

రష్యన్లు పౌలస్ ను గౌరవపూర్వకంగా వాన్ పౌలస్ అని పిలిచేవారు. ఈ వాన్ పౌలస్ నాజీ

Edit with WPS Office
వ్యతిరేకి అయిన మంచి జర్మన్ అని ప్రచారం చేశారు. అది వాస్తవం కాదు. పౌలస్ హిట్లర్ భక్తుడు. పోలెండు మీదా రష్యా మీదా దురాక్రమణ యుద్ధాలలో మనస్ఫూర్తిగా హిట్లర్ తో ఉన్నాడు. స్టాలిన్ గ్రాడ్ లో అపజయం అతన్ని జర్మనీ భవిష్యత్తు గురించి ఆందోళన పడేలా చేసింది. 1944 జులై 20న కొంతమంది జర్మన్ ఆఫీసర్లు హిట్లర్ మీద చేసిన హత్యా ప్రయత్నం విఫలమై వారందరూ ఉరితీయబడిన తర్వాత మాత్రమే, హిట్లర్ జర్మనీని ఏ దిశగా తీసుకువెడుతున్నాడో గ్రహించి, హిట్లర్ మీద తిరుగుబాటు చెయ్యమని జర్మన్ సైన్యానికీ ప్రజలకూ అతను పిలుపునిచ్చాడు.

యుద్ధానంతరం కమ్యూనిస్టు అధీనంలో ఉన్న తూర్పు జర్మనీలో నివాసం ఏర్పరుచుకుని 1957లో తన మరణం వరకూ సోవియట్ యూనియన్ - జర్మనీల మధ్య సన్నిహిత సంబంధాల కోసం కృషి చేశాడు.

డాన్, వోల్గా, స్టాలిన్ గ్రాడ్ ప్రాంతాలలో జరిగిన ఈ యుద్ధంలో జర్మనీ 15 లక్షల సైన్యాన్ని కోల్పోయింది. 3,500 టాంకులు, స్వయంచలిత ఫిరంగులు, 12,000 ఫిరంగులు, మోర్టార్లు, 3,000 విమానాలు – ఇవి కాకుండా పెద్ద ఎత్తున ఇతర సామగ్రినీ జర్మనీ నష్టపోయింది. 24 మంది జనరల్స్, 2500 మంది ఆఫీసర్లూ రష్యన్ ఖైదీలయ్యారు. ఇంత పెద్ద ఎత్తున నష్టాలు జర్మన్ యుద్ధ యంత్రాంగ పునాదులను కుదిపి వేశాయి. ఈ యుద్ధం తర్వాత చొరవ రష్యన్ల చేతుల్లోకి వచ్చింది. యుద్ధంలో మరో దశ ప్రారంభమైంది. ఇంతవరకూ ఆత్మ రక్షణ యుద్ధం చేస్తున్న రష్యా జర్మనీని రష్యా నుంచి తరిమివేసే యుద్ధం ప్రారంభించింది.

'స్టాలిన్ గ్రాడ్ లో జర్మన్ పరాజయం సైన్యాన్నీ ప్రజలనూ భయభీతులను చేసింది. జర్మన్ చరిత్రలో ఇంత ఘోర అపజయం కనీవినీ ఎరుగనిది' అని జర్మన్ జనరల్ వెస్ట్ ఫాల్ రాశాడు. హిట్లర్, అతని అనుచరులూ జర్మనీని వినాశకరమైన యుద్ధంలోకి దించారని జర్మన్ ప్రజలు అర్థం చేసుకోసాగారు. జర్మన్ అపజయం, దాని మిత్ర దేశాలలో - ఇటలీ, హంగరీ, రుమేనియా వగైరాలలో - జర్మనీ తమను ఈ యుద్ధంలోకి దించి బలి చేస్తోందనే భావన కలిగించింది. మిత్ర దేశాలతో విభేదాలు మొదలయ్యాయి. మరొక ఫలితం ఏమిటంటే ఈ యుద్ధ పరిణామం ఎలా ఉంటుందా, ఎవరితో చేతులు కలపాలా అని గోడమీద పిల్లుల్లా వేచి ఉన్న దేశాలు రష్యా శక్తిని తెలుసుకుని వెనక్కు తగ్గాయి.

స్టాలిన్ గ్రాడ్ విజయం తర్వాత రష్యా జయం, జర్మనీ పరాజయం తధ్యమని అందరూ నమ్మసాగారు.

జర్మన్ సైనికుల్లో చాలామంది నిస్పృహ చెందినా కరుడు గట్టిన నాజీ సైనికులు మాత్రం జర్మనీ అపజయం అసంభవమనీ యుద్ధం ఏ పక్షం గెలవకుండా ప్రతిష్టంభనతో ముగుస్తుందనీ భావించేవారు.

స్టాలిన్ గ్రాడ్ లో జర్మనీ అపజయంతో సరి తూగగల బ్రహ్మాండమైన విజయం కోసం హిట్లర్ తహతహలాడసాగాడు. 1943లో కుర్స్క్ (Kurks) యుద్ధం హిట్లర్ కు ఆ ఆశ కల్పించింది.

Edit with WPS Office

అధ్యాయం ఏడు

స్టాలిన్ గ్రాడ్ నుంచి కుర్స్క్ వరకూ.....

ఈ కుర్స్క్ యుద్ధం రెండో ప్రపంచ యుద్ధంలో అతి గొప్ప టాంకు యుద్ధంగా ప్రసిద్ధికెక్కింది. ఈ యుద్ధంలో కొద్దిపాటి ప్రదేశంలో ఇరు పక్షాలకు చెందిన 6000 టాంకులు పాల్గొన్నాయి. ఈ యుద్ధం గురించి తెలుసుకునే ముందు 'కకాసస్ పరిక్రమ' (Caucaus Round Trip) గురించి తెలుసుకుందాం.

ఆగస్టు 1942లో జర్మన్ సైన్యం అతి వేగంగా పురోగమిస్తూ కకాసస్ లో విస్తారమైన భూభాగాలను ఆక్రమించింది. 1943 జనవరి-ఫిబ్రవరి నెలలలో అంత వేగంగానూ కకాసస్ నుంచి పలాయనం సాగించింది. ఈ ఆరు నెలల కకాసస్ ఆక్రమణను జర్మన్ సైనికులు కొంత విషాదంతోనూ, కొంత అపహాస్యంగానూ, 'కకాసస్ పరిక్రమ' అంటుండేవారు.

కకాసస్ ను జయించి మైకాప్, గ్రోజ్నీ, బాకూ చమురు గనులను స్వాధీనం చేసుకునే ఉద్దేశంతో జర్మన్లు 1942 ఆగస్టులో ఈ ప్రాంతంలో యుద్ధం ప్రారంభించారు. ఒక వైపు స్టాలిన్ గ్రాడ్ వైపు పురోగమిస్తూ మరో వైపు కకాసస్ లోని రష్యన్ సైన్యాలను తరిమికొట్టసాగారు. 'వెనుకకు ఒక్క అడుగు కూడా వెయ్యకూడదు' అన్న స్టాలిన్ ఉత్తర్వు చేసిన తర్వాత కూడా జర్మన్ సైనిక శక్తి ముందు నిలువలేక, చుట్టుముట్టబడే ప్రమాదాన్ని తప్పించుకునేందుకు రష్యన్లు వెనుకకు, పర్వతాల వైపుకు తిరోగమించారు. తిరోగమిస్తూ జర్మన్ల చేతబడకుండా మైకాప్ నూనె గనులనూ చమురు నిల్వలనూ ధ్వంసం చేశారు.

కకాసస్ మీద జర్మన్ దాడి రష్యన్ ప్రభుత్వానికి కొత్త సమస్యను తీసుకు వచ్చింది. కకాసస్ లో ఉండేవారు ముస్లిం మతస్తులు. కకాసస్ జాతులకు సోవియట్ ప్రభుత్వం అంటే కొంత వ్యతిరేకత ఉంది. జర్మనీ ఇది దృష్టిలో ఉంచుకుని వారిని అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నాలు చేసింది. అంతర్యుద్ధ కాంలోనూ ఆ తర్వాత భూమిని సమిష్టి భూమిగా మార్చిన ఉద్యమంలోనూ ఈ ప్రాంతంలో సోవియట్ యూనియన్ అంటే వ్యతిరేకత ఏర్పడింది. క్రిమియాలో తార్తార్లు ముస్లింలు. విప్లవానికి ముందు టూరిజం వలన ఆర్థికంగా మంచి స్థితిలో ఉండేవారు. విప్లవం తర్వాత టూరిజం తగ్గి వారి ఆదాయం కూడా క్షీణించింది. అందుచేత వారు సోవియట్ వ్యతిరేక స్వభావంతో ఉన్నారు. కకాసస్ లో ఆర్మీనియన్లు మాత్రమే సోవియట్ యూనియన్ కు అనుకూలంగా ఉన్నారు.

సోవియట్ ప్రభుత్వం ముస్లిం జాతులు ఎటు మొగ్గుతాయా అనే ఆందోళనతో ఉంది. మధ్య ఏషియాలో కజక్ లు ముస్లింలే అయినా వారు తేలికగా రష్యన్లతో కలిసిపోయారు. స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో రష్యన్లతో చేయిచేయి కలిపి పోరాడారు. ఉజ్ బెక్ లంటే మాత్రం రష్యన్లకు అనుమానంగా ఉండేది. వారిలో తన పట్ల విధేయతను కలిగించడానికి సోవియట్ ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసింది.

1942 అక్టోబరు 31 వ తేదీ ప్రావ్దా సంచికలో రెండో పేజీ అంతా ఒక పక్క ఉజ్ బెక్ భాషలోనూ, మరొక పక్క అనువాదం రష్యన్ భాషలోనూ, ఉజ్ బెక్ ప్రజలనుంచి ఉజ్బెక్ సైనికులకు ఒక విజ్ఞప్తి వెలువడింది.

'.....పుత్రులారా....గుర్తుంచుకోండి. మీ పూర్వీకులు బానిసలుగా ఉండడానికి నిరాకరించారు. తమ పళ్ళతో గొలుసులు కొరికి తెంచేవారు. హిట్లర్ యూరోపియన్ దేశాల శత్రువు మాత్రమే కాదు, స్లావ్ దేశాల శత్రువు మాత్రమే కాదు, తూరుపు దేశాల శత్రువు కూడా అని గుర్తుంచుకోండి. క్రిమియా, కకాసస్ ల లోని ముస్లింల దుర్గతి చూడండి. ప్రశాంతంగా ఉండే వారి పల్లెలను జర్మన్లు దోచుకుంటున్నారు, తగలబెడుతున్నారు.....'

ఈ విజ్ఞప్తి ముఖ్య ఉద్దేశం క్రిమియాలోనూ కకాసస్ లోనూ దురాగతాలు సాగిస్తున్న హిట్లర్ ముస్లింలకు శత్రువు అని చెప్పడం. ఇటువంటి ప్రచారం యుద్ధ ప్రారంభకాలం లోనే కకాసస్ లో ప్రారంభమైంది. ఫాసిస్టు వ్యతిరేక సమావేశాలు ఏర్పాటు చేసి హిట్లర్ దురాక్రణను ఖండించడం

Edit with WPS Office
జరిగింది.

తన పక్షాన టర్కీని యుద్ధంలోకి దించాలనే లక్ష్యంతో ఉన్న హిట్లర్, 'ముస్లింలు మాత్రమే నమ్మదగిన వారు....ప్రత్యేక ముస్లిం సైన్యాలను ఏర్పరచడంలో ప్రమాదమేమీ లేదు' అని 1942 డిసెంబరులో ప్రకటించాడు. ఉత్తర కకాసస్ లోని ముస్లిం జాతులతో – చెచెన్, ఇంగుషీ, కరాచే, బాల్కేరియన్లతో - జర్మన్లు ఉదారంగా వ్యవహరించారు. ముస్లింల అభిమానం పొందడానికి వారు పథకం వేశారు. 'జర్మన్లు మసీదులు తెరుస్తారు, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు రద్దు చేస్తారు అని ప్రచారం చెయ్యాలి. పౌరుల దగ్గరనుంచి తీసుకున్న వస్తువులకు వెల చెల్లించాలి. ముస్లిం స్త్రీల పట్ల సత్ప్రవర్తన చూపించి జర్మన్లు ముస్లిం ప్రజల విశ్వాసాన్ని పొందాలి' - అని జర్మన్ అధికారులను ఆదేశించడం జరిగింది. అక్టోబరు 11న ముస్లిం పండుగ బైరాను సందర్భంగా ఉన్నత జర్మన్ అధికారులకు స్థానిక కమిటీ విలువైన కానుకలు సమర్పించింది. జర్మన్ సైన్యంతో చేతులు కలిపి పోరాడేందుకు కరాచే ముస్లింలతో ఒక ఆశ్విక సైన్యం ఏర్పాటు చెయ్యబడింది. అలాగే నాల్చిక్ లో కూడా స్థానిక కమిటీ జర్మన్లకు విలువైన కానుకలిచ్చింది. జర్మన్లు వారికి ఖురాన్లు, రష్యన్ల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలూ బహుమతిగా ఇచ్చారు. బాల్కార్ ముస్లింలు జర్మనీ అనుకూలురు. అలాగే చెచెన్, ఇంగూషీ ముస్లింలు కూడా జర్మన్ అనుకూలురు. ఈ రెండు ముస్లిం జాతులూ బహిరంగంగానే జర్మనీకి మద్దతిచ్చాయి.

కకాసస్ లోకి జర్మనీ చొచ్చుకు వస్తుంటే బ్రిటిష్ ప్రధాన మంత్రి చర్చిల్ తీవ్రంగా ఆందోళన పడ్డాడు. కకాసస్ లో జర్మనీ విజయం సాధించి ఈజిప్ట్ లో ప్రవేశిస్తే బ్రిటన్ పరిస్థితి అధ్వాన్నంగా మారే ప్రమాదం అతను గుర్తించి కకాసస్ రక్షణకు పెద్ద బ్రిటిష్-అమెరికన్ వైమానిక దళాన్ని పంపిస్తానని స్టాలిన్ కు ఒక ప్రతిపాదన చేశాడు. స్టాలిన్ ఈ ప్రతిపాదనను అంగీకరించనూ లేదు, వెంటనే తిరస్కరించనూ లేదు.

చెచెన్లు, ఇంగూషీ, కరాచే, బాల్కేరియన్లు, కాల్మూక్ లు తప్ప కకాసస్ లో ముస్లిం ప్రాంతానుంచి చాలా తక్కువమందే జర్మనీతో సహకరించారు. హిట్లర్ తో చేతులు కలిపిన ముస్లిం జాతులు తమ ద్రోహానికి శిక్ష అనుభవించాల్సి వచ్చింది. ఫిబ్రవరి 11, 1944న సుప్రీం సోవియట్ ఈ ముస్లిం ప్రాంతాలను నిర్మూలించాలని ఉత్తర్వు చేసింది. జర్మనీతో చేతులు కలిపిన చెచెన్, ఇంగుషీ, కరాచే, బాల్కార్, కాల్మూక్ జాతులను రైళ్ళ మీద తూరుపుకు తరలించారు (కృశ్చేవ్ తన రహస్య నివేదికలో జర్మన్లతో చేతులు కలిపిన ఈ జాతులను తూర్పుకు తరలించడం గురించి స్టాలిన్ ను తీవ్రంగా విమర్శించాడు. వారినందరినీ మళ్ళీ వారి వారి ప్రాంతాలకు తీసుకు వచ్చాడు). జర్మనీతో చేతులు కలిపిన చెచెన్లు ఇప్పుడు (ఈ పుస్తకం మొదటి ముద్రణ కాలానికి - 2005 సంవత్సరం నాటికి) అమెరికా పరోక్ష ప్రాత్సాహంతో పదేళ్ళుగా అంతర్యుద్ధం చేస్తున్నారు అన్న విషయం గమనించాలి.

కకాసస్ ముస్లింలను తమకు అనుకూలంగా మార్చి వారి సహాయంతో మధ్య తూర్పు దేశాలను ఆక్రమించాలనే జర్మన్ పథకం తలక్రిందులయింది. ముస్లింలలో అధిక సంఖ్యాకులు రష్యన్ల సరసన నిలిచి పోరాడారు.

90,000 మంది పౌరులు రాత్రింబవళ్ళు శ్రమించి గ్రోజ్నీ, బాకూ నగరాలకు పది రక్షణ రేఖలను నిర్మించారు. ఈ రక్షణ రేఖలలో ఫిరంగి స్థావరాలు, రక్షణ స్థావరాలు నిర్మించారు. ఆకురాలు కాలానికి 1,00,000 రక్షణ కట్టడాలను నిర్మించారు. 500 మైళ్ళ పొడుగున టాంకుల గమనాన్ని నిరోధించేందుకు కందకాలు తవ్వారు. 200 మైళ్ళ పొడవున పదాతి దళ గమనాన్ని నిరోధించేందుకు అవరోధాలు కల్పించారు. 1000 మైళ్ళ ట్రెంచిలు తవ్వారు. పర్వతాల్లో, అడవుల్లో, పురాతన వృక్షాలు కొట్టి రోడ్ల మీద అడ్డు పడేశారు. ఈ పనంతా చెయ్యడానికి 91,50,000 పని దినాలను వెచ్చించడం జరిగింది. బొబ్బలెక్కి రక్తాలు కారుతున్న చేతులకు గుడ్డలు చుట్టుకుని ప్రజల రాత్రింబవళ్ళు ఈ రక్షణ రేఖలను బలోపేతం చేశారు. ఈ ప్రజలు ఆకలితో మాడిపోతూ శత్రు విమాన దాడులకు గురవుతూ ఈ నిర్మాణాలు సాగించారు.

గ్రోజ్నీకి 65 మైళ్ళ దూరంలో మొజ్డోక్ వద్ద రష్యన్లు జర్మన్లను తీవ్రంగా ప్రతిఘటించి కొన్ని నెలల పాటు నిలుపు చేశారు. కీలకమైన ప్రదేశాలలో రష్యన్లు ఇలా తీవ్రంగా ప్రతిఘటించడం జర్మన్లకు ఆశ్చర్యాన్ని కలిగించింది. జర్మన్లు గ్రోజ్నీ చేరలేకపోయారు. జర్మన్ సైన్యం కకాసస్ పర్వత శ్రేణిని దాటి నల్ల సముద్రం చేరడానికి ప్రయత్నించింది. 9000 అడుగుల ఎత్తు పర్వత శ్రేణి మీద నుంచి జర్మన్లకు నల్ల సముద్ర దర్శనం అయింది కాని ముందుకు కదలలేకపోయారు. అతి క్లిష్ట పరిస్థితులలో రష్యన్లు

Edit with WPS Office
జర్మన్లను ఈ పర్వతాల మీద నిలుపు చేశారు. రష్యన్ సైన్యాలకు గుర్రాలు, గాడిదల ద్వారా సామగ్రి చేరవేయవలసి వచ్చేది లేదా చిన్న విమానాల ద్వారా చేరవేసేవారు. గాయపడిన వారిని తరలించడం కూడా కష్టమైంది. నవంబరులో గ్రోజ్నీ చేరడానికి జర్మన్లు మరోదాడి ప్రారంభించారు. రష్యన్లు తీవ్రంగా ప్రతిఘటించారు. ఐదు రోజుల యుద్ధంలో జర్మన్ సైన్యం 140 టాంకులు, 250 మోటారు వాహనాలూ తదితర సామగ్రి కోల్పోయింది. 5000 మంది జర్మన్ సైనికులు మరణించారు. ఆ తర్వాత జర్మన్లు పెద్ద ఎత్తున దాడి చేసే ప్రయత్నం విరమించుకుని తాము ఆక్రమించిన ప్రాంతాలలో రక్షణ ఏర్పాట్లు చేసుకుని స్టాలిన్ గ్రాడ్ పరిణామాలు చూడసాగారు. స్టాలిన్ గ్రాడ్ లో జర్మనీ గెలిచిన తర్వాత కకాసస్ పై మళ్ళీ దాడి కొనసాగిద్దామని వారి ఆలోచన.

కాని స్టాలిన్ గ్రాడ్ పరాజయం జర్మన్లను భయభ్రాంతులను చేసింది. రష్యన్లు కకాసస్ చేరి దారులు మూసివేయకముందే నిష్క్రమించాలనే ఉద్దేశంతో జర్మన్లు అతి వేగంగా కకాసస్ వదలి పారిపోసాగారు. జర్మన్లు ఇది వలాయనం కాదనీ ఒక క్రమ పద్ధతిలో సాగిన తిరోగమనం అనీ అంటారు. రష్యన్లు దీన్ని పలాయనంగా భావిస్తారు. భారీ సామాగ్రిని వెనుక వదిలేసి జర్మన్లు పరుగులు తియ్యాల్సి వచ్చింది. ఒక రైల్వే స్టేషనులో 1500 వేగన్ల లోడు రష్యన్ల వశమయింది.

తిరోగమనమైనా, పలాయనమైనా, స్టాలిన్ గ్రాడ్ తర్వాత జర్మన్లకు ఇది మరో పరాజయం.

కుర్స్క్ యుద్ధం

స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో జర్మన్ మృగం గాయపడింది కాని ఇంకా బలంగానే ఉంది. యుక్రెయిన్, క్రిమియా, డోనెట్స్ బేసిన్ పారిశ్రామిక ప్రాంతం, మధ్య రష్యాలో అధిక భాగం, ఈశాన్య ప్రంతాలు, బాల్టిక్ రాజ్యాలు - ఇంకా జర్మనీ అధీనంలోనే ఉన్నాయి. జర్మన్ సైన్యాలు లెనిన్ గ్రాడ్ సరిహద్దులలోనే ఉన్నాయి. మాస్కో సమీపంలో వ్యూహరీత్యా ప్రాముఖ్యత గల కొంత భాగం ఇంకా జర్మనీ స్వాధీనంలోనే ఉంది. యూరోపు అంతా జర్మనీ ఆక్రమణలోనే ఉంది. యూరోపు పారిశ్రామిక సంపదా మానవ వనరులూ జర్మన్ సైన్యానికి అందుతూనే ఉన్నాయి. బ్రిటన్, అమెరికాలు ప్రారంభిస్తాయని ఆశించిన రెండో యుద్ధ రంగం 1943లో కూడా ప్రారంభించలేదు. రష్యా ఒంటరిగానే జర్మనీతో పోరాడుతోంది.

1943లో పార్టిజాన్ ఉద్యమం బాగా వ్యాపించింది. మాస్కోలో పార్టిజాన్ కేంద్ర కార్యాలయం పార్టిజాన్ కార్యకలాపాలను సైన్యంతో సమన్వయపరచసాగింది. పార్టిజాన్లు శత్రు సైన్యాల కదలికల గురించి సమాచారం సేకరించడం, రవాణా మార్గాల మీద దాడి చేసి శత్రు సరఫరాలకు అంతరాయం కలిగించడం, సైన్యాల మీద దాడి చేసి నష్టపరచడం తీవ్రం చేశారు 1942లో జర్మన్లు సోవియట్ యూనియన్ లో ఉన్న తమ సైన్యంలో పదోవంతు సైన్యాన్ని ఈ పార్టిజాన్ చర్యలను అణచడానికి వినియోగించాల్సి వచ్చింది. 1943లో SS, SD పోలీసు బలగాలూ సహాయక సైన్యం నుంచి 5 లక్షల సైనికులనే కాక 25 డివిజన్ల రెగ్యులర్ సైన్యాన్ని పార్టిజాన్లతో పోరాడడానికి జర్మనీ మళ్ళించవలసి వచ్చింది. పార్టిజాన్ దళాలలో కమ్యూనిస్టులు రాజకీయ ప్రచారం చేసేవారు. కరపత్రాలు పంచేవారు. శత్రు ప్రచారాన్ని ఖండిస్తూ వాస్తవాలు చెబుతూ రష్యన్ ప్రజలను ఉత్తేజపరుస్తూ పోరాటానికి సంసిద్ధం చేసేవారు. ఈ పార్టిజాన్ కార్యకలాపాల వలన శత్రువు మనో నిబ్బరం బాగా దెబ్బతింది.

1943 వసంత కాలంలో రష్యన్ హై కమాండుకు వేసవిలో జర్మనీ ఏ రంగంలో యుద్ధం ప్రారంభిస్తుందా అన్న ప్రశ్న ఎదురైంది. శత్రు కార్యకలాపాలు, సైన్యాల కదలికల గురించి, ముఖ్యంగా జర్మనీ, ఫ్రాన్స్ ల నుంచి వస్తున్న కొత్త సైన్యాలు ఏఏ రంగాలకు మళ్ళించబడుతున్నాయో సమాచారం సేకరించవలసిందని గూఢచార శాఖకూ పార్టిజాన్ దళాలకూ ఆదేశాలనివ్వడం జరిగింది. యుద్ధరంగంలో ఉన్న సైన్యాలు కూడా శత్రు ప్రాంతాలలోకి దళాలను పంపించడం ద్వారా, విమానాలను పంపించడం ద్వారా సమాచారం సేకరించారు. ఫలితంగా ఏప్రిల్ ప్రారంభానికి శత్రు కార్యకలాపాల గురించి రష్యన్లకు స్పష్టమైన సమాచారం అందింది.

స్టాలిన్ గ్రాడ్ రంగంలో జర్మనీ విపరీతమైన నష్టాలకు గురయింది కనుక దక్షిణ రంగంలో జర్మనీ దాడి చేసే అవకాశం లేదు. ఉత్తరాన లెనిన్ గ్రాడ్ ప్రాంతంలో పెద్ద దాడి చేసేంత సైన్యం జర్మనీకి లేదు ఒకవేళ సైన్యాన్ని సమీకరించి ఆ ప్రాంతంలో యుద్ధం ప్రారంభించినా ఫలితం మాత్రం స్టాలిన్ గ్రాడ్

Edit with WPS Office
అపజయాన్నీ అవమానాన్నీ తుడిచివేసే ఎత్తున ఉండదు. స్టాలిన్ గ్రాడ్ యుద్ధానంతరం ఖార్కోవ్ ను తిరిగి జర్మనీ ఆక్రమించినా అది గొప్ప విజయం కాదు. హిట్లర్ స్టాలిన్ గ్రాడ్ తో సరితూగగల ఒక బ్రహ్మాండమైన విజయం కోసం కుర్స్క్ రంగాన్ని ఎంచుకున్నాడు. ఇక్కడ ప్రధాన జర్మన్ సైన్యాలు కేంద్రీకరించబడి ఉన్నాయి. ఈ ప్రాంతంలో జర్మన్ విజయం దక్షిణ రష్యా జర్మన్ ఆక్రమణలో సురక్షితంగా ఉండేలా చేస్తుంది. మాస్కో ద్వారాలు మళ్ళీ తెరుస్తుంది. స్టాలిన్ గ్రాడ్ అపజయానికి ప్రతీకారం చెయ్యడానికీ చొరవ తమ చేతుల్లోకి తీసుకోవడానికీ ఇది జర్మనీకి అనుకూలమైన రంగం.

ఈ కుర్స్క్ ప్రాంతం 'కోడి మెడ' లా ముందుకు చొచ్చుకు వచ్చింది. 'మెడ'లో రష్యన్ సైన్యాలున్నాయి. 'మెడ' ఇరువైపులా ఉత్తర, దక్షిణ దిక్కులలో జర్మన్ సైన్యం ఉంది. ఈ రెండు సైన్యాలూ చెరోవైపు నుంచి దాడి చేసి కలుసుకుంటే కోడి మెడలో ఉన్న రష్యన్లను చుట్టుముట్టవచ్చు. ఈ విజయం జర్మనీకి మాస్కో మీద దాడి చేసే అవకాశాన్ని ఇస్తుంది. అందుచేత ఈ ప్రాంతంలో దాడి చెయ్యడానికి హిట్లర్ నిర్ణయించాడు. అవే కారణాల వలన హిట్లర్ ఈ ప్రాంతంలో దాడి చేస్తాడని రష్యన్లు ఊహించారు. పార్టిజాన్లు, గూఢ శారి శాఖల రిపోర్టులు కూడా ఈ విషయాన్నే ధృవపరిచాయి.

జర్మన్ దాడిని ఎలా ఎదుర్కోవాలా అన్న ప్రశ్న రష్యన్ హై కమాండుకు ఎదురైంది. మాస్కో, స్టాలిన్ గ్రాడ్ యుద్ధాలలో లాగే జర్మనీని ముందు దాడి చెయ్యనిచ్చి, బలహీన పరచి, ఎదురు దాడి చెయ్యాలని కొంతమంది జనరల్స్ (జనరల్ ఝుకోవ్, జనరల్ వాసిలేవస్కీ మొదలైనవారు) అభిప్రాయపడితే, జర్మన్లను మొదట దాడి చెయ్యనిస్తే, 1941, 1942 సంవత్సరాలలో లాగానే ఆ దాడి మెరుపు దాడిగా పరిణమించే ప్రమాదం ఉందనీ, వారిని ఆపడం కష్టమవుతుందనీ, అందువలన జర్మన్ సైన్యం దాడి చెయ్యడానికి ముందే రష్యన్ సైన్యం జర్మన్ సైన్యం మీద దెబ్బ తియ్యాలనీ కొంతమంది జనరల్స్ (జనరల్ వటూటిన్, ఆ రంగంలో రాజకీయ ప్రతినిధి కృశ్చేవ్) అభిప్రాయపడ్డారు. ఏప్రిల్ మధ్య కాలానికి, జర్మన్ సైన్యాన్ని మొదట దాడి చెయ్యనిచ్చి రక్షణ యుద్ధాలలో, స్థానికంగా ఎదురుదెబ్బలతో బలహీన పరచి, తర్వాత మాత్రమే ఎదురు దాడి చెయ్యాలని ప్రాథమిక నిర్ణయం తీసుకోవడం జరిగింది. కుర్స్క్ రక్షణ యుద్ధం రష్యా ఒక పథకం ప్రకారం ఉద్దేశపూర్వకంగా చేసినదే కాని ఎర్రసైన్యం బలహీనలతల వలన కాదు.

ఏప్రిల్ లో జర్మన్ దాడిని రక్షణ యుద్ధం ద్వారా ఎదుర్కోవాలని ప్రాథమిక నిర్ణయం తీసుకున్నా, ఏప్రిల్ నుండి జూన్ వరకూ ఈ విషయమై మళ్ళీ మళ్ళీ చర్చలు జరిగాయి. స్టాలిన్ జూన్ వరకూ ఒక నిర్ణయానికి రాలేకపోయాడు. జర్మన్లను ముందు దాడి చెయ్యనిస్తే, గత రెండు సంవత్సరాలలోనూ అనేక మార్లు జరిగినట్లుగానే రష్యన్ బలగాలు జర్మన్ దాడి ఉధృతిని తట్టుకుని నిలబడలేకపోవచ్చునని అతను భయపడ్డాడు. అదే సమయంలో రష్యన్ సైన్యాలు ముందు దాడి చేసి జర్మన్లను ఓడించలేకపోవచ్చునని కూడా అతను అభిప్రాయపడ్డాడు.

'మళ్ళీ మళ్ళీ ఈ సమస్యను సమగ్రంగా చర్చించిన తర్వాత, శత్రు కార్యకలాపాల గురించి సేకరించిన సమాచారాన్ని పరిశీలించిన తర్వాత, ఫిరంగుల కాల్పులతోనూ విమానదాడుల ద్వారానూ ఎదురు దెబ్బలు తియ్యడం ద్వారానూ జర్మన్ దాడిని కాచుకోవాలనీ, శత్రువు బలహీన పడిన తర్వాత మాత్రమే శత్రువును తరిమివేసే ఉద్దేశంతో పెద్ద ఎత్తున ఎదురు దాడి (offensive) చెయ్యాలనీ, స్టాలిన్ చివరకు నిర్ణయించాడు...' - (G. Zhukov, Reminiscences and Reflections, Vol. 2, P. 168).

ఈ అంతిమ నిర్ణయాన్ని స్టాలిన్ జూన్ లో తీసుకున్నాడు.

1943 వసంతకాలంలో వేసవి యుద్ధానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. సైన్యానికి ఆధునిక ఆయుధాలు పెద్ద సంఖ్యలో అందసాగాయి. రాబోయే యుద్ధంలో పెద్ద ఎత్తున టాంకులు ఉపయోగించబడతాయి కనుక పార్టీ కేంద్ర కమిటీ టాంకులు, స్వయం చలిత గన్నుల ఉత్పత్తి గురించి ప్రత్యేక శ్రద్ధ చూపింది. అలాగే అధునాతన విమానాలతో వైమానిక సైన్యాలను ఏర్పరిచారు. రష్యన్ వైమానిక బలగం జర్మన్ వైమానిక బలగం మీద ఆధిక్యత సాధించింది. ఫిరంగి దళాలకు కూడా మోటారు వాహనాలను ఏర్పరచడం జరిగింది. జులై నాటికి ఎర్ర సైన్యం సంఖ్య 66 లక్షలు. ఈ సైన్యానికి 1,05,000 ఫిరంగులు, మోర్టార్లు, 2200 రాకెట్ ఆర్టిలరీ, 10000 టాంకులు, స్వయంచలిత ఫిరంగులు, 10,300 యుద్ధ విమానాలూ ఉన్నాయి. 1943 అంతానికి ఎర్ర సైన్యంలో 23 లక్షల కమ్యూనిస్టులు, మరో 27 లక్షల యువ కమ్యూనిస్టులూ ఉన్నారు. వేసవి యుద్ధ ప్రారంభ సమయానికి ఎర్ర సైన్యానికి జర్మన్ సైన్యం కంటే సంఖ్యలోనూ, గుణాత్మకంగానూ ఆధిక్యత ఉంది.

Edit with WPS Office

1943 వేసవినాటికి రష్యాలో జర్మనీ దాని మిత్ర దేశాల సైన్యం 53 లక్షలుంది. జర్మనీకి 56000 ఫిరంగులు, 5850 టాంకులు, స్వయంచలిత ఫిరంగులు, 3000 విమానాలూ ఉన్నాయి. కుర్స్క్ యుద్ధానికి జర్మనీ పది లక్షల సైన్యాన్నీ, 10000 ఫిరంగులనూ, 2700 టాంకులనూ 2000 విమానాలనూ కేటాయింది. ఈ శక్తివంతమైన సైన్యం విజయం సాధిస్తుందని హిట్లర్ నమ్మకంతో ఉన్నాడు. ఈ దాడిలో జర్మనీ సరికొత్త టైగర్, పేంథర్ టాంకులను దించింది. ఈ టాంకులు రష్యన్లకు నిజానికి కొత్తవి కావు. లెనిన్ గ్రాడ్ యుద్ధ రంగంలో ప్రయోగాత్మకంగా ఉపయోగించిన ఈ టాంకులను జర్మన్ల దగ్గరనుంచి స్వాధీనం చేసుకుని వాటిపై అనేక ప్రయోగాలు జరిపి వాటి బలహీనతలను తెలుసుకున్నారు రష్యన్లు.

ఆశించినంత సైన్యాన్ని సమయానికి సమీకరించడంలో ఆలస్యం కావడంతో ఈ ఆపరేషన్ రెండు సార్లు వాయిదాపడింది. ఈ లోగా వేల టైగర్, పాంథర్ టాంకులు, ఫెర్డినాండ్ స్వయంచలిత ఫిరంగులూ జర్మన్ ఆయుధ ఫాక్టరీలనుండి తిన్నగా యుద్ధరంగానికి తరలించబడ్డాయి.

మార్చి నుండీ జర్మన్ వైమానిక బలగాలు ఈ ప్రాంతంలోని రైల్వే జంక్షన్ల మీదా, రోడ్ల మీదా, నగరాలు, పట్టణాలు, వెనుకతట్టున ఉన్న ముఖ్య లక్ష్యాల మీదా బాంబు దాడులు తీవ్రం చేశాయి. జూన్ లో యుద్ధ రంగంలోనూ వెనుకతట్టున ఉన్న సైన్యం మీదా దాడులు ప్రారంభించాయి.

రష్యన్లు మార్చి నుండీ ఈ ప్రాంతంలో రక్షణ ఏర్పాట్లు ప్రారంభించారు. మూడు నెలలలో 5 లక్షల రైల్వే వేగన్లు కుర్స్క్ యుద్ధరంగానికి అవసరమైన సామగ్రిని చేరవేశాయి. వేలమైళ్ళ ట్రెంచిలు తవ్వారు, ఫిరంగి స్థావరాలు నిర్మించారు. 150 కి. మీ. లోతు ప్రాంతాన్ని రక్షణ కట్టడాలతో దుర్గంలా మార్చారు. జూన్ అంతానికి శత్రువు త్వరలోనే దాడి ప్రారంభిస్తాడని స్పష్టమైంది. టాంకు దాడిని నిరోధించడానికి ఉత్తర దక్షిణ రంగాలలో ఏంటీ టాంకు రక్షణ ఏర్పాట్లు చేశారు. ఫిరంగులు, టాంకులు, మందుపాతరలు, టాంకు అవరోధాలతో ఎర్రసైన్యం జర్మన్ టాంకు దాడిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది. ఇంతకు ముందు జరిగిన యుద్ధాల అనుభవం ఈ ఏంటీ టాంకు ఏర్పాట్లు చెయ్యడంలో ఉపయోగపడింది. చాలా పెద్ద ఎత్తున జర్మన్లు చెయ్యబోతున్న టాంకు దాడిని తట్టుకోగలమన్న విశ్వాసంతో ఉంది ఎర్రసైన్యం.

కుర్స్క్ ప్రాంతంలో ఉన్న కర్మాగారాలు టాంకులు, విమానాలు, మోటారు వాహనాలు, ఫిరంగులనూ మరమ్మత్తు చేసేవి. సైన్యానికీ ఆసుపత్రులకూ కావలసిన వస్తువులను తయారు చేసేవి. స్థానిక ప్రజలు రక్షణ ఏర్పాట్లు చెయ్యడంలోనూ రోడ్లు మరమ్మత్తు చెయ్యడంలోనూ చురుకుగా పని చేశారు.

స్పష్టమైన సమాచారం అందిన తర్వాత, జులై 3-6ల మధ్య జర్మన్ దాడి ప్రారంభం కావచ్చునని జులై 2వ తేదీన యుద్ధరంగంలో ఉన్న ఎర్ర సైన్యాన్ని హెచ్చరించడం జరిగింది. యుద్ధ ఖైదీలను ప్రశ్నించడం ద్వారా జులై 5న జర్మన్ దాడి ప్రారంభం కానున్నదని జులై 4న తెలిసింది.

జులై 5వ తేదీ తెల్లవారగట్ల 5.30కు జర్మన్ సైన్యం దాడి చెయ్యబోతోందనగా 2.30 గంటలకు జర్మన్ సైన్యం ఊహించని విధంగా రష్యన్ ఫిరంగి దళం ఎదురు కాల్పులు చేసింది. దాడికి సిద్ధమవుతున్న జర్మన్ సైన్యం మీద కాట్యూషా రాకెట్లు కురిశాయి. ఈ ఫిరంగి దాడిలో కొన్ని రంగాలలో జర్మన్ సైన్యం నష్టాలకు గురైంది. కొన్ని ప్రాంతాలలో జర్మన్ సైనికులు ఇంకా బంకర్లలో నిద్రపోతుండగా, జర్మన్ టాంకులు యుద్ధరంగంలో కేంద్రీకరించబడడానికి ముందే రష్యన్ ఫిరంగి దాడి మొదలైన కారణంగా జర్మన్ నష్టాలు తక్కువగానే ఉన్నాయి. రాత్రి కావడంగా ఎర్ర వైమానిక దళం ఈ దాడిలో లేదు. తెల్లవారగానే జర్మన్ విమానాలు తమ సైన్యానికి రక్షణగా యుద్ధరంగంలోకి వచ్చాయి. రష్యన్ విమానాలు జర్మన్ విమానాలను అడ్డగిస్తూ, యుద్ధరంగంలో ఉన్న జర్మన్ సైన్యం మీద బాంబులు కురిపిస్తూ నష్టపరచసాగాయి.

తెల్లవారకట్ల 5.30కు జర్మన్ దాడి ప్రారంభమైంది. రష్యన్ రక్షణ రేఖలో ఉన్న వేల ఫిరంగులు జర్మన్ దాడిని ప్రతిఘటించాయి. విపరీతమైన నష్టంతో జర్మన్ సైన్యం వెనుకంజ వెయ్యాల్సి వచ్చింది. యుద్ధం ప్రారంభం కాగానే జర్మన్లు బ్రహ్మాండమైన సైనిక శక్తిని వినియోగిస్తున్నారనీ విపరీతంగా నష్టపోతున్నారనీ, నష్టాలతో పోల్చి చూస్తే వారి విజయాలు అతి స్వల్పమనీ రష్యన్లకు స్పష్టమయింది. జులై 5న జర్మన్ సైన్యం రష్యన్ శ్రేణులను ఛేదించడానికి 5 దాడులు చేసింది. ఆ రోజు సాయంకాలానికి ఒక ప్రాంతంలో జర్మన్ సైన్యం 3-6 కి. మీ పురోగమించగలిగింది. తీవ్రంగా ప్రతిఘటిస్తున్నప్పటికీ జులై 5-6వ తేదీలలో జర్మన్ సైన్యం కొన్ని రంగాలలో 10 కి. మీ. పురోగమించింది. జర్మన్ వైమానిక బలగం

Edit with WPS Office
విపరీతమైన నష్టాలకుగురవుతున్నప్పటికీ రష్యన్ సైన్యం మీద దాడులు తీవ్రం చేసింది. జులై 10వ తేదీకి హిట్లర్ ఆశలు పెట్టుకున్న టాంకు సైన్యంలో అధిక భాగం నష్టమైంది. జర్మన్లు ముందుకు కదలలేకపోయారు.

జులై 5న రష్యన్ ప్రభుత్వం ఒక ప్రకటనలో - '....ఉదయం నుంచి జర్మన్ టాంకులతోనూ పదాతి దళాలతోనూ ఎర్ర సైన్యం పోరాడుతోంది. శత్రు విమానాలు వందల దాడులు చేస్తున్నాయి. జర్మన్లు కొన్ని ప్రదేశాలలో ముందుకు చొచ్చుకు వచ్చారు.....రష్యన్ సైన్యం 586 టాంకులను ధ్వంసం చేసింది. 203 శత్రు విమానాలను కూల్చి వేసింది....' అని వెల్లడించింది.

అంతవరకూ ఎప్పుడూ ఒక్క రోజు యుద్ధంలో 586 టాంకులను ధ్వంసం చేసినట్లు ప్రకటించడం జరగలేదు. 586 టాంకులు అనగానే ఎంత పెద్ద ఎత్తున ఈ యుద్ధం జరుగుతున్నదో ప్రజలకు అర్థమైంది. వారు ఊపిరి బిగబట్టి యుద్ధ పరిణామం ఎలా ఉంటుందా అని ఆందోళనతో ఎదురు చూడసాగారు.

రష్యన్లు మరికొంత తిరోగమించినట్లూ, 433 టాంకులనూ 111 విమానాలనూ ధ్వంసం చేసినట్లూ జులై 6 ప్రకటన పేర్కొంది.....7వ తేదీన 520 టాంకులు, 111 విమానాలు.....8వ తేదీన 304 టాంకులు, 161 విమానాలు....9వ తేదీకి ప్రమాదం తొలగింది.

విపరీతమైన నష్టాలతో జర్మన్ సైన్యం కొంత పురోగమించింది కాని జులై 9 కల్లా బలహీనపడింది. నాలుగు రోజుల యుద్ధంలో జర్మన్లు ఉత్తరాన 12 మైళ్ళ వెడల్పు యుద్ధ రంగంలో పది మైళ్ళూ, దక్షిణాన 30 మైళ్ళ వెడల్పు యుద్ధరంగంలో 30 మైళ్ళూ పురోగమించారు. ఈ రెండు సైన్యాల మధ్యా ఇంకా 100 మైళ్ళ అంతరం ఉంది. అప్పటికే జర్మన్ సైన్యం నీరసించి పోయింది. జర్మన్ టాంకు సైన్యంలో అధిక భాగం నాశనమైంది. ముందుకు వెళ్లడం మాట అటుంచి అడుగు పెట్టిన చోట నిలవడానికి పోరాడాల్సిన పరిస్థితి వచ్చింది.

జులై 12న, జర్మనీ దాడి ప్రారంభించిన ఐదో రోజున రష్యన్ సైన్యం ఎదురు దాడి చేసింది. 50 రోజుల భీషణ పోరాటంలో జర్మన్లను తరిమి తరిమి కొట్టింది. ఎర్ర సైన్యాన్ని ప్రతిఘటించడానికి యూరోపు నుంచి రష్యన్ యుద్ధరంగానికి జర్మనీ 14 డివిజన్లను తరలించింది. ఆ విధంగా యూరోపియన్ రంగంలో జర్మనీ మరింత బలహీనపడింది. జర్మనీ ఈ యుద్ధంలో మెరికల్లాంటి 30 డివిజన్లను కోల్పోయింది. 7 టాంకు డివిజన్లను నష్టపోయింది. 5 లక్షల సైన్యాన్నీ, 2000 టాంకులు, స్వయంచలిత ఫిరంగులనూ, 3000 ఫిరంగులనూ, 3700 విమానాలనూ కోల్పోయింది. జర్మనీకి ఇది మరో ఘోర పరాజయం. ఈ పరాజయాన్నుంచి జర్మనీ మరి కోలుకోలేదు.

కుర్స్క్ యుద్ధంలో మాస్కో, స్టాలిన్ గ్రాడ్ యుద్ధాలలో కంటే ఎక్కువ సైనిక బలగాలు పాల్గొన్నాయి. మాస్కో యుద్ధంలో 17 చిన్న సైన్యాలు టాంకులు లేకుండా యుద్ధం చేశాయి. స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో 14 సైన్యాలు, ఒక టాంకు సైన్యం, మోటారు వాహనాల మీద కదిలే అనేక సైన్యాలూ పాల్గొన్నాయి. కుర్స్క్ యుద్ధంలో టాంకు, మోటారు సైన్యాలను రష్యన్లు మొట్టమొదటిసారి విరివిగా ఉపయోగించారు. శత్రువును తరిమి కొట్టడంలోనూ, చుట్టుముట్టడంలోనూ, వేగంగా ప్రయాణించే ఈ సైన్యాలు ప్రముఖ పాత్ర పోషించాయి. టాంకు సైన్యాలూ వైమానిక బలగాలూ నూతన ఫిరంగి సైన్యాలూ రష్యన్లు తమ లక్ష్యాన్ని సాధించడంలో ఎంతో ఉపయోగపడ్డాయి. యుద్ధం మొదటి దశలో కంటే కుర్స్క్ యుద్ధం తర్వాత సోవియట్ సైన్యాలు మరింత కదలిక (mobile) కలిగి ఉన్నాయి. కుర్స్క్ యుద్ధంలో ప్రతీ కిలోమీటరు యుద్ధ రంగానికి రష్యా 15-20 టాంకులు, 150-200 ఫిరంగులు కేంద్రీకరించగలిగింది.

కుర్స్క్ యుద్ధం తర్వాత దెబ్బ కాచుకుంటూ తన అంతాన్ని వాయిదా వేస్తూ పోవడం తప్ప జర్మనీ చెయ్యగలిగిందేమీ లేదు. హిట్లర్ తన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసే రోజు దగ్గర పడుతోంది. ఈ నరరూప రాక్షసుడి అంతం గురించి తెలుసుకునే ముందు జర్మన్ ఆక్రమణలో రష్యా ఎటువంటి నరకాన్ని అనుభవించిందో తెలుసుకుందాం.

Edit with WPS Office

జర్మన్ ఆక్రమణలో సోవియట్ యూనియన్.....

ఈ యుద్ధంలో సోవియట్ యూనియన్ భయంకరమైన నష్టాలకు గురయింది. 2,000 నగరాలను, 70,000 గ్రామాలను జర్మన్ సైన్యం నాశనం చేసింది. 40 లక్షల మందికి జీవనోపాధి కల్పించిన ఫాక్టరీలు పూర్తిగా కాని, పాక్షికంగా కాని నాశనమయ్యాయి. 38,500 మైళ్ళ రైలు మార్గం ప్రత్యేకమైన పేలుడు పదార్థాలతో ధ్వంసం చెయ్యబడింది. అందువలన ఈ మార్గాలను మళ్ళీ పూర్తిగా వెయ్యాల్సి వచ్చింది. 70 లక్షల గుర్రాలూ, 170 లక్షల పశువులూ జర్మనీకి తరలించబడ్డాయి. 2 కోట్ల పందులను చంపేశారు. గనులను ఒక పద్ధతి ప్రకారం నాశనం చేసి నీళ్ళతో నింపేశారు. ఆక్రమిత ప్రాంతాలలో బొగ్గు, విద్యుత్తు, ఉక్కు, లోహాలు, యంత్ర పరిశ్రమలలో 40 నుంచి 60 శాతం ధ్వంసమైంది. రైల్వే మార్గాలనే కాదు, నీటి మార్గాలను కూడా జర్మన్లు ధ్వంసం చేశారు. నీపర్ డాం నాశనం కావడంతో నీటి మార్గం మీద ప్రయాణం నిలిచిపోయింది.

యూరోపులో జరిగిన నష్టం మొత్తంలో సగం రష్యా లోనే జరిగింది. ప్రపంచ యుద్ధంలో అమెరికా పొందిన నష్టానికంటే రష్యా వందరెట్లు నష్టపోయింది. రెండు కోట్ల ఏభై లక్షలమంది నిర్వాసితులయ్యారు. ఈ యుద్ధంలో రష్యా ఒక కోటి ఇరవై లక్షల సైనికులనూ ఒకకోటి డెబ్భయి లక్షల పౌరులనూ కోల్పోయింది - అంటే ప్రతీ ఏడుగురు రష్యన్లలోనూ ఒకరు మరణించారు. సోవియట్ యూనియన్ లో యువతరంలో అధికభాగం యుద్ధంలో తుడిచిపెట్టుకుపోయింది. దక్షిణ రష్యాలో కొన్ని గ్రామాలలో యువతులు పెళ్ళి చేసుకునేందుకు మగవాళ్ళే లేని పరిస్థితి ఏర్పడింది. ఒక అంచనా ప్రకారం 1923లో జన్మించిన యువకులలో 80 శాతం ఈ యుద్ధంలో మరణించారు. మరణించిన వారు కాక కోట్ల సంఖ్యలో క్షత గాత్రులు, లక్షల సంఖ్యలో జర్మనీ నుంచి ఎముకల గూడుల్లా తిరిగి వచ్చిన పౌరులు. ఈ నష్టం కేవలం యుద్ధ రంగంలోనే జరిగిన నష్టం కాదు. రష్యన్ జనాభాను తుడిచి వేసేయాలనే లక్ష్యంతో జర్మనీ రష్యాలో సాగించిన రాక్షస కాండ ఫలితం. ఈ రాక్షస కాండను అర్థం చేసుకోవాలంటే ముందు నూతన వ్యవస్థ (New Order) అంటే ఏమిటో తెలుసుకోవాలి. నూతన వ్యవస్థ అంటే ఏమిటో తెలుసుకోకుండా హిట్లర్ ను నరరూప రాక్షసుడని ఎందుకంటారో, రష్యాలో హిట్లర్ పరాజయం వలన ప్రపంచం ఎటువంటి నరకం నుంచి రక్షించబడిందో అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.

ఈ నూతన వ్యవస్థ అంటే ఏమిటో ఎక్కడా వివరంగా వ్రాతపూర్వకంగా లేదు. కాని హిట్లర్ కలలు గన్న ఈ నూతన వ్యవస్థ ప్రపంచానికి మాత్రం ఒక పీడకల. ఈ నూతన వ్యవస్థలో యూరోపు అంతా నాజీ జర్మనీ ఆక్రమణలో ఉంటుంది. ఆర్యులైన జర్మన్లకు మిగిలిన జాతులన్నీ బానిసలై బ్రతకాలి. అన్ని దేశాల వనరులూ సంపదా జర్మనీ అవసరాలు తీర్చాలి. స్లావ్ జాతులలాంటివి మానవ జాతి అనిపించుకోడానికి అనర్హమైన (subhuman), అవాంఛనీయమైన జాతులు - ఈ జాతులను భౌతికంగా అంతం చెయ్యాలి.

హిట్లర్ ఆక్రమణలో ఉన్న డెన్మార్క్, నార్వే, హాలెండు, బెల్జియం, ఫ్రాన్స్ లాంటి దేశాలలో పాలన కఠినంగా ఉన్నా అక్కడ జర్మన్ ఆక్రమణ లక్ష్యం ఆ దేశాల సంపదను దోచుకోవడమే కాని జనాభాని అంతం చెయ్యడం కాదు. ఈ దేశాలనుండి జర్మన్లు బంగారం, ముడి సరుకులూ ఫాక్టరీలూ కళా సంపదా దోచుకున్నారు కాని జనాభాని మాత్రం ఉద్దేశపూర్వకంగా చంపలేదు. కాని తూర్పు దేశాలలో పరిస్థితి వేరు. పోలెండుకు తూర్పు ప్రాంతాలలో ఉండే జనాభాని అంతం చేసి ఈ ప్రాంతాలను జర్మన్లు నివాస స్థలంగా (lebensraum) మార్చడం హిట్లర్ లక్ష్యం. రష్యాతో యుద్ధ లక్ష్యం కేవల ఆక్రమణ, సంపద దోచుకోవడం కాక రష్యాని ప్రపంచ పటం నుంచి తుడిచి వెయ్యడం.

'స్లావ్ లు జర్మనీ కోసం పని చెయ్యాలి. జర్మనీకి అవసరం కాని పరిస్థితులలో వారిని

Edit with WPS Office
చావనియ్యవచ్చు. వారికి వైద్య సదుపాయాలు ఏవీ ఉండక్కర్లేదు.....వాళ్ళు జీవించడానికి అవసరమైన దాని కంటే ఎక్కువ తిండి పెట్టకూడదు. వాళ్ళ జనాభా పెరగడం వాంఛనీయం కాదు. వాళ్ళకి విద్య నేర్పడం ప్రమాదకరం. వంద దాకా లెక్క పెట్టగలిగేంత చదువు సరిపోతుంది. విద్యావంతుడైన ప్రతీ స్లావ్ భవిష్యత్తులో జర్మనీకి శత్రువే.....' అన్నాడు మార్టిన్ బార్ మేన్ అనే నాజీ నాయకుడు (The Rise and Fall of Third Reich, William Shirer, p. 1225).

ఈ జాతుల్లో మేధావి వర్గం పూర్తిగా తుడిచివెయ్యబడుతుంది. రష్యా, పోలెండుల సంస్కృతి పూర్తిగా నాశనమవుతుంది. ఆ దేశాల పరిశ్రమలన్నీ జర్మనీకి తరలించబడతాయి. ఆ దేశాల ప్రజలు పొలాల్లో, గనుల్లో జర్మన్ యజమానుల బానిసలుగా, కూలీలుగా పనిచేస్తూ జర్మనీకి ఆహారం పండించాలి. వారు చావకుండా ఉండడానికి అవసరమైన ఆహారాన్ని ఉంచి మిగిలినదంతా జర్మనీకి తరలించబడుతుంది. జ్యూలు (యూదు మతస్థులు) పూర్తిగా అంతం చెయ్యబడతారు. యూరోపులో ఒక్క జ్యూ కూడా ఉండకూడదు. లెనిన్ గ్రాడ్, వార్సా, మాస్కో లాంటి నగరాలు ప్రపంచపటం నుంచి తుడిచి వేయబడతాయి. లిథుయేనియా, ఎస్తోనియా, లాత్వియాలు జర్మనీలో కలుస్తాయి. క్రిమియా జర్మన్ ప్రాంతంగా మారుతుంది. క్రిమియా నుండి సోవియట్ జనాభాను తరిమేసి జర్మన్లు మాత్రమే ఉంటారు.

1941 మే 13న గొయరింగ్ ఒక ఆదేశంలో రష్యాలోని పారిశ్రామిక ప్రాంతాలను నాశనం చెయ్యాలనీ కార్మికులు, వాళ్ళ కుటుంబాలతో సహా, ఆకలితో మాడి చచ్చినా, రష్యాలోని ఇతర ప్రాంతాలనుండి వాళ్ళ కోసం ఆహారం దిగుమతి చెయ్యకూడదనీ అన్నాడు (ibid...P. 1229). 1941 నవంబరులో గొయరింగ్ ఇటలీ విదేశాంగ మంత్రి సియానోతో సంభాషిస్తూ '....ఈ సంవత్సరం 20-30 మిలియన్ల (రెండు, మూడు కోట్లు) రష్యన్లు ఆకలితో చస్తారు. అలా జరగడం మంచిదే. కొన్ని దేశాలు అలాగే నాశనమవ్వాలి.....మానవ జాతి ఆకలితో చావాల్సి వస్తే చివరకు అంతమయ్యేవి జర్మనీ, ఇటలీ లే .....' అన్నాడు (ibid. P. 1118).

'10,000 మంది రష్యన్ స్త్రీలు ఏంటీ టాంకు కందకాలు తవ్వుతూ అలిసిపోయి చచ్చినా పట్టించుకోను. ఆ పని పూర్తవడమే నాకు కావాలి' అన్నాడు హిమ్లర్ (ibid. P. 1224).

జర్మన్ సైన్యం టాంకులు, మోటారు వాహనాలతో వేగంగా కదిలే సైన్యంగా ప్రసిద్ధి పొందినా నిజంగా సైన్యం అంతా గుర్రాల సహాయంతోనే కదిలేది. పశ్చిమ యూరోపు దేశాల మీద దాడి చేసినప్పుడు గుర్రాలకు కావలసిన ఆహారాన్ని జర్మన్ సైన్యం తనతో కూడా తీసుకు వచ్చింది. లేదా జర్మనీ నుంచి రైళ్ళ ద్వారా వచ్చేది. 1941లో జర్మనీ రష్యా మీద దాడి చేసినప్పుడు జర్మన్ సైన్యంలో 7,50,000 గుర్రాలున్నాయి. వీటికి రోజుకు 16,350 టన్నుల ఆహారం కావాలి. ధాన్యాగారాలను కొల్లగొట్టి ఈ గుర్రాలను మేపేవారు. మరో పక్క సోవియట్ పౌరులు తిండిలేక మరణిస్తుండేవారు. రష్యాలో 1941-45 ల మధ్య జర్మన్ సైన్యం 67 లక్షల గుర్రాలను నష్టపోయింది. ఈ 67 లక్షల గుర్రాలను జర్మన్ సైన్యం రష్యన్ ప్రజల దగ్గరనుంచి దోచుకున్న ఆహారధాన్యాలతో మేపింది.

అమెరికన్ జనరల్ ఐజెన్ హోవర్ (ఇతను 1944లో జర్మన్ ఆక్రమిత ఫ్రాన్స్ లో దిగిన ఆంగ్లో-అమెరికన్ సైన్యాలకు నాయకత్వం వహించాడు) రష్యాలో జరిగిన భయంకరమైన వినాశనం గురించి ఇలా అన్నాడు - '1945లో నేను విమానంలో రష్యాలో ప్రయాణిస్తున్నప్పుడు, పశ్చిమ సరిహద్దులనుండి మాస్కో ప్రాంతంవరకూ గల ప్రదేశంలో కూలిపోని ఒక్క ఇల్లు కూడా నాకు కనుపించలేదు. జర్మన్లు ఆక్రమించిన ఈ ప్రాంతంలో స్త్రీలూ పురుషులూ వృద్ధులూ ఎంతమంది హత్య చెయ్యబడ్డారో రష్యన్ ప్రభుత్వం అంచనా వెయ్యలేకపోతోంది అని మార్షల్ ఝుకోవ్ నాతో అన్నాడు....'

వాల్ట్ కెర్ అనే అమెరికన్ పాత్రికేయుడు 1941 డిసెంబరులో మాస్కో ప్రాంతంలో రష్యన్లు ఎదురుదాడి చేసి జర్మన్ సైన్యాలను తరిమివేసి విముక్తి చేసిన ప్రాంతాలలో పర్యటించాడు. జర్మన్ ఆక్రమణలో రష్యన్ ప్రజల జీవితం ఎలా ఉన్నదీ, షాప్ కోవో, మేలయేర్ గ్రామాల ప్రజలు ఎలాంటి అమానుషాలకు గురయినదీ అతని ది రష్యన్ ఆర్మీ అనే పుస్తకంలో వివరించాడు.

మేలయేర్ గ్రామంలోని ప్రజలందరూ సమీపంలో ఉన్న సమిష్టి వ్యవసాయ క్షేత్రంలో పని చేసేవారు. టాపిట్సిన్ అనే యువకుడు క్షయరోగి కావడం మూలాన ఎర్రమైన్యం అతన్ని సైన్యంలో చేర్చుకోలేదు. డిసెంబరు 24న ముగ్గురు జర్మన్ సైనికులు అతని ఇంటికి వచ్చారు. పది నిమిషాలలో కుటుంబమంతా ఇల్లు ఖాళీ చెయ్యాలని ఆదేశించారు. దుస్తులు కూడా తీసుకు వెళ్ళవచ్చు కాని ఆహారం తీసుకు వెళ్ళకూడదు. బయట మంచు కురుస్తూ ఉంటుంది. మేం ఎక్కడ ఉండాలి, ఏం

Edit with WPS Office
తినాలి అని టాపిట్సిన్ అడిగితే జర్మన్ సైనికులు 'స్టాలిన్ ను అడుగు' అంటారు. ఆ గ్రామంలో ఉన్న 80 మంది ప్రజలను జర్మన్లు ఇళ్ళల్లోంచి తరిమి వేస్తారు. టాపిట్సిన్, అతని భార్య, ఎనిమిది నెలలు-14 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న తొమ్మండుగురు పిల్లలు, అంధుడైన 74 ఏళ్ళ తండ్రి, తల్లి - వీరందరూ ఇల్లు వదలి రోడ్డుమీద పడ్డారు. పసిపాపను టాపిట్సిన్ ఎత్తుకుంటాడు. అతని భార్య మరో బిడ్డను ఎత్తుకుంటుంది. ఆడవాళ్ళు గొల్లు గొల్లున ఏడుస్తుంటే మగవారు వారిని ఓదారుస్తారు. మంచుతో కప్పబడిన రోడ్డు మీద గ్రామస్తులు ప్రయాణం మొదలు పెడతారు. గ్రామస్తుల ఇళ్ళనుంచి దోచుకున్న ఆహారపదార్థాలతో వాళ్ళ వెనుక జర్మన్ సైనికులు నడుస్తారు. తల్లి మెల్లిగా నడుస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు జారి పడిపోతూ ఉంటుంది. వేగంగా నడవమని జర్మన్ సైనికుడు ఆమెను కొడతాడు. ఆ రాత్రి మంచులో మరో గ్రామానికి నడుస్తుండగా అతని బిడ్డ, మరో నలుగురు పిల్లలూ చలివల్ల చనిపోతారు. రెండో రోజు మూడేళ్ళ కొడుకు చచ్చిపోతాడు. ఆ రోజు మధ్యాహ్నం నడవలేక వెనుకబడ్డవారిని జర్మన్లు కాల్చి వేయడం మొదలుపెడతారు. టాపిట్సిన్ భార్యను, ఒక కూతురిని జర్మన్లు కాల్చి వేస్తారు. గ్రామం నుంచి తరలించిన 80 మందిలోనూ 21 మందిని హత్య చేసి, 30 మందిని గాయపరచి, రష్యన్ సైన్యం సమీపిస్తుండడంతో జర్మన్లు పారిపోతారు. టాపిట్సిన్ కుటుంబంలో ఉన్న మొత్తం 13 మందిలో ఏడుగురు మిగులుతారు.

జర్మన్ ఆక్రమణకు ముందు ఆ జిల్లాలో 6000 ఇళ్ళుండేవి. ఎర్ర సైన్యం ఆ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనపరుచుకునేటప్పటికి రోడ్డుకి దూరంగా ఉన్న 1287 ఇళ్ళు మాత్రమే నిలిచి ఉన్నాయి. జర్మన్లు 2886 ఇళ్ళను పూర్తిగా నాశనం చేశారు. 1827 ఇళ్ళు బాగా దెబ్బతిన్నాయి.

వాల్టర్ కెర్ మరో గ్రామంలో ఉన్న ఉరికొయ్యల గురించి కూడా వివరంగా రాశాడు.

25 అడుగుల ఎత్తు ఉన్న రెండు కొయ్యల మధ్య అడ్డంగా 20 అడుగుల అడ్డకొయ్య ఉంది. ఇది శాంతికాలంలో పిల్లల ఆటస్థలం. ఇంతకు ముందు ఈ అడ్డకొయ్యకు రింగులుండేవి. పిల్లలు ఈ రింగులు పట్టుకుని ఊగుతూ ఆడుతుండేవారు. జర్మన్లు రింగులు తీసివేసి దీన్ని ఉరి కొయ్యగా మార్చారు. అడ్డకొయ్య నుండి కిందికి దిగిన రాగితీగ చివర ఉరితాడు ఉండేది. ఉరితీయబడే వ్యక్తిని రెండు డ్రమ్ముల మీద నిలబెట్టి మెడకు ఉరితాడు తగిలించి డ్రమ్ములు తన్నేసేవారు. మృతుడి శవం అలాగే వేలాడుతుండేది. ఆ గ్రామంలో జర్మన్లు ఆరుగురిని ఉరితీశారు. ఉరితీయబడ్డవాళ్ళలో 27 ఏళ్ళ స్త్రీ కూడా ఉంది. ఆమె భర్త ఎర్ర సైన్యంలో ఉన్నాడు. ఆరు శవాలూ మంచుకూ, వానకూ తడుస్తూ రష్యన్లు తిరిగి ఆ ప్రాంతాన్ని ఆక్రమించే వరకూ అలా నెలల తరబడి వేలాడుతూనే ఉన్నాయి.

రష్యాలో అడుగడుగునా ప్రతీ క్షణం జరిగిన జర్మన్ దురంతాలకు ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే.

బానిసలుగా.....

రష్యానుండి 40 లక్షలమంది పౌరులను బానిసలుగా జర్మనీకి తరలించారు. వీరిలో సగం మంది స్త్రీలు. రష్యన్ పౌరులను పట్టుకుని గుడ్స్ పెట్టెలలో నింపి జంతువులను తరలించినట్లు జర్మనీకి తరలించేవారు. వారాల తరబడి ఈ ప్రయాణంలో ఆహారం, నీళ్ళు ఉండేవి కావు. మలమూత్రాలు విసర్జించడానికి మరుగు సౌకర్యాలు ఉండేవి కావు. రష్యన్ పౌరులు జర్మనీలో గనుల్లో, పొలాల్లో, ఫాక్టరీలలో బానిసలుగా పనిచేసేవారు. హీనంగా బతుకుతూ జర్మన్ హింసలకు గురవుతూ ఆహారం, దుస్తులు, ఉండడానికి వసతీ లేక మృత్యువు పాలయ్యేవారు.

ఇలా లక్షలమందిని బానిసలుగా జర్మనీకి తరలించడం వలన కుటుంబాలు చెల్లాచెదురయ్యేవి. భార్యలను భర్తలనుంచి, పిల్లలను తల్లిదండ్రులనుంచి విడదీసి దూర ప్రాంతాలకు పంపించేవారు. పని చెయ్యగలిగే వయసులో ఉన్న పిల్లలను కూడా వదలలేదు. జూన్ 12, 1944 న ఒక అదేశంలో 'ఆర్మీ గ్రూప్ సెంటర్ 10-14 ఏళ్ళ వయసుగల 40-50,000 మంది పిల్లలను బంధించి జర్మనీకి పంపించాలనే ఉద్దేశంతో ఉంది.....జర్మనీలో పనివాళ్ళ కొరత ఉంది కనుక జర్మన్ వ్యాపారస్తులు ఈ సైనిక చర్యను ఎంతో ఉత్సాహంతో ఆహ్వానిస్తున్నారు....ఈ చర్యవలన శత్రువుకు సైన్యంలో చేరే యువకుల సంఖ్య తగ్గుతుంది. అదీకాక శత్రువు పునరుత్పత్తి కూడా తగ్గుతుంది....' అని పిల్లలను కూడా జర్మనీకి బానిసలుగా తరలించమని జర్మన్ సైన్యం ఆదేశించింది - (The Rise and Fall of Third Reich, William Shirer, P. 1235).

Edit with WPS Office
అటువంటి చర్యలకు ప్రతిఘటన ఎదురైనప్పుడు గ్రామాలను తగులబెట్టి, గ్రామ ప్రజలందరినీ జర్మనీకి తరలించేవారు. కాళ్ళమీద నిలబడగలిగినంత కాలం ఆ బానిసల చేత పని చేయించేవారు.

వాల్యా అనే రష్యన్ బాలిక తన అనుభవాలు ఇలా వివరించింది (Russia at War, Alexander Werth, P. 719-722) - '....1942 ఫిబ్రవరి 12 తెల్లవారకట్ల రెండు గంటలకు యుక్రెయిన్ పోలీసులూ జర్మన్ పోలీసులూ మా గ్రామానికి వచ్చారు. నాతో పాటు అనేకమంది అమ్మాయిలను ఐదు గంటలకు రైల్వే స్టేషనుకు తీసుకు పోయి గుడ్స్ పెట్టెలో ఎక్కించారు. ఆ పెట్టెలో 70 మంది అమ్మాయిలు ఉన్నారు....అనేక రోజుల ప్రయాణం తర్వాత ఒక కేంపు చేరుకున్నాం. అక్కడ ఫాక్టరీ యజమాని ఒకడు మమ్మల్ని కేంపు నుండి ఫాక్టరీకి తీసుకు వెళ్ళాడు. అక్కడ కూడా కేంపులో లాగే ఉండేది.

తెల్లవారకట్ల ఐదు గంటలకు లేచేవాళ్ళం. ఏవీ తినకుండా ఆకలి కడుపుతో మధ్యాహ్నం రెండు గంటలదాకా పని చేసే వాళ్ళం. రెండు గంటలకు రంపపు పొట్టు, ఇంకా అనేక పదార్థాలూ కలిపిన బ్రెడ్ స్లైసు ఒకటి, రెండు చెంచాల దుంపల పులుసూ ఇచ్చేవారు. తరువాత రాత్రి పదకొండు, పన్నెండు వరకూ పని. సాయంత్రం మూడు నాలుగు ఉడికించిన బంగాళా దుంపలు....కొద్దిగా కాఫీ.....ఇదీ మా ఆహారం.

ఫాక్టరీలో జర్మన్లు చాలా క్రూరంగా ఉండేవారు. నేను పని చేస్తున్న యంత్రం పాడైపోయింది అని చెప్పినందుకు అది నా నేరమైనట్లు ఒక జర్మన్ స్త్రీ నన్ను తీవ్రంగా కొట్టింది. మరొకసారి నేను పని చేస్తున్న యంత్రం ఆగిపోయినందుకు ఫోర్మన్ తీవ్రంగా కొట్టాడు. ఫాక్టరీ అంతా ధూళితో నిండి ఉండేది. పగలు కూడా లైట్లు వేసేవారు.....మేము వేసుకున్న దుస్తులే తప్ప మరో జత దుస్తులు లేవు.....జర్మన్లు మేము మనుషులం కాము అన్నట్లు ప్రవర్తించేవారు. ఆహార లోపం వలన అందరికీ స్కర్వీ జబ్బు వచ్చింది. పళ్ళు ఊడిపోయేవి....'

జర్మనీలో పని చేస్తున్న స్త్రీలు గర్భవతులవుతే వారిని రష్యాకు వెనక్కు పంపించేవారు. ఈ నరకాన్నుంచి తప్పించుకోవడానికి దగ్గరలో కేంపుల్లో ఉన్న ఫ్రెంచ్, ఇంగ్లీషు యుద్ధ ఖైదీల ద్వారా గర్భవతి అవుతే బాగుంటుంది అనే ఆలోచన కూడా వాల్యాకు వచ్చింది. చివరకు ఉద్దేశపూర్వకంగా యంత్రంలో చెయ్యి పెడుతుంది. ఆమె చెయ్యి కోల్పోయి రష్యాకు చేరడం చూసిన ఆమె స్నేహితురాలు కూడా యంత్రంలో చెయ్యి పెడుతుంది. కాని జర్మన్లు జరిగింది గ్రహించి ఆమె స్నేహితురాలిని తీవ్రంగా శిక్షించారు.

ఈ బానిసల బతుకులు ఎంత హృదయవిదారకంగా ఉండేవో మరో ఉదాహరణ - రష్యా నుంచి బానిసలను తీసుకు వెడుతున్న ఒక రైలు బ్రెస్ట్ స్టేషను చేరింది. అదే సమయంలో జర్మనీ నుంచి 'అరిగిపోయిన బానిసలతో' తిరిగి వస్తున్న మరో రైలు కూడా ఆ స్టేషను చేరింది. ఈ సంఘటన గురించి ఆందోళన పడుతూ డా. గుట్ కెల్చ్ అనే జర్మన్ అధికారి '.....ఒక పెద్ద ప్రమాదం తప్పింది.....జర్మనీ నుంచి వస్తున్న బండిలో శవాల గుట్టలు....ఈ బండిలో గర్భిణీ స్త్రీలు ప్రయాణంలో ప్రసవించిన శిశువుల్ని కిటికీలోంచి బయటకు విసిరేస్తున్నారు.....అనేక రోగాలతో ఉన్న రోగులు....అందరూ క్రిక్కిరిసి పోయి ఒకే పెట్టెలో ఉన్నారు.....చావబోతున్న వారు బోగీలో నేలమీద పడుకుని ఉన్నారు.....చనిపోయిన వాడిని ఒకడిని స్టేషనులోనే పెట్టెలోంచి బయటకు తోసేశారు.....' అని తన రిపోర్టులో వివరించి ఇటువంటి దృశ్యాలు జర్మనీ వెళ్ళబోతున్న బానిసల కంటబడితే ప్రమాదం అని చెప్పి, అటువంటివి జరగకుండా చూడాలని కోరాడు (The Rise and Fall of Third Reich, William Shirer, P. 1236).

జర్మనీకి గన్నులు, టాంకులు, మందుగుండు తయారు చేసే పెద్ద పరిశ్రమ క్రుప్ వర్క్స్. ఈ క్రుప్ వర్క్స్ లో బానిసలు పని చేసేవారు. ఈ పరిశ్రమలో పని చేసిన 600 మంది స్త్రీల గురించి ఒక డాక్టరు న్యూరెంబర్గ్ విచారణలో ఇలా చెప్పాడు - '....నేను మొదటి సారి వాళ్ళను చూసినప్పుడు వాళ్ళ ఒళ్ళంతా రసికారుతున్న కురుపులతో, గాయాలతో నిండి ఉంది. రోగాలు....వైద్య సదుపాయం లేదు. కాళ్ళకు జోళ్ళు లేవు. వాళ్ళకు దుస్తులకు బదులు ఒక గోనె సంచీ ఉంది. తల దగ్గరా, కాళ్ళూ చేతుల దగ్గరా కన్నాలుండేవి. వాళ్ళుండే కేంపు చుట్టూ ముళ్ళ కంచె.....సైనికులు కాపలా కాస్తుండేవారు....బేరక్స్ లో అడుగు పెట్టగానే ఈగలు ఝుమ్మని దాడి చేసేవి.....రష్యానుంచి వచ్చిన కూలీలు.....అవే దుస్తులతో వారాలు ప్రయాణం చేశారు. అవే దుస్తులతో పని చేస్తున్నారు. అవే దుస్తులతో నిద్రిస్తున్నారు. వాళ్ళకు ఆ దుస్తులు తప్ప కోట్లు లేవు. చలిలో, వానలో వాళ్ళు దుప్పట్లు కప్పుకుని ఉండేవారు. శీతాకాలం కూడా ఈ బానిసలు బూట్లు లేకుండా వట్టి కాళ్ళతో పని చేస్తుండేవారు. వీళ్ళకు మరుగు దొడ్ల సౌకర్యం లేదు. 12000 మందికి 10 మరుగుదొడ్లు ఉండేవి.

Edit with WPS Office
నేలంతా మలంతో నిండిపోయి ఉండేది. వసతి లేకపోవడం, ఆహారం లేకపోవడం, శ్రమ, విశ్రాంతి లేకపోవడం వల్ల ఖైదీలు ఈగల్లా రాలిపోతుండేవారు. నల్లులు, ఈగలు....అనేక రకాల రోగాలతో బాధపడేవారు. కొన్ని కొన్ని సార్లు, ఎనిమిది నుంచి పధ్నాలుగు రోజుల దాకా కేంపుకు నీటి సరఫరా ఆపుచేసేవారు....' (The Rise and Fall of Third Reich, William Shirer, P. 1237).

జర్మన్ల ఇళ్ళల్లో పని చెయ్యడానికి స్లావ్ స్త్రీలను బానిసలుగా తీసుకుపోయేవారు. జర్మన్ గృహిణులను ఇంటి పని నుంచి విముక్తి చెయ్యడానికి 5 లక్షలమంది స్లావ్ స్త్రీలను జర్మనీకి పంపించాలని 1942లో హిట్లర్ ఆదేశించాడు. ఈ స్త్రీ బానిసలు ఇంటి పనులు చెయ్యడానికి మాత్రమే ఇల్లు వదలి వెళ్ళవచ్చు వారికి విశ్రాంతి అన్నది ఉండేది కాదు.

హత్యాకాండ

నగరాలను నాశనం చెయ్యడం, ప్రజలను ఆకలితో మాడ్చి చంపడం మాత్రమే కాదు. జర్మన్ సైన్యం వెనుక ప్రత్యేక బలగాలు (Einsatzgruppen) ఉండేవి. హిట్లర్ ఈ సాయుధ మూకలకు '.... రష్యన్ సమాజంలో నాయకత్వం వహించగల వారినందరినీ (అంటే మేధావి వర్గాన్ని), కమ్యూనిస్టులనూ, యూదు మతస్థులనూ గెరిల్లాలనూ, జర్మన్ ఆక్రమణను ప్రతిఘటించేవారినీ - అందరినీ అంతం చెయ్యమని' ఆదేశించాడు. ఈ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించింది జర్మన్ సైన్యం. కమ్యూనిస్టులనూ యూదు మతస్తులనూ కమిస్సార్లనూ పట్టుకున్న వెంటనే చంపేసేవారు. ధాన్యం, పశు సంపద, యంత్ర సామగ్రి మొదలైన విలువైన వాటిని దోచుకోవడమే కాక ఇళ్ళూ, గ్రామాలూ తగలబెట్టేవారు. అడ్డుపడిన పౌరులను హత్య చేసేవారు.

హిట్లర్, హిమ్లర్ వంటి కరుడు గట్టిన నాజీలు మాత్రమే కాదు - జర్మన్ సైన్యం కూడా అన్ని యుద్ధ నియమాలనూ ఉల్లంఘించి నిరాయుధులైన పౌరులను హత్య చేసింది. గౌరవనీయులుగా చలామణి అయ్యే అనేకమంది జనరల్సుకు ఈ హత్యాకాండలో భాగం ఉంది. ఫీల్డ్ మార్షల్ వాన్ మాన్ స్టీన్ 'జ్యూల-బోల్షివిక్కుల వ్యవస్థను నాశనం చెయ్యాలి. జర్మన్ సైనికుడు జాతి సిద్ధాంతాన్ని అమలు చెయ్యడానికి వచ్చిన వాడు. (అతను).....యూదులను కఠినంగా శిక్షించాల్సిన ఆవశ్యకతను అర్థం చేసుకోవాలి.....సైన్యానికి ఆహారం ఆక్రమిత ప్రాంతాలనుండే అందాలి. సాధ్యమైనంత అధికంగా జర్మనీకి ఆహారధాన్యాలను పంపించాలి. శత్రు నగరాలలోని జనాభాలో అధికభాగం ఆకలితో మాడిపోతుంది. మానవతా దృక్పధంతో యుద్ధఖైదీలకు గాని, జనాభాకు కాని ఆహారం ఇవ్వకూడదు. జర్మన్ సైన్యానికి ఉపయోగపడేటట్లయితేనే వారికి ఆహారం ఇవ్వాలి.....' అని ఒక ఆదేశంలో చెప్పాడు.

యూదులనూ సోవియట్ కమిస్సార్లనూ - స్త్రీలు, పిల్లలతో సహా - చంపెయ్యడం వంటివి ఈ ప్రత్యేక దళాలు చేసేవి. ఈ దళాలు గ్రామంలోనో, పట్టణంలోనే ప్రవేశించి యూదులందరినీ సమావేశపరచేవి. వారిని మరో ప్రదేశానికి తరలిస్తున్నామని చెప్పేవారు. వారి దగ్గరున్న విలువైన వస్తువులన్నీ స్వాధీనం చేసుకునే వారు. తర్వాత ట్రక్కులలో నిర్ణయించిన ప్రదేశానికి తీసుకువెళ్ళే వారు. వారిని కాల్చి వేసే ముందు నగ్నం చేసేవారు. చంపేసి గోతుల్లో పడేసేవారు. తర్వాత ఈ హత్యాకాండకు గేస్ వేన్లు కూడా ఉపయోగించడం మొదలు పెట్టారు.

ఈ గేస్ వేన్లు, చూడడానికి అన్ని పక్కలా మూయబడ్డ మామూలు ట్రక్కుల్లాగే కనుపించేవి. యూదులను మరో ప్రదేశానికి తీసుకు వెడుతున్నామని చెప్పి ఈ వేన్లలోకి ఎక్కించి తలుపులు మూసేసేవారు. ఇంజను స్టార్టు చెయ్యగానే ఇంజను పొగ ట్రక్కులోపలికి పోయేలా వీటిని నిర్మించేవారు. పది, పదిహేను నిమిషాలలో ట్రక్కులో ఉన్న వారు చనిపోయేవారు. అయితే ఈ గేస్ వేన్లలో తడవకు పది, పదిహేనుమంది కంటే ఎక్కువమందిని చంపగలిగేవారు కారు. అదీకాక ఈ గేస్ వేన్లు మరణ వేదనతో కొట్టుకున్న మృతుల మలమూత్రాలతో, వమనాలతో నిండిపోయి అటువంటి హత్యాకాండ చేస్తున్న జర్మన్ సైనికుల మానసిక సంతులనత మీద ప్రభావం చూపించేవి. అందుచేత ఈ గేస్ వేన్ల పద్ధతికి స్వస్తి చెప్పడం జరిగింది. పెద్ద ఎత్తున అంతం చెయ్యాల్సి వచ్చినప్పుడు కాల్చి చంపేవారు.

1942 అక్టోబరు 5న యుక్రెయిన్ లో జరిగిన హత్యాకాండను చూసిన ఒక సాక్షి, ఒక జర్మన్ ఇంజినీరు, న్యూరెంబర్గ్ విచారణ సమయంలో ఇలా వెల్లడించాడు -

'.....ట్రక్కుల్లోంచి దిగిన వారినందరినీ - స్త్రీలూ, పురుషులూ, పిల్లలతో సహా - నగ్నంగా నిలబడమని ఆదేశించాడు ఒక సైనికుడు. అతని చేతిలో కొరడా ఉంది. అక్కడ జోళ్ళూ, పై దుస్తులూ,

Edit with WPS Office
లోని దుస్తులూ పెద్ద గుట్టలుగా ఉన్నాయి. ఏడవకుండా, అరవకుండా వాళ్ళంతా మౌనంగా నగ్నమయ్యారు. అతను ఆజ్ఞాపించినట్లు వాళ్ళు పై దుస్తులు, లోని దుస్తులు, జోళ్ళూ వేరు వేరు ప్రదేశాలలో ఉంచారు. కుటుంబ సభ్యులు ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకుని మరో సైనికుడి ఆజ్ఞకోసం ఎదురు చూడసాగారు. ఈ రెండో సైనికుడు ఒక గొయ్యి దగ్గర కొరడా పుచ్చుకుని నిలబడి ఉన్నాడు. అక్కడ నేను పదిహేను నిమిషాలున్నాను కాని ఎవరూ దయ చూపించమని అడగలేదు.

ఒక వృద్ధురాలు ఏడాది వయసు పాపను ఎత్తుకుని ఆడిస్తోంది. ఆ పాప సంతోషంతో కేరింతలు కొడుతోంది. ఆ పాప తల్లిదండ్రులు కన్నీళ్ళతో చూస్తున్నారు. తండ్రి పదేళ్ళ కొడుకు చెయ్యి పట్టుకుని మెల్లిగా మాట్లాడుతున్నాడు. ఆ కుర్రాడు ఏడుపు ఆపుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. తండ్రి ఆకాశం కేసి చూపించి కొడుకుతో ఏదో అన్నాడు.

గొయ్యి దగ్గరున్న సైనికుడు ఆ సమయంలో ఏదో అరిచాడు. జనం దగ్గరున్న సైనికుడు ఇరవైమందిని లెక్కపెట్టి మట్టి దిబ్బ వెనుకకు వెళ్ళమన్నాడు. నా పక్కనుంచి సన్నగా, నల్లటి జుట్టుతో ఉన్న అమ్మాయి వెళ్ళింది. వెడుతూ వెడుతూ తన కేసి వేళ్ళు తిప్పి చూపిస్తూ 'నాకు ఇరవై మూడేళ్ళు' అంది.

నేను మట్టిదిబ్బ వైపు వెళ్ళాను. అక్కడ ఒక పెద్ద గొయ్యి కనుపించింది. అందులో జనం గుట్టలు గుట్టలుగా పడి ఉన్నారు. వాళ్ళ తలలు మాత్రమే కనిపిస్తున్నాయి. తలలనుండీ భుజాల నుండీ రక్తం ప్రవహిస్తోంది. కొంతమంది కదులుతున్నారు. కొంతమంది ఇంకా తాము బ్రతికే ఉన్నామని చెప్పడానికి తలలు కదుపుతున్నారు. చేతులు పైకెత్తుతున్నారు. ఈ గొయ్యి రెండు వంతులు నిండి ఉంది. గోతిలో ఒక వెయ్యిమంది దాకా ఉంటారు. వీళ్ళను కాల్చి చంపిన SS సైనికుడు గొయ్యి అంచున, గోతిలోకి కాళ్ళు వేలాడేసి కూర్చుని సిగరెట్టు కాలుస్తున్నాడు. అతని చేతిలో టామీ గన్ ఉంది. ఈ ఇరవై మంది గోతిలో దిగి, గోతిలో ఉన్న వాళ్ళ తలల మీదుగా నడిచి సైనికుడు చెప్పిన చోట నిలబడ్డారు. టామీ గన్ను పేలింది. నేను గోతిలోకి చూశాను. ఇరవైమందీ కూలిపోయారు. వాళ్ళ మెడనుంచి రక్తం కారుతోంది. కొంతమంది నిశ్చలంగా ఉన్నారు. కొంతమంది శరీరాలు కొట్టుకుంటున్నాయి. ఈ లోగా మరో ఇరవైమంది వచ్చి, ఇంతకుముందు కాల్చబడిన ఇరవైమంది ఎదురుగా నిలబడ్డారు.....' - (The Rise and Fall of Third Reich, William Shirer, P. 1251-52).

యుద్ధకాలంలో దాదాపు 8 లక్షలమంది రష్యన్ యూదులను జర్మన్లు హత్య చేశారు. గేస్ వేన్లూ ప్రత్యేక దళాలూ కోట్లమంది రష్యన్లనూ పోలిష్ ప్రజలనూ యూదులనూ అంతం చెయ్యలేవు. మృత్యువును ఒక భారీ పరిశ్రమగా మార్చితే కాని కోట్లమందిని అంతం చెయ్యడం సాధ్యం కాదు. నాజీల రాక్షసత్వానికి పరాకాష్ట మృత్యు కర్మాగారాలు.

మృత్యు కర్మాగారాలు

పురోగమిస్తున్న రష్యన్ సైన్యాలు 1944 జులై 23న మేడెనిక్ లో ప్రవేశించి మొట్టమొదటి సారి మృత్యు కర్మాగారాలను చూశాయి. ఇక్కడ జర్మన్లు 15 లక్షల మందిని హత్య చేశారు. వేలమందిని కాల్చి చంపిన సంఘటనలున్నా, గ్రామాలకు గ్రామాలను తుడిచి వేసిన సంఘటనలున్నా, జనాభాను హత్య చెయ్యడం ఒక భారీ పరిశ్రమగా మేడెనిక్ లో మొట్టమొదటిసారి వెలుగులోకి వచ్చింది. ఆగస్టు నెలలో మేడెనిక్ ను దర్శించిన అలెగ్జాండర్ వెర్త్ ఈ మృత్యు కర్మాగారం గురించి బి.బి.సి. కి రిపోర్టు పంపితే, బి.బి.సి. ఇదంతా రష్యన్ ప్రచారమనీ నమ్మశక్యం కాదు అనీ ఆ వార్తను ప్రసారం చెయ్యడానికి నిరాకరించింది. తరువాత పశ్చిమాన బుషెన్ వాల్డ్, దాచా, బెల్సెన్ లాంటి మృత్యు కర్మాగారాలు చూసిన తర్వాత మేడెనిక్, ఆష్విజ్ లు రష్యన్ ప్రచారం కాదనీ భయంకరమైన వాస్తవాలు అనీ ప్రపంచం అంగీకరించింది.

మేడెనిక్ మృత్యు కర్మాగారం గురించి వెర్త్ తన పుస్తకం 'రష్యా ఎట్ వార్'లో వివరంగా రాశాడు.

'....మేడెనిక్ చూడగానే నేను ఆశ్చర్యపోయాను. ఊహకందని భయంకరమైన దృశ్యమేదో నా కళ్ళపడుతుందనుకున్నా కాని బయటనుంచి చూస్తే నాకు అటువంటి భావం ఏమీ కలుగలేదు. కార్మికుల నివాసాలలా కనుపించే కాలనీ ముందు ఆగినప్పుడు 'ఇదా (మృత్యుకర్మాగారం)?'అని నాకు ఆశ్చర్యం కలిగింది.....రోడ్డుకూ కేంపుకూ మధ్య రెండు వరుసల ముళ్ళ కంచె.....ఇటువంటి ముళ్ళ కంచెలు సైనిక స్థావరాలలో సహజమే.....ఆ ప్రదేశం చాలా విశాలమైనది. ఆకుపచ్చ రంగుతో

Edit with WPS Office
పెయింటు చెయ్యబడిన బేరక్సుతో నిండిన పెద్ద పట్టణంలాగా ఉంది....' అని ఆ కేంపు పైకి ఎంత నిరపాయకరంగా కనుపించేదో చెప్పి, ఆ కేంపులో ఏం జరిగేదీ వివరించాడు.

అనేక రోజుల ప్రయాణం తర్వాత కేంపుకు చేరిన ఖైదీలను స్నానం చెయ్యమని ఆదేశించేవారు. గదిలో బల్లల మీద ఖైదీలు తమ దుస్తులు ఉంచి నగ్నమయ్యేవారు. సుదీర్ఘ ప్రయాణం తర్వాత స్నానం చేస్తున్న ఖైదీలు కొన్ని నిమిషాల తర్వాత ఏం జరగబోతోందో బహుశా ఊహించగలిగేవారు కారు. స్నానం చేసిన తర్వాత వారిని మరో గదిలోకి పంపించేవారు. ఈ 'మరో గది'లో ఐదు చదరపు గజాల గదులు (కాంక్రీటు బాక్సులు) ఆరు ఉండేవి.

ఈ గదులకు కిటికీలు లేవు. బరువైన స్టీలు తలుపులుండేవి. ఈ తలుపులకు మూడు అంగుళాల వ్యాసార్థం గల రంధ్రం ఒకటి ఉండేది. ఈ రంధ్రానికి అద్దం ఉండేది. నగ్నంగా ఉన్న 200-250 మంది ఖైదీలను - పురుషులనూ స్త్రీలనూ పిల్లలనూ - వేరు వేరు బేచ్ లుగా ఈ కాంక్రీటు బాక్సులలోకి కుక్కేవారు. బహుశా అంతవరకూ ఏ అనుమానం రాని వారికి కూడా ఈ కాంక్రీటు బాక్సులలో అడుగు పెట్టగానే ఇక్కడకు ఎందుకు తీసుకు వచ్చారు అని బహుశా సందేహం కలిగేదేమో. పైన కప్పులో ఉన్న కన్నం నుండి వచ్చే కొద్దిపాటి వెలుగూ, మూసుకున్న తలుపుకు ఉన్న చిన్న అద్దం నుంచి వచ్చే వెలుగూ తప్ప లోపలంతా చీకటిగా ఉండేది.

తలుపుకున్న అద్దంలోంచి లోపల ఉన్న ఖైదీలను జర్మన్ సైనికులు చూస్తుండేవారు. ఖైదీలను కాంక్రీటు బాక్సులోకి పంపించి స్టీలు తలుపులు వేసి గడియ పెట్టేవారు. మొదట కప్పులో ఉన్న రంధ్రం గుండా వేడిగాలి పంపించేవారు. ఆ తరువాత కప్పునుండి లేత నీలం రంగు సైక్లోన్ స్ఫటికాలు జనాల మీద కురిసేవి. వేడి గాలిలో ఈ స్ఫటికాలు త్వరలోనే ఆవిరై విషవాయువు గదంతా వ్యాపించేది. రెండు నుంచి పది నిమిషాలలో గదిలో ఉన్న అందరూ మరణించేవారు. మరణిస్తున్నవారి ఏడుపులూ ప్రార్థనలూ శాపాలూ, మందమైన కాంక్రీటు గోడలు, స్టీలు తలుపులు దాటి బయటికి రాకుండా 'హెర్ ఆర్ట్, బెర్లిన్' కంపెనీ ఈ గదులను నైపుణ్యంతో నిర్మించింది. ఈ ఆరు కాంక్రీటు గదులలోనూ తడవకు రెండువేల మందిని హత్య చెయ్యవచ్చు. కొన్ని నిమిషాల తర్వాత లోపల కదలికలు ఆగిపోయిన తర్వాత తలుపు మీద నీలం చాకు పీసు తో 'వెన్ గేస్ట్' (గేస్ తో చంపడమైనది) అని జర్మన్ గార్డులు రాసేవారు.

అక్కడనుండి శవాలను టార్పాలిన్ కప్పిన లారీలలో లోడు చేసి, అరమైలు దూరంలో కేంపు చివరనున్న దహన ప్రదేశానికి తీసుకు వెళ్ళేవారు. అక్కడ కాలరు ఎముకలు, చేతి వేళ్ళ ఎముకలు, కపాలాల ముక్కలు, పసిపిల్లల ఎముకలతో నిండిన తెల్లటి బూడిద గుట్టలుండేవి. ఈ గుట్టలకావల సమతల ప్రదేశంలో అనేక ఎకరాలలో తెల్లటి బూడిదతో కప్పబడిన పెద్ద పెద్ద కేబేజీ పువ్వులతో నిండిన కేబేజీ పొలాలుండేవి. ఒక పొర ఎరువు, మరొక పొర చితాభస్మం వేసి కేబేజీలు పెంచేవారు జర్మన్లు. మేడెనిక్ కేంపులో అడుగు పెట్టిన ఖైదీలు ఏపుగా పెరిగిన కేబేజీలుగా మారిపోయేవారు.

దహన ప్రదేశంలో బ్రహ్మాండమైన ఆరు ఫర్నేసులుండేవి. వాటి నుంచి పెద్ద ఫాక్టరీ పొగ గొట్టంలా ఒక పొగ గొట్టం ఉండేది. ఫర్నేసుకు ఒక వైపు బొగ్గు గుట్టలు.....మరో వైపు శవాలను ఫర్నేసులోకి పంపించేందుకు తలుపులూ ఉండేవి. అక్కడంతా కుళ్ళు వాసన....నేలంతా చితాభస్మంతో నిండి ఉండేది. ఫర్నేసుకు మరో వైపున ఆపరేషన్ టేబులు లాగా పెద్ద కాంక్రీటు స్లాబ్ ఉండేది. ఇక్కడ ఒక 'స్పెషలిస్టు' ఫర్నేసులోకి వెళ్ళ ప్రతీ శవాన్ని పరిశీలించి బంగారపు పన్నులుంటే అవి తీసి ఆ బంగారాన్ని రై బేంకుకు (జర్మన్ బాంకుకు) పంపించేవాడు.

ఒక్కొక్కప్పుడు 'ప్రత్యేక దినాల'లో ఈ ఫర్నేసులు కెపాసిటీని మించి శవాలు దహనం చెయ్యవలసి వచ్చేది. 1943 నవంబరు 3న, 'యూదులను అంతం చేసే దినం' నాడు, 20,000 మందికి పైగా స్త్రీలనూ పురుషులనూ పిల్లలనూ హత్య చెయ్యడం జరిగింది. ఇంతమందిని ఒక్క రోజులో గేస్ ఛాంబర్లలో చంపడం అసాధ్యమైంది. చాలామందిని తుపాకీతో కాల్చి చంపి సమీపాన ఉన్న అడవిలో పూడ్చారు. ఒక్కొక్కసారి ఫర్నేసులకు వెలుపన శవాలను గుట్టలుగా పేర్చి పెట్రోలుతో తడిపి అంటించి తగలబెట్టేవారు.

ఈ మృత్యు పరిశ్రమలో జరుగుతున్న వ్యాపారం గురించి అలెగ్జాండర్ వెర్త్ వివరించాడు.

'నవంబరు 3న సమీప అడవుల్లో జర్మన్లు 10,000 మంది యూదులను కాల్చి చంపారు. ఆ రోజు వ్యాపారం కంటే వేగంగా లక్ష్యాన్ని సాధించడం ముఖ్యమైనందున మృతులను నగ్నం చెయ్యకుండానే కాల్చి చంపారు. స్త్రీల చేతుల్లో హేండ్ బేగ్ లూ పిల్లల చేతుల్లో బొమ్మలూ అలాగే

Edit with WPS Office
ఉన్నాయి.....కుళ్ళుతున్న శవాలలో ఎలుగుబంటి బొమ్మను పట్టుకున్న ఒక పసిపాప శవం చూశాను.....కాని ఇల్లాంటిది జరగడం చాలా అరుదు.

ఈ మృత్యు వ్యాపారంలో నియమం ఏమిటంటే ఏదీ వృధా కాకూడదు. ఒక బేరన్ లాంటి కట్టడంలో 8,50,000 జతల పాదరక్షలు కనుపించాయి. అందులో పసిపాపల బూట్లు కూడా ఉన్నాయి....ఛోపిన్ వేర్ హౌస్ అనే బ్రహ్మాండమైన ఐదు అంతస్థుల భవనం - ఈ మృత్యు కర్మాగారానికి చెందినది - ఉంది. లక్షలమంది మృతులకు చెందిన వస్తువులన్నీ జాగ్రత్తగా పేక్ చేసి జర్మనీకి పంపిస్తుండేవారు.....ఒక పెద్ద హాలులో వేల ట్రంకు పెట్టెలు, సూటు కేసులూ ఉన్నాయి. మరికొన్ని గదుల్లో వేల జతల చెప్పులు సైజువారీ ఉన్నాయి. ఒక పొడుగాటి కారిడార్ లో స్త్రీల దుస్తులు, ఓవర్ కోట్లూ వేల సంఖ్యలో ఉన్నాయి.....పెద్ద పెద్ద చెక్క బీరువాలలో రేజర్లు, షేవింగ్ బ్రష్ లు, వేల చాకులూ, పెన్సిళ్ళూ ఉన్నాయి. పక్క గదిలో పిల్లల బొమ్మలు గుట్టలుగా పడి ఉన్నాయి.....

గ్రవుండ్ ఫ్లోర్లో ఎక్కౌంట్స్ డిపార్టుమెంటు ఉంది.....నవంబరు 3, 1942 తేదీ గల ఛోపిన్ వేర్ హౌస్ కు రాసిన ఒక ఉత్తరంలో హిట్లర్ యూత్ కేంప్, కంపోనీ 934 కు రగ్గులు, టవల్సు, వంటింటి సామాను, చాకులు, పళ్ళాలూ లాంటివి కావాలంటూ ఒక పెద్ద లిస్టు ఉంది.' - (Russia at War, Alexander Werth, pages 796-804).

ఈ మృత్యు కర్మాగారాలను నిర్మించడానికీ శవాలను దహనం చేసే ఫర్నేసుల నిర్మాణానికీ హత్య చెయ్యడానికి ఉపయోగించే విషవాయువు సరఫరా చెయ్యడానికీ జర్మన్ కంపెనీల మధ్య పెద్ద పోటీ ఉండేది. ఈ వ్యాపారానికి సంబంధించిన పత్రాలూ బిల్లులూ న్యూరెంబర్గ్ విచారణలో బయటపడ్డాయి. ఈ. ఐ. కోరీ అనే కంపెనీ ఈ రంగంలో తమకున్న విస్తారమైన అనుభవం గురించి చెబుతూ దాచాలో నాలుగు ఫర్నేసులూ లుబ్లిన్ లో ఐదు ఫర్నేసులూ తాము నిర్మించామనీ అవి చాలా సంతృప్తికరంగా పని చేస్తున్నాయనీ, అందుచేత బెల్ గ్రేడ్ (మృత్యు కర్మాగార ఫర్నేసు) 'కాంట్రాక్టు' తమకే ఇవ్వవలసిందనీ కోరింది. ఒక్కొక్కసారి ఈ మృత్యు కర్మాగారాలలోని చితా భస్మాన్ని ఎరువుగా అమ్మడం జరిగేదని న్యూరెంబర్గ్ విచారణలో వెల్లడైంది. డాన్జిగ్ లో ఉన్న మరో కంపెనీ మనిషి కొవ్వుతో సబ్బులు తయారు చేసే ఫాక్టరీ ఒకటి నిర్మించింది. 12 పౌండ్ల మనిషి కొవ్వు, 10 వంతులు నీరు, ఒక్కొక్క పౌండుకు 8 ఔన్సుల కాస్టిక్ సోడా - ఇవన్నీ రెండు మూడు గంటలు మరిగించి చల్లారిస్తే సబ్బు తయారవుతుంది - ఇదీ ఈ కంపెనీ ఫార్ములా. జైక్లోన్ - ఇ విష స్ఫటికాలను అమ్మడానికి కంపెనీల మధ్య పోటీ ఉండేది.

న్యూరెంబర్గ్ విచారణకు ముందు ఈ హత్యాకాండ అంతా కరుడుగట్టిన నాజీ ముఠా చేసిందని నమ్మేవారు. కాని ఈ విచారణలో క్రుప్స్, ఐ. జి. ఫార్బెన్ లాంటి పెద్ద కంపెనీలకూ వందల కంపెనీలు డైరెక్టర్లకూ సంఘంలో గౌరవనీయులుగా చలామణి అయ్యే అనేక వందలమందికీ సంబంధం ఉందని తేలింది. డబ్బు సంపాదించడానికి వ్యాపారస్తుడు ఏ స్థాయికి దిగజారగలడో ఈ మృత్యు కర్మాగారాలు తెలియజేస్తాయి.

ట్రెబ్లింకా, బెల్సెక్, సిబీబోర్, చెల్ మో, ఆష్విజ్ లాంటి 30 ముఖ్యమైన మృత్యు కర్మాగారాలలో 60 లక్షలమంది యూదులనూ, 50 లక్షల మంది పోలిష్, రష్యన్ ప్రజలనూ జర్మనీ కాల్చి బూడిద చేసింది.

60 లక్షల యూదుల హత్య గురించి 'హోలో కాస్ట్' అని పశ్చిమ దేశాలలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది కాని పోలిష్, రష్యన్ ప్రజల హత్యల గురించి పెట్టబడిదారీ పత్రికలు ఎక్కువ మాట్లాడవు.

యుద్ధ ఖైదీలు

యుద్ధ తొలిదశలో పట్టుబడిన వెంటనే రష్యన్ ఖైదీలను చంపివెయ్యడం జర్మన్ పాలిసీగా ఉండేది. మొదటి 8 నెలలలోనూ 28 లక్షలమంది రష్యన్ సైనికులు జర్మన్ల చేతిలో చిక్కారు. దాదాపు పది లక్షలమంది సైనికులను పట్టుకోగానే చంపివేయడం జరిగింది. తర్వాత యుద్ధం దీర్ఘ కాలిక యుద్ధంగా పరిణమిస్తోందని గ్రహించిన తర్వాత ఈ యుద్ధ ఖైదీలను చంపెయ్యడం కంటే బానిసలుగా పనిచేయించడం ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుందని జర్మనీ భావించి జర్మనీ వీరిని పరిశ్రమలలోనూ సైన్యంలోనూ ఉపయోగించసాగింది.

యుద్ధకాలంలో 53 లక్షల రష్యన్ సైనికులు ఖైదీలుగా పట్టుబడ్డారు. 1945లో జర్మనీ ఓటమి నాటికి వీరిలో పది లక్షలు మాత్రమే బతికి ఉన్నారు. యుద్ధం జరుగుతుండగా 10 లక్షలమంది రష్యన్ ఖైదీలు విడుదల కావడం కాని లేదా జర్మన్లు ఏర్పాటు చేసిన సోవియట్ వ్యతిరేక సైన్యంలో చేరడం

Edit with WPS Office
కాని జరిగింది. ఆకలి వలనా చలివలనా రోగాల వలనా 20 లక్షలమంది మరణించారు. మరో 10 లక్షలమంది లెక్క తేలలేదు. న్యూరెంబర్గ్ విచారణలో ఈ 10 లక్షలమంది మరణించడం కాని జర్మన్లు వారిని హత్య చెయ్యడం కాని జరిగిందని భావించబడింది. జనీవా యుద్ధ నియమాల ప్రకారం యుద్ధ ఖైదీలను యుద్ధ పరిశ్రమలలోనూ, యుద్ధావసరాలకూ వినియోగించడం నిషేధం. వీరిలో కనీసం 5 లక్షల ఖైదీలు యుద్ధ పరిశ్రమలలో పని చేసే వారు. వీరు కాక లక్షలమంది యుద్ధ ఖైదీలు జర్మన్ సైన్యానికి సైనిక స్థావరాలు నిర్మించే పనిలోనూ, యుద్ధరంగంలో ఉన్న సైన్యానికి మందుగుండు సరఫరా చేసే పనిలోనూ వినియోగించబడ్డారు. రికార్డుల ప్రకారం 1943 సంవత్సరంలో, 80 వేలమంది రష్యన్ యుద్ధ ఖైదీలు జర్మన్ విమాన విధ్వంసక శతఘ్ని దళాలలో ఉన్నారు. 1944 డిసెంబరు నాటికి దాదాపు 7 లక్షలమంది రష్యన్ ఖైదీలు గనుల్లో, యుద్ధ పరిశ్రమల్లో పని చేసేవారు. పొలాల్లో రెండు లక్షలమంది పని చేసేవారు.

పట్టుబడినప్పటినుండీ ఖైదీల కష్టాలు ప్రారంభమయ్యేవి. కేంపులకు వచ్చే ఖైదీలలో ఐదు, పది శాతం కేంపులకు చేరకుండానే దారిలో చనిపోయేవారు. లేదా కేంపుకు చేరేటప్పటికి సగం చచ్చి ఉండేవారు. రైలుస్టేషన్నుంచి కేంపుకు మార్చి చేయిస్తుండగానే చాలామంది ఖైదీలు కూలిపోయేవారు. కల్నల్ ఎర్విన్ లాహౌసెన్ జర్మన్ విదేశ గూఢచార శాఖలో ఆఫీసరు. అక్టోబరు 1941లో అతను ఒక రిపోర్టులో 'రోడ్ల మీద నడుస్తున్న రష్యన్ ఖైదీలు జంతువుల మందలా ఉన్నారు. గార్డులు బలప్రయోగం చేసి వాళ్ళలో కొద్ది క్రమశిక్షణ ఉండేలా చేస్తున్నారు. ఆహారం లేక పోవడం, కేంపుల్లో వసతి సౌకర్యం లేకపోవడం, వందల కిలోమీటర్లు నడవడం కారణంగా నిస్త్రాణతో ఖైదీలు కూలిపోతున్నారు. ఈ కూలిపోయిన ఖైదీలను మిగిలిన ఖైదీలు మోసుకు వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు. 6వ సైన్యం వెనుకబడి పోయిన ఖైదీలను కాల్చి వెయ్యాలని ఉత్తర్వు చేసింది. దురదృష్టవశాత్తూ ఈ విధంగా ఖైదీలను కాల్చి వెయ్యడం (ప్రజల కళ్ళ ఎదురుగా) రోడ్ల మీదా పట్టణాలలోనూ కూడా జరుగుతోంది....' అన్నాడు.

యుద్ధ ఖైదీల కేంపుల్లో పరిస్థితి ఘోరంగా ఉండేది. ఆహారం ఇచ్చేవారు కారు. కేంపులకు తీసుకు వెళ్ళుతున్నప్పుడు రష్యన్ పౌరులు ఖైదీలకు ఆహారం ఇవ్వడానికి ప్రయత్నించే వారు కాని జర్మన్ సైనికులు ఆహారం ఇవ్వనిచ్చేవారు కాదు. అలిసిపోయిన ఈ ఖైదీలు రోడ్డు మీద మరి నడవలేక కూలిపోతే కాల్చి చంపేసేవారు. శవాల్ని అలాగే వదిలేసేవారు. పశువులకు ముద్ర వేసినట్లుగా రష్యన్ ఖైదీలకు ముద్ర వేసేవారు. ఖైదీలను ముళ్ళ కంచె వేసిన బహిరంగ ప్రదేశాలలో ఉంచేవారు. నెత్తి మీద కప్పు ఉండేది కాదు. ఖైదీలు, ఎండలో, వానలో, బురదలో, శీతాకాలం ఉష్ణోగ్రత సున్నాకి 30 డిగ్రీల దిగువకు పడిపోయినప్పుడు చలికి గడ్డ కట్టుకుపోతూ అలా బహిరంగ ప్రదేశాలలో ఉండేవారు. యుద్ధానంతరం ఈ ఖైదీల పరిస్థితి గురించి ఒక హంగేరియన్ ఆఫీసరు హృదయవిదారకంగా చెప్పాడు - '(అప్పుడు) మేం రోవ్నో దగ్గర ఉన్నాం. దూరంగా వేల కుక్కలు మొరుగుతున్న శబ్దంతో నేను నిద్రలోంచి మేల్కొన్నాను. ఏవిటీ గోల అని నా ఆర్డర్లీని అడిగాను. సమీపంలో ఆరుబయలు ప్రదేశంలో 80 వేలమంది రష్యన్ యుద్ధ ఖైదీలున్నారనీ వాళ్ళు ఆకలితో చలితో అరుస్తున్నారనీ ఆర్డర్లీ చెప్పాడు. నేను కేంపుకు వెళ్ళి చూశాను. ముళ్ళ కంచె వెనుక వేలమంది రష్యన్ ఖైదీలున్నారు. చాలామంది చావడానికి సిద్ధంగా ఉన్నారు. వాళ్ళలో కాళ్ళ మీద నిలబడగల శక్తి లేదు. వాళ్ళ మొహాలు ఎండిపోయి కళ్ళు లోపలికి పోయి గుంటలు కనుపిస్తున్నాయి. రోజూ వందల మంది చని పోతున్నారు. కొంచెం ఓపిక ఉన్న వాళ్ళు ఆ శవాలను అక్కడ ఉన్న పెద్ద గొయ్యి లోకి నెట్టుతున్నారు....' - (Russia at War, Alexander Werth, P. 635).

గొయరింగ్ - 'కేంపుల్లో రష్యన్ ఖైదీలు వాళ్ళ బూట్లతో సహా ఏది దొరికితే అది తినేస్తున్నారు. అవి కూడా అయిపోతే తోటి ఖైదీలను తింటున్నారు. ఇప్పుడు పరిస్థితి మరి కొంచెం ప్రమాదకరంగా మారుతోంది. వాళ్ళు ఒక జర్మన్ సెంట్రీని కూడా తినేశారు....' అని పరిహాసంగా రష్యన్ ఖైదీలు గురించి మాట్లాడాడు.

రష్యన్ ఖైదీలను రకరకాలుగా హింసించేవారు. జోళ్ళు లేకుండా క్వారీలోకి దింపేవారు. వాళ్ళ వీపు మీద మొదటి ప్రయాణంలో 60 పౌండ్ల బరువున్న రాళ్ళు ఉంచేవారు. ఈ రాళ్ళను ఖైదీలు పైకి మోసుకు వెళ్ళాలి. దారి పొడుగునా వాళ్ళని కొడుతుండేవారు. ఒకసారి పైకి వెళ్ళి వచ్చిన తర్వాత బరువు ఇంకా పెంచేవారు. ఈ బరువు మొయ్యలేక ఖైదీలు కూలిపోతే బూట్లతో తన్నేవారు. లాఠీలతో కొట్టేవారు....ఇలా ఒక రోజు పని చేసేటప్పటికి ఖైదీలు చనిపోయేవారు.

Edit with WPS Office

యుద్ధ ఖైదీలను గినీ పిగ్స్ లాగా వైద్య పరిశోధనలకు ఉపయోగించేవారు. ఖైదీలను హై ప్రెషర్ ఛాంబర్స్ లో (ఒత్తిడి ఎక్కువగా ఉండే గదులు) ఉంచి వారి ఊపిరి ఆగిపోయేవరకూ పరిశోధనలు చేసేవారు. టైఫస్, జాండీస్ లాంటి రోగ క్రిములను ఖైదీల శరీరాలలోకి ఎక్కించి పరిశోధించేవారు. విషపు బుల్లెట్లు ప్రయోగించేవారు. న్యూరెంబర్గ్ లో 'డాక్టర్ల విచారణ' లో డా. రేచర్ అనే జర్మన్ వైద్యుడు యుద్ధ ఖైదీల మీద చేసిన ప్రయోగాల గురించి అతని దగ్గర పని చేసిన ఆర్డర్లీ సాక్ష్యమిచ్చాడు - '.....ఇద్దరు రష్యన్ ఆఫీసర్లను బేరక్స్ నుంచి తీసుకు వచ్చారు. వారిద్దరినీ నగ్నం చేసి ఐసు నీళ్ళున్న టాంకులో దింపారు. గంటలు గడుస్తున్నాయి. సాధారణంగా చల్లదనం వలన మనిషికి 60 నిమిషాల తర్వాత స్పృహ తప్పిపోతుంది కాని ఈ ఇద్దరు ఖైదీలూ రెండు గంటల తర్వాత కూడా జీవించే ఉన్నారు. ఈ ఖైదీలకు మత్తుమందు ఇవ్వమని డే. రేచర్ కు విజ్ఞప్తి చేశాం కాని అతను మా మాట వినలేదు. మూడో గంట గడుస్తుండగా ఒక రష్యన్ ఖైదీ తోటి ఖైదీతో 'కామ్రేడ్! (ఇలా చిత్రహింస చేసే కంటే) కాల్చి చంపమని ఆఫీసర్ ని అడుగు' అన్నాడు. సమాధానంగా రెండో ఖైదీ ఫాసిస్టు కుక్కల దగ్గరనుంచి తను ఏ దయాదాక్షిణ్యాలూ ఆశించనన్నాడు. వాళ్లిద్దరూ వీడ్కోలు చెప్పుకుంటూ చేతులు కలిపారు. రష్యన్ ఖైదీలు ఏ మాట్లాడుకున్నదీ ఒక పోలిష్ కుర్రవాడు కొంచెం మార్చి డా. రేచర్ కు చెప్పాడు. రేచర్ తన ఆఫీసుకు వెళ్ళాడు.

అతను వెళ్ళగానే పోలిష్ కుర్రాడు ఖైదీలకు క్లోరోఫాం ఇవ్వడానికి ప్రయత్నించాడు. ఆఫీసునుంచి వెంటనే తిరిగి వచ్చిన డా. రేచర్ తుపాకీతో మమ్మల్ని బెదిరించాడు. ఈ ప్రయోగం ఐదు గంటలు జరిగింది. ఐదు గంటల తర్వాత మృత్యువు ఈ ఖైదీలను రక్షించింది....' - (The Rise and Fall of Third Reich, William Shirer, P. 1284).

న్యూరెంబర్గ్ విచారణలో రష్యన్ ప్రభుత్వం సమర్పించిన డాక్యుమెంట్లు రష్యన్ ఖైదీలను జర్మన్లు ఎలా చిత్రహింస చేసి చంపేసేవారో తెలియజేస్తాయి.

'.... యుద్ధరంగమంతా, ఆర్కెటిక్ నుంచి నల్ల సముద్రం వరకూ, చిత్రహింస చేసి చంపేసిన రష్యన్ ఖైదీల శవాలను కనుగొన్నాం.....ఇటువంటి సంఘటనలు రోజూ మా దృష్టికి వస్తున్నాయి..... 1942 మార్చ్ 2-6 తేదీలలో క్రిమియా రంగంలో జర్మన్లు చిత్రహింస చేసి చంపేసిన తొమ్మిది మంది రష్యన్ సైనికుల శవాలు దొరికాయి. వీరిని ఎంత దారుణంగా హింసించారంటే ఇద్దరిని మాత్రమే గుర్తించడానికి వీలుపడింది. చేతివేళ్ళ గోళ్ళు తీసేశారు....కనుగుడ్లు పీకేశారు...నిప్పుతో కాల్చిన గుర్తులు.....కత్తిపోట్లు.....విరిగిపోయిన దవడ ఎముకలు....వారిని ఎంత దారుణంగా హింసించారో తెలియజేస్తున్నాయి.....స్మోలెన్ స్క్ ప్రాంతంలో 29 మంది ఎర్ర సైనికుల శవాలు దొరికాయి. వీరిలో ఒక్కరికి కూడా తుపాకీ గుండు గాయం లేదు, పట్టుబడిన ఈ ఖైదీలను కత్తులతో చీల్చి చంపడం జరిగింది.....58 మంది ఎర్ర సైనికులను, ఇద్దరు ఏంబ్యులెన్స్ స్త్రీలతో సహా, గడ్డివాములో పెట్టి తగలబెట్టారు....మంటలలోంచి తప్పించుకోవాలని ప్రయత్నించిన వారిని జర్మన్ సైనికులు కాల్చి చంపేశారు.....కాలినిన్ ప్రాంతంలో జర్మన్లు గాయపడ్డ 50 మంది ఎర్ర సైనికులను ఒక స్కూలు భవనంలో బంధించి భవనానికి నిప్పు పెట్టి హత్య చేశారు....'

స్టాలిన్ అనంతరం యుద్ధంలో ఇటువంటి నేరాలు చేసి, రష్యాలో యుద్ధ నేరస్తులుగా శిక్షననుభవిస్తున్న 9000 మంది ఖైదీలను విడుదల చెయ్యాలని పశ్చిమ జర్మనీ, అమెరికా మొదలైన దేశాలు రష్యా మీద ఒత్తిడి తీసుకు వచ్చాయి. బుల్గానిన్ 'రష్యాలో యుద్ధ ఖైదీలు లేరు. స్త్రీలనూ వృద్ధులనూ పిల్లలనూ హత్యలు చేసిన యుద్ధ నేరస్తులు మాత్రమే ఉన్నారు. సోవియట్ చట్టాల క్రింద వారిని శిక్షించడం జరిగింది. ఏ అంతర్జాతీయ చట్టం ప్రకారం చూసినా వారు యుద్ధ ఖైదీలు కారు, యుద్ధ నేరస్తులు మాత్రమే' అని స్పష్టం చేసినా పశ్చిమ దేశాలతో సత్సంబంధాల కోసం, పశ్చిమ దేశాలు విదిలించే ఆర్థిక సహాయం కోస తహతహలాడుతున్న కృశ్చేవ్ ప్రభుత్వం 1955 సెప్టెంబరులో 8,877 జర్మన్ యుద్ధ నేరస్తులను విడుదల చేసి జర్మనీకి పంపించాలని నిర్ణయించింది. జర్మనీ చేరిన తర్వాత వీరిని జర్మన్ ప్రభుత్వం అరెస్టు చెయ్యాలి, జర్మనీలో వీరు తమ శిక్ష అనుభవించాలి అన్న షరతుల మీద జర్మనీ పంపించడం జరిగింది కాని జర్మనీ చేరిన వెంటనే ఈ యుద్ధ నేరస్తులను విడుదల చెయ్యడమే కాదు, వారికి హీరోలుగా స్వాగతం ఇవ్వడం జరిగింది.

పార్టిజాన్ యుద్ధం

Edit with WPS Office

1941 జులైలో యుద్ధ ప్రారంభంలో జర్మన్ సైన్యం రష్యన్ సైన్యాలను చెల్లా చెదరు చేస్తూ రష్యా భూభాగంలోకి చొచ్చుకుపోయింది. లక్షల సైన్యాన్ని చుట్టుముట్టి ఖైదీలుగా పట్టుకుంది. ఇలా చుట్టుముట్టబడిన సైన్యాలనుండి కొంతమంది సైనికులు తప్పించుకుని పార్టిజాన్లు (గెరిల్లాలు)గా అడవుల్లో, కొండల్లో, చిత్తడినేలల్లో, పార్టిజాన్ యుద్ధానికి అనుకూలమైన ప్రదేశాలలో తలదాచుకుంటూ జర్మన్ల మీద గెరిల్లా యుద్ధం ప్రారంభించారు.

రష్యన్ చరిత్రలో పార్టిజాన్ యుద్ధ సంప్రదాయం ఉంది. 1812లో నెపోలియన్ రష్యా మీద దాడి చేసి మాస్కో వరకూ వచ్చినప్పుడు, ఫ్రెంచి సైన్యం మీద పార్టిజాన్ యుద్ధం జరిగింది. అలాగే 1917లో విప్లవానంతరం అంతర్యుద్ధంలో కూడా పార్టిజాన్లు పోరాడారు.

స్టాలిన్ జులై 3న రేడియో ప్రసంగంలో శత్రు ఆక్రమిత ప్రాంతాలలో పార్టిజాన్ ఉద్యమాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించాలని ఆదేశించాడు. శత్రు ఆక్రమిత ప్రాంతాలలో శత్రువు జీవితం దుర్భరం చెయ్యాలనీ రవాణా సమాచార మార్గాలను ధ్వంసం చెయ్యలనీ జులై 18న కమ్యూనిస్టు పార్టీ విజ్ఞప్తి చేసింది.

పార్టిజాన్ గైడ్ అనే పుస్తకం పార్టిజాన్ లు ఎలా పోరాడాలో, ఎలా జీవించాలో సూచనలు ఇచ్చింది. పార్టిజాన్ యుద్ధ నియమాలూ, శత్రువు దగ్గరనుంచి ఆయుధాలు ఎలా స్వాధీనం చేసుకోవాలీ, వాటిని ఎలా ఉపయోగించాలీ, శత్రు విమానాలనూ టాంకులనూ ఎలా నాశనం చెయ్యాలీ, రోడ్డుకి అడ్డంగా తీగ కట్టి మోటారు సైకిళ్ళ మీద ప్రయాణం చేసే జర్మన్ సైనికులను ఎలా చంపాలీ, శత్రువు కంటబడకుండా ఎలా దాక్కోవాలీ, కేంపుల్లో, మంచులో ఎలా జీవించాలీ, శత్రువుతో ఎలా యుద్ధం చెయ్యాలీ వగైరా వివరాలు, చిత్రాలతో సహా ఉండేవి. తినడానికి తిండి లేనప్పుడు చెట్టు బెరడులు, రాళ్ళ మీద నాచు లాంటివి తింటూ ఎలా జీవించాలీ అనేది కూడా ఈ పార్టిజాన్ గైడ్ వివరాలు ఇచ్చింది.

హేన్స్ రోత్ అనే జర్మన్ సైనికుడు పార్టిజాన్ యుద్ధం గురించి ఇలా రాశాడు: '...సెప్టెంబరు 30.....ఎర్ర సైన్య నాయకత్వం అన్ని సన్నాహాలు చేసి పార్టిజాన్ యుద్ధాన్ని ఒక పధకం ప్రకారం నిర్వహిస్తోంది...' (The Soviet Army through German Eyes, p. 213-214).

మరొక అజ్ఞాత సైనికుడు నవంబరు 27న తన కుటుంబానికి రాసిన లేఖలో 'మా ప్రస్తుత యుద్ధం ఇప్పుడు పార్టిజాన్లతో. మేం వాళ్ళని బందిపోట్లు అని పిలుస్తాం. పార్టిజాన్లు చిన్న, పెద్ద దళాలుగా పోరాడుతారు. తరచు వినాశనాన్నీ గందరగోళాన్నీ సృష్టిస్తుంటారు. ఒంటరి సైనికులు కనుపించినా, వాహనాలు కనుపించినా, చిన్న సైనికుల గుంపు కనుపించినా దాడి చేస్తారు...' అని రాశాడు (The Soviet Army Through German Eyes, P. 219).

తొలిరోజుల్లో పార్టిజాన్ యద్ధం ఏ ఎత్తున జరిగినదీ ఎవరికీ తెలియదు. యుద్ధం ప్రారంభం కావడానికి ముందునుండీ శత్రువు రష్యన్ భూభాగాన్ని ఆక్రమించిన పక్షంలో పార్టిజాన్ యుద్ధం చెయ్యాల్సి ఉంటుందన్న అవగాహన నాయకత్వానికి ఉంది. ఆ అవగాహనతో వేలమంది పౌరులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలూ కామ్సోమాల్సూ జర్మన్ సైన్యం చెల్లా చెదురు చేసిన సైనిక దళాలలోని సైనికులూ, సోవియట్ ప్రభుత్వ అధికారులూ, రైల్వే కార్మికులూ - వీరందరూ తొలిరోజులలోనే పార్టిజాన్ యుద్ధం ప్రారంభించారు. తొలి పార్టిజాన్లు చాలామంది వారి కధ లోకానికి తెలియకుండానే అడవుల్లో, కొండల్లో జర్మన్లతో తలపడుతూ నశించిపోయారు. తొలి రోజుల్లో పార్టిజాన్లు తమ దగ్గర ఉన్న ఆయుధాలతోనూ, జర్మన్ల నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలతోనూ పోరాడారు. ఈ పార్టిజాన్ ల పరిస్థితి దుర్భరంగా ఉడేది. తినడానికి తిండి ఉండేది కాదు. ఎర్ర సైన్యం వందల మైళ్ళు తిరోగమించడం వలన రష్యన్ భూభాగాన్నుండి వారికి సహాయం అందే పరిస్థితి లేదు. చిన్న చిన్న గాయాలు కూడా వైద్య సదుపాయం లేక ప్రాణాంతకరంగా పరిణమించేవి.

మొదటి నెలల్లో పార్టిజాన్ లు చిన్న చిన్న శత్రు స్థావరాలూ రెజిమెంట్లూ హెడ్ క్వార్టర్సుల మీదా, మోటారు వాహనాలలో ప్రయాణిస్తున్న సైనికుల మీదా దాడి చేసి నష్టపరిచేవారు. ఈ దశలో వారు దాడిచేసి ఆయుధాలు స్వాధీనం చేసుకునే వారు. మాస్కో యుద్ధ సమయంలో, మాస్కో రంగంలో జర్మన్ల వెనుక ప్రాంతంలో 10000 మంది పార్టిజాన్లు యుద్ధం చేశారు. జర్మన్ రైళ్ళ మీదా, మోటారు శకటాల సైన్యం మీదా దాడి చేశారు. వీరు 18,000 మంది జర్మన్లను చంపేశారు.

కొన్ని నెలల వరకూ ఈ పార్టిజాన్ దళాలు ఒక ఉద్యమంగా కాక విడివిడిగా పని చేసేవి. జర్మన్లు అతి వేగంగా పురోగమిస్తుండడం వలన పార్టిజాన్ యుద్ధం ప్రారంభించడానికి తగిన ఏర్పాట్లు ముందే

Edit with WPS Office
చెయ్యడానికి వీలు పడలేదు. పార్టిజాన్లకు ఆహారం, ఆయుధాలు, మందుగుండు, మందులు - ముందే రహస్య ప్రదేశాల్లో పెద్ద ఎత్తున దాచి ఉంచి తగిన ఏర్పాట్లు చేసి ఉంటే పార్టిజాన్ యుద్ధం తొలి దశలోనే బలంగా ఉండేది. మాస్కో యద్ధానికి ముందు సోవియట్ ప్రభుత్వం పార్టిజాన్ లకు అవసరమైన సహాయం అందించలేకపోయింది. జీవన్మరణ పోరాటంలో ఉన్న రష్యా పార్టిజాన్ లకు ఆయుధాలు అందించగల స్థితిలో లేదు.

నగరాలలో గెరిల్లా పోరాటాలు చేసిన ఉదాహరణలున్నా రష్యన్ గెరిల్లాలు సాధారణంగా నగరాలలోనూ, పట్టణాలలోనూ ప్రవేశించేవారు కారు. అడవుల్లోనూ, చిత్తడినేలల్లోనూ ఉంటూ రాత్రివేళ గ్రామాలలో ప్రవేశించి జర్మన్ సెంట్రీల మీదా వాహనల మీదా కమాండు పోస్టుల మీదా దాడి చేసేవారు. ఈ దాడులకు ప్రధానంగా మూడు లక్ష్యాలుండేవి. శత్రు వాహనాల మీద చేతి బాంబులు విసిరీ, వంతెనలూ మందుగుండు గిడ్డంగులూ పేల్చివేసీ, టెలిఫోను తీగలు తెంపివేసీ శత్రువుకు నష్టం కలిగించేవారు. రెండవది, ఎర్ర సైన్యానికి స్కౌట్లుగా పనిచేస్తూ శత్రు సైన్య కదలికల గురించి సమాచారం సేకరించేవారు. మూడవది, జర్మన్ ఆక్రమిత ప్రాంతంలో సోవియట్ చట్టాలను అమలు పరిచే యంత్రాంగంగా పని చేసేవారు. జర్మన్లతో చేతులు కలిపిన ద్రోహులను శిక్షించేవారు. లేదా వారి గురించి సమాచారాన్ని మాస్కోకు పంపేవారు. ఈ పార్టిజాన్ దళాలలో ఎర్ర సైన్యం ఆఫీసర్లూ కమ్యూనిస్టులూ లేదా పార్టీ నమ్మిన వ్యక్తులూ ఉండేవారు. వీళ్ళు సాధారణ దుస్తులు ధరించేవారు. 30 నుంచి 150 వరకూ ఒక గ్రూపుగా పని చేసేవారు.

తొలి రోజుల విభ్రాంతి నుండి కోలుకున్న తర్వాత శత్రు ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉన్న చోట శత్రువు రాకముందే ఈ దళాల నిర్మాణం జరిగింది. దళాల కోసం ఆహారం, ఆయుధాలూ ముందే రహస్య ప్రదేశాలలో దాచి ఉంచేవారు. మాస్కో సమీపంలో లోటోషినో గ్రామ దళ కార్యకలాపాల గురించి వాల్టర్ కెర్ తన పుస్తకం 'ది రష్యన్ ఆర్మీ'లో పేర్కొన్నాడు. ఈ దళంలో 103 మంది మధ్యవయస్కులుండేవారు. యువకులంతా సైన్యంలో చేరడం వలన పార్టిజాన్ దళాలలో మధ్య వయస్కులు ఎక్కువగా ఉండేవారు. ఈ దళం జర్మన్లు మాస్కో మీదకు వస్తున్నప్పుడు తమ ప్రాంతం నుండి ట్రాక్టర్లూ యంత్రాలూ ఆహార ధాన్యాలూ పశువులూ తరలించడంలో చురుకుగా పని చేసింది. అలాగే పొరులను కూడా తరలించింది. గెరిల్లా యుద్ధం సాగించడానికి ఒక రహస్య స్థావరాన్ని ఎంచుకుని అక్కడ తేలిక ఆయుధాలు, ఆహారం, మందులు లాంటి అవసరమైన సామాగ్రిని నిలువచేసింది. జర్మన్లు అక్టోబరు 13న లోటోషినో చేరారు. జర్మన్లు గ్రామాన్ని ఆక్రమించడానికి ఒక రోజు ముందు, అంటే అక్టోబరు 12న, పార్టిజాన్లు భార్యాబిడ్డలకు వీడ్కోలు చెప్పి తాము తీసుకు వెళ్ళగలిగినంత సామగ్రితో రహస్య స్థావరానికి వెళ్ళిపోయారు. ఈ గెరిల్లా దళాలలో సభ్యులెవరు అన్నది అతి రహస్యమైన విషయం. సైన్యానికీ, పార్టీకీ, గెరిల్లాల భార్యలకూ మాత్రమే తెలుసు. జర్మన్లు ప్రతీకార చర్యగా గెరిల్లా దళ సభ్యుల కుటుంబాలను కాల్చి చంపేస్తుండేవారు. లోటోషినో దళంలోని ఒక గెరిల్లా చివరి క్షణం వరకూ గ్రామంలోనే ఉండి, జర్మన్లు మరో రెండు గంటలలో గ్రామంలో ప్రవేశిస్తారనగా టెలిఫోన్ వైర్లు తెంపేసి దళాన్ని చేరుకుంటాడు.

ఆరు రోజులు దళం తన రహస్య స్థావరంలోనే ఉండి, ఏడో రోజు పన్నెండు గుర్రాలు, నాలుగు మర తుపాకులు, రైఫిల్స్, చేతి బాంబులు తీసుకుని బయలు దేరుతుంది. నివాసాలకూ రోడ్లకూ దూరంగా పన్నెండు మైళ్ళు ప్రయాణించి నాలుగు రోడ్ల కూడలి సమీపానికి చేరుతుంది. దళ స్కౌట్లు జర్మన్ టాంకులు, సైన్యం ఒక ప్రవాహంలా తూరుపు వైపుకు ప్రయాణిస్తున్నాయని సమాచారం తీసుకు వస్తారు. ఆ రోజు చెయ్యగలిందేమీ లేక పార్టిజాన్లు తమ స్థావరానికి తిరిగి వెళ్ళి పోతారు.

ఆ రోజునుండీ స్కౌట్లు గ్రామాల మీదా రోడ్ల మీదా ఒక కన్ను వేసి ఉంచారు. పరిస్థితులు అనుకూలించినప్పుడు గెరిల్లాలు అడవుల్లోంచి జర్మన్ ట్రక్కుల మీద కాల్పులు జరిపేవారు. గెరిల్లా చర్యల తర్వాత తెల్లవారకుండా తమ స్థావరానికి చేరేవారు. ఒకసారి జర్మన్ మందుగుండు గిడ్డంగిని పేల్చి వేశారు. జర్మన్లు ఈ పార్టిజాన్ దళాలను నిర్మూలించడానికి సైన్యాన్ని అడవుల్లోకి పంపించేవారు. స్కౌట్ల ద్వారా జర్మన్ సైన్యం రాక గురించి తెలుసుకున్న దళం గుహల్లోనూ లోయల్లోనూ దాగి ఉండేది. కొంతకాలానికి పరిస్థితి ప్రమాదకరంగా తయారైంది. జర్మన్ విమానాలు నిరంతరం అడవి పైన తిరుగుతూ గెరిల్లాల కోసం వెతుకుతుండేవి. పార్టిజాన్ దళం అడవి వదలి చిత్తడి నేలల్లోకి మారింది. ఈ ఊబినేలలో అడుగు పెట్టడానికి జర్మన్లు భయపడేవారు. ఈ చిత్తడినేలల్లో భూగర్భంలో నివసిస్తూ దళం దాడులు కొనసాగించింది. శీతాకాలం ఈ దళం చాలా ఇబ్బందులకు గురయింది. సమీపంలో

Edit with WPS Office
ఉన్న మరికొన్ని గెరిల్లా దళాలతో సంబంధాలు ఏర్పడ్డాకా వారి దగ్గరనుండి 30 జతల వెచ్చని బూట్లు దళానికి దొరికాయి కాని ఇవి దళానికంతటికీ సరిపోవు. అందువలన వంతులు వారీగా దళ సభ్యులు బూట్లు ధరించేవారు. ఆహార నిల్వలు కూడా తగ్గిపోయాయి.

ఈ ప్రాంతం జర్మన్ ఆక్రమణలో 99 రోజులు మాత్రమే ఉంది. తర్వాత రష్యన్ ఎదురు దాడిలో ఈ ప్రాంతం విముక్తి చెయ్యబడింది. ఈ 99 రోజులలోనూ ఈ దళం 207 మంది జర్మన్లను చంపివేసింది. మరో 300 మంది దాకా చనిపోయి ఉండవచ్చునని భావించింది. 27 ట్రక్కుల మందుగుండు నాశనం చేసింది. మరో 24 వాహనాలను ధ్వంసం చేసింది. ఇంజను పాడై అడవి ప్రాంతంలో దిగిన జర్మన్ విమానాన్ని గెరిల్లాలు తగలబెట్టేశారు.

పార్టిజాన్లు చేసిన ఈ రకమైన యుద్ధంలో నష్టం కాక గెరిల్లా దళాలనుండి రక్షించుకోవడానికి జర్మన్లు తమ సెంట్రీల సంఖ్యను రెండు రెట్లూ మూడు రెట్లూ చెయ్యాల్సి వచ్చింది. వందల సైనికుల్ని దళాల మీదకు పంపాల్సి వచ్చింది. గెరిల్లాలు తెంపి వేస్తున్న టెలిఫోను వైర్లు బాగు చెయ్యడానికి పంపించే లైన్ మేన్ల రక్షణకు అనేకమంది గార్డులను పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గెరిల్లా చర్యలకు జర్మన్ల ప్రతీకారం కూడా భయంకరంగా ఉండేది. పార్టిజాన్ ప్రాంతాలలో పార్టిజాన్ల మీదా వారికి ఆశ్రయమిస్తున్న ప్రజల మీదా జర్మన్ దాడులు అతి క్రూరంగా ఉండేవి. 1942 డిసెంబరు 16న ఒక ఆర్డరులో హిట్లర్ - '....తూర్పున బందిపోట్లను (పార్టిజాన్లను) అతి క్రూరమైన చర్యల ద్వారా నిర్దాక్షిణ్యంగా అణచి వెయ్యాలి....ఆడవాళ్ళు, పిల్లలు అని దయచూపకూడదు...మన విజయానికి తోడ్పడే ఏ చర్యనైనా తీసుకోవడానికి వెనుకాడకూడదు.....దయ చూపడం జర్మన్ సైనికుల పట్ల, జర్మన్ ప్రజల పట్ల నేరం అవుతుంది....' అంటూ అతి క్రూరంగా పార్టిజాన్ ఉద్యమాన్ని అణచి వేయాలని ఆదేశించాడు. గెరిల్లాలను పట్టుకున్న వెంటనే ఉరితీసేవారు. గ్రామ ప్రజలనూ కుటుంబ సభ్యులనూ క్రూరంగా హత్య చేసేవారు.

జర్మన్ సైన్యం గెరిల్లా దళనాయకుడు 'అంకుల్ వాన్యా' కోసం వెతుకుతూ అతని గ్రామంలో ప్రవేశిస్తుంది. అతను సమీపంలో ఎక్కడో ఉన్నాడని జర్మన్లకు ఖచ్చితమైన సమాచారం అందింది. వృద్ధుడైన అతని తండ్రిని జర్మన్లు అరెస్టు చేస్తారు. చిత్రహింసలు పెట్టినా అతని దగ్గరనుండి ఏమీ సమాచారం దొరకదు. చివరకు అతని కాళ్ళకూ చేతులకూ తాళ్ళు కట్టి, తాళ్ళ కొసలు రెండు టాంకులకు కట్టి, రెండు టాంకులనూ చెరోవైపుకు నడిపిస్తారు. ఆ వృద్ధుడు రెండు ముక్కలుగా చీలిపోతాడు. వీధుల్లోకి తరమబడిన జనం నిశ్శబ్దంగా ఈ భయంకర దృశ్యాన్ని చూస్తారు.

జర్మన్ సైనికులు అంతటితో ఆగరు. గుంపులో ఉన్న స్త్రీల దగ్గరకు వెళ్ళి వాళ్ళ బిడ్డల్ని లాక్కుంటూ 'అంకుల్ వాన్యా ఎక్కడ?' అని అడుగుతారు. ఆ స్త్రీలు సమాధానం చెప్పరు.

జర్మన్లు ఇరవైమంది పిల్లలను తల్లుల దగ్గరనుండి లాగి తాళ్ళతో కట్టి ఒక టాంకును పిల్లల గుంపు మీంచి నడిపిస్తారు. టాంకు పట్టాల కింద ఈ పిల్లలు పిప్పి పిప్పి అయిపోతుంటే పీక నొక్కేస్తున్న వ్యక్తి అరిచినట్లు జనంలోంచి శబ్దం వస్తుంది.

ఈ భయంకర దృశ్యాన్ని జనంలో ఉన్న ఇద్దరు గెరిల్లాలు చూస్తారు. ఒక గెరిల్లా తన దగ్గరున్న చేతి బాంబు జర్మన్ల మీద విసురుదామని జేబులో చెయ్యి పెట్టబోతుంటే రెండో గెరిల్లా వారిస్తాడు. ఆ పిల్లల గుంపులో తన కొడుకు కూడా ఉన్నా తను ప్రేక్షకుడిలా చూస్తూ నిలబడ్డాననీ, పోరాటానికి ఇది సమయం కాదనీ ఆపు చేస్తాడు.

ఆ రాత్రి గెరిల్లా దళం దాడి చేసి ఈ జర్మన్ రాక్షసులందరినీ నాశనం చేస్తుంది.

1942లో పార్టిజాన్ ఉద్యమం వ్యాపించింది. మాస్కోనుండి విమానాల ద్వారా ఆయుధాలను జర్మన్ ఆక్రమిత ప్రాంతాలకు పంపించడం ప్రారంభమైంది. కాని ప్రధానంగా శత్రువు ఆయుధ గిడ్డంగుల మీద దాడి చేసి స్వాధీనం చేసుకున్న ఆయుధాలనే పార్టిజాన్ లు ఉపయోగించేవారు. జర్మన్లు రష్యన్ పల్లెల్లోనూ పట్టణాలలోనూ యువకుల్ని జర్మనీకి బానిసలుగా తరలించడం వలనా, పార్టిజాన్ ప్రతిఘటనను అతి క్రూరంగా అణచి వెయ్యడానికి ప్రయత్నించడం వలనా పార్టిజాన్ ఉద్యమం మరింత పెరిగింది. ఈ పార్టిజాన్ యూనిట్లకు పార్టీ కార్యకర్తలూ కామ్సొమాల్స్ నాయకత్వం వహించేవారు. 1942 వేసవిలో జర్మనీ పెద్ద ఎత్తున సైన్యాన్నీ పోలీసులనూ పార్టిజాన్ కార్యకలాపాలను అణచి వెయ్యడానికి వినియోగించాల్సి వచ్చింది. ఒక్క బ్రియాన్స్క్ ప్రాంతంలోనే జర్మనీ తన అధీనంలో ఉన్న 30,000 మంది హంగేరియన్ సైనికులను పార్టిజాన్ కార్యకలాపాలను అరికట్టడానికి వినియోగించాల్సి వచ్చింది.

Edit with WPS Office
1942 సెప్టెంబరులో, స్టాలిన్ గ్రాడ్ లో తీవ్ర యుద్ధం జరుగుతున్న తరుణంలో పార్టిజాన్ లకు స్టాలిన్ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చాడు. జర్మన్ రైలు, రోడ్డు రవాణా మార్గాలు చాలా పొడుగై పార్టిజాన్ దాడులకు అనుకూలంగా ఉన్నాయని అతను వివరించాడు. రైళ్ళు, రైలు వంతెనలు, రైలు మార్గాలూ ధ్వంసం చెయ్యాలని అతను ఆదేశించాడు. అతని పిలుపు అందుకుని 1942లో పార్టిజాన్ లు 3000 రైళ్ళను ధ్వంసం చేశారు.

1942లో పార్టిజాన్ ప్రాంతాలు (గెరిల్లా ప్రాంతాలు) కూడా ఏర్పడ్డాయి. ఈ పార్టిజాన్ ప్రాంతాల్లో పార్టిజాన్లు సోవియట్ ప్రభుత్వాన్ని తిరిగి నెలకొల్పారు. ఓరెల్ ప్రాంతంలో 18000 మంది పార్టిజాన్ లు 490 గ్రామాలను జర్మన్ల నుండి విముక్తి చేసి గెరిల్లా ప్రాంతం ఏర్పరిచారు. 1942 శీతాకాలం నాటికి బెలో రష్యాలో 60 శాతం గెరిల్లా ప్రాంతంగా మారింది. ఈ గెరిల్లా ప్రాంతాలు గెరిల్లాలకు సరఫరాలు అందించడానికి అనుకూలంగా ఉండేవి. 1942 మధ్య భాగంలో ఈ గెరిల్లా ప్రాంతాలలో విమానాలు దిగడానికి రన్ వేలు ఏర్పాటు చేశారు. రష్యన్ భూభాగం నుండి పార్టిజాన్లకు ఆయుధాలూ ఆహారం అందుతుండేవి. గాయపడిన గెరిల్లాలను విమానాల ద్వారా తరలించేవారు. 1942 రెండో భాగం నుండి పార్టిజాన్లు మాస్కోలోని ఆర్మీ కమాండుతో తమ చర్యలను సమన్వయపరిచి ఒక పధకం ప్రకారం జర్మన్ స్థావరాల మీదా రైళ్ళ మీదా దాడి చేసేవారు.

స్టాలిన్ గ్రాడ్ లో రష్యన్ వలయంలో చిక్కుకున్న జర్మన్ సైన్యానికి సహాయం చెయ్యడానికి జనరల్ వాన్ మాన్ స్టీన్ చేసిన ప్రయత్నాలు పార్టిజాన్ దాడుల కారణంగా భగ్నమయ్యాయి. పార్టిజాన్ లు రైళ్ళు పేల్చివేయడంతో అనుకున్న సమయానికి అతను సైన్యాన్ని కేంద్రీకరించి దాడి మొదలు పెట్టలేకపోయాడు. తార్మాసిన్, కోటోల్నికోవ్ - రెండు ప్రదేశాలనుండి రెండు సైన్యాలతో దాడి చెయ్యాలని ఉద్దేశించిన అతను కోటోల్నికోవ్ నుంచి మాత్రమే దాడి ప్రారంభించగలిగాడు.

స్టాలిన్ గ్రాడ్ యుద్ధం తర్వాత పార్టిజాన్ ఉద్యమం ఒక విశాల ఉద్యమంగా మారింది. దీనికి కారణాలు రెండు. రష్యా విజయం తథ్యమని గ్రహించిన కొంతమంది పార్డిజాన్ లలో చేరారు. రెండోది, 1943లో పార్టిజాన్ దళాలకు మాస్కో నుండి పెద్ద ఎత్తున సహాయం అందడం మొదలైంది. మోర్టార్లు, భారీ గన్నులు, రైలింజన్లనూ బోగీలనూ ధ్వంసం చెయ్యడానికి టాంకు విధ్వంసక గన్నులు, ఆహారం, మందులూ అందసాగాయి. దీనివలన పార్టిజాన్ ఉద్యమం అతి వేగంగా పెరగసాగింది. బెలో రష్యాలో 1943 ఫిబ్రవరిలో 60,000 మంది పార్టిజాన్ లు ఉంటే, డిసెంబరు నాటికి వీరి సంఖ్య 3,60,000కు పెరిగింది. అలాగే మిగిలిన ప్రాంతాలలో కూడా పార్టిజాన్ ఉద్యమం విస్తరించింది. జర్మన్ల శిక్ష తప్పించుకోవడానికి కుటుంబాలకు కుటుంబాలు, గ్రామాలకు గ్రామాలు తరలి వచ్చి పార్టిజాన్లతో కలిసేవి.

1943 జులై 14న కుర్స్క్ యుద్ధం జరుగుతున్నప్పుడు సుప్రీం కమాండు రైలు మార్గాల మీద యుద్ధం చెయ్యమని పార్టిజాన్ లను ఆదేశించింది. ఈ దాడికి అన్ని సన్నాహాలూ ముందుగానే చెయ్యబడ్డాయి. యుద్ధ రంగంలో రష్యా దాడి ప్రారంభిస్తున్న సమయంలో, జర్మన్ సైన్యం వెనుక తట్టున, జులై 20-21 తేదీలలో పార్టిజాన్లు రైలు మార్గాల మీద పెద్ద ఎత్తున దాడి చేశారు. ఆ రాత్రి 5,800 దాడులు జరిగాయి. బెలో రష్యాలో మూడింట రెండు వంతుల రైలు మార్గాలు ధ్వంసమయ్యాయి. కొన్ని మార్గాలలో వారాల పాటు రైళ్ళ రాకపోకలు నిలిచిపోయాయి.

1943 ఆగస్టు-నవంబరు కాలంలో బెలో రష్యాలో రైలు మార్గాలను పేల్చి వేసిన సంఘటనలు రెండు లక్షలు. 1014 రైళ్ళను ధ్వంసం చెయ్యడం కాని పట్టాలు తప్పించడం కాని జరిగింది. 814 రైలింజన్లను ధ్వంసం చేశారు. 72 రైలు వంతెనలను నాశనం చెయ్యడం కాని నష్టపరచడం కాని జరిగింది. ఇంత పెద్ద ఎత్తున పార్టిజాన్లు చేస్తున్న రైలు యుద్ధం జర్మన్లను భయభ్రాంతులను చేసింది. సైన్యం కదలికల మీదా, సైన్యావసరాల రవాణా మీదా, మొత్తం జర్మన్ మిలిటరీ కార్యకలాపాల మీదా ఈ రైలు యుద్ధ ప్రభవం పడింది.

1941-44ల మధ్య బెలో రష్యాలో పార్టిజాన్లు 47 మంది జనరల్సుతో సహా 5 లక్షలమంది జర్మన్లను చంపి వేశారు. యుక్రెయిన్ లో 4,60,000 మంది జర్మన్లను చంపి వేశారు. 5000 రైలింజన్లనూ 50,000 రైలు వేగన్లనూ 15000 మోటారు వాహనాలను ధ్వంసం చేశారు.

పార్టిజాన్ యుద్ధంలో పార్టిజాన్లు ఆహార, ఆయుధాల కొరతతో పాటు మరొక ప్రాణాంతక సమస్యను ఎదుర్కోవలసి వచ్చేది. శత్రు ఏజెంట్లనుండి నిరంతరం తమను తాము రక్షించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. శత్రు ఏజెంట్లను వేటాడి హతమార్చవలసి వచ్చేది.

Edit with WPS Office
ఎంత కూర్రంగా అణచి వెయ్యడానికి ప్రయత్నించినా పార్టిజాన్ ఉద్యమం ఆగలేదు. జర్మన్లను తరుముతూ ఎర్ర సైన్యం రావడానికి ఒకటి రెండు రోజుల ముందే పార్టిజాన్లు పట్టణాలను ఆక్రమించేవారు. ఎర్రసైన్యం రాగానే సైన్యంలో చేరేవారు. సైన్యం యుద్ధం చేసే తీరు వేరు, పార్టిజాన్ లు యుద్ధం చేసే తీరు వేరు. పార్టిజాన్ లలో కొంతమంది సైన్యంలో ఇమడలేకపోయేవారు. అయితే పార్టిజాన్లుగా వీరికున్న ప్రత్యేక ఆనుభవం కారణంగా సైన్యం వీరిని శత్రువు గురించి సమాచారం సేకరించడానికి వినియోగిస్తుండేది.

విషాదమేమిటంటే ఈ పార్టిజాన్లలో దాదాపు 20 శాతం సైన్యంలో చేర్చుకోవడానికి ముందు జరిపే వైద్య పరీక్షలో ఫెయిలయ్యేవారు. వీరిలో అధిక భాగానికి క్షయ వ్యాధి ఉండేది.

1943-44 ప్రాంతాలలో కనీసం 5 లక్షల మంది పార్టిజాన్లు ఉండేవారు. ఎంతమంది పార్టిజాన్లు ప్రాణాలు కోల్పోయారో అంచనా తెలియదు. ఒక్క బెలో రష్యాలోనే పది లక్షల మందిని జర్మన్లు చంపారని అంచనా. వీరిలో పార్టిజాన్లే కాకుండా వారికి ఆశ్రయమిచ్చిన రైతులు, కుటుంబాలు, గ్రామాలూ కూడా ఉన్నాయి.

ఈ పార్టిజాన్ ఉద్యమం ప్రజల ఉద్యమం. ప్రజా సహకారం, ప్రజల పాత్ర లేకుండా పెద్ద ఎత్తున జరిగే భయంకరమైన ప్రతీకార చర్యలను తట్టుకుని పార్టిజాన్ ఉద్యమం నిలవగలిగేది కాదు. పార్టిజాన్ ఉద్యమమే కాదు, ప్రజలందరి పాత్ర లేకుండా స్టాలిన్ కాని కమ్యూనిస్టు పార్టీ కాని ఏమీ సాధించగలిగేవారు కారు. ఈ యుద్ధం ప్రజల సహకారంతో, ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొనే యుద్ధం కాబట్టే ఇది ప్రజా యుద్ధం అయింది.

అయితే ఇక్కడ ఒక ప్రశ్న ఎదురవుతుంది. బూర్జువా చరిత్రకారులు వర్ణిస్తున్నట్లు స్టాలిన్ నరరూప రాక్షసుడే అయితే, వారు నిరంతరం ప్రచారం చేస్తున్నట్లు రష్యాలో ప్రజాస్వామ్యం అన్నది లేక దారుణమైన పార్టీ నియంతృత్వం ప్రజలను అణచివేస్తుంటే, ప్రజలందరూ ఒక్కటై స్టాలిన్ వెనుకా రష్యన్ కమ్యూనిస్టు పార్టీ వెనుకా ఎందుకు నిలిచారు? ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించి ఈ 'నియంతృత్వాన్ని' కాపాడుకోవడానికి ఎందుకు పోరాడారు?

Edit with WPS Office

“A nation in which the majority of the workers and peasants realize, feel and see that they are fighting for their own Soviet power,for the rule of the working people, for the cause, whose victory will ensure them and their children all the benefits of culture, of all that has been created by human labour, such a nation can never be vanquished….”

“ఏ దేశంలో కార్మిక కర్షకుల్లో అధిక సంఖ్యాకులు తాము తమ సోవియట్ అధికారం కోసం; శ్రామిక వర్గ పాలన కోసం, తమకూ తమ సంతానానికీ ఇంతవరకూ మానవ శ్రమ సృష్టించిన సంపదల, సంస్కృతి ఫలాలను అందించే ఒక ఆశయ విజయం కోసం పోరాడుతున్నామని స్పష్టంగా గుర్తిస్తారో - ఆ దేశాన్ని ఎవ్వరూ ఓడించలేరు.”

- లెనిన్

Edit with WPS Office

అధ్యాయం తొమ్మిది

నూతన సామాజిక చైతన్యం

పెట్టుబడిదారీ దేశాలలోని వార్తాపత్రికలను పెట్టుబడికి, కట్టుకథలకు పుట్టిన విష పుత్రికలుగా వర్ణించాడు మహాకవి శ్రీశ్రీ. వార్తా పత్రికలు, రేడియో, సినిమా, టీవీ లాంటి ప్రచార సాధనాలు పెట్టుబడిదారుల చేతుల్లో వారి వర్గ ప్రయోజనాలను కాపాడే సాధనాలు. ఈ ప్రచార సాధనాలు తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేసి, మసిపూసి మారేడు కాయ చేస్తూ ప్రజాభిప్రాయాన్ని పెట్టుబడి దారీ వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా మలుస్తుంటాయి. బూర్జువా మేధావులు గొప్పగా చెప్పే పత్రికా స్వాతంత్ర్య నిజ స్వరూపం ఇది. ఈ వాస్తవం అర్థం చేసుకోక పోతే స్టాలిన్ మీదా, కమ్యూనిజం మీదా జరిగిన, జరుగుతున్న విష ప్రచారాన్ని అర్థం చేసుకోవడం కష్టం. అలాగే సోవియట్ యూనియన్ పతనం తర్వాత, వేళ్ళమీద లెక్కపెట్టగలిగిన కొంతమంది బందిపోట్లు వేల కోట్ల ప్రభుత్వ సంపద దోచుకుని సోవియట్ ప్రజలను అంతులేని దారిద్ర్యంలోకి నెట్టినప్పుడు (నేటి (2005) రష్యాలో 4 కోట్లమంది పౌరులు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తుంటే 17 మంది బిలియనైర్లు దేశ ఆర్థిక వ్యవస్థను నియంత్రిస్తున్నారు) దాన్ని కమ్యూనిజం నుండి విముక్తిగా, ప్రజాస్వామ్యంగా, పెట్టుబడిదారీ ప్రపంచంలోని ప్రచార సాధనాలు ఎందుకు కీర్తించాయో అర్థం చేసుకోలేం.

స్టాలిన్ మీద విషప్రచారం సాగించిన వారిలో విలియం రేండాల్ఫ్ హెర్ స్ట్ ప్రముఖుడు. ఇతను అమెరికాలో సెన్సేషనల్ ప్రెస్ కు అధిపతి. 1940 దశాబ్దంలో ఇతని పత్రికా సామ్రాజ్యంలో 25 దిన పత్రికలు, 25 వార వార్తా పత్రికలు, 12 రేడియో స్టేషన్లు, 2 ప్రపంచ వార్తా సంస్థలు, సినిమా కంపెనీలు, వగైరాలుండేవి. 1934లో ఇతను హిట్లర్ అతిథిగా జర్మనీ పర్యటించి వచ్చాకా ఇతని పత్రికలన్నీ సోవియట్ రష్యాలోని కరువుల గురించీ బానిసత్వం గురించీ హత్యాకాండ గురించీ నాయకుల విలాస జీవితాల గురించీ అసత్యాలు ప్రచారం చెయ్యసాగాయి. స్టాలిన్ రక్తసిక్తమైన కత్తి పట్టుకుని నిలబడి ఉన్నట్లు చిత్రాలు ప్రచురించేవి. అమెరికాలో నాలుగు కోట్లమంది ప్రజలు ఇతని పత్రికలు చదువుతుండేవారు. ప్రపంచం మొత్తం మీద వందల కోట్లమంది ఆలోచనలను నియంత్రించగల ప్రచార యంత్రాంగం ఉంది ఇతనికి. నాజీ జర్మనీలో హిట్లర్ తన నియంతృత్వం నెలకొల్పుతూ హత్యాకాండ కొనసాగిస్తుంటే, హెర్ స్ట్ పత్రికా సామ్రాజ్యం సోవియట్ యూనియన్ లో నియంతృత్వం గురించీ హత్యాకాండ గురించీ పెద్ద ఎత్తున ప్రచారం మొదలు పెట్టింది.

నాజీ జర్మనీ అంతమైన తర్వాత దాని బూట్లలో అమెరికా అడుగు పెట్టింది. నాజీ గూఢచార సంస్థ గెస్టపో స్థానంలో అమెరికన్ సి.ఐ.ఏ. వచ్చింది. నాజీ ప్రచారాన్ని వాయిస్ ఆఫ్ అమెరికా కొనసాగించింది. పాత్రలు మారినా గొంతుక గోబెల్స్ దే.

రష్యా గురించి విషప్రచారం సాగించిన వ్యక్తులలో మరో ప్రముఖుడు ప్రొఫెసర్ రాబర్ట్ కాంక్వెస్ట్ అనే మేధావి. ఈ ప్రొఫెసర్ గారి గురించి కొద్దిగా పరిచయం అవసరం. ఈయన బ్రిటిష్ గూఢచార సంస్థలో తప్పుడు సమాచార విభాగంలో - Disinformation Department (Information Research Department) - ఏజెంటుగా పనిచేశాడు. తర్వాత రచయితగా, స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పని చేశాడు. బ్రిటిష్ గూఢ చార సంస్థలోని ఈ ఐ. ఆర్. డి. విభాగం కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం సాగించడానికీ వివిధ దేశాల్లోని రాజకీయనాయకుల్లో, జర్నలిస్టులలో, మేధావి వర్గంలో కమ్యూనిస్టు వ్యతిరేక భావాలు ప్రచారం చెయ్యడానికీ 1947లో ప్రారంభమైంది. 1977లో ఈ రహస్య విభాగ కార్యక్రమాలు బహిరంగమయ్యాయి. ఈ విభాగం సమాచార రంగాన్ని బ్రిటన్ కూ పెట్టుబడిదారీ విధానానికీ అనుకూలంగా మలిచేది. 100 మంది ప్రముఖ జర్నలిస్టులు ఈ విభాగం అందించే సమాచారం ఆధారంగా పత్రికల్లో రాస్తున్నట్లు వెల్లడయింది. ఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్ రాబర్ట్ కాంక్వెస్ట్ మూర్తీభవించిన అసత్యం. ఈయన రాసిన గ్రంధాలలో ముఖ్యమైనవి 1969లో రాసిన 'మహా భీభత్సం' (The Great Terror), 1986లో రాసిన 'కన్నీటి పంట' (Harvest of Sorrow) అనే గ్రంధాలు. ఇప్పటికీ బూర్జువా మేధావులు స్టాలిన్ 'హత్యాకాండ' గురించి

Edit with WPS Office
మాట్లాడేటప్పుడు ఈయనను ఉదహరిస్తుంటారు. యుక్రెయిన్ కరువు గురించి 'మహత్తర పరిశోధనా గ్రంధాన్ని' వెలువరించినందుకు యుక్రెయిన్ జాతీయ సంస్థ నుండి ఈయనకు 80 వేల డాలర్లు ముట్టాయి (యుక్రెయిన్ జాతీయవాదులు రెండో ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్ కు వ్యతిరేకంగా జర్మనీతో చేతులు కలిపి యుక్రెయిన్ లో లక్షల మంది సోవియట్ పౌరులనూ యూదు మతస్తులనూ హత్య చెయ్యడంలో ప్రముఖ పాత్ర పోషించారు).

మన ప్రొఫెసర్ గారు పరిశోధించి వెల్లడించిన 'స్టాలిన్ ఘాతుకాల' గురించి మచ్చు తునకలు - 1937లో స్టాలిన్ పార్టీ ప్రక్షాళన కార్యక్రమం ప్రారంభించడానికి ముందు రష్యన్ జెయిళ్ళలో 50 లక్షలమంది రాజకీయ ఖైదీలున్నారు. ప్రక్షాళన కార్యక్రమం మొదలైన తర్వాత మరో 70 లక్షలమంది జెయిలు పాలయ్యారు. అంటే 1939 నాటికి ఒక కోటి ఇరవై లక్షలమంది రాజకీయ ఖైదీలున్నారు. వీరు కాకుండా సాధారణ నేరస్తులు. వీరందరినీ కలిపితే రెండున్నర, మూడు కోట్లమంది స్టాలిన్ లేబర్ కేంపుల్లో ఉన్నారు. 1937-1939 ల మధ్య 10 లక్షలమంది రాజకీయ ఖైదీలను స్టాలిన్ హత్య చేశాడు. ఆకలితో మరో 20 లక్షలమంది మరణించారు - ఇలా సాగుతుంది ఈయనగారి పరిశోధన.

ఈ మేధావి అంచనాల ప్రకారం 1930-1953ల మధ్యకాలంలో కమ్యూనిస్టులు ఒక కోటి ఇరవై లక్షలమంది రాజకీయ ఖైదీలను హత్య చేశారు. కమ్యూనిస్టులు కొనసాగించిన ఈ హత్యాకాండకు 1930లో 'స్టాలిన్ ఆర్థిక విధానాల వలన వచ్చిన కరువులో మరణించిన' వారిని కూడా కలిపితే కమ్యూనిజం ఈ ఇరవై మూడేళ్ళలోనూ 2 కోట్ల 60 లక్షలమందిని బలితీసుకుంది. రెండు కోట్ల అరవై లక్షలు - ఈ సంఖ్యను మనం గమనించాలి. హిట్లర్ దురాక్రమణలో మరణించిన రష్యన్ల సంఖ్య రెండు కోట్ల ఎనభై లక్షలు. స్టాలిన్ క్రూరత్వం వలన మరణించిన వారి సంఖ్య రెండు కోట్ల అరవై లక్షలు. హిట్లర్ కూ స్టాలిన్ కూ మధ్య తేడా ఏమీ లేదు - ఇద్దరూ హంతకులే. కమ్యూనిజానికీ ఫాసిజానికీ తేడా ఏమీలేదు - రెండూ తీరని రక్తదాహం గల సిద్ధాంతాలే అని రాబర్ట్ కాంక్వెస్టు గారు అంకెల గారడీ చేసి నిరూపించారు.

స్టాలిన్ మరణానంతరం రష్యాలో యవుషెంకో, సోల్జెన్ త్సీన్ లాంటి రచయితలు ఈ విషప్రచారానికి తమ గొంతులను అరువిచ్చారు. సోల్జెన్ త్సీన్ కృశ్చేవ్ కాలంలో 1962లో 'ఇవాన్ డెనిసోవిచ్ జీవితంలో ఒక రోజు (One day in the life of Ivan Denisovich)' అనే పుస్తకం ప్రచురించాడు. స్టాలిన్ లేబర్ కేంపుల్లో స్వల్ప నేరానికి శిక్ష అనుభవించిన ఇవాన్ డెనిసోవిచ్ అనే వ్యక్తి కన్నీటి గాధ ఇది. 1970లో రష్యాలో లేబర్ కేంపుల గురించి 'ది గులాగ్ ఆర్కిపెలాగో (The Gulag Archipelago)' అనే పుస్తకం రాసినందుకు ఇతనికి నోబుల్ సాహిత్య పురస్కారం లభించింది. కృశ్చేవ్ కాలంలో ప్రసిద్ధి కెక్కిన కవి యూజినీ యవుషెంకో స్టాలిన్ శవాన్ని మస్కోలియం నుంచి బయటకీడ్చి క్రెమ్లిన్ గోడలకు వెలుపల సమాధి చేసిన సంఘటనను హర్షిస్తూ 1962లో ఒక కవిత రాశాడు -

'....చనిపోయినట్లు నటిస్తూ తన పిడికిలి బిగించి
అతను శవపేటికలోంచి అందరినీ గమనిస్తున్నాడు
ఏదో కుట్ర పన్నుతున్నాడు
అతను నిద్రపోతున్నాడు కాని చని పోలేదు
నేను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను
ఈ సమాధిరాయి దగ్గర కాపలా సైనికులను రెట్టింపు చెయ్యండి
మూడు రెట్లు చెయ్యండి
లేకపోతే స్టాలిన్ మళ్ళీ లేస్తాడు
అతనితో పాటు గతమూ లేస్తుంది
స్టాలిన్ వారసులు ఈ భూమి మీద మళ్ళీ నడుస్తారు.....'

సాహిత్యం మీదా కళల మీదా మార్క్సిస్టు అజమాయిషీ అంతమై, రష్యన్ సాహిత్యంలో, కళల్లో ఒక 'కొత్త వసంతం' వచ్చిందని బూర్జువా ప్రపంచం కొనియాడుతున్న సమయంలో చిగురించిన కవిత ఇది. కార్మికవర్గ అజమాయిషీ అంతమై నయా బూర్జువా వర్గ అజమాయిషీ ప్రారంభమైన దశ ఇది. ఇది సహజంగానే సాహిత్యంలో ప్రతిఫలించింది. చివరకు ఈ పరిణామం సోషలిస్టు రష్యా అంతానికి దారి తీసింది.

అయితే సోషలిస్టు రష్యా అంతమైనంత మాత్రాన వర్గ పోరాటం ముగియదు. యవుషెంకో భయపడ్డట్లు స్టాలిన్ మళ్ళీ లేస్తాడు. అతనితో పాటు గతమూ మళ్ళీ లేస్తుంది. స్టాలిన్ వారసులు ఈ

Edit with WPS Office
భూమి మీద మళ్ళీ నడుస్తారు. పీడితులు మళ్ళీ పాలకులవుతారు. చరిత్ర గమనాన్ని ఎవ్వరూ ఆపలేరు.

స్టాలిన్ ఘాతుకాల గురించిన ప్రచారం హిట్లర్ కాలం నుండీ పుస్తకాలలో, వార్తా పత్రికలలో, రేడియో, టీవీ, సినిమాలలో జరుగుతూనే ఉంది. హిట్లర్ తర్వాత పెట్టుబడిదారీ ప్రపంచం, సోషలిజం పతనమైన తర్వాత రివిజనిజం ఈ ప్రచారాన్ని అందుకున్నాయి. స్టాలిన్ ను నర రక్తం తాగే డ్రాక్యులా లాగా చిత్రించాయి.

కమ్యూనిజం, ఫాసిజం రెండూ ఒకటే అయినప్పుడు, స్టాలిన్-హిట్లర్, ఇద్దరూ నియంతలే అయినప్పుడు, రష్యన్లు కమ్యూనిజం కోసం, స్టాలిన్ కోసం కనీవినీ ఎరుగని విధంగా ఎందుకు పోరాడారు? అతి ముఖ్యమైన ఈ ప్రశ్నకు బూర్జువా మేధావులు ఇచ్చే సమాధానాలు చిత్రంగా ఉంటాయి.

కొంతమంది స్టాలిన్ రష్యన్ ప్రజలను భయభ్రాంతులను చెయ్యడం ద్వారా యుద్ధం చేసేలా చేసేడంటారు. కొంతమంది హిట్లర్ ను రష్యన్లు తప్పకుండా ఆహ్వానించేవారనీ కాని హిట్లర్ తన మూర్ఖత్వం వలన రష్యన్ ప్రజలను దూరం చేసుకున్నాడనీ అందువలన రష్యన్లు హిట్లర్ కు వ్యతిరేకంగా పోరాడారనీ అంటారు. మరికొంతమంది రష్యా ఎవరికీ అర్థం కాని ఒక మిస్టరీగా ప్రచారం చేశారు. కొందరు రష్యన్లకు తమ స్వాతంత్ర్యానికి ప్రమాదం ఎదురైనప్పుడు పోరాడే సంప్రదాయం ఉందన్నారు. మరికొందరు మేధావులు రష్యన్లు, హిట్లర్ ఎక్కువ దుర్మార్గుడా, స్టాలిన్ ఎక్కువ దుర్మార్గుడా అని త్రాసులో ఇద్దరినీ తూచి, హిట్లర్ కంటే స్టాలినే నయమనుకుని స్టాలిన్ వైపు మొగ్గారని అన్నారు.

(జర్మన్) జనరల్ గుడెరియన్ మాస్కో దాడి సమయంలో ఒక జారిస్టు జనరల్ తో సంభాషణ గురించి రాశాడు - '.....మీరు ఇరవై సంవత్సరాల క్రిందట వచ్చినట్లయితే మిమ్మల్ని చేతులు చాచి ఆహ్వానించే వాళ్ళం. కాని మీరు రావడం చాలా ఆలస్యమైంది. ఇప్పుడిప్పుడే మేం మా కాళ్ళమీద నిలబడుతున్నాం. మీరు వచ్చి మమ్మల్ని మరో రెండు దశాబ్దాలు వెనక్కు గెంటేస్తున్నారు. మేం ఇప్పడు మా మాతృదేశం కోసం పోరాడుతున్నాం. ఈ పోరాటంలో మేమందరం ఒక్కటయ్యాం' అనిచెప్పాడుట గుడెరియన్ గారితో. బహుశా ఈ జారిస్టు జనరల్ గారికి 20 సంవత్సరాల క్రితం 14 దేశాలు బోల్షివిక్కులనుండి రష్యానూ ప్రపంచాన్నీ రక్షించడానికి దాడి చేసి విఫలమైన సంగతి గుర్తుండి ఉండదు. లేక జర్మన్లు మాత్రమే రష్యన్లను స్టాలిన్ నుండి రక్షించగలరని జనరల్ గుడెరియన్ గారి అభిప్రాయం కావచ్చు.

ఈ రకమైన వివరణలన్నీ ఒక మహత్తర పోరాటానికి వెనుకునున్న అసలు కారణాన్ని కప్పి పుచ్చుతాయి. అదేమిటంటే స్టాలినిస్టు రష్యాలో సామాన్య ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనుభవిస్తున్నారు కాని వారు స్టాలిన్ బానిసలు కారు. స్టాలిన్ నాయకత్వంలో కార్మికవర్గ నియంతృత్వం ప్రజలను పీడించే వర్గాలనూ వ్యక్తులనూ నిర్దాక్షిణ్యంగా అణచి వేస్తూ పీడిత వర్గాలలో ఒక నూతన చైతన్యం తీసుకు వచ్చి, తమ శక్తిలో, తమ భవిష్యత్తులో విశ్వాసం కల్పించి, వారు తమ స్వేచ్ఛ కోసం, తాము సాధించిన ప్రగతిని కాపాడుకోవడం కోసం సింహాల్లా పోరాడేలా చేసింది. ఇదీ వీరు కన్నులు చూడ నిరాకరించే వాస్తవం.

1990లో అంతవరకూ రహ్యస్యంగా ఉన్న స్టాలిన్ ప్రభుత్వ రికార్డులను గోర్బచేవ్ బహిరంగం చేసినప్పుడు, తాము స్టాలిన్ హత్యాకాండ గురించి చెప్పినదంతా ఈ ప్రభుత్వ రికార్డులు ధృవపరుస్తాయనీ కమ్యూనిజం ఎంత రక్తసిక్తమైనదో స్పష్టమవుతుందనీ రాబర్ట్ కాంక్వెస్ట్, సక్రోవ్, మెద్వెదేవ్ లాంటి మేధావులు చంకలు గుద్దుకున్నారు. ఈ ప్రభుత్వ రికార్డులు ఏం వెల్లడించాయి?

అనేకమంది చరిత్రకారులు సోవియట్ యూనియన్ లోని శిక్షా వ్యవస్థ గురించి పరిశోధనలు చేశారు. వీరి పరిశోధనలు 9000 పేజీల రిపోర్టులో ఉన్నాయి. ఈ పరిశోధకులలో జెమ్స్కోవ్, దుగిన్, లెంజుక్ అనే రష్యన్ చరిత్రకారులు ప్రపంచానికి పరిచితమైన వారు. ఇక్కడ ఒక విషయం స్పష్టం చెయ్యాలి. వీరు సోషలిస్టు భావాలు కలవారు కారు. సోషలిస్టు వ్యతిరేక భావాలు గల బూర్జువా మేధావులు. ఈ పరిశోధనా పత్రాలు వెలువడినది సోవియట్ యూనియన్ కూలిపోతున్న, కూలిపోయిన తర్వాత కాలంలో. అందువలన ఈ పరిశోధనను కమ్యూనిస్టు కుట్రగా కొట్టి పడెయ్యడానికి వీలులేదు. వీరు కమ్యూనిస్టు వ్యతిరేకులయినా తమ పరిశోధనల పట్ల నిజాయితీ గల మేధావులు. 1990 నుండి 1993 వరకూ వీరి పరిశోధనా పత్రాలు ప్రపంచానికి పెద్దగా తెలియని

Edit with WPS Office
సైంటిఫిక్ జర్నల్స్ లో మాత్రమే ప్రచురితమయ్యాయి. స్టాలిన్ రక్తదాహం గురించి విపరీతమైన ప్రచారం చేసిన, చేస్తున్న పెట్టుబడిదారీ ప్రపంచం ఈ పరిశోధనలు వెల్లడించిన వాస్తవాల పట్ల మౌనం వహించింది. పెట్టుబడిదారీ ప్రపంచంలో ఒకటి రెండు జర్నల్సుతో పాటు, ఈ రిపోర్టు వివరాలు అమెరికన్ హిస్టారికల్ రివ్యూలో వచ్చాయి (US Journal American Historical Review by J. Arch Getty, a professor of history at the University of California, Riverside, in collaboration with G. T. Rettersporn, a CNRS researcher, and the Russian Researcher, V. N. Zemskov, from the Institute of Russian History (part of the Russian Academy of Sciences). ఈ పరిశోధనలు వెల్లడించిన వాస్తవాలు:

1. 1934లో లేబర్ కేంపుల్లో రాజకీయ ఖైదీలూ సాధారణ నేరస్తులూ కలిపితే 5,10,307 మంది ఉన్నారు.
2. రాజకీయ ఖైదీల సంఖ్య 1934లో 1,27,000 నుండి 1941-1942లలో 5,00,000 మధ్య ఉంది. 1936-1939 ల మధ్య అన్ని రకాల నేరస్తుల సంఖ్య 8,39,406 నుంచి 13,17,195కు పెరిగింది. సోవియట్ యూనియన్ లో లేబర్ కేంపుల్లో అత్యధిక ఖైదీలున్న సంవత్సరం 1951. ఆ సంవత్సరంలో 19,48,158 మంది లేబర్ కేంపుల్లో ఉన్నారు. వీరిలో అత్యధికులు సాధారణ నేరస్తులు. రాజకీయ నేరాలకు శిక్షించబడిన వారి సంఖ్య 5,79,878. వీరిలో అత్యధికులు నాజీ దురాక్రమణ దారులతో చేతులు కలిపినందుకు శిక్షను అనుభవిస్తున్నవారు. దేశద్రోహ నేరం క్రింద 3,34,538 మంది శిక్షించబడ్డారు.

రాబర్ట్ కాంక్వెస్టు గారు 1939లో 90 లక్షల మంది రాజకీయ ఖైదీలు లేబర్ కేంపుల్లో ఉన్నారనీ, ఈ 90 లక్షల రాజకీయ ఖైదీలూ కాక అంతకు ఎక్కువే సాధారణ ఖైదీలున్నారనీ చెప్పారు. కాని పై ప్రభుత్వ పత్రాల ప్రకారం 1939లో మొత్తం ఖైదీల సంఖ్య 20 లక్షలు మాత్రమే. ఇందులో 4,54,000 మంది మాత్రమే రాజకీయ ఖైదీలు (మన కాంక్వెస్టు గారు చెప్పినట్లు 90 లక్షలు కాదు). 1937-39 కాలంలో లేబర్ కేంపుల్లో మరణించిన ఖైదీల సంఖ్య 1,60,000 (కాంక్వెస్టు గారు ప్రచారం చేసినట్లు 30 లక్షలు కాదు). 1950లో 5,78,000 మంది రాజకీయ ఖైదీలు లేబర్ కేంపుల్లో ఉన్నారు (కాంక్వెస్టు చెప్పినట్లు ఒక కోటి, పన్నెండు లక్షలు కాదు).

పెట్టుబడి దారీ దేశాల కుట్రల మధ్య సతమతమవుతూ, సైనిక రాజకీయ తిరుగుబాటు కుట్రతో తన ఉనికే ప్రమాదంలో పడిన అత్యంత గడ్డుకాలంలో సోవియట్ యూనియన్ జెయిళ్ళలో 25 లక్షలమంది ఖైదీలు - అంటే సోవియట్ యువ జనాభాలో 2.4 శాతం - ఉన్నారు. ఈ సంఖ్యను 1996 నాటి అమెరికాతో పోల్చి చూద్దాం. ఆ నాటి అమెరికన్ జనాభా 25 కోట్ల 20 లక్షలు. ఆ సంవత్సరంలో అమెరికన్ జెయిళ్ళలో 55 లక్షల మంది ఖైదీలున్నారు - అంటే యువ జనాభాలో 2.8 శాతం. సోషలిస్టు న్యాయ సూత్రాలను అతిక్రమించి స్టాలిన్ దేశాన్ని ఒక జెయిలుగా మార్చాడని నిందించిన కృశ్చేవ్ కాలంలో లేబర్ కేంపుల్లో ఉన్న ఖైదీల సంఖ్య దాదాపు 20 లక్షలు.

ఇంత కంటే ఈ అసత్య ప్రచారం గురించి వివరాల్లోకి పోనక్కర్లేదు. ఈ మేధావులు చిత్రిస్తున్నట్లు స్టాలినిస్టు రష్యా తీరని రక్తదాహంతో కోట్ల మంది పౌరులను హత్య చేసిన రాక్షస సమాజం కాదు. పాలితులను పాలకులను చేసి, వారిలో ఒక నూతన చైతన్యాన్ని తీసుకువచ్చిన నూతన వ్యవస్థ.

రష్యాలో విప్లవానికి ముందు జారిస్టు రష్యాలోని కార్మికుల పరిస్థితిని, విప్లవానంతరం అతి తక్కువ కాలంలో స్టాలినిస్టు రష్యా ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో సాధించి అద్భుత ప్రగతితో పోల్చి చూస్తే, రష్యన్ ప్రజల జీవితాలలో ఈ స్వల్పకాలంలో ఎంత మార్పు వచ్చినదీ గమనిస్తే, ఈ విషయం స్పష్టమవుతుంది.

స్టాలినిస్టు రష్యా, రష్యన్ శ్రామిక వర్గం, పీడిత ప్రజల జీవితాల్లో ఎటువంటి మౌలికమైన మార్పులు తీసుకు వచ్చిందో చూద్దాం.

కార్మికుల జీవితాలు

బ్రిటిష్ ప్రభుత్వం ఒక శ్వేత పత్రంలో విప్లవానికి ముందు రష్యన్ కార్మికుల జీవన పరిస్థితి గురించి

Edit with WPS Office
ఇలా వెల్లడించింది:

'....రష్యాలో పారిశ్రామిక పరిస్థితుల గురించి చేసిన ఒక అధ్యయనం ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. మానవ జీవితం గురించీ, అమానుషమైన అవమానకరమైన పరిసరాల్లో కాయకష్టం చేసే కార్మికుల శారీరక, మానసిక స్థితి, అటువంటి జీవితాన్నుంచి ఎదురయ్యే సామాజిక ప్రమాదాల గురించీ (రష్యన్) పారిశ్రామిక వేత్తలకు లక్ష్యం లేదు అని తెలియజేస్తుంది...' - (Workers in the Soviet Union by Andrew Rothsteinn, p. 7).

జార్ చక్రవర్తిని అభిమానించే స్టీఫెన్ గ్రాహం అనే పరిశీలకుడు 1911-12లలో యురల్స్ ఫాక్టరీల పరిస్థితులను గమనించిన తర్వాత '...కార్మికుల జీవన పరిస్థితులు ఎంత ఘోరంగా ఉన్నాయంటే వారిని పోరాడమని వేరే ఎవరూ చెప్పనక్కర్లేదు. పుస్తకాలూ కరపత్రాలూ బోధించనక్కర్లేదు. వారి జీవితానుభవం చాలు. అధికారుల చాకచక్యం, క్రూరత్వం - ఏదీ కూడా ఈ ఉప్పెనను ఆపలేదు. రష్యన్ కార్మికులు ఇంగ్లీషు కార్మికుల కంటే తేలికగా ఏకమవుతారు. వారికి జీవితమంటే భయం లేదు. పరిణామాల గురించి లెక్క చెయ్యరు. ఈ రోజు వారు తిరగబడినట్లయితే ఎంతో ప్రతికూలమైన పరిస్థితులను ఎదుర్కోవలసి ఉంటుంది. అదొక్కటే వారిని ఆపి ఉంచుతోంది.....' అని రాశాడు (ibid, p. 10).

విప్లవానికి పూర్వం జారిస్టు రష్యాలో సగటు పనిదినం 10-12 గంటలుండేది. పిల్లలు సగటున ఏడున్నర గంటలు పనిచేసేవారు. తండ్రి కనుక అదే ఫాక్టరీలో పని చేస్తుంటే పిల్లల చేతా, స్త్రీలచేతా రాత్రి కూడా పని చేయించవచ్చు. వేతనాలు తక్కువగా ఉండేవి. స్త్రీల వేతనాలు పురుషుల వేతనాల కంటే చాలా తక్కువ. 1913లో పురుషుల సగటు వేతనాలు నెలకు 21 రూబుళ్ళుంటే స్త్రీల వేతనాలు 15 రూబుళ్ళు మాత్రమే ఉండేవి. కార్మికుల నిజ వేతనాల పెరుగుదల, నిత్యావసర వస్తువుల ధరలతో పోల్చి చూస్తే చాలా తక్కువగా ఉండేది. 1901 నుంచి 1912 వరకు వేతనాలు 18 శాతం మాత్రం పెరగగా, కార్మికుల ప్రధాన ఆహారమైన రై బ్రెడ్ ధర 51 శాతం పెరిగింది. యజమాని అసంతృప్తి చెందితే కార్మికుల వేతనాల్లో మూడోవంతు ఫైను వెయ్యవచ్చు. కార్మికులు వారికి కావలసిన వస్తువులను యజమాని షాపునుండే సాధారణంగా కొనవలసి వచ్చేది. ఈ పద్ధతి కార్మికులు యజమాని దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేలా చేసేది. స్త్రీ కార్మికులకు ఫోర్మన్లు, షాపు మేనేజర్ల నుండి రక్షణ ఉండేది కాదు. తండ్రులు, భర్తలు ఉద్యోగాలు కోల్పోతారన్న భయంతో స్త్రీలు బలవంతపు వ్యభిచారానికి దిగాల్సిన పరిస్థితి చాలా చోట్ల ఉండేది. కార్మికుల బీమా పధకం కింద జీతం నుంచి డబ్బు వసూలు చేసేవారు కాని కార్మికులకు నామ మాత్రపు వైద్య సదుపాయం ఉండేది. ప్రమాదాలు జరిగినప్పుడు యజమాని ప్రమాదం కార్మికుడి నిర్లక్ష్యం వలన జరిగిందని రుజువు చేస్తే ఏ విధమైన సహాయం ప్రమాదానికి గురయిన కార్మికుడికి అందదు. యజమానులు తరచు అలా 'రుజువు' చేసి ప్రమాదానికి గురయిన కార్మికులకు ఏ సహాయం ఇచ్చేవారు కారు. దాదాపు అన్ని పరిశ్రమలలోనూ ఏదో ఒక కారణం చూపించి సమ్మెలు నిషేధించబడ్డాయి. ఆశ్విక దళాలు సమ్మె చేసే కార్మికుల మీద దాడి చేసేవి. వారి ప్రదర్శనలను భగ్నం చేసేవి. సమ్మెలో పొల్గోవడం అంటే అరెస్టులు, సైబీరియా ప్రవాసం, పోలీసు కాల్పుల్లో మరణాలు. ట్రేడ్ యూనియన్లను నిషేధించిన కారణంగా సమ్మెలను రహస్యంగా ఆర్గనైజు చెయ్యాల్సి వచ్చేది. 1905 విప్లవ సమయంలో కార్యకర్తలు కొంతకాలం వరకూ బహిరంగంగా పని చేశారు కాని 1906 విప్లవ పరాజయంతో ట్రేడ్ యూనియన్ ఉద్యమం కష్టాలపాలయింది. 1907-1912ల మధ్య 600 ట్రేడ్ యూనియన్లను మూసి వెయ్యాల్సి వచ్చింది లేదా ప్రభుత్వం గుర్తించ నిరాకరించింది. కార్మికుల కుటుంబాలలో శిశుమరణాల సంఖ్య 1000 కు 266 ఉండేది. కుటుంబాలలో దుర్భర జీవన పరిస్థితులు, ఫాక్టరీ యజమానుల క్రూరత్వం, నలుగురూ కలిసి తమ గోడును వినిపించే మార్గం లేకపోవడం, నామ మాత్రమైన స్వేచ్ఛ - కార్మికులను పోరాటాల్లోకి దించేవి.

1917 విప్లవానంతరం రష్యాలో కార్మిక, కర్షక రాజ్యం ఏర్పడి పాలితులు పాలకులయ్యారు. సహజంగానే కార్మిక వర్గం ఈ మార్పులో ప్రధాన పాత్ర పోషించింది. అంతవరకూ జారు పాలనలో అణగి పోతున్న మెజారిటీ ప్రజలు, తమను అణచి ఉంచిన మైనారిటీని అణగదొక్కి తమ పాలన ప్రారంభించారు. ఈ విప్లవం కార్మిక వర్గ జీవన పరిస్థితులలోనూ, అధిక సంఖ్యాక ప్రజల జీవన పరిస్థితులలోనూ మౌలికమైన మార్పులు తీసుకు వచ్చింది.

1941 నాటి రష్యాలో సగంమంది ప్రజలు జారిస్టు రష్యాలోని దుర్భర జీవితం స్వయంగా

Edit with WPS Office
అనుభవించారు. మిగిలిన సగం తమ తల్లిదండ్రుల దగ్గరనుండి ఆ జీవితం ఎలా ఉండేదో తెలుసుకున్నారు. అందువలన 1941 నాటి సోవియట్ ప్రజానీకం, జారిస్టు రష్యాలో సామాన్య ప్రజల జీవన పరిస్థితికీ సోవియట్ రష్యాలో జీవన పరిస్థితికీ మధ్య అంతరాన్ని స్పష్టంగా అర్థం చేసుకున్నదని చెప్పవచ్చు.

పెట్టుబడిదారీ దేశాలలో కార్మికుడిని భయం నీడలా వెన్నాడుతూ ఉంటుంది. ఉద్యోగం ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు ఊడుతుందో తెలియని అనిశ్చిత పరిస్థితి కార్మికుడిని క్రుంగదీస్తుంది. వేలమంది తోటి కార్మికులతో పోటీ పడుతూ ఫాక్టరీ గేటు దగ్గర పనికోసం పడిగాపులు పడాల్సిన స్థితి కార్మికుడిని వివశుడిని చేస్తుంది. నిరుద్యోగిగా అతను ఎంతో కాలం బతకలేడు. అతను పొదుపు చేసినదంతా నాలుగువారాలు పని లేకుండా ఉంటే ఎగిరిపోతుంది. నిరుద్యోగ భయం, ఆర్థిక మాంద్య భయం, దారిద్ర్య భయం, అనారోగ్య భయం, వార్ధక్యంలో దిక్కులేని చావు చావాల్సి వస్తుందన్న భయం - అతని జీవితమంతా భయంతోనే గడుస్తుంది.

ఈ భయం లేకుండా సోవియట్ కార్మికులు జీవించారు. అక్కడ తేనె, పాల నదులు ప్రవహించలేదు కాని కార్మికుల జీవన పరిస్థితి చాలా మెరుగైంది. భవిష్యత్తులో ఇంకా మెరుగవుతుందన్న ఆశ ఉంది. 1931 తర్వాత నిరుద్యోగం అన్నది లేకుండా అందరికీ ఉద్యోగాలు దొరకసాగాయి. ఉద్యోగం, ఉచిత వైద్యం, పరిమితి లేకుండా అనారోగ్యపు వేతనం, వృద్ధాప్యపు పెన్షనూ - కార్మికులు రేపు గురించి భయపడకుండా చేశాయి.

విప్లవానంతరం 1922లో 8 గంటల పనిదినం అమలులోకి వచ్చింది. 14-16 సంవత్సరాల పిల్లలు తప్పనిసరి పరిస్థితులలో తప్ప పని చెయ్యకూడదు. ఒకవేళ పని చెయ్యాల్సి వస్తే వారి పనిదినం నాలుగు గంటలకు మించదు. 16-18 సంవత్సరాల యువకుల పనిదినం 6 గంటలు. ప్రమాదకర ప్రదేశాల్లోనూ గనుల్లోనూ విద్యా సంస్థలలోనూ ఆఫీసుల్లోనూ పనిదినం 6 గంటలు. అత్యవసర పరిస్థితులలో తప్ప ఓవర్ టైం నిషేధించబడింది. 1913లో 10-11 గంటల సగటు పనిదినం ఉంటే 1934లో 6.6 గంటల సగటు పనిదినం ఉంది. కొంతకాలం సోవియట్ పరిశ్రమలలో 6 దినాల వారం (5 రోజుల పని, ఒక దినం విశ్రాంతి) అమలులో ఉండేది. రోజుకు 7 గంటల పని. 1940లో యుద్ధ మేఘాలు కమ్ముతున్నప్పుడు 7 రోజుల పని వారం (6 రోజుల పని, ఒక రోజు విశ్రాంతి) అమలులోకి వచ్చింది.

1926లో కార్మికుల నిజ వేతనాలు మొదటి ప్రపంచ యుద్ధ ప్రారంభ సమయానికంటే (అంటే 1913తో పోల్చి చూసినప్పుడు) 15 శాతం ఎక్కువ. 1932లో మొదటి పంచవర్ష ప్రణాళిక పూర్తయినప్పుడు రెట్టింపు అయ్యాయి. రెండో పంచవర్ష ప్రణాళికా కాలంలో మళ్ళీ రెట్టింపు అయ్యాయి (పెట్టుబడిదారీ వ్యవస్థ 1929లో ఆర్థిక మాంద్యంలో చిక్కుకున్నప్పుడు, ఆకలి దశాబ్దం అని పేరుపడ్డ 1930 దశకంలో కేపిటలిస్టు దేశాలలో కోట్లమంది నిరుద్యోగులై ఆకలితో అల్లాడి పోయారు. హిట్లర్ జర్మనీలో 1929తో పోల్చి చూసినప్పుడు 1937లో నిజవేతనాలు 21 శాతం క్షీణించాయి). రష్యాలో చేసిన పని పరిమాణం, నాణ్యతల మీద వేతనాలు నిర్ణయించే విధానం అమలులో ఉండేది. సోవియట్ వేతన విధానం పనిచేసే అందరికీ కనీస జీవన ప్రమాణాలను గేరంటీ చేసేది. వేతనాలకు సంబంధించి మరో విషయం ఇక్కడ గుర్తుంచుకోవాలి. సోషలిజాన్ని వ్యతిరేకించేవారు, కార్మికుడు పని చేసినా చెయ్యకపోయినా జీతాలిస్తుంటే కార్మికులు ఎందుకు పని చేస్తారని ప్రశ్నిస్తారు. ఇది పూర్తిగా అపోహ, దుష్ప్రచారం మాత్రమే. సైద్ధాంతికంగానూ ఆచరణలోనూ ప్రతీ ఒక్కరికీ ఒకే రకమైన వేతనాలు అనేది స్టాలినిస్టు రష్యాలో లేదు. పని చేసే ప్రతీ వ్యక్తి కనీస అవసరాలు తీరే విధంగానూ, తన నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుని ఎక్కువ ఉత్పత్తి చేసే వ్యక్తికి అధికంగానూ వేతనాలు చెల్లించే పద్ధతి ఉండేది. నైపుణ్యం, అర్హతలూ పెంచుకుని అధికంగా ఉత్పత్తి చేసే కార్మికులకు అధిక వేతనాలు పొంది తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకునే అవకాశం ఉండేది. కార్మిక సంక్షేమ కార్యక్రమాలను దుర్వినియోగం చేసే సోమరిపోతులను అదుపులో ఉంచడానికి క్రమశిక్షణ ఉండేది. వేతనాలకు సంబంధించి మరో ముఖ్యమైన విషయమేమిటంటే స్త్రీ పురుష కార్మికులకు సమాన వేతనాలు. ఆ కాలంలో రష్యాని సందర్శించిన ప్రతీ వారూ స్త్రీ పురుషులకు ఇలా సమాన వేతనాలివ్వడాన్ని వేనోళ్ళ కొనియాడారు.

1931 తర్వాత రష్యాలో నిరుద్యోగం పూర్తిగా అదృశ్యమైంది. జీవన వ్యయం తగ్గింది. కార్మికులకు అవసరమైనవి ఉచితంగా గాని, తక్కువ ధరలకు కాని లభ్యమయ్యేవి. 1926లో ఇంటి

Edit with WPS Office
అద్దె, రెంటు, ఇంటిని వేడిగా ఉంచడానికి (శీతల దేశాలలో ఇంటిని వేడిగా ఉంచడానికి ఇంధనం కావాలి) అయ్యే ఖర్చు కుటుంబ బడ్జెట్ లో 3-4 శాతం మించి ఉండేది కాదు. 1934-37లలో బ్రెడ్ ధర, వెన్న ధర సగం తగ్గాయి. మాంసం ధర 63 శాతం, పంచదార ధర 73 శాతం తగ్గాయి. కార్మికుల్లో నల్ల రొట్టె (చవకరకం రొట్టె) వినియోగం 1930లో 100 అనుకుంటే 1939లో 71 శాతానికి తగ్గింది. అదే కాలంలో కార్మికుల్లో గోధుమ రొట్టె (మేలు రకం రొట్టె) వినియోగం 176 శాతం పెరిగింది. గుడ్లు 208 శాతం, వెన్న 301 శాతం, మాంసం వినియోగం 500 శాతం పెరిగింది.

పోషకాహారం లభ్యం కావడం వలన సోవియట్ యువకుల దేహదారుఢ్యం కూడా పెరిగింది. 1927 లో కంటే 1933లో సోవియట్ యువకుల సగటు రొమ్ము చుట్టుకొలత అంగుళం పెరిగింది. బరువు 5 పౌన్ల కంటే ఎక్కువ పెరిగింది. పొడుగు ఒకటినుండి ఒకటిన్నర అంగుళాలవరకూ పెరిగింది. 1937లో మరణాల సంఖ్య 1913లో జారిస్టు రష్యాలో మరణాల సంఖ్య కంటే 40 శాతం తక్కువ. 1911-13లో శిశు మరణాలు 1000కి 266 ఉంటే 1922-26లకు 178కి, 1941 సంవత్సరానికి 138కు తగ్గింది. 1917-1939ల మధ్య క్షయ వ్యాధి 83 శాతం తగ్గింది.

కార్మికుల సంక్షేమ కార్యక్రమాలు ప్రపంచంలో ఏ దేశంలో కన్నా మెరుగ్గా ఉండేవి. కనీసం అయిదున్నర నెలలు పని చేసిన వారికి 15 రోజులు పూర్తి వేతనంతో సెలవూ, ప్రమాదకర పరిశ్రమలలో పని చేసేవారికీ, 18 సంవత్సరాల లోపు యువకులకూ ఒక నెల సెలవూ లభించేవి. కార్మికులకు బీమా సదుపాయం ఉచితం. జీతం నుండి ఏమీ కోత ఉండేది కాదు. ఈ పథకమంతా కార్మికులే నిర్వహించేవారు. కార్మికులు తాత్కాలికంగా పని చెయ్యలేని పరిస్థితులలో వారి సర్వీసుని బట్టి వారికి వేతనం చెల్లించబడేది. ట్రేడ్ యూనియన్ సభ్యుడై, కనీసం 2 సంవత్సరాల సర్వీసు ఉన్న కార్మికులకు 50 శాతం, 2-3 సంవత్సరాల సర్వీసుంటే 60 శాతం, 3-6 సంవత్సరాల సర్వీసుంటే 80 శాతం, 6 సంవత్సరాల సర్వీసు దాటితే పూర్తి వేతనం లభ్యమయ్యేది. బొగ్గు గనుల్లోని కార్మికులకు రెండు సంవత్సరాల లోపు సర్వీసుంటే 60 శాతం, రెండు సంవత్సరాలుంటే పూర్తి వేతనం దొరికేది.

అనారోగ్యం కాని, ప్రమాదాలు కాని శాశ్వతంగా అవిటి వాళ్ళను చేస్తే కార్మికులకు పెన్షన్ దొరికేది.

ప్రమాదం వలన కాని, పారిశ్రామిక అనారోగ్యాల వలన కాని కార్మికుడు పని చెయ్యలేని పరిస్థితిలో ఉంటే అతనికి పూర్తి వేతనం దొరుకుతుంది. ఇతర కారణాల వల్లనైతే 66 శాతం లభించేది. 60 ఏళ్ళ పురుషులకూ 55 సంవత్సరాల స్త్రీలకూ వృద్ధాప్యపు పెన్షన్ దొరికేది. పనిచేసిన ప్రదేశాన్ని బట్టి పెన్షన్ దొరికేది. ప్రమాదకరమైన ప్రదేశాల్లోనూ భూగర్భంలోనూ పని చేసిన వారికి సగటు వేతనంలో 60 శాతం, తేలికపాటి పరిశ్రమల్లో పని చేసిన వారికి 50 శాతం దొరికేది. పెన్షనర్లు పని చేయాలనుకుంటే వేతనాలతో పాటు పూర్తి పెన్షన్ దొరికేది. కుటుంబాన్ని పోషించే వ్యక్తి చనిపోతే అతని మీద ఆధారపడిన వారికి పరిస్థితులను బట్టి వేతనంలో సగం నుండి మూడొంతుల వరకూ పెన్షన్ దొరికేది. ఈ పెన్షన్ విషయం స్త్రీ పురుణ వివక్ష లేదు.

సోవియట్ కార్మికులకు విశ్రాంతి గృహాలలోనూ సేనిటోరియాలలోనూ వసతి తీసుకునే ఏర్పాటు ఉండేది. 1928లో 5,11,000 మంది కార్మికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటే 1940లో 30 లక్షలమంది కార్మికులు వినియోగించుకున్నారు. విప్లవానికి ముందు భూస్వాములకు చెందిన భవనాలు విప్లవానంతరం కార్మికుల విశ్రాంతి మందిరాలుగా మారాయి. అవి కాక విప్లవం తర్వాత అనేక విశ్రాంతి గృహాల నిర్మాణం జరిగింది.

1929లో ఆర్థిక మాంద్యానికి ముందు, పెట్టుబడి దారీ ప్రపంచంలో ఉత్పత్తి శిఖరానికి చేరుకున్న తరుణంలో సోవియట్ పరిశ్రమల ఉత్పత్తి ప్రపంచ ఉత్పత్తిలో 3.8 శాతం ఉంది. 1932లో 11 శాతం, 1936 నాటికి 15.2 శాతం పెరిగింది. పెట్టుబడిదారీ దేశాల ఉత్పత్తి 1929 కంటే 1937 నాటికి 3.5 శాతం మాత్రమే పెరిగింది. 1929తో పోల్చి చూసినప్పుడు 1937లో సోవియట్ పారిశ్రామిక ఉత్పత్తి మొత్తం 371 శాతం, ఆధునిక భారీ పరిశ్రమల ఉత్పత్తి 428 శాతం పెరిగింది.

1933 మే నెలలో ఒక బ్రిటిష్ కార్మిక వర్గ ప్రతినిధి వర్గం సోవియట్ యూనియన్ పర్యటించింది. ఈ ప్రతినిధి వర్గంలో ఇంజినీర్లు, ఉక్కు మిల్లు కార్మికులు, రైల్వే కార్మికులు, తదితర కార్మికులూ ఉన్నారు. ఈ ప్రతినిధి వర్గం తమ పర్యటన గురించి ఇలా పేర్కొంది - '.....మేము ఏం చూశాం? నిర్మాణంలో మునిగిన దేశాన్ని చూశాం. పెద్ద ఫాక్టరీలు - కొన్ని పూర్తయి పని చేస్తున్నాయి. కొన్ని పూర్తవుతున్నాయి – చూశాం. ప్రతీచోటా ఆరోగ్యానందాలతో, ఈ దేశానికి తాము అధిపతులమనే, ఈ దేశాన్ని నడిపించాల్సిన బాధ్యత తమదీ అనే స్పృహతో, ఉత్సాహంతో ప్రజలు పని చెయ్యడం చూశాం.....'

Edit with WPS Office
(ibid., p. 16)

వాల్టర్ రూథర్ అనే అమెరికన్ ట్రేడ్ యూనియన్ లీడర్ తన యవ్వనంలో రష్యా పర్యటించి ఇలా రాశాడు - '.....రష్యాలో అద్భుతాలు చూస్తున్నాం. అనుభవిస్తున్నాం. అత్యంత వెనుకబడిన దేశం శాస్త్ర పురోగతితో, నూతన భావాలతో, ఆధునిక దేశంగా అతి త్వరితంగా మారడం చూస్తున్నాం. సోషలిజం పుస్తకాల్లోంచి జీవితంలోకి ప్రయాణించడం చూస్తున్నాం. ఇటువంటివి చూస్తున్నప్పుడు ఎవరికి ఉత్సాహం కలుగదు?' అన్నాడు (అతను తరువాత కమ్యూనిస్టు వ్యతిరేకిగా మారాడు. అది వేరే సంగతి).

విప్లవం తమకేమి తెచ్చిందో స్వయంగా గ్రహించిన రష్యన్ కార్మిక వర్గం ఆ విప్లవ ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి ముందుండి పోరాడిందంటే ఆశ్చర్యం ఏముంది?

స్టాలినిస్టు రష్యాలో స్త్రీల స్థితిగతులు

స్త్రీలు పురుషులకంటే తక్కువ వారని మార్క్సిజం అంగీకరించదు. స్త్రీ పురుషుడి మీదా, పిల్లలు తల్లిదండ్రుల మీదా ఆధారపడి ఉండిన పరిస్థితి నేటి వివాహ వ్యవస్థకు పునాది అంటుంది. స్త్రీ సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనుభవించాలంటే ఈ రెండు విషయాలలోనూ పరిస్థితి మారాల్సిన అవసరాన్ని గుర్తిస్తుంది. మార్క్సిస్టులు అనుసరించే స్త్రీ విముక్తి పంథా బూర్జువా ఫెమినిస్టుల ఆచరణ శూన్యమైన శుష్క నినాదాల పంథా కాదు - శాస్త్రీయమైనది. స్త్రీ సామాజిక జీవితంలో చురుగ్గా పని చేసే పరిస్థితులను కల్పించడం, ఈ రంగంలో ఆమెకు అడ్డుపడుతున్న పరిస్థితులను తొలగించడం ద్వారా మాత్రమే స్త్రీ పురోగతి సాధ్యమవుతుంది అని కమ్యూనిస్టులు మొదటి నుండీ గుర్తించారు. ఆ దిశగా కృషి చేసి అద్భుతమైన ఫలితాలు సాధించారు.

'మనం అత్యున్నతమైన ఆదర్శాలను బలి చెయ్యకూడదు' అన్నాడు హిట్లర్. హిట్లర్ జర్మనీ అత్యున్నతమైన ఆదర్శం ఏమిటంటే జర్మన్ స్త్రీ గృహానికే పరిమితమై ఉండాలి. సోవియట్ స్త్రీ వలె ఆమె జర్మన్ పురుషులతో పాటు యుద్ధరంగంలో లేదు; ఫాక్టరీలలో లేదు; పొలాల్లో లేదు. సైన్యంలో, గెరిల్లా దళాలలో, వైమానిక దళాలలో సోవియట్ స్త్రీ పురుషుడి సరసన పోరాడుతుంటే జర్మన్ స్త్రీ గృహానికి పరిమితమైంది. యుద్ధకాలంలో పురుషులందరూ యుద్ధానికి పోయిన స్థితిలో సోవియట్ స్త్రీ ఒంటరిగా వ్యవసాయ భారం మోస్తుంటే, జర్మన్ స్త్రీ ఇంటి పనులలో మునిగి తేలింది. సోవియట్ పరిశ్రమలలో 51 శాతానికి పైగా స్త్రీ కార్మికులు ఉంటే జర్మనీలో 1,82,000 మంది స్త్రీలు మాత్రమే పరిశ్రమలలో పని చేశారు. సోవియట్ స్త్రీలు సోవియట్ పురుషుడి సరసన, అతనితో సమానంగా గొప్ప సాహసంతో ఎందుకు పోరాడారో, అకుంఠిత దీక్షతో ఫాక్టరీలలో రోజుకు పదిహేను, పద్దెనిమిది గంటలు పని చేస్తూ సోవియట్ విజయానికి ఎందుకు తోడ్పడ్డారో అర్థం చేసుకోవాలంటే ముందు సోవియట్ సమాజం స్త్రీలకు ఏమిచ్చిందో తెలుసుకోవాలి.

జారిస్టు రష్యాలో స్త్రీల అణచివేత ఎక్కువగా ఉండేది. అణకువగా లేని భార్యలను కొట్టడాన్ని చర్చి ప్రోత్సహించేది. తూర్పున ముస్లిం ప్రాంతాలలో వివాహ సమయంలో పెళ్ళి కొడుకులకు (పెళ్ళాలను కొట్టడానికి) కొరడాలు బహుమానంగా ఇచ్చేవారు. ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్ లలో పరదా సంప్రదాయం ఉండేది. ఒక నూతన సమాజాన్ని నిర్మించాలంటే స్త్రీలను ఇలా అణచి వేసే సమాజాన్ని మార్చాలనే అవగాహన విప్లవ నాయకత్వానికి మొదటి నుండీ ఉంది. స్త్రీలను తక్కువ చేసే చట్టాలూ సంప్రదాయాలూ నిర్మూలించడానికి సోషలిస్టు ప్రభుత్వం కృషి చేసింది.

అక్టోబరు విప్లవం తర్వాత అంతర్యుద్ధంలో 'తెల్ల సైన్యం' పెట్రో గ్రాడ్ (తర్వాత లెనిన్ గ్రాడ్ గా మారింది) మీద దాడి చేసినప్పుడు 2 లక్షలమంది స్త్రీలు యుద్ధరంగానికి కదిలారు. వేలమంది బోల్షివిక్ కార్యకర్తలు - స్త్రీలు, పురుషులు - తూర్పున సోషలిస్టు నిర్మాణానికి కదిలారు. మహిళా కమ్యూనిస్టులు పరదా నిర్మూలన కార్యక్రమంలో ప్రముఖ పాత్ర పోషించారు. రైతుల గుడారాల్లో నివసిస్తూ, వారితో పాటు జీవితాన్ని పంచుకుంటూ, ఓపిగ్గా వారిని విప్లవ పథంలోకి తీసుకు వచ్చారు. రాజకీయ ప్రచారం అయ్యాకా పరదాలు తీసెయ్యాల్సిన సమయం వచ్చింది.

1928 మార్చి 8న, అంతర్జాతీయ మహిళా దినం నాటి ఈ పరదా నిర్మూలన కార్యక్రమం గురించి డేనిష్ రచయిత్రి ఫెమినా హెల్లీ ఇలా వర్ణించింది: '.....ఆ రోజున మధ్య ఏసియా నగరాల్లోనూ పట్టణాలలోనూ ఇరుకు వీధుల్లోనూ పరదా ధరించిన స్త్రీలు వేలమంది కెరటంలా విరుచుకు పడ్డారు.

Edit with WPS Office
వారితో పాటు కొంతమంది పురుషులూ పిల్లలూ కూడా ఉన్నారు. వారందరూ లెనిన్ విగ్రహం ముందు నిలబడ్డారు. స్త్రీలు ఎంతో ఉత్సాహంతో జరగబోయే దాన్ని గురించి ఎదురు చూస్తున్నారు. బేండ్లు అంతర్జాతీయ కార్మిక గీతం ఆలాపిస్తుండగా స్త్రీ బానిసత్వానికి చిహ్నంగా నిలిచిన పరదాలు గాలిలోకి లేచాయి. మొదట సందేహిస్తున్నట్లు అక్కడక్కడ లేచాయి. త్వరలోనే మైదానమంతా గాలిలో ఎగురుతున్న పరదాలతో నిండిపోయింది. పరదాలు గుట్టలుగా పోసి పేరాఫిన్ చల్లి అంటించారు. వేల సంవత్సరాలుగా స్త్రీలను అణచి ఉంచిన సంప్రదాయం క్షణాలలో నల్లటి పొగలలో అదృశ్యమైంది.....' - (Stalin's successes - Humanity's gains, p. 54).

సోవియట్ రాజ్యాంగంలో ఆర్టికల్ 122 పురుషులతో పాటు స్త్రీలకు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాలన్నింటిలోనూ సమాన హక్కులు ఇచ్చింది. సహకార క్షేత్రాలలో వ్యవసాయ కార్మికులుగా, మేనేజర్లుగా అనేకమంది స్త్రీలు పురుషులతో పాటు సమానంగా పని చేస్తుండేవారు. 1938లో కార్మికుల్లో 42 శాతం స్త్రీలే. అంతవరకూ స్త్రీలు ప్రవేశించరాని అనేక పరిశ్రమలలో వారికి ప్రవేశం దొరికింది. పురుషులతో పాటు అన్ని విద్యా సంస్థలలోనూ ప్రవేశించే అవకాశం స్త్రీలకు ఉండేది. 1938లో 1,40,000 మంది స్త్రీలు మెటల్ వర్కింగ్ పరిశ్రమలో ఇంజినీర్లుగానూ టెక్నీషియన్లు గానూ పని చేస్తుండేవారు. సోవియట్ యూనియన్ లో డాక్టర్లలో సగానికి పైగా (70,000) స్త్రీలే. 1939లో ఉన్నత విద్యా సంస్థలలో 6 లక్షలమంది విద్యార్థులలోనూ 43 శాతం స్త్రీలే. 1937లో కార్మిక విద్యార్థులలో 41 శాతం స్త్రీలు.

స్త్రీ కార్మికులకు ప్రసవానికి ముందు ఐదు వారాల, ప్రసవానికి తర్వాత నాలుగు వారాల, పూర్తి వేతనం దొరికేది. బిడ్డ జన్మించినప్పుడు కొంత ధన సహాయం ఉండేది. బిడ్డ పుట్టిన తర్వాత తొమ్మిది నెలలు బిడ్డ ఆహారానికి అదనంగా ఇచ్చేవారు. గర్భిణీదశలో చివరి మాసాలలో వేతనం తగ్గించకుండా తేలికపాటి పని ఇచ్చే సౌకర్యం ఉండేది. పాలిచ్చే తల్లులకు మూడున్నర గంటల తర్వాత బిడ్డకు పాలివ్వడానికి ఒక అరగంట సెలవు దొరికేది. ఈ అరగంటకు వేతనంలో కోత ఉండదు. పిల్లల బాధ్యత నుండి తల్లులను విముక్తి చెయ్యడానికి సోవియట్ ప్రభుత్వం నర్సరీలూ డే కేర్ సెంటర్లూ కేజీలూ ఆటస్థలాలూ ఫాక్టరీలలో ఆహారశాలలూ పెద్ద ఎత్తున ఏర్పాటు చేసింది. 1914లో (విప్లవానికి ముందు) మాతాశిశు కేంద్రాలలో 6800 పడకలుంటే 1937లో 81000 పడకలూ 1941 ప్రారంభానికి 1,36,000 పడకలూ ఉన్నాయి. ఇవి కాక రైల్వేలో పని చేసే వారికి అదనంగా పడకలుండేవి. పని చేసే తల్లుల బిడ్డల కోసం క్రెచ్ లూ కిండర్ గార్టెన్లూ ఉండేవి. 1913లో క్రెచ్ లలో 550 మంది పిల్లలను ఉంచడానికి ఏర్పాటు ఉంటే, 1941 ఏప్రిల్ 1 నాటికి 9 లక్షల మంది పిల్లలకు పెర్మనెంటు క్రెచ్ సౌకర్యం, మరో 40 లక్షలమంది పిల్లలకు సీజన్ వారీ క్రెచ్ సౌకర్యాలూ (ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో) ఉన్నాయి. అలాగే 1914లో కిండర్ గార్టెన్లలో 3 లక్షలమంది పిల్లలకు సౌకర్యం ఉంటే 1928 నాటికి 32 లక్షల మంది పిల్లలకు ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగింది. 1937 కంటే 1938లో మాతాశిశు సంక్షేమ బడ్జెట్ 30 శాతం పెరిగింది.

విద్యా సంక్షేమ కార్యక్రమాల కారణంగా సామాజిక జీవితంలో పాల్గొనే స్త్రీల సంఖ్య క్రమంగా పెరిగింది. 1936-37 సంవత్సరంలో 168 ట్రేడ్ యూనియన్ సెంట్రల్ కమిటీలలో 25 శాతం స్త్రీలున్నారు. ఆ సంవత్సరం ఎన్నికల ముందు 9 మంది స్త్రీలు ట్రేడ్ యూనియన్ అధ్యక్షులుగానూ, 23 మంది జనరల్ సెక్రటరీలుగానూ ఎన్నికయ్యారు. అలాగే పట్టణాలలో సోవియట్లు ప్రధానంగా కార్మిక వర్గాన్నుండి వచ్చిన వారి చేతుల్లో ఉండేవి. ఈ పట్టణ సోవియట్లలో 1926-27 సంవత్సరంలో 16,500 మంది స్త్రీలు సభ్యులుగా ఉంటే 1939వ సంవత్సరానికి ఈ సంఖ్య 54,400 కు - అంటే మొత్తం సభ్యత్వంలో 38 శాతానికి పెరిగింది. వందలమంది స్త్రీలు సుప్రీం సోవియట్ లోనూ, 16 రిపబ్లిక్ ల సోవియట్ లలోనూ సభ్యులయ్యారు.

1940లో సోవియట్ యూనియన్ సుప్రీం సోవియట్ లో కార్మిక, కర్షక వర్గాల నుంచి వచ్చిన 189 మంది మహిళా ప్రతినిధులున్నారు. ఆ నాటి ప్రపంచంలో ఏ పార్లమెంటులోనూ అంతమంది మహిళా ప్రతినిధులు లేరు. 1940లో సోవియట్ మధ్య ఏషియాలో పెద్ద నగరం అయిన తాష్కెంట్ ప్రెసిడెంటు ఒక మహిళ. కొద్ది సంవత్సరాల క్రితం ఆమె నిరక్షరాస్యురాలు. పరదా ముసుగులో నలిగిపోయిన పని పిల్ల.

బూర్జువా ఫెమినిస్టు మేధావి బూత్ క్లేర్ 1963 జూన్ 28 తేదీ లైఫ్ సంచికలో వ్రాస్తూ - '..... కమ్యూనిజం స్త్రీ పురుషులు సమానమేననీ చెప్పడమే కాదు, 1917 నుండీ ఆచరణలో చూపిస్తోంది'

Edit with WPS Office
అని అంగీకరించింది. 1929-1961 మధ్య కాలంలో ఆర్జనాపరులైన స్త్రీల సంఖ్య 31,18,000 నుంచి 3,16,09,000కు పెరిగిందనీ, 1917-1961 మధ్య కాలంలో స్త్రీ ఇంజినీర్ల సంఖ్య 600 నుంచి 3,79,000 మందికి పెరిగిందనీ (సోవియట్ యూనియన్ లో 31 శాతం ఇంజినీర్లు స్త్రీలే), 1961లో సుప్రీం సోవియట్ లో 26 శాతం స్త్రీలనీ, 20,000 సోవియట్ గ్రామాలలో స్త్రీలు నాయకత్వం వహిస్తున్నారనీ, 1961 సంవత్సరంలో సోవియట్ యూనియన్లో డాక్టర్లూ సర్జన్లలో 74 శాతం స్త్రీలేననీ ఆమె చెప్పింది. సోషలిస్టు వ్యవస్థలో స్త్రీ సాధించిన ప్రగతి గురించి ఎవ్వరూ కాదనలేని సత్యాలివి.

1942 మార్చి 8 నాటి ప్రావ్దా సంచిక సంపాదకీయం సోవియట్ స్త్రీ గురించి ఇలా వ్రాసింది - '.... సోవియట్ స్త్రీ యుద్ధరంగంలోనూ, వెనుకతట్టునా మగవారితో పాటు చేయిచేయీ కలిపి శత్రువు మీద విజయం సాధించడానికి పునాదులు వేస్తోంది....వీరి సాహసాలు మన దైనందిన జీవితంలో ఒక భాగమయ్యాయి.....వెనుకతట్టులో, పరిశ్రమలలో, రవాణాలో, వ్యవసాయంలో స్త్రీల పాత్ర ప్రశంసనీయమైనది... క్రిందటి సంవత్సరం అక్టోబరు నాటికి పరిశ్రమలలో 45 శాతం కార్మికులు స్త్రీలే. పరిశ్రమలలో స్త్రీ కార్మికులు యుద్ధరంగంలో పనిచేసినట్లుగానే పని చేస్తున్నారు....చరిత్రకారులు ఫాసిజం మీద విజయం సాధించిన వారి గురించి చెబుతున్నప్పుడు, మన గార్డ్స్ సైనికులతో పాటు, మన గెరిల్లా యోధులతో పాటు, మన స్త్రీ కార్మికుల త్యాగాల గురించి కూడా చెబుతారు.....'

హిట్లర్ జర్మనీ సోవియట్ రష్యా మీద దాడి చేసినట్లయితే విజయం సాధించాలంటే సోవియట్ స్త్రీ కూడా పురుషుడి సరసన పోరాడవలసి ఉంటుందన్న విషయం కమ్యూనిస్టులు గుర్తించి, యుద్ధానికి ముందు సంవత్సరాలలో లక్షలమంది స్త్రీలకు విమానాల పైలట్లుగానూ, పేరాషూట్ జంప్ చెయ్యడంలోనూ, గురిచూసి తుపాకీ పేల్చడంలోనూ శిక్షణనిచ్చారు. యుద్ధకాలంలో వేలమంది స్త్రీలు డాక్టర్లు, ఇంజినీర్లు, నర్సులగా పని చేశారు. మగవారు యుద్ధరంగానికి పోతే స్త్రీలు వారి స్థానాల్లో రక్షణ పరిశ్రమలలో, పోలీసులుగా, కారు, రైళ్ళ డ్రైవర్లగా, గని కార్మికులుగా, ఉక్కు పరిశ్రమలలో కార్మికులుగా - అన్ని రంగాలలోనూ పని చేశారు. సైన్యంలో, వైమానిక బలగాల్లో, గెరిల్లా దళాల్లో చేరి పోరాడారు.

గెరిల్లా యువతి 'టాన్యా' కథ సుప్రసిద్ధమైనది. 1941 డిసెంబరు మొదటి వారంలో ఈ 18 ఏళ్ళ గెరిల్లా యువతిని జర్మన్లు ఉరి తీశారు. ఆమె ఎవరైనదీ, ఎక్కడనుండి వచ్చినదీ ఎవరికీ తెలియదు. ప్రాంతీయ గెరిల్లా దళ సభ్యులను ఒకసారి కలిసినప్పుడు తన పేరు టాన్యా అని చెబుతుంది కాని అంతకంటే వివరాలు చెప్పదు. జర్మన్ ఆక్రమిత ప్రాంతాలలో ఆమె ఒకసారి టెలిఫోన్ తీగలు తెంపేస్తుంది. మరోసారి గుర్రపుశాలకు నిప్పంటించి 17 గుర్రాలను నాశనం చేస్తుంది. ఇలా జర్మన్లను వేధిస్తున్న ఈ గెరిల్లా ఒక రోజు రాత్రి జర్మన్ గుర్రపుశాలకు నిప్పు అంటిస్తుండగా పట్టుబడుతుంది. చిత్రహింసలు చేసినా ఆమె ఎవరూ, ఎక్కడనుంచి వచ్చినదీ, ఆమె స్నేహితులెవరూ అన్న విషయాలేమీ చెప్పదు. అండర్వేర్ తప్ప ఏమీ లేని ఆమెను జర్మన్ సైనికులు వట్టి కాళ్ళతో మంచులో రాత్రి నడిపిస్తూ హింసిస్తారు.

మర్నాడు గ్రామ మధ్య స్థలంలో, వందల గ్రామస్తుల సమక్షంలో జర్మన్ సైనికులు ఆమెను ఉరి తీస్తారు. ఉరికంబం ఎక్కుతూ ఆమె గ్రామస్తులను ఉద్దేశించి అంటుంది - 'దిగులు పడకండి కామ్రేడ్స్! ధైర్యంగా ఉండండి. జర్మన్లను తరిమి తరిమి చంపండి. చావంటే నాకు భయంలేదు కామ్రేడ్స్! ప్రజలకోసం మరణించడం గొప్ప విషయం.....'. తొందరగా ఉరి తియ్యమని ఆదేశాలిస్తున్న జర్మన్ ఆఫీసరు కేసి తిరిగి - 'నేను ఒంటరిని కాను. మేం కోట్ల మందిమి ఉన్నాం. కోట్లమందిని నువ్వు ఉరితియ్యలేవు. నా మరణానికి ప్రతీకారం జరిగి తీరుతుండి.....సెలవు కామ్రేడ్స్! స్టాలిన్ మనతోనే ఉన్నాడు. స్టాలిన్ వస్తాడు.....విజయం మనదే.....' అంటుంది.

గాలి వీచినప్పుడల్లా ఊగుతూ, మంచుకు తడుస్తూ నెల రోజులు ఆమె శవం ఉరికొయ్యకు అలా వేలాడుతూనే ఉంది. ఆ గ్రామం మీదుగా పోయే జర్మన్ సైనికులు కర్రలతో ఆమె శరీరాన్ని పొడుస్తూ కేరింతలు కొట్టేవారు. 1942 జనవరి ఒకటిన, కొత్త సంవత్సరం రోజున, తాగి ఉన్న జర్మన్ సైనికులు ఆమె శవాన్ని నగ్నం చేసి అవమానాలకు గురి చేస్తారు. కత్తులతో పొడుస్తారు. ఆ రోజు సాయంకాలం శవాన్ని సమాధి చెయ్యమని గ్రామస్తులను ఆజ్ఞాపిస్తారు. గ్రామస్తులు శవాన్ని గుడ్డతో చుట్టబోతుంటే వారించి, అలాగే నగ్నంగానే సమాధి చెయ్యమంటారు జర్మన్లు.

టాన్యా చేసిన త్యాగాలు వృధా కాలేదు. ఒక రోజు ఎర్ర సైన్యం దాడి చేసి జర్మన్లను తరిమివేసి ఆ ప్రాంతాన్ని విముక్తి చేస్తుంది.

Edit with WPS Office
తన పేరు కూడా లోకానికి చెప్పకుండా మరణించిన ఈ వీర యువతి అసలు పేరు జోయా. మాస్కో యువ కమ్యూనిస్టు లీగ్ సభ్యురాలు. జోయా లాగా అనేక వేలమంది యువతులు గెరిల్లాలుగానూ, స్కీ దళాల్లోనూ, సైన్యంలోనూ మగవారి సరసన యుద్ధం చేశారు.

సోవియట్ స్త్రీ లేకుండా సోషలిస్టు రష్యా విజయం లేదు. సోషలిస్టు వ్యవస్థ లేకుండా సోవియట్ స్త్రీకి జీవితం లేదు.

విద్యా సాంస్కృతిక రంగాలు

విద్య లేని వాడు వింత పశువు అంటారు. ఆరోగ్యం మహాభాగ్యం అంటారు. పెట్టుబడిదారీ దేశాలలో అన్నింటి లాగానే విద్యావైద్యాలు లాభాలు ఆర్జించి పెట్టే వ్యాపారాలే. చదువు ఖర్చు భరించలేని మనిషి విద్యాహీనుడిగా, వింత పశువుగా జీవించవలసి వస్తుంది. డాక్టరు బిల్లులు భరించలేని మనిషికి రోగ విముక్తిని ప్రసాదించేది శ్మశానమే. జ్ఞానం, ఆకలి, అనారోగ్యం అన్నింటినీ వ్యాపారంగా మార్చే అమానుషమైన వ్యవస్థ పెట్టుబడిదారీ వ్యవస్థ.

సోషలిస్టు ఆర్థిక విధానం పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి భిన్నమైనది. పెట్టుబడిదారీ విధానంలోలా లాభార్జన కాక ప్రజల అవసరాలను తీర్చడం దాని లక్ష్యంగా ఉంటుంది. సోషలిస్టు రష్యా విద్యా వైద్యాలనూ ప్రజల జీవన స్థాయిని పెంచడానికి అత్యవసరమైన సాధనాలుగా నిర్ణయించి ఈ రంగాలలో ఎంతో కృషి చేసింది.

జారిస్టు రష్యా ప్రధానంగా వ్యావసాయిక దేశంగా ఉండేది. జనాభాలో 80 శాతం నిరక్షరాస్యులు. 1913లో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో 80 లక్షలమంది చదువుతుండే 1933 నాటికి ఈ సంఖ్య 230 లక్షలు, 1940 నాటికి 3 కోట్ల 50 లక్షలు అయింది. 1913లో యూనివర్సిటీలలో 1,20,000 మంది విద్యార్థులుంటే 1940లో 6,20,000 మంది ఉన్నారు. విద్య ఉచితం లేదా అతి తక్కువ ఫీజు ఉండేది. 1913లో అక్షరాస్యుల సంఖ్య 21 శాతం ఉంటే 1939లో 85 శాతం అయింది. అలాగే సాంకేతిక విద్యలో రష్యా సాధించిన ప్రగతి సోవియట్ యూనియన్ ను బ్రహ్మాండమైన పారిశ్రామిక దేశంగా మార్చింది. సాధారణ, సాంకేతిక విద్యతో పాటు ఇంటర్మీడియట్ స్థాయిలో వృత్తి విద్య సోవియట్ పరిశ్రమలకు నైపుణ్యం గల కార్మికులను అందించేది. ఫాక్టరీలకు అనుబంధంగా వందల ఎప్రెంటీస్ స్కూళ్ళుండేవి. ప్రథమ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఉన్నత సాంకేతిక పాఠశాలలనుంచి 1,70,000 మంది సాంకేతిక నిపుణులు, మాధ్యమిక సాంకేతిక పాఠశాలలనుంచి 2,91,000 మంది సాంకేతిక నిపుణులూ ఉత్తీర్ణులయ్యారు. రెండో పంచవర్ష ప్రణాళికా కాలంలో ఉన్నత పాఠశాలలనుండి 8,70,000 మంది, మాధ్యమిక పాఠశాలలనుండి 6,23,000 మంది ఉత్తీర్ణులయ్యారు. సాంకేతిక విద్యలో రష్యా సాధించిన ఈ ప్రగతి రక్షణ దృష్ట్యా ఎంతో కీలకమైనది.

సోవియట్ ప్రభుత్వం యువతనూ పిల్లలనూ అమూల్యమైన సంపదగా చూసింది. పిల్లల కోసం నర్సరీలూ కేజీలూ స్కూళ్ళూ పెద్ద ఎత్తున ఏర్పాటు చేసింది. పిల్లలకు ఆటస్థలాలు, పిల్లల చిత్రాలు, పిల్లల థియేటర్లూ ఉండేవి. పసితనం నుండీ సోవియట్ పిల్లలకు ఇతరులతో కలిసిమెలిసి పనిచెయ్యడం అలవాటు చేసేవారు. ఉదాహరణకు పిల్లలు ఇటుకలతో, క్యూబ్స్ తో బొమ్మరిల్లు కట్టి ఆడుకోవాలంటే, ఒక పిల్లవాడు ఒక్కడే ఆ వస్తువులను పట్టుకోలేనట్లుఉద్దేశ పూర్వకంగా పెద్దవిగా చేసేవారు. సమిష్టిగా కృషి చెయ్యడం అనేది పసితనం నుండీ అలవాటు కావాలని అలా చేసేవారు. 800 పిల్లల క్లబ్బులుండేవి. ఈ క్లబ్బులలో పిల్లలకు ఇంజినీరింగ్, ఓడలు, విమానాల నిర్మాణ విషయాలలో ఆసక్తి గలిగించే విధంగా తగిన పరికరాలతో లేబొరేటరీలుండేవి. పిల్లలు ఓడలు, విమానాల మాడల్సు నిర్మిస్తుండేవారు. ట్రేడ్ యూనియన్లు పిల్లలకు పయెనీర్ కేంపులు నిర్వహించేవి. 1938 నాటికి 30,000 మంది పిల్లలకు సదుపాయాలు గల 250 కేంపులు ఉంటే 1941 నాటికి 1,35,000 మంది పిల్లలకు సదుపాయాలు గల 1000కు పైగా శాశ్వత కేంపులను ట్రేడ్ యూనియన్లు ఏర్పాటు చేశాయి. ఇవి కాక 1200 సీజనల్ కేంపులు ఏర్పాటు చేశాయి. 1940 సంవత్సరంలో 15 లక్షలమంది పిల్లలు 26 రోజులు ఈ కేంపుల్లో గడిపారు. సామాజిక బీమానిధి నుండి ట్రేడ్ యూనియన్లు పిల్లల కేంపులూ తదితర సౌకర్యాల మీద పెద్ద మొత్తాలు ఖర్చు పెట్టేవి. ట్రేడ్ యూనియన్లు 2,000 వేసవి కేంపులు పిల్లల కోసం నడిపేవి. 1941 సంవత్సరంలో వేసవి కేంపుల్లో 15 లక్షల మంది పిల్లలు గడపడానికి ఏర్పాటు జరిగింది కాని యుద్ధం ప్రారంభమవడం వలన ఆగిపోయింది.

Edit with WPS Office

యువకులకు తీరిక సమాయాలలో రిక్రియేషన్ కు అనేక సౌకర్యాలుండేవి. ట్రేడ్ యూనియన్లు యువకులకు విహారయాత్రలు ఏర్పాటు చేసేవి. 1936-1941ల మధ్య ట్రేడ్ యూనియన్లు 7 లక్షలమంది యువకులకు కకాసస్, క్రిమియా, యురల్స్ మొదలైన ప్రదేశాలకు విహార యాత్రలు నిర్వహించాయి. ట్రేడ్ యూనియన్లు యుక్త వయస్కులకు 234 సేనిటోరియాలూ 631 విశ్రాంతి గృహాలూ నడిపేవి. ట్రేడ్ యూనియన్లు నడిపే ఈ వసతి గృహాలూ సేనిటోరియాలూ కాక ప్రభుత్వ ఆరోగ్య శాఖ నడిపే వసతి గృహాలుండేవి.

విప్లవానికి పూర్వం 1914లో దేశంలో 222 క్లబ్బులుండేవి. వీటిలో గౌరవనీయులకు మాత్రమే ప్రవేశం ఉండేది. విప్లవానంతరం కార్మికుల రిక్రియేషన్ కు ఫాక్టరీలలో 6,000 క్లబ్బులుండేవి. ఈ క్లబ్బులను కార్మిక కమిటీలు నిర్వహించేవి. అవసరమైన నిధులను మేనేజ్ మెంటు ఇచ్చేది. ఈ క్లబ్బులలో కార్మికులు - విదేశీ భాషలు నేర్చుకోవడం, సాంకేతిక నిపుణత కోర్సులు, డాన్సింగ్ క్లాసులు, డ్రామా క్లాసులు - వారి వారి అభిరుచిననుసరించి వివిధ రకాల కోర్సులు చేసేవారు.

ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో 1800 రేడియో రిలే స్టేషన్లూ 10,000 సినిమా హాళ్ళూ 15,000 ఫాక్టరీ లైబ్రరీలు (4 కోట్ల 20 లక్షల పుస్తకాలతో) ఉండేవి. 2000 ఫాక్టరీలలో ప్రతీదినం కాని, వారానికొకసారి కాని పత్రికలు ప్రచురించబడేవి. మాస్కోలో స్టాలిన్ ఆటో వర్క్స్ లో 350 గోడ వార్తా పత్రికలుండేవి. రష్యా మొత్తంలో గోడ వార్తా పత్రికలు లక్షల్లో ఉండేవి. 1914 లో జారిస్టు రష్యాలో 153 థియేటర్లుంటే 1939 ప్రారంభానికి సోవియట్ యూనియన్ లో 790 థియేటర్లున్నాయి. ఇవన్నీ కూడా స్వచ్ఛంద కృషి ద్వారా ప్రజలు తమ విద్యా సాంస్కృతిక స్థాయిని పెంచుకునేందుకు ఉపయోగపడ్డాయి. ఇవి కాక పిల్లలకు 70 ప్రత్యేక థియేటర్లుండేవి. అలాగే క్రీడారంగంలో కూడా. 1913లో జారిస్టు రష్యాలో 20 క్రీడా క్లబ్బులుండేవి. వీటిలో ఉన్నత వర్గాలకు చెందిన కొన్ని వేలమంది సభ్యులుండేవారు. 1940 నాటికి ట్రేడ్ యూనియన్లు నిర్వహించే క్రీడా క్లబ్బుల్లో కోటిమందికి పైగా కార్మికులుండేవారు. వంద స్టేడియంలూ క్రీడా స్థలాలూ ఈత కొలనులూ స్కీయింగ్ స్టేషన్లూ కార్మికుల కోసం ఉండేవి. 1940 వసంత కాలంలో ట్రేడ్ యూనియన్లు నిర్వహించిన పరుగు పోటీలలో 6,11,000 మంది, స్కీయింగ్ పోటీలలో 13,81,000 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.

1940లో ట్రేడ్ యూనియన్లు నిర్వహించే విశ్రాంతి గృహ వసతులను 30 లక్షలమంది పౌరులు ఉపయోగించుకున్నారు. ఇది కాక ఆరోగ్య స్థావరాలలో ఉన్న విశ్రాంతి గృహాలలో, హోటళ్ళలో ప్రజలు స్వల్పమైన అద్దె చెల్లించి ఒకటి రెండు నెలలు ఉండవచ్చు. ఫాక్టరీ కమిటీలు ఈ విషయంలో సహాయం చేసేవి. ప్రతీ ముఖ్య నగరం, పట్టణం వెలుపలా ట్రేడ్ యూనియన్లూ, ఫాక్టరీలూ, ఆఫీసుల ఆధ్వర్యంలో 'దాచా' (గ్రామీణ ప్రాంతాలలో ఉండే బంగ్లాలు) ఉండేవి. వేసవి నెలలలో వేలమంది కార్మికులు తమ కుటుంబాలతో ఇక్కడ ఉండేవారు. నగరాల పరిసర సహకార క్షేత్రాలలో ఉండే రైతులు ప్రతీ సంవత్సరం ఒకటి రెండు నెలల పాటు కార్మికుల కుటుంబాలకు గదులు అద్దెకి ఇచ్చేవారు. అటువంటి గదులు లక్షలుండేవి. కార్మికుల కుటుంబాలు వేసవికాలం గ్రామీణ ప్రాంతాలలో గడుపుతుంటే, ఫాక్టరీలలో పని చేసే కార్మికులు సెలవు రోజుల్లోనో, ఆదివారాలలోనో తమ కుటుంబాలతో కలిసి గడుపుతుండేవారు.

విప్లవానికి ముందు అల్ప సంఖ్యాకులైన ధనిక వర్గానికే పరిమితమైన సౌకర్యాలు కార్మికులకు కూడా లభించాయి. బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రతినిధి వర్గం 'సోవియట్ యూనియన్ లో కార్మికులు పాలక వర్గం అనుభవించే సౌకర్యాలు అనుభవిస్తున్నారు' అని పేర్కొంది.

స్టాలినిస్టు రష్యా గురించి మాట్లాడుకునేటప్పుడు విప్లవానంతరం మేధావి వర్గంలో వచ్చిన మౌలికమైన మార్పు గురించి చెప్పుకోవాలి. విప్లవానికి పూర్వం మేధావి వర్గం, వ్యాపారస్తులు, జమీందారులు, పారిశ్రామిక వేత్తలు, భూస్వాములు మొదలైన ఆస్తులున్న వర్గం నుంచే వచ్చేది. మేధావి వర్గంలో కొంతమంది చిన్న వ్యాపారస్తులు, చిన్న ఉద్యోగులు, రైతులు, కార్మికుల బిడ్డలూ ఉండేవారు కాని వారు నిర్ణయాత్మక పాత్ర పోషించగలిగేవారు కారు. ఈ మేధావి వర్గం తన మనుగడకు ఆస్తులున్న వర్గం మీద ఆధారపడేది. వారికి సేవలు చేసేది. అక్టోబరు విప్లవం తర్వాత, కార్మిక కర్షక వర్గాన్నుంచి వచ్చిన లక్షలాది యువకులు యూనివర్సిటీలలోనూ సాంకేతిక కళాశాలలోనూ ఉత్తీర్ణులై నూతన మేధావి వర్గంగా రూపొంది చ నూతన ఉత్తేజం తీసుకు వచ్చారు. అట్టడుగు ప్రజలతో సన్నిహిత సంబంధాలు గల ఈ మేధావి వర్గం సంఖ్య 1937 నాటికి 95 లక్షలు. వారి కుటుంబాలతో

Edit with WPS Office
కలిపి జనాభాలో 13-14 శాతం. ఇది ఒక బ్రహ్మాండమైన సాంస్కృతిక విప్లవం.

సోవియట్ సమాజానికి ముందున్న సమాజాలన్నీ శారీరక శ్రమకూ మానసిక శ్రమకూ మధ్య ఒక అగాధం ఉన్నట్లూ, ధనిక వర్గం పాలించడానికీ పేదవర్గం పాలించబడడానికీ ఉన్నట్లూ ప్రచారం చేశాయి. ఆ ప్రచారాన్ని సోవియట్ యూనియన్ వమ్ము చేసింది. 20వ శతాబ్దపు గొప్ప వ్యక్తులలో ఒకనిగా 1942 టైమ్స్ పత్రిక కీర్తించిన స్టాలిన్ చెప్పులు కుట్టే వాడి కొడుకు. అంతర్యుద్ధంలో ప్రముఖ పాత్ర పోషించిన మార్షల్ వొరోషిలోవ్ తండ్రి యుక్రెయిన్ రైల్వేలో వాచ్ మేన్ గా పని చేసేవాడు. తల్లి బొగ్గు కూలీ. అతను ఏడవ ఏట బొగ్గు గనులలో పని చెయ్యడం మొదలుపెట్టాడు. 12వ ఏట చదువు నేర్చుకోవడం మొదలు పెట్టాడు. జర్మన్ సైన్యాలను తరిమికొట్టడంలో ప్రముఖ పాత్ర వహించిన మార్షల్ టిమోషెంకో రైతు బిడ్డ. మార్షల్ బుడెన్నీ రైతు బిడ్డ. ఇవి ఉదాహరణలు మాత్రమే. అట్టడుగు వర్గానుండి వచ్చిన వారు విప్లవకారులుగా మారి ఒక చేతిలో పెన్నూ, మరో చేతిలో గన్నూ పట్టుకుని, కార్మిక వర్గం అధోగతిలో ఉండడానికి కారణం మేధోపరంగా తక్కువగా ఉండడమే అన్న బూర్జువా వర్గ ప్రచారాన్ని తుత్తినియలు చేశారు.

కార్మిక వర్గ నియంతృత్వంలో నిజమైన ప్రజాస్వామ్యం అమలు జరిగింది. ట్రేడ్ యూనియన్ మీటింగులలో అన్ని రంగాలలోనూ అవినీతినీ, అసమర్థతనూ నిర్దాక్షిణ్యంగా విమర్శించడం జరిగేది. అన్ని రంగాలలోనూ విమర్శా ఆత్మ విమర్శా ఉండేవి. ఈ విమర్శలన్నీ వార్తా పత్రికలలో వచ్చేవి. ఈ విమర్శలను ఉదాహరించి పెట్టుబడిదారీ పత్రికలు రష్యాలో అవినీతి గురించీ, అసమర్థత గురించీ ప్రచారం చేసేవి. కాని కమ్యూనిస్టు పార్టీ ఈ విమర్శను ఆపు చెయ్యడానికి నిరాకరించడమే కాకుండా ప్రోత్సహించింది. అవినీతి, అసమర్థతలకు వ్యతిరేకంగా కార్మికులూ ప్రజలూ చొరవతో పోరాడాలని పార్టీ ఉద్దేశించింది.

సోవియట్ యూనియన్ లో వినియోగ వస్తువులు ప్రజలకు అందుబాటులో లేకపోవడం గురించి, రోడ్ల పరిస్థితి గురించి, గృహ వసతి గురించి పశ్చిమ దేశాలలో విపరీతమైన ప్రచారం జరిగేది. పరిమితంగా ఉన్న వనరులను ఆర్థిక పురోగతికి వినియోగించడమే ప్రగతి కాని ఎక్కువగా వినియోగ వస్తువుల ఉత్పత్తికి వినియోగించడం అపరాధమవుతుందని సోవియట్ ప్రభుత్వం భావించింది. ఆ కారణాల వలన పశ్చిమ దేశాలలో విరివిగా ఉన్నట్లు వినియోగ వస్తువులు సోవియట్ సోషలిస్టు సమాజంలో దొరికేవి కావు. సోషలిస్టు రష్యా విశాల ప్రజానీకపు కనీస అవసరాలను తీర్చడం తన లక్ష్యంగా పెట్టుకుంది కాని అల్ప సంఖ్యాకులు సకల సౌకర్యాలతో విలాసంగా జీవించే విధంగా ఆర్థిక రంగాన్ని మలచడం తన లక్ష్యంగా పెట్టుకోలేదు. ఇదే విషయాన్ని స్పష్టం చేస్తూ 1944లో ఇల్యా ఎహ్రెన్ బర్గ్ అనే ప్రసిద్ధ రష్యన్ రచయిత ఒక వ్యాసంలో ఇలా రాశాడు:

'.....యుద్ధానికి ముందు సంవత్సరాలలో మన దేశం గురించి విదేశాలలో ప్రచురింపబడిన అనేక పుస్తకాలను నేను చూశాను. మన దేశం గురించి చారిత్రక దృష్టి లేకుండా అనేక కథలు అవి ప్రచారం చేశాయి. మన దేశంలో పాడు రోడ్ల గురించీ జనంతో క్రిక్కిరిసిన ఆపార్టుమెంట్ల గురించీ, మాస్కో దుస్తుల ఫాక్టరీలు తయారు చేసే (అంద విహీనమైన) దుస్తుల గురించీ విపరీతంగా రాశాయి. దుస్థితిలో ఉన్న రోడ్లూ, గృహరంగంలో ఇబ్బందులూ, అందంగా కుట్టని దుస్తులూ - ఇవన్నీ నిజమే. కాని ఈ నిజాలనే చూపించే చిత్రం మాత్రం అసమగ్రం, అసత్యం. ఇవి మాత్రమే చూసే విదేశస్తులకు పూర్తి చిత్రం అగుపించలేదు. క్షణక్షణం పురోగమిస్తున్న దేశాన్ని వారు చూడలేకపోయారు. రెండు లక్షలమందికి అందమైన దుస్తులు తయారు చెయ్యడం కంటే 20 కోట్లమందికి దుస్తులు తయారు చెయ్యడం కష్టసాధ్యమని వారు గుర్తించరు. సరిహద్దుల్లో ఫాసిస్టు రాజ్యాలు లేస్తున్నప్పుడు గృహోపకరణాల కంటే గన్నులు ముఖ్యమని వారు గ్రహించరు. మనల్ని మట్టి కాళ్ళ మహాబలుడిగా చిత్రించారు.....'

సోషలిస్టు రష్యా సాధించిన ప్రగతిని కార్లూ, మోటారు సైకిళ్ళూ, రిఫ్రిజిరేటర్ల సంఖ్యతోనూ, విశాలమైన రోడ్లతోనూ కొలిచే విధానం అసమగ్రమైనది. ప్రజల జీవితాలలో, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో రష్యా సాధించిన ప్రగతి మరువలేనిది. 1930 ఆర్థిక మాంద్యంలో తలక్రిందులైన పెట్టుబడిదారీ ప్రపంచంలో యువత నిరుద్యోగులై నిరాశా నిస్పృహలతో దిగజారిపోయి మత్తు పదార్థాలకు బానిసలవుతుంటే సోవియట్ యూనియన్ లో యువత భవిష్యత్తులో అంతులేని విశ్వాసంతో నూతన సమాజ నిర్మాణంలో ఉత్సాహంతో పాల్గొంది.

మార్షల్ ఝుకోవ్ ఆ కాలంలో ఆర్థిక,సామాజిక రంగాలలో రష్యా సాధించిన ప్రగతి గురించి చెబుతూ '.... విప్లవానికి ముందు జన్మించిన వారికి (సోషలిస్టు విజయాలు) చాలా ముఖ్యమైనవి.

Edit with WPS Office
మేం వాటిని అధ్యయనం చేశాం. అవి మా జ్ఞాపకాలలో ఒక భాగమయ్యాయి. ఈ విజయాలకు మేం గర్వించే వాళ్ళం. వ్యక్తి సౌఖ్యం కంటే సమిష్టి శ్రేయస్సు ముఖ్యమనే ఆదర్శంతో ప్రభావితులమయ్యాం....యుద్ధానికి ముందు మన దేశం సాధించిన అభివృద్ధి మన (సోషలిస్టు) వ్యవస్థ అభివృద్ధికరమైన వ్యవస్థ అన్న దానికి రుజువుగా నిలుస్తుంది. చరిత్రకారులూ తత్వ వేత్తలూ సామాజిక వేత్తలూ రచయితలూ అత్యంత వేగంగా (మన దేశం) అభివృద్ధి చెందడం వెనుక రహస్యాలను అన్వేషించడానికి ఆ కాలానికి మళ్లీ మళ్ళీ ప్రయాణం చేస్తారు.....' అన్నాడు.

జర్మనీ మీద విజయం సాధించడానికి కమ్యూనిస్టు రష్యా అనుసరించిన వ్యూహం అతి సరళమైనది. ప్రజలతో అత్యంత సన్నిహిత సంబంధాలుండే కమ్యూనిస్టులు తప్ప మిగిలినవారు ఆచరించడానికి అసాధ్యమైనది. అదేమిటంటే - ప్రతీ సోవియట్ పౌరుడినీ ఒక సైనికుడిగా తీర్చి దిద్దడం. 1919 అంతర్యుద్ధం తర్వాత సామ్రాజ్యవాదులు రష్యాను నాశనం చెయ్యాలని మళ్ళీ మళ్ళీ ప్రయత్నిస్తూనే ఉంటారని స్టాలిన్ గ్రహించాడు. అందుకు సోవియట్ యూనియన్ సిద్ధంగా ఉండాలని కూడా అతను భావించాడు. భవిష్యత్తులో జరుగబోయే భయంకర యుద్ధంలో విజయం సాధించాలంటే చైతన్యవంతులైన ప్రజలందరి సహకారం ఉండాలనే మార్క్సిస్టు అవగాహనతో సోవియట్ ప్రభుత్వం యుద్ధానికి ముందే పెద్ద ఎత్తున ప్రజానీకానికి సాయుధ శిక్షణ ఇచ్చింది. ప్రజాయుద్ధంగా మార్చడానికి పధకం వేసింది. ప్రజలందరికీ సాయుధ శిక్షణ ఇచ్చిన సంస్థ పేరు ఒసోవియఖిమ్. ఈ సంస్థలో సభ్యుల సంఖ్య ఒక కోటి 50 లక్షలు. ఈ సంస్థ సోవియట్ జనాభా అంతటికీ సైనిక శిక్షణ ఇచ్చేది. గురిచూసి తుపాకీ పేల్చడంలో, గుర్రపు స్వారీలో, పేరాషూట్ సహాయంతో విమానంలోంచి దూకడంలో, మంచు మీద స్కీయింగ్ లో, విమానాలు నడపడంలో, శిక్షణ ఇచ్చేది. 1938 సంవత్సరంలో 60 లక్షల మంది యువకులు తుపాకీ పేల్చడంలో నిపుణులై పతకాలు పొందారు. యుద్ధానికి ముందే ప్రజలందరూ సాయుధ శిక్షణ పొంది ఉండడం వల్లనే యుద్ధ కాలంలో జర్మన్ల ఊహకందని విధంగా అతి స్వల్ప కాలంలో 'గాలి లోంచి పుట్టుకొచ్చినట్లు నూతన సైన్యాలు' పుట్టుకొచ్చాయి.

1942లో సోవియట్ యూనియన్ విదేశాంగ శాఖలో అసిస్టెంట్ కమిస్సార్, పత్రికా విలేఖరి ఎడ్గార్ స్నోకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఇలా చెప్పాడు:

'.....రష్యన్లు ఎందుకు తెగించి పోరాడారు.....ఎందుకు ఇంకా పోరాడుతూనే ఉన్నారు అన్నది అమెరికన్లు తెలుసుకోవాలనుకుంటున్నారా? అమెరికన్లు గతంలో మమ్మల్ని అర్థం చేసుకోలేదు. వాస్తవాన్ని వాళ్ళు గుర్తించలేదు. అందువలన మా గురించి తప్పుడు అభిప్రాయాలను ఏర్పరుచుకున్నారు. ఇప్పుడు రష్యన్లు ఎలా పోరాడుతున్నారో చూస్తున్నారు. రష్యన్లను ఇలా పోరాడేలా చేస్తున్నదేదో రష్యాలో ఉందని వాళ్ళు గుర్తిస్తున్నారు. అదేమిటో తెలుసుకోవాలనుకుంటున్నారా? రష్యన్ విప్లవం ఒక నూతన సామాజిక చైతన్యాన్ని సృష్టించింది. ఈ దేశంలోని స్త్రీ పురుషులకు జీవించడానికీ పోరాడడానికీ పోరాటంలో ప్రాణాలు త్యాగం చెయ్యడానికీ ఒక ఆదర్శం ఉంది.....'

రష్యన్ ప్రజలను చైతన్యవంతులను చేసి, జీవించడానికీ పోరాడడానికీ పోరాటంలో ప్రాణాలు త్యాగం చెయ్యడానికీ పురిగొల్పిన ఉన్నత ఆదర్శం సోషలిజం. కేపిటలిజం తమను ఎంత క్రూరంగా దోచుకుందో, స్టాలిన్ నాయకత్వంలో కమ్యూనిస్టులు నిర్మించిన సోషలిస్టు వ్యవస్థ తమకు ఏ మేలు చేసిందో పీడిత ప్రజలు స్పష్టంగా చూడగలిగారు. అనుభవంలో అర్థం చేసుకున్నారు. హిట్లర్ జర్మనీ సోషలిస్టు రష్యాను ఓడించి పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరిస్తే తాము ఎటువంటి దుర్భర జీవితం గడపవలసి ఉంటుందో గుర్తించారు. అందుకని తమ కోసం, తమ బిడ్డల భవిష్యత్తు కోసం, తమకు ఒక నూతన జీవితాన్ని ప్రసాదించిన సోషలిస్టు విజయాలను కాపాడుకోవడం కోసం పోరాడారు. స్టాలిన్ ను ఒక రక్త పిపాసిగా, సోషలిజాన్ని ఒక అసమర్థ, నిరంకుశ వ్యవస్థగా ప్రచారం చేసే బూర్జువా మేధావులూ చరిత్రకారులూ దాచి పుచ్చడానికి ప్రయత్నించే వాస్తవం ఇది.

కమ్యూనిస్టు వ్యతిరేకులు రష్యాలో భయంకరమైన నియంతృత్వం గురించి లక్షల పేజీలు నింపారు.

ఎప్పుడు ఎవరి తలుపులు పోలీసులు తడతారో, ఎవరు ఎప్పుడు హఠాత్తుగా మాయమైపోతారో అని భయపడుతూ సోవియట్ ప్రజలు బ్రతికినట్లు చిత్రించారు. నవలలు రాశారు, సినిమాలు తీశారు, కడవల కొద్దీ కన్నీళ్ళు కార్చారు. నియంతృత్వం అనే మాటకు మనం చెప్పుకునే అర్థం అధిక సంఖ్యాక ప్రజలను అణచి వేసి, ఒక వ్యక్తి లేక అల్ప సంఖ్యాకులు పాలించే విధానం అని. నియంత ప్రజా వ్యతిరేకి.

Edit with WPS Office
ప్రజల అండదండలులేని వాడు. ప్రజలంటే భయపడతాడు. తనకు విశ్వాస పాత్రంగా ఉండే అల్ప సంఖ్యాక వర్గం, సైన్యం సహాయంతో ప్రజలను అణచి వేస్తూ పాలిస్తాడు.

స్టాలిన్ వ్యక్తిగత నియంతృత్వం గురించీ, కమ్యూనిస్టుల నియంతృత్వం గురించీ విష ప్రచారం చేసే వారిని మనం అడగాల్సిన ప్రశ్న ఒకటుంది - ఏ నియంత అయినా కోట్లమంది సామాన్య ప్రజలను సాయుధం చెయ్యడం మీరు చూశారా?

Edit with WPS Office

అధ్యాయం పది

బెర్లిన్ పతనం

స్టాలిన్ గ్రాడ్ లో జర్మనీ కాళ్ళు విరిగినా అది సైనికంగా ఇంకా చాలా బలంగానే ఉంది. కాని కుర్స్క్ యుద్ధం తర్వాత జర్మనీ నడు విరిగింది. జర్మనీ పరాజయం నిశ్చయమైంది.

మరొక పక్క జర్మనీ మిత్ర దేశం ఇటలీ ఘోర పరాజయాలు పొందసాగింది. కుర్స్క్ యుద్ధంలో జర్మనీ పరాజయం తర్వాత, అదే నెలలో జూలై 25వ తేదీన ఇటలీలో హిట్లర్ మిత్రుడు నియంత ముస్సోలినీ పదవి నుండి తొలగించబడ్డాడు. ఇటలీలో ఫాసిస్టు పాలన అంతమైంది కాని జర్మన్ సైన్యం ఇటలీ మీద దాడి చేసి మూడు వంతులు ఆక్రమించి ముస్సోలినీని రక్షించగలిగింది.

1943 జులై – సెప్టెంబరుల మధ్య ఎర్ర సైన్యం యుక్రెయిన్ లోనూ, ఇతర ప్రాంతాలలోనూ జర్మన్లను తరిమి కొట్టసాగింది. ఆగస్టు 23న ఖార్కోవ్ ను విముక్తి చేసింది. ఆగస్టు 31 నాటికి రష్యన్ సైన్యం యుక్రేయిన్ లోకి చొచ్చుకుపోయింది. సెప్టెంబరు 8న దక్షిణాన డోన్బాస్ ప్రాంతం విముక్తి చెయ్యబడింది. జర్మన్లు నీపర్ నది దగ్గర రష్యన్లను ఆపడానికి ప్రయత్నించారు కాని అక్టోబరులో రష్యన్లు నీపర్ నదిని దాటారు.

ఈ చర్యను ఒక అద్భుతమైన సాహసిక చర్యగా వర్ణిస్తారు. నీపర్ నదిని సమీపించిన రష్యన్ సైన్యం ఆగలేదు. రాత్రి వేళ చీకటి మాటున వేల మంది సైనికులు డ్రమ్ములు, చెక్కలు, పార్కుల బెంచీలు, దూలాలు -ఏవి దొరికితే అవి పట్టుకుని నది దాటి హఠాత్తుగా జర్మన్ల మీద దాడి చేశారు. నీపర్ నది ఒడ్డున రక్షణ రేఖ దుర్భేధ్యం అనీ, రష్యన్లు నది దాటడం అసంభమనీ అనుకుంటున్న జర్మన్లు, రష్యన్లు అకస్మాత్తుగా దాడి చెయ్యగానే తెల్లబోయారు. బ్రిటిష్ మిలిటరీ మిషన్ కు చెందిన మార్టెల్ 1943లో ఒక సమావేశంలో మాట్లాడుతూ 'రష్యన్ సైన్యం తప్ప ప్రపంచంలో ఏ సైన్యమూ ఈ అద్భుత కార్యాన్ని సాధించలేదు' అన్నాడు.

చూడడానికి ఇది దుస్సాహస చర్యగా కనుపించినా, జాగ్రత్తగా వెయ్యబడిన పధకం ఇది. నదిని దాటడానికి డ్రమ్ములు, చెక్కలు, బెంచీలు, కర్రలు - అన్నీ ముందే పోగు చేసి ఉంచారు. సైన్యం కర్రలు, చెక్కలు కలిపి తెప్పలు తయారు చేసీ, డ్రమ్ములు, చెక్క బెంచీలు, దూలాల సహాయం ఈదుతూనూ, అవతలి ఒడ్డుకు చేరింది. నీరు లోపలికి పోకుండా జాగ్రత్తగా సీలు చెయ్యబడిన 60 టాంకులు నీటి అడుగునుండి ప్రయాణం చేసి అవతలి ఒడ్డుకు చేరుకున్నాయి. రెండు బ్రిగేడ్ల పేరాట్రూపర్లు కూడా అవతలి ఒడ్డున దిగారు. వేల సైన్యం హఠాత్తుగా దాడి చేసి అవతలి ఒడ్డును ఆక్రమించిన తరువాతి వారం రోజులలోనూ ఫెర్రీల ద్వారానూ, పాంటూన్ బ్రిడ్జిల ద్వారానూ పెద్ద ఎత్తున ఆయుధాలను, సైన్యాలను అవతలి ఒడ్డుకు చేరవేశారు. జర్మన్ విమాన దాడుల నుండి రష్యన్ ఫైటర్ విమానాలు రక్షణనిచ్చేవి. ఎర్ర సైన్యం నీపర్ నది దాటిన సంఘటన గురించి ఒక కవి ఇలా రాశాడు:

పగతో రగులుతున్న రష్యా ఉరుకుతోంది
యుక్రెయిన్, బెలోరష్యా.....కొంచెం ఓపిక పట్టండి.
మీ బ్రతుకులను నరకం చేసిన జర్మన్ల ఘడియలు దగ్గర పడుతున్నాయి
మీ దుర్దినాలు ఇక ముగుస్తాయి
నీపర్ నది ఒడ్డునుంచి
ప్రుత్, నీమన్ జలాలు చూస్తున్నాం

1943 అంతానికి జర్మన్ ఆక్రమణలో ఉన్న భూభాగంలో మూడు వంతులు విముక్తి చెయ్యబడింది.

1944లో విజయపరంపర

Edit with WPS Office

1944 పది ఘన విజయాల సంవత్సరంగా ప్రసిద్ధి కెక్కింది.

1. 900 రోజుల దిగ్బంధం తర్వాత జనవరిలో లెనిన్ గ్రాడ్ విముక్తి చెయ్యబడింది. జర్మన్లూ రష్యన్లూ - ఇరు పక్షాలూ విపరీతమైన నష్టానికి గురయ్యారు. కాని రష్యన్ల ముందు నిలువలేక వారం రోజుల యుద్ధం తర్వాత జర్మన్లు ఎస్తోనియా సరిహద్దు వరకూ తిరోగమించారు. 6 లక్షలమంది లెనిన్ గ్రాడ్ ప్రజలు ఆనందంతో ఒకరినొకరు కౌగిలించుకుని కన్నీళ్ళు కార్చారు. రోడ్లమీద కొచ్చి డాన్సు చేశారు. జర్మన్లు తిరోగమిస్తూ పుష్కిన్ పేలేస్ తో సహా అనేక చారిత్రాత్మక భవనాలను నాశనం చేశారు.
2. ఫిబ్రవరి, మార్చిలలో మార్షల్ కోనెవ్ నాయకత్వాన రష్యన్ సైన్యం కోర్సున్ లో జర్మన్లను చుట్టుముట్టి నాశనం చేసింది. స్టాలిన్ గ్రాడ్ లో లాగానే కోర్సున్ లో కూడా జర్మన్ సైన్యం చక్రబంధంలో ఇరుక్కుంది. కాని కోర్సున్ జర్మన్ సైన్యం ఫిబ్రవరి 16-17లలో చక్రబంధాన్నుంచి బయటపడడానికి ప్రయత్నించింది. ఫిబ్రవరు 17 రాత్రి జర్మన్లు ఒక యుక్రెయిన్ గ్రామంలో ఉన్నట్లు మార్షల్ కోనేవ్ కు వార్త అందింది. ఆ రాత్రి విశ్రాంతి తీసుకుని మర్నాడు ఉదయం పారిపోవాలని జర్మన్లు ఆలోచించారు. అప్పుడు భయంకరమైన మంచు తుఫాను వీస్తోంది. జర్మన్లకు విశ్రాంతి లేకుండా చెయ్యడానికీ, ఒక సంఘటిత సైన్యంగా తిరోగమించే అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతోనూ, ఆ రాత్రి మంచు తుఫానులో విమానాలతో, ఫిరంగులతో దాడి చెయ్యాలని రష్యన్లు నిర్ణయించారు. ఆ కటిక చీకటిలో జర్మన్లు ఉన్న గ్రామం మొదట కనుక్కోవాలి. అటువంటి వాతావరణంలో విమానాలు ఎగరడం కష్టమని కోనెవ్ కు తెలుసు.
'వైమానికులకు నేను ఆదేశాలు ఇవ్వలేను. కాని జర్మన్ల మీద ఈ రాత్రి దాడి చెయ్యాలి' అని ఈ దాడికి వలంటీర్లను ఆహ్వానించాడు కోనెవ్. ఆత్మహత్యాసదృశమైన ఈ విమాన దాడికి కామ్సొమాల్ వైమానికులు ముందుకు వచ్చారు. అడుగు ముందేమున్నదీ కనుపించనప్పుడు ఈ గ్రామాన్ని విమానాలు చేరడం ఎలా అన్న ప్రశ్న ఎదురైంది.
గంటకు 60 మైళ్ళ వేగంతో ఆతి మెల్లిగా ప్రయాణం చేసే యు.2 విమానాలు చీకటిలో, మంచు తుఫానులో ఈ గ్రామం ఎక్కడ ఉందో కనుక్కున్నాయి. భయంకరమైన తుఫానులో ఇంత చిన్న విమానాలు ఇలా వస్తాయని జర్మన్లు ఊహించలేదు. ఈ చిన్న విమానాలు ఆ గ్రామంలో మంటల బాంబులు వేశాయి. మంటలు లేవగానే బాంబరు విమానాలకు ఎక్కడ బాంబులు వెయ్యాలో తెలిసింది. ఫిరంగి దాడులతో, విమాన దాడులతో జర్మన్లను గ్రామం నుంచి తరిమి వేశాయి.
28,000 మంది జర్మన్లు రెండు గ్రూపులుగా పారిపోవడానికి ప్రయత్నిస్తుంటే రష్యన్ టాంకులూ ఆశ్విక దళాలూ దాడి చేసి ఊచకోత కోశాయి. నాలుగు గంటల్లో 20,000 మంది జర్మన్లు మరణించారు. మిగిలిన 8,000 మంది పట్టుబడ్డారు. ఈ కోర్సున్ యుద్ధంలో మొత్తం జర్మన్ నష్టాలు 55,000 మరణాలు, 18,000 ఖైదీలు, 500 టాంకులు, 300 విమానాలు.
మూడు వారాల తర్వాత అన్ని యుద్ధ నియమాలనూ ఉల్లంఘిస్తూ రష్యన్ సైన్యం యుక్రెయిన్లో 'బురద దాడి (mud offensive)' చేసింది. బురదకాలంలో యుక్రెయిన్ రోడ్లన్నీ మైళ్ళకు మైళ్ళు రెండడుగుల లోతు బురదతో నిండిపోయి ప్రయాణం అసాధ్యమవుతుంది. ఈ బురదలో రష్యన్ టి-34 టాంకు తప్ప మరే వాహనం ప్రయాణం చెయ్యలేదు. జర్మన్ టాంకులు ఈ బురదలో కదలవు. ఈ బురద కాలం అంతమై రోడ్లు గట్టి పడేదాకా రష్యన్లు దాడి చెయ్యరని జర్మన్లు నిశ్చింతగా ఉన్న సమయంలో ఊహించని విధంగా మార్చి 5న రష్యన్ సైన్యం బురదలో ప్రయాణించి దాడి చేసింది. తమ దగ్గరున్న వందల టాంకులు, ట్రక్కులు, ఫిరంగులు వదిలేసి జర్మన్లు బురదలో పడి పారిపోయారు. రష్యన్లు ఒక రైల్వే స్టేషన్ లో 240 కొత్త జర్మన్ టాంకులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని నాశనం చెయ్యడానికి పారిపోతున్న జర్మన్లకు వ్యవధి చిక్కలేదు.
రష్యన్ టాంకులు బురదలో ప్రయాణించగలిగినా, ఫిరంగులు ప్రయాణించలేవు. ఒక్కొక్కప్పుడు టాంకుల సహాయంతోనూ, ఒక్కొక్కసారి టాంకులు కూడా లేకుండానూ

Edit with WPS Office
రష్యన్లు జర్మన్లను తరమ సాగారు. బురదలో ముందుకు పోతున్న ఈ సైన్యానికి అవసరమైన ఆహారం, మందుగుండు, ఇంధనం వందల రష్యన్ విమానాలు సరఫరా చేసేవి. వాతావరణం అనుకూలించినప్పుడు ఈ విమానాలు జర్మన్ సైన్యాల మీద దాడిచేసేవి.

యుక్రెయిన్ లో ఎర్ర సైన్యం తరిమి తరిమి కొడుతుంటే జర్మన్ సైనికులు విషాదంగా -

కోళ్ళు లేవు, కోడి గుడ్లు లేవు
బీరు లేదు, వైను లేదు, గుడ్ బై యుక్రెయిన్
కోడి మాంసం లేదు, బ్రెడ్డూ లేదు
గుడ్ బై బెల్గోరాద్!
కోడి మాంసం లేదు, కోడి సూపూ లేదు
గుడ్ బై క్రెమించుగ్!

అని పాడుకుంటూ నిష్క్రమించేవారు.

3. ఏప్రిల్ లో ఒడెస్సా, మేలో క్రిమియా, విముక్తి చెయ్యబడ్డాయి. క్రిమియా యుద్ధం ఏప్రిల్ 11న రష్యన్ దాడితో ప్రారంభమైంది. స్వల్పకాలంలోనే రష్యన్లు ఉత్తర క్రిమియాను ఆక్రమించారు. జర్మన్లు సెవస్తపోల్ నగరానికి పారిపోవడం మొదలు పెట్టారు. ఈ సెవస్తపోల్ నగరంలో 1941-42 కాలంలో రష్యన్లు 250 రోజులు జర్మన్ ముట్టడిని ఎదుర్కొని నిలిచి పోరాడిన విషయం పాఠకులకు గుర్తు ఉండి ఉంటుంది. అలాగే 50,000 జర్మన్ సైన్యం సెవస్తపోల్ లో ఉండి రష్యన్ సైన్యాలను నిరవధికంగా ప్రతిఘటించవచ్చుననుకున్నాడు హిట్లర్. కాని నాలుగు రోజుల్లో ఈ జర్మన్ 'దుర్గం' రష్యన్ల వశమైంది. టాంకులలో, విమానాలలో, సైన్య సంఖ్యలో - జర్మన్ సైన్యం అన్నింటిలోనూ ఆధిక్యత కలిగి ఉన్నప్పుడు సెవస్తపోల్ లో రష్యన్లు 250 రోజులు ప్రతిఘటించగలిగారు. 1944లో జర్మన్లు నాలుగు రోజులు కూడా నిలబడలేకపోయారు. ఈ క్రిమియా యుద్ధంలో జర్మన్ నష్టాలు లక్షవరకూ ఉండవచ్చని అంచనా.
4. ఫిన్లాండుతో యుద్ధంలో రష్యా 1940 సరిహద్దుకు చేరింది. సరిహద్దు చేరిన తర్వాత తనంత తానే ఆగిపోయింది.

5. బెలో రష్యాలో రష్యన్ దాడి 1944 జూన్ 23న - అంటే రష్యా మీద జర్మనీ 1941 జూన్ 22న దాడి ప్రారంభించిన మూడు సంవత్సరాల తర్వాత, ప్రారంభమైంది. ఈ మూడేళ్ళలోనూ పరిస్థితి తారుమారైంది. ఈ ముడేళ్ళలోనూ రష్యా బ్రహ్మాండమైన సైనిక శక్తిగా రూపొందితే జర్మనీ శక్తి రోజు రోజుకూ క్షీణించింది. రష్యన్ సైనికుల సంఖ్య 1942 నవంబరుతో పోల్చి చూస్తే 12 శాతం మాత్రమే పెరిగినప్పటికీ గన్నులు, మోర్టార్లు 217 శాతం, టాంకులు 250 శాతం, విమానాలు 343 శాతం పెరిగాయి.

మే-జూన్ ల తర్వాత జర్మన్లు తరువాతి రష్యన్ దాడి దక్షిణ రంగంలో ప్రారంభమవుతుందని ఊహించారు. కాని బెలో రష్యాలో రష్యన్లు 166 డివిజన్ల సైన్యాన్ని రహస్యంగా కేంద్రీకరించారు. 31,000 ఫిరంగులు, మోర్టార్లు, 5,200 టాంకులు, స్వయంచలిత ఫిరంగులు, 6000 విమానాలూ ఈ దాడికి సమీకరించారు. రష్యన్లు సైన్యంలో 2:1, ఫిరంగులు, మోర్టార్లలో 2.9:1, టాంకులలో 4.3:1, విమానాలలో 4.5:1 ఆధిక్యతతో ఉన్నారు. ప్రధాన దాడి ప్రాంతాలలో ప్రతీ మైలుకూ 320 ఫిరంగులున్నాయి. అనేక వారాలుగా బ్రహ్మాండమైన మందుగుండు, పెట్రోలు, ఆహార నిల్వలు పోగుచేశారు. రష్యన్ సైన్యాలకు రోజుకు వంద రైళ్ళ లోడు సరఫరా వచ్చేది. ముందుకు పోతున్న సైన్యానికి సరఫరాలు సకాలంలో అందించడానికి, ఒక ట్రిప్పులో 25,000 టన్నుల మందుగుండు, పెట్రోలు, ఆహారం అందించడానికి, 12,000 లారీలు సిద్ధంగా ఉన్నాయి. 2,94,000 పడకలతో ఆసుపత్రి సౌకర్యాలూ, గాయపడిన వారిని తరలించడానికి ఏంబులెన్సులూ సిద్ధం చేశారు. రష్యన్లు ఈ బెలో రష్యా యుద్ధానికి అన్ని ఏర్పాట్లూ చేశారు. 1941 పరాజయానికి ప్రతీకారం ఇది.

Edit with WPS Office
పార్టిజాన్లు ఈ యుద్ధం లో ప్రముఖ పాత్ర పోషించారు. బెలో రష్యాలో 1,43,000 మంది పార్టిజాన్లు ఉన్నారు. ఈ పార్టిజాన్ దళాలు ఎర్రసైన్యంతో తమ కార్యకలాపాలను సమన్వయపరుస్తూ ఎర్ర సైన్యం దాడి చెయ్యబోయే సమయంలో, జూన్ 22-23న మొత్తం బెలో రష్యాలో రైలు మార్గాలను పూర్తిగా ధ్వంసం చేశారు. జర్మన్లకు సైన్యాలను తరలించడం, సరఫరాలను అందించడం అసాధ్యమైంది.
జూన్ 23న ప్రారంభమైన ఈ దాడిలో రోజుకు పది పదిహేను మైళ్ళు పురోగమిస్తూ జులై 28 కల్లా బెలో రష్యానుండి జర్మన్లను తరిమివేయడం జరిగింది. ఈ యుద్ధంలో జర్మనీ 3,50,000 మంది సైనికులను నష్టపోయింది.

బెలో రష్యాను, తూర్పు పోలెండులో అధిక భాగాన్ని,లిథుయేనియాను విముక్తి చేసిన తర్వాత నీమెన్ నదిని దాటి రష్యన్ సైన్యం తూర్పు ప్రష్యా సరిహద్దులకు చేరింది.

6. జులైలో పశ్చిమ యుక్రెయిన్ విముక్తి చెయ్యబడింది. పోలెండు రాజధాని వార్సా విముక్తి చేద్దామని రష్యన్ సైన్యం చేసిన ప్రయత్నం విఫలమైంది.
7. ఆగస్టులో ఎర్రసైన్యం మాల్దేవియా, రుమేనియాలలో ప్రవేశించింది. రుమేనియా లొంగిపోయింది. బల్గేరియాను జయించి హంగరీ సరిహద్దులకు చేరింది. యూగోస్లోవియాతో సంబంధం ఏర్పరుచుకుంది.
8. సెప్టెంబరులో ఎస్తోనియా, లాత్వియాలలో అధిక భాగాన్నుండి జర్మన్లను తరిమివేసింది.
9. అక్టోబరులో ఎర్రసైన్యం హంగరీ, తూర్పు జకోస్లోవేకియాలలో ప్రవేశించింది. యూగోస్లావ్ ప్రజలతో చేతులు కలిపి వారి రాజధాని బెల్ గ్రేడ్ ను విముక్తి చేసింది. హంగరీలో తీవ్ర యుద్ధం జరిగింది. రాజధాని బుడాపెస్టు కోసం నెలల తరబడి యుద్ధం జరిగింది. 1945 ఫిబ్రవరిలో కాని ఈ నగరాన్ని ఎర్ర సైన్యం స్వాధీనం చేసుకోలేదు.
10. అక్టోబరులో ఎర్ర సైన్యం జర్మన్లను తరిమివేసి ఉత్తర నార్వేలో ప్రవేశించింది.

ఈ ఘన విజయాలన్నీ రష్యాకు తేలికగా లభించలేదు. జర్మనీకి దారి తీసే మార్గాలన్నింటా, ముఖ్యంగా తూర్పు ప్రష్యాకు దారి తీసే మార్గాలలోనూ, తూర్పు ప్రష్యాలోనూ జర్మన్లు తీవ్రంగా ప్రతిఘటించారు.

ఫ్రాన్స్ లో మిత్ర దేశాల ప్రవేశం

మనం పశ్చిమదేశ చరిత్రకారుల కథనాలు విన్నా, హాలీవుడ్ సినిమాలు చూసినా జర్మనీ పరాజయానికి అమెరికా, బ్రిటన్ లే కారణమనిపిస్తుంది. రష్యా పాత్ర తక్కువగా కనుపిస్తుంది.

జర్మనీ, రష్యాల మధ్య జరుగుతున్న యుద్ధ పరిణామం ఎలా ఉంటుందా అని గోడమీద పిల్లుల్లా, గోతికాడ నక్కల్లా ఎదురు చూస్తున్న ఈ దేశాలు, 1944లో రష్యా జర్మనీని ఒంటరిగా తరిమి కొడుతున్న సమయంలో, జర్మనీ పరాజయం నిశ్చయమైన తరుణంలో, తాము రంగంలోకి దిగకుంటే యూరోపు అంతా 'ఎర్రబడుతుందన్న' భయంతో, జూన్ నెలలో ఫ్రాన్స్ లో దిగి రెండో యుద్ధరంగాన్ని ప్రారంభించాయి.

'.....(మిత్ర దేశాలు).....1943లో రెండో యుద్ధ రంగాన్ని ప్రారంభించగలిగి ఉండేవి. కాని మనం జర్మన్ సైన్యాలను మరిన్ని అపజయాలకు గురిచేసి మరింత బలహీన పరుస్తామనీ, మనం కూడా బాగా నష్టపోయి బలహీ పడతామనే అభిప్రాయంతో ఉద్దేశపూర్వకంగానే వాయిదా వేశారు.....' అని రెండో యుద్ధరంగం ఆలస్యంగా ప్రారంభించడానికి వెనుకనున్న రహస్యాన్ని వెల్లడించాడు మార్షల్ ఝుకోవ్ (G. Zhukov, Reminiscences and Reflections, Vol. 2, p. 457).

1944 జూన్ 6న మిత్ర దేశాల సైన్యాలు, ఇంగ్లండ్-ఫ్రాన్స్ ల మధ్యనున్న సముద్రాన్ని దాటి ఫ్రాన్స్ బీచిల్లో దిగాయి. ఈ రోజును డి-డే అంటారు. మొదటి రోజున దిగిన సైన్యం సంఖ్య 1,56,000. వీటికి 11,590 విమానాల సహకారం ఉంది. మిత్ర దేశాల విమానాలు 14,674 దాడులు చేశాయి కాని నష్టాలు మాత్రం కేవలం 127 మాత్రమే. ఈ డి-డే నాడు మిత్ర దేశాల నష్టాలు 10,000. వీరిలో మరణించిన వారి సంఖ్య 2,500. అమెరికన్ నష్టాలు - చనిపోయిన వారు 1465, గాయపడ్డవారు 3184, కనుపించకుండా పోయిన వారు 1928, శత్రువుకు పట్టుబడ్డవారు 26. నార్మండీ యుద్ధంలో

Edit with WPS Office
మొత్తం మిత్ర దేశాల నష్టాలు 2,09,000. మృతుల సంఖ్య 53,714.

నార్మండీ (ఫ్రాన్స్)లో మిత్ర దేశాల దాడి సముద్ర తీరంలో జర్మన్ సైన్యం నుండి తీవ్ర ప్రతిఘటన ఏమీ లేకుండా సాగింది. 'అట్లాంటిక్ గోడ' అని జర్మన్లు గొప్పగా ప్రచారం చేసిన అభేద్యమైన రక్షణ ఏమీ లేదు.

యుద్ధానంతరం జనరల్ ఐసెన్ హోవర్, మార్షల్ ఝుకోవ్ తో ఈ అట్లాంటిక్ గోడ గురించి మాట్లాడుతూ - '.....మామూలుగా ఉండే ట్రెంచిలున్నాయి. అవి కూడా తెగిపోకుండా ఒక రేఖలా లేవు. యుద్ధరంగమంతా కలిపి అన్ని రకాల గన్నులూ 3,000 కు మించి లేవు. సగటున ప్రతీ కిలో మీటరుకు ఒక గన్ను ఉంది. అక్కడక్కడ కాంక్రీటుతో నిర్మించిన ఫిరంగి స్థావరాలు మా సైన్యాలను అడ్డగించలేకపోయాయి....' అని చెప్పాడు (ibid., p. 458). అదే విషయాన్ని స్పష్టం చేస్తూ జర్మన్ జనరల్ హాల్డర్ 'సముద్రాన్ని దాటి వస్తున్న మిత్ర దేశాల సైన్యాలను ప్రతిఘటించడానికి జర్మనీ దగ్గర ఏమీ లేవు. మిత్ర దేశాల వైమానిక బలగం ఆకాశాన్ని పూర్తిగా ఏలుతూ తమ సైన్యాలకు రక్షణ ఇచ్చింది' అని వివరించాడు.

మిత్ర దేశాలకు 76 పూర్తి డివిజన్లు, 15 బ్రిగేడ్లు, 16,100 టాంకులు, స్వయంచలిత ఫిరంగులు, 16,700 విమానాలూ ఉన్నాయి. ఈ రంగంలో జర్మన్ సైన్యం - 74 బలహీనమైన డివిజన్లు, 3 బ్రిగేడ్లు. జర్మన్ డివిజన్లలో సైనికుల సంఖ్య ఉండవలసిన దాని కంటే తక్కువగా ఉంది. ఈ సైన్యానికి 3,500 టాంకులు, గన్నులు, 2,700 విమానాలూ ఉన్నాయి. మిత్ర దేశాల సైన్యం 30 లక్షలు. జర్మన్ సైన్యం 15 లక్షలు. జర్మన్ సైన్యం కంటే సైన్యంలో రెండింతలు, టాంకులలో నాలుగింతలు, విమానాలలో ఆరు రెట్ల అధిక్యత కలిగి ఉన్నాయి అమెరికన్, బ్రిటిష్ సైన్యాలు.

జర్మన్ సైన్యంలో అధిక భాగం రష్యన్ యుద్ధ రంగంలో కేంద్రీకరించబడింది. ఈ రంగంలో 179 పూర్తి డివిజన్లు, 5 బ్రిగేడ్లతో జర్మన్ సైన్యం, 49 డివిజన్లు, 12 బ్రిగేడ్లతో ఉపగ్రహ దేశాల సైన్యాలు ఉన్నాయి. ఈ సైన్యంలో 43 లక్షల మంది సైనికులున్నారు. 59,000 ఫిరంగులు, మోర్టార్లు, 7800 టాంకులు, 3000 యుద్ధ విమానాలూ ఉన్నాయి.

జులై వరకూ మిత్ర దేశాల సైన్యాలను జర్మన్ సైన్యాలు బలంగా ప్రతిఘటించలేక పోయాయి. జులై తర్వాత కూడా ప్రతిఘటించిన చోట్ల, నేల మీదా, ఆకాశంలోనూ ఆధిక్యత గల మిత్ర దేశాల సైన్యాల ముందు అవి నిలువలేకపోయాయి. మిత్ర దేశాల సైన్యాలు రష్యన్ రంగంలో లా బలమైన శత్రు రక్షణ రేఖలనూ ప్రతిఘటననూ అధిగమిస్తూ ఎదురుదాడులు చెయ్యలేదు. అలా దాడులు చేసే అవకాశమూ లేదు. ఎందుకంటే వారిని ప్రతిఘటించేందుకు బలమైన జర్మన్ సైన్యాలు లేవు.

ఒక పక్క బ్రిటిష్, అమెరికన్ సైన్యాలతోనూ, మరొక పక్క రష్యన్ సైన్యాలతోనూ రెండు రంగాలలో పోరాడుతున్న జర్మన్లు, రష్యన్లను అడుగడుగునా తీవ్రంగా ప్రతిఘటిస్తూ, బ్రిటిష్, అమెరికన్ సైన్యాలకు తేలికగా లొంగిపోసాగారు. '.....ఉదాహరణకు, యఫ్. సి. పోగ్ తన పుస్తకం ది సుప్రీం కమాండు లో, జనరల్ పేటన్ నాయకత్వాన ఉన్న ఒకటవ అమెరికన్ సైన్యం 1945 ఏప్రిల్ 23న ముగ్గురు సైనికుల నష్టానికి 9000 మంది జర్మన్ సైనికులనూ ఆఫీసర్లనూ ఖైదీలుగా పట్టుకుంది అని రాశాడు.....రైన్ నుంచి తూర్పు, ఆగ్నేయ, పూర్వోత్తర దిక్కులనుంచి దాడి చేసిన 30 లక్షల అమెరికన్ సైన్యం ఎంత నష్టపోయింది? 8,351 సైనికుల నష్టానికి లక్షలమంది జర్మన్ సైనికులనూ ఆఫీసర్లనూ బందీలను చేసింది....' (ibid., p. 412) అని స్వల్ప నష్టాలకు బ్రిటిష్, అమెరికన్ సైన్యాలు లక్షల జర్మన్ సైన్యాన్ని బందీ చెయ్యడం గురించి వివరించాడు.

యుద్ధంలో పశ్చిమ దేశాల పాత్ర గురించి మాట్లాడేటప్పుడు బూర్జువా చరిత్రకారులు అమెరికా, బ్రిటన్ దేశాలు సరఫరా చేసిన ఆయుధాలూ ముడి సరుకులూ ఆహార పదార్థాలూ జర్మనీ మీద రష్యా విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాయని పెద్దగా ప్రచారం చేస్తారు.

జర్మనీ విజయం తమ వినాశనానికి దారి తీస్తుందన్న భయంతో ఉన్న బ్రిటన్, అమెరికాలు, రష్యా జీవన్మరణ పోరాటం సాగిస్తున్నప్పుడు 4 లక్షల వాహనాలు, రైలు ఇంజిన్లు, సమాచార పరికరాలు అందించాయి. యుద్ధ కాలంలో 18,000 విమానాలూ 11,000 టాంకులూ రష్యాకు పంపించాయి. నిజమే, కాని ఈ దేశాలు రష్యాకు చేసిన సహాయం సోవియట్ యూనియన్ యుద్ధ కాలంలో ఉత్పత్తి చేసిన ఆయుధాలలో 4 శాతం మించదు. మూడేళ్ళు ఒంటరిగా పోరాడుతూ ప్రధమ శ్రేణికి చెందిన లక్షల జర్మన్ సైన్యాలను నాశనం చేసి అమెరికన్, బ్రిటన్ సైన్యాలు ఫ్రాన్స్ లో తేలికగా దిగే పరిస్థితులు కల్పించిన రష్యా ఆ దేశాలకు చేసిన సహాయం నిర్ణయాత్మకమైనదా లేక 4 శాతం మించని సహాయం

Edit with WPS Office
విజయంలో నిర్ణయాత్మకంగా ఉంటుందా?

రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా నష్టాలను మిత్ర దేశాల నష్టాలతో పోల్చి చూసినప్పుడు ఇది స్పష్టమవుతుంది. ఈ సంఖ్యలు ఒక అవగాహన ఇవ్వడానికి ఉద్దేశించబడినవి. వివిధ పరిశోధకులు వివిధ సంఖ్యలు ఇస్తారు. కాని ఇంచుమించుగా ఇవి వాస్తవమైనవి.

రెండో ప్రపంచ యుద్ధంలో రష్యన్ సైనికులలో మృతుల సంఖ్య ఒక కోటి 20 లక్షలు. పౌరులలో మరణించిన వారి సంఖ్య ఒక కోటి 70 లక్షలు. అంటే ఈ యుద్ధంలో మొత్తం 2 కోట్ల 90 లక్షల మంది రష్యన్లు బలయ్యారు. బ్రిటిష్ సైన్యంలో మృతుల సంఖ్య 4,03,000. పౌరుల్లో మృతుల సంఖ్య 92,700 - అంటే మొత్తం 4,95,000 మంది ఈ యుద్ధంలో మరణించారు. అమెరికన్ సైన్యంలో మృతుల సంఖ్య 4,07,000. పౌరులలో మృతుల సంఖ్య 6,000 - మొత్తం 4,13,000. యుద్ధంలో మరణించిన ప్రతీ ఒక్క అమెరికన్ సైనికుడికి 80 మంది రష్యన్ సైనికులు మరణించారు. యుద్ధం ముగుస్తుండగా బెర్లిన్ నగరం మీద దాడిలోనూ నగర శివార్లలోనూ, నగరంలోనూ జరిగిన యుద్ధంలో, రెండు మూడు వారాలలో మూడు లక్షలమంది రష్యన్ సైనికులు మరణించారు. నాజీ జర్మనీని ఓడించడంలో రష్యా పోషించిన పాత్రను ఎవ్వరూ తక్కువ చెయ్యలేరు.

నాజీ జర్మనీ అంతం

జర్మనీ మీద దాడి 1945 జనవరి 12న ప్రారంభమై, నాలుగు నెలల తర్వాత జర్మనీ పరాజయం, హిట్లర్ ఆత్మహత్యలతో ముగిసింది.

జనవరి 29న రష్యన్ సైన్యం సరిహద్దు దాటి జర్మనీలో ప్రవేశించింది. రష్యన్ సైన్యం 25 లక్షలు. ఈ సైన్యానికి 41,000 ఫిరంగులు, 6000 టాంకులు, 6500 విమానాలూ ఉన్నాయి. జర్మన్ సైన్యం బహుశా 10 లక్షలుండవచ్చు. జర్మనీ, రష్యన్ ఆయుధ సంపదలో మూడోవంతు మాత్రమే కలిగి ఉంది. జర్మన్ రాజధాని బెర్లిన్ లో భయోత్పాతం మొదలైంది. రష్యన్ సైన్యాలు వస్తుంటే - 30 డిగ్రీల సెంటీ గ్రేడ్ చలిలో లక్షలమంది జర్మన్లు బెర్లిన్ వైపుకు పారిపోసాగారు. వేలమంది దారిలోనే చనిపోయారు. వేలమంది మంచు దెబ్బకు గురయ్యారు. జర్మన్ విమానాలు రష్యన్ ప్రజల మీద దాడి చేసినట్లు పారిపోతున్న జర్మన్ల మీద రష్యన్ విమానాలు దాడి చెయ్యలేదు. పశ్చిమ దేశాల విమానాలు మాత్రం నిర్వాసితులతో నిండిన బెర్లిన్ మీద పెద్ద ఎత్తున విమాన దాడులు చేశాయి. ఫిబ్రవరిలో 1000 విమానాలతో బెర్లిన్ నగరం మీద దాడి చేశాయి.

బ్రిటన్, అమెరికాలకు లొంగిపోయినట్లు జర్మన్లు రష్యాకు తేలికగా లొంగిపోలేదు. తీవ్రంగా ప్రతిఘటించారు. జనవరి అంతానికి జర్మన్లు 552 విమానాలు, 2995 టాంకులు, 15000 గన్నులు, మోర్టార్లు, 26000 మర తుపాకులు, 34000 మోటారు వాహనాలను కోల్పోయారు. 2,95,000 మంది మరణించారు కాని 86,000 మంది మాత్రమే ఖైదీలుగా పట్టుబడ్డారు.

ఫిబ్రవరిలో జర్మనీ ఆఖరి ఉపగ్ర రాజ్యం హంగరీని రష్యన్లు ఆక్రమించారు.

బెర్లిన్ నగరం మీద దాడి ఏప్రిల్ 16న తిరిగి ప్రారంభమైంది. ఓడెర్ నదితో మొదలుకుని బెర్లిన్ నగరం వరకూ జర్మన్లు రక్షణ స్థావరాలు నిర్మించారు. బెర్లిన్ నగరం 350 చదరపు మైళ్ళ వైశాల్యం గలది. భూగర్భంలో మార్గాలూ, సబ్ వేలూ, సైన్యాన్ని అటూ ఇటూ తరలించడానికి అనువుగా ఉన్నాయి. బెర్లిన్ నగరం, పరిసర ప్రాంతాలూ రక్షణ యుద్ధానికి అనువుగా సిద్ధం చెయ్యబడ్డాయి. ప్రతీ వీధీ, ప్రతీ భవనం, కాలువ, వంతెన నగర రక్షణలో భాగమైంది. రష్యన్లు ఇటువంటి నగరాన్ని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చింది.

సోవియట్ విమానాలు నగరాన్నంతా ఫొటోలు తీశాయి. ఆ ఫొటోల సహాయంతోనూ, ఇతర సమాచారంతోనూ నగర మేప్ లు వివరంగా తయారు చెయ్యబడ్డాయి. సైనిక ఇంజినీర్లు నగరం మాడల్ ఒకటి తయారు చేశారు. ఈ మాడల్ సహాయంతో, మేప్ ల సహాయంతో, బెర్లిన్ మీద దాడికి పధకం తయారైంది. సాధారణంగా రాత్రి వేళ దాడి శత్రువు మీద ఎక్కువ ప్రభావం కలిగిస్తుంది. అందుచేత తెల్లవారడానికి రెండు గంటల ముందు దాడి చెయ్యాలని నిర్ణయించడం జరిగింది. శత్రు స్థావరాలను 140 సెర్చ్ లైట్ల వెలుగుతో ముంచెత్తాలని కూడా ఒక కొత్త పద్ధతిని ఆలోచించడం జరిగింది (ఈ సెర్చ్ లైట్ల వలన పెద్ద ప్రయోజనం ఏమీ లేకపోయిందనీ వీటివల్ల సైనికులూ కమాండర్లూ కూడా ఇబ్బంది పాలయ్యారనీ ఒక విమర్శ ఉంది).

Edit with WPS Office
ఏప్రిల్ 16న రష్యన్ దాడిని ఎదుర్కోవడానికి జర్మన్లు తీవ్రంగా ప్రయత్నించారు కాని 17-18 తేదీలలో రష్యన్లు జర్మన్ ప్రతిఘటనను అధిగమించి ముందుకు సాగారు. ఏప్రిల్ 20వ తేదీన రష్యన్ సైన్యాలు బెర్లిన్ రక్షణ స్థావరాలను అధిగమించాయి. ఏప్రిల్ 20వ తేదీ మధ్యాహ్నం 1.50 నిమిషాలకు రష్యన్ ఫిరంగులు బెర్లిన్ నగరం మీద గుళ్ళ వర్షం కురిపించడంతో బెర్లిన్ నగర యుద్ధం ప్రారంభమైంది. మరుసటి రోజు రష్యన్ సైన్యం నగర శివార్లలో ప్రవేశించింది. జర్మన్లు నగరంలోని ప్రతీ వీధికీ భవనానికీ నేల మాళిగకూ తీవ్రంగా పోరాడారు. రష్యన్లు జర్మన్ ప్రతిఘటనను అధిగమిస్తూ రైటా (జర్మన్ పార్లమెంటు భవనం) ఆక్రమించి, ఆ భవనం మీద ఎర్ర జండా ఎగురవేశారు.

హిట్లర్ ఆత్మహత్య

ఏప్రిల్ 20న బెర్లిన్ వదలి బార్బరోస్సా పర్వత శ్రేణుల్లోకి చేరి అక్కడనుండి యుద్ధం కొనసాగించాలనుకున్నాడు హిట్లర్. వాస్తవానికీ అతని ఊహలకీ పొత్తులేదు. బెర్లిన్ దగ్గర రష్యన్ సైన్యాలు ఘోర పరాజయం పొందుతాయని అతని విశ్వాసం. జర్మన్ సైన్యాలు బెర్లిన్ ను గాని, జర్మనీని గాని రక్షించగల స్థితిలో లేవు. జర్మనీ అంతం త్వరగా దగ్గర పడుతోంది. అతను ఊహించిన దాని కన్నా జర్మన్ సైన్యాలు వేగంగా పరాజయం చెందడంతో అతనికి బెర్లిన్ వదలి పారిపోయే అవకాశం లేకుండా పోయింది. ఏప్రిల్ 22న రష్యన్లు బెర్లిన్ నగరాన్ని చేరారు. ఈ నరరూప రాక్షసుడు తన పాపాలకు ప్రాయశ్చిత్తం చెయ్యాల్సిన సమయం దగ్గరవుతోంది. మునిగిపోతున్న ఓడను వదలి ఎలుకలు పారిపోయినట్లు అతని విశ్వాసపాత్రులైన వారందరూ ఒక్కొక్కరే వదలి పారిపోసాగారు.

ఏప్రిల్ 29న ఇటలీ నియంత ముస్సోలినీ మరణ వార్త హిట్లర్ కు చేరింది. ఇటలీ నుండి స్విడ్జర్లాండు పారిపోతుంటే ముస్సోలినీని, వాడి ఉంపుడు కత్తెనూ ఇటాలియన్ పార్టిజాన్లు ఏప్రిల్ 27న పట్టుకుని ఉరితీశారు. ఈ ఇద్దరి శవాలనూ లారీలో మిలన్ తీసుకొచ్చి దీపస్తంభాలకు తలక్రిందులుగా వేళ్ళాడదీశారు. ఆ తాళ్ళు తెగి ముస్సోలినీ, వాడి ఉంపుడు గత్తె శవాలు కింద పెంటకుప్ప మీద ఆదివారమంతా అలా పడి ఉన్నాయి. ఇటాలియన్లు వాళ్ళ మీద ఉమ్మేశారు. మే 1న ముస్సోలినీ, అతని ఉంపుడుగత్తెనూ దరిద్రులను పాతి పెట్టే శ్మశాల భాగంలో పాతి పెట్టారు. హిట్లర్ ఆత్మహత్యకు ముందు ముస్సోలినీ కుక్కచావు గురించి వివరాలు ఎంతమటుకు అందాయో తెలియదు కాని ముస్సోలినీ మరణం ఆత్మహత్య చేసుకోవాలనే అతని నిర్ణయాన్ని మరింత బలపరిచింది.

ఏప్రిల్ 29 తెల్లవారగట్ల హిట్లర్ తన ఉంపుడుగత్తె ఎవా బ్రాన్ ను పెళ్ళి చేసుకున్నాడు. మధ్యాహ్నం 2.30 గంటలకు తన డ్రైవర్ కెంప్కాను 200 లీటర్ల పెట్రోలు తీసుకు రమ్మని ఆదేశించాడు. ఈ ప్రపంచాధినేతను తగలెయ్యడానికి అతి కష్టంమీద 180 లీటర్ల పెట్రోలు సంపాదించగలిగారు. 3.30 గంటలకు హిట్లర్ ఎవా బ్రాన్ తో తన గదిలోకి వెళ్ళాడు. రివాల్వర్ నోట్లో పెట్టుకుని పేల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎవా బ్రాన్ విషం మింగింది.

హిట్లర్ శవాన్ని బంకర్ లోంచి గార్డెన్ లోకి మోసుకు వెళ్ళారు. రష్యన్ బొంబార్డుమెంటు మధ్య విరామంలో అతని శవాన్ని ఒక గోతిలో పెట్టి గేసోలిన్ పోసి అంటించారు. మళ్ళీ ఎర్రసైన్యం ఫిరంగి కాల్పులు మొదలు పెట్టింది.

హిట్లర్, ఎవా బ్రాన్ ల అవశేషాలు దొరకలేదు. యుద్ధం తర్వాత హిట్లర్ బెర్లిన్ వదలి పారిపోయాడనే పుకారు ఒకటి వచ్చింది. ఇప్పటికీ అసలు ఏం జరిగిందో తెలియదు. అతి తీవ్రంగా ఉన్న ఎర్ర సైన్య ఫిరంగి దాడిలో హిట్లర్ శవం ఛిన్నాభిన్నమై అవశేషాలు ఏవీ మిగిలి ఉండకపోవచ్చునని అంటారు.

ఇది హిట్లర్ చావు కథ. అయితే ఈ కథను కొంతమంది నమ్మరు. హిట్లర్ తప్పించుకు పారిపోయాడని చాలా కథలున్నాయి కాని అవి అంత నమ్మశక్యం కాదు.

వెయ్యి సంవత్సరాలు వెలుగుతుందన్న నాజీ జర్మనీ హిట్లర్ ఆత్మహత్య తర్వాత మరి ఏడు రోజులు మాత్రమే జీవించింది.

మే 8న జర్మనీ బేషరతుగా లొంగిపోయింది. యుద్ధం ముగిసింది.

యుద్ధం ముగియడంతో ఈ పుస్తకం కూడా ముగుస్తుంది. సోవియట్ యూనియన్ ఎల్లాంటి

Edit with WPS Office
పరిస్థితులలో ఎలా పోరాడిందో పరిచయం చెయ్యడమే ఈ పుస్తక రచయిత ఉద్దేశం కాని ఆ నాటి ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులూ పరిణామాలూ వివరంగా చర్చించడం కాదు. అలా చెయ్యడానికి ఈ రచయితకు శక్తి లేదు. భవిష్యత్తులో చారిత్రక పరిశోధకులు రికార్డుల సహాయంతో వివరంగా పరిశోధించి స్టాలినిస్టు రష్యా గురించి పూర్తి వాస్తవాలు వెల్లడిస్తారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ధృతరాష్ట్ర కౌగిలి నుండి సమాచారం రంగం బయటపడ్డప్పుడు ప్రజలకు ఈ వాస్తవాలు చేరే అవకాశం ఉంది. అప్పుడు ఈ కాలం గురించి సరియైన అవగాహన కలుగుతుంది.

సోవియట్ రష్యా పతనానికి ముందు అమెరికా, రష్యాల మధ్య సంఘర్షణ యుద్ధానికి దారి తీస్తోందనీ ఈ రెండు దేశాలూ ఒక శాంతి ఒడంబడికకు వస్తే ప్రపంచమంతా శాంతి వెల్లి విరుస్తుందనీ మేధావులు అనేవారు. రష్యా పతనమైంది. సోషలిస్టు వ్యవస్థ తాత్కాలికంగా అదృశ్యమైంది. కాని యుద్ధాలు ఆగలేదు. శాంతి పావురాలు ఎగరడం లేదు. ఎందుకంటే యుద్ధాలు రావడానికి కారణాలు వేరు. శాంతి అనేది శాంతి పిపాసుల కోరికలకు అనుగుణంగా, వారి ఉద్దేశాలు ఎంత ఉన్నతమైనవైనా, సంభవించదు.

స్టాలిన్ చెప్పినట్లు సామ్రాజ్యవాదం ఉన్నంత కాలం యుద్ధ ప్రమాదం ఉంటూనే ఉంటుంది. బలహీనులనూ, వెనుకబడ్డవారినీ బలవంతులు దోచుకోవడమన్నది దోపిడీ దారుల సూత్రం. పెట్టుబడిదారీ విధానపు ఆటవిక న్యాయం. సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించడానికి సాయుధంగా సంసిద్ధమైనప్పుడే శాంతి బలడుతుంది. సహృదయులైన మన మేధావులు తరచు విస్మరించే, విప్లవకారులు ఎన్నటికీ విస్మరించరాని, సత్యం ఇది.

పుస్తకం ముగించే ముందు యుద్ధానంతర పునర్నిర్మాణం గురించి రెండు మాటలు.

ముందు అధ్యాయాల్లో వివరించినట్లు యూరోపులో జరిగిన మొత్తం నష్టంలో సగం రష్యాలోనే జరిగింది. అమెరికా నష్టపోయిన దాని కంటే రష్యా వంద రెట్లు ఎక్కువ నష్టపోయింది. ఈ భయంకరమైన వినాశనం నుండి కోలుకోవడానికి సోవియట్ యూనియన్ కు అనేక దశాబ్దాలు పట్టవచ్చునని కొంతమంది అంచనా వేశారు.

యుద్ధం జరుగుతుండగానే పునర్నిర్మాణం ప్రారంభమైంది. ఎర్రసైన్యం గెలుచుకున్న ప్రాంతాలలో భూమిని సాగు చేసే ప్రయత్నం 1943లోనే మొదలైంది. అతి ముఖ్యమైన పరిశ్రమలు పని ప్రారంభించాయి. ముఖ్య రవాణా మార్గాలను పునర్నిర్మించడం ప్రారంభమైంది. 1943లోనే పరిశ్రమలను తిరిగి ప్రారంభించడానికీ పశు సంపదను అభివృద్ధి చెయ్యడానికీ గృహ నిర్మాణానికీ వివరంగా ప్రణాళిక వెయ్యడం జరిగింది. 1943 నాటికి జర్మన్ ఆక్రమణలో లేని ప్రాంతంలో, అనేక కష్టాలకు లోనవుతూ కోటి ఎకరాలు అదనంగా సాగులోకి తీసుకు వచ్చారు. యుద్ధానంతరం 1946లో రష్యా ప్రధాన ధాన్యాగారమైన యుక్రెయిన్ లోనూ వోల్గా ప్రాంతంలోనూ భయంకరమైన కరువు వచ్చింది. అంతకు ముందు 50 ఏళ్ళలోనూ అంత పెద్ద కరువు రాలేదు. 1947లో ఆహార ధాన్యాల పరిస్థితి బాగుపడడంతో రేషనింగు పద్ధతికి స్వస్తి చెప్పడం జరిగింది. 1947 – 1954 ల మధ్య ధరలు ఏడు మార్లు తగ్గించబడ్డాయి. ఈ ఏడు సంవత్సరాలలోనూ ధరల సూచి రెండు మూడు రెట్లు తగ్గింది. 1954 నాటికి ఇంగ్లండులో ఇంకా రేషనింగ్ అమలులోనే ఉంది అన్న విషయం గుర్తుంచుకుంటే రష్యా సాధించిన ఘన విజయం అర్థమవుతుంది

1945 అంతానికి రష్యాలో 50,000 కి. మీ రైలు మార్గం పునరుద్ధరించబడింది. పశ్చిమ సరిహద్దుకు ఆవల మరో 50,000 కి. మీ. రైలు మార్గం - అంటే మొత్తం లక్ష కి. మీ. రైలు మార్గం పునరుద్ధరించబడింది. నాశనమైన రోడ్లను పునరుద్ధరించడమే కాకుండా 7,900 మైళ్ళ కొత్త రోడ్లను నిర్మించారు. 1946 వేసవి కాలానికి నీటి మార్గాలు కూడా చాలా మటుకు బాగు చేయబడి నౌకాయానం ప్రారంభమైంది. 1947లో నీపర్ డాం (ఈ డాంను రష్యన్లు యుద్ధకాలంలో పేల్చి వేశారు) పునర్నిర్మాణం పూర్తయి ఈ ప్రాంతంలో కూడా నౌకాయానం ప్రారంభమైంది. యుద్ధ ప్రారంభంలో పరిశ్రమల, జనాభా తరలింపు లాగే జర్మన్ ఆక్రమిత ప్రాంతాలు విముక్తి చెయ్యబడిన తర్వాత తిరిగి పరిశ్రమలను పశ్చిమానికి తరలించడం రవాణా సౌకర్యాల మీద అదనపు భారాన్ని మోపింది. నాశనమైన పట్టణాలనూ పల్లెలనూ తిరిగి నిర్మించడం మొదలైంది. 1946 ప్రారంభానికి 2 కోట్ల 50 లక్షల ప్రజలకు పునరావాసం కల్పించబడింది. జర్మన్లు నాశనం చేసిన ప్రాంతాలలో 70,000 పాఠశాలలూ 6,000 ఆసుపత్రులూ నిర్మించారు.

ఆశ్చర్యకరంగా 1948 నాటికి రష్యన్ పారిశ్రామిక ఉత్పత్తి 1940 సంవత్సర ఉత్పత్తిని మించింది.

Edit with WPS Office
1940వ సంవత్సరంతో పోల్చి చూస్తే ఈ మూడేళ్ళలోనూ ఉత్పత్తి - బొగ్గు 123 శాతం, విద్యుత్తు 130 శాతం, కార్లు, ట్రక్కులు 161 శాతం, యంత్ర పరికరాలు 150 శాతం, సిమెంటు 114 శాతం పెరిగింది. నాలుగో పంచవర్ష ప్రణాళికా లక్ష్యాలను తొమ్మిది నెలల ముందుగానే సాధించడం జరిగింది. 1950లో నాలుగో పంచవర్ష ప్రణాళికాంతానికి పారిశ్రామిక ఉత్పత్తి 1940 సంవత్సరంతో పోల్చి చూస్తే 73 శాతం పెరిగింది. పారిశ్రామిక సామగ్రి ఉత్పత్తి రెట్టింపు అయింది. వినియోగ వస్తువుల ఉత్పత్తి 23 శాతం పెరిగింది. సోషలిస్టు రష్యా యుద్ధానికి ముందూ, యుద్ధ కాలంలోనూ, యుద్ధనంతరమూ ఆర్థిక, సైనిక, సామాజిక రంగాలలో సాధించిన ఘన విజయాలు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ పెట్టుబడి దారీ విధానం కంటే ఉన్నతమైనదని రుజువు చేశాయి.

అతి క్లిష్టమైన పరిస్థితులలో స్టాలినిస్టు రష్యా సాధించిన ఘన విజయాలను నేడు ప్రపంచం దాదాపు మరిచిపోయే పరిస్థితి ఏర్పడింది. సోవియట్ యూనియన్ అంతం కాని, సోషలిస్టు వ్యవస్థ పతనం కాని ఆ విజయాల గొప్పతనాన్ని తక్కువ చెయ్యలేవు. ప్రపంచ కార్మిక వర్గమూ, ప్రజలూ నేటి నిరాశా నిస్పృహలనుండి కోలుకుని మళ్ళీ పోరాట మార్గం వైపు మళ్ళినప్పుడు ఈ గతం భవిష్యత్తుకు - అవును, భవిష్యత్తుకు - ఆదర్శంగా నిలుస్తుంది.

ఎందుకంటే కమ్యూనిజానికి గర్వించదగ్గ గతమే కాదు, ఉజ్వలమైన భవిష్యత్తు కూడా ఉంది.

Edit with WPS Office

I know that after my death a pile of refuse will be heaped on my grave, but the winds of history will sooner or later sweep it away without mercy. I do not, however, believe that this will happen soon. It is very probable that in the near future fervent anti-communists will take power in this country.

నా మరణం తర్వాత నా సమాధి మీద చెత్తా చెదారం పడేస్తారని నాకు తెలుసు. కానీ కొంచెం ముందో వెనుకో చరిత్ర గాలులు ఈ చెత్తని నిర్దాక్షిణ్యంగా తుడిచి పడేస్తాయి. అయితే ఇది వెంటనే జరుగుతుందని నేను అనుకోవడం లేదు. ఈ దేశంలో పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకులు సమీప భవిష్యత్తులో అధికారాన్ని చేజిక్కుంచుకునే అవకాశం చాలా ఉంది.

- మాలటోవ్ తో స్టాలిన్ (మాలటోవ్ జ్ఞాపకాల నుంచి)

Edit with WPS Office

స్టాలిన్

యుద్ధానంతరం అతి క్లిష్టమైన పరిస్థితులలో పునర్నిర్మాణం విజయవంతంగా పూర్తి చేసి రష్యాను అగ్ర రాజ్యంగా రూపొందించడానికీ మరిన్ని ఘనవిజయాలకూ ప్రణాళికలు వేస్తున్న తరుణంలో 1953 మార్చి 5న స్టాలిన్ మరణించాడు. స్టాలిన్ మరణం సహజ మరణమా లేక అతను హత్య చెయ్యబడ్డాడా? ఇప్పుడు లభ్యమవుతున్న సమాచారాన్ని బట్టి ఈ ప్రశ్నకు స్పష్టంగా సమాధానం చెప్పడం సాధ్యం కాదు కాని అతని మరణానికి ముందు కొన్ని ఆసక్తికరమైన మార్పులు జరిగాయి. అవసాన దశలో స్టాలిన్ అంతఃపుర శత్రువుల చేత చుట్టుముట్టబడినట్లు కనుపిస్తుంది. ఇది ఎలా జరిగిందన్నది తెలియదు.

స్టాలిన్ మరణానికి కొద్ది నెలల ముందు స్టాలిన్ రక్షణకు ఉన్న వ్యవస్థనంతా మార్చి వెయ్యడం జరిగింది. 1928 నుండి స్టాలిన్ పెర్సనల్ సెక్రటరీగా పని చేస్తున్న అలెగ్జాండర్ ప్రోస్క్రిబిషేవ్ ఉద్యోగం నుంచి తొలగించబడి గృహ నిర్బంధంలో ఉంచబడ్డాడు. రహస్య పత్రాలను వెల్లడి చేశాడని అతని పై ఆరోపణ. స్టాలిన్ రక్షణకు 25 సంవత్సరాలుగా బాధ్యత వహిస్తున్న లెఫ్టెనెంటు కల్నల్ నికోలాయ్ వ్లాసిక్ 1952 డిసెంబరు 16న అరెస్టు చెయ్యబడ్డాడు. కొన్ని వారాల తర్వాత అతను కారాగారంలో మరణించాడు. మరొక ఆఫీసరు మేజర్ జనరల్ పీటర్ కోసింకిన్, క్రెమ్లిన్ గార్డుకు వైస్ - కమాండర్ - స్టాలిన్ రక్షణకు బాధ్యుడు - హృద్రోగంతో ఫిబ్రవరి 17 1953లో మరణించాడు. స్టాలిన్ చుట్టూ ఉన్న రక్షణ వలయాన్ని ఒక క్రమ పద్ధతిలో నాశనం చెయ్యడం జరిగింది.

రహస్య పోలీసు అధిపతి బెరియా ఒక్కడే ఇదంతా చెయ్యగల సమర్థుడు. అతను స్టాలిన్ ను అంతమొందించడానికి కుట్రపన్ని ఉండవచ్చు. దీనిలో ఎవరెవరి సహకారం ఉందో తెలియదు. స్టాలిన్ పార్టీలో మరో ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రారంభించడానికి తలపెట్టడంతో భయకంపితులైన ప్రముఖులు ఈ హత్య వెనుకాల ఉండవచ్చు (బెరియా నిరపరాధి అనీ, అతను స్టాలిన్ ను రక్షించడానికే ప్రయత్నించి ఇతరుల కుట్రలకు బలైపోయాడనీ మరొక కథనం ఉంది. వాస్తవమేమిటో ఈ నాటికీ తెలియదు).

మరణానికి కొన్ని నెలల ముందు, 1952 అక్టోబరులో, స్టాలిన్ ఉన్నత పార్టీసంస్థలలో సభ్యుల సంఖ్యను రెట్టింపు చెయ్యడానికి నిర్ణయించాడు. ఈ సభ్యుల నుండి స్టాలిన్ తర్వాత ఎవరు నాయకత్వం వహిస్తారు అన్నది నిర్ణయమవుతుంది. సెంట్రల్ కమిటీ స్టాలిన్ ప్రతిపాదనను అంగీకరించింది. విస్తృత పరచబడిన పార్టీ ప్రిసైడియం, కొత్త సెక్రటేరియట్ సభ్యుల జాబితాను కూడా కేంద్ర కమిటీ ఆమోదించింది.

స్టాలిన్ కుడిభుజం మాలటోవ్ - '....స్టాలిన్ మరణానికి బెరియా కారకుడు కాడని నేను చెప్పలేను. 1953 మేడే నాడు మసోలియం మీద ఉన్నప్పుడు బెరియా నాతో, 'స్టాలిన్ ను నేను మాయం చేశాను. మిమ్మల్నందరినీ రక్షించాను' అని చెప్పాడు' అన్నాడు (Molotov Remembers, p. 237).

మార్చి 6 ఉదయం బెరియా నాయకత్వంలో ఉన్న భద్రతా పోలీసు దళాలు మాస్కో రక్షణకు ఉన్న సైన్యాల కమాండర్లను అరెస్టు చేశాయి. సైన్యం బేరక్స్ దాటి బయటకు రాకూడదని నిషేధం విధించబడింది. బెరియా మనుషులు క్రెమ్లిన్, మాస్కోలను స్వాధీనం చేసుకున్నారు. ఆ రోజు సాయంకాలానికి 1952 అక్టోబరులో కేంద్ర కమిటీ పార్టీ సెక్రటేరియట్ కు ఎన్నిక చేసిన పదిమంది సభ్యులలో అయిదుగురినీ, ప్రిసైడియంకు ఎన్నికయిన 36 మంది సభ్యులలో 22 మందినీ వారి పదవులనుండి తొలగించడం జరిగింది. 52 గవర్నమెంటు మినిస్ట్రీలలోనూ 27 మూసివేయబడ్డాయి.

కొత్త నాయకవర్గంలో మాలెంకోవ్ ప్రధాన మంత్రి.....బెరియా మొదటి ఉప ప్రధాన మంత్రి....బెరియా వెనుకే కృశ్చేవ్.....మార్షల్ ఝుకోవ్ రక్షణ శాఖలో కో-డిప్యూటీ మంత్రి అయ్యాడు.

మరోవైపు కృశ్చేవ్ బెరియాకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నాడు. అతను మొదట మాలెంకోవ్ సహకారం తీసుకున్నాడు. తర్వాత మిగిలిన పాలిట్ బ్యూరో సభ్యులతో ఒక్కొక్కరితోనూ మాట్లాడాడు.

Edit with WPS Office
చివరన బెరియా ఆప్తమిత్రుడు మికోయాన్ తో సంప్రదించి తన వైపుకు తిప్పుకున్నాడు. 1953 జూన్ 24న ప్రిసైడియం సమావేశం జరిగింది. ఆ సమావేశం జరుగుతుండగా, ముందు అనుకున్న విధంగా సంకేతం అందిన తర్వాత, మార్షల్ ఝుకోవ్ నాయకత్వంలో 11 మంది మార్షల్స్, జనరల్సు సమావేశం జరుగుతున్న హాలులో ప్రవేశించి బెరియాను అరెస్టు చేశారు. 1953 డిసెంబరు 23న బెరియా కాల్చివేయబడ్డాడు. బెరియా అనుచరులు కాల్చివేయబడ్డారు లేక పార్టీ నుంచి తొలగించబడ్డారు.

స్టాలిన్ మరణానంతరం మూడు నెలల తర్వాత 1953 మేలో 'కమ్యూనిస్టు' పత్రికలో వ్యక్తిపూజను నిరసిస్తూ లెనిన్, స్టాలిన్, మార్క్స్, ఏంగెల్స్ ల కొటేషన్లతో ఒక సుదీర్ఘ వ్యాసం వచ్చింది. స్టాలిన్ మీద పరోక్షంగా మొదటి దాడి ఇది. తరువాత అటువంటి వ్యాసాలు వందలు ప్రచురించబడ్డాయి.

బెరియాను కాల్చేసిన తర్వాత కృశ్చేవ్ ప్రిసైడియంలో ముఖ్యుడయ్యాడు. మాలెంకోవ్ నూ అతని సహచరులనూ పార్టీ వ్యతిరేక గ్రూపు ముద్ర వేసి తొలగించాడు. ఈ దశలో కృశ్చేవ్ స్టాలిన్ విధానాల రక్షకుడిగా పోజు పెట్టాడు. మాలెంకోవ్ ను తొలగించిన తర్వాత కృశ్చేవ్ పార్టీ ఫస్ట్ సెక్రటరీ అయ్యాడు. పార్టీ అతని అధీనంలోకి వచ్చింది. స్టాలిన్ కాలంలో ప్రజా ద్రోహులుగా శిక్షించబడిన వారిని విడుదల చేసి కీలక స్థానాలలో నియమించడం ప్రారంభమైంది. 1938లో కృశ్చేవ్, మికోయాన్ ల మిత్రుడు స్నెగోవ్ ప్రజాద్రోహిగా 25 సంవత్సరాల శిక్షకు గురయ్యాడు. 1956లో స్టాలిన్ ఘాతుకాలకు నిదర్శనంగా స్నెగోవ్ కేసును చూపించి, స్నెగోవ్ ను విడుదల చేసి ఆంతరంగిక మంత్రిత్వ శాఖ కమిస్సార్ గా కీలక స్థానంలో నియమించాడు కృశ్చేవ్. 'స్టాలిన్ నేరాలకు మూల కారణం అక్టోబరు విప్లవం, అంతర్యుద్ధం' అన్న అభిప్రాయంతో ఉన్న (అలా అని తనతో చెప్పినట్లు కృశ్చేవ్ కొడుకు అన్నాడు) స్నెగోవ్ కు, స్టాలిన్ ఘాతుకాలకు బలయినవారందరికీ పునరావాసం కల్పించే బాధ్యత అప్పగించాడు కృశ్చేవ్.

పార్టీ ఫస్ట్ సెక్రటరీ కాగానే పార్టీలో నిబద్ధులైన కార్యకర్తలను తొలగించడం మొదలు పెట్టాడు కృశ్చేవ్. యుక్రెయిన్ లో 9000 మంది పార్టీ సెక్రటరీలనూ జార్జియాలో 2500 మంది ఫస్ట్ సెక్రటరీలనూ తొలగించాడు. ఒక వైపు నిబద్ధులైన కార్యకర్తలను పార్టీ నుంచి తొలగిస్తూ మరో వైపు (1956లో) 20వ కాంగ్రెస్ తర్వాత సోవియట్ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారన్న నేరంపై శిక్షలు అనుభవిస్తున్న 7000 మంది ద్రోహులను విడుదల చేశాడు. ప్రభుత్వంలో కీలక స్థానాలలో 'స్టాలిన్ ఘాతుకాలకు' గురయిన వారిని నియమించాడు.

మాలెంకోవ్ ను తొలగించిన తర్వాత మాలటోవ్ కృశ్చేవ్ తరువాతి లక్ష్యం అయ్యాడు. మాలటోవ్ కృశ్చేవ్ విధానాలను వ్యతిరేకించసాగాడు.

1957 జూన్ 18న కృశ్చేవ్ ను పార్టీ నాయకత్వం నుంచి తొలగించాలని ప్రిసైడియం నిర్ణయించింది. కేంద్ర కమిటీ పూర్తి సమావేశం ప్రిసైడియం నిర్ణయాన్ని ఆమోదించితే కాని రాజీనామా చెయ్యనని కృశ్చేవ్ మొండికేశాడు. ఇక్కడ మార్షల్ ఝుకోవ్ రంగంలోకి దిగాడు.

మార్షల్ ఝుకోవ్ నిస్సందేహంగా సమర్థుడైన జనరల్. అతను సమర్థవంతుడైన జనరల్ అయినా, అసంఖ్యాక సైన్యాలనూ ఆయుధాలనూ అందించిన కార్మికవర్గం, ప్రజలూ, సోషలిస్టు వ్యవస్థ ఈ ప్రజలలో తీసుకు వచ్చిన నూతన సామాజిక చైతన్యం, ఈ సోషలిస్టు సమాజాన్ని ఉనికిలోకి తీసుకు వచ్చిన అక్టోబరు విప్లవం, ఆ విప్లవాన్ని సాధించిన బోల్షివిక్ కమ్యూనిస్టు పార్టీ, ఆ పార్టీ కార్యకర్తల ఉక్కు క్రమ శిక్షణ, సాటిలేని విప్లవ దీక్ష - ఇవేవీ లేకుండా మార్షల్ ఝుకోవ్ ప్రతిభ రాణింపుకు రాడు. ఈ చైతన్యంలోంచే మార్షల్ ఝుకోవ్ లు, కోనెవ్ లూ, షపోష్నికోవ్ లు పుట్టుకొస్తారు. తమ ప్రతిభ చూపిస్తారు.

కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సోషలిస్టు సోవియట్ సమాజం సృష్టించిన ఈ నూతన సామాజిక చైతన్యాన్ని పూర్తిగా విస్మరించే బూర్జువా చరిత్రకారులు, రష్యా విజయానికి కారణం ఓటమి ఎరుగని మార్షల్ ఝుకోవ్ అని ప్రచారం చేశారు. స్టాలిన్ మూర్ఖత్వం వలన అపజయాలు సంభవించినా, మార్షల్ ఝుకోవ్ అసమాన ప్రతిభతో రష్యన్ సైన్యాలను నడిపించి జర్మనీని ఓడించినట్లు చిత్రించారు. స్టాలిన్ కు పోటీగా అతన్ని నిలబెట్టడానికి ప్రయత్నించారు. మార్షల్ ఝుకోవ్ తలబిరుసు మనిషి. అటువంటి పొగడ్తలు అతనిలో అహంకారాన్ని పెంచి పైపైకి ఎగబాగాలన్న కోరిక కలిగించి ఉండవచ్చు.

పార్టీకీ సైన్యానికీ మధ్య ఉండవలసిన సంబంధం గురించి మార్క్సిస్టులకు ఒక స్పష్టమైన అవగాహన ఉంది. పార్టీ తుపాకీని నడిపించాలి కాని తుపాకీ పార్టీని నడపించకూడదు.

Edit with WPS Office
యుద్ధానంతరం, ప్రజల్లో సైన్యానికి ఉన్న పరపతి కారణంగా స్టాలిన్ 'బోనపార్టిజం' (సైన్యం అధికారం హస్తగతం చేసుకునే) ప్రమాదాన్ని నివారించేందుకు మార్షల్ ఝుకోవ్ ని ప్రాధాన్యత లేని పదవిలోకి పంపించాడు. ఇది ఒక్కటే కారణం కాకపోవచ్చు.

మార్షల్ ఝుకోవ్ జర్మనీ నుండి విలువైన సంపదనూ, కళాఖండాలనూ కొల్లగొట్టి తన ఇంట్లో 51 ట్రంకు కేసులలో నింపి ఉంచిన సంగతి స్టాలిన్ కు తెలిసింది. ఒక బాధ్యత గల మార్షల్ ప్రభుత్వానికి తెలియకుండా విదేశాలనుండి ఇలా లూట్ చెయ్యడం నేరమే. ఈ నేరం విచారణలో రుజువైంది. ఈ నేరానికి శిక్షగా ఝుకోవ్ పదవిని తగ్గించడం జరిగింది. ఇది కూడా ఒక కారణం కావచ్చు.

మార్షల్ ఝుకోవ్ కు పార్టీ సైన్యం వ్యవహారాల్లో కలుగజేసుకోకూడదు అన్న అభిప్రాయం మొదటి నుండీ ఉంది. సైన్యంపై పార్టీ అజమాయిషీని అతను మొదటి నుండీ నిరసిస్తున్నాడు. తను ప్రాముఖ్యతను కోల్పోయినప్పటినుండీ ఝుకోవ్ స్టాలిన్ అంటే అసంతృప్తితో ఉన్నాడు. కృశ్చేవ్ అతనితో చేతులు కలిపి 1953లో అతన్ని కో-డిప్యూటీ రక్షణ మంత్రిని చేశాడు. 1955లో మాలెంకోవ్ ను పదవినుంచి తొలగించే సమయానికి రక్షణ మంత్రి అయ్యాడు. సోవియట్ యూనియన్ చరిత్రలో పార్టీ కార్యకర్త కాక ఒక సైనికాధికారి రక్షణ శాఖకు మంత్రి అవడం అదే మొదటిసారి. 1956 మార్చిలో ఝుకోవ్ పార్టీ ప్రిసైడియం కేండిడేట్ మెంబరుగా ప్రమోట్ చెయ్యబడ్డాడు. కృశ్చేవ్ అండదండలతో అతను పైపైకి ఎగబాకాడు.

1957 జూన్ లో పార్టీ ప్రిసైడియంలో బలహీనంగా ఉండి ఓటమి తధ్యమన్న పరిస్థితిలో ఉన్న కృశ్చేవ్ కు తన అండదండలు అందించాడు మార్షల్ ఝుకోవ్.

సైనిక విమానాలు పంపి కృశ్చేవ్ అనుచరులను కేంద్ర కమిటీ సమావేశానికి మాస్కో తీసుకు వచ్చాడు. కేంద్ర కమిటీలో కృశ్చేవ్ తన మనుషులను నింపి ఉంచాడు. మార్షల్ ఝుకోవ్ కృశ్చేవ్ వైపు మొగ్గడంలో మరో ప్రమాదం ఏర్పడింది. కృశ్చేవ్ ను తొలగించినట్లయితే మార్షల్ ఝుకోవ్ నాయకత్వంలో ఉన్న సైన్యం మాలటోవ్, మాలెంకోవ్, కగనోవిచ్ ల ప్రభుత్వాన్ని గుర్తించదు అనే హెచ్చరిక కూడా ఉంది. స్టాలిన్ భయపడ్డది నిజమవుతోంది. పార్టీ తుపాకీని నడిపించడం లేదు. తుపాకీ పార్టీని నడిపిస్తోంది.

ఈ సంఘర్షణలో మాలటోవ్ గ్రూపు ఓడిపోయింది. కృశ్చేవ్ సైన్యం సహకారంతో విజయం సాధించాడు. నిజానికి ఇది ఒక సైనిక తిరుగుబాటు లాంటిది. తుపాకీ గొట్టం ద్వారా కృశ్చేవ్ అధికారం స్థిరపడింది. ఈ తుపాకీ శ్రామిక వర్గం చేతుల్లో ఉన్న తుపాకీ కాదు. కార్మిక వర్గ నియంతృత్వాన్ని నిరసించే ఆఫీసర్ల చేతుల్లో ఉన్న తుపాకీ. ఝుకోవ్ మరో మెట్టు పైకెక్కాడు. ప్రిసైడియం ఫుల్ మెంబరయ్యాడు. అయితే అతను కృశ్చేవ్ ను సరిగా అర్థం చేసుకోలేదు. కృశ్చేవ్ మాత్రం అతన్ని సరిగానే అర్థం చేసుకున్నాడు. మార్షల్ ఝుకోవ్ తన పక్షం నుంచి మరో పక్షానికి మొగ్గితే తను కూలిపోతానని అతనికి అర్థమైంది.

మార్షల్ ఝుకోవ్ 1957 అక్టోబరులో ఆల్బేనియా పర్యటించి మాస్కోకు తిరిగి చేరగానే విమానాశ్రయంలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. కొన్ని గంటల తర్వాత అతను పదవినుంచి తొలగించబడ్డాడు. కృశ్చేవ్ కాలంలో మార్షల్ ఝుకోవ్ మీద దుష్ప్రచారం జరిగింది. సమాధానమివ్వడానికి అతనికి అవకాశం లేకపోయింది. 1963లో కృశ్చేవ్ పదవీచ్యుతుడైన తర్వాత మార్షల్ ఝుకోవ్ తన జ్ఞాపకాలు రాయడం మొదలు పెట్టాడు. కృశ్చేవ్ తో కలిసి ఉన్నంతకాలం అతను కూడా స్టాలిన్ ను నిందించాడు లేదా ఇతరులు స్టాలిన్ మీద అసత్య ప్రచారం సాగిస్తుంటే వాస్తవాలు తనకు తెలిసి కూడా మౌనం వహించాడు. తరువాతి కాలంలో కృశ్చేవ్ చేతిలో తను కీలుబొమ్మలా ఆడాననే ఆగ్రహం వల్ల కావచ్చు, లేదా సుప్రీం కమాండర్ స్టాలిన్ మీద చల్లుతున్న బురద డిప్యూటీ సుప్రీం కమాండర్ గా తన మీద కూడా పడుతున్నదన్న సంగతి గుర్తించి కావచ్చు, లేదా చరిత్రలో స్టాలిన్ కున్న స్థానం గురించి వాస్తవాలు చెప్పే ఉద్దేశంతో కావచ్చు - ఏ కారణాలవల్లనైతేనేమి, అతను స్టాలిన్ గురించి చాలా వివరాలు వెల్లడించాడు.

కృశ్చేవ్-మాలటోవ్ ల మధ్య సంఘర్షణ పార్టీ ఉన్నత స్థాయిలో జరిగిందే కాని పార్టీ సభ్యులందరినీ, ప్రజలందరినీ మాలటోవ్ కలుపుకు రావడంలో విఫలమయ్యాడు. బహుశా ఆ నాటి పరిస్థితిలో మాలటోవ్ కు అది అసాధ్యమై ఉండవచ్చు. మాలటోవ్ తిరుగుబాటు చేస్తే, మార్షల్

Edit with WPS Office
ఝుకోవ్ కృశ్చేవ్ కు అండగా నిలిస్తే, ఒక అంతర్యుద్ధం జరిగేది. ఆ నాటి పార్టీ ఇటువంటి అంతర్యుద్ధానికి సిద్ధంగా లేదు. అంతర్జాతీయ పరిస్థితి కూడా అతనికి అనుకూలంగా లేదు.

కృశ్చేవ్ కాలంలో రష్యాలో కేపిటలిస్టు పునరుద్ధరణకు అంకురార్పణ జరిగింది. అయితే కృశ్చేవ్ స్టాలిన్ సోషలిస్టు ఆర్థిక విధానాలను సమూలంగా మార్చి వెయ్యడానికి దాడి మొదట ఆర్థిక విధానాల మీద మొదలు పెట్టలేదు. ఎవరూ కాదనలేని సోషలిస్టు విజయాలు ప్రజల కళ్ళముందున్నాయి. ప్రపంచంలో సోషలిజం పేరు మారు మోగుతోంది. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలకు సోషలిజం ఆదర్శమవుతోంది. భారత దేశంలో కూడా నెహ్రూ గారు తన సంకర ఆర్థిక విధానాలకు మన కమ్యూనిస్టులు పొంగిపోయేలా సోషలిస్టు తరహా సమాజం అని పేరు పెట్టారు. ఆ నాడు సోషలిజానికున్న పేరు అది. అందుచేత సోషలిజం మీద సూటిగా దాడి చెయ్యడానికి కృశ్చేవ్ సాహసించలేదు. మూడు దశాబ్దాల సోషలిస్టు విజయాలను పొగుడుతూనే మూడు దశాబ్దాలు సోషలిస్టు రష్యాకు నాయకత్వం వహించిన స్టాలిన్ మీద దాడి చేశాడు. స్టాలిన్ వేసిన సోషలిస్టు బాటనుండి రష్యాను దారి తప్పించేందుకూ, ప్రపంచ సోషలిస్టు ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకూ, మొదట ఈ ఉక్కుమనిషిని ధ్వంసం చెయ్యాలి. స్టాలిన్ ను ఆరాధిస్తున్న పార్టీ సాధారణ సభ్యులలోనూ ప్రజానీకంలోనూ అతన్ని అపఖ్యాతి పాలు చేసే ఉద్దేశంతో కృశ్చేవ్ 1956లో 20వ పార్టీ కాంగ్రెసులో స్టాలిన్ 'ఘాతుకాల' పై ఒక రహస్య నివేదిక సమర్పించాడు.

కృశ్చేవ్ రహస్య నివేదికలో స్టాలిన్ మీద అనేక ఆరోపణలున్నాయి. స్టాలిన్ మూర్ఖుడనీ అహంభావి అనీ మొరటు మనిషి అనీ హంతక మనస్తత్వం కలవాడనీ అనుమానించే స్వభావం కలవాడనీ పిరికిపంద అనీ - ఇలా చాలా ఉంది. స్టాలిన్ పై దాడి ఈ రహస్య నివేదికలో మాత్రమే కాదు, కృశ్చేవ్ హయాంలోనూ, ఆ తరువాత కూడా కొనసాగింది, ఇంకా కొనసాగుతోంది.

గ్రోవర్ ఫర్ అనే అమెరికన్ ప్రొఫెసర్ కృశ్చేవ్ నివేదిక అబద్ధాల పుట్ట అనీ కృశ్చేవ్ తన నివేదికలో 60 అసత్యాలు చెప్పాడనీ చారిత్రక పత్రాల ఆధారంగా రుజువు చేస్తూ 2011లో 'కృశ్చేవ్ అసత్యాలు (Khruschev Lied)' అనే పుస్తకం ప్రచురించాడు. స్టాలిన్ మీద విమర్శలన్నింటికీ ఆ పుస్తకంలో సమాధానాలు చూడవచ్చు.

ఇక్కడ జర్మన్-రష్యా యుద్ధం గురించి స్టాలిన్ మీద చేసిన విమర్శను మాత్రమే పరిశీలించడం జరిగింది.

స్టాలిన్ మీద ఆరోపణలు - వాస్తవాలు

1. స్టాలిన్ దేశాన్ని యుద్ధానికి సన్నద్ధం చెయ్యలేదు. 1939-41ల మధ్య నిరాక్రమణ సంధి ఇచ్చిన వ్యవధిని సద్వినియోగం చెయ్యలేదు.

'....స్టాలిన్ ఈ విషాదమంతా (యుద్ధం) సోవియట్ యూనియన్ మీద జర్మనీ అకస్మాత్తు దాడి ఫలితం అని చెప్పాడు. కాని కామ్రేడ్స్, ఇది పూర్తిగా అసత్యం. హిట్లర్ అధికారంలోకి వచ్చిన రోజునే కమ్యూనిజాన్ని అంతం చెయ్యడానికి కంకణం కట్టుకున్నాడు....యుద్ధానికి ముందున్న చారిత్రక వాస్తవాలు పరిశీలిస్తే హిట్లర్ సోవియట్ యూనియన్ మీద యుద్ధం చెయ్యడానికి సిద్ధమవుతున్నాడని స్పష్టమవుతుంది.....మన పరిశ్రమలను సరియైన సమయంలో సైనిక అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేసి ఉంటే, మన సైన్యానికి అవసరమైనది సకాలంలో అందజేసి ఉంటే.....మన యుద్ధ నష్టాలుచాలా తక్కువగా ఉండేవి....మన సైన్యానికి తగిన ఆయుధాలు లేవు.....సోవియట్ సాంకేతిక నైపుణ్యం ఉత్తమ రకమైన టాంకులు, ఆర్టిలరీ యుద్ధానికి ముందే తయారు చేసింది. కాని ఈ ఆయుధాల ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగలేదు....' - కృశ్చేవ్ రహస్య నివేదిక.

అక్టోబరు విప్లవం నుండి స్టాలిన్ ఈ కొద్ది కాలంలోనూ ఎటువంటి పరిస్థితులలో ఏం సాధించినదీ పరిశీలిస్తే కాని ఈ ఆరోపణలోని అసత్యం స్పష్టంకాదు.

1917లో విప్లవానంతరం జరిగిన అంతర్యుద్ధంలోనూ, 14 పెట్టుబడిదారీ దేశాల దురాక్రణ యుద్ధ ఫలితంగానూ యుద్ధ కారణంగా వచ్చిన కరువు కాటకాలలోనూ, రష్యా 70 లక్షలమంది పౌరులను కోల్పోయింది. సోవియట్ పరిశ్రమలూ వ్యవసాయమూ పూర్తిగా అస్తవ్యస్తమయ్యాయి. 1921లో

Edit with WPS Office
యుద్ధ పరిశ్రమలను శూన్యం నుండి ప్రారంభించాల్సి వచ్చింది. 1924 నుండి 1928 వరకూ స్టాలిన్ నాయకత్వంలో రష్యన్ ఆర్థిక వ్యవస్థ నిలద్రొక్కుకుంది. 1928 నాటికి ఉక్కు, బొగ్గు, సిమెంటు మొదలైన వాటి ఉత్పత్తి గణనీయంగా పెరిగింది.

1928లో సోవియట్ యూనియన్ ను అతి వేగంగా ఆధునికం చెయ్యాలనే లక్ష్యంతో మొదటి పంచ వర్ష ప్రణాళికను వెయ్యడం జరిగింది. సోవియట్ పరిశ్రమలలోనూ వ్యవసాయంలోనూ సమూలంగా మార్పులు తీసుకు వచ్చే ప్రణాళిక ఇది. సోవియట్ యుద్ధ పరిశ్రమకు పునాది ఈ ప్రణాళికలోనే పడింది.

1931 ఫిబ్రవరి 4న సోషలిస్టు పరిశ్రమ నాయకులతో సమావేశంలో ప్రసంగిస్తూ, స్టాలిన్ రష్యా ఏ కారణం వలన అత్యంత వేగంగా పారిశ్రామిక దేశంగా రూపొందాలో వివరించాడు -

'....(సమూలంగా మార్పులు తీసుకువచ్చే చర్యలు)...తీసుకోవడంలో అలసత్వం చూపించడమంటే వెనుకబడడమే. రష్యా చరిత్ర ప్రత్యేకత ఏమిటంటే నిరంతరం ఇతర దేశాల దురాక్రణకు గురవుతుండడం. సైనికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా, పారిశ్రామికంగా, వ్యవసాయికంగా వెనుకబడినందువల్లనే రష్యా కష్టాలపాలయింది. బలహీనులనూ వెనుకబడ్డవారినీ దోచుకోవడమన్నది దోపిడీ దారుల సూత్రం. పెట్టుబడిదారీ విధానం యొక్క ఆటవిక న్యాయం....మన సోషలిస్టు మాతృదేశం విదేశీ ఆక్రమణకు గురయి స్వాతంత్ర్యం కోల్పోవాలని మీరు కోరుకుంటున్నారా? అలా కానట్లయితే మనం అతి తక్కువ కాలంలో బోల్షివిక్ దీక్షతో మన వెనుకబాటుతనాన్ని అంతం చెయ్యాలి. మరో దారి లేదు....మనం అభివృద్ధి చెందిన దేశాల కంటే ఏభై, వంద సంవత్సరాలు వెనుకబడి ఉన్నాం. ఈ అంతరాన్ని మనం ఒక దశాబ్దంలో అధిగమించాలి.....ఇది చెయ్యలేకపోతే శత్రవు మనల్ని నాశనం చేస్తాడు...' (Speech delivered at the First All-Union Conference of Leading Personnel of Socialist Industry, February 4, 1931).

సోవియట్ ప్రజలు స్టాలిన్ పిలుపును అందుకుని ప్రణాళికా లక్ష్యాలను ప్రణాళిక కాలం ముగియడానికి ముందే సాధించారు. ప్రధమ పంచవర్ష ప్రణాళికలో సాధించిన ప్రగతిని గురించి అన్నా లూయీ స్ట్రాంగ్ 'స్టాలిన్ యుగం' లో ఇలా రాసింది: '...చరిత్రలో ఇంతకు ముందెన్నడూ ఇంత ప్రగతి ఇంత వేగంగా జరుగలేదు'

1928-1940ల మధ్య 9,000 ఫాక్టరీలు నిర్మించబడ్డాయి. మొదటి పంచవర్ష ప్రణాళికలో యుద్ధ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వబడింది. 1930లో 740 టాంకులు ఉత్పత్తి అయితే 1938 నాటికి ఈ సంఖ్య 2271కు పెరిగింది. అదే కాలంలో విమానాల ఉత్పత్తి 860 నుంచి 5,500కు పెరిగింది. ఒక్క విమాన ఫాక్టరీ కూడా లేని స్థితి నుండి 1935-36 నాటికి సోవియట్ యూనియన్ 74 విమానాల ఫాక్టరీలను నిర్మించింది. సోవియట్ యూనియన్ ముందు చూపుతో తన పరిశ్రమలను యుద్ధానికీ శాంతికీ కూడా వినియోగపడేలా నిర్మించింది. ట్రాక్టర్ ఫాక్టరీలు అవసరమైతే ట్రాక్టర్లకు బదులు టాంకులు తయారు చెయ్యగలవు. ఎరువుల, రసాయన ఫాక్టరీలు యుద్ధకాలంలో మందుగుండు ఉత్పత్తికి అనుగుణంగా మారగలవు. అలాగే ట్రక్కు ఇంజిన్ ఫాక్టరీలు యుద్ధ కాలంలో విమానాల ఇంజిన్లు తయారు చెయ్యగలవు.

1939 సెప్టెంబరు తర్వాత ఒకటిన్నర, రెండు సంవత్సరాలలో కీలక ఆయుధాల ఉత్పత్తి, ముఖ్యంగా విమానాల ఉత్పత్తి, కనీసం రెట్టింపు చెయ్యడానికి పార్టీ, ప్రభుత్వం ప్రణాళికలు వేశాయి. 1942 ప్రారంభానికి సైన్యాన్ని పూర్తిగా పునర్నిర్మించడానికీ నూతన ఆయుధాలు సమకూర్చడానికీ జనరల్ స్టాఫ్ పధకాలు వేసింది.

జోసెఫ్ ఇ. డేవీస్ అమెరికా రాయవారిగా మాస్కోలో 1936 నుండి 1938 వరకూ ఉన్నారు. ఆయన మిషన్ టు మాస్కో అన్న పుస్తకం రాశారు. అందులో ఆయన అమెరికన్ ప్రభుత్వానికి పంపించిన ఉత్తరాలూ నోట్సూ రహస్య నివేదికలూ ఉన్నాయి. అవి చూస్తే కొన్ని వాస్తవాలు తెలుస్తాయి. స్టాలిన్ మీద నేడు వేస్తున్న నిందలు సత్యమో అసత్యమో నిర్ణయించుకోవడానికి పాఠకులకు అవకాశం లభిస్తుంది. అందుచేత ఆయన పుస్తకం నుండి సుదీర్ఘమైన కొటేషన్లు ఇస్తున్నాను. పాఠకులు మరొక విషయం కూడా గుర్తు పెట్టుకోవాలి. ఈయన కమ్యూనిస్టు అభిమాని కాదు, కమ్యూనిజాన్ని వ్యతిరేకిస్తున్న దేశ రాయబారి.

'.....1937లో ప్రభుత్వం రక్షణకు 23 బిలియన్ల రూబుళ్ళు ఖర్చు పెట్టింది. 1938లో 40 బిలియన్ల రూబుళ్ళు రక్షణకూ, అది కాక 25 బిలియన్ల రూబుళ్ళు యుద్ధ పరిశ్రమలకూ కేటాయించింది.

Edit with WPS Office
1939లో రక్షణ బడ్జెట్ 82 బిలియన్లు ఉండవచ్చు.....1940లో 105 బిలియన్లు....రష్యా తన రక్షణకు తీసుకుంటున్న బ్రహ్మాండమైన చర్యల గురించి బయటి ప్రపంచానికి తెలియదు. తెలిసినా దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోలేదు.....క్లుప్తంగా చెప్పాలంటే ఈ మూడు సంవత్సరాలలోనూ రక్షణ అవసరాలకోసం ప్రతీ సంవత్సరం 6 బిలియన్ల డాలర్లు కేటాయించింది. ఈ మొత్తం బ్రిటిష్ దీవుల ఆదాయం కంటే ఎక్కువ. అమెరికన్ ప్రభుత్వం పన్నులవలన పొందిన ఆదాయంతో సమానం.....' (Joseph E. Davies, Mission to Moscow, P. 298).

(యుద్ధం ప్రారంభమైన తర్వాత 1941 అక్టోబరు 15వ తేదీన రష్యా యుద్ధానికి ఎలా సంసిద్ధమైనదీ వివరిస్తూ ఆయన ఇలా రాశాడు) - '.... 1939లో ఛెలియాబిన్ స్క్ ట్రాక్టరు ప్లాంటు ఏడాదికి 15,000 ట్రాక్టర్లు ఉత్పత్తి చేసేది. 1936 నాటికి ఈ ప్రాంతంలోనే ఏడాదికి 10,000 టాంకులను ఉత్పత్తి చెయ్యగల అవకాశం ఉంది. గత మూడు సంవత్సరాలుగా ఈ ప్రాంతం రక్షణ దృష్ట్యా ఇంకా బాగా అభివృద్ధి చెందింది. 1938లో యురల్స్ ప్రాంతంలో మెషీన్ టూల్స్, ట్రాక్టర్లు, టాంకులు, విమానాలు మొదలైన వాటి ఉత్పత్తి సోవియట్ యూనియన్ ఉత్పత్తిలో 30 శాతం ఉంది. పశ్చిమాన సైనిక దాడి జరుగవచ్చునన్న ఉద్దేశంతో ఆ తరువాతి సంవత్సరాలలో ఈ ప్రాంత సైనిక, పారిశ్రామిక శక్తిని బ్రహ్మాండంగా పెంచడం జరిగింది. ప్రభుత్వం నుంచి సరియైన సమాచారం లేకపోయినా ఇక్కడ సైన్యం విమానాల ఫాక్టరీలను విరివిగా ఏర్పాటు చేసిందని భావిస్తున్నారు....' (ibid., P. 314)

1938-40ల మధ్య యుద్ధ పరిశ్రమల ఉత్పత్తి 39 శాతం పెరిగింది. 1939-41ల మధ్య సైన్యానికి ఎటువంటి సహాయం అందిందో మార్షల్ ఝుకోవ్ వివరించాడు:

'...1939 జనవరి 1 నుంచి 1941 జూన్ 22 దాకా సైన్యానికి 92,578 ఫిరంగులు అందాయి. కొత్త మోర్టార్లు, 82 mm, 120 mm ఫిరంగులు కొత్తగా ప్రవేశ పెట్టబడ్డాయి (G. Zhukov, Reminiscences and Reflections, Vol. I, P.236). వైమానిక దళాలకు 17,745 ఫైటరు విమానాలు సరఫరా చెయ్యబడ్డాయి. వాటిలో కొత్త మాడల్స్ 3,719 ఉన్నాయి. (ibid, P. 240). 1939-41ల మధ్య తీసుకున్న చర్యల వలన యుద్ధకాలంలో విమానాల ఉత్పత్తి, నాణ్యతలోనూ, సంఖ్యలోనూ గణనీయంగా పెంచడానికి అవకాశం ఏర్పడింది.....ఎర్ర సైన్యానికి 7,000 టాంకులు అందాయి. 1940లో టి-34 టాంకుల ఉత్పత్తి ప్రారంభమైంది. యుద్ధ ప్రారంభానికి 1851 టాంకులు నిర్మించబడ్డాయి (ibid., p. 235). 1940లో నావికా దళాల్లో 11 నెలలోనూ 100 డిస్ట్రాయర్లూ జలాంతార్గాములూ టార్పిడో బోట్లూ మైన్ స్వీపర్లూ నిర్మించబడ్డాయి. 270 వివిధ రకాల ఓడలూ నూతన నావికా స్థావరాలూ నిర్మాణంలో ఉన్నాయి.....1939 నుండి 1941 వరకూ సైనిక బలగాలు 180 శాతం పెరిగాయి (ibid., p. 244).

జూన్ 23 1941 (యుద్ధ ప్రారంభమైన రెండో రోజు) జోసెఫ్ ఇ. డేవీస్: '....1938లో ....స్టాలిన్ రెండో ప్రపంచ యుద్ధం అనివార్యమవుతున్నదని హెచ్చరించాడు....హిట్లర్, ముస్సోలినీల దురాక్రమణ విధానాన్నీ, దాని లక్ష్యాన్నీ సోవియట్ నాయకులు స్పష్టంగా గమనించారు.....మ్యూనిచ్ ఒడంబడిక తర్వాత రష్యా రక్షణకు తన కాళ్ళ మీద తాను నిలబడాలనీ బయటనుంచి ఏ సహాయం అందదనీ గుర్తించింది. ఆ కారణాల వలన టాంకులు, విమానాలు, యుద్ధ పరికరాలూ ఉత్పత్తి చెయ్యడానికి నూతన కర్మాగారాలు నిర్మించడానికీ, ఉన్నవాటిని విస్తృత పరచడానికీ ప్రణాళికలు వేసింది. అందుకోసం అపారమైన నిధులు కేటాయించింది. ఈ కర్మాగారాలు డాన్ బేసిన్ లోనే కాదు. దేశం లోతట్టు భాగాల్లో కూడా నిర్మించబడ్డాయి...' అని తను రష్యాలో ఉన్న కాలంలో చూసిన దానిని గురించి చెప్పాడు. (Joseph E. Davies, Mission to Moscow, P. 299).

'ఏప్రిల్ 1, 1938: .....రష్యన్ ప్రభుత్వం ప్రపంచం మీద ఫాసిస్టు శాంతి రుద్దబడుతోందని భావిస్తోంది....చివరకు ఇంగ్లండు తప్ప యూరోపు అంతా ఫాసిస్టు పాలన క్రిందకు వస్తుందని భావిస్తోంది.... సోవియట్ రష్యా ఎవరిమీదా ఆధారపడకూడదనీ, బయటనుంచి ఏ సహాయం అందదనీ, స్వయంసమృద్ధంగా ఉండాలనీ భావిస్తోంది (ibid. P. 181).....క్రిందటి సంవత్సరం ఆదాయంలో నాల్గవ వంతు యుద్ధ అవసరాలకు వినియోగించడం జరిగింది. యుద్ధ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది....యుద్ధానికి సంబంధించిన పరిశ్రమలన్నీ సైన్యం కంట్రోలులోకీ పర్యవేక్షణలోకీ వచ్చాయి....' (ibid., p. 183).

జర్మనీ నుండే కాక, తూర్పున జపాన్ నుండి కూడా సోవియట్ యూనియన్ యుద్ధ ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఈ రెండు దేశాలూ ఒకే సారి దాడి చేసినట్లయితే రష్యా రెండు ముక్కలుగా -

Edit with WPS Office
యూరోపియన్ రష్యా, ఏషియన్ రష్యాలుగా - తెగిపోవచ్చు. ఈ రెండు ముక్కల మధ్యా సంబంధాలు తెగిపోవచ్చు. ఒకదానికొకటి సహాయం అందించుకోగల స్థితిలో ఉండకపోవచ్చు. ఆ ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని జపాన్ దాడిని ఎదుర్కోవడానికి స్వయంసమృద్ధమైన 5 లక్షల సైన్యాన్ని తూరుపు వైపున ఉంచాడు స్టాలిన్. ఆ విషయం గురించి రాస్తూ, జోసెఫ్ ఇ. డేవిస్ -

'.....జపాన్ మీద ఆమీర్ నది పరిసర యుద్ధంలో ఎర్ర సైన్యం విజయం సాధించడం ఎర్ర సైన్యంలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించింది. పశ్చిమాన జర్మనీ నుండీ తూర్పున జపాన్ నుండీ దాడి ప్రమాదాన్ని రష్యన్ ప్రభుత్వం ఎప్పుడూ మరచిపోలేదు. తూర్పు, పడమరలనుంచి ఎదురవుతున్న ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి పశ్చిమానా, తూర్పునా రెండు స్వయంసమృద్ధమైన సైన్యాలను రష్యా సిద్ధం చేసింది. ఈ రెండు సైన్యాలూ ఒకదాని నుంచి మరొకటి ఎటువంటి సహాయమూ ఆశించకుండా స్వతంత్రంగా పోరాడగలవు. తూర్పున 4 లక్షలమంది సైనికులతో ప్రత్యేక ఎర్ర జెండా సైన్యం ఉంది. ఈ సైన్యానికి రెండు సంవత్సరాలకు సరిపడా మందుగుండు, తదితర ఆయుధాల నిలువ ఉంది. సోవియట్ సైన్యంలో అధిక భాగం పశ్చిమ సరిహద్దుల్లో కేంద్రీకరించబడింది....' అని రాశాడు (ibid. P. 296).

'మార్చి 11, 1939: ...మాస్కో రేడియో నిన్న 18వ పార్టీ కాంగ్రెసులో విదేశాంగ విధానం మీద స్టాలిన్ ప్రసంగాన్ని ప్రసారం చేసింది. దురాక్రమణదారుల పట్ల బ్రిటన్, ఫ్రాన్స్ లు అవలంబిస్తున్న అవాస్తవిక విధానాలతో సోవియట్ యూనియన్ విసిగిపోయిందన్న హెచ్చరిక ఈ ప్రసంగంలో ఇమిడి ఉంది. (స్టాలిన్) ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాలు నియంతలకు ఒక రాయితీ తర్వాత మరొక రాయితీ ఇస్తూ వారి ముందు తిరోగమిస్తున్నాయన్నాడు. బందిపోటు దొంగలకు వ్యతిరేకంగా సమిష్టి రక్షణ విధానాన్ని వారు పూర్తిగా వదిలేశారని అన్నాడు. ఈ రెండు దేశాలూ వారి స్వప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జర్మనీని రష్యా మీద దాడి చెయ్యమని రెచ్చగొడుతున్నాయన్నాడు....ఫ్రాన్స్, బ్రిటన్ లు ఆస్ట్రియాను జర్మనీకి అప్పగించాయి. జకోస్లోవేకియాకు ఇచ్చిన హామీలను అతిక్రమించాయి. సోవియట్ యూనియన్ లో అరాచక పరిస్థితి ఉందనీ సైన్యం బలహీనంగా ఉందనీ ప్రచారం చేస్తున్నాయి. రష్యాని జర్మనీ తేలికగా ఓడించగలదనే అభిప్రాయం జర్మనీలో కలిగించడానికి ఇటువంటి ప్రచారం చేస్తున్నాయి.....' (ibid. P. 266).

సైనిక శక్తిని ఒక రోజులోనో, నెలలోనో, సంవత్సరంలోనే అభివృద్ధి చెయ్యడం సాధ్యం కాదు. దానికి సుదీర్ఘ ప్రణాళిక కావాలి. రానున్న ప్రమాదాన్ని ముందుగా గుర్తించి తగిన చర్యలు తీసుకోగల ముందు చూపుగల నాయకత్వం కావాలి. ఆ నాయకత్వం ముందుచూపుతో రక్షణకు అవసరమైన మౌలిక భారీ పరిశ్రమలను - ఉక్కు, బొగ్గు, ట్రాక్టర్లు, చమురు, విమానాలు, టాంకులు, గన్నుల ఫాక్టరీలు - నిర్మించాలి. దాడి జరిగిన పక్షంలో ప్రజలందరినీ సాయుధులను చేసి పోరాడగల వ్యూహం కావాలి. స్టాలిన్ ఈ విషయంలో ఏం చేశాడో చూద్దాం.

జూన్ 23, 1941 (యుద్ధం ప్రారంభమైన తర్వాత రెండో రోజు).....

'.....డిన్నరు తర్వాత మేము ప్రెసిడెంటు ఇంటిలో ప్రవేశించబోతుంటే ఒక యువకుడు లాన్ లోంచి పరిగెత్తుకుంటూ వచ్చి మమ్మల్ని ఆపాడు. అతను యునైటెడ్ ప్రెస్ విలేఖరి. హిట్లర్ రష్యా మీద దాడి చేసినట్లు విస్మయం కలిగించే వార్త చెప్పాడు. ఆ వార్త వినగానే బాంబు పేలినట్లుగా అనిపించింది. అతను నా అభిప్రాయం అడిగాడు. ఎర్ర సైన్యం ప్రతిఘటన తీవ్రత ప్రపంచాన్ని విభ్రాంతిలో ముంచెత్తుతుందని చెప్పాను. హిట్లర్ యుక్రెయిన్ లో గణనీయమైన ప్రాంతాన్ని ఆక్రమించగలిగినా తర్వాత అతని కష్టాలు ప్రారంభమవుతాయని చెప్పాను.....ఈ ప్రకటన అన్ని పత్రికలలోనూ వచ్చింది. నా అభిప్రాయం అందరి మిలిటరీ నిపుణుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా ఉంది. కాని నా అభిప్రాయం ఊహాగానాల మీద ఆధారపడిలేదు. నేను రష్యాలో స్వయంగా చూసిన దాన్ని బట్టి చెబుతున్నాను.....' (ibid. P. 292)

సోవియట్ సైన్యం విపరీతంగా నష్టపోతున్నా ఊహించని విధంగా అసంఖ్యాకమైన సోవియట్ డివిజన్లు యుద్ధరంగంలో ప్రవేశించడం గురించి జర్మన్ జనరల్స్ ఆశ్చర్యం ప్రకటించారు. ఈ డివిజన్లు గాలిలోంచి హఠాత్తుగా పుట్టుకు రాలేదు. దీని వెనుక ముందు చూపు గల నాయకత్వం వేసిన సుదీర్ఘమైన ప్రణాళిక ఉంది. సోవియట్ ప్రభుత్వం మానవ వనరులను యుద్ధావసరాలకు ఎలా సంసిద్ధం చేసినదీ జోసఫ్ ఇ. డేవీస్ ఇలా వివరిచాడు:

'....సోవియట్ ప్రభుత్వం యువకులకు మిలిటరీ శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేక శ్రద్ధ

Edit with WPS Office
తీసుకుంది.....బాలబాలికలు ఆరేళ్ళ వయసులో అక్టోబరిస్టు సంస్థలో చేరుతారు. 12-16 సంవత్సరాల వయసులో యువ పయనీర్ సంస్థలోకి వెడతారు. 14-24 సంవత్సరాల వయసులో కామ్సోమాల్స్ (యువ కమ్యూనిస్టు లీగ్)లో చేరుతారు. ఖార్కోవ్ లో నేను యువ పయనీర్ క్లబ్బు చూశాను. ఆ క్లబ్బులకు అనుబంధంగా సాంకేతిక నిపుణల పర్యవేక్షణలో నడిచే ప్రయోగ శాలలున్నాయి. ఈ ప్రయోగ శాలల్లో పిల్లలు విమానాలు, టాంకులు, రైలింజనులు, రైలు మార్గాలు చిన్న చిన్న మాడల్సు నిర్మించడం నేర్చుకుంటున్నారు. పిల్లల ఈ కార్యక్రమాలలో సైనికాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.
16-24 సవత్సరాల కామ్సోమాల్స్ ల పట్ల సైన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. వారికి మిలిటరీ శిక్షణ, శారీరక శిక్షణ, తుపాకీ గురిపెట్టి కాల్చడం, పేరాషూట్ లతో దూకడం, గ్లైడర్ ప్రాక్టీసు లాంటివి ఇస్తారు. ప్రతీ సంవత్సరం 15 లక్షలమంది యువ సైనికులు 20 సంవత్సరాల వయసులో సైన్యంలో చేరుతారు.....

.....సోవియట్ వైమానిక బలం గురించి ఒక విషయం నా మీద చాలా ముద్ర వేసింది. సోవియట్ ప్రజలకు విమానాలంటే ఆసక్తి. సోవియట్ యూనియన్ లో చెప్పుకోదగ్గ నగరాలన్నింటిలోనూ ఒక విశ్రాంతి పార్కు ఉంటుంది. ఆటపాటలకు తోడు ఈ పార్కులో పేరాషూట్ జంపుకు ఒక గోపురం ఉంటుంది. సెలవుదినాల్లో ఈ గోపురాలు పేరాషూట్ జంప్ చెయ్యడానికి ఉత్సాహంతో వచ్చిన యువకులతో నిండి ఉంటాయి. దాదాపు 10 లక్షలమంది 2000 అడుగుల ఎత్తునుంచి విమానం నుండి మూడుసార్లు పేరాషూట్ జంప్ చేసి ప్రభుత్వాన్నుంచి గుర్తింపు పొందారు....1939లో సైన్యానికి సంబంధించిన 63 ఆఫీసర్ల ట్రెయినింగ్ సంస్థలనుండి వేలమంది శిక్షణ పొంది సైన్యంలో లెఫ్టినెంటుగా చేరడానికి అర్హత పొందారు. 32 విమాన ఇంజినీరింగ్ సంస్థల నుండి వైమానిక శాఖకు చెందిన నిపుణులూ సిబ్బందీ శిక్షణ పొందుతున్నారు.....ఇవి కాక 14 మిలిటరీ యూనివర్సిటీలు, ఎకాడమీలు పై కమాండు కోసం పట్టభద్రులకు శిక్షణ ఇస్తున్నాయి. వీటిలో సాయంకాలం తరగతులు కూడా ఉన్నాయి. వాటిలో 15000 కమాండర్లూ, ఇతర ఉన్నత ఆఫీసర్లూ శిక్షణ పొందుతున్నారు.....1937-38 ప్రాంతాలలో సైన్యంలో జారిస్టు ఆఫీసర్ల సంఖ్య బాగా తగ్గిపోయింది. యువ ఆఫీసర్లూ, మిలిటరీ స్కూల్స్ నుంచి వచ్చిన పట్టభద్రులూ వారి స్థానంలోకి వచ్చారు. 1937 నాటి ఎర్ర సైన్యం ఆఫీసరు తన విభాగంలో సుశిక్షణ పొందడమే కాకుండా, ఉన్నత సైనిక సంస్థల నుంచీ ఎకాడమీల నుంచీ, జనరల్ విధికీ, జనరల్ స్టాఫ్ డ్యూటీలకూ శిక్షణ పొందిన వాడు. చిన్న చిన్న సైనిక దళాలను కమాండు చెయ్యడానికి గొప్ప అర్హతలుగలవాడు. ఉన్నత కమాండుకు అతని అర్హతలు ఎటువంటివో ఇంకా నిర్ణయించబడవలసి ఉంది.

తన విజయం సైన్యం యొక్క సహకారం మీదా విశ్వాసం మీదా ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని ప్రభుత్వం ఎప్పుడూ మరచిపోలేదు....ఈ సైనిక స్కూళ్ళలో 60 శాతం కాలం సైనిక శిక్షణకూ 40 శాతం కాలం కమ్యూనిజాన్ని అధ్యయనం చెయ్యడానికీ వినియోగిస్తున్నారు. సైనికుడి సగటు వయసు 30 సంవత్సరాలకు మించదు. అంటే 1917 విప్లవం నాటికి అతను 7 సంవత్సరాల వాడై ఉంటాడు. పసితనం నుండీ కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్లా, సోవియట్ రష్యా గొప్ప తనం గురించీ, బోల్షివిక్ గా అతని కర్తవ్యం గురించీ, యువకుల్లో నిరంతరం ప్రచారం జరుగుతోంది....పత్రికలు, నాటకాలు, సినిమాలు, పాఠశాలలు, పుస్తకాలూ - అన్నీ కూడా విదేశీ దురాక్రమణ ప్రమాదం గురించీ, మాతృదేశాన్ని రక్షించుకోవలసిన అవసరం గురించీ, కమ్యూనిజం గురించీ, ప్రస్తుత ప్రభుత్వానికి విధేయంగా ఉండడం గురించీ నిరంతరం ప్రచారం చేస్తుంటాయి. నిస్సందేహంగా ప్రభుత్వం తన పట్ల ఎర్ర సైన్య విశ్వాసాన్ని మరింత బలపరచడానికి కృషి చేస్తోంది.

.....1937-38 సంవత్సరాలలో.....సోవియట్ యూనియన్ కు ఏర్పడుతున్న ప్రమాదం గురించి ప్రభుత్వం భయపడుతున్నది. రక్షణకు సంబంధించి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు కనుపిస్తోంది..... విద్రోహ నిర్మూలనం తర్వాత కేంద్రీకృత నియంత్రణలో ఉండేలా సైన్యమంతా పునర్వ్యవస్థీకరించబడింది..... మ్యూనిచ్ కి ముందూ తర్వాతా కూడా శత్రు ప్రమాదం ఉందని భావించబడిన ప్రాంతాలలో (పశ్చిమ) సరిహద్దులు బలపరచబడ్డాయి. లోతట్టు ప్రాంతాలలో రక్షణ బలపరచబడింది. బంకర్లు నిర్మించబడుతున్నాయి.....టాంకులు, టాంకు యూనిట్ల సంఖ్య పెంచబడింది.....' - (ibid. P. 293-297).

'.....పశ్చిమ సరిహద్దుల్లో రక్షణ రంగాలను బలపరిచే నిర్మాణాలు 1940లో ప్రారంభమయ్యాయి. యుద్ధ ప్రారంభ సమయానికి 2,500 సిమెంటు కట్టడాలు నిర్మించబడ్డాయి. ప్రతీ రోజూ ఈ కట్టడాల

Edit with WPS Office
మీద 1,40,000 మంది పని చేసే వారు. స్టాలిన్ మమ్మల్ని పని త్వరగా పూర్తి చెయ్యమని ఒత్తిడి తీసుకు వచ్చేవాడు' అన్నాడు ఝుకోవ్. (Another view of Stalin, p. 121).

'.....1941 ఫిబ్రవరి 15-20లలో 18వ పార్టీ కాంగ్రెసు సమావేశకాలమంతా పరిశ్రమలనూ రవాణానూ యుద్ధావసరాలకు సిద్ధం చెయ్యడాన్ని గురించి వినియోగించబడింది. సోవియట్ యూనియన్ అంతటి నుండీ వచ్చిన ప్రతినిధులు కేంద్ర కమిటీకి సైనిక సభ్యులను అదనంగా ఎన్నుకున్నారు.....'- (Another view of Stalin, p. 121).

1941 మార్చ్ ప్రారంభంలో టిమోషెంకో, ఝుకోవ్ లు పదాతిదళ రిజర్విస్టులకు పిలుపునివ్వాలని స్టాలిన్ ను కోరారు. కాని స్టాలిన్ అందుకు అంగీకరించలేదు. రిజర్విస్టులను సమీకరించడానికి ఆదేశాలిస్తే జర్మనీ అది యుద్ధ చర్యగా భావించి యుద్ధాన్ని ప్రేరేపించవచ్చని అతను మొదట భావించినా, మార్చి అంతానికి 8 లక్షల రిజర్వు సైన్యాలను సమీకరించి సరిహద్దుకు పంపడం జరిగింది.

'....ఏప్రిల్ లో బాల్టిక్, బెలో రష్యా, కీవ్, ఒడెస్సా సైనిక ప్రాంతాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ లు జర్మన్ దాడిని ఎదుర్కోవడానికి తమ దగ్గర తగినంత సైనిక బలగం లేదని తెలియజేశారు....స్టాలిన్ 28 సరిహద్దు డివిజన్లను నాలుగు సైన్యాలుగా ఏర్పరిచి తరలించాడు.....నాజీలను రెచ్చగొట్టకూడదని హెచ్చరించాడు.....' - (ibid., p. 121).

ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ఎర్ర సైన్యం అనేక రంగాలలో బలహీనంగా ఉంది. ఇటువంటి బలహీనతలను సైనికాధికారులు మార్షల్ టిమోషెంకో దృష్టికి తీసుకువచ్చినప్పుడు '....మీరు చెప్పిన దానితో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఈ బలహీనతలన్నింటినీ వెంటనే అధిగమించడం సాధ్యపడుతుందని నేను అనుకోవడం లేదు. నేను నిన్న స్టాలిన్ ను కలిశాను. పావ్లోవ్ కేబుల్ (పశ్చిమ రంగంలో వెంటనే రోడ్లూ రవాణా బలపరచాలంటూ పశ్చిమ మిలిటరీ జిల్లా కమాండు పావ్లోవ్ పంపిన సందేశం) స్టాలిన్ కు అందింది. పావ్లోవ్ డిమాండ్లన్నీ న్యాయమైనవే అయినా అవి తీర్చగలిగే స్థితిలో మేము లేము అని చెప్పమన్నాడు....' అన్నాడు. (G. Zhukov, Reminiscences and Reflections, Vol. I, p. 240).

మార్షల్ ఝుకోవ్ మాటల్లో చెప్పాలంటే - '.....అన్నింటినీ సరియైన పద్ధతిలో తీర్చిదిద్దడానికి చరిత్ర మాకు అతి తక్కువ శాంతి కాలాన్ని ప్రసాదించింది. మేము అనేక విషయాల్లో సరిగానే ప్రారంభించాం. చాలా విషయాల్లో ప్రారంభించిన పని పూర్తి చెయ్యడానికి తగిన వ్యవధి లేకపోయింది. నాజీ జర్మనీ ఎప్పుడు దాడి చేస్తుంది అనే విషయం మాకు తెలియకపోవడం వలన అనేక కష్టాలకు గురయ్యాం. శత్రువు దాడిని ఎదుర్కోవడంలో జరిగిన అనేక పొరపాట్లకు మూల కారణం అది. (కాని) నేను చెప్పిన అనుకూల పరిస్థితులు కాలంతో పాటు మనకు మరింత అనుకూలంగానూ శక్తివంతంగానూ పరిణమించాయి. (సరియైన పద్ధతుల్లో వేసిన పునాదులే).... అంతిమ విజయంలో మనకు తోడ్పడ్డాయి. ప్రతికూలమైన విషయం - శత్రువు ఎప్పుడు దాడి చేస్తాడు అనేది గ్రహించలేకపోవడం - కాలంతో పాటు దాని వినాశకర శక్తిని కోల్పోయింది.....1940లో పార్టీ, ప్రభుత్వమూ దేశ రక్షణను బలపరచడానికి అనేక చర్యలు తీసుకున్నాయి. కాని దేశ ఆర్థిక పరిస్థితి అంత తక్కువ వ్యవధిలో ఈ చర్యలన్నింటినీ అమలు జరుపడానికి అవకాశం ఇవ్వలేదు. నూతన ఆయుధాలను సమకూర్చుకుంటూ, నూతన శిక్షణ పొందుతూ, రిజర్వులను ఏర్పాటు చేసుకుంటూ మన సైన్యం పునర్వవస్థీకరణలో ఉండగా యుద్ధం హఠాత్తుగా మన మీద పడింది.....' - (G. Zhukov, Reminiscences and Reflections, Vol. I, p. 271).

యుద్ధానికి సైనికంగానే కాదు, రాజకీయంగా సిద్ధం కావడం కూడా అతి ముఖ్యం అంటుండే వాడు స్టాలిన్. రాజకీయంగా స్టాలిన్ దేశాన్ని సరియైన పద్ధతుల్లోనే యుద్ధానికి సిద్ధం చేశాడు. ఎర్ర సైన్యాన్ని 1942 కల్లా అధునాతన సైన్యంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు వేశాడు. కాని దురదృష్ట వశాత్తూ యుద్ధం సంవత్సరం ముందే హఠాత్తుగా ప్రారంభమైంది. పోలెండు, ఫ్రాన్స్, పెరల్ హార్బర్ లో అమెరికా - ఏవీ కూడా శత్రువు హఠాత్తుగా మెరుపు దాడి చేసినప్పుడు తమను తాము రక్షించుకోలేక విపరీతమైన నష్టాలు పొందాయన్న సంగతి మరచిపోకూడదు. జర్మన్ సైన్యం అనేక యుద్ధాలలో తన వ్యూహాన్ని, ఎత్తుగడలను పరీక్షించి రాటు దేలిన సైన్యం. అత్యంత అధునాతనమైనది. స్టాలిన్ సరియైన చర్యలు సకాలంలో తీసుకుని రక్షణను బలపరిచినట్లయితే రష్యా స్వల్ప నష్టాలతో జర్మన్ దాడి తిప్పికొట్టగలిగేదంటూ భయంకరమైన ఆ నష్టాలకు స్టాలిన్ ను బాధ్యుడిని చెయ్యడం

Edit with WPS Office
దురుద్దేశంతో కూడిన చర్య.

2. జర్మన్ మెరుపుదాడిని బూర్జువా సిద్ధాంతంగా కొట్టి పడెయ్యడం జరిగింది. సోవియట్ వ్యూహం ఎదురుదాడి మీదే కేంద్రీకరించింది కాని దేశంలో విశాలమైన భూభాగాలను శత్రువు ఆక్రమించగలడన్న విషయాన్ని పరిగణలోకి తీసుకోలేదు.

1939లో ప్రచురింపబడిన డ్రాఫ్ట్ ఫీల్డ్ రెగ్యులేషన్స్ గురించి ప్రస్తావిస్తూ - '.....మెరుపుదాడి అనేది బూర్జువా సిద్ధాంతంగా కొట్టి వేయబడింది. సోవియట్ సైనిక వ్యూహం సోవియట్ యూనియన్ మీద శత్రువు దాడి చేసినట్లయితే శత్రువును అతని దేశంలోనే అంతమొందించడం అనే ఎత్తుగడ మీద ఆధారపడి ఉంది....తిరోగమనం అనేది ఒక రంగంలో అక్కడక్కడ జరుగవచ్చు కాని పెద్ద ఎత్తున యుద్ధరంగమంతా తిరోగమనం జరుగవచ్చుననీ, పెద్ద పెద్ద సైన్యాలు చుట్టుముట్టబడవచ్చుననే విషయాన్ని పరిగణలోకి తీసుకోలేదు...' - కృశ్చేవ్ కాలంలో ప్రచురింపబడిన హిస్టరీ ఆఫ్ వార్.

'....యుద్ధం మొదలవబోతుంటే సోవియట్ యూనియన్ మీద దాడి చేసే శత్రువును తేలికగా ఓడించవచ్చుననే ధోరణి చాలా హాని కలిగించింది. If war comes tomorrow లాంటి సినిమాలు.....సైన్యం పత్రికల్లో కూడా ఇటువంటి ప్రచారం జరిగింది....' - హిస్టరీ ఆఫ్ వార్.

భవిష్యత్తులో ఏ యుద్ధం ఎవరితో ఎలా జరుగుతుందో ఎవరూ ఊహించలేరు కాని ప్రపంచ పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తున్న స్టాలిన్, జర్మన్ ప్రమాదాన్నీ పెరుగుతున్న దాని సైనిక శక్తినీ అర్థం చేసుకున్నాడు. యూరోపునంతా ఆక్రమించి అత్యంత శక్తివంతంగా జర్మనీ తయారైన పరిస్థితులలో, జర్మనీని సరిహద్దులలో నిలువరించడం అసాధ్యమనీ, అది యుద్ధంలో రష్యాలో భూభాగాలను ఆక్రమించగలదనీ ఊహించాడు.

జోసెఫ్ ఇ. డేవీస్ డైరీ, జూన్ 23, 1941: '.....1937లో (రష్యన్ మిలిటరీ పెరేడ్ లో) 6000 మంది సివిలియన్లు తుపాకులతో నడవడం చూశాను. వారు మామూలు దుస్తులు ధరించారు. మెరుపుదాడిని ఎదుర్కోవడానికి సోవియట్ వ్యూహవేత్తలు లోతట్టు రక్షణ (Defence in depth) వ్యూహాన్ని రూపొందించారు. శత్రువును లోనికి రానిచ్చి, పొడుగవుతున్న అతని సరఫరా మార్గాల మీద దాడి చేస్తూ వేధించడానికి ఇప్పుడు జర్మన్ల మీద ఎర్ర సైన్యం ఉపయోగిస్తున్న గెరిల్లా దళాల శకలాలు అవి. జర్మనీ యుద్ధంలో పశ్చిమ రష్యాను ఆక్రమించగలదనీ ఈ గెరిల్లా దళాలు శత్రు ఆక్రమిత ప్రాంతాలలో ముందుకు చొచ్చుకు వచ్చిన జర్మన్ సైనిక శ్రేణులను వెనుకనుండి వేధించి నష్టపరచాలని 1937లోనే రష్యన్లు ఆలోచించడం గమనించతగ్గది.....' అని రాశాడు (Joseph E. Davies, Mission to Moscow, p. 293).

1939 మే-ఆగస్టులలో జపాన్ తోనూ, డిసెంబరు 1939-మార్చి 1940లలో ఫిన్లాండుతోనూ యుద్ధాలు జరిగిన తర్వాత ఈ యుద్ధానుభవాన్ని జాగ్రత్తగా విశ్లేషించడం జరిగింది. 1940 మార్చిలో కేంద్ర కమిటీ సమావేశంలో ఫిన్లాండు యుద్ధ సమీక్ష తీవ్ర చర్చలకు దారి తీసింది. సైన్యానికి శిక్షణను సరియైన పద్ధతుల్లో ఇవ్వడం లేదని విమర్శించడం జరిగింది.

1940 డిసెంబరు 23 నుంచి 1941 జనవరి 13 వరకూ ఒక పెద్ద సైనిక సమావేశం జరిగింది. అందులో ప్రముఖ సైనికాధికారులందరూ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానాంశం జర్మనీతో యుద్ధం ఎలా జరుగుతుందనేది. పెద్ద టాంకు సైన్యాలను ప్రయోగించడంలో జర్మనీ గడించిన అనుభవాన్ని అధ్యయనం చెయ్యడం జరిగింది. సమావేశానంతరం మేప్ మీద వ్యూహానికి సంబంధించిన అభ్యాసం జరిగింది. అప్పుడు స్టాలిన్ కూడా ఉన్నాడు.

'.....ఈ చర్చల్లో పాల్గొన్న వారూ, చర్చలను సమీక్షించిన పీపుల్స్ కమిస్సార్ ఫర్ డిఫెన్స్ - అందరూ ఏక గ్రీవంగా అంగీకరించిన విషయమేమిటంటే నాజీ జర్మనీ సోవియట్ యూనియన్ మీద దాడి చేసిన పక్షంలో మనం పశ్చిమ రంగంలో అత్యంత శక్తివంతమైన శత్రువుతో పోరాడవలసి ఉంటుంది. జర్మనీకి అనేక కవచ శకటాల డివిజన్లు, మెకనైజ్డ్ డివిజన్లూ ఉన్నాయనీ, అత్యంత శక్తివంతమైన వైమానిక బలగం ఉందనీ, (జర్మన్) జనరల్స్ ఆధునిక యుద్ధ నిర్వహణలో చాలా అనుభవం గడించారనీ ఈ సమావేశం నొక్కి చెప్పింది....' - (G. Zhukov, Reminiscences and

Edit with WPS Office
Reflections, Vol. I, p. 220).

'పశ్చిమ సరిహద్దులో జర్మనీ సోవియట్ యూనియన్ పై దాడి చేస్తే ఏం జరుగుతుంది అనే దాని మీద ఈ అభ్యాసం జరిగింది.....' - (ibid., p. 221).

ఈ అభ్యాసంలో మార్షల్ ఝుకోవ్ జర్మన్ సైన్యాలకు నాయకత్వం వహించగా, జనరల్ పావ్లోవ్ సోవియట్ ప్రతిఘటనకు నాయకత్వం వహించాడు.

'....ఈ అభ్యాసంలో తూరుపు సైన్యం (సోవియట్ సైన్యం) ప్రమాదక పరిస్థితిలో పడింది. ఈ అభ్యాసంలో సోవియట్ సైన్యం ఎదుర్కొన్న పరిస్థితి లాంటిదే 1941 జూన్ లో ఫాసిస్టు జర్మనీ దాడి చేసినప్పుడు ఏర్పడింది. పావ్లోవ్ (సోవియట్ పక్షం) ఓడిపోయాడు.

'.....ఒక జిల్లా కమాండు చేస్తున్న ఆఫీసరు యుద్ధ తంత్రంలో నిపుణుడై ఉండాలి. ఎటువంటి పరిస్థితులలోనైనా సరియైన పరిష్కారాలు కనుగొనాలి. అలా పరిష్కారాలు వెతకడంలో విఫలమైనందువలనే నువ్వు ఈ అభ్యాసంలో ఓడిపోయావు....' అని స్టాలిన్ అతన్ని తీవ్రంగా మందలించాడు (ibid., p. 223).

స్టాలిన్ చెప్పిన ఈ మాటలు గుర్తు పెట్టుకోదగ్గవి. ఎంత గొప్ప యుద్ధతంత్రమైనా శత్రువుతో మొట్టమొదట తలపడగానే తలక్రిందులవుతుందన్నాడు క్లాష్ విజ్ అనే యుద్ధతంత్ర నిపుణుడు. శత్రువు నువ్వు ఊహించని విధంగా, ఊహించని ఎత్తుగడలతో దాడి చెయ్యవచ్చు. ఎంతో జాగ్రత్తగా నువ్వు వేసిన వ్యూహం తలకిందులు కావచ్చు. నిపుణుడైన కమాండరు దానికి సిద్ధంగా ఉండాలి. అనుకోనిది తటస్థించినప్పుడు సరియైన పరిష్కారాలు చూడగలగాలి.

జర్మనీ మెరుపుదాడి పరిణామాలన్నింటినీ స్టాలిన్ కాని, రష్యన్ సైన్యం కాని ఊహించలేకపోయి ఉండవచ్చు. వాళ్ళు మెరుపుదాడిని ఎదుర్కోవడానికి వేసిన ప్రణాళికలు అనేక కారణాల వలన తలక్రిందులయి ఉండొచ్చు. కాని ఒకసారి పరిస్థితి అవగాహనలోకి వచ్చిన తర్వాత స్టాలిన్ త్వరగా మెరుపుదాడిని ఎదుర్కొనే వ్యూహాన్ని రూపొందించాడు. ఎదుర్కోవడంలో సఫలమయ్యాడు. అది అతని నిపుణతను,చాతుర్యాన్ని సూచిస్తుంది.

శిక్షణ విషయంలో జరిగిన లోపాల గురించి చెబుతూ మార్షల్ ఝుకోవ్ - '.....సైనిక వ్యూహం దురాక్రమణదారుడిని ఎదురు దాడి (offensive operations) ద్వారానే ఓడించగలమనే సరియైన అవగాహన మీదే ఆధారపడింది. కాని ఇతర పోరాట పద్ధతులు – శత్రువుతో తలపడడం, శత్రువు ఒత్తిడి తీసుకు వచ్చినప్పుడు తిరోగమించడం, చుట్టుముట్టినప్పుడు పోరాడడం, రాత్రి వేళ యుద్ధం - లాంటి విషయాలకు తగినంత ప్రాముఖ్యతనివ్వడం జరుగలేదు....' అన్నాడు (ibid., 245).

మిషన్ టు మాస్కో నుంచి -

'జులై 9, 1941 (వాషింగ్టన్).....(రష్యన్) రాయబారి ఓమన్ స్కీ మా ఇంటికి విందుకు వచ్చాడు. లెనిన్ గ్రాడ్ జర్మన్ల వశమవుతే అక్కడ ఉన్న పారిశ్రామిక సంపదంతా జర్మన్ల వశమయ్యే ప్రమాదం ఉందా అని అతన్ని అడిగాను. అలాంటి ప్రమాదం ఎదురవడానికి చాలా ముందే ఫాక్టరీలను తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తనకు సమాచారం అందిందని అతను చెప్పాడు..... జర్మనీ యుక్రెయిన్ లో కొంత భాగాన్ని ఆక్రమించగలదని ఓమన్ స్కీ అన్నాడు. కాని అది చాలా స్వల్పభాగం అని అతను అనుకుంటున్నాడు. నా ప్రశ్నకు సమాధానం చెబుతూ నిస్సందేహంగా ప్రభుత్వమూ, ఎర్ర సైన్య హై కమాండూ ఆ ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని దానిని ఎదుర్కోవడానికి ప్రణాళికలు వేశాయి అన్నాడు. ఒకవేళ మాస్కో జర్మన్ల వశమైన పక్షంలో, తూరుపు వైపు ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యడానికి సోవియట్ ప్రభుత్వం అప్పుడే ఏర్పాట్లు చేసిందని అతను చెప్పాడు. ప్రభుత్వంతో పాటు పూర్తిగా స్వయం సమృద్ధమైన స్వతంత్ర సైన్యం కూడా ఉంటుంది.....సోవియట్ యుద్ధ వ్యూహం పశ్చిమ యుద్ధ రంగాన నిర్ణయాత్మక యుద్ధాలు చెయ్యాలని తలపెట్టడం లేదు.....శత్రువు సరఫరా మార్గాలు దీర్ఘమయ్యేలా సోవియట్ సైన్యం వెనుకంజ వేస్తూ శత్రువును లోలోనికి రానిచ్చే స్పష్టమైన ప్రణాళిక ఉంది. అలా ముందుకు చొచ్చుకు వచ్చే శత్రువు ప్రతీ అడుగుకూ తగిన మూల్యం చెల్లించేలా రక్షణ యుద్ధాలు చేస్తూ శత్రువును బలహీన పరచాలని సోవియట్ వ్యూహం నిర్ణయించింది....జర్మన్ టాంకు దాడులను రష్యన్ సైన్యం ప్రతిఘటిస్తున్న తీరు గురించి యుద్ధ రంగంనుంచి వస్తున్న వార్తలు విస్మయాన్ని కలిగిస్తున్నాయని అతను అన్నాడు. నాజీలు విమానాలతో, టాంకులతో చేస్తున్న దాడిని ఇలా ఎదుర్కొనే రష్యన్ ఎత్తుగడలు సైనిక చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తున్నాయని అతను అన్నాడు.....' - (Mission to Moscow, p. 302).

Edit with WPS Office
ఓమన్ స్కీ యుద్ధం ప్రారంభమైన రెండు వారాల తర్వాత చెప్పిన దానిని బట్టి - 1) జర్మన్లను సరిహద్దులలో నిలువరించి నిర్ణయాత్మక యుద్ధాలను చెయ్యాలని స్టాలిన్ అనుకోలేదు 2) వెనుకంజ వేస్తూ జర్మన్లను లోనికి రానిచ్చి శత్రువు సరఫరా మార్గాల మీద దాడి చేస్తూ, మెరుపుదాడిని దీర్ఘకాలిక యుద్ధంగా మార్చే ఒక స్పష్టమైన ప్రణాళిక రష్యాకు యుద్ధ ప్రారంభం నుంచీ ఉంది 3) శత్రువు మాస్కోను కూడా ఆక్రమించినా రష్యన్ ప్రభుత్వం మరింత తూర్పుకు తిరోగమించి పోరాడుతుంది.

'...జులై 31, 1941: ఈ రోజు వైట్ హౌస్ కార్యాలయంలో నేను జనరల్ గోలికోవ్ (ఎర్ర సైన్యం అసిస్టెంటు చీఫ్ ఆఫ్ ది జనరల్ స్టాఫ్) ను కలిశాను. అతను రష్యన్ యుద్ధరంగాన్నుండి లండన్ ద్వారా వచ్చాడు.....సోవియట్ ప్రభుత్వానికి ఎటువంటి నోటీసు ఇవ్వకుండా హిట్లర్ దాడి చేశాడు. కాని ఎర్ర సైన్యానికి గూఢచార శాఖ ద్వారా హిట్లర్ దాడికి సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలుసు. ఎర్ర సైన్యం ఏ పరిణామానికైనా సిద్ధంగా ఉంది.....హఠాత్తుగా దాడి చెయ్యడంవలన హిట్లర్ మొదట వ్యూహాత్మకంగా అనుకూల పరిస్థితిలో ఉన్నాడు.....హిట్లర్ దాదాపు 30,000 టాంకులను ఈ దాడికి వినియోగించాడని అంచనా.....ఎర్ర సైన్యానికి కూడా చాలా టాంకులు ఉన్నాయి.

ఫ్రాన్స్ లో పెద్ద ఎత్తున జర్మన్లు టాంకులు, సాయుధ శకటాలతో దాడి చేసిన పద్ధతిని సోవియట్ జనరల్ స్టాఫ్ జాగ్రత్తగా అధ్యయనం చేసింది. అటువంటి దాడిని ఎదుర్కోవడానికి ఒక మార్గం ఎన్నుకున్నది. బాల్టిక్ రాజ్యాలనుండి వ్యూహాత్మకంగా తిరోగమించడంలో ఈ వ్యూహాన్ని ప్రయోగించి చూస్తున్నది. సూటిగా చెప్పాలంటే ఈ ఎత్తుగడ ఏమిటంటే, ఈ ఉక్కు వేళ్ళను - జర్మన్ టాంకులు, సాయుధ శకటాలను - రష్యన్ శ్రేణులలోంచి ముందుకు పోనిచ్చి, రష్యనన్లు వాటి మీద వెనుక నుంచి దాడి చెయ్యడం.....పెద్ద పెద్ద సైన్యాలు చుట్టుముట్టబడే ప్రమాదం ఉందని గుర్తిస్తున్నారు. ఈ సైన్యాలు జర్మన్ చక్రబంధాన్ని ఛేదించి బయటపడాలి అని భావించడం జరుగుతోంది. ఈ యుద్ధతంత్రం హిట్లర్ యుక్రెయిన్ లో అధిక భాగాన్ని ఆక్రమించిన పక్షంలో వోల్గా-యురల్స్ ప్రాంతంలో స్వయంపోషకమైన ఆర్థిక వ్యవస్థను ఏర్పరచడానికీ రిజర్వు సైన్యాలను ఏర్పాటు చేయడానికీ కూడా ప్రణాళికలు వేసింది....' - (Joseph E. Davies,, Mission to Moscow, p. 307).

పై వాస్తవాలు మెరుపుదాడిని బూర్జువా సిద్ధాంతంగా కొట్టి పడెయ్యడం కాక జాగ్రత్తగా అధ్యయనం చెయ్యడం జరిగిందని స్పష్టం చేస్తాయి. జర్మనీ మెరుపుదాడిలో విశాలమైన రష్యన్ భూభాగాలను ఆక్రమించగలదని స్టాలిన్ ఊహించాడు. అందుకు తగిన వ్యూహాన్ని రూపొందించాడు. బలమైన శత్రువుతో పోరాడుతున్నప్పుడు నష్టాలు అధికంగానే ఉంటాయి. లక్షల ఎర్ర సైన్యాన్ని జర్మన్లు చుట్టుముట్టి నాశనం చెయ్యగలరనే విషయాన్ని స్టాలిన్ గుర్తించాడు. ఇవి ఒక భయంకర యుద్ధంలో అనివార్యంగా జరిగే నష్టాలుగానే అతను స్వీకరించాడు.

3. జర్మన్ దాడి గురించి వస్తున్న హెచ్చరికలను స్టాలిన్ నమ్మలేదు. అతని అభిప్రాయాలు తప్పు అని ఎవ్వరూ చెప్పడానికి సాహసించలేక పోయారు. వ్యక్తి పూజ వల్లనే ఇదంతా జరిగింది.

'.....జర్మన్లు రష్యామీద దాడి చెయ్యడానికి సైన్యాన్ని సిద్ధం చేస్తున్నారని 1941 ఏప్రిల్ 3న చర్చిల్ స్టాలిన్ ను వ్యక్తిగతంగా హెచ్చరించాడు. ..... కాని స్టాలిన్ లక్ష్య పెట్టలేదు.....బెర్లిన్ లో ఉన్న సోవియట్ మిలిటరీ అధికారులు మే 14-జూన్ 15 ల మధ్య జర్మనీ రష్యా పై దాడి చేస్తుందనే వార్తల గురించి రిపోర్టులు పంపించారు....ఇన్ని తీవ్ర హెచ్చరికలు వస్తున్నప్పటికీ స్టాలిన్ దేశ రక్షణకు సరియైన చర్యలు తీసుకోలేదు..... ఫాసిస్టు సైన్యం రష్యన్ భూభాగం మీద దాడులు ప్రారంభించినప్పుడు, మాస్కో జర్మన్ల మీద ఎదురు కాల్పులు జరుపవద్దని ఆదేశాలించ్చింది..... ఒక జర్మన్ సైనికుడు సరిహద్దు దాటి వచ్చి, జూన్ 22 తెల్లవారగట్ల మూడు గంటలకు రష్యా మీద దాడి చెయ్యాలని జర్మన్ సైన్యానికి ఆదేశాలివ్వబడ్డాయని తెలియజేశాడు....ఈ హెచ్చరిక కూడా నిర్లక్ష్యం చెయ్యబడింది....'- కృశ్చేవ్.

ఈ విషయం గురించి ఇంతకు ముందు రెండవ అధ్యాయంలో కొన్ని వివరాలు ఇవ్వడం జరిగింది. అవి కూడా పాఠకులు మరొకసారి చూడవచ్చు.

ఒక సంఘటన జరిగిన చాలాకాలం తర్వాత, ఇరుపక్షాల ఉద్దేశాలూ, ఎత్తుగడలూ అన్నీ

Edit with WPS Office
స్పష్టమైన తర్వాత 'అప్పుడు ఇలా కాక అలా చేసి ఉంటే' అని విమర్శించడం సరికాదు. వర్తమానంలో జీవిస్తున్నవారికి జరుగుతున్నది అంత స్పష్టంగా తెలియదు. కొన్ని వాస్తవాల ఆధారంగా ఏం చెయ్యాలా అని నిర్ణయిస్తారు. అందులో అనివార్యంగా పొరపాట్లు ఉంటాయి.

స్టాలిన్ నిజంగా హెచ్చరికలూ, యుద్ధం రాబోతోందన్న సూచనలూ నిర్లక్ష్యం చేశాడా? ఈ విషయం గురించి మార్షల్ ఝుకోవ్ ఏం చెప్పాడో చూద్దాం.

'....స్టాలిన్ నాయకత్వాన ఉన్న ప్రభుత్వం (సకాలంలో) యుద్ధ చర్యల ప్రణాళికను ఎందుకు అమలు జరుపలేదు? ఈ పొరపాట్లన్నింటికీ తరచు స్టాలిన్ ను నిందిస్తుంటారు. స్టాలిన్ తప్పులు చేశాడు కాని క్లిష్టమైన ఆ నాటి ఆర్థిక, రాజకీయ అంశాలూ చారిత్రక పరిణామాలకూ అతీతంగా ఈ తప్పులు ఎత్తి చూపడం సరికాదు. ఇప్పుడు మనకు (ఆ పరిణామాల) ఫలితాలు తెలుసు కాబట్టి, ప్రారంభానికి ప్రయాణించి అన్ని రకాల అభిప్రాయాలను వ్యక్తపరచడం కంటే తేలికైన విషయం మరొకటి ఉండదు.....నా ఎదురుగా స్టాలిన్ అనేకమందితో జరిపిన సంభాషణలు విని విశ్లేషించిన అనంతరం నేనొక ధృఢమైన అభిప్రాయానికి వచ్చాను. స్టాలిన్ చర్యల వెనుక యుద్ధాన్ని నివారించాలనే ఆలోచన ఉంది. ఇందులో తాను విజయం సాధించగలనన్న ఆశ ఉంది. నాజీ జర్మనీ లాంటి క్రూరుడైన, బలమైన శత్రువుతో యుద్ధం వస్తే సోవియట్ ప్రజలు ఎంత భయంకరమైన విపత్తుకు గురవుతారో స్టాలిన్ కు బాగా తెలుసు. ఆ కారణంగా, పార్టీ లాగే అతను కూడా వ్యవధి సంపాదించడానికి ప్రయత్నించాడు.....'
- (G. Zhukov, Reminiscences and Reflections, Vol. I, p. 264).

మార్షల్ ఝుకోవ్ ఈ విషయం గురించి తన పుస్తకంలో కొంచెం వివరంగా వ్రాశాడు.

'..సోవియట్ యూనియన్ సరిహద్దులలో నాజీలు సైన్యాలను సమీకరిస్తున్నట్లూ యుద్ధానికి సంసిద్ధులౌతున్నట్లూ హెచ్చరికలు ఉన్నాయన్నది నేడు అందరికీ తెలిసిన సత్యం. కాని ఆ కాలంలో మరో రకమైన వార్తలు అధిక సంఖ్యలో స్టాలిన్ కు అందేవి. ఉదాహరణకు - (జర్మన్) హై కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఫీల్డ్ మార్షల్ కైటెల్, 1941 ఫిబ్రవరి 15 న శత్రువుకు (అంటే రష్యాకు) తప్పుడు సమాచారం అందించడానికి ఒక ప్రత్యేక ఆదేశం ఇచ్చాడు. ఆపరేషన్ బార్బరోస్సాకు జరుగుతున్న ఏర్పాట్లను కప్పిపుచ్చడానికీ, రష్యాను తప్పుదారి పట్టించడానికీ, జర్మన్ గూఢచార విభాగం అనేక చర్యలు చేపట్టింది. నీలి వార్తలు ప్రచారం చేసింది. తప్పుడు సమాచారం అందించింది. జర్మనీ ఇంగ్లండ్ మీద దాడి చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నదనీ, సైన్యాన్ని తూరుపు వైపు పంపించడం ఇంగ్లండును తప్పుదారి పట్టించడం కోసమే అన్న వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇంగ్లండ్ మీద దాడికి ముందు విశ్రాంతి తీసుకోవడానికి సైన్యాన్ని తూర్పు వైపు పంపిస్తున్నట్లు జర్మన్ సైనిక దళాలలో వార్తలు ప్రవేశపెట్టబడ్డాయి. పెద్ద ఎత్తున ఇంగ్లండు పటాలు ముద్రించి జర్మన్ సైన్యంలో ప్రచారంలో పెట్టారు. జర్మన్ సైనిక యూనిట్లకు ఇంగ్లీషు అనువాదకులను తోడు చేశారు. నార్వే, ఇంగ్లీషు ఛానల్, డోవర్ సంధి లాంటి కొన్ని తీర ప్రాంతాలను సీలు చెయ్యడానికి సన్నాహాలు చేశారు. జర్మన్ సైన్యాలు సోవియట్ యూనియన్ ద్వారా ఇండియా మీద దాడి చేస్తాయని నీలివార్తలు ప్రచారంలోకి వచ్చాయి. రష్యాను తప్పుదారి పట్టించడానికి ఇంగ్లండు మీద దాడికి ఆపరేషన్ షార్క్, ఆపరేషన్ హార్పూన్ అనే పేర్లతో పధకాలు తయారయ్యాయి. సోవియట్ యూనియన్ కు వ్యతిరేకంగా జర్మనీలో జరుగుతున్న ప్రచారం ఆగిపోయి ఇంగ్లండుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం మొదలైంది.

1941 ఏప్రిల్ లో చర్చిల్ జర్మన్ దాడి గురించి స్టాలిన్ ను హెచ్చరించిన మాట వాస్తవమే. కాని బ్రిటన్ అంతవరకూ జర్మనీతో వ్యవహరించిన తీరు చర్చిల్ సందేశాన్ని సందేహంతో చూసేలా చేసింది. 1940లో ప్రపంచ పత్రికలన్నింటిలోనూ బ్రిటిష్, ఫ్రెంచ్ సైనిక బలగాలు (రష్యాలోని) ఉత్తర కకాసస్ మీద దాడి చెయ్యడానికీ, బాకూ, గ్రోజ్నీ, మైకాప్ చమురు గనుల మీద విమాన దాడులు చెయ్యడానికీ, సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నీలి వార్తలు నిజమేననడానికి రుజువుగా పత్రాలు వెలువడ్డాయి. చర్చిల్ సోవియట్ వ్యతిరేక స్వభావమూ, ఆ నాడు సంభవిస్తున్న అనేక పరిణామాలూ స్టాలిన్ చర్చిల్ ను సందేహించేటట్లు చేశాయి.

సోవియట్ యూనియన్ జర్మనీ మీద దాడికి సన్నాహాలు చేస్తున్నట్లు 1941 వసంత కాలంలో పశ్చిమ దేశాలలో పెద్ద ఎత్తున నీలి వార్తలు చెలరేగాయి. ఈ వార్తల గురించి జర్మన్ పత్రికలు తీవ్రంగా స్పందించాయి. ఇటువంటి సమాచారం సోవియట్ రష్యా-జర్మనీల మధ్య సంబంధాలను విషపూరితం చేస్తాయని వ్యాఖ్యానించాయి. ఇటువంటి వార్తలూ పరిణామాలూ గమనిస్తున్న స్టాలిన్, బ్రిటన్ అమెరికాలు సోవియట్ యూనియన్ కూ జర్మనీకి మధ్య యుద్ధం తీసుకురావాలని

Edit with WPS Office
ప్రయత్నిస్తున్నాయన్న అభిప్రాయంతో ఉన్నాడు.

.....సోవియట్ యూనియన్ మీద దాడికి, బ్రిటన్ తదితర పశ్చిమ దేశాలు హిట్లర్ ను ఉసిగొల్పుతున్నట్లు స్టాలిన్ గమనించాడు. తమ పరిస్థితి సైనికంగా అధ్వాన్నంగా ఉన్న కారణంగా (1940లో ఆరు వారాల యుద్ధంలో ఫ్రాన్స్ ఓడిపోయి, బ్రిటిష్ సైన్యాలు ప్రాణలు అరిచేతుల్లో పెట్టుకుని పారిపోయిన తర్వాత జర్మనీ ఇంగ్లండు మీద పెద్ద ఎత్తున విమాన దాడులు చెయ్యసాగింది. జర్మనీ సముద్రం దాటి ఇంగ్లండు మీద దాడి చెయ్యబోతోందన్న వార్తలు వెలువడుతున్న పరిస్థితులలో - తోలేటి) వినాశనాన్నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఈ దేశాలు జర్మనీ-సోవియట్ యూనియన్ ల మధ్య యుద్ధం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆ కారణంగా జర్మనీ రష్యా మీద దాడి చెయ్యబోతున్నదని పశ్చిమ దేశాలనుంచి వస్తున్న వార్తలను స్టాలిన్ సందేహంతో చూసేవాడు.....' (ibid. P. 267)

చర్చిల్ సలహాను నిర్లక్ష్యం చేసిన స్టాలిన్ నిజంగా జర్మనీ యుద్ధం చెయ్యబోదని నమ్మాడా?

1945 మే 5న క్రెమ్లిన్ లో మిలిటరీ ఎకాడమీ నుండి ప్యాసయిన సైనిక ఆఫీసర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వందల సైనిక ఆఫీసర్లు పాల్గొన్నారు. స్టాలిన్ ఈ సమావేశంలో ప్రసంగించాడు. 'ఎటువంటి హఠాత్పరిణామానికైనా మనం సంసిద్ధులమై ఉండాలి' అనే శీర్షిక కింద ప్రావ్దా పత్రికలో ఈ సమావేశం గురించి క్లుప్తంగా వార్త వచ్చింది. ఈ సమావేశంలో స్టాలిన్ 40 నిమిషాలు ప్రసంగించాడు. ఈ ప్రసంగ వివరాలను యుద్ధానంతరం అలెగ్జాండర్ వెర్త్ సేకరించి 'రష్యా ఎట్ వార్' పుస్తకంలో ప్రచురించాడు. స్టాలిన్ ప్రసంగంలోని ముఖ్య అంశాలు:

1. పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉంది. సమీప భవిష్యత్తులో జర్మనీ దాడి చేసే ప్రమాదం ఉంది. అందుచేత ఎటువంటి హఠాత్పరిణామానికైనా సంసిద్ధులై ఉండండి.
2. ఎర్ర సైన్యానికి జర్మన్ సైన్యాన్ని తేలికగా ఓడించగల శక్తి లేదు. ఎర్ర సైన్యం సన్నాహాలూ, సామగ్రీ సంతృప్తికరంగా లేవు. ఎర్ర సైన్యంలో ఆధునిక టాంకులు, ఆధునిక విమానాలు తదితర యుద్ధ సామగ్రి కొరత తీవ్రంగా ఉంది. సైన్య శిక్షణ ఇంకా పూర్తి కాలేదు. సరిహద్దుల్లో రక్షణ బలహీనంగా ఉంది.
3. దౌత్య మార్గాల ద్వారా జర్మనీ దాడి వాయిదా పడేలా, కనీస ఆకురాలు కాలం దాకా వాయిదా పడేలా, సోవియట్ యూనియన్ శతవిధాల ప్రయత్నిస్తుంది. ఈ ప్రయత్నాలు సఫలం కావచ్చు, విఫలం కావచ్చు.
4. జర్మన్ దాడి వాయిదా వేయించడంలో సఫలమయినట్లయితే ఈ యుద్ధం 1942లో జరిగి తీరుతుంది. జర్మనీ రష్యామీద దాడి చెయ్యనైనా చేస్తుంది. లేదా జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రష్యా జర్మనీ మీద దాడి చెయ్యవచ్చు. ఎందుకంటే నాజీ జర్మనీ ఉనికి ప్రపంచ శాంతికి ప్రమాదకరం. అప్పుడు రష్యాకు అనుకూలమైన పరిస్థితులలో యుద్ధం జరుగుతుంది. అప్పటికి సైన్య శిక్షణ పూర్తవుతుంది. సైన్యానికి ఆధునిక ఆయుధాలుంటాయి.
5. సోవియట్ యూనియన్ తో నిరాక్రమణ సంధి జరిగిన తర్వాత జపాన్ సోవియట్ యూనియన్ మీద దాడి చెయ్యకపోవచ్చు.

ఈ సమావేశంలో మే నుంచి ఆగస్టు వరకూ సోవియట్ యూనియన్ కు అత్యంత గడ్డుకాలం అని స్టాలిన్ హెచ్చరించాడు. (Alexander Werth, Russia at War, p. 133).

మే 6న సుప్రీం సోవియట్ ప్రిసైడియం స్టాలిన్ ను దేశాధ్యక్షుడిగా నియమించింది. అంతవరకూ స్టాలిన్ కమ్యూనిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ మాత్రమే. స్టాలిన్ ను అధ్యక్షుడిగా నియమించడం మామూలు పరిస్థితులలో జరుగదు. సోవియట్ యూనియన్ ప్రమాదంలో ఉంది అనే దానికి సంకేతంగా ఈ నియామకాన్ని ప్రపంచం భావించింది.

దౌత్య మార్గాల ద్వారా, జర్మనీ కవ్వింపు చర్యలు అని భావించే చర్యలన్నింటినీ నిలుపు చెయ్యడం ద్వారా జర్మన్ దాడి వాయిదా పడేలా చెయ్యడానికి స్టాలిన్ చివరివరకూ ప్రయత్నించాడు. యుద్ధం అప్పుడు ప్రారంభమవుతే రష్యాకు ప్రతికూలమైన, జర్మనీకి అనుకూలమైన పరిస్థితులలో ప్రారంభమవుతుందని అతనికి తెలుసు. జర్మన్ విమానాలు తరచు సరిహద్దులు ఉల్లంఘిస్తున్నా, వాటిని కూలగొట్టవద్దనీ జర్మనీ కవ్వింపు చర్యలుగా భావించే ఏ చర్యలూ తీసుకోవద్దనీ అతను సైన్యాన్ని అదేశించాడు. ఇందులో భాగంగానే జూన్ 14న, వారం రోజులలో జర్మనీ దాడి చేస్తుందనగా,

Edit with WPS Office
టాస్ వార్తా సంస్థ ఒక ప్రకటన ఇచ్చింది. స్టాలిన్ హ్రస్వదృష్టికీ, జర్మనీలో ఏం జరుగుతున్నదీ అర్థం చేసుకోలేని అతని అజ్ఞానానికీ, వాస్తవాలతో నిమిత్తం లేని అతని ఊహా ప్రపంచానికీ, నిదర్శనంగా స్టాలిన్ అనంతర చరిత్రలో ఈ టాస్ ప్రకటనను ఉదహరించడం జరిగింది. '....రాజకీయ, సైనిక పరిస్థితిని స్టాలిన్ తప్పుగా అంచనా వేశాడని (ఈ ప్రకటన) స్పష్టం చేస్తుంది. యుద్ధం తలుపు తడుతున్నప్పుడు ఈ ప్రకటన సోవియట్ ప్రజలను తప్పుదారి పట్టించింది....సోవియట్ ప్రజల, సైన్య జాగరూకతను దెబ్బ తీసింది....' అంటూ స్టాలిన్ ను తీవ్రంగా విమర్శించడం జరిగింది.

జూన్ 14 టాస్ ప్రకటనలో ఇలా ఉంది -

'....జర్మనీ-సోవియట్ యూనియన్ ల మధ్య త్వరలోనే యుద్ధం ప్రారంభం కాబోతున్నదన్న నీలి వార్తలు విరివిగా వస్తున్నాయి....ఇదంతా సోవియట్ యూనియన్-జర్మనీల మధ్య యుద్ధం తీసుకు రావాలని ఆశిస్తున్న శక్తుల ప్రచారం తప్ప మరేమీ కాదు...సోవియట్ యూనియన్ వలెనే....జర్మనీ కూడా నిరాక్రమణ సంధి షరతులను తూచా తప్పకుండా పాటిస్తోంది. అందువలన జర్మనీ సంధిని ఉల్లంఘించి సోవియట్ యూనియన్ మీద దాడి చెయ్యాలని ఉద్దేశిస్తున్నట్లు వస్తున్న నీలి వార్తలు ఆధారరహితమైనవి....జర్మనీ ఉత్తర, తూర్పు సరిహద్దులకు (సోవియట్ యూనియన్ సరిహద్దులకు - తోలేటి) సైన్యాలను తరలించడానికీ సోవియట్-జర్మన్ సంబంధాలకూ ఎటువంటి సంబంధం లేదని (సోవియట్ ప్రభుత్వం) భావిస్తోంది....జర్మనీ-సోవియట్ యూనియన్ నిరాక్రమణ సంధి షరతులకు సోవియట్ యూనియన్ కట్టుబడి ఉంది. సోవియట్ యూనియన్ యుద్ధానికి సన్నద్ధమవుతోందన్న వార్త కట్టుకథ.....వేసవికాలంలో ఇప్పుడు జరుగుతున్న ఎర్ర సైన్యం రిజర్వు సైన్యాల సమీకరణ.....సైనిక విన్యాసాలు...రిజర్విస్టులకు శిక్షణనివ్వడానికి ఉద్దేశించినవే....ప్రతీ సంవత్సరం ఇటువంటి విన్యాసాలు జరుగుతూనే ఉన్నాయి.....జర్మనీని ఉద్దేశించిన శత్రు కార్యకలాపాలుగా వీటిని చిత్రించడం అభూత కల్పన.....'

ఈ ప్రకటన గురించి వెర్త్ '....వార్తలలో అంతరార్థం చదవడం సోవియట్ ప్రజలకు అలవాటు. ఈ ప్రకటన వెలువడిన తర్వాత ప్రజలు అజాగరూకులు అవలేదు సరికదా యుద్ధం రాబోతోందని భయాందోళనలకు గురయ్యారు' అని రాశాడు - (Russia at War, p. 136).

దౌత్య సంబంధాలను దృష్టిలో ఉంచుకుని ఆ ప్రత్యేక పరిస్థితులలో వెలువడిన ఈ టాస్ ప్రకటనను చూపించి స్టాలిన్ సైనిక, రాజకీయ పరిస్థితిని తప్పుడు అంచనా వేశాడనీ, ఈ ప్రకటన ప్రజల, సైనికుల జాగరూకతను దెబ్బతీసిదనీ ఆరోపించడం హాస్యాస్పదం.

యుద్ధం రాబోతున్నదన్న హెచ్చరికలను స్టాలిన్ నిర్లక్ష్యం చేశాడు అన్న ఆరోపణ మీద మార్షల్ వాసిలేవస్కీ అభిప్రాయాలు -

'.....రాజకీయ నాయకత్వం (అంటే స్టాలిన్) యుద్ధం వస్తోందని గ్రహించింది. యుద్ధ జ్వాలలు సోవియట్ యూనియన్ ను దహించి వెయ్యకుండా ఆపడానికీ, ఆలస్యం చెయ్యడానికీ ప్రయత్నించింది.....ఇది సరియైన, వాస్తవికమైన విధానం. ఈ విధానాన్ని అమలు పరచడానికి కేపిటలిస్టు రాజ్యాలతో, ముఖ్యంగా దురాక్రమణ చేస్తున్న దేశాలతో, దౌత్య వ్యవహారాలను చాలా నైపుణ్యంతో నడపాలి. నాజీ సైన్యం సైనిక చర్యగా భావించి, పరిస్థితిని మరింత ఉద్రిక్తపరిచే ఎటువంటి చర్యలూ సైన్యం తీసుకోరాదని రష్యన్ సైన్యాలకు ఆదేశాలు ఇవ్వబడ్డాయి...' - (Another View of Stalin, p. 124)

మే 1941 పరిస్థితి గురించి మార్షల్ వాసిలేవస్కీ -

'.....సరిహద్దులో ఉన్న సైన్యానికి యుద్ధానికి సిద్ధంగా ఉండండి (State of Alert) అని ఆదేశాలివ్వడం అనేది చాలా తీవ్రమైన విషయం....యుద్ధ పరిస్థితికి ముందే ఇటువంటి ఆదేశాలివ్వడం లేక ఆలస్యంగా ఆదేశాలు ఇవ్వడం - రెండూ ప్రమాదకరమైనవే. తరచు పొరుగు దేశం శత్రు చర్యలకూ యుద్ధానికీ మధ్య చాలా అంతరం ఉంటుంది....' (ibid., p. 125).

జర్మనీతో యుద్ధాన్ని నివారించడానికీ, నివారించడానికి వీలుకాని పక్షంలో రష్యా బలహీనంగా ఉన్నప్పుడు కాక సైన్య పునర్నిర్మాణం తర్వాత 1942లో అధునాతన ఆయుధాలతో సంసిద్ధంగా ఉన్న పరిస్థితులలో జరిగేలా చెయ్యడానికీ స్టాలిన్ అనేక విధాల కృషి చేశాడు. ఆ కృషిలో భాగంగానే జర్మనీని రెచ్చగొట్టే చర్యగా భావించే ఏ సైనిక చర్యనైనా నిషేధించాడు. ఆ చర్యలో భాగంగానే జర్మనీ వ్యతిరేక ప్రచారాన్ని తగ్గించాడు. అంతేకాని స్టాలిన్ యుద్ధం రాబోతున్నదన్న సంగతి ఎవ్వరు చెప్పినా నమ్మలేదనడం సరికాదు.

Edit with WPS Office

4. స్టాలిన్ ఎవరి మాటా వినే వాడు కాదు. సమిష్టిగా పని చెయ్యకుండా తన నిర్ణయాలను అందరిమీదా రుద్దేవాడు.

'.....స్టాలిన్ వ్యక్తి పూజ, సైనిక విషయాల్లో పరిశోధనకు అడ్డుపడి స్వతంత్ర చొరవ లేకుండా చేసి, పిడివాదానికి దారితీసింది. స్టాలిన్ ఆదేశాల గురించి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమస్యలకు పరిష్కారాలను జీవితంలోనూ అనుభవంలోనూ వెతకకుండా, సిద్ధాంతాలలో, ఫార్ములాలలో, రెడీమేడ్ కొటేషన్లలో వెతికే ధోరణి.....యుద్ధ తంత్రానికి సంబంధించిన చర్చలు స్వేచ్ఛగా జరుగకుండా ఈ ధోరణి అడ్డుపడింది....' - కృశ్చేవ్ కాలంలో ప్రచురింపబడిన హిస్టరీ ఆఫ్ వార్.

'....ఒక వ్యక్తి, స్టాలిన్, చేతుల్లో అధికారమంతా కేంద్రీకృతం కావడం దేశభక్తి ప్రపూరిత యుద్ధంలో అనేక తీవ్ర పరిణామాలకు దారి తీసింది. స్టాలిన్ ఎవరి సలహా తీసుకోడు, ఎవరినీ సహించడు. అందరి తరఫున తనే నిర్ణయాలు తీసుకుంటాడు....' - కృశ్చేవ్ రహస్య నివేదిక.

'....స్టాలిన్ పరిస్థితిని వివరించి, ఓర్పుతో నచ్చచెప్పి, జనాల సహకారంతో పనిచేసేవాడు కాదు. అతను తన అభిప్రాయాలను ఇతరులపై రుద్ది, తన భావాలను అందరూ అంగీకరించి తీరాలని ఆశించేవాడు. ఎవరైనా స్టాలిన్ భావాలను వ్యతిరేకించి సరియైన తన అభిప్రాయాన్ని తెలియజేయడానికి ప్రయత్నిస్తే, అతన్ని సమిష్టి బాధ్యత నుంచి తొలగించడమే కాదు, అతన్ని నైతికంగానూ, భౌతికంగానూ (స్టాలిన్) నాశనం చేసేవాడు.....' - కృశ్చేవ్ రహస్య నివేదిక.

'.....అతని అనుమానపు జబ్బు అందరినీ అనుమానించేలా చేసేది. ఎవరూ తమ అభిప్రాయాలను అతని ఎదురుగా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది....' - కృశ్చేవ్ రహస్య నివేదిక.

జనరల్ వాసిలేవస్కీ 1941 మే లో చీఫ్ ఆఫ్ స్టాఫ్ బాధ్యతను స్వీకరించాడు. స్టాలిన్ ఎలా పని చేసేవాడో అతను ఇలా వివరించాడు: '...ఒక వ్యూహానికి, ఆపరేషన్ కు సంబంధించిన నిర్ణయం తీసుకోవలసివచ్చినప్పుడు, లేదా యుద్ధ నిర్వహణకు సంబంధించిన ఇతర ముఖ్య విషయాలను పరిశీలించేటప్పుడు, కమాండర్-ఇన్-చీఫ్ (స్టాలిన్) ఆ విషయానికి ప్రత్యక్షంగా బాధ్యులైన వారినందరినీ సమావేశపరిచేవాడు.....యుద్ధ నిర్వహణకు సంబంధించిన ఏదైనా నిర్ణయం తీసుకునేందుకూ, తీసుకున్న నిర్ణయాన్ని సమీక్షించడానికీ, లేదా ఆ నిర్ణయం సరియైనదే అని ఆమోదించడానికీ, తరచు యుద్ధరంగాన్నుంచి మిలిటరీ కౌన్సిల్ సభ్యులను సమావేశపరిచేవాడు.....

సాధారణంగా పాలిట్ బ్యూరో, స్టేట్ డిఫెన్స్ కమిటీ సభ్యులతో చర్చించిన తర్వాత వ్యూహానికి సంబంధించిన మొదటి ముసాయిదా తయారయ్యేది. ఈ పని చాలా రోజులు పట్టేది....ఈ సమయంలో స్టాలిన్ వివిధ యుద్ధ రంగాలకు చెందిన కమాండర్లతోనూ మిలిటరీ కౌన్సిల్ సభ్యులతోనూ చర్చిస్తుండేవాడు....' - (Another view of Stalin, p. 143).

వాసిలేవస్కీ చెబుతున్నదానిని బట్టి స్టాలిన్ నాయకత్వంలో స్టేట్ డిఫెన్సు కమిటీ సమిష్టిగా నిర్ణయాలు తీసుకునేది. ఈ కమిటీకి సర్వాధికారాలూ ఉండేవి.

'....కేంద్ర కమిటీ, పాలిట్ బ్యూరో, సైనిక నాయకత్వం, సమిష్టి నిర్ణయాల మీద ఆధారపడేవి. అందువల్లనే సుప్రీం కమాండు సమిష్టిగా తీసుకునే నిర్ణయాలు యుద్ధరంగ పరిస్థితికి అనుగుణంగా ఉండేవి....' - వాసిలేవస్కీ (ibid., p. 143).

స్టాలిన్ గ్రాడ్ యుద్ధ ప్రారంభ సమయం గురించి చెబుతూ, '....స్టాలిన్ యుద్ధానికి సంబంధించి ఏ ముఖ్య విషయం మీద నైనా నిర్ణయం తీసుకునే ముందు, తన డిప్యూటీలతోనూ ఉన్నత జనరల్ స్టాఫ్ సభ్యులతోనూ పీపుల్స్ డిఫెన్స్ కమిస్సారియేట్ ముఖ్య విభాగాల ప్రధానాధికారులతోనూ, యుద్ధంరంగంలోని కమాండర్లతోనూ, యుద్ధ పరిశ్రమలకు బాధ్యులైన ప్రజా కమిస్సార్లతోనూ చర్చించి, సలహాలు తీసుకునేవాడు...' అని వివరించాడు. - వాసిలేవస్కీ (ibid., p.144).

మార్షల్ ఝుకోవ్ - '....స్టాలిన్ జనరల్ స్టాఫ్ మీద విశ్వాసం ఉంచేవాడు. జనరల్ స్టాఫ్ రిపోర్టులూ సూచనలూ చూడకుండా అతను ఏ ముఖ్య నిర్ణయం తీసుకునే వాడు కాడు (G. Zhukov, Reminiscences & Reflections, Vol. I, p. 350)....సుప్రీం కమాండు సమిష్టిగా పనిచేసేది. ఒక నాయకుడి క్రింద సమిష్టిగా పని చెయ్యడమనే సరియైన విధానం అనుసరించేది. అన్ని విషయాలలోనూ చివరి నిర్ణయం కమాండర్-ఇన్-చీఫ్ దే.....' - (ibid., p. 347)

Edit with WPS Office
యుద్ధకాలమంతా జనరల్ స్టెమెంకో చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్ గా, అండర్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ గా పని చేశాడు. అతను ఇలా అన్నాడు: ' ....స్టాలిన్ యుద్ధానికి సంబంధించిన సమస్యలను తనే నిర్ణయించేవాడు కాడనీ అలా నిర్ణయించడానికి ఇష్టపడేవాడు కాడనీ స్పష్టం చేస్తున్నాను. క్లిష్టమైన ఈ రంగంలో సమిష్టిగా పని చెయ్యాల్సిన ఆవశ్యకతను అతను చాలా స్పష్టంగా అర్థం చేసుకున్నాడు. ఒక సైనిక సమస్య ఎదురైనప్పుడు ఆయా రంగాల్లోని నిపుణులను సంప్రదించేవాడు. వారి సలహాలు తీసుకుని గౌరవించేవాడు....' (ibid., p. 144)

మార్షల్ ఝుకోవ్ - '....స్టేట్ డిఫెన్స్ కమిటీ సమావేశాల్లో తరచు తీవ్రంగా చర్చలు జరుగుతుండేవి. స్పష్టమైన, తీవ్రమైన భాషలో అభిప్రాయాలు వెల్లడించబడేవి. కమిటీ సమావేశం ఏ నిర్ణయానికీ రాలేకపోతే, భిన్న అభిప్రాయాలతో ఉన్న రెండు పక్షాలనుండీ సభ్యులతో ఒక కమిషన్ నియమించబడేది. వారు చర్చించి తమ అభిప్రాయాలను కమిటీకి తెలిపేవారు.....సైనిక, ఆర్థిక విషయాల మీద స్టేట్ డిఫెన్స్ కమిటీ యుద్ధ కాలంలో దాదాపు 10,000 నిర్ణయాలను తీసుకుంది....' - (G. Zhukov, Reminiscences &Reflections, Vol. I, p. 335).

స్టాలిన్ పనిచేసే తీరు గురించి మరో ఉదాహరణ. ఈ సారి కృశ్చేవ్ పాత్ర కూడా ఉంది. కృశ్చేవ్ తన రహస్య నివేదికలో '.....యుద్ధం ప్రారంభమైనప్పుడు మన దగ్గర తగిన సంఖ్యలో రైఫిల్సు కూడా లేవు' అని ఆరోపించాడు. బహుశా ఆ ఆరోపణను దృష్టిలో ఉంచుకుని కాబోలు, జనరల్ వాసిలేవస్కీ ఒక సంఘటన గురించి ఇలా వివరించాడు:

'....1941 ఆగస్టు 5న ఎర్ర సైన్యం దాడి చెయ్యడానికి (స్టాలిన్) కృశ్చేవ్ కు అనుమతిచ్చాడు. అదే సమయంలో స్టాలిన్ తను నిర్ణయించిన రక్షణ రేఖను కూడా సిద్ధం చెయ్యాలని కృశ్చేవ్ తో చెప్పాడు. 'యుద్ధంలో నూవ్వు అనుకూల పరిణామాలకూ, తీవ్రమైన ప్రతికూల పరిణామాలకూ సిద్ధంగా ఉండాలి. తీవ్రమైన పొరపాట్లు నివారించడానికి ఇదే మార్గం.....' అని కృశ్చేవ్ ను హెచ్చరించాడు.

కృశ్చేవ్ హెడ్ క్వార్టర్సు తీర్చలేని డిమాండ్లన్నీ పంపడం మొదలు పెట్టాడు.

'....ఎవరో అంతా తయారు చేసి నీకు అందిస్తారని ఆశించకు. నీ అంతట నువ్వే నీ సైన్యాలకు ఆయుధాలు సమకూర్చుకో. నీ సైన్యం అవసరాలు ఎలా తీర్చాలో నేర్చుకో. సైన్యంలో రిజర్వు యూనిట్లు ఏర్పాటు చెయ్యి. ఫాక్టరీలలో రైఫిల్స్, మర తుపాకులు తయారు చెయ్యి.....లెనిన్ గ్రాడ్ కాట్యూషా రాకెట్లు తయారు చేస్తోంది.'

కృశ్చేవ్ - '.....కామ్రేడ్ స్టాలిన్! నీ ఆదేశాల్ని పాటిస్తాం. దురదృష్టవశాత్తూ కాట్యూషా రాకెట్ల గురించి మాకు తెలియదు..'

స్టాలిన్ - '.....నీ వాళ్ళ దగ్గర కాట్యూషా రాకెట్ల బ్లూప్రింట్లున్నాయి. కాట్యూషా రాకెట్ల మాడల్సు ఉన్నాయి. ఇంత ముఖ్యమైన ఆయుధం గురించి నీకు తెలియకపోవడం నీ తప్పు....'

జనరల్ వాసిలేవస్కీ వివరించిన పై సంఘటనను గమనిస్తే స్టాలిన్, బాధ్యతా సృజనాత్మకతా చొరవా ఉండాలని బోధించేవాడని తెలుస్తుంది.

1942 జులైలో మార్షల్ రోకోస్సోవస్కీని బ్రియన్ స్క్ యుద్ధరంగ కమాండరుగా నియమించడం జరిగింది. ఈ పదవిని తాను నిర్వహించగలనా అన్న సంశయం ఉంది అతనికి. పదవీ నియామకం తర్వాత అతను స్టాలిన్ ను కలవడానికి వెళ్ళాడు. స్టాలిన్ అతన్ని సగౌరవంగా ఆహ్వానించి మాట్లాడాడు. అతను వెళ్ళబోతుంటే 'అప్పుడే వెళ్ళొద్దు' అని స్టాలిన్ అతన్ని ఆపాడు. తర్వాత జరిగిన సంఘటన గురించి రోకోస్సోవస్కీ మాటలలో:

'.....స్టాలిన్ ప్రొస్క్రిబిషేవ్ (స్టాలిన్ పెర్సనల్ సెక్రటరీ)కు ఫోను చేసి యుద్ధరంగంలో కమాండు పదవినుంచి తొలగించబడిన ఒక జనరల్ ను పంపించమన్నాడు. స్టాలిన్ కూ, ఆ జనరల్ కూ మధ్య సంభాషణ ఇలా జరిగింది.

స్టాలిన్ - '....నిన్ను అకారణంగా శిక్షించామని అంటావు నువ్వు?'

'...అవును, తప్పు నాది కాదు. జనరల్ హెడ్ క్వార్టర్స్ ప్రతినిధి (అంటే యుద్ధ రంగానికి స్టాలిన్ పంపించిన వ్యక్తి) ప్రతీ దాంట్లోనూ అడ్డు పడేవాడు'

'ఎలా అడ్డుపడేవాడు?'

'అతను నేనిచ్చిన ఆదేశాల్లో కలుగజేసుకునే వాడు. నా ఆదేశాలకు విరుద్ధంగా ఆదేశాలిచ్చేవాడు. చర్యలు తీసుకోవలసిన సమయంలో చర్చలు ప్రారంభించేవాడు....అతను

Edit with WPS Office
కమాండరు మీద అధికారం చెలాయించడానికి ప్రయత్నించాడు'

'నీ దారికి అతను అడ్డు వచ్చాడంటావు. కాని యుద్ధరంగం నీ కమాండు క్రింద ఉంది.'

'అవును'

'పార్టీ, ప్రభుత్వమూ యుద్ధరంగాన్ని నీ చేతులలో పెట్టింది.....నీ దగ్గర టెలిఫోనుందా?'

'ఉంది'

'అతను నీకు అడ్డువస్తున్నాడని నువ్వు ఎందుకు రిపోర్టు చెయ్యలేదు?'

'నీ ప్రతినిధి మీద ఆరోపణ చెయ్యడానికి నేను సాహసించలేకపోయాను'

'అందువలనే - నువ్వు టెలిఫోను అందుకుని మాట్లాడే ధైర్యం చూపించనందుకే - నిన్ను శిక్షించడం జరిగింది. నువ్వు నీకిచ్చిన ఆపరేషన్ నిర్వహించడంలో విఫలమయ్యావు....'

ఈ సన్నివేశం గురించి వివరిస్తూ 'సుప్రీం కమాండరు (స్టాలిన్) ఆఫీసునుంచి ఒక కొత్త పాఠం నేర్చుకున్నాను అన్న ఆలోచనతో నేను బయటికి నడిచాను. ఈ పాఠం నాకు చాలా ఉపయోగపడింది' అని రాశాడు మార్షల్ రోకోస్సోవస్కీ. (ఈ రోకోస్సోవస్కీని 1937 సైనిక ప్రక్షాళన కార్యక్రమంలో అరెస్టు చెయ్యడం జరిగింది. ఈ కాలంలో అతన్ని చిత్రహింస చెయ్యడం జరిగింది. అతని కుటుంబం కూడా కష్టాలపాలయింది. తర్వాత అతను నిరపరాధి అని గుర్తించి పునరావాసం కల్పించి స్టాలిన్ ఉన్నత పదవులు ఇచ్చి గౌరవించాడు. స్టాలిన్ మరణానంతరం, రోకోస్సోవస్కీ కొంతకాలం జెయిలులో ఉన్నాడు కాబట్టి స్టాలిన్ అంటే ద్వేషంతో ఉంటాడన్న ఉద్దేశంతో స్టాలిన్ ను నిందిస్తూ ఒక వ్యాసం రాయమని కోరాడు కృశ్చేవ్. 'కామ్రేడ్ స్టాలిన్ నాకు దేముడితో సమానం' అని సమాధానమిచ్చాడు రోకోస్సోవస్కీ).

స్టాలిన్ గ్రాడ్ యుద్ధం ప్రారంభం కాబోతున్నదనగా ఒక జనరల్, జనరల్ వాల్ స్కీ, రష్యాకు తగినంత సైన్యం కాని, ఆయుధాలు కాని లేవనీ, అటువంటి పరిస్థితులలో ఈ స్టాలిన్ గ్రాడ్ యుద్ధం రష్యా ఘోర అపజయానికి దారి తీస్తుందనీ 'నిజాయితీ గల కమ్యూనిస్టు'గా స్టాలిన్ ను హెచ్చరించాడు. జనరల్ వాల్ స్కీ కూడా స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో పాల్గొంటున్న జనరల్. జనరల్ వాల్ స్కీ అభ్యంతరాలను చర్చించడానికి స్టేట్ డిఫెన్స్ కమిటీ అత్యవసర సమావేశం నవంబరు 17న జరిగింది. యుద్ధరంగం నుండి మార్షల్ ఝుకోవ్ నూ, వాసిలేవస్కీని కూడా మాస్కో పిలిచాడు స్టాలిన్. మార్షల్ ఝుకోవ్, వాసిలేవస్కీలు, జనరల్ వాల్ స్కీ అభ్యంతరాలకు తమ వివరణలు ఇచ్చారు. తర్వాత క్రెమ్లిన్ నుండి స్టాలిన్ స్వయంగా జనరల్ వాల్ స్కీ కి ఫోను చేసి వారి సమాధానాలు వివరించిన తర్వాత జనరల్ వాల్ స్కీ తన అభ్యంతరాలను ఉపసంహరించుకున్నాడు. ఈ సమావేశం ఎందుకు జరిగినదీ స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

అయితే స్టాలిన్ ను ప్రతీదానికీ తప్పు పట్టే మానసిక రోగులకు ఇందులోనూ స్టాలిన్ కుట్ర కనుపిస్తుంది. హేరిసన్ సాలిస్ బరీ పైసంఘటన గురించి '....ఈ సమావేశం ఎందుకు జరిగిందో అర్థం కాదు. ఒకవేళ స్టాలిన్ గ్రాడ్ యుద్ధం విఫలమైన పక్షంలో వాసిలేవస్కీ, ఝుకోవ్ లను బాధ్యులను చెయ్యడానికి స్టాలిన్ కుట్ర అనిపిస్తోంది....' అని రాశాడు. స్టాలిన్ వ్యతిరేకతతో అంధులైన వారు వాస్తవాలను చూడలేరు కదా!

చివరన మార్షల్ ఝుకోవ్ - '.....జనరల్ హెడ్ క్వార్టర్స్ ఒక క్రమ పద్ధతిలో సమర్థవంతంగా పని చేసేది. ప్రతీ ఒక్కరికీ వారి అభిప్రాయాన్ని వెల్లడించడానికి ఒక అవకాశం ఉండేది. స్టాలిన్ వక్త చెప్పేది శ్రద్ధగా వినేవాడు. నా అనుభవాన్ని బట్టి నేను చెబుతున్నాను. స్టాలిన్ కు అప్రియమైన ఏ విషయమైనా నిరభ్యంతరంగా అతని ముందు పెట్టవచ్చు, చర్చించవచ్చు. ఆ వ్యక్తి వాస్తవాల ఆధారంగా తన అభిప్రాయాన్ని వివరించగలిగితే స్టాలిన్ అంగీకరించేవాడు. స్టాలిన్ అలా చేసేవాడు కాదని ఎవరేనా అంటే అది అసత్యం మాత్రమే.....' అన్నాడు (ibid., p. 148).

ఇంతకంటే ఈ అసత్యం గురించి వివరించాల్సిందేముంటుంది?

5. 1937లో ఎర్రసైన్యంలో స్టాలిన్ జరిపిన ప్రక్షాళన కార్యక్రమం సైన్యాన్ని బలహీనపరిచింది.

1936-1938ల మధ్య కాలంలో రష్యా చాలా ఒడిదుడుకులకు గురయింది.

Edit with WPS Office

1934లో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు కిరోవ్ హత్య చెయ్యబడ్డాడు. ఈ హత్య తర్వాత ట్రాట్ స్కీయిస్టులు జర్మనీతో చేతులు కలిపి స్టాలిన్ ప్రభుత్వాన్ని కూలద్రోయాలని ప్రయత్నించారు అన్న కుట్ర బయటపడింది. ఈ కుట్ర, ప్రభుత్వంలోనూ పార్టీలోనూ సైన్యంలోనూ శత్రు కార్యకలాపాలను నిర్మూలించే ప్రక్షాళన కార్యక్రమానికి దారి తీసింది. దీన్ని 'The Great Purge' అంటారు బూర్జువా చరిత్రకారులు. స్టాలిన్ రక్త దాహానికి నిదర్శనంగా ఈ ప్రక్షాళన కార్యక్రమాన్ని ఉదహరిస్తూ స్టాలిన్ బాధితుల పట్ల కడవలకొద్దీ కన్నీళ్లు కారుస్తుంటారు. ఈ కుట్రా, దానికి సంబంధించిన విచారణ వివరాలలోకి మనం వెళ్ళనక్కర్లేదు కాని కొన్ని విషయాలు గమనించాలి. ఈ విచారణ బహిరంగంగా జరిగింది. విదేశీయులు చాలా మంది ఈ విచారణను జాగ్రత్తగా పరిశీలించారు. అటువంటి వారిలో జోసెఫ్ ఇ. డేవీస్ ఒకరు. అతను అమెరికా రాయబారి మాత్రమే కాదు, ప్రముఖ న్యాయవాది కూడా.

జోసెఫ్ డేవీస్ 1938 మార్చి 17న అమెరికన్ ప్రభుత్వానికి పంపించిన రహస్య నివేదికలో '.....సాక్షులు సాక్ష్యంచెప్పే తీరూ, అప్రయత్నంగా సాక్షులు చెబుతున్నది ఒకదానినొకటి రుజువు చేస్తున్న తీరూ, ఈ విచారణకు సంబంధించిన ఇతర వాస్తవాలూ పరిశీలించిన తర్వాత, ఈ రాజకీయ నేరస్తులు సోవియట్ చట్టాల ప్రకారం నేరాలు చేశారని ఏ సందేహానికి తావు లేకుండా రుజువవుతోంది...వీరిని దేశ ద్రోహ నేరం క్రింద సోవియట్ చట్టాలననుసరించి శిక్షించడం సరైనదే.....ఈ విచారణకు రెగ్యులర్ గా హాజరయిన దౌత్య వర్గాల వారు కూడా ప్రభుత్వానికి తీవ్రమైన రాజకీయ వ్యతిరేకత ఉందనీ, చాలా తీవ్రమైన కుట్ర ఉందనీ జరుజువైందనే అభిప్రాయంతో ఉన్నారు....' అని రాశాడు (Mission to Mosow, p. 163).

జర్మనీ కేవలం సైనిక బలంతోనే యూరోపు అంతా గెలిచిందనుకోవడం పొరపాటు. జర్మనీ గెలిచిన ప్రతీ దేశంలోనూ జర్మన్ అనుకూల పంచమాంగ దళం చురుకుగా పని చేసేది. రష్యాలో ఈ పంచమాంగ దళం సమూలంగా నిర్మూలించబడింది. నాజీ జర్మనీతో చేతులు కలిపి సోవియట్ ప్రజలకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్న శక్తులను నిర్దాక్షిణ్యంగా నిర్మూలించి స్టాలిన్ రష్యాకు, ప్రపంచానికి గొప్ప సేవ చేశాడు. అతను అలా చెయ్యకపోతే, జర్మన్ల తొత్తుగా నార్వేను జర్మనీకి అప్పగించి, ఇంగ్లీషు భాషను తన పేరుతో సుసంపన్నం చేసి ఖ్యాతి (లేదా అపఖ్యాతి) పొందిన 'క్విజ్లింగ్' (ఇంగ్లీషు భాషలో క్విజ్లింగ్ అంటే 'తొత్తు' అని అర్థం) లాంటి తొత్తులు రష్యాలో కూడా తలెత్తేవారు. యుద్ధం ప్రారంభం కాగానే జర్మనీ అనుకూల రాజకీయ, సైనిక తిరుగుబాటు చేసి హిట్లర్ ఆశించినట్లు ఆరువారాల్లో సోవియట్ యూనియన్ పతనానికి దారి తీసేవారు. యూరోపు ఆర్థిక శక్తితో పాటు రష్యా ఆర్థిక శక్తిని కూడా కలుపుకుని, జపాన్ తో చేతులు కలిపితే ఇండియా, చైనాలతో సహా ప్రపంచమంతా ఫాసిస్టుల వశమయ్యేది. చరిత్ర మరో శతాబ్దం వెనక్కు నడిచేది.

ఈ విచారణలో రాజకీయ నాయకత్వానికీ సైన్యానికీ మధ్య సంబంధం బయటపడింది. 1937 మే 26న మార్షల్ తుఖాచ్ వస్కీ మరి ఏడుగురు కమాండర్లూ అరెస్టయ్యారు. మిలిటరీ ట్రైబ్యునల్ విచారణ తర్వాత వారిని కాల్చి వెయ్యడం జరిగిందని జులై 12న ప్రకటన వెలువడింది. సైన్యంలో వేలమంది ఆఫీసర్లు అరెస్టయ్యారు. కొంతమంది మరణ శిక్షకు గురయ్యారు. కొంతమంది సైన్యాన్నుంచి తొలగించబడి పౌర జీవితం ప్రారంభించారు. కొంతమంది కేసులను సమీక్ష చేసి తిరిగి సైన్యంలోకి తీసుకుని వారి ఉన్నత స్థానాలను కూడా ఇవ్వడం జరిగింది. మార్షల్ ఝుకోవ్ లాంటి వారు సైన్యంలో జరిగిన ఈ ప్రక్షాళన కార్యక్రమ అవసరాన్ని అర్థం చేసుకోలేదు.

అలెగ్జాండర్ వెర్త్ సైన్యంలో జరిగిన ఈ ప్రక్షాళన కార్యక్రమం గురించి తన పుస్తకం 'మాస్కో 41' లో ఇలా రాశాడు - '....ఎర్రసైన్యంలో ఈ ప్రక్షాళన కార్యక్రమం జర్మనీతో యుద్ధం అనివార్యం అన్న స్టాలిన్ నమ్మకంతో ముడిపడి ఉందని నా ధృఢాభిప్రాయం. తుఖాచ్ వస్కీ జర్మనీ మనిషి అని ఫ్రెంచి వారు కొందరు నాతో చెప్పారు. జెక్ దేశీయులు మరో కథ చెప్పారు. తుఖాచ్ వస్కీ ప్రేగ్ (జకోస్లోవేకియా రాజధాని) వచ్చినప్పుడు, తాగి ఉన్న స్థితిలో హిట్లర్ తో ఒప్పందం ఒక్కటే జకోస్లోవేకియాకి, రష్యాకి మిగిలిన ఆశ అంటూ స్టాలిన్ ను తిట్టడం ప్రారంభించాడు. జక్స్ ఈ విషయాన్ని క్రెమ్లిన్ కు తెలియజేశారు. దానితో తుఖాచ్ వస్కీ అతని అనుచరులా కథ ముగిసింది....' అని రాశాడు (Another view of Stalin, p. 63)

జనరల్ తుఖాచ్ వస్కీ నిజాయితీ గల సమర్థుడైన సైనికాధికారి అనీ, స్టాలిన్ అనుమాన పిశాచానికి అతనూ, అతని సహచరులూ బలైపోయారన్న ప్రచారం జరిగింది, జరుగుతోంది.

జోసెఫ్ డేవీస్ (జూన్ 28, 1937) - '....సైనిక తిరుగుబాటుకు సంబంధించిన కుట్ర ఒకటి

Edit with WPS Office
ఖచ్చితంగా ఉందని విశ్వసించడం జరుగుతోంది. స్టాలిన్ కు వ్యతిరేకంగా కాకపోవచ్చు.....పార్టీకి వ్యతిరేకంగా కావచ్చు. స్టాలిన్ ధైర్యంగా, వేగంగా, సమర్థవంతంగా దాన్ని అణచివేశాడు...' అని రాశాడు (Mission to Moscow, p. 99).

అలెగ్జాండర్ వెర్త్, జోసెఫ్ డేవీస్ లు చెబుతున్నట్లు స్టాలిన్ కి వ్యతిరేకంగా ఒక కుట్ర ఉన్న మాట వాస్తవం. మాస్కో, లెనిన్ గ్రాడ్ లలో ఉన్న ముఖ్య సైనిక దళాలపై సైనిక చర్యతో ఈ తిరుగుబాటు ప్రారంభమవుతుంది. ఈ సైనిక తిరుగుబాటుకు తుఖాచ్ వస్కీ నాయకుడు. ఈ తిరుగుబాటు తర్వాత యుక్రెయిన్ తో సహా విశాల భూభాగాలను నాజీ జర్మనీకి అప్పగించడానికి ఒక ఒప్పందం ఉందని 1938లో బహిరంగ విచారణలో బుఖారిన్ అంగీకరించాడు. విప్లవ ద్రోహులకు తన సహాయాన్ని అందించడానికి నాజీ జర్మనీ విధించిన షరతు అది. తుఖాచ్ వస్కీ తదితర నేరస్తులు టెర్రరిజం, అవినీతి, హత్యా ప్రయత్నం, దేశద్రోహ నేరాల క్రింద నేరాలు చేసినట్లు రుజువై వారిని కాల్చివేయడం జరిగింది. వీరిని స్టాలిన్ అనుమాన పిశాచికి బలైపోయిన అమాయకులుగా చిత్రించడం చరిత్రను వక్రీకరించడమే.

జోసెఫ్ డేవీస్ డైరీ (జులై 4, 1937) - '.....(ఈ రోజు) లిత్వినోవ్ తో మాట్లాడాను. ఈ ప్రక్షాళన కార్యక్రమాల మీదా, ఎర్ర సైన్యం జనరల్స్ ను కాల్చి వేయడం గురించీ అమెరికా, పశ్చిమ దేశాల అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పాను. ఇదంతా చెడ్డ పరిణామమనీ, సోవియట్ యూనియన్ ను అపఖ్యాతి పాలు చేస్తుందనీ చెప్పాను.....లిత్వినోవ్ నిర్మొహమాటంగా మాట్లాడాడు. ఈ ప్రక్షాళన కార్యక్రమాల ద్వారా బెర్లిన్, టోక్యోలతో చేతులు కలిపే ద్రోహులెవ్వరూ మిగలకుండా చెయ్యాల్సి వచ్చిందనీ, ఏదో ఒక రోజు (రష్యన్) ప్రభుత్వాన్ని విద్రోహుల నుండి కాపాడడానికి వారు చేసింది ప్రపంచం అర్థం చేసుకుంటుందనీ అన్నాడు. హిట్లర్ ప్రపంచాన్నంతా ఆక్రమించే ప్రమాదం నుండి తమను తాము రక్షించుకోవడానికి చేపట్టిన ఈ చర్యలు సోవియట్ యూనియన్ ను సంరక్షించి, నాజీలకు వ్యతిరేకంగా ఒక కంచుకోటలా చేశాయి. ఆ విధంగా సోవియట్ యూనియన్ ప్రపంచానికి చేసిన సేవలు గుర్తించి, స్టాలిన్ ఎంత గొప్ప వ్యక్తో ప్రపంచం గుర్తిస్తుంది' అని అన్నాడు (ibid. P. 103).

సైన్యంలో ఈ ప్రక్షాళన కార్యక్రమం సైన్యాన్నీ దేశాన్నీ బలహీన పరిచిందా? బలరపచిందా? ఈ ప్రశ్నకు సమాధానం చూద్దాం.

రోబర్ కోలోండర్ (Robert Coulondre) 1936-38కాలంలో మాస్కోలో ఫ్రెంచి రాయబారిగా ఉన్నాడు. అతను తన జ్ఞాపకాలలో -

'....ఫ్రెంచ్ విప్లవకాలంలో విప్లవ భయోత్పాతం (Revolutioary terror) భూస్వాములను నిర్దాక్షిణ్యంగా అణచి వేసి ఫ్రెంచ్ ప్రజలు యూరోపియన్ రాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడేలా చేసింది. అదే సమయంలో ఫ్రెంచ్ విప్లవాన్ని వ్యతిరేకిస్తున్న దేశాలు - ముఖ్యంగా ఇంగ్లండ్, రష్యాలు - విప్లవ భయోత్పాతం చూసి ప్రభుత్వం ముక్కచెక్కలయిపోతోందని భ్రమ పడ్డాయి. నిజం చెప్పాలంటే విప్లవ ప్రభుత్వం బలపడింది కాని బలహీన పడలేదు. సోవియట్ విప్లవంలో కూడా అదే జరుగుతోంది.....తుఖాచ్ వస్కీ అరెస్టయిన తర్వాత అనేక మంది బోల్షివిక్ నాయకులతో పరిచయం ఉన్న ఒక లిథుయేనియన్ మంత్రి, తుఖాచ్ వస్కీ సైన్యం మీద పార్టీ అజమాయిషీని నిరసిస్తున్నాడనీ, కమ్యూనిస్టు పార్టీ పీక నొక్కేసి సైనిక నియంతృత్వం తీసుకురావాలని ప్రయత్నించాడనీ చెప్పాడు.....నేను సోవియట్ హింస అనే దానికి సరియైన నిర్వచనం ఇచ్చానని నా నివేదికలు వెల్లడిస్తాయి. రష్యా ముక్క చెక్కలయిపోతోందనీ రష్యన్ బలగాలు నీరసించి పోతున్నాయనీ భావించకూడదని నేను పదే పదే చెబుతున్నాను.....' అని తుఖాచ్ వస్కీ కాల్చి వేయడం గురించీ, సైన్యంలో ప్రక్షాళన గురించీ చెప్పాడు (Another view of Stalin, p. 64).

ఒక్క తాపు తంతే రష్యాకూలిపోతుందనితాపు తన్ని రెండు కాళ్ళూ విరగ్గొట్టుకున్న హిట్లర్ తుఖాచ్ వస్కీ విచారణ గురించి ఏమన్నాడో చూద్దాం. 1943 మే 8న గోబెల్స్ తన జర్నల్ లో ఇలా రాశాడు - 'తుఖాచ్ వస్కీ కేసు గురించి హిట్లర్ మరోసారి మాట్లాడాడు. స్టాలిన్ ఎర్ర సైన్యాన్ని నాశనం చేశాడని మనం అప్పుడు తప్పుగా భావించాం. కాని నిజానికి దానికి వ్యతిరేకంగా జరిగింది. సైన్యంలో తనను వ్యతిరేకించేవారినందరినీ స్టాలిన్ నిర్మూలించి, సైన్యంలో ఓటమి ధోరణి లేకుండా చేశాడు...' (ibid., p. 66)

చర్చల్ తన జ్ఞాపకాలలో, స్టాలిన్ ను కూలద్రోసి జర్మన్ అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి జకోస్లోవేకియాలోని రష్యన్ రాయబార కార్యాలయం ద్వారా హిట్లర్ తో సంప్రదింపులు జరిగిన

Edit with WPS Office
విషయాన్ని ప్రస్తావిస్తూ - '.....రష్యాలో రాజకీయంగా, సైనికంగా, శత్రు నిర్మూలనం జరిగింది. బహుశా ఇది అనవసరం అనలేం. రష్యన్ సైన్యంలో జర్మన్ అనుకూల శక్తులను నిర్మూలించడంజరిగింది. హిట్లర్ ఇది స్పష్టంగా అర్థం చేసుకున్నాడు. ఫ్రెంచ్, బ్రిటిష్ ప్రభుత్వాలు ఇంత తెలివితేటలు చూపించాయని నేను అనుకోవడం లేదు. బ్రిటిష్, ఫ్రెంచ్ ప్రభుత్వాలు 1937 ప్రక్షాళన కార్యక్రమం రష్యన్ సైన్యాన్ని ముక్కలు చెయ్యడం, భయంకరమైన ద్వేషాలు, పగలతో సోవియట్ యూనియన్ ముక్కలైపోవడం మాత్రమే చూశాయి....' అని రాశాడు (ibid., p. 65)

జోసెఫ్ డేవీస్ 1938 జూన్ 6న పంపిన ఒక నివేదికలో - '...ప్రక్షాళనకు గురయిన వారి సంఖ్య ఎక్కువే అయినా జనాభా సంఖ్యతో పోల్చి చూస్తే చాలా తక్కువ. కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం 30 లక్షలు....ఈ ప్రక్షాళనలో పార్టీ పూర్తిగా మార్చి వేయబడింది. కొత్త రక్తం, యువరక్తం చేరింది. వీరంతా స్టాలిన్ మనుషులు....సామాన్య ప్రజలు దీన్ని గురించి పెద్ద పట్టించుకున్నట్లు కనుపించదు. కొన్ని సందర్భాలలో వాళ్ళను వేధించే అధికారుల, విచ్చిన్నకారుల, తమ ప్రియతమ సోవియట్ యూనియన్ కు వ్యతిరేకంగా కుట్ర చేసిన దేశద్రోహుల, నిర్మూలనను అంగీకరిస్తున్నారు....' (Mission to Moscow, p. 246)

'....పార్టీ నాయకులు ఈ హింస అనివార్యమైనందుకు చింతిస్తున్నారు. తమ విద్యుక్త ధర్మ నిర్వహణలో ఇలాంటి సెంటిమెంట్లు అడ్డురాకూడదని భావిస్తున్నారు. మహత్తర విప్లవాలు సెంట్లు చిలకరించడం వలన సంభవించవని వాళ్ళు నమ్ముతున్నారు. ఇంతకు ముందు కార్మిక వర్గ ఉద్యమాలు తప్పుడు సెంటిమెంట్ల వలనా బలహీనతల వలనా నాశనమయ్యాయని వాళ్ళు అంటున్నారు....ఇటువంటి పరిస్థితులలో కొంతమంది నిరపరాధులు బలయిపోతారనే విషయాన్ని వాళ్ళు గుర్తిస్తున్నారు. దాన్ని గురించి వాళ్ళు బాధపడుతున్నారు. విప్లవాన్ని రక్షించేందుకు ఇదంతా చేసి తీరాలంటున్నారు.....భవిష్యత్తులో మెరుగుపడిన కార్మికుల జీవితాలు ఇప్పుడు చేస్తున్న పోరాటాన్ని న్యాయమైన పోరాటంగా చరిత్రలో రుజువు చేస్తాయని వారు అంటున్నారు....' అని రాశాడు (ibid. P. 183).

పశ్చిమ దేశాలలోనూ, స్టాలిన్ తదనంతరం రష్యాలోనూ, స్టాలిన్ ప్రక్షాళనలో సైనిక నాయకత్వాన్ని తుడిచి పెట్టేసి సైన్యాన్ని బలహీనపరిచాడని ప్రచారం జరిగింది. కాని వాస్తవం మరోలా ఉంది.

1937లో ఎర్ర సైన్య, వైమానిక బలగాలలో 1,44,300 మంది ఆఫీసర్లూ రాజకీయ కమిస్సార్లూ ఉంటే 1939 నాటికి ఈ సంఖ్య 2,82,300 అయింది. 1937-38 ప్రక్షాళన కార్యక్రమంలో 34,300 మంది ఆఫీసర్లు రాజకీయ కారణాల వలన సైన్యం నుండి తొలగించబడ్డారు. 1940 మే నాటికి వీరిలో 11,596 మందిని విచారణ తర్వాత తమ పదవుల్లోకి తిరిగి తీసుకోవడం జరిగింది. అంటే 1937-38 ప్రక్షాళన కార్యక్రమంలో 22,705 మంది ఆఫీసర్లూ రాజకీయ కమిస్సార్లూ సైన్యం నుండి తొలగించబడ్డారు. వీరిలో కొంతమందిని దేశ ద్రోహులుగా శిక్షించడం జరిగింది కాని మెజారిటీ సైన్యం నుండి తొలగించబడిన తర్వాత పౌర జీవితం ప్రారంభించారు (Lies coelcerning the history of the Soviet Union by Mario Sousa, Member of the Communist Party Marxist-Leninist Revolutionaries, Sweden, p. 21).

సైన్యంలో ఈ ప్రక్షాళన ఎలా జరిగిందో జనరల్ ఛర్నికోవస్కీ జీవిత చరిత్ర చూస్తే తెలుస్తుంది. స్టాలిన్ పిచ్చెక్కినట్లు అనుమానం వచ్చిన వాడినల్లా కాల్చెయ్యలేదని అర్థమవుతుంది. జరనరల్ ఛర్నికోవస్కీ సోవియట్ సైన్యంలో ప్రసిద్ధుడైన కమాండర్ - యుద్ధం తొలి రోజులనుండీ అతను యుద్ధంలో పాల్గొన్నాడు. 1945 ఫిబ్రవరిలో అతను యుద్ధరంగంలో మరణించాడు.

ఛర్నికోవస్కీ మిలిటరీ ఎకాడమీలో శిక్షణ పూర్తి చేసి సైన్యంలో భవిష్యత్తు గురించి కలలు కంటున్న సమయంలో అతని మీద ఒక ఆరోపణ వచ్చింది. తోమాష్ పోల్ జిల్లా పార్టీ కమిటీ అధికారి, పెస్కుడ్ అనే వ్యక్తి, ఛర్నికోవస్కీ తన గురించి నిజాల్ని దాచాడనీ, అతను ఎర్ర సైన్యంలో ఉండడానికి అనర్హుడనీ ఆరోపించాడు.

ఛర్నికోవస్కీ శ్రద్ధగా చదివి ప్రధమ శ్రేణిలో ఉత్తీర్ణుడవడం కూడా ద్రోహపూరితమే అనే ఆరోపణను కొందరు ఎకాడమీ పార్టీ మీటింగులో చేస్తారు. కొందరు ఛర్నికోవస్కీని సమర్థిస్తారు. మరి కొందరు అతన్ని పార్టీ నుంచి తొలగించాలని ప్రతిపాదిస్తారు. చీఫ్ ఇన్ స్ట్రక్టర్ కోటోవ్ ఆ ప్రతిపాదనను అంగీకరించక ఎకాడెమీ నుండి ఎవరినైనా ఛర్నికోవస్కీ పట్టణానికి పంపించి నిజానిజాలు

Edit with WPS Office
విచారించాలనీ, అంతవరకూ ఏ నిర్ణయం తీసుకోకూడదనీ సూచిస్తాడు. అతని ప్రతిపాదన నెగ్గుతుంది.

సమావేశానంతరం కోటోవ్, ఛర్నికోవస్కీని తన ఆఫీసుకు పిలిచి అతన్ని తన వివరాలు చెప్పమని అడుగుతాడు. ఛర్నికోవస్కీ రెండు గంటలపాటు తన కుటుంబం గురించి వివరిస్తాడు. పార్టీ సమావేశంలో మిత్రుడు దేవిదోవస్కీ (ఛర్నికోవ్ ను పార్టీ నుంచి తొలగించాలని ప్రతిపాదించిన వ్యక్తి) చేసిన విమర్శల గురించి బాధపడవద్దనీ, ట్రాట్ స్కీ, జినోవీవ్, బుఖారిన్ లాంటి ద్రోహుల విచారణ ప్రభావం తమ అందరి మీదా ఉందనీ చెబుతాడు. దేవిదోవస్కీ విషయంలో శత్రువు పట్ల ఉండవలసిన జాగరూకత స్థానంలో అనుమానం పైచేయి చేసుకుందని చెబుతాడు.

నీ గ్రామానికి చెందిన నమ్మకస్తుడైన మిత్రుడెవరైనా మాస్కోలో ఉన్నాడా? నువ్వు చెప్పినదంతా నిజమేనని అతను ధృవపరచగలడా? అని అడుగుతాడు.

ఛర్నికోవస్కీ ఒక మిత్రుని తీసుకుని సోవియట్ కంట్రోల్ కమిషన్ సభ్యురాలు మరియా ఉల్యానోవాని (ఈవిడ లెనిన్ సోదరి) కలుసుకుంటాడు. ఆవిడ ఛర్నికోవస్కీ చెప్పినది సానుభూతితో విని తన కింది అధికారిని పిలిచి నాలుగు రోజులలో ఈ కేసు వివరాలు పరిశీలించే ఏర్పాటు చెయ్యమని చెబుతుంది.

ఛర్నికోవస్కీకి సైన్యంలో ప్రమోషను కూడా వస్తుంది కాని సెక్యూరిటీ సర్వీసు అధికారులు అతన్ని మాటి మాటికి విచారణకు పిలుస్తుంటారు.

ఛర్నికోవస్కీ మీద ఆరోపణ చేసిన పార్టీ అధికారి పెస్కూడ్, లెనిన్ సోదరి సలహా మీద జిల్లా పార్టీ కమిటీ నుంచి తొలగించబడి, బేంక్ మేనేజర్ గా పని చేస్తుంటాడు. ఒక రోజు పెస్కూడ్ పేరుతో పత్రికలో ప్రచురించబడిన ఒక వ్యాసం ఖార్కోవ్ నగరంలో ఉన్న అతని 'సోదరుడి' కంటపడుతుంది. సోదరుడి పేరు కూడా పెస్కూడ్. అంతర్యుద్ధంలో ఇతని అన్న పెస్కూడ్ ఎర్ర సైన్యం కమాండరుగా ఉండి యుద్ధంలో మరణించాడు. ఈ పెస్కూడ్ ఎవరా అని ఆశ్చర్యపోయి 'సోదరుడిని' కలుసుకోవడానికి వస్తాడు. దానితో అసలు విషయం బయటపడుతుంది.

అంతర్యుద్ధంలో పెస్కూడ్ ను హత్య చేసి, అతని కాగితాలు దొంగిలించి, పెస్కూడ్ పేరుతో చలామణీ అవుతున్న ఈ నకిలీ పెస్కూడ్ శత్రు ఏజెంటుగా బయటపడతాడు.

ఛర్నికోవస్కీ విషయంలో అంతా సవ్యంగా ముగిసింది కాని అనేక మంది నిరపరాధుల విషయంలో ద్రోహులు బయటపడక వారికి శిక్ష పడి ఉండవచ్చు. ఇది విచారించవలసిన విషయమే కాని శత్రువుతో ముఖాముఖి చేసే యుద్ధంలోనే కాదు, శత్రువు రహస్యంగా సాగించే విధ్వంస కార్యకలాపాలలో కూడా విప్లవకారులు నష్టపోతారు. వర్గ పోరాటంలో అనివార్యంగా జరిగే నష్టాలుగానే వాటిని స్వీకరించాలి.

ఎర్ర సైన్యంలో ఈ ప్రక్షాళన కార్యక్రమం వలన సైన్యం బలహీన పడిందనీ, తొలి దశలో తీవ్ర అపజయాలకు గురియిందనీ స్టాలిన్ తదనంతరం ప్రచారం జరిగింది. నిజంగా సైన్యం బలహీనపడిందా లేక బలపడిందా అన్న విషయం గురించి జోసెఫ్ డేవీస్ ఇలా రాశాడు - '.....ప్రక్షాళనలో సీనియర్ కమాండర్లను తొలగించడం వలన యువ ఆఫీసర్లకు ప్రమోషను వచ్చింది. వీరికి తొలగించబడిన ఆఫీసర్లకున్న అనుభవం లేకపోయినా పార్టీ పట్లా, ప్రభుత్వం పట్లా విధేయత చాలా ఎక్కువ. ఈ మార్పులు సామాన్య సైనికుల్లో విశ్వాసం కలిగించాయి. ట్రాట్స్కీయిస్టు ద్రోహుల చేతుల్లో కాక నిజాయితీ గల నమ్మదగిన ఆఫీసర్ల చేతుల్లో తమ జీవితాలు సురక్షితంగా ఉన్నాయని వారు భావిస్తున్నారు. ట్రాట్ స్కీయిస్టు ఆఫీసర్లు తమ ద్రోహాలకు తగిన శిక్ష అనుభవించారని కూడా వారు అనుకుంటున్నారు' అని రాశాడు (Mission to Moscow, p. 296).

చివరన మాలటోవ్ జ్ఞాపకాల నుండి - '....ఎంతో ఉద్రిక్త వాతావరణం ఉన్న కాలం అది. నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఇది సరియైనదే అని నేననుకుంటున్నాను. తుఖాచ్ వస్కీ, యకీర్, రైకోవ్, జినోవీవ్ లు యుద్ధకాలంలో తిరుగుబాటు చేస్తే భయంకరమైన పోరాటం జరిగేది. భయంకరమైన ప్రాణ నష్టం జరిగేది. ఇరు పక్షాలూ నాశనమయ్యేవి....వాళ్ళకు (తుఖాచ్ వస్కీ తదితరులకు) హిట్లర్ దాకా సంబంధాలున్నాయి - హిట్లర్ దాకా. ట్రాట్ స్కీ కి కూడా నిస్సందేహంగా అటువంటి సంబంధాలున్నాయి. హిట్లర్ లాగే ట్రాట్ స్కీ దుస్సాహసి. వాళ్ళిద్దరికీ పోలికలున్నాయి. రైటిస్టులు బుఖారిన్, రైకోవ్ లకు కూడా వాళ్ళతో సంబంధాలున్నాయి.....సైనికాధికారులకు సరే సరి....' (Another view of Stalin, p. 67).

Edit with WPS Office

6. స్టాలిన్ పిరికితనం, అజ్ఞానం, హిస్టీరియా, పొగరుమోత్తనం వగైరాల గురించి.....

'.....స్టాలిన్ గ్లోబు మీద ఆపరేషన్స్ ప్లాను వేస్తుండేవాడు.....నిజం కామ్రేడ్స్....గ్లోబు మీద యుద్ధరేఖ గీస్తుండేవాడు.....స్టాలిన్ కు యుద్ధ రంగంలో పరిస్థితి తెలిసేది కాదు....ఇది సహజమే. ఎందుకంటే అతను ఎన్నడూ యుద్ధరంగంలో అడుగు పెట్టలేదు..' - కృశ్చేవ్ రహస్య నివేదిక.

'.....స్టాలిన్ తనను ఒక గొప్ప నాయకుడిగా చిత్రించుకోవడానికి ఎంతో ప్రచారం సాగించాడు....ఉదాహరణకు మన చారిత్రక, యుద్ధానికి సంబంధించిన సినిమాలు చూడండి.....అవి మనకు వికారం కలిగిస్తాయి. వాటి లక్ష్యం ఏమిటంటే స్టాలిన్ ను ఒక గొప్ప సైనిక మేధావిగా ప్రచారం చెయ్యడం....స్టాలిన్ కాదు, పార్టీ మొత్తం, సోవియట్ ప్రభుత్వం, మన సైన్యం, ప్రతిభావంతులైన దాని నాయకులు, వీరులైన మన సైనికులు, మొత్తం సోవియట్ దేశం - వీరంతా కూడా దేశభక్తి ప్రపూరిత మహా యుద్ధంలో మనకు విజయం కలిగేలా చేశారు...'

'.....యుద్ధరంగంలో (తొలి) తీవ్ర అపజయాల తర్వాత స్టాలిన్ అంతా అయిపోయింది అని భావించాడు.....స్టాలిన్ చాలాకాలం వరకూ యుద్ధ నిర్వహణలో కలుగజేసుకోలేదు. ఈ వ్యవహారాలన్నీ పూర్తిగా వదిలేశాడు'

'....1941 అక్టోబరులో కేంద్ర కమిటీ ప్లీనం సమావేశం ఏర్పాటు చెయ్యడానికి ప్రయత్నం జరిగింది. దేశం నలుమూలలనుండీ కేంద్ర కమిటీ సభ్యులు మాస్కో చేరుకున్నారు....స్టాలిన్ వారిని కలుసుకుని మాట్లాడడానికి ఇష్టపడలేదు. స్టాలిన్ తొలి నెలలలో ఎంత అధైర్యంగా ఉన్నాడో దీన్నిబట్టి అర్థం అవుతుంది....'

- కృశ్చేవ్ రహస్య నివేదిక

మరొక చరిత్రకారుడు ఎలెన్ స్టీన్ - '.....స్టాలిన్ 11 రోజులు ఏకధాటిగా వోడ్కా తాగుతూ పడున్నాడు...' అని రాశాడు.

ఈ రకమైన ప్రచారం స్టాలిన్ మరణించినప్పటినుండీ రకరకాలుగా సాగుతోంది. ఎవరి ఊహాశక్తిననుసరించి వారు, స్టాలిన్ క్రెమ్లిన్ లో తన గదిలో తలుపులు వేసుకుని తాగుతూ కూర్చున్నాడనీ, కుంట్సేవోలో తన కుటీరం (దాచాలో) తాగి పడుండేవాడనీ రాశారు.

సోవియట్ యూనియన్ పతనం తర్వాత స్టాలిన్ ప్రభుత్వ రికార్డులు పరిశీలకులకు లభ్యమయ్యాయి. ఎడింబర్గ్ యూనివర్సిటీకి చెందిన స్టీవెన్ మెయిన్ ఆ కాలం నాటి స్టాలిన్ దినవారీ కార్యక్రమాల (ఎప్పాయింట్ మెంట్) డైరీలు పరిశీలించాడు. అతని పరిశీలనా వివరాలు (Steven J. Main: 'Stalin in June 1941: A comment on Cynthia Roberts', in: 'Europe-Asia Studies', Vol. 48, No. 5 (July 1996), p. 8307 as quoted in Compass Munist League, April 2000, No. 135).

'....యుద్ధం ప్రారంభమైన మొట్టమొదటి రోజు (జూన్ 22), స్టాలిన్ అఫిషియల్ దిన కార్యక్రమం ఉదయం 5.45 ని. కు ప్రారంభమై సాయంత్రం 4.45 ని. ముగిసింది.....స్టాలిన్, మాలటోవ్ (విదేశాంగ వ్యవహారాల ప్రజా కమిస్సార్), టిమోషెంకో (రక్షణ శాక ప్రజా కమిస్సార్), ఝుకోవ్ (ఎర్ర సైన్యం చీఫ్ ఆఫ్ స్టాఫ్), కుజ్నెట్సోవ్ (ఉత్తర కకాసస్, బాల్చిక్ మిలిటరీ జిల్లాల కమాండరు), షపోష్నికోవ్ (రక్షణ సాఖలో డిప్యూటీ ప్రజా కమిస్సార్) లను, ముఖ్య సోవియట్ ప్రభుత్వ, సైనికాధికారులనూ కలిశాడు. దాడి మొదటి రోజున, స్టాలిన్ సోవియట్ ప్రభుత్వానికీ సైన్యానికీ చెందిన 15 మందిని కలిశాడు.....'

ఈ కార్యక్రమాలు అఫీషియల్ రికార్డులలో ఉన్నవి మాత్రమే. ఇది కాకుండా స్టాలిన్ జూన్ 21 రాత్రి తన ఆఫీసులో పని చేస్తున్నట్లు ఝుకోవ్ రాసిన దానిని బట్టి తెలుస్తుంది. ఝుకోవ్ రాత్రి పన్నెండున్నరకు (అంటే తెల్లవారితే 22 అనగా) స్టాలిన్ కు ఫోను చేశాడు.

'...జర్మన్లు సైన్యాన్ని సరిహద్దులకు తరలిస్తున్నారని స్పష్టమవుతోంది. రాత్రి పన్నెండున్నర గంటలకు స్టాలిన్ కు ఈ సంగతి తెలియజేశాం. స్టాలిన్ అన్ని (మిలిటరీ) జిల్లాలకూ ఆదేశాలు పంపడం జరిగిందా అని ప్రశ్నించాడు. పంపించామని నేను తెలియజేశాను.....' - (G. Zhukov, Reminiscences and Reflections, Vol. I, p. 280).

తిరిగి తెల్లవారగట్ల 3.30 గంటలకు ఝుకోవ్ స్టాలిన్ కు ఫోను చేశాడు.

'....3.30 గంటలకు.....రక్షణ కమిస్సార్ స్టాలిన్ కు ఫోన్ చెయ్యమని ఆదేశించాడు. నేను ఫోను

Edit with WPS Office
చేశాను. నా ఫోనును రక్షణ విభాగంలో డ్యూటీలో ఉన్న జనరల్ నిద్రమత్తుతో అందుకున్నాడు. స్టాలిన్ ను ఫోను దగ్గరకు పిలవమని చెప్పాను.....మూడు నిమిషాల తర్వాత స్టాలిన్ లైనుమీదకు వచ్చాడు....' -(ibid., p. 281).

(ఝుకోవ్ చెప్పినది సరి కాదనీ, రాత్రి పన్నెండు గంటలదాకా పని చేసిన తర్వాత, తిరిగి తెల్లవార కట్ల రెండు గంటలకే పాలిట్ బ్యూరో సమావేశంలో ఉందని మాలటోవ్ Molotov Remembers (p. 36) లో తెలియజేశాడు).

యుద్ధం ప్రారంభమైన వారంలో స్టాలిన్ కార్యక్రమాల గురించి స్టాలిన్ డైరీ ఏం చెబుతున్నదో చూద్దాం.

'....అఫీషియల్ రికార్డుల ప్రకారం ఈ వారంలో స్టాలిన్ తక్కువ పని చేసిన రోజు జూన్ 24. ఆ రోజు 5 గంటలు పైన పనిచేశాడు. అయితే అంతకు ముందు రోజు, జూన్ 23న, దాదాపు 24 గంటలు పని చేశాడు (22 గంటల 35 నిమిషాలు)....జూన్ 25, 26లలో 24 గంటలు సమావేశాల్లో గడిపాడు....జూన్ 26, 27లలో అతని పనిదినం రోజుకు 10 గంటలు దాటింది. శారీరకంగా, మానసికంగా ఈ రెండు రోజులూ అలిసిపోవడం వలన కాబోలు, జూన్ 28న 5 గంటల కంటే కొంచెం ఎక్కువ పని చేశాడు.....మొత్తం మీద జూన్ 22-28 వారంలో రికార్డుల ప్రకారం స్టాలిన్ 88 గంటల 40 నిమిషాలు సమావేశాల్లో గడిపాడు.....ఈ కాలంలో స్టాలిన్ 45 గురు సీనియర్ ప్రభుత్వాధికారులతోనూ, సైనికాధికారులతోనూ 158 సమావేశాలలో పాల్గొన్నాడు.....అతని ఎప్పాయింట్ మెంటు డైరీ వెల్లడిస్తున్నదాన్నీ, అతని సమకాలికులు చెప్పేదాన్నీ, ఆ కాలంలో పార్టీ, ప్రభుత్వం తీసుకున్న ముఖ్య నిర్ణయాలనూ పరిశీలిస్తే, యుద్ధ ప్రారంభంలో స్టాలిన్ తన గదిలో తలుపులు వేసుకుని ఉండేవాడనే ఆరోపణ నిజమనిపించదు' అని రాశాడు స్టీవెన్ మెయిన్.

అప్పాయింట్ మెంట్ డైరీ పరిశీలించిన స్టీవెన్ మెయిన్ ఏం వెల్లడించాడో చూశాం. మొదటి రోజు గురించి మార్షల్ ఝుకోవ్ ఏం చెప్పాడో ఇప్పుడు చూద్దాం.

'....స్టాలిన్ పిరికివాడు కాడు, అతను చాలా ధైర్యస్తుడు. అతన్ని నిరాశగా ఒక్కసారే - జూన్ 22 తెల్లవారకట్ల - యుద్ధాన్ని నివారించాలని అతను చేసిన ప్రయత్నాలు విఫలమై యుద్ధంమీద పడ్డ పరిస్థితిలో - చూశాను' అని ఆ సన్నివేశం గురించి వర్ణించాడు మార్షల్ ఝుకోవ్.

తొలి రోజుల్లో స్టాలిన్ కుప్ప కూలిపోయాడన్న ప్రచారం గురించి మాలటోవ్ ను ప్రశ్నించినప్పుడు అతను స్టాలిన్ రాత్రింబవళ్ళు పని చేసేవాడనీ, స్టాలిన్ ఎలా ఉంటాడని భావిస్తామో, అలాగే ధృఢంగా ఉన్నడనీ తెలియజేశాడు (Molotov Remembers, p. 39).

యుద్ధం ప్రారంభమైన తర్వాత కూడా జర్మన్ సైన్యం మీద కాల్పులు జరుపకూడదని స్టాలిన్ ఆదేశించాడని కృశ్చేవ్ ప్రచారం.

జూన్ 22 ఉదయం ఝుకోవ్ శత్రు సైన్యం మీద దాడులు ప్రారంభించాలన్నాడు. స్టాలిన్ వెంటనే ఆదేశాలు ఇవ్వమన్నాడు. ఉదయం 7. 15 ని. ఆదేశాలివ్వబడ్డాయి కాని శత్రువు ఆధిక్యతతో ఉండడం వలన ఈ ఆదేశాలను అమలు చెయ్యడం సాధ్య కాలేదు.

'తాగి మత్తులో పడున్న స్టాలిన్' ఆ రోజు మధ్యాహ్నం 1.00 గంటకు ఝుకోవ్ కు ఫోను చేసి 'మన కమాండర్లకు అనుభవం లేదు. వాళ్ళు గందరగోళంలో ఉన్నట్లు కనుపిస్తోంది. నిన్ను జనరల్ హెడ్ క్వార్టర్స్ ప్రతినిధిగా నైరుతి రంగానికి పంపించాలని పాలిట్ బ్యూరో నిర్ణయించింది. మార్షల్ షపోష్నికోవ్, మార్షల్ కులిక్ లను పశ్చిమ రంగానికి పంపిస్తున్నా.....' అని తెలియజేశాడు (G. Zhukov, Reminiscences....Vol. I, p. 284).

జూన్ 26న యుద్ధరంగానికి వెనుక 300 కి. మీ. దూరంలో రిజర్వ్ రంగాన్ని సిద్ధం చెయ్యాలని స్టాలిన్ వ్యూహానికి సంబంధించి ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నాడు. శత్రువు రష్యన్ ప్రతిఘటనను అధిగమించి ముందుకు చొచ్చుకు వస్తే ఇక్కడ శత్రువును నిలువరించాలని అతని ఆలోచన.

అదే రోజున జర్మన్లు పశ్చిమ రంగంలో రష్యన్ రక్షణ రేఖను ఛేదించి బెలో రష్యా రాజధాని మిన్స్క్ వైపు పురోగమించసాగారు. ఆ సాయంత్రం స్టాలిన్, టిమోషెంకో, ఝుకోవ్, వాటునిన్ లతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, మీరు పరిస్థితిని అధ్యయనం చేసి ఏం చెయ్యాలో నిర్ణయించండి అని చెప్పాడు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఇవి. మాస్కోకు దారి తీసే మార్గాలలో లోతట్టు

Edit with WPS Office
రక్షణ ఏర్పాటు చెయ్యడం, శత్రువు మీద విరామం లేకుండా దాడులు చేస్తూ, అతన్ని బలహీన పరుస్తూ, రష్యన్ రక్షణ రేఖల వైపు అతని పురోగమనాన్ని అరికట్టడం, ఈ లోగా తూర్పునుండి కొత్త సైన్యాలను తీసుకువచ్చి కొత్త సైన్యాలతో ఎదురుదాడి చెయ్యడం. స్టాలిన్ ఈ నిర్ణయాలను ఆమోదించాడు.

మార్షల్ ఝుకోవ్ వివరిస్తున్న దాన్ని బట్టి స్టాలిన్ చురుకుగా యుద్ధ వ్యవహారాలలో నాయకత్వం వహిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కృశ్చేవ్ ఆరోపిస్తున్నట్లు అతను 'దూరంగా ఉండలేదు'.

స్టాలిన్ పని చేసే హాలులో గ్లోబు ఉండేది కాని స్టాలిన్ గ్లోబు మీద ప్లానులు వేసే వాడని చెప్పడం హాస్యాస్పదం.

'....మేప్ మీద చూపించిన పరిస్థితిని గురించి పూర్తి వివరాలు లేకుండా, అతిశయోక్తులతో కూడిన రిపోర్టులతో స్టాలిన్ ఎదురుగా నిలవడం చాలా కష్టం.....స్టాలిన్ అలా అస్పష్టమైన రిపోర్టులను సహించేవాడు కాదు....స్పష్టత, వాస్తవాలు అతను కోరుతుండేవాడు....రిపోర్టులలోని, డాక్యుమెంట్లలోని బలహీనతలను పసిగట్టగలిగే నేర్పు అతనికి ఉండేది. వెంటనే ఆ బలహీనతలను ఎత్తి చూపి, అలాంటి అవాస్తవిక రిపోర్టు ఇచ్చిన వారిని తీవ్రంగా విమర్శించేవాడు. అతనికి అద్భుతమైన జ్ఞాపక శక్తి ఉండేది. అందుచేత మేం ఒళ్ళు దగ్గర పెట్టుకుని మా డాక్యుమెంట్లూ, రిపోర్టులూ జాగ్రత్తగా తయారు చేసే వాళ్ళం.....' అన్నాడు ఝుకోవ్ (Another view of Stalin, p. 148).

స్టాలిన్ యుద్ధరంగాన్ని ఎప్పుడూ చూడలేదు అనే విమర్శ గురించి జనరల్ స్టెమెంకో - '....సుప్రీం కమాండరు (స్టాలిన్) జనరల్ హెడ్ క్వార్టర్స్ వదలి వెళ్ళడం క్షమించరాని నేరమూ, తెలివి తక్కువ తనమూ అవుతుంది' అన్నాడు.

'....అటువంటి ప్రయాణాలు నిరుపయోగం. స్టాలిన్ కి వివరంగా ఖచ్చితమైన సమాచారం అందుతుండేది.....అతను మాస్కోలోనే ఉండి వెంటనే సరియైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉంది' అన్నాడు జనరల్ వాసిలేవస్కీ (ibid., p. 149).

హెడ్ క్వార్టర్స్ అందించే సమాచారం మీద ఆధారపడే కాకుండా, ఒక పరిస్థితి ప్రత్యేకతలను కూడా దృష్టిలో ఉంచుకుని స్టాలిన్ నిర్ణయాలు తీసుకుంటుండేవాడు. అతనికి చీఫ్ ఆఫ్ స్టాఫ్, రక్షణ మంత్రాలయం, ఎర్ర సైన్యంలో ఉన్న రాజకీయ నాయకత్వాల నుండి ముఖ్యమైన సమాచారం అందుతుండేది. వివిధ రంగాలలోని పరిస్థితి గురించి అతనికి రెండు విధాల సమాచారం అందుతుండేది. మొదటిది యుద్ధరంగంలో ఉన్న కమాండర్లు అతనికి రిపోర్టులు పంపిస్తుండేవారు. రెండోది, యుద్ధ రంగంలోని పరిస్థితిని అధ్యయనం చెయ్యడానికి జనరల్ హెడ్ క్వార్టర్స్ నుండి స్టాలిన్ తన ప్రతినిధులను పంపిస్తుండేవాడు. ఈ ప్రతినిధులు రోజూ స్టాలిన్ కు రిపోర్టు పంపిస్తుండేవారు.

'....(ఈ ప్రతినిధులు).....యుద్ధరంగంలో ఉన్న కమాండర్లతో సంప్రదించి, పరిస్థితిని అధ్యయనం చేసి పంపించే రిపోర్టులూ, జనరల్ హెడ్ క్వార్టర్స్ అభిప్రాయాలూ, యుద్ధరంగంలో ఉన్న కమాండర్ల సలహాలూ, స్పెషల్ రిపోర్టులూ - వీటన్నింటి మీదా ఆధారపడి స్టాలిన్ ముఖ్య నిర్ణయాలు తీసుకుంటుండేవాడు....' (ibid., p. 149).

'...వివిధ యుద్ధ రంగాల్లో ఉన్న కమాండర్లను సమావేశానికి పిలిచి వారితో యుద్ధ నిర్వహణ గురించి స్టాలిన్ చర్చించేవాడు. స్టాలిన్ తన క్రింద పని చేస్తున్న జనరల్స్, మార్షల్స్ తో సమానంగా, బహుశా వారి కంటే ఎక్కువ స్పష్టంగా, సైనిక సమస్యలను అర్థం చేసుకునే వాడు. అనేక సార్లు అతను ముఖ్యమైన సైనిక చర్యలకు సంబంధించి ఆసక్తికరమైన ప్రతిపాదనలను చేశాడు. ముఖ్యమైన చర్యలకు సంబంధించిన నిర్ణయాలను అతను ముందే ఊహించగలిగేవాడు.....' - మార్షల్ ఝుకోవ్ (ibid., p. 152).

పనిలో అలసత్వాన్ని స్టాలిన్ సహించేవాడు కాడు. జనరల్ వాసిలేవస్కీ స్టాలిన్ ప్రతినిధిగా 1943 ఆగస్టులో ఖార్కోవ్ ప్రాంతానికి వెళ్ళాడు. ఆగస్టు 16న, ఒక ముఖ్యమైన ఆపరేషన్ ప్రారంభమైన రోజున, వాసిలేవస్కీ తన రిపోర్టు పంపించలేదు (స్టాలిన్ ప్రతినిధులు రోజూ తమ రిపోర్టులు పంపించేవారు). ఇలా రిపోర్టు సకాలంలో పంపించకపోతే అతన్ని పదవినుండి తొలగించాల్సి వస్తుందని స్టాలిన్ హెచ్చరించాడు. వాసిలేవస్కీ స్టాలిన్ హెచ్చరిక విని నిర్ఘాంతపోయాడు.

అయినా అతను స్టాలిన్ 'పొగరుమోతు' అని నిందించలేదు. '.....స్టాలిన్ అందరితోనూ ఖచ్చితంగా ఉండేవాడు. జనరల్ హెడ్ క్వార్టర్స్ ప్రతినిధుల నుండి కూడా అలాంటి క్రమశిక్షణే కోరేవాడు.....జనరల్ హెడ్ క్వార్టర్స్ ప్రతినిధి అలసత్వాన్ని అతను ఉపేక్షించకపోవడం సరియైనదే. యుద్ధ కార్యక్రమాలు సరిగా నిర్వహించాలంటే అటువంటి క్రమశిక్షణ ఉండాల్సిందే. స్టాలిన్ యుద్ధ

Edit with WPS Office
రంగంలోని పరిస్థితిని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండేవాడు. పరిస్థితులలో మార్పులకు వేగంగా స్పందిస్తూ సైన్యాన్ని క్రమశిక్షణలో ఉంచేవాడు.....' అన్నాడు వాసిలేవస్కీ. వాసిలేవస్కీ స్టాలిన్ క్రింద 34 నెలలు పని చేశాడు. స్టాలిన్ పని చేసే విధానం గురించి అతను ఇంకా ఇలా రాశాడు.

'.....జనరల్ హెడ్ క్వార్టర్స్ సమర్థవంతంగా పని చేసే విధానాన్ని అభివృద్ధి చెయ్యడానికి స్టాలిన్ చాలా శ్రద్ధ చూపించాడు. 1942 ఆకురాలు కాలం నాటికి జనరల్ స్టాఫ్ పనిచేసే విధానం చాలా అభివృద్ధి చెందింది. వ్యూహానికీ ఆపరేషన్లకీ సంబంధించిన ప్లానులు సమిష్టి అనుభవం మీదా, చొరవ మీదా, యుద్ధరంగంలో ఉండే సైన్యాలతో నిరంతర సంపర్కం మీదా, యుద్ధరంగంలోని పరిస్థితిని గురించి సరియైన పరిజ్ఞానం మీదా ఆధారపడి వెయ్యబడేవి. స్టాలిన్ సుప్రీం కమాండరుగా అందరూ ఒళ్ళు వంచి పని చేసేలా ఒత్తిడి తీసుకు వచ్చేవాడు. స్టాలిన్ లోని ఈ గుణం ఆవశ్యకత, ముఖ్యంగా యుద్ధ కాలంలో, ఎంతైనా ఉంది. పనిలో నిర్లక్ష్యాన్నీ, సరిగా పని పూర్తి చేయకుండా వదిలెయ్యడాన్నీ అతను ఎన్నడూ క్షమించేవాడు కాడు.....' - (Another view of Stalin, p. 150).

'.....స్టాలిన్ కొద్దిగా పొట్టిగా, చూడడానికి సాధారణంగా కనుపించినా చూడగానే ఆకర్షించేవాడు.....మాట్లాడినవారందరి హృదయాలనూ ఆకట్టుకునేవాడు. అతను ఏ కపటం లేకుండా మాట్లాడేవాడు. అతను తన ఆలోచనలను సూటిగా, స్పష్టంగా చెప్పే తీరు అందరినీ ఆకట్టుకునేది. ప్రతీ విషయాన్నీ కూలంకషంగా విశ్లేషించే తీరూ, అతని జ్ఞాపక శక్తీ ఇవన్నీ కూడా కాకలు తీరిన వారు కూడా ఒళ్ళు దగ్గర పెట్టుకుని ఉండేలా చేసేది....' - మార్షల్ ఝుకోవ్ (ibid., p. 152).

'.....స్టాలిన్ కు అసాధారాణమైన తెలివితేటలుండేవి. దానికి తోడు ఆశ్చర్యంకొలిపేంత విస్తారమైన పరిజ్ఞానం ఉండేది. స్టేట్ డిఫెన్స్ కమిటీ, పాలిట్ బ్యూరో సమావేశాల్లోనూ, జనరల్ హెడ్ క్వార్టర్స్ లోనూ పని చేసిన కాలంలోనూ, ఏదైనా సమస్యను కూలంకషంగా పరిశీలించే అతని ప్రతిభను నేను గమనించాను. అతను వక్తలు చెప్పేది చాలా శ్రద్ధగా వినేవాడు. అప్పుడప్పుడు ప్రశ్నలడుగుతూ ఉండేవాడు. వ్యాఖ్యానిస్తుండేవాడు. చర్చ అనంతరం తన అభిప్రాయాలను స్పష్టంగా, చక్కగా చెప్పి చర్చను సమీక్షించేవాడు..... '

'.....విరామం లేకుండా పని చెయ్యగల అతని సమర్థతా, ఒక పుస్తకంలోని ముఖ్య విషయాన్ని త్వరగా గ్రహించగల అతని శక్తీ, అద్భుతమైన అతని జ్ఞాపక శక్తీ - ఇవన్నీ కూడా ఒక రోజులో ఎంతో సమాచారాన్ని అతను అధ్యయనం చెయ్యడానికి ఉపయోగపడేవి. దేముడి వరమున్న వ్యక్తి మాత్రమే ఇలా చెయ్యగలడు.....'

'...స్టాలిన్ కు గొప్ప నిర్మాణ శక్తి ఉండేది. అతను చాలా కష్టపడి పనిచేసేవాడు. ఇతరులు కూడా కష్టపడి పనిచేసేట్లు చేసేవాడు.....స్టాలిన్ జ్ఞాపక శక్తి ఆశ్చర్యం కలిగించేది. స్టాలిన్ కు యుద్ధరంగంలోని వందల కమాండర్లు, సైన్యం కమాండర్లూ తెలుసు. వీరే కాకుండా డివిజన్, కోర్స్ స్థాయిలోని కమాండర్లూ, ప్రజా రక్షణ కమిస్సారియేట్ లోని ముఖ్య ఉద్యోగులు, కేంద్రంలోనూ, ప్రాంతాలలోనూ ఉండే పార్టీ యంత్రాంగంలోని ముఖ్య వ్యక్తులూ - అందరూ తెలుసు.....' - జనరల్ వాసిలేవస్కీ (ibid., p. 152)

'....వీరే కాకుండా విమానాలూ, ఆర్టిలరీ, టాంకులూ నిర్మించే వ్యక్తులందరూ స్టాలిన్ కు వ్యక్తిగతంగా తెలుసు. స్టాలిన్ వారిని తరచు కలుస్తూ వివరంగా ప్రశ్నించి వారి పని గురించి తెలుసుకుంటుండేవాడు....' - మార్షల్ ఝుకోవ్ (ibid., p. 153)

స్టాలిన్ తనను ఒక గొప్ప మిలిటరీ మేధావిగా ప్రచారం చేసుకున్నాడని కృశ్చేవ్ ఆరోపణ. స్టాలిన్ మిలిటరీ మేధావి అవునా కాదా అన్న దానిని గురించి - '...స్టాలిన్ గ్రాడ్, కుర్స్క్ యుద్ధాల తర్వాత, స్టాలిన్ వ్యూహాత్మక నాయకత్వ విషయంలో చాలా ఎత్తుకు ఎదిగాడు. అప్పటినుండీ ఆధునిక యుద్ధం ఎలా జరగాలి అన్న విషయం గురించి ఆలోచించేవాడు. (సైనిక) ఆపరేషను ఎలా ప్లాను చెయ్యాలీ, ఎలా అమలు జరపాలీ అనే దాని మీద అతనికి మంచి పరిజ్ఞానం ఉండేది. సైనిక చర్యలు మిలిటరీ సైన్యాను దృష్టిలో పెట్టుకుని సృజనాత్మకంగా ఉండాలనీ, శత్రువును ముక్కలు చేసి చుట్టుముట్టే ఉద్దేశంతో ఈ చర్యలు నిర్ణయాత్మకంగానూ, అవసరాలకు అనుగుణంగా మారే విధంగానూ ఉండాలనీ అతను చెప్పేవాడు. అతను సైనికుల్నీ ఆయుధాలనూ కేంద్రీకరించి దాడి చెయ్యాలని ఆలోచించేవాడు. దాడులు ప్రారంభించేటప్పుడూ, దాడి జరుగుతున్నప్పుడూ (శత్రువును గందరగోళ పరచడానికి) రకరకాల పద్ధతులు ఉపయోగించడానికి ఆలోచించేవాడు. మిలిటరీ వ్యూహానికి సంబంధించి స్టాలిన్ తన పట్టును ప్రదర్శించసాగాడు.....' - జనరల్ వాసిలేవస్కీ (ibid., p. 154).

Edit with WPS Office

'....స్టాలిన్ ఒక గొప్ప సేనానిగా మిలిటరీ చరిత్రలో నిలిచి పోతాడు. సుప్రీం కమాండర్ గా అతని నేతృత్వంలో సోవియట్ సైన్యం రక్షణ పోరాటాలు సాగించింది. ఎదురు దాడి చేసి విజయాలు సాధించింది. అయినా నాకు తెలుసున్నంతవరకూ అతను తన పాత్రను గురించి ఎప్పుడూ చెప్పుకోలేదు. హీరో ఆఫ్ సోవియట్ యూనియన్, జనరలిస్సిమో అనే బిరుదులు అతనికి ఇవ్వాలని యుద్ధం రంగ కమాండర్లు పార్టీ సెంట్రల్ కమిటీకి విజ్ఞప్తి చేశారు.....అతను ఏమీ దాచకుండా నిజాయితీగా యుద్ధంలో జరిగిన తప్పిదాల గురించి చెప్పేవాడు.....'

'....యుద్ధంలో తరువాతి కాలంలో, వ్యూహాత్మక నాయకత్వంలో (strategic command) స్టాలిన్ అత్యంత శక్తివంతమైన, ప్రాముఖ్యతగల నాయకుడు అని నా ధృఢవిశ్వాసం. పార్టీ కార్యక్రమాన్ననుసరించి సమర్థవంతంగా యుద్ధ రంగాన్నీ, దేశ యుద్ధ ప్రయత్నాలనూ అతను పర్యవేక్షించాడు....నా దృష్టిలో అతను అనుకున్న దానిని కఠినంగానూ, ధృఢనిశ్చయంతోనూ సాధించే నాయకుడిగా మిగిలిపోతాడు. అలా అని అతనిలో ఒక విధమైన వ్యక్తిగత ఆకర్షణాశక్తి లేకపోలేదు....' - జనరల్ వాసిలేవస్కీ (ibid., p. 155).

'.....యుద్ధంలో ఎదురుదాడి చేస్తున్నప్పుడు ఫిరంగి దళాలను సంసిద్ధం చేసే పద్ధతులూ, ఆకాశంలో ఆధిక్యత సంపాదించే విధానాలూ, శత్రువును చుట్టుముట్టే పద్ధతులూ, చుట్టుముట్టబడిన శత్రు సైన్యాన్ని ముక్కలుగా చేసి విడివిడిగా నాశనం చేసే పద్ధతులూ - ఇలాంటి మౌలికమైన ఎత్తుగడలన్నింటినీ స్టాలిన్ రూపొందించాడని అంటుంటారు. ఇదంతా శత్రువుతో చేసిన యుద్ధఫలితాలు. శత్రువుతో యుద్ధం చేసిన సైనికుల, కమాండర్ల అనుభవాల ఫలితాలు....ఈ అనుభవాలన్నింటినీ అధ్యయనం చేసిన ఫలితాలు.....స్టాలిన్ గొప్పతనం ఎక్కడుందంటే సైనిక నిపుణులు ఇచ్చే సలహాలను సరిగా అంచనా వేసి, ఆదేశాల రూపంలో, డైరెక్టివ్, రెగ్యులేషన్స్ రూపంలో వెంటనే సైన్యానికి యుద్ధ రంగంలో ఉపయోగపడేలా అందజేసేవాడు.....'

'....యుద్ధానికి ముందూ, ముఖ్యంగా యుద్ధానంతరం, సైన్యాన్ని తయారు చెయ్యడంలోనూ, సోవియట్ మిలిటరీ సైన్స్, వ్యూహానికి సంబంధించిన సిద్ధాంతాలూ, యుద్ధ తంత్రమూ అభివృద్ధి చెయ్యడంలోనూ స్టాలిన్ కు ఒక మహత్తర పాత్ర ఇవ్వబడింది....స్టాలిన్ యుద్ధ రంగంలో ఆపరేషన్స్ నిర్వహించడం అధ్యయనం చేశాడు. అతను క్లిష్టమైన వ్యూహానికి సంబంధించిన సమస్యలను చాలా స్పష్టంగా అర్థం చేసుకుని, అనేక రంగాల్లో సైన్యాన్ని నడిపించగలిగేవాడు. స్టాలిన్ గ్రాడ్ యుద్ధ కాలం నుండీ కమాండర్ ఇన్ చీఫ్ గా స్టాలిన్ తన శక్తి సామర్థ్యాలు చూపించసాగాడు....మొత్తం రష్యన్ సైన్యానికి నాయకత్వం వహించడంలో స్టాలిన్ కు అతని సహజమైన తెలివితేటలూ, ఒక వ్యూహాత్మక పరిస్థితిలో కీలకమైన విషయాన్ని గ్రహించడం ద్వారా, శత్రువును ప్రతిఘటించి పెద్ద ఎత్తున ఎదురు దాడి చెయ్యగల అతని నేర్పూ ఉపయోగపడ్డాయి. అతను పేరుకు తగ్గట్టు ఒక గొప్ప సుప్రీం కమాండరు....' - మార్షల్ ఝుకోవ్ (ibid., p. 155).

స్టాలిన్ దగ్గర పని చేసిన జనరల్స్ అభిప్రాయాలు ఇవి.

పైన వివరించినట్లు స్టాలిన్ ఒక గొప్ప మిలిటరీ కమాండరు మాత్రమే కాదు, భవిష్యత్తును కూడా స్పష్టంగా చూడగలిగిన మేధావి అనిపిస్తుంది కోలోంతీవా చెప్పినది చూస్తుంటే.

ఎ. యస్. కొలోంతీవా 1938-1939 ప్రాంతంలో స్వీడన్ లో రష్యన్ రాయబారిగా పని చేసింది. 1939లో స్టాలిన్ కోలోంటీవాతో సంభాషిస్తూ రష్యా భవిష్యత్తు గురించి ఇలా అన్నాడు -

'....మన పార్టీ, ప్రజలూ సాధించిన విజయాలు తలకిందులవుతాయి. వీటి మీద విష ప్రచారం ముందు (రష్యా) సరిహద్దుల వెలుపల మొదలవుతుంది. మన దేశంలో కూడా ఈ విష ప్రచారం జరుగుతుంది. ప్రపంచ ఆర్థిక విధానాన్ని శాసింపజూస్తున్న జియోనిజం, ఇతర శత్రువులూ మన ప్రగతిని అడ్డగించాలని విశ్వ ప్రయత్నాలు చేస్తారు. వారి దృష్టిలో సోవియట్ యూనియన్ ఒక వెనుకబడ్డ దేశం మాత్రమే కాదు - ముడి వనరుల సంపద గల విలువైన దేశం. నా పేరు మీద కూడా బురద చల్లుతారని నాకు తెలుసు. ఊహించ సాధ్యం కాని ఘోర నేరాలకు నా పేరు తగిలిస్తారు....

ప్రపంచంలోని విప్లవ ప్రతీఘాత శక్తులన్నీ సోవియట్ యూనియన్ ను ముక్కలు చెయ్యడానికి తమ శక్తియుక్తులన్నీ ఉపయోగిస్తాయి. రష్యా కాళ్ళ మీద మళ్ళీ నిలబడడానికి వీలు లేకుండా కాళ్ళు విరగ్గొట్టడానికి ప్రయత్నిస్తాయి. సోవియట్ యూనియన్ శక్తి జాతుల ఐక్యత మీద ఆధారపడి ఉంది. మన ప్రజల ఐక్యతను భగ్నం చెయ్యడానికీ, సోవియట్ యూనియన్ ను చిన్న చిన్న ముక్కలుగా తెగ్గొట్టడానికీ, సరిహద్దుల్లో ఉన్న రిపబ్లిక్ లను సోవియట్ యూనియన్ నుంచి విడదీయడానికీ విశ్వ

Edit with WPS Office
ప్రయత్నాలు జరుగుతున్నాయి.

సోవియట్ యూనియన్ రక్షించడానికి చెయ్యవలసినదంతా ఇంకా మనం చెయ్యలేదని ఇక్కడ మనం ఒప్పుకు తీరాలి.

వికృత రూపంలో జాతితత్వం తలెత్తుతోంది. ఈ జాతితత్వం అంతర్జాతీయత తత్వాన్నీ దేశభక్తినీ అణచి వెయ్యడంలో కొంతకాలం విజయం సాధిస్తుంది. ఇంటాబయటా ఉన్న అభివృద్ధి నిరోధక శక్తుల ప్రోత్సాహంతో అనేక జాతుల గ్రూపులు తలెత్తుతాయి. సంఘర్షణలు జరుగుతాయి. తమ జాతులకు ద్రోహం చేసే మరుగుజ్జుల్లాంటి నాయకులు అనేకమంది తలెత్తుతారు.

సోవియట్ ప్రజలకూ, అంతర్జాతీయ శ్రామిక వర్గానికీ ఇది చాలా గడ్డు కాలం. తూర్పు, పడమరల మధ్య సంఘర్షణలు తలెత్తుతాయి.

ఇవన్నీ సంభవించినా, తాత్కాలికంగా అవి విజయం సాధించగలిగినా, రాబోయే తరాల వారు మన సోషలిస్టు మాతృదేశం సాధించిన ఘన విజయాలను ఆదర్శంగా తీసుకుంటారు. కొత్త తరాలు వస్తాయి. వాళ్ళు తమ తండ్రుల, తాతల విప్లవ అరుణ పతాకాన్ని అందుకుంటారు. మన విజయాల పునాది మీద వాళ్ళ భవిష్యత్తును నిర్మించుకుంటారు....' (Northstarcompass, Vol. 8, No. 7, February 2000 సంచిక నుండి)

ఇప్పటికి 79 సంవత్సరాల క్రితం 1939లో స్టాలిన్ అన్న మాటలు ఇవి. అతను మహా మేధావా లేక కృశ్చేవ్, గోర్బచేవ్ లలా ఒక మరుగుజ్జా - చరిత్ర తన తీర్పు చెప్పే రోజు వస్తుంది.

ఇప్పుడో చిన్న జోక్!

'.....ట్రాట్ స్కీయిస్టు ద్రోహులు మన నాయకుడికి వ్యతిరేకంగా టెర్రరిస్ట్ చర్యలకు సిద్ధపడుతున్నారు. మనం మరచిపోలేని వ్యక్తి కిరోవ్ ను ఈ ద్రోహుల తుపాకీ బలి తీసుకుంది. ఈ ద్రోహులు మన పార్టీ హృదయంలోకీ మెదడులోకీ చొచ్చుకుపోవాలని ప్రయత్నిస్తున్నారు. వాళ్ళు **కామ్రేడ్ స్టాలిన్** మీదా, కార్మిక వర్గం మీదా కత్తి ఎత్తారు. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, వాళ్ళ **గొప్ప శిష్యుడు జె. వి. స్టాలిన్** మీద కత్తి ఎత్తారు. **స్టాలిన్** మీద కత్తి ఎత్తడం అంటే ప్రజలకున్న అతి ప్రియమైన వారి మీద కత్తి ఎత్తడం అన్నమాట...ఈ దేశం కన్న **గొప్ప బిడ్డ స్టాలిన్....స్టాలిన్ మన ఆశ....మన భవిష్యత్తు....మన కలల పంట....ప్రపంచ భవిష్యత్తుకు లైట్ హౌస్.....స్టాలిన్.....మన దీక్ష.....మన స్వాతంత్ర్యం.....స్టాలిన్....మన విజయం**...సోవియట్ ప్రభుత్వం వర్ధిల్లాలి....సోవియట్ ప్రభుత్వ నేత, ప్రజా కమిస్సార్ కౌన్సిల్ ఛెయిర్మన్ కామ్రేడ్ మాలటోవ్ వర్ధిల్లాలి.....**ప్రపంచ కార్మిక వర్గ నాయకుడు, లెనిన్ కలల్ని నిజం చేస్తున్న మన గొప్ప కామ్రేడ్ స్టాలిన్ వర్ధిల్లాలి....'**

1937 జనవరి 30న ట్రాట్ స్కీ ముఠాకు చెందిన దేశద్రోహులను శిక్షించినందుకు హర్షిస్తూ, రెడ్ స్క్వేర్ లో రెండు లక్షలమంది ప్రజల సమక్షంలో ఒక పేరాలో ఎనిమిది సార్లు స్టాలిన్ పేరు మననం చేసి, మన భవిష్యత్తూ ప్రపంచ భవిష్యత్తూ అంటూ పొగిడిన మహనీయుడెరో ఊహించగలరా? మరెవరో కాదు, స్టాలిన్ మరణానంతరం ఈ దేశద్రోహులందరికీ కీలక స్థానాల్లో పునరావాసం కల్పించి, వ్యక్తి పూజ నిరసించే పేరుతో స్టాలిన్ విగ్రహాలు కూలగొట్టించి, స్టాలిన్ పేరుతో ఉన్న వీధులు, పార్కులు, నగరాలు - అన్నింటి పేరు మార్పించి, చివరకు స్టాలిన్ శవం మీద దాడి చెయ్యడానికి కూడా వెనుదీయని ఘనుడు శ్రీ శ్రీ శ్రీ కృశ్చేవ్.

నవ్వితే నవ్వండి.

అసహ్యించుకుంటే అసహ్యించుకోండి.

Edit with WPS Office

అనుబంధం రెండు

మేం వెడుతున్నాం

(దేశభక్తి ప్రపూరిత మహా యుద్ధంలో పోరాడిన యోధులు నిష్క్రమిస్తూ యువతరానికి ఇచ్చిన సందేశం)

రక్తంతో తడిసిన 20వ శతాబ్దాన్ని మా వెనుక విడిచి మేం వెడుతున్నాం. ఈ 20వ శతాబ్దంలో ప్రపంచ దేశాలు కనీవినీ ఎరుగని నష్టాన్ని పొందాయి. కష్టాల పాలయ్యాయి. అద్భుత విజయాలూ సాధించాయి. సుడిగాలిలా కాలాన్ని మధించి 20వ శతాబ్దం వెళ్ళిపోతోంది. దానితో పాటు మేమూ వెళ్ళి పోతున్నాం.

మమ్మల్ని విజేతలన్నారు కాని మేము సాధారణ మానవులం. మా తల్లులు మమ్మల్ని రక్తసిక్తమైన యుద్ధాలకు బలి చెయ్యడానికి కనలేదు. మేం కీర్తి ప్రతిష్టలు సాధించాలనీ ఆశించలేదు. మా తల్లులు మా కోసం సామాన్యమైన, అర్థవంతమైన జీవితాన్ని కలలుకన్నారు. కాని విధి మరోలా నడిపించింది. ఏ కాలంలో జన్మించాలో మేం నిర్ణయించుకోలేదు. కాలమే నిర్ణయించింది.

మా యవ్వనం మరుపురానిది - అంతర్యుద్ధ కాలం నాటి పాటలు, ఛపయేవ్ (అంతర్యుద్ధ కాలం నాటి వీరుడు - అను) సినిమా, రైఫిల్, పేరాషూట్ గ్రూపులు, ప్రసిద్ధికెక్కిన ఛక్లోవ్ విమానయానాలు, ఉత్తర ధ్రువానికి యాత్రలు.....ప్రతీ రోజూ దిన పత్రికల పేజీల్లోంచి కొత్త ముఖాలు మమ్మల్ని పలకరించేవి. మట్టిలోంచి ఎటువంటి మాణిక్యాలను సృష్టించింది మన దేశం? పూరి గుడిసెల్లో ఎంతటి ప్రతిభావంతులు జన్మించారు? ప్రతీ వారికీ అభివృద్ధి చెందే అవకాశం ఉండేది. గుండెలనిండా కొత్త గాలి పీలుస్తూ పెరిగాం.

కాని కాలం అంతవరకూ కనీవినీ ఎరుగని భయంకర యుద్ధానికి బలికావడం మా వంతైంది. యుద్ధంలో పాల్గొన్న ప్రతీ సైనికుడూ చివరి క్షణం దాకా కలలో యుద్ధాన్ని చూస్తూనే ఉంటాడు - తగలబడుతున్న టాంకుల్లో తగలబడిపోతాడు. నీపర్, వోల్గా, ఓడెర్, విస్లా నదులలో విమాన దాడులకు గురయి మునిగిపోతాడు.

చనిపోయిన కామ్రేడ్స్ ను పాతి పెట్టి, తగలబడుతున్న రష్యన్ అడవులు గుండా పోరాడుతూ మాతృదేశాన్ని విముక్తి చేశాం. దేశ దేశాల్ని తన ఉక్కు పాదాల కింద అణచివేసిన ఫాసిజాన్ని కాలరాశాం. ఫాసిజం నుండి విముక్తి చెయ్యబడిన దేశాలు తమ కాళ్ళ మీద మళ్ళీ నిలబడుతూ 'సోదరులారా' అంటూ మమ్మల్ని కౌగిలించుకున్నాయి. పొగచూరిన మా టాంకులను ఆనందభాష్పాలతో కడిగాయి. పాటలు పాడాయి. నిజమైన ఆనందం అంటే ఏమిటో ఆ కాలంలో మాతో ఉన్న వారికి తెలుసు.

యుద్ధం తర్వాత విశ్రాంతి ఉంటుందని మాకు ఎవ్వరూ వాగ్దానం చెయ్యలేదు. యుద్ధం తర్వాత మా చేతుల్లోకి రైఫిల్స్ బదులు గొడ్డళ్ళూ గునపాలూ వచ్చాయి. టాంకులకు బదులు ట్రాక్టర్లు వచ్చాయి. మాతృదేశానికి తగిలిన గాయాలు మానిపోయేవరకూ, భర్తలను కోల్పోయిన స్త్రీల, అనాధులైన పిల్లల కన్నీరు ఆగిపోయేవరకూ నిద్రాహారాలు లేకుండా, చేతులు కాయలు కాసేలా పునర్నిర్మాణానికి ఎంత శ్రమించాం? యుద్ధాన్నుంచి కోల్కోవడమే కాదు, మన దేశం శక్తివంతమైన అగ్రరాజ్యం అయింది. మాకు ఇది కూడా యుద్ధమే. ఈ యుద్ధం శాంతియుతంగా జరిగింది. కాని బ్రతుకులు ఎంత అస్తవ్యస్తమయ్యాయి? ఎన్నెన్ని విపత్తులు సంభవించాయి? దేశభక్తి ప్రపూరిత మహాయుద్ధంలో లాగానే ఈ యుద్ధంలో కూడా నడుములు విరిగేలా శ్రమించాం. యుద్ధరంగంలోని సైనికుల్లాగానే ఎన్నో త్యాగాలు చేశాం. ఈ యుద్ధం కడా మేం గెలిచాం.....

....మన మాతృదేశం ఎటు పయనిస్తుందో చూడడానికి మేం జీవించి ఉండం. కాని నేడు యువతలో నాటుకుంటున్న భావాలు రేపు పుష్పిస్తాయని మాకు విశ్వాసం ఉంది. ప్రస్తుతం దేశం

Edit with WPS Office
ఎదుర్కొంటున్న భయంకర విపత్తులో యువకులు మాతో చేయి కలుపుతున్నారు. నేటి నాయకులు యువత రక్తాన్ని చిందిస్తున్నారు. యువత తన ప్రశ్నలు తన గుండెల్లో దాచుకోంటోంది. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం అడిగే కాలం ఒకటి వస్తుంది.

అప్పుడు వెలిగే మీ ముఖాలు చూడడానికి మేము ఉండం. అటువంటి విపత్కర పరిస్థితులలో మా ఆత్మలు మీతోటే ఉంటాయి. కష్టాలు ఎలా అధిగమించాలో మా జీవితం నుండి నేర్చుకోండి. విజయం సాధించాలనే పట్టుదలా, ధర్మమైన ఆగ్రహం, మన పోరాటం న్యాయమైనదన్న విశ్వాసం, మా నుండి అందుకోండి. మీరు చెయ్యబోయే పోరాటాలు ముందున్నాయి. రష్యాకి మళ్ళీ జీవం పోసే గురుతరమైన బాధ్యత మీ భుజాల మీద ఉంది.

తిరిగిరాలేని ఈ దూరాన్నుంచి మిమ్మల్ని ప్రేమతోనూ, విచారం తోనూ ఆశీర్వదిస్తున్నాం.

మేం వెడుతున్నాం. మమ్మల్ని గుర్తు పెట్టుకోండి.

Edit with WPS Office

నేటి (2005 నాటి) రష్యా

పెట్టుబడిదారీ ప్రపంచం రష్యాలో కార్మిక వర్గ నియంతృత్వ అంతాన్ని కీర్తించింది, కీర్తిస్తోంది. రష్యా పీడకలలాంటి గతం లోంచి ప్రజాస్వామ్యంలోకి అడుగు పెట్టిందని ప్రశంసిస్తోంది. కార్మిక వర్గ నియంతృత్వం అంతమైంది. కాని వర్గ సమాజంలో వర్గ ప్రయోజనాలకు అతీతమైన ప్రజాస్వామ్యం ఉండదు. బూర్జువా నియంతృత్వానికి పెట్టుబడిదారీ ప్రపంచం పెట్టిన ముద్దు పేరు ప్రజాస్వామ్యం. ఈ 'ప్రజాస్వామ్యం' లో రష్యా ఎలా ఉంది?

1. 2000 సంవత్సరంలో జనాభాలో 2 శాతం, 30 లక్షలమంది రష్యన్లు - స్త్రీలు, పురుషులు, పిల్లలు - మత్తుపదార్థాలకు బానిసలు. వీరిలో మెజారిటీ 30 సంవత్సరాలలోపు యువకులు. 1997లో మత్తు పదార్థాల వ్యాపారం విలువ 2.5 బిలియన్ల అమెరికన్ డాలర్లు (మన రూపాయలలో 11,500కోట్లు).
2. రష్యాలో ఎయిడ్స్ వ్యాధి పెరుగుదల రేటు ప్రపంచంలో ఏ దేశం కంటే అధికంగా ఉంది.
3. ప్రపంచ జనాభా పెరుగుతుంటే రష్యాలో జనాభా తగ్గిపోతోంది. 1990లో రష్యా జనాభా 148.3 మిలియన్లుంటే 2015లలో జనాభా 138.4 మిలియన్లకు తగ్గుతుందని అంచనా.
4. 1989 నుంచి రష్యాలో ఆత్మహత్యలు 60 శాతం పెరిగాయి.
5. 1980లో మగవారి సగటు జీవితం 62 సంవత్సరాలుంటే 2000 సంవత్సరానికి 58 సంవత్సరాలకు తగ్గింది.
6. గర్భిణీ స్త్రీలలో 75 శాతం గర్భిణీ దశలో తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు.
7. రష్యాలో 15-29 సంవత్సరాల యువకుల సంఖ్య తగ్గుతోంది. 1989 నాటి కంటే 1998లో యువకుల సంఖ్య 10 శాతం తగ్గింది. జననాల కంటే మరణాల సంఖ్య 70 శాతం ఎక్కువగా ఉంది.
8. 1998లో జరిపిన ఒక సర్వే ప్రకారం రష్యన్ స్కూలు విద్యార్థులు సైంటిస్టులూ, ఇంజినీర్లూ కావాలని అనుకోవడం లేదు. రిసెర్చి లాంటి విషయాలలో ఆసక్తి చూపడం లేదు. వ్యభిచారం, కిరాయి హత్యలు ఆకర్షణీయమైన వృత్తి అని వారు చెప్పారు.
9. 1999లో ప్రాథమిక పాఠశాలలకు పోయే వయసులో ఉన్న పిల్లల్లో 5 శాతం స్కూలుకు పోవడం లేదు. రష్యాలో విద్య మీద ఖర్చు మూడోవంతు తగ్గింది.
10. పసివారిలోనూ యువకుల్లోనూ ఆరోగ్యం క్షీణించింది. రష్యన్ పబ్లిక్ హెల్త్ మినిస్ట్రీ ప్రకారం 1999లో పిల్లలు శారీరకంగానూ మానసికంగానూ దుర్బలులుగా ఉన్నారు. శారీరక అభివృద్ధి సూచికలు అయిన బరువు, ఎత్తు, రొమ్ము సైజు, కండరాల బలం లాంటివి ఈ పది సంవత్సరాలలోనూ బాగా క్షీణించాయి.
11. పూర్తి వివరాలు తెలియకపోయినా, చట్ట సమ్మతంగానూ చట్ట విరుద్ధంగానూ రష్యా నుండి సంవత్సరానికి 18 బిలియన్ల అమెరికన్ డాలర్ల సంపద విదేశాలకు పోతోందని అంచనా. 2000 సంవత్సరం నాటికి పెట్టుబడి నిష్క్రమణ 100 బిలియన్ అమెరికన్ డాలర్లు - మన రూపాయలలో 4,60,000 కోట్లు.

Edit with WPS Office

ముఖచిత్రం గురించి

ఈ పుస్తకం చదివిన పాఠకులకు రెండు విషయాలు గుర్తుండి ఉంటాయి. ఒకటి, సరిహద్దుల్లో బ్రెస్ట్ దుర్గంలో చుట్టుముట్టబడిన రష్యన్ సైనికుల పోరాటగాథ. రెండు, గెరిల్లా కార్యకలాపాలకు జర్మన్ల ప్రతీకార చర్యలు. పార్టిజాన్ చర్యలకు ప్రతీకారంగా జర్మన్లు గ్రామాలలో యువతీ యువకులను ఉరితీసేవారు. ఆ శవాలు తల్లిదండ్రుల కళ్ళ ఎదురుగా నెలల తరబడి మంచులో, వానలో తడుస్తూ ఉరికొయ్యకు అలాగే వ్రేలాడుతుండేవి. జర్మన్లు ఆ శవాలను సమాధి చెయ్యనిచ్చేవారు కారు. రష్యన్ సైనికులు ఆ ప్రాంతాన్ని విముక్తి చేసిన తర్వాత ఉరికొయ్యలనుంచి తమ బిడ్డల శవాలను దింపి తల్లిదండ్రులు సమాధి చేసేవారు. కవరు పేజీ మీద ఉన్న రెండు చిత్రాలలో ఒకటి బ్రెస్ట్ దుర్గ పోరాటానికి సంబంధించిన చిత్రం. రెండవది గ్రామస్తులు ఉరికొయ్యమీంచి శవాలను దింపి సమాధి చేస్తున్న దృశ్యం.

ఆ చిత్రాలు రంగుల సమ్మేళనంలో కాని, సాంకేతికంగా కాని ఏ స్థాయిలో ఉన్నాయో నేను చెప్పలేను కాని ఈ రెండు చిత్రాలూ నన్ను కదిలించాయి. కొంతమంది హృదయాన్ని కదిలించేది ఉత్తమ కళ కాదనీ, ఉత్తమ కళ మేధస్సును కదిలించాలనీ అంటారు. నాలాంటి సామాన్యులకు అర్థమయ్యేది కళకాదంటే నేను అంగీకరించలేను. కళను ప్రజలకు చేరువగా తీసుకు వెళ్ళడంలో తప్పటడుగులు ఉండవచ్చు. ఉన్నత ప్రమాణాలలో చిత్రీకరించడంలో వైఫల్యాలు ఉండవచ్చు. కాని ప్రజలకు దగ్గరగా కళను తీసుకు వెళ్ళాలన్న కమ్యూనిస్టుల ఆశయం ఉన్నతమైనదే.

బూర్జువా మేధావులకు చరిత్ర అరాచకంగానూ, వర్తమానం అయోమయంగానూ, భవిష్యత్తు నిరాశాజనకంగానూ కనుపిస్తోంది. ఈ ఆలోచనా ధోరణి ఆ వర్గ కళా సాహిత్యాలలో ప్రతిఫలిస్తోంది. శ్రామిక వర్గ తత్వ శాస్త్రమైన మార్క్సిజానికి భవిష్యత్తు నిరాశాజనకం కాదు. జీవితం అయోమయం కాదు. అలా చిత్రించే బూర్జువా కళాసాహిత్యాలు శ్రామిక వర్గానికి అవసరం లేదు. శ్రామిక వర్గం తన వర్గ ప్రయోజనాలను ప్రతిబింబించే కళాసాహిత్యాలను సృష్టించుకుంటుంది. ఈ కళా సాహిత్యాలలో తన విజయాలను నెమరు వేసుకుని గర్విస్తుంది. ఓటమిలో ఊరట పొందుతుంది. నేటి నిరాశా నిస్పృహలనుండి కోలుకుని మళ్ళీ వర్గ పోరాటాలకు సంసిద్ధమవడానికి ఉత్తేజం పొందుతుంది.

ఎందుకంటే వర్గ పోరాటాన్నుండి, వర్గ ప్రయోజనాలనుండి దూరమవడమంటే శ్రామిక వర్గానికి మరణమే.

గ్రంథ సూచిక (BIBLIOGRAPHY)

ఈ పుస్తకం రాయడంలో నాకు ఉపయోగపడ్డ పుస్తకాల పట్టిక ఈ దిగువన ఇస్తున్నాను. ఈ పుస్తకాలే కాకుండా ఇంటర్నెట్ నుంచి సేకరించిన వివిధ కమ్యూనిస్టు పార్టీల డాక్యుమెంట్లూ, పత్రాలూ, వ్యాసాలూ అనేకం ఉపయోగపడ్డాయి. ముఖ్యంగా Northstarcompass పత్రిక ఇంటర్నెట్ ఎడిషన్ లో ప్రచురించబడిన వ్యాసాలు చాలా ఉపయోగపడ్డాయి. వాటన్నించి పట్టిక ఇవ్వడం సాధ్యం కాదు కనుక ముఖ్యమైనవి మాత్రమే ఇస్తున్నాను.

1. G. Zhukov, Reminiscences and Reflections, Progress Publishers, Moscow, 1985.
2. The Rise and Fall of Third Reich by William Shirer.
3. Russia at War, Alexander Werth.

Edit with WPS Office

4. Leningrad, Alexander Werth.
5. The 900 days, The Siege of Leningrad by Harrison E. Salisbury.
6. Marshal Zhukov's Greatest Battles by Harrison E. Salisbury.
7. Stalingrad 1943 published by People's Publishing House (1943)
8. Stalingrad, The Turning Poinnt by Geoffrey Jukes.
9. Two Hundred Days of Fire, Accounts by Participants and Witnesses of the Battle of Stalingrad, Progress Publishers, Moscow.
10. Russia's Amazing Defence by Lucien Zacharoff (1942).
11. Soviet Economic Development since 1917 by Maurice Dobb.
12. The Russian Army by Walter Kerr (1944)
13. Mission to Moscow by Joseh E. Davies.
14. Our Ally Russia by Jennie Lee (1941).
15. Workers in the Soviet Union by Andrew Rothsterin (1942).
16. The Working Class in the Soviet Union by Victor G. Kiernan
17. Another View of Stalin by Ludo Martens
18. Lies concerning the History of the Soviet Union by Mario Sousa, Member of the Communist Party Marxist-Leninist Revolutionaries, Sweden.
19. His name was not listed, a novel by Boris Vassilyev (1978).
20. స్టాలిన్ యుగం, అన్నా లూయీ స్ట్రాంగ్, మార్క్సిస్టు ప్రచురణలు (1957).
21. Restoration of Capitalism in the USSR by Martin Nicolaus, Liberator Press, Chicago, 1975.
22. The German Generals Talk, B.H. Liddel Hart
23. In the Service of the Reich – The Memoirs of Field Marshal Keitel.
24. Molotov Remembers
25. The Soviet Army Through German Ey6es
26. Epoch of Stalin – Facts and Figures

రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా (వెనుక అట్టపై)

ఈ యుద్ధంలో .....

- జూన్ 22, 1941లో 55 లక్షల జర్మన్ సైన్యం, 48,000 శతఘ్నులు, 3,000 టాంకులు, 5,000 విమానాలతో హఠాత్తుగా రష్యా మీద దాడి చేసింది.

- జర్మన్ సైన్యం చుట్టు ముట్టడంతో లెనిన్ గ్రాడ్ నగరం 900 రోజులు దిగ్బంధంలో ఉంది. బయటి నుంచి ఆహారం అందే మార్గం లేక నగర జనాభాలో మూడో వంతు, దాదాపు పది లక్షలు ఆకలితో మరణించారు.

- ఆగష్టు 23, 1942న స్టాలిన్ గ్రాడ్ నగరం మీద జర్మన్ వైమ్మనిక దళం ఆరు వందల విమానాలతో రెండు వేల దాడులు చేసినప్పుడు, ఆ ఒక్క రోజులోనే 43, 000 మంది పౌరులు చనిపోయారు. 1,50,000 మంది గాయపడ్డారు.

- రెండు కోట్ల తొంభైలక్షల మంది రష్యన్ పౌరులు బలి అయ్యారు. అంటే ప్రతి ఏడుగురిలోనూ ఒకరు మరణించారన్న మాట. రెండో ప్రపంచయుద్ధంలో, అన్ని రంగాలలోనూ అమెరికన్ నష్టాలు 4,13,000, బ్రిటన్ నష్టాలు 4,95,000 మాత్రమే.

Edit with WPS Office

- యూరోపులో జరిగిన మొత్తం నష్టంలో సగం రాష్యాలోనే జరిగింది. అమెరికా పొందిన నష్టం కంటే వంద రెట్లు రష్యా నష్టపోయింది.
- ఆనాటి కమ్యూనిష్టులు స్టాలిన్ అనంతరం అధికారంలోకి వచ్చిన కులాసా కమ్యూనిష్టులవంటి వారు కారు. 50 లక్షల మంది పార్టీ సభ్యులలోనూ 30 లక్షల మంది మెరికల్లాంటి కామ్రేడ్స్ యుద్ధానికి బలైపోయారు.
- ఊహించ సాధ్యంకాని గడ్డు పరిస్థితులలో రష్యన్ కార్మికవర్గం నాలుగు సంవత్సరాల యుద్ధకాలంలోనూ 4,90,000 శతఘ్నులు, మోర్టార్లు, 1,20,000 టాంకులు, స్వయం చలిత శతగ్నులు, 1,37,000 యుద్ధ విమానాలు, సైన్యానికి కావలసిన మందుగుండు, ఇతర సామాగ్రి నిరంతరాయంగా అందించి అంతిమ విజయానికి తోడ్పడింది.